

# శ్రీ దత్తగురు భగవద్గీత

అక్షర ప్రసాదము



శ్రీ దత్త భక్తులు


ప్రొ. డా॥ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి, M.Sc., Ph.D




శ్రీ కనకదుర్గ, విజయవాడ




శ్రీ దత్త కాలభైరవస్వామి




శ్రీ భ్రమరాంబ - మల్లిఖార్జునులు, శ్రీశైలం



శ్రీపాద శ్రీవల్లభస్వామి, పిఠాపురం



శ్రీ నృశింహ సరస్వతి స్వామి, గాణుగాపురం




శ్రీ మాణిక్య ప్రభువు, మాణిక్యనగర్




శ్రీ స్వామి సమర్థ, అక్కలకోట




శ్రీ శిరిడి సాయినాథుడు




శ్రీ సత్యసాయిబాబా, పుట్టపర్తి




శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, మైసూరు



శ్రీ సదానంద సరస్వతి మహరాజ్



శ్రీ మహరాజ్, బరోడ



శ్రీ పూర్ణానంద స్వామి, సున్నిపెంట, శ్రీశైలం




శ్రీ జన్నాభట్ల వీరభద్రయ్య - హనుమాయమ్మ గార్లు

(శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తిగారి తల్లి దండ్రులు)




శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి

దత్త భక్తులు



కీ॥ శే॥ శ్రీ చిలుకూరు సూర్యనారాయణ - చెల్లమ్మ గార్లు
(శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి గారి తల్లిదండ్రులు)



శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి, శ్రీమతి భవాని

శ్రీ మహా గణాధిపతయే నమః శ్రీ మహా సరస్వత్యై నమః

# శ్రీ దత్త గురు భగవద్గీత

బ్రహ్మాఖండము - విష్ణు ఖండము - శివ ఖండము

కాలభైరవ ఖండము


శ్రీ దత్త భక్తులు :

ప్రొ॥ డా॥ శ్రీ జన్నాభట్ల వేణుగోపాల కృష్ణ మూర్తి, M.sc, Ph.D.

రామిరెడ్డిపేట, నరసరావుపేట


భగవాన్ శ్రీ దత్తాత్రేయ స్వామి వారి సేవలో :-

**చిలుకూరు బాలకృష్ణ మూర్తి**

ధర్మపత్ని **భవాని**

**కుటుంబసభ్యులు**

41-15-4, నల్లగేటు డౌన్, కృష్ణలంక, విజయవాడ - 13, ఫోన్ : 521809.

MIG II బ్లాక్ -20, ప్లాట్ 14, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 44.

ఫోన్ : 7667758

ప్రథమ ముద్రణ
శ్రీ దత్త జయంతి 3-12-1998
బహుధాన్య నామ సం॥
మార్గశిర పూర్ణిమ గురువారము

ప్రతులు : 1600

మూల్యము : గురుదక్షిణయే

ప్రతులకు :

శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి
శ్రీమతి భవాని
41-15-4, నల్లగేటు డౌన్, కృష్ణలంక,
విజయవాడ - 520 013.
ఫోన్ : 521 809

హైదరాబాద్
MIG - II, బ్లాక్ - 20, ఫ్లాట్-14,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-44,
ఫోన్ : 7667758

శ్రీ టి. దేవోత్తం
శ్రీమతి అరుణజ్యోతి
H.No 1-8-37/C, చిక్కడపల్లి,
హైదరాబాద్ - 500 020. ఫోన్ : 7645883

డైప్ సెట్టింగ్ :
ఆర్.ఆర్. ప్రింటర్స్
విజయవాడ-2, ఫోన్ : 438722

ముద్రణ :
సవితా ప్రింటర్సు
విజయవాడ - 520 002. ఫోన్ : 576670

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త



# శ్రీ దత్త గురు భగవద్గీత



శ్రీ గురు దత్తాత్రేయాయ నమః

## -ః విషయసూచిక ః-

1. తొలిపలుకు - శ్రీ చిలుకూరు బాల కృష్ణమూర్తి, శ్రీమతి భవాని
2. ఉపోద్ఘాతము - శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి
3. పిలుపు పాట - శ్రీ దత్త భగవానులు
4. శ్రీ దత్తాష్టకము - శ్రీ విష్ణు దత్తులు రచించినది
5. శ్రీ దత్తాష్టకము - శ్రీ దత్త భక్తులు రచించినది
6. శ్రీ దత్త భజనావళీ - శ్రీ దత్త భక్తులు రచించినది

## బ్రహ్మ ఖండము

(1 నుండి 4 అధ్యాయములు - 1 నుండి 63 పేజీలు)

### ప్రథమోZధ్యాయః - శ్రీ దత్త దర్శన యోగః

దత్త భక్తులు శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి గారు యతి తపః స్థల క్షేత్రమున తపస్సు చేయుట.... శ్రీ దత్త సద్గురు సాక్షాత్కారము.... శ్రీ దత్త భక్తులు శ్రీ దత్త భగవానుని స్తుతించుట.... స్వామి దత్త భక్తుని వరము కోరుకొను మనుట.... దత్త భక్తులు కైవల్యము కోరుట.... స్వామి - ఈ లోకములో తన సేవకునిగా చేరి తన సేవలో పాల్గొనుటయే మోక్షమని తెల్పుట.... కాలోచిత సేవ వివరణము.... జ్ఞాన ప్రచారమే ఇప్పటి కాలోచిత సేవ యని బోధించుట.... స్వార్థ రోగము.... జ్ఞానౌషధము.... ప్రచారము.... సత్సంగము.... మానవుడు తను చేసిన పాపములను సమర్థించుకొనుట.... ప్రాయశ్చిత్తము.... త్రేతాయుగములో శ్రీ దత్త సాక్షాత్కారము.... చతుర్వేదములు శునకములుగా స్వామిని సేవించుట.... ధర్మదేవత గో రూపమున స్వామిని సేవించుట.... శ్రీ దత్త పరబ్రహ్మము యొక్క నిరూపణము.

## ద్వితీయోఽధ్యాయః - శ్రీ దత్త పరబ్రహ్మ తత్త్వ దర్శన యోగః

నేను ఆకాశము వలె శూన్యమగుదునా? వాయువు నా? అగ్ని నగుదునా? అశబ్దమును.... ప్రస్థాన త్రయము.... స్వరూపలక్షణము తటస్థ లక్షణము.... త్రిముఖ రూపము నిత్యము. ఇదే అసలు బ్రహ్మ రూపము.... మిగిలిన రూపములు బ్రహ్మము యొక్కవేషాలే.... కార్య బ్రహ్మము.... కారణ బ్రహ్మము. నేను, నా మాయా వేరుకాము.... జగత్తు .... పరమ వ్యోమము.... వివరణము.... శ్రీ దత్త పరబ్రహ్మతత్త్వ వివరణము....

## తృతీయోఽధ్యాయః - శ్రీ దత్త భిన్న జీవ యోగః

కృత యుగములో అందరు జీవులు శుద్ధ చైతన్య స్వరూపులే.... తర్వాత జీవులకు స్వేచ్ఛ నొసగుట.... దేవతలు... రాక్షసులు.... మానవులు.... పరాప్రకృతి.... అపరా ప్రకృతి.... పరా ప్రకృతియే చైతన్యము.... అపరా ప్రకృతియే దేహము.... స్థూల శరీరము.... సూక్ష్మ శరీరము.... జీవుడు.... యాతనాశరీరము.... భోగశరీరము... కారణ శరీరము.... పుత్రుడు.... తండ్రి.... దత్త తండ్రి.... జీవుడు కూడా కర్మ స్వరూపుడే.

## చతుర్థోఽధ్యాయః - శ్రీ దత్త - జీవ విభాగ యోగః

నా తనువు నిత్యము.... నీ తనువు అనిత్యము.... నేను మాత్రమే క్రొత్తదానిని సృష్టించగలను.... నీవు క్రొత్తగా ఏమియు సృష్టించుటలేదు.... జీవుడు స్వభావ సిద్ధంగా బ్రహ్మము కాదు. అయితే బ్రహ్మము దయ వలన బ్రహ్మము కాగలడు.... ఆత్మ ప్రాప్తి పరమాత్మ ప్రాప్తి కాదు.... జీవునకు జగత్తు సత్యము.... ఈ విశ్వములో పరమాణువును నేనే- కొండను నేనే.... పులిని నేనే.... వృక్షము నేనే.... మనుజుడను నేనే.... నేను ఒక చోటనే ఉంటూ ప్రతి చోటా పరిపూర్ణంగా ఉంటూ విశ్వమంతా వ్యాపించి కూడా యున్నాను.



# విష్ణు ఖండము

(5 నుండి 8 అధ్యాయములు - 64 నుండి 150 పేజీలు)

## పంచమోఽధ్యాయః - శ్రీ దత్తావతార తత్త్వ యోగః

ఆవేశము - అవతారము వివరణ.... లోకంలో అన్ని పనులను చేయుచున్న వాడను నేనే.... ధర్మమును ఉద్ధరించుటకు, అధర్మమును దండించుటకు ప్రతిక్షణము అవతరింతును.... దత్తునకు దత్తావతారమునకు తేడా లేదు.... సిద్ధులకు అవతార పురుషునకు తేడా లేదు.... భక్తి యొక్క సత్యమైన పరీక్షయే సేవ.... రాధ పరాభక్తి.... బ్రహ్మము యొక్క అనూహ్యమైన విచిత్ర తత్త్వము.... నా రూపము విశేషయత్నమైన తపస్సు చేతనే చూడదగినది.... అన్ని రూపములు నా వేషములే.... నేను సర్వ శక్తి సంపన్నుడను.... ఆదిలో నున్న మానవులు ఈ నాటి యంత్రపురుషులు.... బ్రహ్మ జ్ఞానము యొక్క వివరణము.

## షష్ఠోఽధ్యాయః - శ్రీ దత్తో పాసనా యోగః

యోగము అంటే ఏమిటి?.... వివరణము.... జ్ఞాన యోగము.... భక్తి యోగము కర్మయోగము లేక సేవా యోగము.... శక్తి వ్యయము క్రోధము వలన శక్తిని కోల్పోవుట.... ఈ విశ్వంలో నేను ప్రతి పరమాణువులోను పూర్ణముగా యున్నాను.... సత్సంగము.... జ్ఞానము.... బ్రహ్మముపై ఆకర్షణ.... బ్రహ్మభక్తి.... వైరాగ్యము.... ఉపాసన.... కుంభకము.... చలనచిత్రములు మనస్సుపై చేయు ప్రభావము.... ఇడ.... పింగళ నాడులు. మాయ.... మనస్సునకు అనుకూలమైన సాధన చేయుట.... సాధన యొక్క ప్రతి రూపమే సిద్ధి.... గాయత్రి.... బ్రహ్మచారి వానప్రస్థుడు.... స్త్రీలకు స్వాతంత్ర్యము.... ధర్మమే వేదాంత శాస్త్రము యొక్క తాత్పర్యము.

## సప్తమోఽధ్యాయః - శ్రీ దత్త నిష్కామ భక్తి యోగః

నిష్కామ కర్మ రూపమైన సేవా ఫలము శాశ్వతము.... జ్ఞానమే సాధనకు మూలము.... సాత్త్వికాహంకారము.... రాజసాహంకారము.... తామసాహంకారము.... నా సేవకునకు నేను నన్ను దత్తము చేసుకొందును.... అహం బ్రహ్మాస్మి.... తత్త్వమసి.... నక్క.... కుక్క....

తేడా.... సమన్వయ వివరణము.... స్వార్థమునకు కారణం ఒక్కటే.... గృహస్థులు.... అవధూతలు.... సంన్యాసులు.... అజ్ఞానులు.... నిష్కామ భక్తి.... నేనెప్పుడును ఉపకారమునే చేయుదును.... వేశ్య.... ధర్మపత్ని.... నిష్కామ భక్తియే సత్యమైన భక్తి.

## అష్టమోZధ్యాయః - శ్రీ దత్త వాత్సల్య యోగః

అహర్నిశలు సాధన చేయుట.. ఈ జన్మ సమయము చాలని వారికి మరల మానవ జన్మ ఇత్తును. నరకాదుల ప్రశంస.... యమ ధర్మ రాజు.... కాల భైరవుడు.... ఎవరు చేసిన కర్మల ఫలములను వారు అనుభవించక తప్పదు.... పశ్చాత్తాపము.... నవగ్రహములు ఎవరు? మానవుడు పుత్రవ్యామోహము.. పరిణామము.. నేను అపారప్రేమ స్వరూపుడను.... నీవు నీ భార్యాపుత్రాదులను నేను రక్షించలేదని నా పై అలుగు చున్నావు.... నీ పూర్వ జన్మలు నీకు తెలియవు.... నాకు తెలుసును.... దయ కన్న ప్రేమ చాలా గొప్పది.... యోగ భ్రష్టుని విషయము.... కర్మ చక్రము.... దృతరాష్ట్రుని యుక్తి.... అధర్మ అచరణ సమయము రాగానే నా సమాధానము.... అతిధి - గృహ యజమాని.

# శివ ఖండము

(9 నుండి 12 అధ్యాయములు - 151 నుండి 220 పేజీలు)

## నవమోZధ్యాయః - శ్రీ దత్త వేదోక్త పరబ్రహ్మ రహస్యయోగః

సర్వ జగత్తు నా ఊహయే.... జీవుడు కూడా నా ఊహయే.... పరమ వ్యోమము బ్రహ్మమే.... నా తనువులో నున్న పంచభూతములు చాలా విచిత్రమైనవి.... త్రిమూర్తులు.... ముగ్గురమ్మలు.... పరబ్రహ్మము అత్రిమునికి దర్శన మిచ్చుట.... వేదోక్త పరబ్రహ్మరహస్యము.... నన్ను ఎవ్వడును తెలియ జాలడు.... సర్వ దేవతలు.... హనుమంతుడు.... విశ్వరూపుడు.... భగవచ్ఛబ్దార్థము బ్రహ్మవిష్ణు శివులు.... పరాశక్తి.... ధర్మ చక్రము.... బ్రహ్మజ్ఞానము.... దత్తాత్రేయ శబ్దార్థము.... పురుషుని పశువుగా బంధించుట.... సమస్త విశ్వము నా నాటకమే.



## దశమోZధ్యాయః - శ్రీ దత్త నిస్స్వార్థ సేవా ఫల యోగః

అష్ట సిద్ధులు నా సృష్టియే.... వాటిని నాసేవకుల కిత్తును.... సాధర్మ్యము.... సారూప్యము సాయుజ్యము సామీప్యము సాలోక్యము.... నా దాసులకు నేను దాసుడను.... నంది, గరుత్మంతుడు, హంస, కాలభైరవుడు మానవాకారము దాల్చకుండుట యందలి రహస్యము.... సన్యాస యోగము అత్యుత్తమము.... మధ్యము లెవరు? అధము లెవరు? అధమాధములెవరు? నా భక్తుడు నాతో శాశ్వత ప్రేమ బంధమును పెట్టు కొన్న ఫలమేమి? ముక్త జీవుడు.... స్వామి కార్యములో సేవకుడివై నిస్స్వార్థ సేవా ఫలమును పొంది, తరించుము.

## ఏకాదశోZధ్యాయః - శ్రీ దత్త జ్ఞాన ప్రచార యోగః

ధర్మమనగా ఏమి? కర్మయనగానేమి? జ్ఞాన ప్రచారము.... శ్రవణము.... మననము.... నిదిధ్యానము. వికర్మ.... అకర్మ.... అన్నదానము అశాశ్వతము.... జ్ఞానదానము శాశ్వతము.... ప్రస్తుతము జ్ఞాన ప్రచార సేవ కర్తవ్యము.... దుర్యోధనుడు.... ధృతరాష్ట్రుడు. అహంకారమమకారములే శత్రువులు. సాధన ఫలమే నా సేవకుడు మరల ఫలము కోరడు.... నా సత్య తత్త్వము.... నా కార్యము సర్వ జీవుల నుద్ధరించుటయే.... సేతువు నిర్మాణ రహస్యము.... కలికాలో చిత సేవ ఏమి?

## ద్వాదశోZధ్యాయః - శ్రీ దత్త సేవక జీవన్ముక్తి యోగః

దత్త శిష్యుని ప్రశ్న.... భగవానుని సమాధానము.... దత్త పరీక్ష..... నేను కష్టములను సృష్టించి ప్రత్యేకముగా ఇచ్చుట లేదు.... కార్తవీర్యుని సేవా రహస్యము.... అజ్ఞానమే అన్ని అపార్థములకు కారణము.... కష్టములు లేకున్నచో సుఖము విలువ తెలియదు.... బ్రహ్మ పరీక్ష.....విష్ణు పరీక్ష.....రుద్ర పరీక్ష..... కృతయుగము త్రేతాయుగము ద్వాపర యుగము కలియుగము.... మెడలోని బంగారు గొలుసు.... ఆశీస్సులు.... శాపములు.... దుర్యోధనుడు.... రావణుడు.... ధృతరాష్ట్రుడు.... రాముడు.... ఆనందము యోగలక్ష్యము

కాదు.... శాంతమే బ్రహ్మము.... యోగియే జీవన్ముక్తుడు.... అంజనేయ ఆరాధన, రామ ఆరాధనము లలిత పూజ - శివాభిషేకము - పురాణములు, దైవ చిత్రములలో ముక్తిని గురించి ప్రచారము చేసిన విషయముల రహస్యము....

## కాలబైరవ ఖండము

(13 నుండి 16 అధ్యాయములు - 221 నుండి 332 పేజీలు)

### త్రయోదశోఽధ్యాయః - శ్రీ దత్త ఆకాశ చైతన్య విచార యోగః

దత్త శిష్యులు ప్రశ్నించుట.... స్వామి దత్త శిష్యుని అభినందించుట.... ఆకాశము.... అభావము అనగా నేమి?.... స్వప్నములోని పులి.... మేల్కొని యుండినప్పుడు చూచు పులి.... చైతన్యము.... పరమ వ్యోమము.... యంత్ర పురుషుడు.... మహర్లోకము.... తపోలోకము.... జన లోకము.... సంఘాతము.... ఈ గీతను నిన్ను దృష్టిలో ఉంచుకొని చెప్పుచున్నాను.... జగత్తు అసత్యమా లేక సత్యమా?.... బింబము నేనే.... ప్రతి బింబము నేనే.... తత్త్వపరంగా జీవుడు బ్రహ్మమే.... నా చైతన్య సముద్రములోని బిందువులే ఈ లోకములు.... నవీనుల మతము.... బ్రహ్మము అనూహ్యము....

### చతుర్దశోఽధ్యాయః - శ్రీ దత్త పరబ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణ యోగః

ఈనాటి విశేష యంత్రములు.... ప్రత్యక్ష ప్రమాణము.... అనుమాన ప్రమాణము.... సమాధి.... నవీన మతము ప్రకారము చైతన్యము.... అవు కొమ్ము కుందేటి కొమ్ము.... ద్రవ్యము క్రియగా మారదు.... నాకు అసాధ్యమంటూ ఏమీ లేదు. విశ్వరూపుడు.... కృష్ణ వేషంలో నటుడు.... నేను తర్కాతీతుడను.... నా ప్రతి అవయవము పూర్ణ బ్రహ్మమే.... నేను ఒకేసమయమున ఆకారముగను నిరాకారముగను ఉండగలను.... గోడమీది పిల్లి.... శ్వేత కేతువు.... బ్రహ్మజ్ఞాని ఎవరు?.... సజాతీయ భేదము.... విజాతీయ భేదము.... శాస్త్రజ్ఞులకు నేనే నవీన భౌతిక విజ్ఞానమును అందించుచున్నాను.... శక్తి.... శక్తిని కలవాడు వివరణము.... ప్రాచీనుల తర్కమును నవీనుల తర్కము చేతను నవీనుల తర్కము అష్టసిద్ధుల ప్రదర్శనము చేతను అణచి వేయుచున్నాను.... కాన విచిత్ర తత్త్వమైన నా మాయను అంగీకరించక తప్పదు.



### పంచదశోఽధ్యాయః - శ్రీ దత్త విశ్వ వ్యాపక యోగః

ఈ విశ్వము చూచుటకు ఎంతో రమ్యంగా ఉంటుంది.... దాని అంతః స్వరూపమును శ్రీ దత్త స్వామి వారు దత్త భక్తులకు దివ్య దృష్టితో చూపుట.... అత్యంత సూక్ష్మ ద్రవ్య కణములు.... పరమాణువు.... "విశ్వం విష్ణుః" వివరణ.... నాకు మాయ లేదు.... ద్రవ్యము.... క్రియ.... శక్తికి చైతన్యానికి తేడా లేదు.... ఈ జగత్తులోని ప్రతి పరమాణువు పూర్ణ బ్రహ్మమే..... కపిలుడు.... అసంగయోగము.... బుద్ధుడు.... అహింసా ధర్మము...., చలన చిత్రముల ఉపమానము. అర్జునుడు, కృష్ణుడు.... విశ్వము.... ఆనందముకన్న శాంతి గొప్పది.... ఓంకారము.... సాధన మార్గాల వివరణ.... నాస్తికుడునూ నా బిడ్డయే....

### షోడశోఽధ్యాయః - శ్రీ దత్త మత సమన్వయ యోగః

పండితుల ప్రశంస.... శంకర, రామానుజ, మధ్వాచార్యుల ప్రశంస.... త్రిమూర్తులే త్రిమతా చార్యులు.... శంకరులు "జగత్ మిధ్య" అనుటకు కారణము.... మిధ్య అనగా నేమి? జగత్తుతో కూడిన బ్రహ్మము చీమతో కూడిన మానవుని వంటి వాడు.... సర్వం ఖల్విదం బ్రహ్మ.... అహం బ్రహ్మాస్మి.... రామానుజ మధ్వులు చెప్పినది ఏమి? త్రిమతాచార్యుల సిద్ధాంతము ఒక్కటియే.... నిరూపణము.... ద్వైతము.... అద్వైతము.... విశిష్టాద్వైతము.... బౌద్ధులు.... పరమార్థదశ.... వ్యవహార దశ.... వివరణము.... పల్లెరాజు దేశరాజు.... బిందె.... నీరు.... ముగ్గురి మతములు ఒక్కటియే.... అపార్థములను తొలగించుట.... శబ్దానికి అర్థము నిర్ణయించకుండా కేవలము శబ్దములతో కలహించరాదు.... నా భక్తుల ద్వారా, నా అవతారముల ద్వారా నేను చెప్పుదును.... నేనే సర్వజ్ఞుడను.... శాస్త్రమును ఎప్పుడును అల్పజ్ఞుడు, అజ్ఞుడు అయిన జీవునకే ఉపదేశించవలయును గాని సర్వజ్ఞుడైన నాకు కాదు.

*ఓం తత్ సత్*

# శ్రీ దత్త గురు భగవద్గీత

## తొలిపలుకు

సుప్రసిద్ధ జ్యోతిష పండితులు, ఆంధ్ర గీర్వాణ భాషలలో శతాధిక గ్రంధ కర్త, ఆశు కవియు అగు శ్రీ జన్నాభట్ల వీరభద్రయ్య శాస్త్రి, శ్రీమతి హనుమాయమ్మ గార్ల ప్రధమ పుత్రరత్నమగు శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి గారు డాక్టరేటు సాధించినట్టియు యం.యస్.సి; పి.హెచ్.డి. ఉత్తీర్ణులైనట్టియు కెమిస్ట్రి ప్రొఫెసరు. వీరు శ్రీ దత్త ప్రభువుల దర్శనము పొందిన ధన్యులు. వీరు బాల్యముననే, హిమాలయము నుండి వచ్చిన ఒక సంన్యాసి ఆదేశానుసారము 24 లక్షలు గాయత్రి జపము చేసి, సంస్కృతములో ఆశు కవిత్వము, సర్వశాస్త్రజ్ఞానమును పొంది, సంస్కృతంలో 60కి పైగా వేదాంత గ్రంధాలు వ్రాశారు. వీరికి శ్రీ దత్త స్వామి సర్వదా ప్రసన్నులు, ప్రత్యక్షమై సదా సంభాషిస్తూ ఉంటారు. శ్రీ దత్త స్వామి ఆదేశానుసారముగా ప్రస్థాన త్రయములగు "ఉపనిషత్తులు.... భగవద్గీత - బ్రహ్మసూత్రాలకు - శంకర - రామానుజ - మధ్వ మతత్రయ సమన్వయం చేస్తూ సంస్కృతంలో భాష్య త్రయములను రచించారు. వీరు శ్రీ దత్త స్వామి వారు చెపుతుంటే విని అంతా వ్రాస్తున్నానని చెపుతుంటారు. స్వామి చెప్పగా విని (శ్రుతి) చెప్పిన దానిని చెప్పుట "వేదము" అంటారు. అందుకే వీరు తన వ్రాతల నన్నింటినీ "దత్త వేదము" అని నామం క్రింద చేర్చారు.

శ్రీశైలంలో, వీరితో కలసి, చాలా కాలం, మేము దంపతులము ఇరువురమూ అనేక దైవారాధనలను వీరి సూచనల ప్రకారం చేశాము. మేము చేశాము అంటే అహంకారం అవుతుంది. శ్రీ దత్త భక్తులే వారి అనుగ్రహం మాయందు కురిపించి ఎన్నో అర్చనలు చేయించి మమ్మ కృతార్థులను చేశారు. శ్రీ వారు చెప్పేది మాకు ఎప్పటికప్పుడు వినిపించి మమ్మ ధన్యులను చేశారు. ఎన్నో అనుభూతులు - నిదర్శనములు కలిగినవి. ఒక నాడు స్వామి ఆదేశాన్ని ఇలా చెప్పారు. "దత్త వేదాన్ని గ్రంధస్థం చేసి ప్రచారం చేస్తే, ఎందరు జీవులు సాధనలో ఉద్ధరించబడతారో, అందరి పుణ్యాల భాగాలు మిమ్ములను చేరి, మీరుతరిస్తారు" అని. మేము వెంటనే "శ్రీదత్త వేదము" గ్రంధమును తెలుగులో ముద్రించి, భక్త మహాశయులకు అందచేశాము. దానిలోని సంగ్రహ వాక్యాలను "శ్రీ దత్త సూక్తులు" కూడా భక్తులకు అంద చేశాము. మరియు శ్రీ దత్త గ్రంధ మాలలో భాగంగా "గురు స్తుతి", "శివ మహిమ్నః స్తోత్రము", "శ్రీ దత్త ఉమా మహేశ్వరస్తుతి", "భోగ భాగ్య గుళికలు", శ్రీదత్త కాలభైరవ స్తుతి, శ్రీ దత్తామృతము, శ్రీశ్రీ అక్కలకోట మహారాజుల చరిత్ర, శ్రీ మాణిక ప్రభువుల చరిత్ర, శ్రీ శ్రీపాదశ్రీవల్లభుల చరిత్ర, శ్రీ సాయినాధుని చరిత్ర మొదలగు గ్రంధాలను కూడా ముద్రించి భక్తులకు అందచేసి ధన్యుల మైతిమి. శ్రీ నరసింహ సరస్వతి స్వామివారి చరిత్ర ముద్రించ వలసి యున్నది.



దత్త భక్తులు శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి గారికి శ్రీ దత్త స్వామి వారు సాక్షాత్కరించి "తాను మా ఇంటికి రాదలచితి ననియు, తనను తీసుకొని వెళ్ళి మా దంపతులకు అనుగ్రహించవలసినదిగా ఆజ్ఞ ఇచ్చినారట. 8-2-1996 తేదీన రాత్రి 8.30 గం॥లకు శ్రీ దత్త భక్తులు శ్రీ శ్రీ శ్రీ దత్త స్వామి వారి చిత్ర పటమును నెత్తిన పెట్టుకొని వచ్చి మా దంపతులకు అనుగ్రహించినారు. ఆనాటి నుండి మేము, మా కుటుంబ సభ్యులు శ్రీవారిని కొల్చుకుంటున్నాము.

ఇంతలో ఒక విచిత్రం జరిగినది. శ్రీ దత్త భక్తులు తమ మిత్రుల బలవంతము వలన షిరిడి, గాణుగాపురము, మరి కొన్ని దత్త క్షేత్రాలు దర్శించారు. శిరిడి సమాధి మందిరంలో శ్రీ దత్త భక్తులకు శ్రీ శిరిడి సాయి నాధుడు దర్శన మిచ్చారు. ఆశీర్వదించారు. అక్కడ నుండి శ్రీ దత్త భక్తులు గాణుగాపురం దర్శించారు. సంగమ స్నానం చేస్తున్నారు. సంగమంలో శ్రీ నరసింహ సరస్వతి స్వామి వారు సాక్షాత్కరించి ఇలా సెలవిచ్చారట, "నాయనా! విను; ఆనాడు తుల్జాపూరు భవాని దేవి ఛత్రపతి శివాజీకి, భౌతిక దుష్ట శక్తులను చీల్చుటకు ఖడ్గ మిచ్చినట్లు. ఈనాడు నీకు ఆధ్యాత్మిక రంగంలో అజ్ఞాన శక్తులను చీల్చుటకు జ్ఞాన ఖడ్గమును ఇస్తున్నాను, స్వీకరించు అని తళతళ మెరిసే ఖడ్గాన్ని ప్రసాదించారట. ఆ ఖడ్గము వచ్చి శ్రీ దత్త భక్తుల హృదయంలో ప్రవేశించి అదృశ్యమైనదట", ఎంతటి మహా భాగ్యము.

అనంతరము, శ్రీ దత్త భక్తులకు శ్రీ దత్త భగవానులు ప్రత్యక్షముగా "శ్రీ దత్త గురు భగవద్గీత"ను ఉపదేశించారు. ఈనాటి ఈ దత్త గురు భగవద్గీత శ్రీవారి దివ్య వాణియే. ఆస్వాదించండి. తరించండి.

ఈ పవిత్ర గ్రంధాన్ని సకాలంలో సర్వాంగ సుందరంగా అచ్చు వేసి అందించిన సవితా ప్రింటర్సు విజయవాడ వారు - ఆ ప్రెస్ అధినేత శ్రీ సుబ్బరాజు గారికి మరియు వారి శిబ్బందికి మా హృదయ పూర్వకమైన కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము. ముద్రణకు సహకరించిన భక్తమహాశయులకు కృతజ్ఞతలు సమర్పిస్తున్నాము.

బహుధాన్య నామ సం॥
మార్గశిర పూర్ణిమ
శ్రీ దత్త జయంతి 3-12-1998

శ్రీ దత్త సేవలో
**చిలుకూరు బాల కృష్ణ మూర్తి**
**భవాని దంపతులు**

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

# శ్రీ దత్త గురు భగవద్గీత

## ఉపోద్ఘాతము

శ్రీ దత్తగురు భగవద్గీత యందు అనేక అద్భుత విషయములు రత్న రాశుల వలె యున్నవి. ఉపోద్ఘాతములో అన్ని రత్నములను చూపించుటకు వీలు కాదు. కాన, కొన్ని రత్నములను మాత్రమే మచ్చు తునకలుగా ప్రదర్శించు చున్నాము. నిజముగా ఈ గీత యందు ఏ విషయము, మరియొక విషయమునకు ఏమాత్రము తీసిపోదు. ఈ గీతను అధ్యయనము చేయుటకు ముందు సాధకునకు ప్రేరణ కల్గించుటకు కొన్ని విషయములను ప్రకాశింపచేయుచున్నాను. వీటిని చదివి వీటితో సమానమైన ఇతర విషయములను కూడా తెలుసుకొన్నగాని గీతా బ్రహ్మ జ్ఞానము సంపూర్ణము కాదు.

ఈ సృష్టిలోని జీవులందరికి వేదము పరమ ప్రమాణము. ఏలననగా ఊహాతీత విషయములను ప్రత్యక్షానుభవమునకు తెచ్చి నిరూపించునది వేదము. ఎక్కడో కనపడని స్వర్గాది లోకములను సాధించుటయే కాక, ప్రత్యక్షంగా కనపడే అయురారోగ్య-ఐశ్వర్య కార్య విజయాది ఐహికములను సాధించు యజ్ఞములను వేదమే చెప్పుచున్నది. కొన్ని శబ్దములను ఉచ్చరించుచు అగ్నిలో నేయి పోసినంత మాత్రమున ఆయురారోగ్య ఐశ్వర్యము లెట్లు సిద్ధించునో, ఊహకు అందకున్నవి. కావుననే ఊహాతీత విషయములలో వేదమే పరమ ప్రమాణము.

పరబ్రహ్మము ఊహాతీతము. ఈ పర బ్రహ్మమును గుర్తించే స్వరూపలక్షణాన్ని వేదము ఇలా చెప్పుచున్నది. దేని నుండి ఈ సమస్త భూతములు పుట్టి, దేని చేత నిలచి, దేని యందు లయమును చెందుచున్నవో అదే పర బ్రహ్మము. అది ఏకైక స్వరూపము. అద్వితీయము. ఈ వేద నిర్వచన ప్రకారంగా పర బ్రహ్మ లక్షణంలో రెండు అంశాలు ఉన్నాయి.

1) జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయునది బ్రహ్మము.
2) ఆ బ్రహ్మము ఒకే ఒక స్వరూపము. అనగా బ్రహ్మము ఒక్కరే. ఇంకా, బ్రహ్మమును గురించి వేదము ఇలా చెప్పుచున్నది.



1. "తపస్సు చే బ్రహ్మమును పొందుము"
2. "బ్రహ్మము తప్ప ఇతరములను కోరని వానికే బ్రహ్మము చిక్కును."
3. "ఆ బ్రహ్మము అట్టి వానికి తన తనువును అనగా స్వరూపమును చూపెట్టును".
4. "బ్రహ్మము ప్రత్యక్షము, పరోక్షము గాదు."

ఈ వేద వాక్కుల ప్రకారము అత్రి బ్రహ్మమునే కోరి, బ్రహ్మమును గురించి ఋక్ష పర్వతమునందు తపస్సు చేసెను. తపస్సు అనగా బ్రహ్మమును దర్శింప వలయునన్న తపన. బ్రహ్మమును దర్శించుటకు ఋషులందరును తపస్సును చేసినారు. కావుననే ఆ కాల మంతయు కృతయుగ మనబడినది. కృతము అనగా (తపస్సు) చేయ బడినది. అందరి తపస్సులలో అత్రి తపస్సు యోగ్యమైనది కావున బ్రహ్మము అత్రికి సాక్షాత్కరించదలచెను. కాని అత్రి బ్రహ్మమును గురించి వేదమును ఏమాత్రము అర్థము చేసుకున్నాడో తెలుసుకొనుటకు బ్రహ్మము పరీక్షించ తలచెను. అత్రి ఎదుట బ్రహ్మ, విష్ణు, శివులు నిలచిరి. "జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయునదే బ్రహ్మము గదా! కావున జగత్తు సృష్టి, స్థితి, లయములను చేయు మేము ముగ్గురము కలిపి బ్రహ్మమే కదా!" అని అనిరి. కాని అత్రి, ఈ ముగ్గురిని కలిపి బ్రహ్మమనుటకు నిరాకరించినాడు. ముగ్గురిని నిరాకరించుట వల్లనే, అతడు అత్రి అనబడినాడు. అ-త్రి ఎందుకు నిరాకరించినాడు? వేద నిర్వచనములో ఒక అంశము మాత్రమే త్రిమూర్తులలో సమన్వయించబడినది. అది జగత్తు సృష్టి స్థితి లయములను చేయునది బ్రహ్మము అను అంశము మాత్రమే. కాని, రెండవ అంశము సమన్వయింపబడలేదు.ఆ రెండవ అంశము ఏమి అనగా బ్రహ్మము "ఏకైక స్వరూపము-ఒక్కరే అని", త్రిమూర్తులు ముగ్గురు కాని ఒక్కరు కారు. కాన వేద నిర్వచనము లోని రెండు అంశాలు సమన్వయించబడలేదు. త్రిమూర్తులను కలిపి బ్రహ్మము అన్నచో మూడు బ్రహ్మములు లేవు. ఒకే బ్రహ్మము మూడు ముక్కలు కాలేదు. కావుననే అత్రి నిరాకరించినాడు. త్రి=త్రిమూర్తులు, అ=బ్రహ్మము కారు. కావుననే అత్రి అయినాడు.

అత్రి యొక్క వేద జ్ఞానమునకు సంతసించి, పరిక్షలో నెగ్గినాడు కావున, బ్రహ్మము త్రిమూర్తులను అదృశ్యము చేసినది. వెంటనే బ్రహ్మము అత్రికి సాక్షాత్కరించినది. ఈ బ్రహ్మములో వేద నిర్వచనము యొక్క రెండు అంశములు పూర్తిగా సమన్వయమగుచున్నవి. ఈ బ్రహ్మమునకు మూడు ముఖములున్నవి.

1. సృష్టి చేయు హిరణ్య గర్భ ముఖము (హిరణ్యగర్భాంశయే బ్రహ్మ దేవుడు)
2. మధ్యముఖము స్థితికి కారణమగు నారాయణ ముఖము (నారాయణాంశమే విష్ణువు)
3. లయ కారణ మగు రుద్రముఖము. (రుద్రాంశయే శివుడు)

ఈ మూడు ముఖముల ద్వారా జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయుట అను మొదటి అంశము సమన్వయమైనది. ఈ స్వరూపము ఒకే ఒక వ్యక్తి కావున బ్రహ్మము ఏకైక స్వరూపము అన్న రెండవ అంశము కూడా సమన్వయమైనది. ఈ విధముగా బ్రహ్మమును గురించిన వేద నిర్వచనమును చక్కగా సూటిగా ప్రత్యక్షముగా ఈ రూపమునకు పూర్తిగా సమన్వయమగుచుండగా ఈ రూపమును వదలి ఇతర రూపములపై బ్రహ్మ నిర్వచనమును బలవంతముగా సమన్వయము చేయుట ఎంత వెర్రితనము! ఒక రూపము శత్రువా? మరియొక రూపము చుట్టమా?

బ్రహ్మము సాక్షాత్కరించగనే " దత్తః దత్తః" అని అత్రి కేకలు పెట్టినాడు. దత్తః అనగా చిక్కినాడు అని అర్థము. చిక్కినాడు అను శబ్దము ఒక వస్తువు యొక్క పేరు కాజాలదు. చిక్కినది అనగానే , "అది ఏమిటి? " అను ప్రశ్న వెంటనే వచ్చును. మరి "దత్తః" చిక్కినాడు అని పేరు ఎందుకు స్థిరపడినది? అందరును ఒక రత్నమును వెదుకుచున్నారు అనుకొందము. వారిలో ఒక వ్యక్తికి రత్నము చిక్కనది అనుకొందము, అప్పుడు అతడు "చిక్కింది" "చిక్కింది" అని కేక పెట్టును. అందరును "చిక్కింది" అని అంటారే తప్ప, "రత్నము చిక్కింది" అని ఎవరు అనరు గదా. ఎందు వలన? అందరు ఆ రత్నమునే అన్వేషించుచున్నారు కాన, చిక్కినది రత్నమేనని అందరికి తెలియును. అనగా ఆ యుగములో అందరు బ్రహ్మమును అన్వేషించుచున్నారు. కావున అత్రి "చిక్కినది" -అన్నప్పుడు చిక్కినది బ్రహ్మమేనని అందరికి తెలియును. కావున చిక్కింది (దత్తః) అను శబ్దమే ఆకాలమున ఆ రూపమునకు స్థిరమైన పేరుగా నిలిచి పోయినది. కావున దత్త శబ్దమునకు అర్థము బ్రహ్మమే. కలియుగములో బ్రహ్మమును గురించిన అన్వేషణ ఎవరికిని లేదు కావున "చిక్కినది" (దత్తః) అను మాటకు ఏమి చిక్కినది అను ప్రశ్న ప్రతి జీవునిలో కలుగుచున్నది. ఆకాలమున దత్తః అనగానే బ్రహ్మము అను అర్థము ప్రతి జీవునకు తెలిసి యుండెను.

నిజముగా దత్తుడు అన్నది ఒక విశేషణ పదమే. ఉదా॥ నల్లని కలువ అన్నప్పుడు నల్లనిది అను మాట విశేషణము. కలువ యన్నది ఆ వస్తువు యొక్క అసలు పేరు. అనగా విశేష్యము.ఇట్లే దత్త బ్రహ్మము అనగా చిక్కిన బ్రహ్మము అను



మాటలో "చిక్కినది" అను శబ్దము విశేషణము. బ్రహ్మము అను శబ్దము అసలు పేరు లేదా విశేష్యము. కావున దత్త శబ్దము విన్నంతనే దాని అర్థము అగు వస్తువు యొక్క అసలు పేరు బ్రహ్మము అని వెంటనే స్ఫురించవలెను.

ఇప్పుడు అనేక దేవతల ఆరాధనములతో సాధకుడు తికమక పడుచుండగా, మరల ఇంకొక దేవతా రూపమును "దత్తుని"ని తెచ్చి పెట్టినారే! అని అపార్థము చేసుకొనరాదు. దత్తు డనగా బ్రహ్మము అని చెప్పితిమి కదా. ఈ దత్త బ్రహ్మము ఇన్ని యుగములలో ప్రకాశమునకు రాకుండా ఇప్పుడే కలియుగములో ఎందుకు.ప్రకాశము అగుచున్నది? దీనికి కారణము ఒక చక్కని ఉదాహరణముతో స్వామి ఇట్లు సెలవిచ్చుచున్నారు. నీ కుమారుడు ఒక్కొక్క రోజు ఒక్కొక్క నాటకమున ఒక్కొక్క వేషమును వేసెను అనుకొనుము, అన్ని వేషములలో నున్న వేషధారి నీ కుమారుడే నని నీవు గుర్తించనందున, ఒక వేషము నీకు నచ్చి ప్రశంసించుచున్నావు. మరియొక వేషము నచ్చక తిట్టుచున్నావు. రెండు వేషములు సమానముగా నచ్చి, రెండు వేషములను సమానముగా నీవు ప్రశంసించవలెనన్నచో, ఏమి చేయవలెను? నాటకములను చూచుటకు ముందుగనే ఆ వేషములను వేసిన వేషధారి, నీ కుమారుడేనని నీకు ముందుగానే తెలిసినది అనుకొందము. ఇప్పుడు నీవు ఏ వేషమును చూచినా, ఆ వేషధారి నీ పుత్రుడే అని తెలిసినందున, ప్రతి వేషము సమానముగనే నచ్చుచున్నది. ఏలననగా అన్ని వేషములందును నీలో పుత్ర ప్రేమయే సమానముగా ప్రసరించుచున్నది. ఒక వేషముపై అధిక అభిమానము, మరియొక వేషముపై ద్వేషము కలుగచేయు భేదబుద్ధి, వేషధారి నీ పుత్రుడని తెలిసిన జ్ఞానముచే నశించుచున్నది. కలియుగమునకు ముందున్న యుగములలో సర్వ దేవతా రూపములను సమానముగనే ఆరాధించెడివారు. ఏలననగా వారికి సర్వదేవతా వేషములలో ఉన్న వేషధారి బ్రహ్మమే (దత్తుడే) నని బాగుగ తెలియును. ఆ బ్రహ్మమును, వారందరును, తమ పుత్రునిగా దత్తము చేసుకొన్న పరమజ్ఞానులు కావున, సర్వదేవతా రూపసందర్శనములలో వారి పుత్ర ప్రేమయే సమానముగా ప్రసరించినది. కానీ, కలియుమున, బ్రహ్మజ్ఞానము అనగా దత్త భగవానుడే బ్రహ్మమను జ్ఞానము లోపించినందున సర్వదేవతలు దత్త బ్రహ్మము యొక్క వేషములే అని తెలియక, కొన్ని దేవతా రూపముల మీద అభిమానమును పెంచుకొని ఇతర దేవతా రూపములను తిరస్కరించుట మొదలుపెట్టి అది రాను రాను ద్వేషముగా మారి వీరశైవ, వీర వైష్ణవ మతములకు దారితీసినవి. ప్రస్తుతము దత్త బ్రహ్మము తనను ప్రకాశింపచేసుకొన్నుటలో ఇతర

దేవతలను తిరస్కరించి దత్త రూపముపై అభిమానము పెంచుకొని వీర దత్త మతమును ప్రతిపాదించుట ఉద్దేశము కాదు. సర్వదేవతా వేషములందున్న వేషధారి యగు దత్త బ్రహ్మము యొక్కటే అని వేషధారిని చూపించుటయే తప్ప దత్త రూపము మరియొక వేషము కాదు. అన్ని వేషములను తీసివేసి నిజమైన సహజ వేషమున ఉన్న పరబ్రహ్మమే దత్త స్వరూపము. దిగంబర దత్త స్వరూపము అనగా, అన్ని వేషములను తీసివేసి నిజవేషమున ఉన్న స్వరూపమే తప్ప అన్ని వస్త్రములను తీసి వేసిన నగ్న స్వరూపము కాదు. ఈ దత్త బ్రహ్మము తన నిజరూపము మార్పు చెందకుండగనే ఇతర దేవతా రూపములు అను వేషములను ధరించగల, అనూహ్య శక్తి గలది. ఇతర రూపములను ధరించుటకు నిరాకార స్థితిని పొందనవసరము లేదు. ఎట్లు ఇతర వేషములను ధరించుటకు ఒక వ్యక్తి నగ్నము కానవసరము లేదో, తన నిజ వేషమును త్యజించకయే, దానిపైన ఇతర వేషములను ధరించగలడో, అట్లే దత్త బ్రహ్మము తన స్వరూపమును త్యజించకయే, ఇతర రూపములను, వేషములను ధరించగలడు. అసలు దత్త స్వరూపమే బ్రహ్మము తప్ప నిరాకారమైన బ్రహ్మము లేదు. ఈ గొప్ప పరిమాణము గల సృష్టిని ధరించుటకు ఈ సృష్టి కన్న పెద్దపరిమాణము గల నిరాకారమైన బ్రహ్మము ఉండవలయునన్నచో, అట్టి నియమమునకు బ్రహ్మము లొంగినట్లే గదా. అనగా మన తర్కమునకు బ్రహ్మము లోబడి యున్నట్లే అగును. చిన్న జగత్తును పెద్ద బ్రహ్మము ధరించుచున్నది అన్నప్పుడు ఇందులో తర్కాతీతమైన స్థితిగానీ, ఆశ్చర్యముకానీ ఏమియులేనందున బ్రహ్మము యొక్క గొప్పతనము ఏమియు లేనట్లే గదా. కానీ, బ్రహ్మ శబ్దమునకు అర్థము "ఎంతో గొప్పది" అని. ఈ అర్థము ఎప్పుడు సిద్ధించును? చిన్న బ్రహ్మము పెద్ద జగత్తును ఒక రోమమును ధరించినట్లుగా ధరించి యున్నది అన్నప్పుడే తర్కాతీతమైన స్థితి ఏర్పడి ఊహకు అందక గొప్పఆశ్చర్యము కలిగి బ్రహ్మము ఎంతో గొప్పది అను బ్రహ్మ శబ్దార్థము సార్థకమగుచున్నది. మరియు పరిమాణము గుణముగాగల ఆకాశమునకు బ్రహ్మము అతీతము. పరిమాణ గుణమునకు లొంగిన ఈ జగత్తు ఎంతో పెద్దది అని చెప్పుటలో అర్థమున్నది. కాని, పరిమాణగుణమునకు అతీతమైన బ్రహ్మము పెద్దది, చిన్నది అని చెప్పుటకు వీలుకాదు. ఉపాసకుడు ఎంత పరిమాణములో యుండునో అంత పరిమాణములోనే ఈ దత్త బ్రహ్మము ఉండును. ఒకే సమయమున అదే ప్రదేశమున లేక వివిధ ప్రదేశములందు కానీ బ్రహ్మము అనేక పరిమాణములను కలిగి యుండును. ఊహకు అందని స్థితికి బ్రహ్మమును మనము ఎంతవరకు తెచ్చుకొనగలమో అంత వరకు తెచ్చుకొన్ననే అట్టి స్థితియే



బ్రహ్మము యొక్క సత్యమైన వస్తు స్వరూపము అగును.

దత్త బ్రహ్మము యొక్క వేషమే సర్వ దేవతలు అయినట్లు, ఈ జగత్తు కూడా దత్త బ్రహ్మము యొక్క విశ్వరూపుడు అను దేవతా వేషమే. నాస్తికునకు, వేషమైన ఈ విశ్వమే కలదు. విశ్వభిన్నమైన బ్రహ్మము లేదు. అట్లే వీర శైవునకు వేషమగు శివుడే సత్యము తప్ప శివునకు భిన్నమైన బ్రహ్మములేదు. అట్లే వీర వైష్ణవునకు వేషమైన విష్ణువు తప్ప, విష్ణు భిన్నమైన బ్రహ్మము లేదు. ఇట్టి వీర శైవ, వీర వైష్ణవులకు నాస్తికులకు తేడా ఏమీ లేదు అంటారు స్వామి. ఎందుకనగా, వీరందరు వేష భ్రాంతులై వేషధారివగు బ్రహ్మమును గుర్తించని అజ్ఞానులే కదా. ఈ సిద్ధాంతము ఈ ప్రపంచములో నున్న సర్వమతముల దేవతా రూపముల వెర్రి అభిమానములకు పరమత దేవతల ద్వేషములకు గొడ్డలిపెట్టు అగుచున్నది. కావున దత్త స్వరూపమును ప్రకాశింపచేయుట మరియొక కొత్త మత దేవతా రూపమును స్థాపించుట కానే కాదు. విశ్వములో నున్న సర్వమతముల నున్న దేవతా రూపములను వేషములందున్న వేషధారియగు బ్రహ్మమును ప్రకాశింప జేసి, సర్వమత దేవతా రూపములందు నున్న వేషధారియైన బ్రహ్మముపై ఏక దృష్టి అగు భక్తి సమత్వమును స్థాపించుటయే. వేషధారి ఒక్కడే కాన ఏ దేవతా రూపమును నిందించినా సర్వదేవతా రూపములును వాటి యందు వేషధారిగా యున్న పరమాత్మయగు దత్త బ్రహ్మమును నిందించి నట్లే అగును.

సర్వలోకములను వదలి,స్వామి సదా భూలోకములోనే సంచరిస్తున్నారు. దీనికి కారణము, భూలోకవాసులు దిగజారినంతగా ఏ లోక జీవులూ దిగజారలేదు. తండ్రి అందరి కన్ననూ పతితుడైన పుత్రుని వద్దనుండి వానిని ఉద్ధరించుటకే సదా ప్రయత్నము చేయుచుండును గదా. స్వామి కైవల్యమును ఇంతవరకు ఎవ్వరికి ఇవ్వలేదంటారు. దానికి కారణము - జీవుడు తనలో కలసిన, స్వామి యొక్క పరిమాణము ఎక్కువ కాదు కావున కైవల్యములో జీవుడు శూన్యము అగుచున్నాడు. అది జీవునకు ఎంతో నష్టము. కైవల్య స్థితినే పట్టుపట్టినచో అనూహ్యశక్తి గల స్వామి, తన్ను తానే జీవునకు దత్తం చేసుకొని జీవునిలో ఐక్యమై కైవల్యమును ప్రసాదించుచున్నారు - కైవల్యములో స్వామితో సమానమైన స్థితి మాత్రమే జీవులకు ప్రాప్తించును. ఇందులో అద్వైత ముక్తుడై జీవుడు "అహం బ్రహ్మాస్మి" అంటాడు. దీని కన్న గొప్ప ముక్తి కలదు. అందులో స్వామి జీవునకు దాసు డౌతాడు. ఇది ఎప్పుడు సిద్ధించుననగా అద్వైత స్థితి నుండి అనగా "అహం" నుండి స్వామిని వేరు చేసుకొని

విశిష్టాద్వైత ముక్తి యగు "సోऽహం" స్థితిలోనికి వచ్చి, కడపటికి ద్వైత ముక్తియగు "దాసోऽహం" స్థితికి వచ్చుటయే పరమ కైవల్యము. ఇది జరిగిన నాడు స్వామి తన దాసుడుగా ఉంటాడు. ఇంతకన్నా గొప్ప స్థితి ఏమి ఉండును? ఆంజనేయ, కాలభైరవ, గరుడ, నంది, హంసాదులు స్వామి మనుష్యాకారమున ఉన్నారు కావున, వారితో సమాన స్థానమైన మనుష్య రూపమున ఉండ నిష్టపడక దాస బుద్ధితో దాని కన్న తక్కువ యగు పశు పక్ష్యాది రూపములో నున్నారట! ఎంత అద్భుతమైన విషయ మిది! స్వామి తెల్పినగాని ఈ విషయము ఇంతవరకు ఎవరికీ తెలియదుగదా! త్రిమూర్తుల ద్వారా స్వామిని చూడవచ్చును. ఆచార్య త్రయము ద్వారా స్వామిని తెలుసు కొన వచ్చునట! త్రిమూర్తుల సమన్వయమే స్వామి స్వరూప మట! ఆచార్య త్రయ భాష్యముల సమన్వయమే స్వామి యొక్క గీతా వాణి యట. త్రిమూర్తుల అవతారములే ఆచార్య త్రయము కాన త్రిమూర్తులలోను, ఆచార్య త్రయంలోను, ఎవడు భేద దృష్టిని ప్రదర్శిస్తాడో వాడు ఈ సృష్టి యున్నంత కాలము నరకములో పడియుంటాడట! ఆచార్య త్రయము యొక్క భాష్యముల సమన్వయాన్ని శ్రీ దత్త మత సమన్వయ యోగములో పండితులు చూడ వచ్చును. ఈ అధ్యాయము చాలా ముఖ్యమైనది. కాల భైరవ ఖండము - అనగా ఆకాశ చైతన్య విచార యోగము, శ్రీ దత్త ప్రత్యక్ష ప్రమాణ తర్కాతీత యోగము శ్రీ దత్త విశ్వవ్యాపక యోగము, శ్రీ దత్త మత సమన్వయ యోగము పండితులకు ఉద్దేశింపబడి స్వామిచే వచించబడినది.

వర్ణములు సాధనలో దశలను పట్టియే కాని, జన్మ వలన కాదని శ్రీ దత్త శాసనము. ఇక అస్పృశ్యుడెవరనగా- ఈ నాలుగు వర్ణములలో భ్రష్టులైన వారే తప్ప అస్పృశ్యులను కులము లేదని దత్త మతము. అది వారి సంస్కారము లోని మార్పు కొరకేర్పరచిన శిక్షయే. బ్రహ్మమెవరో గుర్తించి దాని స్వరూప నిర్ణయము చేసి దాని తత్త్వమును వివరించువాడే బ్రాహ్మణుడు కాన, తాను తప్ప కలిలో బ్రాహ్మణుడెవడునూ లేడని అన్నారు స్వామి. శాస్త్రములో పుంలింగముతో సూచింపబడువాడు జీవుని గురించి చెప్పునే తప్ప, శరీరగత మైన స్త్రీ - పురుషాకార భేదము కాదట. కాన శాస్త్ర మంతయును స్త్రీలకునూ వర్తించునట. జీవులందరూ ప్రకృతియే కాన స్త్రీ రూపాలే. గాయత్రి అనగా కేవలము ఛందస్సు నామమే. దేవత సవిత, అనగా సృష్టిని చేయు బ్రహ్మ దేవుడగు ఆచార్య రూపములో నున్న తానే నట. అజ్ఞానాంధకారమును పోగొట్టి శిష్యుల బుద్ధులను ప్రేరేపించు తానే గాయత్రీ మంత్రార్థమట. అసలు స్వల్పగానంతో మన మనస్సును ఆకర్షించే ఏ వాక్యమైనా పరమాత్మ పరమైతే గాయత్రీ మంత్రమే. దానిని పదే పదే మననం చేయటయే జపమాల త్రిపుటంలో అంతరార్థము. అన్ని అక్షరాలు బీజాలే



కాన, ఏ వాక్యమైన పునరావృత్తమైతే బీజమాలయేనట! ఇలా ఎన్నో అద్భుత తత్త్వ రహస్యాల వివరణలు గలవు.

ఈ జగత్తు అంతా ఒక పాదమే (కిరణమే) కాన పరబ్రహ్మములో అత్యల్ప భాగమే కాన, పరబ్రహ్మ దృష్ట్యా అసత్యంగా పరిగణించవచ్చును. శంకరులు ఇలా ఎందుకు తీసుకోవలసివచ్చినదో, ఆ తరువాత రామానుజ మధ్వులు సత్యంగా ఎందుకు తీసుకోవలసి వచ్చినదో ఆయా కాల జీవుల సాధన దశలను బట్టి మత త్రయ భాష్యాలను సమన్వయపరచినారు. ఆమూలాగ్రము ఈ సమన్వయము ఎంతో సత్యంగా ఉంది.

ప్రస్తుత కాలంలో పూజలు, హోమాలు అగు కర్మ మార్గము, భజనలు అగు భక్తి మార్గము, ధ్యానము అగు యోగమార్గము, దినదినాభివృద్ధితో స్వార్థము పెరుగుచున్నకొలదీ వృద్ధి చెందుచునే ఉన్నది. వీటిని ఇంకనూ పెంచవలసిన అవసరము ఇప్పుడు లేదు. ఈ మూడు, స్వార్థరోగమును పెంచు పాయసం వంటివి. ఇప్పుడు కావలసినది స్వార్థరోగమును నిర్మూలించు జ్ఞానము అను చేదు ఔషధమే. స్వామి సేవలో చేరి మనము వైద్య సహాయకులుగా యుండి రోగి - జీవుని బుజ్జగించి ఈ జ్ఞాన ఔషధమును త్రాగించవలయునే తప్ప, రోగులు ఇష్టపడు పాయసము నిచ్చుచో వారికి స్వార్థరోగము పెరిగి నశింతురు. కాన, ప్రసుత్తము స్వామి కాలోచిత సేవ, జ్ఞాన ప్రచారమే.

స్వామి తన పని తాను చేసుకొనలేక కాదు. జీవుల తపస్సులకు ఫలముగా తనను సేవించే పరమ ముక్తి పదవిని ప్రసాదించుటయే స్వామి ఉద్దేశము. రావణుని, సంకల్ప మాత్రంతో సంహరించలేక కాదు. తన పుత్రిక యగు సీతా మహాలక్ష్మిని కాపాడుటకు ఆమె తండ్రి యగు సముద్రుడు మార్గమును ఈయలేకయూ కాదు. వారధి కేవలం వానరులసేవను స్వీకరించుటకే. అందులో కూడా పడవేసిన బండలు మునుగుచుండగా వానరులు సందేహించి స్వామి వద్దకు వచ్చారు. కానీ ఉడత మాత్రము స్వామి కార్యముపై ఎట్టి అనుమానాలు లేకుండా తన యావచ్ఛక్తినీ స్వామికి సమర్పణము చేసి కొన్ని ఇసుక రేణువులను ఇసుకలో పొర్లి వచ్చి సముద్రములో విదల్చుచున్నది! కాన స్వామి కార్యముపై ఎట్టి అనుమానాలు లేకుండా మనం పాల్గొనాలి. స్వామి వానరుల వీపులను నిమరక, ఉడత వీపును నిమిరినారు. సేవకత్వము ముక్తి ఫలమే తప్ప సాధన కాదు. సేవకు మరొక ఫలము ఉండదు. అదే చరమ పరమ ఫలము. అది కైవల్యం కన్నా గొప్పది. కైవల్యంలో నీవు స్వామిగా మారుతావుకానీ, స్వామికి సేవకునిగా మారినపుడు, స్వామి సేవకులకు సేవకుడు అవుతాడు. ఇంతకన్నా గొప్ప స్థితి ఏముంది?

ఒక వ్యక్తిపై సంపూర్ణాకర్షణము కలుగుటకు ఆ వ్యక్తి యొక్క పరిపూర్ణ జ్ఞానము కలిగినపుడే అది సాధ్యము. వ్యక్తి జ్ఞానము సంపూర్ణముగా లేకుండా కేవలము వస్తువు ఉన్నదన్నంత మాత్రాన చూచినంత మాత్రాన ఆకర్షణ కల్గునా? ఈ ఆకర్షణయే ఆ వ్యక్తిని పొందుటకు వేదనను కల్గించును ఈ ఆకర్షణ వేదనలే భక్తి. కాన జ్ఞానము లేకుండా భక్తి కలుగదు. జ్ఞానము మూలకారణము. భక్తి, అవ్యక్తిని పొందునట్లు చేయు సాక్షాత్కారణము. వ్యక్తిని పొందిన తర్వాత, ఆ వ్యక్తిని సేవించుటయే జ్ఞాన - భక్తి కి ఫలము. సేవ ప్రతి ఫలాపేక్ష లేనపుడు నిష్కామ కర్మయోగ మనబడును. ఈ సేవలో కూడా చందన భోజన తాంబూలాదుల కన్నను, ఆ వ్యక్తి యొక్క ప్రధాన కార్యక్రమంలో సహకరించుటయే ఉత్తమ సేవ. వారధి కట్టు సేవలో పాల్గొనుటయే ముఖ్యసేవ కానీ, స్వామిని చందన తాంబూలాదులతో అర్చించుట అల్పమైన సేవ, స్వామి ప్రధాన కార్యము భూలోకమున సర్వజీవుల నుద్ధరించుటయే. ప్రస్తుత కాలోచిత సేవ,జ్ఞాన ప్రచారము. ప్రచారము స్వామి కార్యమూ కాదు అన్యుల కార్యము కాదు. ఆలోచిస్తే స్వకార్యమే. ప్రచారమువలన జ్ఞానము ఆచరణలోకి వస్తుంది. కాన ఇది నిదిధ్యాస దశ. స్వామి సదా భూలోకములోనే ఉన్నారు. సర్వలోకజీవులకన్నా భూలోక వాసులు చాలా పతితులై యున్నారు. కాన, శరీర త్యాగానంతరము పైలోకములకు పోయి స్వామిని చూడలేక, మరల జన్మించి స్వామి సేవకునిగా మారుటకన్నా, ఇప్పుడే ఇక్కడే నేరుగా స్వామిసేవలో పాల్గొనుటయే జీవన్ముక్తి. ఈ జీవన్ముక్త సేవకునికి, స్వామి అవతారములవలె జన్మ - మరణ దుఃఖములుండవు. స్వామి యొక్క పరమ స్వభావమైన శాంతి ఉండును. బ్రహ్మస్వభావము శాంతియే, ఆనందము కాదు. ఆనందముకూడా శాంతి చేత నియమించబడి ఆనందమయ కోశమైనది. కాన, స్వామి, తన సేవలో పాల్గొనుటకు సర్వజీవులకూ పిలుపు పాటను ఇలా వినిపించుచున్నారు

ఈ గీతాన్ని భగవద్గీతకు ముందు, సర్వజీవులకు పిలుపు పాటగా ప్రచురిస్తున్నాము-

*నందనా ఓ నంధనా ..... నందనా నా నందనా!*
*నందినీ ఓ నందినీ........ నందినీ నా నందినీ!*
*చందన మేలా? పుష్పములేలా? దీపములేలా?*
*ధూపము లేలా? నాకు నీ నైవేద్యమేలా?* ॥నందనా॥

చంధన మందలి గంధము నేను.... పుష్పములో పరిమళములు నేను
దీపములో ఘన తేజము నేను.... ధూపములోగల సురభియునేను
నీ నైవేద్య సారము నేను..... ॥నందనా॥



అష్టసిద్ధులను భ్రమలను వీడుము.... పాపలకే గద మహిమల వింతలు
జ్ఞాన యోగమున గమ్యము చేరుము.... జ్ఞాన యోగమన తెలియుట చెప్పుట
॥నందనా॥

సర్వజీవులును నీ సోదరులే గద- మునుగు చున్నారు కాలార్ణవమున
ఉద్ధరించుము ఏ స్వార్థము తలచక - నా మార్గ ప్రచారమే నా నిజమగు
సేవ ॥నందనా ॥

ఏనాడో నిను ముక్తుని చేసితి, బంధమున్నదని భ్రమలో నుంటివి
నీవే నేనని, నేనే నీవని, తెలియ జెప్పుట కేతెంచితిని.... ॥నందనా॥

ఒక సమయమునసె నానా రూపముల, అవతరించి భువి సంచరించెదను,
కనుగొన తరమే బ్రహ్మర్షులకును, గురువుగ వచ్చిన భగవానుడను ...
॥నందనా॥

సామాన్యుని వలె కనపడుచుందును, జ్ఞానులు చూచిన గుర్తింతురు నను
సంశయాత్మకులు సందేహింతురు నను, మాయా మకరము కోరల గ్రుచ్చగ,
॥నందనా॥

నా కాలి కుక్కయె నిన్నింద్రుని చేయును, కాలభైరవుడె శ్రీ లక్ష్మీ దేవత,
నాపాద సేవయె తన ఉచ్ఛ్వాసముగ, నా ప్రాణేశ్వరియే జీవించు చున్నది
॥నందనా॥

నామ రూపముల రసమేమున్నది? నా సద్గుణముల రసమాస్వాదించుము
సద్గుణివై నా సేవకు రమ్ము, ముక్తి యనగ నిక వేరేమున్నది?..॥నందనా॥

**జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి**

దత్త భక్తులు

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

# శ్రీ విష్ణుదత్త కృత శ్రీ దత్త స్తవము

1. దత్తాత్రేయం మహాత్మానం, వరదం భక్తవత్సలమ్
ప్రపన్నార్తి హరం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

2. దీనబంధుం కృపాసింధుం సర్వ కారణ కారణమ్
సర్వరక్షాకరం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

3. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణమ్
నారాయణం విభుం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

4. సర్వానర్థ హరం దేవం, సర్వ మంగళ మంగళమ్
సర్వ క్లేశ హరం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

5. బ్రహ్మణ్యం ధర్మ తత్త్వజ్ఞం, భక్తకీర్తి వివర్ధనమ్
భక్తాభీష్టప్రదం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

6. శోషణం పాపపఙ్కస్య, దీపనం జ్ఞాన తేజసః
తాపప్రశమనం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

7. సర్వరోగ ప్రశమనం, సర్వ పీడా నివారణమ్
విపదుద్ధరణం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

8. జన్మ సంసార బంధఘ్నం, స్వరూపానంద దాయకమ్
నిశ్రేయసపదం వందే, స్మర్తృగామీ సనోఽవతు.

9. జయ లాభ యశః కామ - దాతుర్దత్తస్య యస్తవమ్
భోగ మోక్షప్రదస్యేమం, ప్రపఠేత్ సకృతీ భవేత్.



## శ్రీ దత్త భక్తులు శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తి విరచితములు :

## శ్రీ దత్త స్తవః

శ్లో॥ బ్రహ్మ విష్ణు శివాఖ్యానాం మూర్తీనాం మూలహేతవే
త్రిమూర్తి ముఖ పద్మాయ, దత్తాత్రేయాయ తే నమః 1

శ్లో॥ అరుణ శ్యామ ధావళ్య వర్ణమిశ్రమ వర్ణినే
అనసూయైక భాగ్యాయ, దత్తాత్రేయాయ తే నమః 2

శ్లో॥ శంఖం చక్రం త్రిశూలంచ, ఢక్కామపి కమండలుమ్
బిభ్రతేఽక్ష స్రజం హస్తైః దత్తా త్రేయాయ తే నమః 3

శ్లో॥ కుర్వతే భావమాత్రేణ, సృష్టి స్థితి లయానపి
సర్వదేవస్వరూపాయ, దత్తాత్రేయాయ తే నమః 4

శ్లో॥ గురుణాం గురురాజాయ, శ్రుతీనాం శ్రుతయేఽపిచ
శాస్త్రాణామపి శాస్త్రాయ, దత్తాత్రేయాయ తే నమః 5

శ్లో॥ బాలోన్మత్తపదీక్ష్యాయ, సర్వలీలా విహారిణే
అవధూతైక లక్ష్యాయ, దత్తాత్రేయాయ తే నమః 6

శ్లో॥ కరుణావాహినీమూల వాత్సల్యార్ణవ చక్షుషే
ఆహ్వానాదేవ దృష్టాయ దత్తాత్రేయాయ తే నమః 7

శ్లో॥ శ్రితానుద్ధర్తుకామాయ కలౌ సర్వగతాయచ
సాధ్యాసాధ్యాని దదతే దత్తాత్రేయాయ తే నమః 8

ఫలశ్రుతిః

శ్లో॥ శ్రీ దత్తాత్రేయదేవస్య, పుణ్యం కృష్ణ కృతాష్టకమ్
పఠతాంస్యాదిహాముత్ర, ఫల మీప్సిత మక్షయమ్.

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

## (దత్త భక్తులు శ్రీ వేణు గోపాల కృష్ణ మూర్తి కృతములు)

### శ్రీ గురు దత్త భజనావళీ :-

అత్రిజం శంకరం బ్రహ్మ నారాయణం।
సర్వదేవాత్మకం దత్త దేవం గురుమ్॥

1. ఇందిరా మందిరం పార్వతీనాయకం।
భారతీవల్లభం ధర్మధేన్వాశ్రయమ్
శంఖచక్రాన్వితం శూలఢక్కాధరం।
పాత్రమాలాకరం ప్రాణనాథం భజే॥ ॥అత్రిజం॥

2. పావనై రాగమై స్సారమేయాయితైః।
పాదపద్మావృతై ర్మంత్ర మంద్ర స్వరైః
సంచలద్భి శ్శ నైః సంచలంతం ప్రభుం
త్ర్యాననం షట్కరం యోగి రాజం భజే॥ ॥అత్రిజం॥

3. కేవలం నిర్గుణం మూర్తి భూతం జగత్
సృష్టిరక్షాలయాZZధారహేతో స్త్రిధా
అత్రిణా ప్రార్థితం యుక్త మూర్తి త్రయం।
దృష్ట మేకం పున స్తం త్రిమూర్త్యాననమ్॥ ॥అత్రిజం॥

4. మాతృభావానసూయాకృతే గర్భజం।
దృష్ట బాల త్రయం యుక్త మేకం సకృత్,
బ్రహ్మ చర్య వ్రతం దండ పాణిం వటుం।
తాపసైః ప్రస్థితం వృద్ధ శిష్యైర్భజే॥ ॥అత్రిజం॥

5. హంస వాహం క్వచిత్ పక్షిరాడ్వాహనం।
నందినావా క్వచిత్ సంచరంతం విభుమ్
నాస్తికానాం మతం నాశయంతం సదా
పండితాఖండలం స్వామి యోగీశ్వరమ్॥ ॥అత్రిజం॥

★ ★ ★ ★



2. వందేZతి రమ్యం । విశ్వైకగమ్యం - ఉన్మత్త దత్తం । గురు దేవమ్॥

1. వేదాంత సారం । నానావతారం-
భక్తో పకారం। భజ దత్తమ్ ॥ వందేZతి॥

2. సంసార పారం । రుద్రాక్షహారం
నీహార గౌరం । భజ దత్తమ్ ॥వందేZతి॥

3. కాషాయ చేలం । పాత్రాక్షమాలం
ఆమ్నాయ మూలం । భజ దత్తమ్ ॥ వందేZతి॥

4. జ్వాలాక్షి ఫాలం । ఢక్కా త్రిశూలం
కంఠాహి నీలం । భజ దత్తమ్ ॥వందేZతి॥

5. పాదాంత శక్రం । విచ్ఛిన్న నక్రం
శ్రీ శంఖ చక్రం । భజ దత్తమ్ ॥వందేZతి॥

6. కందర్ప రూపం । సౌందర్య దీపం
యోగీంద్ర భూపం । భజ దత్తమ్ ॥వందేZతి॥

7. మంత్రాత్మ బీజం । తంత్రార్థ భాజం
శ్రీ యంత్రరాజం, భజ దత్తమ్ ॥వందేZతి॥

★ ★ ★ ★

3. దత్తా త్రేయా । దత్తా త్రేయా। దత్తా త్రేయా । త్రిమూర్తి రూపా॥
నీవే బ్రహ్మవు - నీవే విష్ణువు- నీవే శివుడవు.... దత్తాత్రేయా॥
వాణీ లక్ష్మి గౌరి నాధా। దత్తాత్రేయా। త్రిలోక పూజ్యా!
శంఖీ చక్రీ ఢక్కా శూలీ కుండీ మాలీ దత్తా త్రేయా!
కాశీ స్నానము -మాహురిభిక్షయు సహ్యము శయ్యా - దత్తాత్రేయా।
ఒకచో యోగిగ - ఒకచో భోగిగ దర్శన మిచ్చే - దత్తాత్రేయా।
ధర్మమె ధేనువు। శ్రుతులే కుక్కలు వెంటబడిన, ఓ దత్తాత్రేయా।
దేవదేవతలు । ఋషులును సిద్ధులు గ్రహములు నీవే దత్తాత్రేయా।
యోగ భ్రష్టుని । నను కాపాడుము దయతో దేవా। దత్తాత్రేయా।

★ ★ ★ ★

4\. దత్తం భావయామి। శ్రీ దత్తం భావయామి।
గురు దత్తం భావయామి । ప్రభుదత్తం భావయామి॥
ధర్మో ధేను రాగా - దామ్నాయా స్సారమేయాః
శంఖీ చక్ర శూలీ । ఢక్కావాన్ దామ కుండీ॥

★ ★ ★ ★

5\. సదా చిత్త చోరా! సహ్యాచల సంచారా!
శ్రీ దత్త - శ్రీ దత్త- హే దత్త ! శ్రీ దత్త!
హే భార్గవోద్ధార! ప్రభుదత్త దత్తా!
శ్రీ షణ్ముఖాచార్య! గురు దత్త దత్తా! ॥సదా॥

★ ★ ★ ★

6\. దత్తా! నా దత్తా ! శ్రీ దత్తా!
నీ వాడనయ్యా నాకింక వేరే దిక్కులేదయ్యా
అయ్యా! అయ్యా! అయ్యా!దత్తా! ఓ దత్తా ! దత్తా! నా దత్తా !
నా తల్లి తండ్రీ! నా సర్వము, నీవేనయా
దత్తా దత్తా ఓ దత్తా దత్తా! నా దత్తా!
ఏలనయ్యా! నీకేల నయ్యా, ఈ మౌన భావం?
దత్తా! ఓ దత్తా ! దత్తా !నా దత్తా!
ఏమైనకానీ! నీ పాద పద్మం విడజాలనయ్యా ॥ దత్తా॥

★ ★ ★ ★

7\. దత్త రాజా! ఓ దత్తా రాజా! నీ కుక్కనయ్యా! నా దత్త రాజా!
నీ పాదాంబుజ మధువులనే గ్రోలెదనయ్యా!
దత్త రాజా ఓ దత్త రాజా॥
నీ ఉచ్ఛిష్టములనే సదా భుజింతునయ్యా! దత్త రాజా! ఓ దత్తరాజా
నీవెంత కొట్టినా నిను విడజాలనయ్యా దత్తరాజా....
నీ పగ వారిని పీకెద కరచెదనయ్యా దత్తరాజా....
నీ కొరకై నా ప్రాణములనే అర్పింతునయ్యా ॥దత్త రాజా॥

★ ★ ★ ★



8\. కనిపించు దత్తా ! కనిపించు దత్తా! కనిపించు దత్తా! నా కండ్లకు
నీ కొరకె దత్తా! నీ కొరకె దత్తా! నీ కొరకె దత్తా నా బ్రతుకు॥
నీ యెడబాటు నే నోర్వలేను ఎన్నాళ్ళు స్వామీ! ఈ ద్వైత బంధం?
నా గుండె చీల్చితి - నీ కోసమేను
నీ కింక ఈ లోక - సంచారమేలా? ॥కనిపించు॥

★ ★ ★ ★

9\. దత్తుని తలచెదము - దత్తుని పిలచెదము
దత్తుని కొలిచెదము - దత్తుని వలచెదము
కోరిక ఏమియు లేకయె- దత్తుని తలచెదము - దత్తుని పిలచెదము
దత్తుని కొలచెదము.... దత్తుని వలచెదము॥
ఏమీ కోరిక లేని మా తలపుకు పిలుపుకు కొలుపుకు వలపుకు కారణం?
\- దత్తునిపై గల - మా అనురాగం
దత్తునిపై గల - మా మమకారం ॥దత్తుని॥

★ ★ ★ ★

10\. దత్త ముత్యము చూచితివా? బ్రహ్మానందము పొందితివా?
దత్త దీపము వెలిగినదా? మాయ చీకటి తొలగినదా?
శ్రీ దత్త దత్తా! గురుదత్త ధత్తా! ప్రభుదత్త దత్తా! నా దత్త దత్తా!

1\. దత్త నామము వింటివా? దత్త పాదము కంటివా?
దత్త దర్శన మైనదా? దత్త బోధలు ఎక్కెనా?
శ్రీ దత్త దత్తా! గురు దత్త దత్తా! ప్రభు దత్త దత్తా! నా దత్త దత్తా!

2\. దత్త పూజను సల్పితివా? దత్తావేశము వచ్చినదా?
దత్త గానము చేసితివా? దత్తోద్రేకము కల్గినదా!
శ్రీ దత్త దత్తా! గురు దత్త దత్తా! ప్రభుదత్త దత్తా! నా దత్త దత్తా!

3\. దత్త గద్దెను చేరితివా? దత్త భ్రువుల మ్రొక్కితివా?
దత్తసేవలు చేసితివా? దత్త కరుణను పొందితివా?
శ్రీ దత్త దత్తా! గురుదత్త దత్తా! ప్రభు దత్త దత్తా! నా దత్త దత్తా!

4. బ్రహ్మ విష్ణు శివ - రూపం బండీ! ముగ్గురమ్మల - తత్త్వం బండీ!
ముక్కోటి సురల - మూలం బండీ! అదియే దత్తా - త్రేయం బండీ!
శ్రీ దత్తా దత్తా గురు దత్త దత్తా! ప్రభుదత్త దత్తా! నా దత్త దత్తా!

5. గణపతి షణ్ముఖ వీరుండండీ! రామకృష్ణ హనుమానే నండీ!
సర్వ దేవతా సారం బండీ! సర్వసిద్ధ అవతారం బండీ ॥ శ్రీ దత్త దత్తా॥

6. శ్రీ పాద శ్రీ వల్లభు డండీ!
నరసింహ సరస్వతి యేనండీ!
నారాయణ మాణిక్య ప్రభువండీ!
అక్కల్ కోట మహరాజేనండీ ॥ శ్రీదత్త దత్తా॥

7. సద్గురు షిరిడీ - బాబా యండీ! పుట్ట పర్తి గల సాయే నండీ!
మూల విరాట్టును గుర్తించండీ!
అందరి పూజలు అదియేనండీ!
అందరి శక్తులు అందరి మహిమలు
అందరి సిద్ధులు అతడే నండీ ॥శ్రీ దత్త దత్తా॥

8. ఋషులకు సురలకే జారేదండీ! మనుజుల కెట్టుల దొరికేనండీ?
నిర్మల భక్తికి మెచ్చేనండీ!
భోగ మోక్షములన నిచ్చేనండీ!.... ॥శ్రీ దత్త దత్తా! ॥

9. దత్తయ్య కెదురే లేదండీ! దత్తయ్య ఇస్తే నిలిచేనండీ!
సర్వ తపస్సుల ఫలమతడండీ! చివరి జన్మలో చిక్కేనండీ॥

శ్రీ దత్త దత్తా! గురుదత్త దత్తా! ప్రభు దత్త దత్తా! నా దత్త దత్తా!

★ ★ ★ ★



11. దత్తం భజే గురు దత్తం భజే అత్రి అనసూయ ముని పుత్రం భజే॥
వాణీపతే బ్రహ్మ వాణీ పతే! అత్రి అనసూయ ముని పుత్రం భజే
లక్ష్మీ పతే విష్ణు లక్ష్మీ పతే! అత్రి అనసూయముని పుత్రం భజే
గౌరీ పతే శంభు గౌరీ పతే! అత్రి అనసూయ మునిపుత్రంభజే.

★ ★ ★ ★

12. ఉద్ధర ప్రభో! ఉద్ధర ప్రభో! ఉద్ధర ప్రభో! మా ముద్ధర ప్రభో!
దత్త సద్గురో! దత్త సద్గురో! దత్త సద్గురో! హే దత్త సద్గురో!

★ ★ ★ ★

13. గురు దేవా! గురుదేవా! శ్రీ దత్త దేవా! గురు దేవా!
నీట ముంచినా గురుదేవా! పాలముంచినా గురుదేవా!
నిన్నే నమ్మితి గురుదేవా! నీవే నా గతి గురు దేవా
తాళజాలనో గురుదేవా! వేగమె రమ్మో గురుదేవా!

శ్రీ దత్త సాయీ! గురు దేవా! శ్రీ దత్త హనుమా! గురు దేవా!
శ్రీ దత్త రామా! గురు దేవా! శ్రీ దత్త కృష్ణా! గురు దేవా!
శ్రీ దత్త బ్రహ్మ గురు దేవా! శ్రీ దత్త విష్ణూ! గురు దేవా!
శ్రీ దత్త రుద్రా! గురు దేవా! గురు దేవ గురు దేవ గురు దేవా!
దత్తా త్రేయా! గురుదేవా!

★ ★ ★ ★

14. శ్రీ దత్త గురో! శ్రీ దత్త గురో! శ్రీ దత్త గురో!
మాముద్ధర, మాముద్ధర, మాముద్ధర, పతితమ్. శ్రీ దత్తగురో!......

★ ★ ★ ★

15. శ్రీ దత్త దేవం - యోగాధినాథం-కోటి సుగుణ సుందరాయ సుందరాయ
మాయా లోలం - విశ్వపాలం- భువన సంచారి సుందరాయ ॥శ్రీ దత్త॥

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

దీ. 7-5- 1997 రాత్రి 11-30 ని॥లకు శ్రీ దత్త భక్తులకు
శ్రీ వారు దత్త కాలభైరవ స్వరూపం దర్శింపచేశారు
ఇవే దత్త భక్తులు రచించిన ఆశు దత్త కాలభైరవ స్తుతులు

## శ్రీ కాలభైరవ స్తుతి

1. సాక్షాచ్చతుర్వేద సార స్వరూపం శ్రీ దత్త దూతం శిరసాన మామి
స్వామి విశ్వాసార్థ శునకాకారం శ్రీ దత్త దూతం శిరసా నమామి
కాలభైరవ గురు దండాధికారం శ్రీ దత్త దూతం శిరసా నమామి
కాశీపుర క్షేత్రపాలక దేవం శ్రీ దత్త దూతం శిరసా నమామి
శ్రీ దత్త దూతం శిరసా నమామి ప్రభు దత్త దూతం మనసా స్మరామి

శ్లో॥ బిభ్రతం పాణి పద్మాభ్యాం మార్జనీం చాగ్ని పాత్రకమ్
శ్వేతం శునక మారూఢం కాలభైరవ మాశ్రయే.

శ్లో॥ నీలమేఘ ప్రతీకాశం, భస్మఫాలం త్రిలోచనమ్
కృష్ణాజినం చాక్షహారం కాలభైరవ మాశ్రమే.

శ్లో॥ వామాంసాలంబి భిక్షార్థ కాషాయాంశుక భస్త్రికమ్
ముక్తకేశం మహావీరం, కాలభైరవ మాశ్రయే.

* * *

శ్లో॥ ఉద్వేగరహితా! సంతోషరహితా! శాంతి సముద్రా! శ్రీ దత్తా॥
నిశ్చల నిర్మల తత్త్వ జ్ఞానీ! నిర్వికార జగ-దంత స్సాక్షీ!
యోగి రాజ గురు పీఠా ధీశా! అవధూతాఖిల విషయ స్పందా!

* * *

అనసూయ పుత్ర గురు దత్తా! అభయంబు నిమ్ము ప్రభుదత్తా!
కమలాయతాక్ష! శ్రీ దత్తా! కరుణాంతరంగ! హే దత్తా!
కమనీయ రూప! శ్రీ దత్తా! కలివాద భంగ! హేదత్తా! అనసూయపుత్ర॥
హృదయాంతరాన ధ్యానిస్తే- వెనువెంట దత్తవిభుడొస్తే-
నను బ్రోవమంచు ఏడిస్తే- గురు సేవ చేయమంటాడు ॥అనసూయ పుత్ర॥



### శ్రీ దత్త గురువుకు దండాలు - శ్రీ దత్త ప్రభువుకు జేజేలు

1. సృష్టి కర్తకు - సృష్టి భర్తకు - సృష్టి హర్తకు । పరబ్రహ్మకు ॥దత్త॥
2. వాణీ భర్తయు - లక్ష్మీ ధవుడును - గౌరీ పతియగు మూలవిరాట్టుకు॥దత్త॥
3. అత్రిమూర్తులే - తన వేషములై - విశ్వమంతయును తానొకడేయగు ॥దత్త
4. శంకచక్రముల ఢమరు శూలముల - కుండీమాలల పట్టిన వటువుకు॥దత్త॥
5. అత్రిపుత్రునకు - అనసూయ పట్టికి - అనఘా ప్రియునకు - ఆనందాత్మకు ॥దత్త॥
6. వేదపురుషులే - శునకాకృతులతో పదముల, వ్రాలిన పావన మూర్తికి॥దత్త॥
7. ధర్మదేవతయె - పాహిపాహియని, గోవుగ చేరిన విశ్వపాలకునకు ॥దత్త॥
8. అష్ట సిద్ధులును - వేయి చేతులను, కార్త వీర్యునకు ఇచ్చిన స్వామికి॥దత్త॥
9. విష్ణు దత్తపితృ - శ్రార్ధము నందున, భోక్తగ వచ్చిన మంత్ర బ్రాహ్మణునకు ॥ దత్త॥
10. వేదశాస్త్రముల - సారము నంతయు - పిండియిచ్చిన జ్ఞాన సాగరునకు - ॥దత్త॥
11. కనుసైగలతో - భోగమోక్షముల, భక్తుల కిచ్చెడి - భగవంతునకు ॥దత్త॥
12. షోడశకళలతో - పూర్ణిమ వెలుగుల - పదునారేడుల ముగ్ధ బాలునకు ॥దత్త॥
13. చిలిపి చేష్టలతో - విశ్వనాటకమును రక్తికిచేర్చెడి - జగన్మోహనునకు ॥దత్త॥
14. పరశు-రామునకె - పరమాచార్యుడు - స్కందగురువుకె ఆధ్యాత్మిక గురువగు ॥దత్త॥
15. సృష్టి స్థితి లయ - కారణ బ్రహ్మము - మూడు ముఖముల తానని తెల్పిన ॥దత్త॥
16. వేదము చెప్పిన - నిర్వచనమునకు - పూర్ణసమన్వయ మగు బహ్మమునకు ॥దత్త॥

దత్త గురువుకు - దండాలు
దత్త ప్రభువుకు - జేజేలు

కంటి, సత్యమును గంటి। నే పరమ సత్యమును గంటి।
ఎల్లదేవతల వేషాల నటుడగు । శ్రీ దత్త బ్రహ్మమును గంటి । కంటి ॥
మూడు ముఖముల నారుచేతుల వెలయు దేవుని
ముద్దులొలికెడి మూడు మూర్తుల వేషధారిని కంటి
పాత్రమాలలను గంటి । ఢమరు శూలముల గంటి ।
శంఖ చక్రముల గంటి । కాల జటలను గంటి ।
కమల లోచనుని గంటి । కాషాయ ధారిని గంటి ।
జ్ఞాన బోధకుని గంటి । జీవ తారకుని గంటి ।
విధి గంటి । హరి గంటి । హరుగంటి । గురు గంటి ।
కామధేనువును గంటి । కాల భైరవుల గంటి ॥ కంటి ॥
నాల్గు వేదములైన కుక్కలు మొరిగి తెలుపగ - వింటి
సత్యమును వింటి -- నే పరమ సత్యమును వింటి
సృష్టి పాలన విలయ కారకుడొక్కడేయని వింటి
నా కన్నులను నలుపు కొంటి
మాయ గాదిది మరల మరలను కంటి
శ్రీ దత్త గురు పాదముల నంటి, శ్రీ దత్త గురుదేవులను గంటి
కంటి, సత్యమును గంటి - నే .........

★ ★ ★

అడుగో - అల్లడుగో - శ్రీ గురు దత్తుడు
మూడు ముఖముల - నారుకరముల
వెలుగు చున్నాడు - వేద విదితుడు
ధర్మ దేవతయె - ధేనురూపమున
కుక్కలై వేదాలు - కూడినడువగ - అడుగో
పరమ పావనుడు - విచ్చేయుచున్నాడు.
అడుగో అల్లడుగో ।



కను గొంటి నయా నిను గురుదైవమా ।
వేద వాక్య నిశ్చితార్థ మైన మంత్రమా ।
సృష్టి భరణ ప్రలయ కారణ పరబ్రహ్మమా । కనుగొంటి నయా ॥
ధర్మధేనువును నడిపించు దివ్య పాశమా
మూడు ముఖముల నారు చేతుల దత్త రూపమా !
బ్రహ్మ విష్ణు రుద్ర మూర్తి మూల వేషమా
పరమ సత్యమును తెలుపు తత్త్వ జ్ఞానమా, కనుగొంటినయా ॥
కాల భైరవ స్వామి పంచప్రాణమా
విష్ణు దత్త సేవల మురిసేటి గురురాయుడ!
కనుగొంటి నయా నిను గురు దైవమా ॥

★ ★ ★

## శ్రీ కాల భైరవ వాణి

అంతర్యామీ! దత్తా త్రేయా! అరచితినీ! మొరిగితినీ!
ఎప్పటికప్పుడే నీ పలుకులను ॥
అరచి అరచి మొరిగి మొరిగి
నీ పద కమలములనిదే వ్రాలితినీ
అంతర్యామీ ॥ దత్తా త్రేయ॥

1. మారరు జీవులు మారరు జీవులు
   నా వాలము వలె వంకరలు
   క్షణికపు మార్పులు - మరల పాతవె పద్ధతులు॥
   అంతర్యామీ! దత్తాత్రేయా॥

2. పాపక్షయ సులభ మార్గమును వినరు ఎంత చెప్పినను॥
   వ్యర్థములగు కష్టమార్గములనే శ్రమపడి చచ్చెదరు।
   అంతర్యామీ! దత్తాత్రేయా॥

3. కృత యుగమంతయు అత్రి తపించిన క్షణ దర్శన మిచ్చితివి
పిలువకయే వచ్చి నాతోనెప్పుడు ముచ్చటింతువు నా ప్రాణ సఖా!
అంతర్యామీ! దత్తాత్రేయా!

4. నాతోడ నడచి నాతో నిత్యము ఐక్యము చెందితివి!
దేవతలకును ఋషులకును అబ్బని భాగ్యము నాకిచ్చితివి
అంతర్యామీ! దత్తాత్రేయా!

5. హంసను పంపుము గరుడుని పంపుము నందిని పంపుము
ఈ లోకమునకు
నారద గణపతి హనుమదాదులు పరమ పావనులు కలరు గదా
నీ సేవలకు
అంతర్యామీ! దత్తాత్రేయా !

6. చాలు చాలునిక కొంత విశ్రాంతి నొసగుము స్వామీ
నీ రూపములో ఇక ఐక్యముగానీ నా రూపము
అంతర్యామీ! దత్తాత్రేయా॥

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

### శ్రీ శంకరాచార్య కృత

## కాలభైరవాష్టకము

1. దేవరాజ సేవ్య మాన పావ నాంఘ్రి పంకజం
వ్యాళయజ్ఞ సూత్ర మిందుశేఖరం కృపాకరం
నారదాది యోగిబృంద వందితం దిగంబరం
కాశికాపురాధినాథ కాలభైరవం భజే॥

2. భాను కోటి భాస్వరం భవాబ్ధితారకం పరం
నీలకంఠ మీప్సితార్థదాయకం త్రిలోచనం
కాలకాల మంబుజాక్ష యక్షశూల మక్షరం
కాశికాపురాధినాథ కాలభైరవం భజే॥

3. శూల టంక పాశ దండపాణి మాది కారణం
శ్యామ కాయ మాది దేవ మక్షరం నిరామయం
భీమవిక్రమం ప్రభుం విచిత్ర తాండవ ప్రియం
కాశికాపురాధినాథ కాలభైరవం భజే॥

4. భుక్తి ముక్తి దాయకం ప్రశస్త చారు విగ్రహం
భక్త వత్సలం స్థితం సమస్త లోక విగ్రహం
నిక్వణ న్మనోజ్ఞహేమ కింకిణీలసత్కటిం
కాశికాపురాధినాథ కాలభైరవం భజే॥

5. ధర్మ సేతు పాలకం త్వధర్మ మార్గ నాశకం
కర్మ పాశ మోచకం సుశర్మదాయకం విభుం
స్వర్ణ వర్ణ కేశ శోభితాంగ మండలం హరం
కాశికాపురాధినాథ కాలభైరవం భజే॥

6. రత్నపాదుకా ప్రభాభిరామ పాద యుగ్మకం
నిత్య మద్వితీయ మిష్టదైవతం నిరంజనం
మృత్యు దర్ప నాశనం కరాళ దంష్ట్ర భీషణం
కాశికాపురాధినాధ కాలభైరవం భజే॥

7. అట్టహాస భిన్న పద్మజాండ కోటి సంతతిం
దృష్టి పాత నష్టపాప జాల ముగ్ర నాశనం
అష్ట సిద్ధిదాయకం కపాల మాలికాధరం
కాశికాపురాధినాధ కాలభైరవం భజే॥

8. భూత సంఘ నాయకం విశాల కీర్తి దాయకం
కాశి వాసి లోక పుణ్య పాప శోధకం విభుం
నీతి మార్గ కోవిదం పురాతనం జగత్ప్రభుం
కాశికాపురాదినాధ కాలభైరవం భజే॥

ఫలశ్రుతిః

9. కాలభైరవాష్టకం పఠంతి యే మనోహరం
జ్ఞాన ముక్తి సాధనం విచిత్ర పుణ్య వర్ధనం
శోక మోహ దైన్య లోభ కోప తాప నాశనం
తే ప్రయాంతి కాలభైరవాంఘ్రి సన్నిధిం ధ్రువమ్

ఇతి కాలభైరవాష్టకమ్ సమాప్తమ్

బ్రహ్మ ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## ప్రథమాధ్యాయః

## శ్రీదత్త దర్శన యోగః

**శ్రీ భవానీ సమేత శ్రీ బాలకృష్ణ ఉవాచ :-**

శ్లో॥ వేణుగోపాల కృష్ణేన, దత్త శిష్యేణ సఙ్కృతామ్
శ్రీ దత్తగురు భగవ-ద్గీతా మానీయ సేవయా. 1

**శ్రీ భవాని బాలకృష్ణ దంపతులు వచించిరి :-**

తా॥ శ్రీ వేణుగోపాలకృష్ణ నామ ధారియగు శ్రీ దత్త శిష్యుడు శ్రీ దత్తస్వామి వారి నుండి గ్రహించిన ఈ శ్రీదత్తగురు భగవద్గీతను శ్రీ దత్త సేవలో నున్న మేము ప్రకాశము చేసి -

శ్లో॥ ప్రచారయావో జీవానాం,శ్రేయసే గురుశాసనాత్
వయో లిఙ్గం మతం వర్ణో,నేహ సర్వేऽధికారిణః॥ 2

తా॥ శ్రీ దత్తగురు శాసనము ననుసరించి,ఈ లోకమున నున్న సర్వజీవుల శ్రేయస్సు కొరకు, మేము ప్రచారము చేయుచున్నాము. ఈ గీతను అధ్యయనము చేసి తరించుటకు, వయస్సు కానీ, స్త్రీ పురుష భేదము కానీ, మతముకానీ, కులముకానీ, అడ్డురావు. శ్రీ దత్త సంప్రదాయానుసారముగ, సర్వజీవులును ఈ గీతకు అధికారులే.

శ్లో॥ ఇద మద్భుత మమృతం, సంవాదం గురుశిష్యయోః
సర్వే పిబన్తు నశ్యన్తి, సర్వపాపాని తత్క్షణాత్॥ 3

తా॥ శ్రీ దత్త శిష్యుడగు శ్రీ వేణుగోపాలకృష్ణునకును, శ్రీ దత్త గురు భగవానునికిని, మధ్య జరిగిన ఈ సంవాదము అద్భుతమైన అమృతము. ఈ జ్ఞానము అను అమృతమును పానము చేసిన వెంటనే, సర్వజీవుల కష్టములకు కారణములగు సర్వపాపములును ఒక్కక్షణ కాలములో నశించును.

శ్లో॥ స త్రిరాత్రం తపస్తేపే, క్షేత్రే యతి తపఃస్థలే
శ్రీ దత్త భగవాన్సాక్షా, ద్దదృశే తేన సద్గురుః॥ 4

తా॥ శ్రీ దత్త శిష్యుడగు శ్రీ వేణుగోపాలకృష్ణుడు మూడు రోజులపాటు యతి తపఃస్థలమను పుణ్య క్షేత్రమున అనగా "ఎత్తిపోతల" క్షేత్రమున తపస్సు చేసెను. సాక్షాత్తుగ శ్రీ దత్త భగవానుడైన ఆ సద్గురువు సాక్షాత్కరించెను.

శ్లో॥ సాక్షా దనుభవైకజ్ఞం, పరమాద్భుత దర్శనమ్
విశ్వమన్తర్దధే యేన, వినాతాభ్యా మసత్పరమ్॥ 5

తా॥ అది పరమాద్భుతమైన దర్శనము. సాక్షాత్తుగా అనుభవముచే తెలియ దగినదే తప్ప, వర్ణింప నలవిగాదు. అప్పుడు విశ్వమంతయు అదృశ్యమైపోయెను! ఆ ఇరువురు తప్ప మరి ఏదియును లేదు!

శ్లో॥ సౌన్దర్యం తస్యకాన్తిశ్చ, దత్తాత్రేయస్య సౌరభమ్
అనూహ్యం విద్యుతాం చక్రే, షడ్భుజ త్రిముఖ ప్రభోః॥ 6

తా॥ శ్రీ దత్తాత్రేయస్వామి వారు త్రిముఖములతోను, షడ్భుజములతోను విద్యుత్కాంతి మండలములో నుండిరి! శ్రీవారి యొక్క సౌందర్యము, కాంతి, వారి నుండి వెడలు సుగంధము, ఊహకు సైతము అందకుండ యుండెను!

శ్లో॥ మహదాశ్చర్య సంవేశా, దుత్థాన మపి విస్మృతమ్
దత్త శిష్యేణ వాగ్ధారా - స్తోత్రమేవ ముదీరితమ్. 7

తా॥ గొప్ప ఆశ్చర్యము ఆవేశించినందున, లేచి నిల్చుండుట కూడ శ్రీ దత్త శిష్యుడు విస్మరించెను! వెంటనే అనర్గళముగ, ఈ క్రింది స్తోత్రమును పఠించెను!

శ్లో॥ బ్రహ్మవిష్ణు శివాఖ్యానాం మూర్తీనాం మూలహేతవే
త్రిమూర్తి ముఖ పద్మాయ। దత్తాత్రేయాయ తే నమః॥ 8



తా॥ బ్రహ్మ విష్ణు శివులను త్రిమూర్తులకు మూలకారణమైన వాడును, త్రిమూర్తుల ముఖ పద్మములతో ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ అరుణ శ్యామ ధావళ్య, వర్ణమిశ్రమ వర్ణినే
అనసూయైక భాగ్యాయ। దత్తాత్రేయాయ తే నమః॥ 9

తా॥ ఎరుపు, నలుపు, తెలుపు - మూడు రంగులును మిశ్రమమైన రంగు కలవాడును, శ్రీ అనసూయ మాత యొక్క ఏకైక అదృష్టము అగు, శ్రీ దత్తాత్రేయ స్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ శఙ్ఖం చక్రం త్రిశూలం చ, ఢక్కా మపి కమణ్డలుమ్
బిభ్రత్రే Zక్ష స్రజం హస్తైః, దత్తాత్రేయాయ తే నమః॥ 10

తా॥ శంఖము, చక్రము, త్రిశూలము, ఢమరుకము, కమండలము, జపమాలలను ఆరు హస్తములతో ధరించియున్న శ్రీ దత్తాత్రేయస్వామి అగు నీకు నమస్కారము.

శ్లో॥ కుర్వతే భావమాత్రేణ। సృష్టి స్థితి లయానపి
సర్వదేవ స్వరూపాయ। దత్తాత్రేయాయ తే నమః॥ 11

తా॥ సంకల్ప మాత్రముననే, జగత్తుయొక్క సృష్టి స్థితి లయములను చేయుచున్న సర్వదేవ స్వరూపుడగు, శ్రీ దత్తాత్రేయ స్వామి అగు నీకు నమస్కారము.

శ్లో॥ గురూణాం గురు రాజాయ, శ్రుతీనాం శ్రుతయే Zపి చ
శాస్త్రాణా మపి శాస్త్రాయ, దత్తాత్రేయాయ తే నమః॥ 12

తా॥ గురువులకు గురువు, వేదములకు వేదము, శాస్త్రములకు శాస్త్రము అగు, శ్రీ దత్తాత్రేయ స్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ బాలోన్మత్త పదీక్ష్యాయ, సర్వలీలా విహారిణే
అవధూతైక లక్ష్యాయ, దత్తాత్రేయాయ తే నమః॥ 13

తా॥ బాలుడిగను, పిచ్చివాడుగను, కనబడువాడును, సర్వ లీలలతో విహరించువాడును, అవధూతలయొక్క ఒకే ఒక లక్ష్యముగ నున్నవాడును, శ్రీ దత్తాత్రేయ స్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ కరుణా వాహినీ మూల-వాత్సల్యార్ణవ చక్షుషే
ఆహ్వానాదేవ దృష్టాయ, దత్తాత్రేయాయ తే నమః॥ 14

తా॥ కరుణా వాహినులకు మూలమైన వాత్సల్య రస సముద్రములే రెండు నేత్రములుగ కలవాడును, పిలిచి నంతనే కనపడువాడును, శ్రీ దత్తాత్రేయ స్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ శ్రితానుద్ధర్తు కామాయ, కలౌ సర్వగతాయ చ
సాధ్యాసాధ్యాని దదతే, దత్తాత్రేయాయ తే నమః॥ 15

తా॥ ఆశ్రయించిన వారి నుద్ధరించుటకై, కలియుగమున, సర్వత్ర సంచరించుచున్నవాడును, సాధ్యములనే కాక అసాధ్యములను సైతము ఇచ్చు వాడును, శ్రీ దత్తాత్రేయ స్వామి యగు నీకు నమస్కారము.

శ్లో॥ శ్రీ దత్తాత్రేయ దేవస్య, పుణ్యం కృష్ణకృతాష్టకమ్
పఠతాం స్యా దిహా ముత్ర, ఫలమీప్సిత మక్షయమ్॥ 16

తా॥ శ్రీ దత్త భగవానునిపై దత్త భక్తుడగు వేణుగోపాల కృష్ణుడు చెప్పిన ఈ అష్టకమును పఠించినచో ఇహలోకము నందును పరలోకమునందును అక్షయ ఫలమును పొందును.

శ్లో॥ అథ ప్రసన్న వదనైః, కమలై ర్మధురస్మితః
శ్రీ దత్తగురు భగవాన్, ఉవాచ మురళీగళః॥ 17

తా॥ అనంతరము, ప్రసన్నములైన ముఖ కమలములతో, మధురముగా నవ్వుచూ, శ్రీ దత్త భగవానుడు, తన వేణు కంఠ స్వరముతో ఇట్లు పలికెను.



శ్రీ దత్తగురు భగవానువాచ

శ్లో॥ కిమిచ్ఛసీహ భోగ్యానా, మాయురారోగ్య సంపదామ్
కిం దాస్యామ్యష్టసిద్ధీర్వా, యాభిః పూజ్యోఽత్ర కాశ్యప! 18

శ్రీ దత్తగురు భగవానుడు వచించెను.

తా॥ ఓ కశ్యప గోత్ర సంభవా! ఈ లోక భోగ్యములగు దీర్ఘాయువు, ఆరోగ్యము, ఐశ్వర్యములలో ఏమి కావలయును? ఈ లోకమున పూజను, కీర్తిని ఇచ్చు అష్ట సిద్ధులనే ఇత్తునా? కోరుకొనుము.

శ్రీ దత్త శిష్య ఉవాచ :

శ్లో॥ న నిస్సరతి కిఞ్చిన్మే, వచో వక్త్రా ద్గురు ప్రభో!
త్వద్దర్శనేన దృష్ట్యాం మే, సర్వశక్తి ర్ఘనాయితా. 19

శ్రీ దత్త శిష్యుడు వచించెను.

తా॥ ఓ గురుప్రభో! నా నోటి నుండి ఏ మాటయును పెగులుట లేదు. నీ దర్శనము ననుభవించు నా యొక్క దృష్టి యందే సర్వశక్తియును ఘనీభవించి, కేంద్రీకృత మైనది.

శ్లో॥ త్వాం దృష్ట్వా నాహ మిచ్ఛామి, ద్రష్టు మన్య దతస్త్వయి
లీయేఽహ మధునా ముక్తో, జగతో దేహి మే వరమ్. 20

తా॥ నిన్ను చూచిన ఈ కనులతో ఇంక దేనినీ చూడలేను. కావున, ఇప్పుడే, ఈ జగత్తు నుండి ముక్తుడనై నీలో లీనమై పోవునట్లు వరము నొసగుము.

శ్రీ దత్తగురు భగవానువాచ :

శ్లో॥ మయి కేవల రాగేణ, ప్రీతోఽస్మి తవ కిన్త్విదమ్
ప్రార్థితం బహుభి ర్దత్తం, కదాచి న్నమయా క్వచిత్. 21

శ్రీ దత్త భగవానుడు వచించెను.

తా॥ నాయందే నీకున్న ప్రేమ వలన నీకు నేను ప్రసన్నుడనై ప్రీతిని పొందితిని. ఐతే, ఈ వరము, ఎందరో అడిగిరి. కాని, దీనిని, ఎప్పుడునూ, ఎక్కడనూ, ఎవ్వరికినీ, ప్రసాదించలేదు.

శ్లో॥ శృణు తత్కారణం యేన, నష్టో భవసి శూన్యవత్
న వర్ధే తవయోగేన, కుమ్భపాత్రామ్బువ న్న తత్. 22

తా॥ దీనికి కారణము చెప్పుచున్నాను. వినుము. నీవు నాలో లీనమై పోయినందున పాత్ర జలమును నీటి కుండలో పోయగా, కుండ నీరు, పరిమాణములో వృద్ధి చెందినట్లు, నీవు నాలో కలిసినందున నేను వృద్ధి చెందను. ఎందువలననగా- నాకు హాని వృద్ధులు లేవు కదా. కనుక నీవు కోరినట్లు జరిగినచో, నీవు శూన్యమై పోవుచున్నావు. అది నీకు నష్టము. (అనగా - నీవు నాలో లీనమై నందున నేను పెరుగుట లేదు కాన, దీని అర్థము - నీవు శూన్యమై పోవుచున్నావనియే కదా)

శ్లో॥ త్వం మే శిష్యోఽసి భక్తోఽసి, కథమిచ్ఛామి తే వ్యయమ్
ఇహ మే సేవకత్వాప్తి, స్సత్యో మోక్షో మతో మమ. 23

తా॥ నీవు నాశిష్యుడవు. నా భక్తుడవు. నీ నష్టమును నేనెట్లు అంగీకరింతును? ఈ లోకమున నా సేవకునిగా చేరుటయే నిజమైన మోక్షము. అదియే నామతము.

శ్లో॥ న మోక్షో జగతః కామ్యో, మోక్ష స్స్వపరిధే ర్మతేః
కర్మబన్ధా ద్విముచ్యేత, కర్మణా మమ సేవయా. 24

తా॥ జగత్తు నుండి తొలగుట మోక్షము కాదు. కాన దీనిని కోరరాదు. "ఇది నాది. ఇది ఇతరులది"అను పరిమితమైన భావము నుండి విడువడుటయే మోక్షము. పరిమిత బుద్ధితో చేయునదే కర్మ బంధము. కాన నా సేవా కర్మ చేసిన వాడు ఆ కర్మబంధము నుండి ముక్తుడగును.

శ్లో॥ జీవః కర్మస్వరూపోఽయం, కర్మణా కర్మ భిద్యతే
సిద్ధై స్సంన్యాసిభి స్సేవా - కర్మైవ క్రియతే మమ॥ 25

తా॥ జీవుడు కర్మ స్వరూపుడు కాన, కర్మ చేయకుండా ఉండలేడు. నా సేవారూప కర్మ చేయుట వలన, బంధరూపకర్మ నశించును. నా సేవారూపకర్మను సిద్ధులైన సంన్యాసులు కూడా, సదా చేయుచున్నారు.



శ్లో॥ ముఞ్చామి సేవకం బన్ధాత్, బద్ధ స్సేవేత కః కథమ్?
కథం వా మోచయత్యన్యాన్, బన్ధో దుఃఖం జనేర్మృతేః॥ 26

తా॥ నా సేవలో చేరిన సేవకుని బంధము నుండి ముక్తుని చేయుదును. బంధమున్నచో, ఎవరైననూ, ఎట్లు సేవ చేయగలడు? బద్ధుడైన వాడు ఇతరులను ఎట్లు విడిపించగలడు? జన్మ-మరణదుఃఖమే బంధము. అట్టి జన్మమృత్యు దుఃఖమైన బంధమును వానికి తొలగింతును. అనగా వానికి జనన, మరణములందు దుఃఖము, ఇతరులకు వలె ఉండదు.

శ్లో॥ జాతో మృతోఽపిచా నిత్యం, సేవార్థం మమ సేవకః
అనుగచ్ఛతి మాం చేహ, సర్వోద్ధరణకర్మణి॥ 27

తా॥ ఆ సేవకుడు ఈ లోకమున సర్వజీవులను ఉద్ధరించు నాకార్యము నందు పాల్గొనుచు, సదా నన్ను అనుసరించుచు, మాటిమాటికిని మరణించిననూ, జన్మించుచుండును. వానికి ఆ జన్మ మరణములలో ఇతరులకు వలె దుఃఖముండదు. కాన వాడు ముక్తుడే.

శ్లో॥ పురాణకఞ్చుక త్యాగో, మృత్యుర్జన్మ నవగ్రహః
తస్మి న్వృథా న శోచన్తి, తథా మే సేవక స్తయోః॥ 28

తా॥ పాత వస్త్రమును విడచుట మరణము. కొత్త వస్త్రమును ధరించుట జన్మ. ఆ రెండూ చేయునపుడు ఎలా దుఃఖించవో నా సేవకుడునూ, జనన మరణములందు అలానే దుఃఖించడు.

శ్లో॥ నానా దేశేషు కాలేషు, నానాభావ జనాయ హి
నానాజన్మా న్యవశ్యం హి, మధ్యే విశ్రాన్తి రస్యచ॥ 29

తా॥ నానా దేశములందు, నానా కాలములందు, నానా భాషా భావములు గల జీవులకు సాధనలో సాయము చేయుటకును, మధ్యమధ్యలో సేవకునికి విశ్రాంతి ఇచ్చుటకును, నానా జన్మముల ఏర్పాటు అవసరము.

శ్లో॥ ప్రచారయ మమ జ్ఞానం, జీవా నుద్ధర సోదరాన్
మాతృదేవాదినా హ్యేషా, మహం మాతా పితా గురుః 30

తా॥ కాన, నా జ్ఞానమును ప్రచారము చేయుము. నీ సోదరులగు జీవులను ఉద్ధరించుము. "మాతృదేవో భవ" "పితృదేవో భవ" "ఆచార్యదేవో భవ" అను ఉపదేశముల ప్రకారము, దేవుడగు నేనే, ఈ జీవులందరకును తల్లిని, తండ్రిని గురువును, అయి ఉన్నాను.
(ఈ శ్రుతికి అర్థము :- దైవమే తల్లిగా, తండ్రిగా, గురువుగా ఉన్నది అనియే తప్ప,తల్లి,తండ్రి, గురువులు దైవ మనికాదు.)

శ్లో॥ కార్యా కాలోచితా సేవా, క్షుధార్తే కిం గురౌ భవాన్
చన్దనా ద్యర్చనం కుర్యా?, త్సేవా యదపి నోచితా॥ 31

తా॥ కాలమునకు ఉచితమగు సేవ చేయవలెను. అనగా ఏ సమయమునకు ఏ సేవ అవసరమో అట్టి సేవ చేయవలెను గాని, దానిని చేయక, ఇంకొక సేవ చేయుట ఆ కాలమునకు ఉచితముకాదు. అది కాలోచితసేవ కాదు. గురువుగారు ఆకలితో బాధపడుచుండగా, వెంటనే భోజనము పెట్టుసేవ చేయవలెనే కాని, గంధము పూయుట సేవయే అయిననూ, అట్లు చేయరాదు. అది ఆ కాలమునకు ఉచితము కాదు గదా.

శ్లో॥ కలౌ జ్ఞానప్రచారేణ, సేవాం కుర్యా న్మమాధునా
తేభ్యో జ్ఞానౌషధం దేయం, స్వార్థో దుర్భర ఆమయః॥ 32

తా॥ ఈ కలియుగమున జీవులు దుర్భర స్వార్థరోగముతో యున్నారు. వీరికి తక్షణము, ఈ జ్ఞానము అను ఔషధమును ఈయవలెను. ఈ జ్ఞానప్రచారము చేసినచో ఇది నాకు ఇప్పుడు కావలసిన కాలోచిత సేవ యగును.

శ్లో॥ స్వార్థేణ వర్ధతే కర్మ, పూజా హోమాది తత్స్వయమ్
ఏకాగ్ర ధ్యానయోగశ్చ, భక్తి ర్భజన రూపిణీ॥ 33

తా॥ ఈ స్వార్థరోగము వలన,పూజా- హోమము, మొదలగు కర్మలును, ఏకాగ్రతను పెంచు ధ్యానమగు యోగము, భజన రూపమైన భక్తియును, స్వయముగనే అనగా



మనప్రయత్నము లేకయే పెరుగుచున్నవి. (అనగా-స్వార్థములను సాధించుటకు మానవులు పూజలను, ధ్యానములను, భజనలను నిరంతరము చేయుచున్నారు గదా అని భావము).

శ్లో॥ కి మర్థం వర్ధమానానాం, వర్ధనం? పాయసం త్రయః
రోగవృద్ధికరం రోగీ, తస్మై ప్రీణాతి యద్విషమ్॥ 34

తా॥ స్వయముగనే వృద్ధిచెందు ఈ కర్మ-యోగ-భక్తి యను మూడింటినీ ఇంకనూ పెంచనేల? ఈ మూడును పాయసము వంటివి. రోగి యొక్క స్వార్థరోగమును పెంచుచున్నవి. రోగియు పాయసమునే ఇష్టపడును కానీ, అది విషమువలె రోగిని సర్వనాశనము చేయును.

శ్లో॥ అనునీయౌషధం దద్యా, ద్గురువైద్యస్య సేవకః
అస్వతన్త్రః ప్రియం కుర్వన్,సర్వ నాశకరోऽన్యథా॥ 35

తా॥ రోగులను బుజ్జగించి యైననూ జ్ఞానౌషధమునీయవలెను. సేవకుడు గురువు యొక్క అధీనుడు. వైద్య సేవకుడును అంతే. స్వతంత్రించరాదు. రోగి ఇష్టముననుసరించి పాయసము నిచ్చినచో అది విషమై రోగిని చంపగా, వైద్య సేవకుడు సర్వనాశనమునకు కారణమగును కదా.

శ్లో॥ నాత్మకార్యం నాన్యకార్యం, స్వకార్యమితి చిన్తయేత్
తద్ధర్మాచరణం జీర్ణం, శ్రుతం జ్ఞానం ప్రచారతః॥ 36

తా॥ ఈ జ్ఞాన ప్రచారము స్వామి కార్యమూకాదు. అన్య కార్యమూకాదు. ఆలోచించినచో ఇది స్వకార్యమే. ఏలననగా, విన్నజ్ఞానము పది మందికి చెప్పి ప్రచారము చేసినచో వంట బట్టి, ఆచరణ లోకి వచ్చును. ఆచరణమే ధర్మమందురు. కాన ప్రచారము చేయువానికే అసలు లాభము.

శ్లో॥ అధర్మా త్కర్మ భక్తిశ్చ, యోగో జ్ఞానం చ సాధవత్
పతే దమూలతో దృశ్యో, రావణశ్చతురగ్రణీః॥ 37

తా॥ ధర్మము లేకున్నచో ఈ కర్మ-భక్తి-యోగ-జ్ఞానములు పునాది లేని మేడలవలె కూలిపోవును. ఈ నాల్గింటి యందును అగ్రేసరుడగు రావణుడు పర స్త్రీని మోహించి అపహరించరాదను సామాన్య ధర్మమును కూడా పాటించనందున నశించెను కదా.

శ్లో॥ న ధర్మః పూజయా వాద్రై, స్తద్రామాయణ భారతే
అజ్ఞాని పశవస్త్యాజ్యా, నజ్ఞా దైత్యా అహంయవః ॥ 38

తా॥ ఎన్ని పూజలు-తపస్సులు, జపాలు చేసినా, రావణుడు శిక్షించబడినాడు కాన వీటివలన అధర్మము, ధర్మముకాదు. శకుని యొక్క కుయుక్తి వాదములతో రాజ్యము తమదేనని దుర్యోధనుడు వాదించినా, శిక్షించబడినాడు కాన పూజల చేతకానీ, తెలివి తేటలచేత కానీ అధర్మము, ధర్మముగా మారదని చెప్పుటయే రామాయణ భారతముల సారములు. రావణ దుర్యోధనుల అంతరాత్మలకు వారాచరించునది అధర్మమని తెలియును. వారికి ఎందరో బోధించిరి. తెలియని పశువులను క్షమింతును కానీ తెలిసియు అహంకరించు మూర్ఖ రాక్షసులను దండించక తప్పదు గదా.

శ్లో॥ అప్రచారేణ నో జీర్ణ, మసత్సఙ్గాఖ్య సేవయా
దైత్యా వేద విదస్తేఽపి, యదజీర్ణం వికారదమ్. 39

తా॥ "ప్రచారము", "సత్సంగము" అను నా సేవలో పాల్గొనని కారణమున జ్ఞానము జీర్ణము కాదు. రాక్షసులు, వేదాధ్యయనము చేసియు దాని అర్థమును తెలుసుకొన్నను, ఇట్టి సేవ చేయనందున ఆ జ్ఞానము జీర్ణము కాక, అజీర్ణ పదార్థము కలిగించు వికారముతో నశించిరి.

శ్లో॥ నదేవ స్సున్దరో నాపి, రాక్షసోఽఙ్గ భయంకరః
సౌన్దర్యంచ వికారశ్చ, మనసా మేవ నిశ్చితః॥ 40

తా॥ దేవతలనగా సుందర రూపులు కాదు. రాక్షసులనగా భయంకర వికార రూపులును కాదు. సౌందర్యము, వికారము నిశ్చయముగా మనస్సుకు సంబంధించినదే. శరీరమునకు సంబంధించినది కాదు.



శ్లో॥ అపాపా దేవతా శ్శుద్ధాః ప్రాయశ్చిత్తేన మానవాః
నాఙ్గీకుర్వ న్త్యహఙ్కరా, ద్విదిత్వాఽపి చ రాక్షసాః 41

తా॥ ఏ పాపము చేయని శుద్ధులే దేవతలు. పాపము చేసి, ప్రాయశ్చిత్తముతో శుద్ధులగు వారే మానవులు. తెలిసియు, అహంకారముతో, తమ పాపములను అంగీకరించనివారే రాక్షసులు.

శ్లో॥ దేవదైత్యా నరస్థాహి, దణ్డయామి పరాన్గురుః
శ్రుత్వాఽపి జానతేనైవ, పశవః పశురూపిణః॥ 42

తా॥ దేవతలు, రాక్షసులు, మనుష్యులలోనే యున్నారు. నేను గురువును కావున రాక్షసులను శిక్షణలో దండించి, బాగు చేయుదును. రాక్షసులు చెప్పినా తెలియని వారు అను మాటకు వీలు లేదు. చెప్పినా తెలియలేనివి పశువులు. ఆ పశువులు, పశు రూపాలతో వేరుగానే యున్నవి. దేవ-రాక్షసులు వేరు రూపాలతో గోచరించుట లేదు. కాన మనష్యులలోనే యున్నారు.

శ్లో॥ న తపో జప యజ్ఞాది, పాపం హన్తి హరామి తత్
క్షణా త్త్రికరణై శ్శుద్ధే, పశ్చాత్తాపేన మే పురః ॥ 43

తా॥ తపస్సు అగు జప, యజ్ఞాదుల చేత పాపము నశించదు. మనసా - వాచా - కర్మణా, నా ముందు పశ్చాత్తాప పడినచో ఆ పాపమును నేను రద్దు చేయుదును.

శ్లో॥ వదే ద్వాచా మనస్తప్తః, కర్మసాధ్యం వివర్తయన్
అకృత్వా పునరేతావ, దలం సర్వాఘ సంక్షయః॥ 44

తా॥ నా ముందు వాక్కుతో తన పాపమును చెప్పి, మనస్సులో బాధపడి, వీలున్నచో చేసిన పాపమును దిద్దుకొని, మరల పాపమును చేయరేని, సర్వ పాపము పూర్తిగా రద్దు చేయబడును.

శ్లో॥ ఏకదణ్డో హి పాపస్య, తత్సమర్థయతో ద్వయమ్
రక్షసాం ద్విగుణో దణ్డః, పాపస్యా ప్యనృతస్య చ॥ 45

తా॥ పాపము చేసి, పాపము చేసితినని అంగీకరించిన వానికి ఒక్క శిక్షయే ఉండును. పాపము చేసియు, తాను పాపము చేయలేదని కుతర్కముతో సమర్థించుకొను వానికి రెండు శిక్షలు పడును - ఒకటి పాప శిక్ష. రెండవది అసత్యమును పలికినందుకు. కాన, రాక్షసులకు శిక్ష రెండింతలుండును.

శ్లో॥ అరూపస్య స్వరూపస్య, యథేష్టం మత్పురో వదేత్
అపాపో యదహం సర్వే, సపాపా స్తత్పురో న తు॥ 46

తా॥ నిరాకారునిగా కానీ, సాకారునిగా గానీ, ఎవరి కేది ఇష్టమో, వారు అట్టి నా ముందు ఈ పాప క్షమాపణము చెప్పవలెను. ఏలననగా, నేను ఏ పాపమును చేయనివాడను. సర్వ మానవులూ పాపులే కాన, వారి ఎదుట పాప క్షమాపణము చెప్పనవసరము లేదు.

శ్లో॥ వర్ణలిఙ్గ వయోవర్గ - మత ధ్యేయాయనా నరమ్
న రక్షన్తి వినాధర్మం, మన్వాదే ర్దత్తశాసనమ్. 47

తా॥ బ్రాహ్మణాది కులముగానీ, పుంలింగాది లింగము కానీ, వార్ధకాది వయస్సు కానీ, దేవ - మనుష్యాది జాతి కానీ, శైవ వైష్ణవాది మతముకానీ, శివ విష్ణ్వాది రూపముకానీ, యజ్ఞాచరణాది వైదిక మార్గము కానీ జీవుని రక్షించ జాలవు. కేవలము మనువు మొ॥ ప్రజాపతుల ద్వారా ప్రవర్తించిన శ్రీ దత్త ప్రభు శాసనమైన ధర్మ శాస్త్రాచరణమే జీవుని కాపాడగలదు.

శ్లో॥ త్రికర్మి కేవలం రూపం, బ్రహ్మవేద్గా దహం శ్రమః
నిరాకారే వృథా స్యాం త, న్నాత్మ రూప వికారవాన్. 48

తా॥ జగత్తు యొక్క సృష్టి స్థితి లయములను నేను ఒక్కడనే చేయుచున్నాను. కాన, వేదములో చెప్పబడిన బ్రహ్మము యొక్క నిర్వచనము నాయందు సంపూర్ణముగా ప్రత్యక్షంగా సమన్వయించినందున నేనే (అనగా నీవు చూచు నా ఈ స్వరూపమే) బ్రహ్మము. నిరాకారమును ధ్యానించుట కష్టము. శ్రమతో కూడినది. కాన ఆ శ్రమ వ్యర్థము. అయితే నిరాకారమే ఇష్టమైనవారికి, నాఈ రూపము ఏమాత్రము చెడకుండగ, అనూహ్యుడ నైన నేను నిరాకారముగ కూడ మారగలను.



శ్లో॥ పరాత్మ భేదా త్పాపస్య, రూప మేకం వదన్త్యమీ
క్వచిద్దేవాః క్వచిద్దైత్యాః, కలౌ హింసా మయోజ్ఝితా॥ 49

తా॥ ఈ మానవులు తాము చేసిన పాపము యొక్క మరియొక రూపమును పాపము కాదనియును, ఇతరులు చేసిన పాపము యొక్క మరియొక రూపమును పాపమనియు వాదింతురు. దొంగ, మద్యపానమునే పాపమని వాదించి, దొంగతనమును పాపముకాదని వాదించును. మానవులు, ఒక సమయమున దేవతలుగను, మరియొక సమయమున రాక్షసులుగను మారుచున్నారు. వెనుక యుగములలో ఎల్లప్పుడును రాక్షసులుగ నుండువారిని సంహరించితిని. ఇప్పుడది కుదరదు, కాన, హింసా మార్గమును వదలియున్నాను.

శ్లో॥ సా హింసా ద్వాపరాన్తాऽసీత్, కలౌ బుద్ధాదిరూపవాన్
దయయా బోధయామ్యత్ర, ఖడ్గమన్తే కలేః పునః॥ 50

తా॥ ద్వాపరయుగ కృష్ణావతారముతో హింసామార్గమునకు స్వస్తి చెప్పితిని. అనగా దండించుట ఆపియున్నాను. కలియుగమున, దయాగుణముతో, బుద్ధావతారము నెత్తి బోధించుచూ, దయతో కూడిన కరుణావతారములనే దాల్చుచున్నాను. కలియుగాంతము వరకును ఇంతే. కలియుగాంతముననే, చివరకు కల్కి అవతారమున ఖడ్గమును ధరింతును.

శ్లో॥ త్రేతాయాం గురు మిచ్ఛన్తి, ద్వాపరే పితరం శివమ్
కలౌ తు మాతరం విష్ణుం, కృతే బ్రహ్మేక్షితం పరమ్॥ 51

తా॥ ఋషులు త్రేతా యుగములో ఆముష్మికప్రదుడగు గురు స్వరూపుడైన బ్రహ్మదేవుని, ద్వాపరంలో గురు-మాతృ సంధి రూపుడగు శివుని అర్చించిరి. కలియుగములో ఐహికములనిచ్చు మాతృరూపుడగు విష్ణువును కోరి అర్చించిరి. కృతయుగములో పరబ్రహ్మమునే కోరి అర్చించిరి. వారు కృతయుగమున చేసిన తపస్సుకు మెచ్చి, ఆ పరబ్రహ్మము, కృతయుగాంతమున, త్రేతారంభమున త్రిముఖ స్వరూపముగా సాక్షాత్కరించెను. ఆ పరబ్రహ్మమే నేను.

శ్లో॥ సోఽహ మన్వేషితో బ్రహ్మ, సర్వైః కృతయుగే చిరమ్
త్రేతాయా మత్రిణా లబ్ధో, దత్తో దత్త ఇతీరితః॥ 52

తా॥ బ్రహ్మమును గురించి కృతయుగమున చిరకాలము దేవతలు, ఋషులు అందరు అన్వేషించిరి. చివరకు త్రేతాయుగములో అత్రి మహర్షి నన్ను దర్శించి "దత్తః" "దత్తః" అనగా "చిక్కినాడు" "చిక్కినాడు" అని పలికెను.

శ్లో॥ మృగ్యమాణే మణౌ సర్వైః ప్రాప్తే కేనాపి తేనహి
ప్రాప్తః ప్రాప్త ఇతి స్యాద్వాక్, న బ్రూయా త్కిమితీతరః॥ 53

తా॥ ఒక రత్నమును అందరు వెదుకుచున్నారనుకొనుము. ఒకరికి అది చిక్కినది అనుకొనుము. అప్పుడు వాడు "చిక్కింది" "చిక్కింది" అని అరచునే గాని "రత్నము చిక్కింది" అని అనడు గదా. ఇతరులు గూడా "చిక్కింది" అని అందురేకాని "రత్నము చిక్కింది" అని అనరు గదా. అందరూ రత్నమునే వెతుకుచున్నారు గాన చిక్కినది రత్నమేనని అందరికి తెలియును కాన రత్నశబ్దమును ఎవరునూ పలుకరు. ఇది లోకములో అందరికి అనుభవయోగ్యమైన విషయమేగదా.

శ్లో॥ అన్విష్యన్తి సమే బ్రహ్మ, దత్తం బ్రహ్మేతి జానతే
బ్రహ్మదత్త మితి ఖ్యాతం, దత్తం నామ న కస్యచిత్. 54

తా॥ అట్లే అప్పుడు అందరూ బ్రహ్మమునే వెతుకుచున్నారు. కాన దత్తము అనగా చిక్కినది బ్రహ్మమేనని అందరికీ తెలియును. అందుకే, ఆకాలంలో "దత్తము" అను శబ్దమే బ్రహ్మమునకు పేరుగా నిలబడినది. "దత్తము" అని అందరూ అన్నారు కాన "దత్తము" అనే శబ్దమే బ్రహ్మము యొక్క పేరుగా నిలబడినది. అట్లు కానిచో, ఏ వస్తువు కైననూ "చిక్కినది" అనగా దత్తము అనిపేరు ఉండదు గదా!

శ్లో॥ ప్రాప్తం స్యా దస్వతన్త్రేతు, స్వతన్త్రే, దత్త మిత్యపి
రూపం హి త్రిముఖం తస్మై, శ్రుతే ర్వివృణుతే తనూమ్॥ 55

తా॥ రత్నము స్వతంత్రములేని జడ పదార్థము. అట్టి రత్నము చిక్కినప్పుడు "ప్రాప్తము"



అని అందురు. స్వతంత్రుడైన ఒక వ్యక్తియైనప్పుడు తన దర్శనదానమును తానే చేసినాడు (దత్తుడు) అనియే అందురు. వేదములో ఇట్లు చెప్పబడినది.
" యమేవైషవృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మావివృణుతే తనూంస్వామ్"
ఇదే బ్రహ్మము యొక్క తనువు అనగా రూపము. ఈ త్రిముఖరూపమే బ్రహ్మము యొక్క తనువు. అనగా బ్రహ్మము తన స్వరూపమైన రూపముతోనే సాక్షాత్కరించును అని అర్థము. అనగా, ఎవరు కోరుదురో వారికి ఆత్మ తన తనువును సాక్షాత్కరింప చేయును అని అర్థము. ( ఆత్మ అనగా, సర్వదేవతావేషములందున్న నటుడగు దత్తుడే)

శ్లో॥ ఇమాన్ జ్ఞానార్ణవా న్పశ్య-శునకా న్వేదపూరుషాన్
తర్కయిత్వా చలజ్జిహ్వా స్సనకాద్యాః పదాశ్రయాః॥ 56

తా॥ ఇదిగో చూడుము-ఆ నాలుగు శునకములు, నలుగురు వేదపురుషులు. సనక, సనందన, సనాతన, సనత్కుమారులే ఈ వేదపురుషులు. వీరు జ్ఞాన సముద్రులు. నన్ను గురించి తర్కించి, తర్కించి, అలసి రొప్పుచు నాలుకలను వ్రేలాడ వేసుకొని, చివరకు నాపాదముల నాశ్రయించినారు. వారు శునకముల రూపములో తమ అచంచల విశ్వాసమును ప్రదర్శించుచూ, నా ఆరాధనలో నా పాదముల నాశ్రయించినారు.

శ్లో॥ జ్ఞానం వేదా ఇమౌ పాదౌ, లిహన్తి శునకా ఇమే
తదధః పాదుకే దేవా, శ్శ్రయన్తే మునయ శ్చ తాన్. 57

తా॥ ఈ చతుర్వేదములే జ్ఞానము. ఈ వేదాలు కుక్కల రూపంలో నా పాదములను నాకుచున్నవి. ఈ పాదముల క్రింద నున్న పాదుకలను దేవతలు పట్టుకొనియున్నారు. ఆదేవతలను, మునులు పట్టుకొని వ్రేలాడుచున్నారు.

శ్లో॥ ధర్మదేవ మిమం పశ్య, కర్మభోగాప్తినిష్ఠురమ్
మత్పాదావనతఘ్రాణం, స్వత్రాణశరణాగతమ్॥ 58

తా॥ ఈ ధర్మదేవుని చూడుము. కర్మలు చేయువారికి కర్మఫలముల నిచ్చుటలో ఇతడు చాల పట్టుదల గల కఠోరశాసనుడు అయినా, తనను రక్షించమని నా శరణము గోరి, నా పాదముల నాఘ్రాణించుచు తలవంచి యున్నాడు. యమధర్మరాజే ధర్మదేవత,

గోరూపము తాల్చి నా శరణము గోరి నా రక్షణలో యున్నాడు.

శ్లో॥ అయం కర్మఫలధ్వంసే, మామశక్త మమంస్తహి
మార్కణ్డేయే విదిత్వా మాం, పురుషో ధేను రాశ్రితః॥ 59

తా॥ ఈ ధర్మదేవుడు జీవుని కర్మఫలములను నేను రద్దుచేయలేనని తలచి నన్ను అసమర్థునిగా భావించి అహంకరించినాడు. మార్కండేయుని విషయములో నాసామర్థ్యమును తెలుసుకొని పురుషుడయ్యును, స్త్రీ పశు రూపమైన ఆవు రూపమున, వినయముతో నన్ను ఆశ్రయించినాడు. యమధర్మరాజు అనగా ధర్మదేవుడే. మార్కండేయుని విషయంలో అహంకరించి, నాచే పరాభవించబడెను గదా.

శ్లో॥ నిత్యో ధర్మో ధేనురూప, శ్చతుష్పాదోఽస్య రక్షకాః
చతుర్వేదా ఇమే శ్వానః, పఞ్చానాం రక్షకోఽప్యహమ్. 60

తా॥ కర్మ రూపమైన ఈ ధర్మము నిత్యము. ఈ ధర్మమే చతుష్పాదములతో ధేనురూపమున నన్నాశ్రయించినది. ఈ ధర్మధేనువును, ఈ చతుర్వేదములు, కుక్కల రూపములో నుండి రక్షించుచున్నవి. ఈ గోవును, కుక్కలను, నేను రక్షించుచున్నాను.

శ్లో॥ అహం తు ధర్మమాలమ్బ్య, స్థితోగాం సత్త్వ పాణ్డురామ్
సాధకానాం చ సిద్ధానా, మాలమ్బం జగతా మతః॥ 61

తా॥ సత్త్వ గుణముచేత శుద్ధమై, తెల్లని ధేనువగు ఈ ధర్మమును ఆనుకొని నేను నిలబడియున్నాను. ఈ ధర్మము సాధకులకును, సిద్ధులకును ఆధారము. సర్వజగత్తునకు కూడ ఈ ధర్మమే ఆధారము.

శ్లో॥ ధర్మాధర్మ వివేకాయ, సారోఽయం గ్రన్థవిస్తరః
దత్తకోపకరోఽధర్మో, ధర్మో దత్త ప్రియప్రదః॥ 62

తా॥ ఏది ధర్మము? ఏది అధర్మము? అనుటకు గ్రంథముల సారమిదియే. దత్తునకు (నాకు) కోపము కలిగించునది అధర్మము. దత్తునకు (నాకు) ప్రీతిని కలిగించునది ధర్మము.



శ్లో॥ ప్రీతోఽస్మి సజ్జనప్రీత్యా, క్రుద్ధ స్సజ్జన బాధయా
పితృభిః ప్రార్థితో మాత్రా, తథావ్యాసో వధూమతః॥ 63

తా॥ నీవు సజ్జనులకు ప్రీతిని కలిగించినచో అది నాకు ప్రీతికరము - ధర్మము. నీవు సజ్జనులకు బాధకలిగించినచో అది నాకు కోపకరము - అధర్మము. వ్యాసమహర్షి అంబిక-అంబాలికలకు పుత్రోత్పాదనము చేయుటలో అధర్మములేదు. ఏలననగా, తనతల్లి చేతను, వారి పితృదేవతలచేతను (అనగా వారి భర్తలతో సహా), వారిరువురి సమ్మతి చేతనే త కార్యమును చేసెను. దీని చేత సజ్జనులకు బాధకలుగలేదు. కావున, అధర్మదోషము వర్తించదు.

శ్లో॥ మదన్యన్నాస్తి కిఞ్చిచ్చ,కిఞ్చేదం మమ దర్శనే
ఏకోఽహ మద్వితీయశ్చ, సత్యోఽహం కేవల శ్రుతః॥ 64

తా॥ నాకన్న ఇతరమైనది, రెండవది, ఏదియునులేదు. అయితే ఇది నా దృష్టిలో మాత్రమే. నేను ఒక్కడినే అద్వితీయుడను, పరమసత్యము అని శ్రుతి వాక్యము.

శ్లో॥ హిరణ్యగర్భ శ్చిత్సర్వం, విశ్వరూపోఽపి తన్మతేః
విశ్వాఖ్యోఽప్యపరా స్థూలో, విరా ట్సూక్ష్మాంశ శక్తిమాన్॥ 65

తా॥ ఈ సర్వజగత్తులోని సమిష్టి చైతన్యమే బ్రహ్మయైనచో నేను "హిరణ్యగర్భుడు" అనబడుచున్నాను. ఈ విశ్వమంతా బ్రహ్మము అగునపుడు నేను "విశ్వరూపుడు" అనబడుచున్నాను. ఈ విశ్వములోని కేవల విశ్వమే అనగా స్థూల ద్రవ్యమే బ్రహ్మమగుచో "విశ్వుడు" అని అనబడుచున్నాను. ఈ జగత్తులోని సూక్ష్మద్రవ్యకణములు అతి వేగముతో కూడిన కాంతి మొదలగు జడశక్తి అగును. అట్టి జడ శక్తియే బ్రహ్మము అగుచో, నేను "విరాట్" అనబడుచున్నాను. అంతా నేనొక్కడినే - రెండవది లేదు.

ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం
శ్రీ దత్త దర్శన యోగో నామ ప్రథమాధ్యాయః

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

బ్రహ్మఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## ద్వితీయాధ్యాయః

## శ్రీదత్త పరబ్రహ్మతత్త్వ దర్శన యోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ :

శ్లో॥ ఆకాశమేవ శూన్యం హి, నిరాకారం విదోవిదుః
ఆకారం పరిఛిన్నం, ఖణ్డైర్భూత చతుష్టయమ్॥ 1

శ్రీ దత్తగురు భగవానులు వచించిరి :

తా॥ శూన్యమైన ఆకాశమునే పండితులు నిరాకారమని చెప్పుదురు. మిగిలిన నాలుగు భూతములను ఖండఖండములై పరిమితులు కలవిగా ఆకారములని వ్యవహరించబడుచున్నవి. అనగా ఆకాశమును నిరాకారమనియు, పృథివి-ఆపః తేజో వాయువులను ఆకారములని పండితులు వ్యవహరించుచున్నారు.

శ్లో॥ అనాద్యనన్త మాకాశం, ఖణ్డానాం పశ్య చాన్వయమ్
నిరాకారోఽస్మి కిం శూన్య, మాకారో వాఽస్మి ఖణ్డశః? 2

తా॥ ఈ ఆకాశము మరియు నాలుగు భూతముల ఖండముల సమూహములు అనాది అనంతములుగా యున్నవి. ఇదే విశ్వముగదా. నన్ను నిరాకారుడన్నచో ఆకాశమువలె శూన్యమగుదునా? ఆకారమన్నచో నాలుగు భూతములుగా ఖండముల సమూహములుగా విభజింప బడితినా?

శ్లో॥ చక్షుషా గృహ్యతే రూప, మరూపం చే దచాక్షుషమ్
స్పర్శ గ్రాహ్య మరుద్వాఽహం, పరమాణు సముచ్చయః ? 3



తా॥ "రూపము" అనగా కంటికి కనిపించునది. "అరూపము" అనగా కంటికి కనిపించనిది. స్పర్శచే గ్రహించబడు పరమాణువుల సమూహమైన వాయువుకూడ అరూపమగును. నన్ను అరూపుడన్నచో అరూపుడగు పరమాణువుల సమూహమైన వాయువునా?

శ్లో॥ నో భయం చాపి వక్తవ్యం, యద్యగ్రాహ్య మతీన్ద్రియమ్
యత్సాక్షా దపరోక్షాది-త్యహం సాక్షాత్కృతోఽపి చ. 4

తా॥ ఇంద్రియములకు అందనిదానిని అగ్రాహ్యము అందురు. ఇంద్రియములకు అందనివాడనైనచో, నన్ను నిరాకారుడని గానీ, ఆకారమనిగానీ అరూపుడనిగానీ ఎట్లు నిర్ణయించగలవు? కాన, ఏ విధముగనూ చెప్పలేవు గదా. "ఏది సాక్షాత్తుగా అపరోక్షమో" అను శ్రుతి ప్రకారముగ నేను సాక్షాత్కరించుచున్నాను గదా. అనగా కంటికి కనిపించు వాడనే గదా! కనుక నన్ను నిరాకారుడని గాని, ఆకారమనిగాని, అరూపుడని గాని ఎట్లు నిర్ణయించగలవు?

శ్లో॥ సఙ్కల్పా ద్యది చైతన్యం,సృష్టే ర్మాం వక్తి సోఽప్యహమ్
చరాచరగ్రహో దత్తా, కిమగ్ని స్సర్వ భక్షకః ? 5

తా॥ సృష్టి చేయ సంకల్పించితినికాన, నేను చైతన్యము అని చెప్పుదురేని, ఈ చరాచర సృష్టిని ప్రళయకాలమున నాలో లీనము చేసుకొందును గదా. కాన నన్ను సర్వ భక్షకుడగు అగ్నియని చెప్పుదురా? కనుక గుణము చేత నన్ను నిర్ణయించరాదు.

శ్లో॥ ఈక్షతే ర్నాస్మి చైతన్య, మశబ్దం బ్రహ్మచాస్మి యత్
ఈక్షతే రితి సూత్రార్థ-వ్యావృత్తం సర్వశబ్దతః ॥ 6

తా॥ ఈక్షతేః = సృష్టిచేయు సంకల్పము వలన, న = బ్రహ్మమును చైతన్యమని భావించరాదు. ఎందువలన? అశబ్దమ్ = బ్రహ్మము శబ్దముచే చెప్పబడదు. "అశబ్ద మస్పర్శమ్" అని శ్రుతి. అనగా బ్రహ్మము ఏ శబ్దము చేతను చెప్పబడదు. ఇదే బ్రహ్మ సూత్రార్థము. అనగా శబ్దార్థములైన సర్వ వస్తువులు బ్రహ్మముకాదు. చైతన్యముకూడా ఒక వస్తువును తెల్పు శబ్దమే కాన, చైతన్యము బ్రహ్మమని భావించరాదు.

(ఈ సూత్రమును ఇట్లు విలక్షణంగా సమన్వయించవచ్చును.)

శ్లో॥ ప్రధాన ప్రకృతే స్సర్వ-వస్తు నేతీతి సర్వకృత్
యత్నలభ్యం తపోలభ్యే, మయి వస్తుని కాశ్యప! ॥ 7

తా॥ ప్రధానము లేక ప్రకృతి యనబడు ఈ జగత్తులోని సర్వ వస్తువులునూ "ఇది కాదు" "ఇది కాదు"అని నిషేధించుటచేత, పురుష ప్రయత్న లభ్యమైన వస్తువు నేను కాదని అర్థము. కాశ్యపా! నేను విశేషమైన తపస్సు చేత లభించు వస్తువును. సంకల్పించుట, దహించుట మొ॥ అన్ని పనులను చేయువాడను నేనే కాన ఒక్కపనిని ఆధారంగా చేసుకొని ఒకే వస్తువుగా నన్ను భావించరాదు.

సామాన్య ప్రయత్న లబ్ధమైన వస్తువు నేను కాదు.

శ్లో॥ గత్వా దృష్ట్వా న లబ్ధవ్యం, తదగ్రాహ్య శ్రుతీరితమ్
మాం పశ్యే త్తపసా లభ్య, స్సేవయాऽనుగ్రహోమమ॥ 3

తా॥ "అగ్రాహ్యుడు, అతీంద్రియుడు" అనగా ఇంద్రియములచేత గ్రహించబడనివాడు అని అర్థము. ప్రయాణము చేసి పోయి, అన్ని వస్తువులను చూచినట్లు కన్నులతో చూడదగినవాడను కాను అని అర్థము. అనగా ఇంద్రియముల ప్రయత్నము చేత గ్రహించబడే వాడు కాడు అని అర్థము.

"యత్సాక్షా దపరోక్షాత్"- అని శ్రుతి. అనగా "ఏది పరోక్షము కాదో" అని అర్థము. అనగా తపస్సు అను విశేష ప్రయత్నము చేతనే నా దర్శనము లభించును.నా కార్యమున పాల్గొని నా సేవ చేసినచో నా అనుగ్రహము లభించును. నా సాక్షాత్కారము కన్న నా అనుగ్రహమే గొప్పది. కాన, తపస్సు కన్ననూ, నా సేవ గొప్పది.

శ్లో॥ యథా మాతా పరాన్బాలాన్, విహాయ స్వశిశుగ్రహ
తథా ప్రకృతిరూపాణి, త్యక్త్వా రూప మిదం వ్రజేత్ ॥ 9

తా॥ ఎట్లు తల్లి అన్య శిశువులను త్యజించి, తన శిశువునే గ్రహించునో, అట్లే, తపస్వి, అన్ని ప్రకృతి రూపములను వర్జించి, నా ఈ రూపమును బ్రహ్మముగ గ్రహించును.

శ్లో॥ న బాల ఇతి తాత్పర్యం, పరబాల నిషేధతః
న రూప మితి తాత్పర్యం, పరరూప నిషేధతః॥ 10



తా॥ ఒక తల్లి తన బాలుని తప్ప, మిగిలిన బాలురను "వీడు నా బాలుడు కాడు" అని ఎట్లు నిషేధించునో, అట్లే నన్ను తప్ప మిగిలిన ప్రకృతి రూపములను నేను కాదని నిషేధించుట జరిగినది (నేతి నేతీతి అని శ్రుతి). అన్యబాలురను నిషేధించినది కాన ఈమె కుమారుడు బాలుడు కాదని. ఎట్లు తలంచరాదో, అట్లే ప్రకృతి రూపములను నిషేధించినంత మాత్రాన నేను రూపము కాదని అనరాదు.

శ్లో॥ అశబ్దం బ్రహ్మ శబ్దార్థం, బ్రహ్మ ప్రకృతి శబ్దగాత్
సర్వార్థా దన్య దిత్యేవ, బ్రహ్మ శబ్దార్థ వస్తు కిమ్ ? 11

తా॥ "అశబ్దము" అనగా - బ్రహ్మ శబ్దమునకు అర్థమైన బ్రహ్మమే. ప్రకృతిలోనున్న అన్ని అర్థములుగల శబ్దముల కన్నా ఈ బ్రహ్మ శబ్దము వేరు అనుటయే "అశబ్దము". అట్లు కాకున్నచో, బ్రహ్మ శబ్దమునకు అర్థమగు మరొక వస్తువు ఏది? "అశబ్దము" అనగా ఏ పేరూ లేనిది అని కాదు.

శ్లో॥ అశబ్ద నామ శబ్దత్వాత్, బ్రహ్మ నామ గురు శ్రుతమ్
శబ్దార్థం లక్షణం ప్రోక్తం, వేదే సూత్రే చ గీయతే ॥ 12

తా॥ నా పేరు "అశబ్దమా"? లేక శ్రుతియందు పిలువబడిన 'బ్రహ్మ' శబ్దమా? అశబ్దమే నా పేరు అయినచో అశబ్దము కూడ ఒక శబ్దమే-అనగా పేరే గదా! నా పేరు అగు బ్రహ్మ శబ్దమునకు "గొప్పది" అను అర్థము అగు వస్తువు యొక్క లక్షణము గుర్తించుటకు శ్రుతియందును, బ్రహ్మ సూత్రములందును, గీతయందును చెప్పబడినది గదా!

శ్లో॥ అపరోక్ష ఫలాద్యజ్ఞై, రాయు రారోగ్య సంపదామ్
మన్త్రాజ్య వహ్నిభి ర్వేదః, ప్రమాణం నోహ్య వస్తుషు ॥ 13

తా॥ ఇహలోకములో కండ్లకు కనిపించు ఆయురారోగ్య ధన ఫలములను, ఆముష్మికముతో కంటికి కనపడని స్వర్గాది ఫలములను ఇచ్చునవి యజ్ఞములు. మంత్రములను చదివి అగ్నిలో నేతిని వేయుట వలన ఐహిక ఫలములు లభించుట ఊహకు అందని విషయముగదా. ఊహకు అందని విషయములలో పరమ

ప్రమాణము ఆ యజ్ఞములను చెప్పినటువంటి వేదమే. కాన ఊహకు అందనివి, ప్రత్యక్షముగా కనిపించునవి అగు ఈ విషయములలో వేదమే ప్రమాణము.

శ్లో॥ అతీన్ద్రియార్థమానాయ, యోగినాంవాఽష్ట సిద్ధయః
వేద ప్రామాణ్య ముక్తం తై, ర్మయాఽఽదిష్టైశ్చ నాస్తికే. 14

తా॥ ఊహకు అందని తత్త్వము ఉన్నదని ప్రత్యక్షముగా నాస్తికులకును నిరూపించుటకై, నాచే నియమించబడిన యోగులు, ఊహాతీతములగు అష్టసిద్ధులను ప్రదర్శించుచున్నారు. అట్టి యోగులు నా ఆదేశమువలన, వేదముయొక్క ప్రామాణ్యతను, అనూహ్య విషయములలో తీసుకొనవలయునని చెప్పుచున్నారు. కాన, ప్రత్యక్ష ప్రమాణము నాశ్రయించియే వేదము, ప్రమాణమగుచున్నది. ప్రత్యక్ష ప్రమాణ విశ్వాసియగు నాస్తికుని ఉద్దేశించియే వేద ప్రామాణ్యము చెప్పబడినది.

శ్లో॥ ప్రమాణం కలితే బ్రహ్మ, ణ్యనూహ్యే మమ వాగియమ్
శ్రుతిశ్చాను శ్రుతీ చైతే, ప్రస్థానత్రయవక్త్రజా॥ 15

తా॥ తపస్సు చేత అనూహ్యమైన బ్రహ్మము ప్రత్యక్షము అగునను వాక్యమునకు ప్రమాణము వేదములే. ఆ వేదములు నావాక్కులే. వేదములే శ్రుతులనబడుచున్నవి. బ్రహ్మ సూత్రములు అనుశ్రుతులనబడుచున్నవి. శ్రుతులు, అనుశ్రుతులు, భగవద్గీత-ఈమూడును నాముఖము నుండి వచ్చిన "ప్రస్థానత్రయ" మనబడును.

శ్లో॥ 'యతోవే' తి శ్రుతేర్జన్మాద్యస్యేతి బ్రహ్మసూత్రతః
ప్రభవః ప్రళయః ప్రోతం,మయీత్యేతద్ధి గీయతే. 16

తా॥ దేనినుండి ఈ భూతములు సంభవించి, దేని చేత నిలబడి, దేని యందు ప్రవేశించుచున్నవో అదే బ్రహ్మము అని శ్రుతి. "ఈ జగత్తు యొక్క జన్మ స్థితి లయములు దేని నుండి జరుగుచున్నవో అది బ్రహ్మము" అని బ్రహ్మ సూత్రము. "నేను సర్వజగత్తునకు జన్మము. ప్రళయము నాయందు ఈ జగత్తు అంతయును దారములో మణులవలె గుచ్చబడి నిలచి యున్నది" అని అదే లక్షణము గీతలోను చెప్పబడినది. ("యతో వా ఇమాని...." అని శ్రుతి. "జన్మాద్యస్య"అని బ్రహ్మసూత్రము. "అహం సర్వస్య..." "మయి సర్వమిదం.." అని గీత.)



శ్లో॥ తటస్థలక్షణం చాపి, దాహోఽగ్నే రివ సంజ్ఞయా
స్వరూపం శక్తి సామర్థ్య, మన్యవ్యావర్తకం యతః॥ 17

తా॥ అయితే, జగత్తు యొక్క సృష్టిస్థితిలయ లక్షణము స్వరూపలక్షణము కాదు. తటస్థలక్షణము అని భావించరాదు. స్వరూపలక్షణము అనగా 'అవుగంగడోలు కలది' అనుట. మరి, తటస్థలక్షణ మనగా- "ఆ చెట్టు క్రింద ఉన్నది అవు"అనుట. స్వరూపలక్షణము నిత్యము. తటస్థలక్షణము అనిత్యము. బ్రహ్మమును గుర్తించుటకు చెప్పిన ఈ లక్షణము తటస్థముగ కనిపించుచున్ననూ, స్వరూపలక్షణమే. శక్తి సామర్థ్యములను చెప్పినపుడు మిగిలిన ఏవస్తువు నందును ఆ లక్షణము లేనపుడు అది స్వరూపలక్షణమే అగును. "దహించునది అగ్ని" అన్నపుడు దహించుట అగ్నికే తప్ప, ఇతర వస్తువులకు ఆ లక్షణము లేదు కాన, అది అగ్ని యొక్క స్వరూపలక్షణమే అగును.కాని తటస్థలక్షణము కాదు. కాన బ్రహ్మమును గురించి శ్రుతులు అనుశ్రుతులు చెప్పిన లక్షణము తటస్థలక్షణముగా గోచరించినా,నిజముగా విచారించినచో స్వరూపలక్షణమే. (జగత్తు యొక్క సృష్టి స్థితి లయములను చేయుట స్వరూపలక్షణమేనని భావము).

శ్లో॥ నిత్యత్వా దన్య దుస్సాధ్యాత్, స్వరూపం లక్షణం హి తత్
ద్రవ్యసామర్థ్యశక్తీనా,మేకార్థత్వం నవం మతమ్. 18

తా॥ ఈ సృష్టి స్థితి లయశక్తి, నిత్యము - బ్రహ్మమునందుండుట వల్లనూ, ఇతరవస్తువులకు ఆలక్షణము లేనందుననూ అది స్వరూపలక్షణమే. ద్రవ్యము లేక శక్తి లేక సామర్థ్యము - ఒకే ఒక పదార్థమని నవీనులైన భౌతిక విజ్ఞానుల మతము గదా. అవిధముగనూ కర్మసామర్థ్యశక్తి - వస్తువూ ఒక్కటియే. కాన శక్తి లక్షణము, వస్తు లక్షణము ఒక్కటియే. (కర్మ-శక్తి-ద్రవ్యము ఒకటేనని నవీన విజ్ఞానవాదుల సిద్ధాంతము).

శ్లో॥ దాహకత్వం గుణః కర్మ, దహనో వస్తుతత్త్వతః
దాహసామర్థ్య శక్తిశ్చ, పదార్థ ఇతి పణ్డితాః॥ 19

తా॥ "దహించుట"ధర్మము (గుణము) లేక కర్మ. "దహనుడు" వస్తువగు అగ్ని. దహించుసామర్థ్యము లేక శక్తి - ఈ మూడును ఒకే పదార్థమని నవీన

భౌతికవిజ్ఞానవేత్తలగు పండితులు చెప్పుదురు. కనుక దహించుట అను కర్మ దహనుడు అను వస్తువు, దహించు సామర్థ్యము అనుశక్తి ఈ మూడును ఒకే పదార్థము అని నవీనుల మతము.

శ్లో॥ ఏకమేవ త్రికర్మీతి, సారాంశ బ్రహ్మ లక్షణమ్
త్రివక్త్రే మయి చైకస్మిన్, ప్రత్యక్షేణ సమన్వితమ్॥ 20

తా॥ జగత్సృష్టి, స్థితిలయములను మూడుకర్మలను ఒక్కటే వస్తువు చేయుచున్నది యనుటయే వేదముచే చెప్పబడిన బ్రహ్మలక్షణము యొక్క సారాంశము. ఈ మూడు ముఖములు ఆ మూడు కర్మలను చేయుటయు, నేను ఒక్కడినే అగుటయు, నాయందు ప్రత్యక్షముగా వేద ప్రోక్త బ్రహ్మ నిర్వచనము సమన్వయించుచున్నది గదా!

శ్లో॥ త్యక్త్వా ప్రత్యక్ష రూపం మాం, రూపాన్యారోపణం కుతః?
నిరాకారాగ్రహః కస్మా? న్నచే దున్మాద లక్షణమ్. 21

తా॥ ఈ రూపంలో ప్రత్యక్షంగా కనిపించుచున్న నన్ను-ప్రత్యక్షముగా బ్రహ్మలక్షణము సమన్వయించిన నన్ను-వదలి, మరొక రూపములో బ్రహ్మలక్షణమును బలవంతముగా ఆరోపించుట ఎందులకు? నిరాకారమే బ్రహ్మము అను పట్టుదల ఎందులకు?నన్ను బ్రహ్మముగా గ్రహించక, అన్యరూపములను బ్రహ్మమనుటయు, నిరాకారమే బ్రహ్మము అనుటయు ఉన్మాదలక్షణ మగును.

శ్లో॥ అనిత్యం మర్త్యరూపం చ, సూర్యరూపం చ శాశ్వతమ్
ఇహసృష్టం విభేదాయ, రూపం నిత్య మిదం హ్యహమ్. 22

తా॥ మానవ రూపము అనిత్యము. సూర్యరూపము నిత్యము. కాన రూపము :- నిత్యము - అనిత్యము - అని రెండు విధములుగ ఉండునని బోధించుటకే, ఈ లోకములో ఒక దానితోనొకటి పోలిస్తే లభించే నిత్యరూపాలనూ, అనిత్యరూపాలను సృష్టించాను. కాపున ఈ త్రిముఖరూపము నిత్యము. ఈ నిత్యరూపము నేనే. మిగిలిన రూపాలన్ని అనిత్యములే.



శ్లో॥ అహం తనురియం చాస్యా, రూపకాన్త్యాదయో గుణాః
ఆత్మాఽస్య కరుణాద్యాశ్చ!,సర్వం బ్రహ్మైవ ఖల్వహమ్. 23

తా॥ ఈ తనువు నేనే. ఈ తనువు యొక్క గుణములగు రూపము, కాంతి మొదలగునవన్నియు నేనే. ఈతనువు లోని చైతన్యాత్మయు నేనే. ఈ చైతన్యాత్మ గుణములగు కరుణ మొదలగు గుణములన్నియు నేనే. ఇది అంతయు బ్రహ్మమే.
ఇదే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనెడి శ్రుతి వాక్యార్థము.

శ్లో॥ ఏకైకావయవో బ్రహ్మ. నేహ నానాఽస్తి కిఞ్చన
రోమాపి మమ విశ్వస్య, సృష్టి స్థితి లయప్రదమ్॥ 24

తా॥ నాప్రతి అవయవమూ బ్రహ్మమే."ఇందులో నానాత్వము లేదు" అని శ్రుతి. నారోమము కూడ ఈ విశ్వ సృష్టి స్థితి లయములను చేయగలదు.

శ్లో॥ చైతన్య జీవ తద్ధర్మా, శ్శరీర ద్రవ్య తద్గుణాః
సర్వేఽప్యస్మ త్పదార్థాహి, తత్త్వశక్తిశ్చ తత్కులమ్॥ 25

తా॥ లోకములో చైతన్యాత్మయగు జీవుడు, కరుణ మొదలగు జీవ చైతన్యగుణములు, శరీరము యొక్క పదార్థమైన పంచ భూతములగు ద్రవ్యము, దాని యొక్క రూపము, కాంతి మొదలగు గుణములు - ఇవి అన్నియు కలిసియే "నేను" అను శబ్దమునకు అర్థముగా వాడబడుచున్నవిగదా. ఇవి అన్ని జడశక్తి రూపములేకాన తాత్త్వికంగా కూడా ఒక్కటే కావ, "నేను" అను ఒకే శబ్దము యొక్క అర్థమై ఇవి అన్నీ యున్నవి.

శ్లో॥ సమ్యక్ప్రత్యక్ష సంపూర్ణా, ద్వేదవాక్య సమన్వయాత్
మాం హిత్వా బ్రహ్మ శత్రుం వా, బన్ధరూప బలాన్వయః 26

తా॥ వేదమాత బ్రహ్మలక్షణమును గురించి చక్కగా, ప్రత్యక్షంగా, సంపూర్ణంగా ఇలా చెప్పుచున్నది.

"యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన
జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభి సంవిశన్తి"

అనగా దేనినుండి ఈ పంచభూతములు పుట్టి, దేనిచే నిలిచి, దేనియందు

లయించుచున్నవో అది బ్రహ్మము అని భావము. ఈ వేద వాక్యము నాలో సంపూర్ణముగా సమన్వయమగు చుండగా, నారూపము శత్రువా? మరొక రూపము చుట్టమా? మరొక రూపంలో భ్రాంతులై బ్రహ్మలక్షణమును బలవంతముగా సమన్వయము చేయుచున్నారు.

శ్లో॥ ప్రత్యక్ష మహ మేకో హి, విశ్వసృష్టిస్థితిక్షయాః
ప్రత్యక్ష త్రిముఖైః కుర్యాం, యస్సాక్షా దపరోక్షతః॥ 27

తా॥ "నేను ఒక్కడినే" అని ప్రత్యక్షముగనే చూచుచున్నావు. "ఏక మే వా ద్వితీయం" అని శ్రుతి గదా. దేని నుండి ఈ భూతములు పుట్టి, జీవించి, దేని యందు లీనమగునో అను బ్రహ్మ లక్షణమును చెప్పు శ్రుతిలో గూడ "యత్" అను శబ్దము ఏకవచనముతో ఏకవ్యక్తినే చెప్పుచున్నది. ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను నేనొక్కడినే చేయుచున్నానని ఈ త్రిముఖములు చెప్పుచున్నవి. నేను ప్రత్యక్షముగా కనబడుట కూడ ("యత్సాక్షాదపరోక్షా ద్బ్రహ్మ" అని)-బ్రహ్మము ప్రత్యక్షమగుట కూడా శ్రుతిచే చెప్పబడియున్నది గదా.

శ్లో॥ జడశక్తి రధీనత్వా, దాకాశ నియమా న్నరే
పరిమాణాంశసామర్థ్యం, నమయ్యేత ద్విలక్షణే॥ 28

తా॥ అయితే, మనుష్యుని విషయంలో అతడు అస్వతంత్రుడు. నా అధీనుడు కావున ఆకాశము యొక్క గుణము అగు పరిమాణమునకు లోబడినాడు. కాన అతని అవయవములు భిన్న పరిమాణములతో భిన్నశక్తులను కలిగి యుండును. నేను స్వతంత్రుడను, ఆకాశ నియమములకు అతీతుడను కాన, ఇది నాయందు ప్రవర్తించదు. నాప్రతి అవయవము సమానమైన పూర్ణబ్రహ్మమే. ఆకాశమునకు అతీతుడనగు నాయందు ఆకాశము యొక్క పరిమాణనియమము ప్రవర్తించదు.

శ్లో॥ త్రేతాయా మత్రిణా దృష్టే, కిం తదైవ మమోద్భవః?
దృష్టే దుర్దిన మధ్యాహ్నే, రవౌ సూర్యోదయ స్తదా!॥ 29

తా॥ నేను అత్రి మహర్షికి త్రేతాయుగములో దర్శనమిచ్చితిని. కావున త్రేతాయుగములో జన్మించితిని కాన అంతకు ముందటి కృతయుగములో లేనట్లేగదా - అని అనరాదు.



మేఘములు దట్టముగా ఆవరించిన రోజు, సూర్యుడు ఉదయమున కనిపించడు గదా. మధ్యాహ్నమైన తర్వాత మేఘములు నిష్క్రమించి, ఆకాశము నిర్మలము కాగానే సూర్యుడు కనపడుచున్నాడు. ఇంత మాత్రాన సూర్యుడు ఉదయము లేడనీ, మధ్యాహ్నమే ఉదయించినాడని అనవచ్చునా? అట్లే నేను త్రేతాయుగమున దర్శనమిచ్చినంత మాత్రాన త్రేతాయుగముననే జన్మించితిననియు కృతయుగమున లేననియు అనరాదు గదా!

శ్లో॥ రూపం తత్త్వా దపిబ్రహ్మ, మృదణూనాం హి బన్ధనమ్
అగ్నిపాకభవా శక్తి, ర్ద్ర్యా మృ త్సాన్ద్రా నవే మతే. 30

తా॥ తత్త్వపరంగా చూస్తే రూపమూ బ్రహ్మమే. మట్టి అణువుల మధ్య ఏర్పడిన శక్తి బంధములు అగ్నిలో పచ్చికుండను కాల్చుట వలన ఏర్పడినవి. ఆ బంధముల శక్తి అంతయును సాంద్రమైనచో ద్రవ్యమై మట్టిగా మారి మట్టియే మిగులును. కాన రూపము (అనగా మట్టి అణువుల మధ్యగల శక్తి బంధముల సమూహశక్తి), మరియు ద్రవ్యము-ఒకే పదార్థమని నవీనుల మతము. అట్లే ఈ రూపము (అనగా శక్తి అగు ఈ తనువు) బ్రహ్మమే.

శ్లో॥ సాన్ద్రత్వా ద్ఘనతన్వాఖ్యా, శ్రుతే ర్వివృణుతే తనూమ్
న శరీరం న దేహో ऽయం, తను రిత్యేవ కథ్యతే॥ 31

తా॥ నీవు ఇప్పుడు చూచుచున్న నా ఈ రూపము తనువు అనబడును. శక్తి సాంద్రము చెంది ఘనీభవించి కొద్ది పరిమాణమును పొందినది. దీనిని తనువు అనవలనే గాని, శరీరము - దేహము అనరాదు. ఎందువలన అనగా, "నశించునది" అను అర్థముగలది శరీరము. "దహించబడునది" అను అర్థముగలది దేహము. కనుక ఈ శబ్దములు నా రూపమునకు ప్రయోగించరాదు.

"తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్" అనిశ్రుతి. అనగా "పరమాత్మ తన తనువును సాక్షాత్కరింపచేయును" అని అర్థము. నాయొక్క అనిత్య రూపమునకు తనువు అనియే ప్రయోగింపబడినది. అనిత్యములగు, నశించు మానవ తనువులను శరీర-దేహ శబ్దములతో చెప్పవలెను.

శ్లో॥ బ్రహ్మ శ్రేష్ఠం విచిత్రం హి, నోహ్యం నాకార మానతః
వాయో శ్శైలో గజా త్సింహో, మహత్తర ఇతిహ్యాహమ్॥ 32

తా॥ బ్రహ్మము అనగా జీవుల ఊహలకు అందని పరమవిచిత్రమైన వస్తువు కాన, "అన్నింటికన్నను గొప్పది" అనియే అర్థము తప్ప, విరాకారమని కానీ, పరిమాణములో గొప్పది, అని కానీ కాదు. నిరాకారమైన వాయువు కన్నా ఆకారముగల కొండ గొప్పది. పరిమాణములో గొప్పది యగు ఏనుగు కన్ననూ పరిమాణములో చిన్నదియగు సింహము గొప్పది. కాన, నేను ఆకారము కలిగిననూ, పరిమాణములో కొద్దివాడ నైననూ అన్నింటికన్ననూ గొప్పవాడను కాన బ్రహ్మమును. గొప్పతనమునకు పరిమాణముకానీ, ఆకారము లేకుండుట కానీ లక్షణముగా ఉండుట అవసరములేదు.

శ్లో॥ ద్రవ్యం బ్రహ్మ తను ర్బ్రహ్మ, చైతన్యం బ్రహ్మ తత్త్వతః
ప్రతిష్ఠా పుచ్ఛమిత్యుక్త, మధిష్ఠాన మిదం త్రయమ్॥ 33

తా॥ ఈ నిరాకారద్రవ్యము, ద్రవ్యమే ఆకారమైన తనువు, నిరాకారచైతన్యము, ఈ మూడును తాత్త్వికంగా ఒకే పదార్థమైన బ్రహ్మము . "బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా" అను శ్రుతి ప్రకారము, ఈ మూడింటికి బ్రహ్మము అనగా నేను అను శబ్దమే అధిష్ఠానము. ఇది జగత్తు యొక్క సృష్టి స్థితి లయములను చేయుట అను ప్రత్యేక లక్షణముగల బ్రహ్మము యొక్క అసలురూపము. మిగిలిన రూపాలు బ్రహ్మము యొక్క అసలు రూపాలు కావు. అవి బ్రహ్మము యొక్క వేషాలే.

కావున ఈ త్రిముఖరూపమే బ్రహ్మము యొక్క అసలు రూపము. మిగిలిన రూపాలు బ్రహ్మము యొక్క వేషాలే కానీ అసలు రూపాలు కావు.

శ్లో॥ దారాః పుంసి చ భూమ్నీతి, కిం భార్యైవం న శబ్దతః
స్త్రీయాలేప పురాణార్థై, రన్ధా దన్లై శ్శశీ శ్రుతః॥ 34

తా॥ శబ్దము యొక్క లింగము చేత, వచనము చేత, అర్థము యొక్క లింగము, వచనములను నిర్ణయించరాదు. "దారాః" అనగా భార్య. కానీ ఈ శబ్దము పుంలింగ-బహువచనమున ఉన్నది. శబ్దము వలన, భార్య, పురుషుడూ కాదు, బహుసంఖ్యలో భార్యలూ కాదు. కాన, శబ్దములను బట్టి అర్థనిర్ణయము చేయరాదు. జీవుల యొక్క



సంసారలంపటవాసనలను దేవతా రూపములపై పులిమి కొందరు, సంసారవాసనా ప్రియులగు జీవుల ప్రీతి కొరకు, అనేక పురాణకథలనల్లియున్నారు. వ్యాసమహర్షి వ్రాసిన పురాణములలో అనేక శ్లోకములు చేర్పబడి, అసలు తత్త్వమే భ్రష్టమైనది. ఈ కథలలోని అంతరార్థమును తీసుకొని తన సాధనకు సహకారమును కల్పించు కొనవలయును కానీ, అంతరార్థమును వదలి, అపార్థములనే పట్టుకొన్నచో, గుడ్డివారు, గుడ్డివాడు వర్ణించు చంద్రోదయమునకు సంతసించుచున్నట్లుండును.

శ్లో॥ తేజోzతిశయ తేజస్వీ, తేజో వ్యాకరణా న్మతమ్
సామర్థ్యం బ్రహ్మచాహం హి, తదరూప మభేదతః॥ 35

తా॥ ఎక్కువ తేజస్సు కలవాడు "తేజస్సు" అని నపుంసక లింగ శబ్దము చేతనే చెప్పబడుట వ్యాకరణశాస్త్ర సమ్మతము "గొప్పతనము కలది అను అర్థము కల నాసామర్థ్యమైన బ్రహ్మము అను నపుంసకలింగశబ్దము చేత నేనే చెప్పబడుచున్నాను. నాసామర్థ్యము నిరాకారము. నాసామర్థ్యము నాకన్న వేరుగా కనిపించదు కాన, నా సామర్థ్యము నేనే. అనగా నేనే బ్రహ్మము బ్రహ్మమే నేను.

శ్లో॥ వాతామ్భసీ నచారూపే, సావధీ పాత్రరూపతః
నాశ్మవ న్నాస్తి నాకార-నాడీస్థా చిచ్చ తన్నభః॥ 36

తా॥ నిరాకారమనువారు సరియగు అర్థమును తెలియక మాట్లాడుచున్నారు. వారి ఉద్దేశమున వాయువు నిరాకారము. కానీ పరమాణుసమూహమైన వాయువుకు కూడాసరిహద్దులు అగు పరిమితములున్నవి కాన అది నిరాకారము కాదు. జలమునకు కూడా పరిమితమైన అవధులున్నవి కాన నిరాకారము కాదు. అయితే వాయువు, జలము ఏ పాత్రలోనుంచుదుమో అది ఆ పాత్ర ఆకారమును ధరించును. ఒక రాయి అట్లు పాత్రాకారమును ధరించలేదు. కాన వాయుజలములు నిరాకారములు. రాయి సాకారము అనరాదు. అన్నీ సాకారాలే. కాకపోతే వాయు జలములు ఇతరాకారములను ధరించగలవు. రాయి ధరించలేదు. అవధులు అనగా పరిమితులు కలది నిరాకారమెట్లు అగును? అవధులు లేని పదార్థమేది? నాడులలో ప్రవహించు చైతన్యము కూడ అవధులు కలదియే కాన సాకారమే. ఆకాశము కూడ వస్తువుల చేత ఖండములుగా నున్నది కాన అవధులు కల ముక్కలుగానే ఉన్నది కాన ఆకాశము నిరాకారము కాదు.

శ్లో॥ నా రూపం నేక్షితానాది, జీవస్యైవ న తస్య హి
దత్తాత్రేయస్య దృష్టస్య, నోహ్యస్య బ్రహ్మణ స్స్వయమ్॥ 37

తా॥ కాన, నిరాకారమన్నదే లేదు. ఆకారము కల పంచభూతపదార్థాలు, అనాదిగా, అనంతంగా ఉన్నవి. ఈ అనాది అనంత పదార్థాలు జీవుని దృష్టిలో అనాది-అనంతాలే తప్ప, పరమాత్మ దృష్టిలో, ఇవి, ఆది-అంతములను కలిగియేయున్నవి. అంటే ఇవి నిజంగా అనాది-అనంతాల్లు కావు. జీవుడు వీటి ఆది - అంతములను చూడలేడనియే అర్థము. ఆ పరమాత్మ రూపము కలిగి దత్తాత్రేయ రూపములోనే ఉన్నారు. ఆ పరమాత్మ కనులకు కనబడుచునే ఉన్నారు గదా! ఇక, పరిమితికల రూపముగల భగవానుడు, అనాది-అనంతసృష్టికి ఆధారమెట్లు? అన్నచో - ఆయన ఊహకు అందనివాడు కనుక ఇది సాధ్యము- ఆ బ్రహ్మమే దత్తాత్రేయుడగు నేను.

శ్లో॥ అనూహ్యం లక్షణం తత్త్వం, దృష్టం తత్త్వం న త న్నఖమ్
ఊహయే దచలోత్క్షేపం, విరోధాన్వయ మేకదా॥ 38

తా॥ ఊహకు అందక పోవుటయే బ్రహ్మము యొక్క తత్త్వలక్షణము. కనపడినంత మాత్రాన, వస్తుతత్త్వము అర్థమైనట్లు కాదు. కృష్ణుడు కంటికి కనిపించుచున్నాడు. కానీ,ఆ బాలుడు తన వ్రేలి గోటిపై గోవర్ధన పర్వతము నెత్తుట వలన, కృష్ణుని తత్త్వము కానీ, కనీసము కృష్ణుని గోటి తత్త్వము కాని అర్థము కాలేదు కదా. కావున, రెండు పరస్పర విరోధ పక్షములు ఒకే చోట ఒకే సమయమున సమన్వయింపబడుటయే బ్రహ్మలక్షణమని ఊహించవలయును.

శ్లో॥ అష్టసిద్ధే రతీతోఽహ, మాకాశనియతే రపి
అల్పో భూయా న్నిరాకార, స్స్యాం చా వికృతరూపవాన్॥ 39

తా॥ ఆకాశధర్మములకు అతీతుడగు నేను నానంకల్పమాత్రమున చిన్నవానిగను, పెద్దవానిగను, నిరాకారుని గను కనిపించగలను. అష్టసిద్ధులు గల వారిట్లు కనిపించలేదు. వారు చిన్నవారుగా కనిపించవలయునన్న వారి రూపములను సంక్షేపించుకొనవలయును. పెద్దవారిగా కనిపించవలయునన్న వారి రూపములను పెంచుకొనవలయును.నిరాకారముగా కనిపించవలయునన్న వారి రూపములు మార్పు



చెందవలయును. నేను ఎట్టిమార్పు లేక ఒకే సమయమున పెద్దగా, చిన్నగా, నిరాకారముగను, కనిపించగలను. కాన, నా మహత్మ్యము అష్టసిద్ధులను అతిశయించినది. అష్టసిద్ధులు ఆకాశ నియమాలకు లొంగినవి. నేను ఆకాశ నియమాలకు అతీతుడను. కాన ఇప్పుడు నీవు దర్శించుచున్న త్రిముఖ షడ్భుజ రూపమే పరబ్రహ్మమని తెలియుము. ఇదే నా తత్త్వము.

శ్లో॥ మయా దత్తా ఇమాః కుర్యా, మహమేవ సుతే యశః
న జానతేఽప్యహన్తా చ, పితుర్హాస్యా శిశోరివ॥ 40

తా॥ ఈ అష్టసిద్ధులు నాచే భక్తులకు ఈయబడిన వరములు. అసలు ఈ సిద్ధులలో కూడ చేయువాడను నేనే. అయితే నాపుత్రుడగు నాభక్తునకు, వాడు చేసినట్లు కీర్తి నిచ్చుచున్నాను. చూచువారికి నేను కనపడను కాన, నా భక్తుడే చేసినట్లు భావించుదురు. నా భక్తుడు కూడ ఒక్కొక్కసారి, తానే చేసినట్లు భావించి అహంకరించును. నేను అట్టి భక్తుని చూచి పసిపిల్లవాని మాటలకు తండ్రి నవ్వినట్లు నవ్వుచుందును.

శ్లో॥ న జగత్కర్మణో ర్మోక్షో, మమ కావ్య మిదం జగత్
న హి నిన్దాం స్వకావ్యస్య, స్వనిన్దాం సహతే కవిః॥ 41

తా॥ జగత్తు నుండి కానీ, కర్మ నుండి కానీ, మోక్షములేదు. ఈ జగత్తు అంతయు కవియగు నేను సృష్టించిన కావ్యమే. కవి యొక్క కర్మయే కావ్యము. కవి తన నిందనైననూ సహించును కానీ, తన కావ్యమును నిందించిన సహించడు గదా.

శ్లో॥ విరక్త స్స్వార్థ భఙ్గేన, స్వకర్మణ్యలసోఽబలః
జగత్తుచ్ఛ మితి బ్రూతే, శివం పరమసున్దరమ్॥ 42

తా॥ జీవుడు తన స్వార్థము నెరవేరనందున విరక్తుడై తన కర్తవ్యమును పాలించుటలో, సోమరితనము వలన అశక్తుడై "ఈ జగత్తు తుచ్ఛము" అని అంటున్నాడు. కాని ఈ జగత్తు తుచ్ఛము కాదు. ఇది అతి సుందరము. మంగళకరమైనది.

శ్లో॥ త్యాజ్యా స్వార్థమితా బుద్ధి, ర్న త్యాజ్యం కర్మ వా జగత్
అజ్ఞానం బన్ధ మాహుశ్చ, జ్ఞానం మోక్షం మనీషిణః॥ 43

తా॥ కనుక జీవుడు స్వార్థముతో పరిమితమైన తన బుద్ధిని త్యజించవలెనే తప్ప, త్యజించవలసినది కర్మ కాదు - జగత్తూ కాదు. అజ్ఞానమే బంధము. జ్ఞానమే మోక్షమని పండితులు కూడా చెప్పియున్నారు గదా.

శ్లో॥ నాస్తి ప్రాగపి కిఞ్చిచ్చ, వర్తే తేదం సదా జగత్
మమ లీలావినోదాయ, న స్యాదిచ్ఛామి చే దహమ్. 44

తా॥ ఈ జగత్తు సృష్టింపబడక ముందు ఏమాత్రమూ లేదు. అయితే, సృష్టించబడినది. నా లీలా వినోదములకు ఈ జగత్తు నిత్యము ఉండును. నేను సంకల్పిస్తే మరల ఏమాత్రము లేకుండా పోగలదు. కానీ, వినోదము నిచ్చు ఈ జగత్తు ను ఏల అంతము చేయవలెను?

శ్లో॥ యోగ నిద్రా సమేతశ్చే, ద్విరక్తోZహ మిదం జగత్
మమ కార్య మహద్బ్రహ్మ మాయా శక్తి స్తుధారయేత్॥ 45

తా॥ నేను విరక్తుడనై యోగనిద్రతో కూడినప్పుడు, నా మాయాశక్తి యగు " కార్య బ్రహ్మ" లేక "మహద్బ్రహ్మ" ఈజగత్తును ధరించగలదు.

శ్లో॥ భూతదర్పణగం రూపం, యథా భూరి హి దృశ్యతే
కార్య బ్రహ్మస్య రూపస్య, ప్రతిబిమ్బం మహత్తథా॥ 46

తా॥ భూత-అద్దములో నీరూపము ఎలా పెద్దదిగా కనపడునో, అదే విధముగా నా ఈ రూపము యొక్క పెద్దది యగు ప్రతిబింబరూపమే "మహత్" అనబడు ఈ కార్య బ్రహ్మము.

శ్లో॥ యథా జీవస్య నిద్రాయాం, చిత్తే విషయవజ్జగత్
తథా మమ మహా ZZ కృత్యా, మవ్యక్తం సూక్ష్మవల్లయే. 47

తా॥ ఏ విధంగా, జీవుడు నిద్రించుచుండగా, వాని చిత్తము ఈ విషయాత్మకమైన జగత్తునంతా సూక్ష్మ రూపముగా ధరించి యుండునో, అదేవిధంగా, నాయొక్క మహారూపమైన కార్యబ్రహ్మము కూడా సూక్ష్మరూపమైన అవ్యక్తమైన స్థితిని పొందిన జగత్తును ధరించి ఉండును. ఇదే ప్రళయమని అందురు.



శ్లో॥ వినాZZకాశం చతుర్భూత, మరూపం తేజ ఏవ చిత్
కార్య బ్రహ్మణి సంలీన, మాకాశే ప్రళయో హి సః॥ 48

తా॥ ఆకాశము తప్ప మిగిలిన నాలుగు భూతములు అనగా భూమి, జలము, అగ్ని, వాయువులు తమ రూపములను కోల్పోయి, అంతయును చైతన్యమైన తేజస్సుగా మారును. ఈ తేజస్సు ఆకాశముతో కూడియున్న కార్యబ్రహ్మము నందు లీనమగును. ఇదే ప్రళయము. ఇందులో ఆకాశముతో కూడిన కార్యబ్రహ్మము మిగిలియుండును.

శ్లో॥ అకాశ ధారకం కార్య-బ్రహ్మ శిష్టం మహా ZZ కృతి
మమైవ మయి లీనం చే, త్సాకాశం స మహాలయః॥ 49

తా॥ ఆకాశమును ధరించియున్న ఈ కార్య బ్రహ్మము నా యొక్క మహారూపమే. ఈ కార్యబ్రహ్మము, ఆకాశముతోపాటు నాయందు లీనమైనప్పుడు, అదే మహా ప్రళయ మందురు.

శ్లో॥ కార్య బ్రహ్మ తథా యుక్తం, కారణ బ్రహ్మణా మయా
యోగ పూర్వక నిద్రేయం, యోగనిద్రేతి చోచ్యతే.॥ 50

తా॥ కారణబ్రహ్మ మైన నాయందు ఆ విధముగా కార్యబ్రహ్మము నాతో యోగము చెందిన తర్వాత నేను నిద్రింతును కాన, దీనిని యోగనిద్ర అందురు.

శ్లో॥ ఉత్థాస్యామి యదా కార్య-బ్రహ్మోత్థాస్యతి తత్తదా
సాకాశం తేజసా సాక, మాకారైశ్శేష భూతజైః ॥ 51

తా॥ నేను నిద్రనుండి లేవగనే, నాతోపాటు, ఈ కార్యబ్రహ్మము, ఆకాశము, చైతన్య తేజస్సు, మిగిలిన నాలుగు భూతములు, వాటి కార్యరూపములగు జగత్తు క్రమముగా లేచుచున్నవి.

శ్లో॥ మాయాశబ్దో విచిత్రార్థే, కారణ బ్రహ్మణి స్మృతః
మాయా శబ్దో హ్యసత్యార్థే, కార్య బ్రహ్మణి యుజ్యతే.॥ 52

తా॥ "మాయా" అను శబ్దమునకు, "విచిత్రమైనది" అను అర్థమున్నప్పుడు కారణ బ్రహ్మమునకు అది చెప్పబడును. అదే శబ్దము, "అసత్యము" అని చెప్పబడినప్పుడు, కార్యబ్రహ్మములో ఉపయోగించబడును.

శ్లో॥ సామర్థ్యం మే నిరాకారం, మాయా మాహుశ్చ సాZ ప్యహమ్
సో Z కరోదితి లోకోక్తి, శ్శక్తిశ్చక్రే Z స్యహీతి నో ॥ 53

తా॥ నా సామర్థ్యము అనగా శక్తి నిరాకారము. దీనినే "మాయ" అందురు. ఆ మాయయు నేనే. "అతడు ఆ పనిని చేసెను" అందురు కాని "అతడి శక్తి ఆ పనిని చేసెను" అని అనరుగదా. కనుక, తనకు-తన శక్తి వేరుకాదు. ఈ సామర్థ్యమునే శక్తి, మాయ, బ్రహ్మము అని పిలతురు.

శ్లో॥ జగత్సృష్టి స్థితి ధ్వంస-సామర్థ్యం బ్రహ్మ యత్త్వహమ్
అగ్నిర్దహతి దాహోహి-నాగ్నే రన్యస్య విద్యతే॥ 54

తా॥ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయు సామర్థ్యము బ్రహ్మము. అది నేనే. అగ్ని ఎల్లప్పుడు దహించును. అగ్ని తప్ప ఇతర వస్తువు దహించలేదుగదా. అగ్ని, దహనశక్తి వేరు కానట్లు నేను-నామాయ వేరుకాము.

శ్లో॥ జీవస్య సత్యమేవేదం, కార్యబ్రహ్మ మమాప్యసత్
అసత్యస్య హ్యసత్యం స్యా, త్సత్యం నాసత్య మేవహి ॥ 55

తా॥ ఈ కార్యబ్రహ్మము నా దృష్టిలో అసత్యమైననూ, జీవుని దృష్టిలో సత్యమే. అసత్యమునకు, అసత్యము సత్యమే అగును కాని, అసత్యము కాదు.

శ్లో॥ కార్యబ్రహ్మణ ఏవాంశో, జీవో Z సత్యో దృశా మమ
జీవస్య తు జగత్సత్యం, కార్యబ్రహ్మ Z స్యధారకమ్॥ 56

తా॥ కార్య బ్రహ్మము యొక్క భాగమే జీవుడు. నా దృష్టిలో కార్యబ్రహ్మము, జీవుడు అసత్యములే. జీవునికి జీవుని దృష్టిలో జగత్తు, జగత్తును ధరించిన కార్యబ్రహ్మమూ సత్యమే.



శ్లో॥ కుడ్యం ప్రవిశ్య గచ్ఛామి, తథా జీవో న గచ్ఛతి
అసత్యేన హి రుద్ధం స్యా, దసత్యం న హి స త్తథా. 57

తా॥ అసత్యమైన గోడ, సత్యమైన నాకు అసత్యమే కాన ఈ జగత్తులో గోడలో నుండి దూరి రెండవ వైపుకు పోగలను. కానీ, అసత్యమైన గోడ, అసత్యమైన జీవునకు సత్యము కావున జీవుని నిరోధించుచున్నది. అందువలన జీవుడు గోడలో నుండి దూరిపోలేడు.

శ్లో॥ సర్వం సత్యం హి జీవస్య, నిత్యా నిత్య మిదం జగత్
జీవ భూతాని నిత్యాని, న నిత్యో రూప సఞ్చయః॥. 58

తా॥ జీవునకు ఈ జగత్తు అంతయు సత్యమే. ఈ జగత్తులో కొన్ని నిత్యములు, కొన్ని అనిత్యములు ఉన్నవి. పంచ భూతములు, జీవుడు నిత్యములు. ఈ జగత్తులోని వస్తురూపములన్నియును అనిత్యములు.

శ్లో॥ శాస్త్ర కారేణ జీవాయ, జీవదృష్ట్యోపదేశతః
సర్వం భాష్యం, జగత్సత్యం, జీవస్సత్య ఇతి ద్వయమ్. 59

తా॥ శాస్త్రకారుడైన ఆచార్యుడు శాస్త్రమును జీవునకు ఉపదేశించుట చేయునుకాన, జీవుని దృష్ట్యా మాట్లాడవలయును. జీవుడూ-జగత్తూ రెండూ సత్యమేనని బోధించవలయును.

శ్లో॥ అల్పం జగ దసత్యం మే, తదంశో Z ల్పతమో హ్యయమ్
అసతో జగతో జీవో, మూఢోZసత్యతమో మతః ॥ .60

తా॥ నాకు ఒక కణమువలె అల్పమైనది కాన ఈ జగత్తు అసత్యము. ఈ జగత్తు యొక్క ఒక కణభాగమగు ఈ మూఢ జీవుడు అత్యంతాల్పుడు కాన అసత్యతముడు. అనగా జగత్తు కన్ననూ ఇంకా అసత్యమైన వాడు అని అర్థము.

శ్రీ దత్త శిష్య ఉవాచ :-

శ్లో॥ నిరాకారోZసివాZZ కారో? దర్పణం కిం త్వాకృతేః
త్వద్భిన్నం సత్య మేవ స్యాత్, ప్రతిబిమ్బ మసద్యది॥ 61

శ్రీ దత్త శిష్యుడు వచించెను :

తా॥ నీవు నిరాకారుడివా? లేక ఆకారమా? నీ అకారము యొక్క ప్రతిబింబమే కార్యబ్రహ్మము అన్నావు కదా! ఆ ప్రతిబింబము నీ దృష్ట్యా అసత్యమే అన్నావు. నీ ప్రతిబింబమును ధరించు అద్దము ఏది? వ్యక్తియు, అద్దము సత్యములే కావలయునుకదా. ప్రతిబింబమే అసత్యము. వ్యక్తి కన్న అద్దము భిన్నముగా ఉండవలయును. కాన, నీ కన్న భిన్నమైన సత్యము ఉన్నదనియే కదా.

శ్లో॥ ఇదం జగదస చ్చే త్తే, కథం పశ్యసి కిం ను వా?
అదృష్టే నో వినోద స్తే, సత్యం చే ద్దృశ్యతే జగత్ ॥ 62

తా॥ ఈ జగత్తు నీకు అసత్యమైనచో, నీవు దేనిని ఎట్లు చూచుచూ వినోదమును పొందుచున్నావు? అసత్యము కనిపించదు కదా. కనిపించనిచో నీకు వినోదము ఉండదు గదా. సత్యమైనచో, జగత్తు కనిపించి వినోదము నిచ్చునుగదా.

శ్లో॥ శ్రీ దత్త భగవ న్దేవ! పృచ్ఛా మ్యజ్ఞాన కారణాత్
న దృష్టో న శ్రుతో Z ప్యేవం, వక్తా జ్ఞానార్ణవో గురుః॥ 63

తా॥ శ్రీ దత్త దేవా! భగవానుడా!

అజ్ఞానము వలన ఈ ప్రశ్నలను అడుగుచున్నాను. నీవంటి జ్ఞాన సముద్రుడగు గురువునూ, ఈ విధముగా వివరించు ఆచార్యునీ ఇంతవరకు చూచుటయే కాదు! కనీసము విననుగూడా వినలేదు.

శ్రీ దత్తగురు భగవానువాచ :-

శ్లో॥ బిమ్బస్య ప్రతిబిమ్బస్య, దర్పణస్య చ తత్త్వతః
పదార్థ జడశక్తి స్స్యా, కేవలేతి నవా న్మతాత్॥ 64

తా॥ శ్రీ దత్త భగవానుదు వచించెను.

బింబమైన వస్తువు, అద్దము, ప్రతి బింబము - ఈ మూడును జడశక్తి యొక్క రూపాంతరములే ననియూ, ఒకే పదార్థము అనియూ నవీన భౌతిక విజ్ఞాన మతము ప్రకారము సిద్ధము గదా.



శ్లో॥ కార్య బ్రహ్మ ప్రతిచ్ఛాయా, మాయా దర్పణ మప్యహమ్
బిమ్బో Z పి తత్త్వతో హ్యేక, స్సర్వం దత్తమయం త్రయమ్. 65

తా॥ ప్రతిబింబమగు కార్యబ్రహ్మము, మాయ అనెడి అద్దము, అసలు బింబమైన నేను - ఈ మూడు తత్త్వపరంగా ఒక్కటే. ఈ మూడును మొత్తము దత్తమయమే.

శ్లో॥ ప్రబుద్ధో భావ రూపాణి, యథా మనసి పశ్యతి
ద్రష్టా యవనికా దృశ్య, మేకం చైతన్యమేవ తత్॥ 67

తా॥ మేల్కొనినవాడు, తనమనస్సులో ఏవిధంగా తన భావములనే రూపములుగా చూచునో, అట్లే నేను కూడ జగత్తును చూచి వినోదింతును. ఇచట చూచువాడు, మనస్సు అను తెరయు, దానిలోని ప్రతిబింబించిన భావరూపములూ మూడునూ ఒక్క చైతన్యమే కదా.

శ్లో॥ యత స్సత్య మిదం నాస్తి, వినోద స్తత ఏవహి
వినోద ఊహ శార్దూలా, త్సత్యా ద్దుఃఖం మహాభయమ్॥ 68

తా॥ ఈ జగత్తు నాకు సత్యము కాదు. అందువలన నేను వినోదమును పొందుదును. ఎట్లు అనగా, ఊహాత్మకమైన పులిని చూచిన వినోదము కలిగినట్లుగా, అదే నిజమైన పులిని చూచిన దుఃఖము, చాల భయము కలుగుచున్నది కదా!

శ్లో॥ మనుష్య స్స్వాప్నికో Z సత్య, స్స్వాప్నిక వ్యాఘ్ర దుఃఖితః
అసత్యో Z య మసత్యేన, జీవో Z యం జగతా క్షతః॥ 69

తా॥ స్వప్నములో విహరించే మనిషి అసత్యము. అతడు అసత్యమైన పులిని చూచి దుఃఖించుచున్నాడు. జీవుడూ అసత్యమే. జగత్తు అసత్యమే. కాన అసత్యమైన జీవునకు అసత్యమైన జగత్తు సత్యమగుటచేత జీవుడు బాధితుడగుచున్నాడు.

శ్లో॥ సత్యో Z యం జాగరూకోహి, భావవ్యాఘ్ర వినోదవాన్
ఆద్యోజీవః పరోదత్తః, భిన్నౌ తౌ తత్త్వ కేవలౌ॥ 70

తా॥ మేల్కొనియున్నపుడు మనిషి సత్యము. తాను భావించుచున్న పులి రూపము అసత్యము. కాన వినోదించుచున్నాడు. కలలో అసత్యమైన భావరూపమైన మనిషియే జీవుడు. ఇతనికి అసత్యమైన భావరూపమైన పులి సత్యమే అగు చున్నది. కనుక దాని చేత బాధించబడుచున్నాడు. అయితే, ఈ సత్యమైన మనిషి అసత్యమైన భావరూపమైన మనిషి ఇరువురూ తత్త్వపరంగా ఒక్కటేగదా.

శ్లో॥ శక్తిరేకైవ చైతన్యం, సాన్ద్రత్వా ద్ఘనదేహవత్
అసాన్ద్రా స్వాప్నికో జీవో, వ్యాఘ్రుశ్చ ఘన ఏవ చ॥ 71

తా॥ ఒకే జడశక్తి సాంద్రతచెందక ముందు చైతన్యంగాను, సాంద్రత చెందుట వలన ఘనమై దేహముగాను అయినది. సాంద్రత చెందని, ఘనము కాని, శక్తియే, చైతన్యము గదా. ఆ చైతన్యమే స్వప్నములోని జీవుడు. ఆ చైతన్యమే స్వప్నములోని పులి. జీవుని దేహము, నిజమైన పులియు అట్లుకాదు. అవి సాంద్రత చెంది ఘనమైన చైతన్యములు.

శ్లో॥ నాసాన్ద్రం సాన్ద్రమత్యేతి, వాయుశ్శైల మివాబలః
ఘనస్తు ఘన మత్యేతి, శైలం వజ్రాయుధం యథా॥ 72

తా॥ కనుక సాంద్రత చెందక, ఘనము కాని శక్తి (అనగా చైతన్యము) సాంద్రత చెంది ఘనమైన శక్తిని (అనగా శరీరమును) భేదించలేదు. ఘన పదార్థమైన కొండను, ఘనము కాని పదార్థమైన వాయువు భేదించ లేదు. కాని ఘన శక్తిని, ఘనశక్తి అనగా కొండను వజ్రాయుధము భేదించగలదు గదా.

శ్లో॥ సర్వం జగ దిదం జీవై, ర్వాయు శ్చాహం మహాచలః
ఉభౌ చ తత్త్వతో ద్రవ్యం, బలే తు మహదన్తరమ్॥ 73

తా॥ జీవులతో సహా ఈ జగత్తు అంతయును ఒక వాయువు వంటిది. నేను కొండవంటి వాడను. రెండునూ తాత్త్వికంగా పదార్థమైన ద్రవ్యమే. అయినా, బలములో చాల తేడా గలదు గదా.

శ్లో॥ అనేక పాద సూర్యస్య, పాదో విశ్వం హి కేవలః
జడశక్తి స్స చైతన్యా, వాయు రాకృతికారిణీ॥ 74



తా॥ అనేక కిరణములు గల సూర్యునికి ఒక కిరణము ఎంతో, ఈ విశ్వమంతయును నాకు అంతే. కాంతి మొదలగు రూపాలలో ఉన్న జడశక్తియే సాంద్రత జెంది ఘనమై, అనేక రూపములను ధరించుచున్నది. ఈ జడశక్తియే సాంద్రత చెందనిదై చైతన్యముగ నున్నది. ఈ జడ శక్తి యొక్క చైతన్యరూపముతో కూడిన, జడశక్తి యొక్క ఘన రూపమునైన జగత్తు అంతయు వాయువు వంటిది. (కాంత్యాది రూప జడశక్తి, దాని అసాంద్ర చైతన్య రూపము, దాని ఘనమునైన ద్రవ్యములూ మూడు కలసి జగత్తు)

శ్లో॥ సాన్ద్ర వాయు ర్జలం మధ్యే, కార్యబ్రహ్మాZస్య భేదకమ్
సాన్ద్రామ్బు ఘన ఏవాహం, ప్రజ్ఞాన ఘన విశ్రుతః॥ 75

తా॥ వాయువు సాంద్రమైనచో, అది వాయువు కన్న బలమైన ద్రవ్యము అగును. ద్రవ్యమును వాయువు భేదించలేదు. వాయువు తక్కువ బలము కలది కనుక, ద్రవ్యం ద్వారా ప్రసరించలేదు. అట్లే ఈ జడశక్తి సాంద్రమై కార్యబ్రహ్మమగును. జడశక్తి కన్న, కార్యబ్రహ్మము బలమైనది. జడశక్తి వాయువు వంటిది. కార్యబ్రహ్మము దాని కన్న బలమైన జలము వంటిది. జలము కూడా సాంద్రమైన ఘనము అగును. జలము కన్నా సాంద్రమైనది, ఎక్కువ బలము కలది ఘనము. జలమైన కార్య బ్రహ్మము కన్న ఘనమైన నేను ఇంకనూ అధిక బలము కలవాడను. "ప్రజ్ఞానఘనుడు" (ప్రజ్ఞానఘనః) అని శ్రుతి చేత చెప్పబడియున్నాను.

శ్లో॥ యస్మా త్సాన్ద్రతరం నాస్తి, కారణబ్రహ్మ పశ్యసి
నిరాకారోZస్మి చైతన్య, మాకార స్తను రప్యహమ్॥ 76

తా॥ ఈ చైతన్యము ఘనీభవించగా వస్తు రూపమైన జగత్తు ఏర్పడుచున్నది. ఇది ఇంకనూ ఘనీభవించినచో, కార్యబ్రహ్మము అగును. ఈ కార్యబ్రహ్మము ఇంక ఘనీభవించుటకు వీలు కానంతగా ఘనీభవించినదే కారణబ్రహ్మము. ఈ కారణబ్రహ్మమునే నీవు ఇప్పుడు చూచుచున్నావు. నాలో ఉన్న చైతన్యము నేనే కాన, నేను నిరాకారుడను. ఈ తనువు కూడా నేనే కావున ఆకారము కూడా నేనే.

శ్లో॥ తనుస్థే పరమవ్యోమ్ని, బ్రహ్మణి బ్రహ్మమే హి చిత్
సాన్ద్రాసాన్ద్ర దశామేతి, యథోహేషు తనౌ తవ॥ 77

తా॥ నా తనువు ఎంత ఆకాశమును ఆక్రమించినదో అదే పరమవ్యోమము అనగా పరమాకాశము. ఈ పరమవ్యోమము బ్రహ్మమే. ఇందులో నున్న నా మనస్సు అనగా చైతన్యము కూడా బ్రహ్మమే. ఈ పరమ వ్యోమములో, నామనస్సు సాంద్రత్వ చెందుటయు పలుచబడుటయు జరుగును. ఊహలలో కాని, స్వప్నంలో కానీ, నా శరీరము ఆక్రమించిన సత్యమైన ఆకాశము లోనే ఈ చైతన్యము కూడ ఘనీభవించుట-పలుచబడుట యను దశలను పొంది బలముకల రూపములు, బలహీనమైన రూపములు ఏర్పడుచున్నవి కదా! అదే విధముగ నాలో జరుగునని తెలియుము.

శ్లో॥ తన్వాకాశశ్చ తే చిచ్చ, సత్యే తే మేఽపి తే తథా
తే తే మమ నసత్యేహి, సత్యే చాత్యల్పసారతః॥ 78

తా॥ నీ శరీరమునందున్న ఆకాశము, నీశరీరమునందున్న చైతన్యము అనగా మనస్సు నీకు సత్యములే కదా. అట్లే నా తనువులోని ఈ "పరమవ్యోమము" అను ఆకాశము, నా తనువులోని చైతన్యము అనగా మనస్సు నాకును సత్యములే. ఐతే నీ శరీరాకాశము, నీ చైతన్యము నాకు అసత్యములు. అసత్యములనగా అత్యల్పములైన సత్యములనియే అర్థము కాని అత్యంతము అభావములు (బొత్తిగా లేనివి) కావు. అందువల్లనే తాత్త్వికంగా అన్నీ బ్రహ్మమే.

శ్లో॥ అనూహ్యం చైకదా దృశ్యం, శైలవచ్చాణువ త్తవ
పరమవ్యోమ చాహం హి, న భిన్నం భిద్యతే ఽ న్యతః॥ 79

తా॥ ఈ "పరమవ్యోమము" ఒకే సమయంలో కొండంత ప్రమాణంలోను, పరమాణు ప్రమాణంలోను నీకు గోచరించును కాన నీ ఊహకు అందదు. ఈ పరమ వ్యోమము నేనే. ఇది నాలోని ఇతర తత్త్వములగు తేజస్సు మొదలగు వాటి కన్నా భిన్నమయ్యును వాటి కన్న భిన్నము కాదు. నీకు అనూహ్యము.

ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం
శ్రీదత్త పరబ్రహ్మతత్త్వదర్శన యోగో నామ ద్వితీయాధ్యాయః

బ్రహ్మఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## తృతీయాధ్యాయః

## శ్రీదత్త భిన్న జీవ యోగః

శ్రీ దత్త గురు భగవాన్ ఉవాచ:

శ్లో॥ శుద్ధ చైతన్య జీవాః ప్రా,క్కృతే నా సచ్చ తే యతాః
కించాతి భుక్త మధురం, న ప్రీత్యై మే వినోదకృత్. 1

శ్రీదత్త గురు భగవానులు వచించిరి :

తా॥ సృష్ట్యాదిలో అందరి జీవులను శుద్ధ చైతన్యస్వరూపులుగానే సృష్టించితిని. అట్టి జీవులు నాచే నియమితులై నాకు పూర్ణప్రపన్నులైయుండిరి. సృష్టిలో కూడ చెడు అన్నది ఎక్కడనూ లేదు. ఇదే కృతయుగము. కానీ, కొంతకాలము తరువాత నాకు ఎక్కువ కాలము తిన్నమధురము వలె సృష్టివినోదము, ప్రీతికరము కాలేదు.

శ్లో॥ దత్తా స్వేచ్ఛా హి జీవేభ్యో, వేద తద్భావి నాప్యహమ్
వేత్తుం శక్యం వినోదో న, జ్ఞాతే వేద శ్రితావనే॥ 2

తా॥ కాన, జీవులపై నా పట్టు సడలించితిని. వారికి స్వేచ్ఛ నొసగితిని. సృష్టిలో చెడును కూడ సృష్టించితిని. స్వేచ్ఛలో ఇక, నా శాసనము జీవులపై నుండదు. ఎవడేమి చేయునో నాకే తెలియదు. తెలుసుకొనలేకకాదు. తెలుసుకొన్నచో వినోదముండదుగదా. అయితే, నన్ను శరణము చొచ్చిన వారి భవిష్యత్ప్రవర్తనను మాత్రము ముందే తెలుసుకొని వానిని రక్షింతును.

శ్లో॥ దేవా స్సన్తి Z సతా దైత్యా, మిశ్రా మర్త్యా బలం క్వచిత్
దేశ కాలా న్నోపదేశ్యా; ఆద్యో కార్యా నరా స్సురాః॥ 3

తా॥ కొందరు జీవులు ముందు నేను సృష్టించిన మంచియందే నిలిచిరి. కొందరు చెడులోనికి పోయిరి. మరి కొందరు రెండింటి యందు ఉండి, మిశ్రమములుగా ఉండిరి. మొదటి వారు దేవతలు. రెండవవారు రాక్షసులు. మూడవవారు మనుష్యులు. ఈ మానవులలో మంచి చెడులు దేశమును బట్టి, కాలమును బట్టి బలపడి మారుచుండును. పూర్తిగా మంచివారు కాన నా ఉపదేశము దేవతలకు అవసరము లేదు. ఉపదేశించినా మారరు కాన, రాక్షసులకును నాఉపదేశము అనవసరము. మానవులలో కొంత మంచి కొంత చెడు కలసి ఉన్నవి. కాన, ఉపదేశముతో చెడును పోగొట్టి వారిని దేవతలుగా మార్చుటయే నా లక్ష్యము.

శ్లో॥ వేద శాస్త్రై ర్నిషేధామి, మాంసాహారం ఫలప్రదః
ప్రాణాన్తే Z పి సమాః ప్రాణాః, కాలఘ్నస్య మమాగ్రహః॥ 4

తా॥ మాంసాహారమును, వేదములు శాస్త్రముల ద్వారా నేను నిషేధించితిని. నేను అందరు జీవులకును ధాన్య ఫలాది రూపంలో ఆహారమును సృష్టించియే యున్నాను. తన ప్రాణహాని సమయంలో కూడా జీవుడు మరొక జీవుని ప్రాణమును తీయరాదు. ఇరువురి ప్రాణములు సమానమైన విలువ కలవియే కదా. నీవు ఒక జీవుని వధించునపుడు ఆ జీవుని సరియైన అంత్యకాలములో వధించు నా అధికారమును నీవు బలాత్కారముగా లాగుకొని నాకు నీపై ఆగ్రహమును కూడా తెప్పించుచున్నావని తెలియుము.

శ్లో॥ వధ్యః కామపశు శ్రృత్యా, మాంసాహారా అపార్థతః
నివేదయన్తి మే ప్రాక్తే, తుష్టః క్రుద్ధో Z స్మి కర్మణా॥ 5

తా॥ యజ్ఞములలో పశువును వధించమని బోధించినది జీవహింస చేయమనికాదు. నీలోని పశుస్వభావము అగు కోరికను వధించుమనియే దీని భావము. "కామఃపశుః" అని శ్రుతి. దీనిని మాంసాహారులు, అపార్థము చేసుకొని వారు తినుటకు ముందు మాంసాహారమును నాయందు భక్తి శ్రద్ధలతో, నాకు నివేదనగా అగ్ని ద్వారా సమర్పించుచున్నారు. వారి సమర్పణా శ్రద్ధకు ప్రీతుడనయ్యును, వారి జీవహింసకు క్రోధముతోనే యుందును.



శ్లో॥ న గీతం సత్త్వ ధర్మాయ, తమో భీమాయ నో మయా
జ్ఞానాజ్ఞానాయ పార్థాయ, నరాయైవ రజోవతే॥ 6

తా॥ సత్త్వగుణ దేవతారూపుడైన ధర్మరాజుకు గానీ, అసుర తమోగుణరూపుడైన భీమునకు గానీ నేను పూర్వము భగవద్గీతను చెప్పలేదు. కొంత తెలిసి, కొంత తెలియని, మంచి చెడుల మిశ్రమమైన రజోగుణియగు నరునికే అనగా అర్జునునికే గీతను చెప్పితిని.

శ్లో॥ గురోః క్లేశో మహానేష, జ్ఞాత్వా కిఞ్చి దహన్తయా
న శృణోతి పరం వక్తా, గురుం శిష్యం కరోతి హి॥ 7

తా॥ నరుని, లక్ష్యము వద్దకు చేర్చుట చాల కష్టము కాన, గురువైన నేను ఎన్నో అవస్థలను పడుచున్నాను. నరుడు పూర్తిగా తెలియనివాడు. కొంత తెలియగనే, తాను సర్వజ్ఞుడనని అహంకరించి, తరువాత చెప్పునది వినడు. ఆ కొంత తెలుసుకొను నంత వరకు వినయమును చూపును. ఆ కొంత తెలియగనే అహంకరించి, మిగిలినది వినకుండ, గురువుకే బోధించుచు, గురువునే తన శిష్యునిగా కమ్మని ఆదేశించు చిత్ర ప్రవృత్తి కలవాడు.

శ్లో॥ పరా భాగో హి జీవో Z య, మపరా చ పరా జగత్
జగత్కణో Z ప్యసచ్చైష, సద సచ్చా సతో Z ప్యసత్॥ 8

తా॥ ఈ జగత్తు పరా- అపరా అను రెండు భాగములతో చైతన్య - జడములుగా నున్నది గదా. ఇందులో పరాభాగమే ఈ జీవుడు. ఈ జీవుడు జగత్తులోని ఒక కణము. సత్యమైన నాకు అసత్యమైన అల్పమైన ఈ జగత్తులోని భాగమగు జీవుడును నాకు అసత్యమే. అనగా స్వల్పుడే. అసత్యమైన జీవునకు అసత్యమైన జగత్తు సత్యమే అగును.

శ్లో॥ పరా చైతన్య జీవో హి, శివలిఙ్గం తరఙ్గవత్
అపరా రూపవ త్స్వాఙ్గో, విష్ణు స్త్రి హి చరాచరే. 9

తా॥ పరాప్రకృతియే చైతన్యము. ఇది తరంగాకారములో నున్న శక్తి. ఈ తరంగాకారమే శివుడు. లింగాకారమున సూచింపబడినాడు. ఇతడే జీవుడు. ఇక ఆకారము కల దేహమే

అపరాప్రకృతి. ఇదే విష్ణువు. అకారముతో విష్ణువు పూజింపబడుట, లింగాకారముతో శివుడు పూజింపబడుట యనగా, ఇదే కాన తరంగాకార శక్తియే శివుడు. కణాకార ద్రవ్యమే విష్ణువు. ఈ ఇరువురు, శివకేశవులు, అన్ని పదార్థాలలోను (జడములు, ప్రాణులలోను) ఉన్నారు.

శ్లో॥ క్రియా సూక్ష్మా శివో వీచి, ర్విష్ణు స్థ్సూలాణ్వ గోచరః
అన్యోన్య పరిణామో Z య, మద్వైతం ప్రకృతి ర్ద్విధా॥ 10

తా॥ తరంగ రూప లింగాకారంతో సూచింపబడే శివుడే సూక్ష్మశరీరమైన క్రియా రూపమైన శక్తితో కూడిన సూక్ష్మకణ చైతన్య తత్త్వము. ఇక కంటికి కనిపించే ఘనీభూత చైతన్యమైన, అవయవములతో కూడిన, ద్రవ్యమైన, స్థూలశరీరమే (అనగా సూక్ష్మకణ సంఘాతమే)విష్ణువు. స్థూలద్రవ్యము, క్రియావేగంతో కూడిన సూక్ష్మకణములుగా (శక్తిగా) మారగలదు. అట్లే శక్తి, ద్రవ్యముగా మారగలదు. ఈ అన్యోన్యపరిణామమును సూచించుటయే శివకేశవుల యొక్క అద్వైతము. ఈ శివుడే పరాప్రకృతి. ఈ విష్ణువే అపరాప్రకృతి. ఈ రెండు ప్రకృతులు అన్యోన్య పరిణామము కలవి. ఈ రెండూ కలిసిన ప్రకృతి సిద్ధించును.

శ్లో॥ పరిణామాంత్యదూరే చి, త్ప్రాప్తస్వేచ్ఛా త్రయక్రియామ్
నిశ్చినోతి గ్రహ స్మృత్యా, సా చిత్తం గీయతే పృథక్॥ 11

తా॥ పరాప్రకృతియగు జీవుడు అన్నరసపరిణామమే కానీ, అన్న తత్త్వానికి చాలా దూరంగా ఉంటుంది. ఇది అంత్యపరిణామము. నాచే దత్తమైన స్వేచ్ఛ కలిగి ఒక విషయమును గ్రహించుట, వికల్పించుట, నిశ్చయించుట, నేను అను స్ఫురణను కలుగ చేయుట అను పనులను చిత్ - చిత్తరూపు డైన జీవుడే చేయుచున్నాడు. అనగా ఒక విషయమును తర్కించు క్రియయగు మనస్సు, నిశ్చయించు క్రియయగు బుద్ధి, నేను అను స్ఫురణ క్రియ యగు అహంకారము - ఈ మూడు జీవుని ఇష్టానుసారమే జరుగుచున్నవి. కాన చిత్- చిత్త - జీవుని ఆధీనములోనే ఈ మూడు ఉన్నవి. కాన అపరాప్రకృతిలో చేరినవి. ఈ శుద్ధ చైతన్యమైన జీవుడే విషయములను గ్రహించి, ధారణ చేసి, స్మృతికి అందించు వ్యవస్థలో చిత్తమనబడుచున్నాడు. నాచే దత్తమైన స్వేచ్ఛ గలిగినందున ప్రత్యేకత కలది యగు ఈ చిత్తమే పరాప్రకృతిగా, జీవునిగా భగవద్గీతలో చెప్పబడినది. (గీతలో మనోబుద్ధ్యహంకారములను అపరాప్రకృతిలో చేర్చి, "ప్రకృతిం విద్ధి మే పరామ్" అని చిత్తము పరాప్రకృతిగా చెప్పబడినది).



శ్లో॥ నిద్రాయాం ధార్యతే సర్వం, జగచ్చిత్తేన గీయతే
న సృష్టి ధారణం తత్తు, నానాజన్మగ్రహం హి తత్॥ 12

తా॥ ఈ శుద్ధ చైతన్యమే బాహ్య విషయములను తన స్వేచ్ఛ వలన, గ్రహించుచున్నది. తన స్వేచ్ఛ వలన, తన కిష్టమైన విషయములను ధారణము చేసి మరల స్మృతికి తెచ్చుచు చిత్తమనబడుచున్నది. తన కిష్టముగాని విషయములను ధ్వంసము చేసి మరచిపోవుచున్నది. నిద్రాసమయమున, తన కిష్టమైన సర్వ బాహ్యవిషయములను (విషయజగత్తు) ధారణము చేసి, నిద్రలేవగనే స్మరణమునకు తెచ్చుచున్నది అను అర్థముతోనే " జగత్తును ధరించుచున్నది"అని చెప్పబడినది కాని, చిత్తము నిజముగా, బ్రహ్మము వలె, ఈ సృష్టిని నిలుపుచున్నది అని అర్థము కాదు. ఈ చిత్తము అనేక జన్మల బలమైన వాసనలను తనలో ధారణము చేసుకొని యున్నది. అనియే అర్థము ("యయేదం ధార్యతే జగత్" గీత)

శ్లో॥ అతః ప్రాణో ఘన స్థూల, స్తీవ్ర భోక్తా మనోమయః
మనోమయః ప్రాణతను, రిత్యామ్నాయా దగోచరః॥ 13

తా॥ చైతన్యము ఘనీభవించి అవయవములతో నున్న కనిపించునట్టి శరీరముగా మారినది. ఇదే స్థూల శరీరము. సూక్ష్మశరీరము కంటికి కనిపించని చైతన్యము (మనోమయము). కావున సూక్ష్మశరీరము తాను అనుభవించు సుఖ దుఃఖ భోగములను చాలా తీవ్రముగా గ్రహించును. "మనోమయః ప్రాణ శరీరనేతా" అని శ్రుతి. అనగా మనోమయుడు ప్రాణశరీరమును కొనిపోవువాడు అని అర్థము.

శ్లో॥ జడక్రియా త్రయం పఞ్చ - భూతాన్నా దపరా జడే
వికల్పధారణస్ఫూర్తి - క్రియాన్తః కరణ త్రయమ్॥ 14

తా॥ జీవుడు తిను పంచభూతమయమైన అన్నము, క్రమముగా మనస్సు. బుద్ధి, అహంకారములుగా మారుతుంది. ఇదే అపరాప్రకృతి. అందువల్లనే అపరాప్రకృతిలో పంచ భూతములు కూడా చేర్చబడినవి. ఈ మూడు అంతః కరణములు స్వేచ్ఛలేక, కేవలము జడములుగా క్రియాతత్త్వాలుగా ఉంటాయి. సంకల్ప, వికల్పాలనే క్రియలు మనస్సు. ఒకదానిని నిశ్చయపరచి ధారణ చేయు క్రియయే బుద్ధి. నేను, నేను అను నిత్యస్ఫురణ క్రియయే అహంకారము. కాన జడమైన అపరాప్రకృతి లోనే చేర్చబడినది.

శ్లో॥ గ్రహణం ధారణం ధ్వంసః, కర్మ చి చ్చిత్తవస్తునః
పరాజీవస్య చ మనో, బుద్ధ్యహఙ్కార కర్మ హి. 15

తా॥ ఒక విషయమును గ్రహించుట, దానిని ధారణము చేయుట, దానిని విలీనము చేయుట అను మూడు కర్మలే "చిత్" లేక చైతన్య స్వరూపము. ఈ మూడు పనులను చిత్తమే చేయుచున్నది. "చిత్" కు "చిత్తము" నకు తేడాలేదు. ఈ "చిత్" లేక చిత్తమే పరాప్రకృతి, జీవుడు. ఇక మనస్సు - బుద్ధి -అహంకారము అపరాప్రకృతి వర్గములోనివి. ధారణము చేసి, స్మృతికి తెచ్చుచిత్తమే చైతన్యము లేక పరాప్రకృతి. ఈ చిత్తము యొక్క విశేష క్రియలే మనస్సు - బుద్ధి - అహంకారాలు. కనుక, సారాంశమేమనగా -
చిత్ - పరాప్రకృతి - లేక జీవుడు (కర్మ స్వరూపము)
మనస్సు - బుద్ధి, అహంకారము :- అపరాప్రకృతి (పరాప్రకృతి అధీన కర్మలు)

శ్లో॥ లీనం త్రయం హి తత్స్వాపే, ధారణ క్రియయా కణాః
తత్క్రియా ముక్త చైతన్యం, కాన్తివ ద్వేగవ త్కణాః॥ 16

తా॥ నిద్రలో మనస్సు, బుద్ధి, అహంకారము కూడా చిత్తము నందే లయించును. చిత్తము కేవలము విషయములను ధారణము చేయు క్రియతో కూడిన సూక్ష్మ ద్రవ్య కణరూపములో ఉండును. ఈ ధారణక్రియను చిత్తము వదలివేసినచో చిత్తమే శుద్ధచైతన్యమగును. అప్పుడు ఆ చైతన్యము కేవలం జడశక్తి యగు కాంతి రూపముగనే ఉంటుంది. అంటే అతి వేగముతో చలించు సూక్ష్మద్రవ్యకణాల రూపంలోనే ఉంటుంది.ఈ అవస్థలో చైతన్యానికి, తేజస్సుకూ, తేడా లేదు. అంటే కేవలము విషయములను'గ్రహించుట, తర్కించుట, నిశ్చయించుట, నేను అను స్ఫురణము అను క్రియలు నాలుగు జరగనిచో చైతన్యమునకూ, జడతేజస్సుకు ఏ తేడా లేదు.

శ్లో॥ సుషుప్త్యాం ఘన చిత్తాను-వృతచైతన్య వారి హి
అన్నసారో Z గ్రహో Z ధర్తా, శుద్ధచిద్వృత ఉచ్యతామ్॥ 17

తా॥ నిద్రలో అనగా స్వప్నాదులగు క్రియలను కూడా చేయని సుషుప్తిలో, అన్నరసము నుండి పుట్టిన శుద్ధచైతన్యశక్తి, ఏవిషయములనూ గ్రహించక, బలమైన వాసనలతో గట్టిపడిన మంచు ముక్కవలెనున్న చిత్తమును ఆవరించి, ఏ వాసనలు లేక స్వచ్ఛమైన నీటి వలె నుండును. అట్టి అవస్థలో ఈ జలమువలెనున్న శుద్ధ చైతన్యమే 'శుద్ధచిత్'.



అయితే, ఈ శుద్ధచైతన్యము అను నీరు మధ్యలో అనేక జన్మల బలమైన విషయములతో ఘనావస్థలో నున్న చిత్తము అను జీవుడు కలడు కాన సుషుప్తిలో జీవుడు, శుద్ధ చైతన్యమైనాడు అనరాదు. కేవలము శుద్ధ చైతన్యముతో ఆవరించబడినాడు అనియే అనవలెను.

శ్లో॥ కర్తా Z హ మపి దౌర్బల్యం, ద్రవ్యస్య క్రియయా తతః
ఉత్థానే బల సౌఖ్యం చి, చ్చిత్తాయ ప్రదదాతి చ॥ 18

తా॥ కర్తను నేనే అయినప్పటికీ, జీవుని స్వాతంత్ర్యమువలన చేయు క్రియలవలన ద్రవ్యము బలహీనమగును. కాన సుషుప్తిలో, క్రియా రాహిత్యము వలన శుద్ధ చైతన్యము బలము కలిగి చిత్తరూపుడగు జీవునకు సుఖమునందించును. అందుకే సుషుప్తి నుండి లేవగానే, బలమైన చైతన్యముతో కూడిన సుఖానుభవమును జీవుడు పొందుచున్నాడు.

శ్లో॥ చిత్తానుజ్ఞోత్థితా Zహన్తా - సుఖసన్ధాన తద్గ్రహః
ఇష్టాను స్మృతి మనన - నిశ్చయాచ్చ మనోధియః॥ 19

తా॥ నిద్ర నుండి లేవగనే, చిత్తము యొక్క అనుజ్ఞ చేత అహంకారము లేచును. అనగా చిత్తము అహంకారక్రియను అరంభించును. ఆ "నేను" కు ఈ సుఖము అందించబడగా "నేను సుఖముగా నున్నాను".అని జీవుడు భావించుచున్నాడు. అంతే కాక, నిద్రానమయమున దాచిన బలమైన వాసనలను గూడ చిత్తము, తన ఇష్టానుసారముగా "నేను" కు అందించగా, జీవుడు విషయములను స్మరించుచున్నాడు. అదే చిత్తము - వికల్పము - నిశ్చయములను చేయగా, మనస్సు-బుద్ధి కూడ ఉద్భవించుచున్నవి.,

శ్లో॥ స్థూలం మలం తమో మాంస-రక్తం సూక్ష్మం రజోయుతమ్
ప్రాణదగ్ధ మహాసూక్ష్మ-సారసత్త్వం చితో బలమ్॥ 20

తా॥ ఈ జలరూపంగా ఉన్న శుద్ధ చైతన్యము, అన్నరసశక్తితో బలపడుతుంది. స్థూలకణరూపంలో అన్న శేషము మలరూపంలో విసర్జింపబడుతుంది. ఇదే తమస్సు. ఇక అన్నరసము అత్యంత సూక్ష్మరసరూపంలో మాంసరక్తాది రూపంలో శరీరములో చేరుకుంటుంది. ఈ సూక్ష్మకణాలలో బాగా చిన్న ధూళి కణాల వంటిది రజోగుణము.

ఇక అత్యంత సూక్ష్మ కణ రూపంలోకి, ప్రాణవాయుసంయోగం చేత దహనమై మారే అన్నసారమే సత్త్వము. ఈ సత్త్వము వల్లనే శుద్ధ చైతన్యము బలపడును.

శ్లో॥ అనిత్య గ్రహణా ద్యా చి, ద్బలస్ఫోటేన చిత్తగా
చిత్తం వజ్రం జలద్వీప-జీవస్ఫోటః క్రియాగుణః॥ 21

తా॥ ఈ శుద్ధచైతన్యమే, నిత్యజీవితంలోని విషయాలను తాత్కాలికంగా గ్రహించి, తాత్కాలికంగా ధారణలచేసి వాటిని ధ్వంసం చేస్తుంది. కానీ, విషయాలలో అత్యంతము ఇష్టమైన వాటిని నిత్యధారణముచేస్తూ ఒక స్ఫోటరూపములో చిత్తం లోకి చేరుతుంది. ఈ చిత్తము చైతన్య జలమధ్యద్వీపము లాగా వాసనలస్ఫోటాలతో ఘనీభవించి వజ్రంలాగా ఉంటుంది. ఈ వజ్రరూపమైన ఘనీభవించిన స్ఫోటముల సమూహములతో కూడిన చిత్తమే జీవుడు. స్ఫోటమంటే, చిత్ ద్రవ్యాన్ని ఆశ్రయించిన క్రియయే. ఈ క్రియనే గుణము అంటారు.

శ్లో॥ లోకాయ యాతనా భోగ - సూక్ష్మం కోటి గుణ గ్రహమ్
సాక్ష్యాయేహాల్ప మన్యత్ర - శేషం భుఙ్క్తేమహత్తరమ్. 22

తా॥ ఈ జల రూపంగా నున్న చైతన్యము దుఃఖానుభవంలో యాతనా శరీరంగాను, సుఖానుభవం కోసం భోగ శరీరంగాను మారి, జీవుని మరణంలో బయటకు లాగి, నరక-స్వర్గలోకాలకు ప్రయాణం చేస్తుంది. ఈ శరీరాన్నే సూక్ష్మశరీరము అంటారు. ఈ శరీరము చిన్మయము కావటం వల్ల దుఃఖాన్ని కాని, సుఖాన్ని కాని ఈ లోకంలో స్థూలశరీరంకన్నా కోటి రెట్లు గ్రహిస్తుంది, ఒక కర్మ యొక్క (పుణ్యం లేదా పాపం) ఫలాన్ని స్వల్పంగా ఈ లోకంలో, ఇతర జీవులు చూచి సాక్ష్యంగా విశ్వసించుట కోసం అనుభవించి, మిగిలిన ఎక్కువ భాగాన్ని పరలోకాలలోనే జీవుడు అనుభవిస్తాడు.

శ్లో॥ మర్యాదా జీవనం కర్తుం, పరోక్ష నరకే హతః
కారాగారే యథా తీవ్రం, స్వల్పం సాక్ష్యాయ తత్పురః॥ 23

తా॥ అపరాధిని రక్షక భటులు జనులు తెలుసుకొనుటకై జనుల ఎదుట, స్వల్పముగా దండింతురు. తరువాత కారాగారంలో తీవ్రంగా దండిస్తారు. ఈ తీవ్ర దండనను జనుల ఎదుట పొందినచో ఆ అపరాధి, సంస్కరించబడిన తరువాత, మరల ఆ జనుల ఎదుట జీవించలేడు. కావున తీవ్రదండనమును రహస్యముగనే చేయుదురు. అట్లే తీవ్ర



ఫలభోగము రహస్యముగా నరకములో అనుభవించి, మరల ఈలోకములో జీవుడు మర్యాదతో జీవించగలుగుచున్నాడు. కావుననే నరకము పరోక్షముగ కనిపించక ఉన్నది.

శ్లో॥ శుద్ధచి ద్గ్రహణై ర్ధ్వంసై, స్సారం చిత్తేన యోజయేత్
యాతనాభోగదేహ స్సా, జీవం కర్షే న్మమాజ్ఞయా॥ 24

తా॥ చిత్త ఘనము నావరించియున్న ఈ శుద్ధచైతన్య జలమే, ఈజన్మలోని విషయములను గ్రహించుచూ, మరల వాటిని లీనము చేయుచూ, వాటిలోని బలమైన విషయములను లోపల చిత్తమునకు అందించి, చిత్తమును పెంచుచూ ఉన్నది. మరణసమయములో ఈ చిత్తావృత చైతన్యజలమే యాతనా భోగ శరీరములుగా మారి, నా అజ్ఞ చేత జీవుని శరీరము నుండి బయటకు లాగుకొని వచ్చు చున్నది.

శ్లో॥ మానసః ప్రతిబిమ్బోऽస్య, మహాకారణకారణః
అన్తోత్థితః ఫలం భోక్తుం, సూక్ష్మదేహ స్స చిన్మరుత్॥ 25

తా॥ మరణసమయమున, మహాకారణ, కారణ శరీరముల వాసనలతో బాటు ఈ జీవుని సర్వావయములు సూక్ష్మమైన శక్తితో నిర్మించబడి, ఈ మానవుని ప్రతిబింబముగా లేచి, సుకృత - దుష్కృత కర్మల ఫలభోగార్థము వెడలు శరీరమే సూక్ష్మశరీరము. ఇది చైతన్యము యొక్క సూక్ష్మతత్త్వము గల వాయుస్థితి వంటి శరీరమే.

శ్లో॥ తత్కాలే దశమే ధర్మ - దిష్టో లోకత్రయం శ్రితః
మృగాది చ దుర్లభో నా - రేతసావాऽ న్యథా మయా॥ 26

తా॥ జీవుడు మరణించిన పదవరోజున, మృతి అనంతరము ప్రేతలోకంలోనుండు జీవునకు నేను విచారణ చేసి తీర్పు ఇస్తాను. ఈ పది రోజులు ధర్మదేవుడగు యముడు జీవుడు చేసిన పాపాలను ఏకరువు పెట్టి జీవునకు మరల మానవ జన్మ నీయవద్దని మృగాది జన్మల నొసగమని ప్రార్థిస్తాడు. సాధారణంగా నేను ధర్మదేవుని సలహాలనే పాటించి అతని కర్మఫలాల లోకాలకే పంపుతాను. అంటే పాపకర్ములను నరక లోకానికి, మధ్యమ కర్ములను పితృ లోకానికి, ఉత్తమ కర్ములను స్వర్గలోకానికి పంపుతాను. ఆ పాపులు నర మృగ పశ్వాది జన్మల నెత్తుతారు. మనుష్యజన్మ మరల దుర్లభము. జీవుడు మరల జన్మించునపుడు పురుషుని రేతస్సు ద్వారా స్త్రీ గర్భమునకు చేరును.

జీవుని మరల గర్భములోనికి ప్రవేశపెట్టు బీజప్రదుడగు పరమ పితను నేనే - ఒక్కొక్క సారి నా ఇష్టము ననుసరించి రేతస్సు ద్వారా  కాకుండా నేరుగా కూడా ప్రవేశపెట్టుదును.

శ్లో॥ గర్భవాసో న సిద్ధస్య, జన్మనా యోజయామి తమ్
తావచ్ఛుద్ధచితా ప్రాణి - శిశుస్సంస్కార వర్జితః 27

తా॥ పురుషుని రేతస్సు ద్వారా కాకుండా, ఒక్కొక్కసారి, సిద్ధపురుషుల జన్మల విషయంలో శిశువు జన్మించునపుడు కూడ జీవుని ప్రవేశపెట్టుదును. అనగా సిద్ధ పురుషునికి గర్భవాసము అక్కరలేదు. అట్టి సమయములో శిశువు కేవల శుద్ధ చైతన్య జలముతో కూడి, ఏ వాసనలు లేక ప్రాణ సహితముగనే ఉండును. ఎప్పుడు జీవుడు ప్రవేశించునో అప్పుడే ఆ శిశువులో వాసనలు ఆరంభించును.

శ్లో॥ దత్తతాత మివార్థార్థీ, సేవన్తే మా మహం పితా
ప్రవేశయామి దాస్యామి, పితరం శుక్లయోజనాత్॥ 28

తా॥ ఈ లోకములో సంతతి లేని వారు దత్తత చేసుకొనుచున్నారు గదా. ఆ దత్త పుత్రుడు ఆదత్త తండ్రిని ఆస్తి కొరకు చేరినట్లు, ఐహికముల కొరకు దత్త తండ్రి యగు నన్ను చేరుచున్నారేకాని అసలు సత్యమును గ్రహించుట లేదు. జీవుని, ఒక మాతృ గర్భమున నేనే ప్రవేశపెట్టుచున్నాను. ఒకానొక పురుషుని శుక్లమున ఈ జీవుని నేనే ప్రవేశ పెట్టి, ఆ జీవుని,ఈ జీవునికి తండ్రిగా నేనే చేయుచున్నాను. కాన ఏ జీవుని, తననిజమైన తండ్రి అని జీవుడు అనుకొనుచున్నాడో ఆ జీవుడే నిజముగ అతనికి దత్త తండ్రి. ఆ జీవునకు ఈ జీవుని దత్తము చేసిన అసలు తండ్రిని నేనే కదా.

శ్లో॥ ధనం గుప్తం మయా పిత్రే, దత్తం పాతా దదామి చ
పోషకో Z హం పితా మాతా, జ్ఞాని ధ్యేయో Z న్యసామ్యతః॥ 29

తా॥ తన తండ్రి తాను ఆర్జించితిని అనుకొనుచున్న తనకు (పుత్రునకు)ఆస్తిని ఇచ్చినాడని జీవుడు భావించుచున్నాడు. కానీ, ఆ తండ్రికి, ఆధనము నిచ్చి, దానిని దుర్వ్యయము కానీయకుండా కాపాడి, ఈ జీవునకు అందించిన వాడను నేనే. తల్లి గర్భపిండమున జీవుని జారిపోనీయకుండా అనగా గర్భపాతము జరగనీయక కాపాడి, ఆహారమును



అందించి పోషించిన వాడను నేనే కాన నిజముగ తల్లిని నేనే. సత్యమును దర్శించిన జ్ఞానులు నన్నే తల్లిగా, తండ్రిగా భావించి, ఉపాసింతురు. ఇతర జీవులగు ఐహికులగు తల్లి తండ్రులు తన తోటి జీవులే ననియు, వారికిని, తల్లిని, తండ్రిని నేనే అనియు జ్ఞానులు గుర్తింతురు.

శ్లో॥ మా Z పత్య పితృ చిన్తా తే, మయా దత్తా మమాత్మజాః
సర్వే జీవాః పరం త్వత్తః, ప్రియా స్సర్వేషు జన్మసు॥ 30

తా॥ వృద్ధులైన  నీ తల్లితండ్రుల గురించి, బాలురైన నీ సంతానము గురించియు చింతించకుము. ఒక జీవుని, మరియొక జీవుని కుమారునిగా, పుత్రికగా, ఏర్పాటు చేసినవాడను నేనే.అసలు ఈ తల్లితండ్రులే దత్త తల్లితండ్రులు. అసలు తల్లిని, అసలు తండ్రిని, సర్వజీవులకు నేనే. కాన వారి బాధ్యత నీకన్ననూ నాకే ఎక్కువగనున్నది అని తెలుసుకొనుము. అంతేకాక, నీ కన్న నేను ఎంతో శక్తివంతుడను కాన, వారి బాధ్యతలను నేను నెరవేర్చగలవాడనని నన్ను విశ్వసించుము. నీకు ఈ జన్మలోనే వీరు బిడ్డలు. నాకు కోట్లాది జన్మలనుండి వీరు బిడ్డలు. కాన,నీ కన్న, వీరిపై నాకు కోట్లాది రెట్లుగ మమకారమున్నదని గ్రహించుము. అట్లే బాధ్యతయు పెచ్చుగ నాకే ఉన్నది.

శ్లో॥ జీవః కర్మస్వరూపో హి, నిద్రాయాం చ మృతావపి
స్పన్దన్తి ద్రవ్య సూక్ష్మా హి, కర్మణా పరమాణవః॥ 31

తా॥ జీవుడు కూడా కర్మ స్వరూపుడే. నిద్రలో కాని, మృతిచెందిన తర్వాత కాని, వాని శరీర భస్మములో నైననూ, వాని దేహ ద్రవ్య పరమాణువులు అతి సూక్ష్మమై స్పందించుచునేయున్నవి గదా.

ఇతి శ్రీదత్తగురు భగద్గీతాయాం
శ్రీ దత్త భిన్న జీవ యోగో నామ తృతీయాధ్యాయః

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

బ్రహ్మఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## చతుర్థాధ్యాయః

## శ్రీ దత్త జీవ విభాగ యోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ:

శ్లో॥ ఆత్మాన ముపమాం కృత్వా, స శరీరం నిబోధ మామ్
నిత్యాZనిత్యా తను ర్మే తే, భిన్నా హనుమతీసుత! 1

శ్రీ దత్తగురు భగవానులు వచించిరి:

తా॥ శరీరంతో కూడిన నీవు ఏ విధంగా ఊహిస్తావో అదేవిధంగా శరీరంతో ఉన్న నేను ఈ జగత్తును ఊహామాత్రంగా సృష్టించానని ఉపమానంగా నిన్నే పెట్టుకొని తెలుసుకొనుము. అయితే ఓ హనుమతీ సుతా! నాతనువు నిత్యము. నీతనువు అనిత్యము అను భేదమును కూడా తెలియుము.

శ్లో॥ బహి స్తవ జగచ్చాస్తి, యదేవోహేషు విద్యతే
న బహి ర్మే సమం చాన్తః, కల్పయామి నవం నవమ్॥ 2

తా॥ నీకు బాహ్యంగా ఈ జగత్తు ఉంది. ఈ బాహ్య జగత్తే, నీ ఊహలలోకి వస్తున్నది. కానీ నాకు బాహ్యంగా ఏమీ లేదు. అంతా నాలోనే ఉంది. నా ఊహయగు ఈ జగత్తు అంతా కొత్త కొత్తగా నేను కల్పించినదే. ఈవిషయములో కూడా మన ఇరువురికి భేదమున్నది.

శ్లో॥ అహమేవ నవం కుర్యా, మభూతం హి పురో జగత్
సాన్ద్రాన్నా జడశక్త్యంశ, స్తదన్నా త్పురుష శ్శ్రుతః॥ 3

తా॥ నేను మాత్రమే కొత్త దానిని సృష్టించగలను. ఏ మాత్రము ముందులేని జగత్తును నేను కొత్తగా సృష్టించియున్నాను గదా. జడశక్తి యొక్క సాంద్రరూపమే జడమైన అన్నము.



ఈ జడమైన అన్నము తినబడి జీర్ణమై, పలుచనై, చైతన్యముగా మారుచున్నది. ఒకే జడశక్తి సాంద్రమై అన్నముగాను, పలుచనై చైతన్యముగాను మారుచున్నది.

"అన్నాత్పురుషః" అనగా "అన్నము నుండి పురుషుడు" అను శ్రుతి వాక్యప్రకారము, అన్నమే చైతన్య రూపమైన జీవునిగా మారుచున్నది.

శ్లో॥ స్రష్టా Z హ మేవ సృష్టే స్త్వం, స్రష్టా స్వప్నోహయో రపి
ఊహ ఏవ సదా జాగ్ర - ద్దశాయామస్మి భిద్యసే॥ 4

తా॥ కాన, కొత్తగా సృష్టించువాడను నేనే. నీవు స్వప్నంలో కానీ, ఊహల్లో కానీ ఈ సృష్టిని చూసి, దానికి అనుగుణంగా సృష్టిస్తున్నావే తప్ప, కొత్తగా నీవు ఏమీ సృష్టించుటలేదు. నాకు స్వప్నదశలేదు. నేను ఎల్లపుడు మేల్కొనియే ఉందును కాన, మేల్కొని చేయు నా ఊహయే ఈ జగత్తు. ఈ విషయంలో కూడా నీకూ నాకూ గల భేదమును గ్రహించవలయును.

శ్లో॥ ఏకాంశోపమయా జ్ఞేయ, స్తదా పూర్ణోపమా యదా
అవతీర్ణోZ స్మి సర్వాంశై, రహం పూర్ణోపమా మమ॥ 5

తా॥ ఉపమానాలలో ఒకే అంశమును తీసుకొనవలయును. అప్పుడే నేను తెలుసు కొనబడుదును. నేను, సర్వాంశలతో ఈ లోకమున అవతరించినపుడు నాకు నేనే పూర్ణమైన ఉపమానమగుదును. నాతో పూర్తిగా పోలిన వాడు నేనే.

శ్లో॥ పుష్పకోమలనాడీషు, చైతన్యం లలితం సరత్
అబలం నాగ్నిమాత్రం చ, జీవో Z య మబలాగ్రణీః॥ 6

తా॥ పుష్పమువలె కోమలములైన నాడుల ద్వారా ప్రవహించు చైతన్యము చాల లలితమైనది. దుర్బలమైనది. కనీసము అగ్నికి ఉన్న శక్తి కూడ లేనిది. చైతన్యరూపుడైన జీవుడు ఈ సృష్టిలో అతిబలహీనులలో మొదటివాడు. చైతన్యము అగ్నివలె వస్తువులను దహించలేదు గదా.

శ్లో॥ అసాన్ద్రా సికతా సాన్ద్రం, కిం ఛినత్తి మహాగిరిమ్?
ఏకా Z పి తత్త్వతో జీవో, న బ్రహ్మ బ్రహ్మతత్త్వతః॥ 7

తా॥ ఘనీభవించనివి ఇసుకరేణువులు. ఆ ఇసుక రేణువులే ఘనీభవిస్తే కొండ ఏర్పడుతున్నది. ఇసుకలోను కొండలోను తత్త్వపరంగా పదార్థము ఒక్కటే. అయిననూ ఇసుక రేణువులు కొండను భేదించలేవు గదా. అట్లే పదార్థతత్త్వంగా జీవుడు-బ్రహ్మము ఒకటే అయిననూ, శక్తి సామర్థ్యములలో జీవుడు-బ్రహ్మము కాదు. ఇదే తేడా.

శ్లో॥ స్వాపాజ్ఞానాది దోషార్హై, ర్న స్వప్నో బ్రహ్మణో భవేత్
స్వతన్త్ర జాగ్ర దూహోZ యం, ప్రపఞ్చ ఇతి సమ్మతః॥ 8

తా॥ ఈ సృష్టి అంతా బ్రహ్మమునకు పట్టిన కల వంటిది అనరాదు. అట్లు అన్నచో బ్రహ్మమునకు నిద్ర - అజ్ఞానము మొదలగు దోషములు పట్టవలసివచ్చును. స్వతంత్రముగా మేల్కొని ఊహించుచున్నవాని ఊహగా ప్రపంచమును చెప్పినచో, ఈ దోషములు రానందున సమ్మతమగును.

శ్లో॥ కిన్తు స్వప్నోహయో ర్బద్ధో, జీవ స్సృష్ట్యంశ ఏవ హి
తజ్జీవో న స్వయం బ్రహ్మ, భవితా దయయా Z స్యతు. 9

తా॥ అయితే, స్వప్నమైనా, మేల్కొని ఊహించుట అయినా, జీవుడు రెండింటిలోను ఊహప్రపంచములో బద్ధుడగుచున్నాడు. కాన, జీవుడి విషయంలో, స్వప్నమైనా, మేల్కొనికను ఊహ అయినా ఒక్కటే. బ్రహ్మము, అట్లు ఊహ ప్రపంచబద్ధముకాదు. స్వతంత్రము. కావున బ్రహ్మము విషయమున, మేల్కొని కల గనుటయే ఉపమానమునకు సరిపోవును. కావున, జీవుడు స్వభావసిద్ధంగా బ్రహ్మము కాదు. అయితే బ్రహ్మము దయవలన, బ్రహ్మము కాగలడు.

శ్లో॥ ఏతావ త్యుపమా తే మే, చిత్రా నూహ్యా తను ర్మమ
అత్యల్పానూహ్యచిత్రత్వా, దచిత్రోహ్యా తను స్తవ॥ 10

తా॥ నీకూ, నాకూ, ఉపమానమింతవరకే తీసుకొనవలయును. ఎందువలననగా, నాతనువు పరమ వ్యోమము - చైతన్యములతో సహా అతివిచిత్రమై అనూహ్యమైనది. నీతనువు, తన శరీరాకాశ - చైతన్యములతో సహా ఊహ్యమైనది. అంటే అత్యల్పమైన అనూహ్యత కలది కాన దాదాపు ఊహకు అందునది అగును.

అనగా - నీకు నాతనువు - పరమ వ్యోమము - చైతన్యముతో సహా - అనూహ్యము. నీకు నీ తనువు - శరీర ఆకాశ - చైతన్యములతో సహా - ఊహించదగినది. ఇదే తేడా నాకు - నీకు.



శ్లో॥ సంవర్తాగ్ని రహం జీవో, విస్ఫులిఙ్గాణుభస్మవత్
సత్యో Z ప్యసత్య సమ్భావ్యో, బ్రహ్మ Z పి బ్రహ్మణో వశే॥ 11

తా॥ నేను ఒక ప్రళయకాల సంవర్తాగ్నిని అనుకొన్నచో, ఈ జీవుడు నాలోని ఒక నిప్పురవ్వలోని ఒక సూక్ష్మకణము. అనగా జీవుడు దాదాపు బూడిద వంటి వాడు. కాన, సత్యమయ్యును, అసత్యముగా తలచదగిన వాడు. జీవుడు తాత్త్వికంగా బ్రహ్మమయ్యును, బ్రహ్మమైన నా వశములో నున్నవాడే.

శ్లో॥ ఊహస్రష్టా జగత్స్రష్టా, చైతన్యాంశ గుణాణుతః
తథైవ పఞ్చభూతానాం, మత్తనో రంశలేశతః॥ 12

తా॥ నేను జగత్తును ఎట్లు ఊహాత్మకంగా సృష్టించుచున్నానో అట్లే నా చైతన్యము యొక్క పరమ స్వల్పాంశయగు జీవుడు తన ఊహలతో లోకములను సృష్టించుచున్నాడు. అంటే నా చైతన్యము యొక్క సృష్టి శక్తిలో అత్యల్పమైన అంశము జీవునకున్నది. అట్లే నాతనువులోని పంచ భూతముల యొక్క అత్యల్పాంశలే ఈ జగత్తు లోని పంచభూతములు కాన, ఇవియును, నాతనువు లోని పంచభూతముల శక్తుల యొక్క అత్యల్పమైన అంశలతోనున్నవి.

శ్లో॥ చిత్రానూహ్యో జగత్యస్మి త్వమూహాత్మోహసృష్టిగః
ఊహాత్మనే సమే దృశ్యే, మహ ద్ద్రష్టృద్వయాన్తరమ్॥ 13

తా॥ నేను అతివిచిత్రమైన, అనూహ్యమైన మాయా శక్తి కలవాడను. కాన ఈ తనువుతోనే జగత్తులోనికి ప్రవేశించగలను. నీవు నీ ఊహలలోకాలలో కేవలము నీ ఊహతో నిర్మించబడిన శరీరముతోనే ప్రవేశించగలవు. కాని, నీ యథార్థశరీరముతో ప్రవేశించలేవు. నీకు నీ ఊహాలోకాలెంతో, నాకు ఈ జగత్తు అంతే. ఇంతవరకు మనకు సమానమే. కానీ నీకు, నాకు చాలా భేదము గలదు.

శ్లో॥ వ్యవహారదశేదం మే, జగదూహశ్చతేZ ణువత్
పరమార్థదశాZహం మే, జగత్తే చోహ్యతే సమా॥ 14

తా॥ నాకు ఈ జగత్తు, నీకు నీ ఊహ - ఈ రెండు వ్యవహారదశలు కాన, అణు మాత్రములు. ఇక నాకు నేను, నీకు ఈజగత్తు పరమార్థ దశలు. పరమార్థ దశలో సమత్వముండును. అనగా నాకు నేను సముడను. నీకు ఈజగత్తు సమము కాన ఊహించవచ్చును.

శ్లో॥ పరమార్థదశాతీత, స్తే Z హం నోహ్యశ్చ చిన్మమ
న చిత్స జడశక్తి ర్హి, మదధీనా నవా న్మతాత్॥ 15

తా॥ కాన,నీకు నేను పరమార్థదశకు కూడ అతీతుడను. కావుననే, నీ ఊహకు అందను. నాలోని ఒక భాగమైన చైతన్యము కూడ నేనే కాన, నా చైతన్యము కూడా నీకు అందనిదే. నీవు అందుకున్నావని భ్రమపడిన జీవ స్వరూపమైన చైతన్యము నిజముగా చైతన్యము కాదు. నాకు అధీనమైన జడశక్తి యొక్క లేశరూపమే.

శ్లో॥ సమాధా వాత్మ గత్యంశ, స్సత్యః పూర్ణో న తత్పరః
అవ్యక్తాన్యో Z హమజ్ఞేయో, గ్రాహ్యమాద్యం న పూర్ణతః॥ 16

తా॥ సమాధి యందు ఆత్మను పొందుట చేత, బాహ్య సంసార వికారములు శాంతించి (అనగా నేనీ దేహము కాదు, ఆత్మను అని తెలియుటచేత) ఏకాగ్రత సిద్ధించును కాన, ఇది చాల అవసరమైన విషయమే, కానీ,ఇదే సంపూర్ణముకాదు. ఏలనన ఆత్మ పరమాత్మకాదు, పరమాత్మ "అవ్యక్తము" (అనూహ్యము) అను మాయ తెరకు వెనుకనున్నాడు. అతడు పొందుటకు గానీ, కనీసము తెలుసుకొనుటకును సాధ్యుడుకాడు. కాన ఆత్మప్రాప్తి, పరమాత్మ ప్రాప్తి కాదు. కాన, సమాధిలోని ఆత్మ ప్రాప్తి, ఒక భాగమే కాని పరిపూర్ణము కాదు. లోకములో కొందరు గురువులు ఈ ఆత్మ ప్రాప్తినే పరమాత్మ ప్రాప్తిగా, వారికి తెలిసిన జ్ఞానమే పూర్ణ మనుచున్నారు. కాన, ఈ గురువుల జ్ఞానములు సత్యములే, అవసరములే కాని, ఏ ఒక్కటీ పూర్ణము కాదు.

శ్లో॥ అభేదాన్నిశ్చితో Z హం తే, భేదో Z పి పరమార్థసత్
చిత్రానూహ్య మహం బ్రహ్మ, బ్రహ్మవిద్బ్రహ్మ నో నరః 17



తా॥ దగ్గరకు జరిగి సాంద్రత చెందు అవకాశము లేని ప్రక్క ప్రక్కన గల ఇసుక రేణువుల సమూహము వలె బ్రహ్మము అంతా నిండి యున్నది. కాన ఇందులో సాంద్రతా భేదము వలన రూపములు ఏర్పడుట అసంభవమని అభేదమతమును స్థాపించినచో, నీవు బ్రహ్మము యొక్క స్వరూపమును నిర్ధారించినవాడ వగుచున్నావు. సిద్ధపురుషులు శూన్యము నుండి అనగా సాంద్రత పలుచగా ఉన్న ఆకాశము నుండి వస్తువులను సృష్టించుట చూచుచున్నావు గదా. కాన అభేదమెంత సత్యమో, భేదమూ అంతే సత్యము. రెండూ ఒకే సమయమున ఒక వస్తువైన నా యందే పరమార్థతత్త్వములుగా నుండుట వలన ఏర్పడిన అతి విచిత్ర - అనూహ్య స్వరూపమే బ్రహ్మము యొక్క స్వరూపము. "బ్రహ్మవేత్త బ్రహ్మము అగును" అని శ్రుతి. బ్రహ్మమును గురించి బ్రహ్మమునకే తెలియును. కాని జీవుడు బ్రహ్మమును తెలియజాలడు అని అర్థము. అంతే తప్ప జీవుడు బ్రహ్మమును తెలుసుకొని బ్రహ్మమగునని కాదు.

శ్లో॥ బ్రహ్మ సత్యం జగన్నాస్తి, దత్తో బ్రహ్మైవ కేవలః
రూపవా న్గుణవా న్జీవో, జగదంశో భవే దహమ్. 18

తా॥ బ్రహ్మమే సత్యము. జగత్తు అత్యంతాల్పము కనుక అసత్యము. వేదవాక్య ప్రమాణ ప్రకారము బ్రహ్మనిర్వచన, నిరూపణము వలన ఈ దత్తుడే ఆ బ్రహ్మము. ఈ దత్తుడు రూపవంతుడు, గుణవంతుడు. అసత్యమైన జగత్తులోని భాగమైన జీవుడును అసత్యమే. అయితే నా దయ వలన జీవుడు బ్రహ్మము కాగలడు. అనగా నేనే కాగలడు.

శ్లో॥ నిర్గుణ స్సకలాధారా, జ్జీవోబ్రహ్మ న హి స్వయమ్
భవితా దయయా మే Z య, మస్య సత్య మిదం జగత్॥ 19

తా॥ నేను ద్రవ్యము. ఈ జగత్తు గుణము. గుణము అనగా ద్రవ్యముపై ఆధారపడునది. ద్రవ్యమైన నా పై ఆధారపడు ఈ జగత్తు గుణము. నేను దేనిపై ఆధారపడను. నేనే అన్నిటికిని ఆధారమును, కావున నిర్గుణుడు అనబడుదును. ఈ అర్థములో నిర్గుణుడనే తప్ప, కారుణ్యాది గుణ రహితుడనని కాదు. "నేను" - అనగా ద్రవ్య, రూప, చైతన్య గుణముల సంఘాతమైన ఈ ఆకారమే అర్థము.జీవుడు స్వయంగా బ్రహ్మము కాదు. కాని నాదయతో బ్రహ్మము కాగలడని చెప్పి యుంటిని కదా. అసత్యమైన జీవునకు, అసత్యమైన జగత్తు అసత్యము కాదు కావున, జీవునకు జగత్తు సత్యమే.

శ్లో॥ ప్రత్యేక బ్రహ్మ పూర్ణత్వా, దరూపో నాక్షి దృశ్య చిత్
రూపం చాహం న తు వ్యాప్తి, స్తర్క మూలాద్వయే ద్వయే 20

తా॥ ఈ కనిపించు నాలోని ద్రవ్య-రూప-చైతన్య-గుణాదులైన సంఘాతములో ప్రతిదీ పూర్ణబ్రహ్మమే. ఎందువల్లననగా, ఇవి ఈ అకాశ పరిమాణనియమాలకు అతీతము కనుక. కావున ఇందులో, నేత్రముల చే అప్రయత్నముగా చూడవీలుకాని చైతన్యము నేనే కాన, నిరాకారుడనే, అరూపుడనే. ఈ సంఘాతంలో రూపంకూడా ప్రత్యేకంగా నేనే కావున నేను అకారమే. చైతన్యము కేవలము యంత్రములచేత ఇప్పుడుచూచుటకు వీలగుచున్నది. యంత్రముల సహాయము లేకుండా నేరుగా నేత్రములతో చూచుటకు వీలుకాదు. కాన చైతన్యమును అరూపము అనవచ్చును. జగత్తు యొక్క నామ రూపాలు అసత్యాలు కాన, నా నామరూపాలు అసత్యాలనీ, సాధక జీవుడు బ్రహ్మము కన్న భిన్నుడు కావున, సిద్ధజీవుడు కూడా భిన్నుడే అనియూ, ఇట్లు తర్కము వలన సిద్ధించు "వ్యాప్తి" ని చేయరాదు.

(వ్యాప్తి అనగా ఒక చోట ఉన్న నియమమును మరొక చోట కూడ అట్లే సమన్వయించుట)

శ్లో॥ యౌ తవోచ్ఛ్వాస నిశ్వాసౌ, తావపి బ్రహ్మ కర్మ హి
నియమైశ్చ మదాదిష్టై,ర్జగ చ్చలతి సర్వదా॥ 21

తా॥ నీవు పీల్చి వదలు శ్వాసలు కూడ బ్రహ్మము చేతనే చేయబడుచున్నవి. నాచే నిర్దిష్టమైన నియమముల చేతనే ఈ జగత్తు ఎల్లప్పుడు నడుచుచున్నది.

శ్లో॥ తేషాం భఙ్గాయ నవ్యాయ, శక్యం కః ప్రతివక్తి మామ్?
భఙ్గోనోహ్యేన నవ్యేన, త్వయాద్భుత మితీర్యతే॥ 22

తా॥ ఈ నియమములను నేను భంగపరచి కొత్త నియమములను పెట్టగలను. నన్ను ప్రశ్నించు రెండవ వాడెవడున్నాడు? ఈ నియమములను భంగపరచి కొత్త నియమమును, నీ ఊహకు అందకుండా చేసినపుడు దానిని అద్భుతమైన సిద్ధి అనుచున్నావు. (ఇవే అష్టసిద్ధులు)



శ్లో॥ శ్వాసా దారభ్య సిద్ధ్యన్తం, మత్త ఏవాఖిల క్రియాః
ఆశ్చర్యం యచ్చ నాశ్చర్యం, కర్మ బ్రహ్మ హి తద్ధ్రువమ్॥ 23

తా॥ మనుజుడు పీల్చు శ్వాసమొదలు కొని, అష్టసిద్ధుల పర్యంతము, అన్ని కర్మలు నేనే చేయుచున్నాను. ఆశ్చర్యం కలిగించే కర్మ అయినా, ఆశ్చర్యం కలిగించని సామాన్యకర్మ అయినా, నేను చేయునదే. కర్మ బ్రహ్మము నుండియే పుట్టినది. అది తాత్త్వికంగా బ్రహ్మమే అగును.

శ్లో॥ చైతన్య మూహత స్త్వం హి, సర్గ స్థావరజఙ్గమః
ఊహ ఏవ చితో జాత, స్తద్భృత శ్చితి లీయతే॥ 24

తా॥ ఊహ యొక్క తత్త్వము చైతన్యమే. చరాచర ప్రపంచమంతయును నా ఊహయే. ఈ విశ్వమంతయును నాచైతన్యము నుండి పుట్టి, నా చైతన్యము చేత ధరింపబడి, నా చైతన్య మందే లయించుచున్నది.

శ్లో॥ చరం వక్తి స్థిరంనైవ, నియమోహ్యేష మత్కృతః
స్థిరం వక్తి చరం నైవ, యదీచ్ఛామి క్వచిత్ప్రభుః॥ 25

తా॥ నేను ఏర్పాటు చేసిన నియమము ప్రకారము, చరము మాట్లాడును. అచరము పలుకలేదు. అయితే శాసకుడగు నేను సంకల్పించినచో, చరము అయిన మనుజుడు మాట్లాడలేక పోవును. అచరము అయిన శిల మాట్లాడును. (నియమము నా ఇచ్ఛామాత్రమే)

శ్లో॥ విశ్వవేషేహి చైకైక - వేషో Z హం విస్మయావహః
పరమాణు ర్గిరి ర్వ్యాఘ్రో - వృక్షో మర్త్యో Z హ మేవ హి॥ 26

తా॥ నా ఈ విశ్వవేషములో, ప్రతి భాగము కూడా మరల ప్రత్యేకముగ, నేనే వేషము వేసి యున్నాను. ఇది నీ ఊహకు అందదు కానీ, ఆశ్చర్యమును కలిగించును. ఈ విశ్వములో పరమాణువు నేనే. కొండ నేనే. పులిని నేనే. వృక్షము నేనే. మనుఝుడు నేనే.

శ్లో॥ అచ్ఛాదకేన వేషేణ, దేవదత్తో హి నాటకే
శిల్పవ చ్చాచరో రాజా, నటః కశ్చి దివాస్థిరః 27

తా॥ దేవదత్తుడను నటుడు నాటకములో శిలాకారమును కనుపింపచేయు ఒకానొక వస్త్రము కప్పినందున, ఒక కదలని శిల్పము వలె నటించగలడు. అదే దేవదత్తుడు కదులుచూ, మాట్లాడుచున్న ఒక రాజు వలె నటించగలడు.

శ్లో॥ సంపూర్ణా చ్ఛాదనా దశ్మ - వేషో విస్ఫురతీవ సః
మాయాచ్ఛాదనరూపేషు, ప్రత్యేకం చాస్మి తత్ర న॥ 28

తా॥ కనుక, ఒక వ్యక్తి సంపూర్ణముగా వస్త్రముతో కప్పినచో, ఒక రాయి వలె నాటకమునందు భాసించగలడు. అదే విధంగా, మాయా శక్తి యొక్క రూపములు నన్ను కప్పి యుండుట చేత, నేనును నాయీ స్వరూపము కనిపించక, పైకి, కొండ, వృక్షము మొదలగు రూపములతో ఒకే సమయమున భాసిస్తున్నాను. నటుడిట్లు ఒకే సమయమున చేయలేడు. నా అనూహ్యశక్తి వలన నాకు సాధ్యము.

శ్లో॥ స్వరూపప్రతిబిమ్బేషు, మాయారూపేషు వై నృషు
ప్రత్యేక మస్మి సర్వేషు, సాక్షాచ్చ పరమాణుషు॥ 29

తా॥ నా ఈ స్వరూపము యొక్క సదృశమైన వేషములగు మాయారూపములే ఈ మానవులు కాన, ప్రతి మానవుడిలోను నేను వేషధారిగానున్నాను. ప్రతి పరమాణువులోను ప్రత్యేకంగా నేనే సాక్షాత్తుగా 'ఉన్నాను.

శ్లో॥ ఏకదా Z నేక రూపేషు, నసాధ్యా స్థితి రీదృశీ
నటస్య తదహం బ్రహ్మ, మాయీ నాప్యూహ గోచరః 30

తా॥ ఒకే సమయంలో ఈ విధంగా ప్రతి రూపంలోను ప్రత్యేకంగా నేనుఉండగలను. కాని ఒక నటునికి ఇది 'సాధ్యము కాదు. అందువల్లనే నేను మాయాశక్తి గల బ్రహ్మమును. ఊహలకు సైతము అందని వాడను.



శ్లో॥ స్వరూప ప్రతి బిమ్బస్త్వం, ప్రతిబిమ్బాని తానితు
అన్యాన్యశ్మ మృగా దీని, బిమ్బోZహం ప్రతిబిమ్బగః॥ 31

తా॥ నా ఈ స్వరూపము యొక్క ప్రతిబింబమే మానవుడు. మిగిలిన రూపములు కూడా నా ప్రతిరూపములే కాని, నా ఈ స్వరూప సదృశములు కాక, అన్యరూపములను కల ప్రతిబింబములు. అవి రాయి, మృగము మొదలగునవి. అన్ని ప్రతిబింబములకు బింబమును నేనే. నేనే అన్ని ప్రతిబింబములలో ప్రత్యేకంగా కూడా ఉన్నాను.

శ్లో॥ అణిమా మహిమా తాభ్యా, మల్పో భూయా న్పునః పునః
వినా తాభ్యాం తథా చ స్యా, మేవం స న్నైవ నోహ్యతే॥ 32

తా॥ అణిమాది అష్టసిద్ధులను పొందిన సిద్ధుడు, అణిమాసిద్ధిలో చిన్నవానిగను, గరిమాసిద్ధిచేత పెద్దవానిగను మాటిమాటికిని కావచ్చును. ఆ రెండు సిద్ధులను వేరువేరుగా ప్రదర్శించగలడు. కాని ఒకే సమయములో రెండు చేయలేడు. కానీ, నేనట్లు కాగలను. అనగా నీకు కనపడు ఈ రూపము ఇట్లే యుండగా (అనగా పెద్దది కాకుండా లేక చిన్నది కాకుండా) నా సంకల్పమాత్రము చేతనే ఒకే సమయమున పెద్దగాను, చిన్నదిగాను కనిపించును. ఇది నీవు ఊహించలేవు.

శ్లో॥ వాయువేగ మనోవేగ, స్సిద్ధ్యై భవతి యోగవిత్
తిష్ఠన్నేవ తథా యామి, యదాకాశా దతిస్థితిః॥ 33

తా॥ యోగి, వాయువేగ, మనోవేగములతో పోగలడు, నేను ఇచ్చట కూర్చుండియే, ఆ వేగములతో పోవుచున్నాను. ఏలననగా, ఆకాశ తత్త్వమునకు అందని స్థితిలో నేనున్నాను. అనగా నేను సర్వత్ర, ప్రతి పరమాణుప్రదేశంలో కూడ పరిపూర్ణంగా నిండి యున్నాను. ఇది అనూహ్యస్థితి.

శ్లో॥ ప్రత్యేక మపి సర్వత్ర, వర్తే Z ప్యత్ర యథేక్షితః
వర్తతే మయి తత్సర్వం, సర్వత్రాహం చ భాగశః॥ 34

తా॥ నేను ప్రతి అణువులోను ప్రత్యేకముగా ఉన్నాను. అదే సమయంలో ఇక్కడ నీకు కనపడుచు ఇక్కడే ఉన్నాను. ఇదంతా నాలోనే ఉన్నది. ఈ మొత్తము కూడ

వ్యాపించి, ప్రతిచోట, నాయొక్క ఒక్కొక్క భాగమాత్రమే ఉండుట కూడ నిజమే. అనగా - ఒక చోటనే ఉంటూ, ప్రతి చోటా పరిపూర్ణంగా ఉంటూ, విశ్వమంతా వ్యాపించి కూడా ఉన్నాను (ఈ మూడు స్థితులలోనున్నాను)

శ్లో॥ ఉపమాతి హి సర్వేషు, తరఙ్గేష్వివసాగరమ్
తన్నాలం పరిమాణాంశా, త్ప్రత్యేకం వీచిగోZర్ణవః 35

తా॥ నేను అన్ని వస్తువులలోను; అలలలో సముద్రమువలె ఉన్నానని ఉపమానము నిత్తురు కాని, అది పూర్ణోపమానము కాదు. ఏలననగా, ప్రతి తరంగములోను సముద్రజలము యొక్క కొంత భాగమే ఉన్నది. నేను అట్లుండుట మాత్రమే కాదు. ప్రతి తరంగములోను సముద్రమంతయును ఉన్నది అను రీతిలోకూడ నున్నాను. ప్రతితరంగములోను సముద్రమంతయును పూర్ణస్థితిలో నుండుచూ అదే సమయంలో సముద్రములో అలలు ఉండుట - ఈ రెండూ ఊహకు అందని స్థితి. కానీ, నేనట్లున్నాను.

శ్లో॥ ఆయామోన్నతి వైశాల్య-త్ర్యక్షాకాశా దతిస్థితః
అకాశవశ భూతాద్యైః, పూర్ణజ్ఞానం న జాయతే॥ 36

తా॥ పొడవు, వెడల్పు, ఎత్తు-అను మూడు అక్షములు (లక్షణములు) గలది అకాశము అనగా శూన్యము లేక ఖాళీ స్థలము. ఈ అకాశమునకు అతీతముగ నున్న నన్ను, అకాశ వశంలో నున్న పంచభూతములతో పోల్చి పూర్ణముగా తెలుసుకొనుట కుదరదు. తెలుసుకొను జీవులు కూడ ఈ అకాశవశంలోనేఉన్నారు కాన, నన్ను ఎన్నటికినీ అర్థము చేసుకొనలేరు.

శ్లో॥ తస్మా త్కస్యాపి సమ్పూర్ణం, బ్రహ్మజ్ఞానం న సిధ్యతి
అహమేవ హి సర్వజ్ఞః, పతితో హ్యన్యథా నతః॥ 37

తా॥ కాన, ఎవరికైననూ, సంపూర్ణబ్రహ్మ జ్ఞానము సిద్ధించదు. నేనొక్కడినే సర్వజ్ఞడను. అట్లు కాకున్నచో, ఈ మానవుడు, బ్రహ్మజ్ఞానము సంపాదించువరకు వినయము కలిగి, పూర్ణసిద్ధి తరువాత, అహంకరించుచు పతితుడగును. కాన, నా కన్న వేరుగా నున్న జీవుడు బ్రహ్మజ్ఞానమును పొందలేడు. బ్రహ్మజ్ఞానము అనగా నా జ్ఞానము (ఆత్మజ్ఞానము) అది నాకు ఒక్కనికే ఉండును.



శ్లో॥ అలభ్యే పాదపాతో Z యం, లభ్యమానే శిరోగ్రహః
పశ్య భస్మాసురో మాం హి, భస్మకర్తు ముపస్థితః॥ 38

తా॥ ఈ మానవుడు అందకున్నంతవరకు పాదములు పట్టుకొనును. అందినంతనే, జుట్టుపట్టుకొనును. చూడుము. భస్మాసురుడు నా నుండి వరమును పొంది, నన్నే భస్మము చేయ ప్రయత్నించెను.

శ్లో॥ పురుషః ప్రకృతి స్తాహి, పురుషః పురుషోత్తమః
పురుషోZస్తి శరీరేషు, లిఙ్గభేదో మహాభ్రమః॥ 39

తా॥ లోకంలో ఉన్నది ఇద్దరే, పరమాత్మ-జీవుడు. పరమాత్మ పురుషుడు, జీవుడు ప్రకృతి. అనగా జీవుడు పరాప్రకృతి. జడమైన అన్నము అపరాప్రకృతి. అపరాప్రకృతి యొక్క వికారమే జీవుడు. జీవునకు, శరీరమునకు గల భేదము ఒకేవర్గములోని రెండు వస్తువులకు గల స్వల్ప భేదమే. దీనినే అవాంతర భేదము అందురు. కనుక ముఖ్యము కాదు. కాన జీవుడు ప్రకృతియే కాని పురుషుడు కాదు. ఈ అవాంతర భేదము ననుసరించి, జీవుని, శరీర వ్యాపకుడు అను అర్థములో పురుషుడన్నచో, స్త్రీ శరీరము-పురుష శరీరములలో గల జీవుడు పురుషుడే అనబడును గదా. అప్పుడు విశ్వవ్యాపకుడను అర్థము గల పురుషుడగు పరమాత్మ పురుషోత్తముడగును. కాన, శరీరమాత్ర భేదం చేత స్త్రీ - పురుష భేదాన్ని పాటించుట అజ్ఞాన పరాకాష్ఠయే అవుతుంది. ఇదే మహాభ్రమ అంటే.

ఇతి శ్రీ దత్త గురు భగవద్గీతాయాం
శ్రీ దత్త-జీవ విభాగయోగోనామ, చతుర్థాధ్యాయః

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

విష్ణు ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## పంచమాధ్యాయః

## శ్రీ దత్తావతార తత్త్వ యోగః

శ్రీ దత్త శిష్య ఉవాచ :

శ్లో॥ ఆవేశః కోఽవతారో వా? స్వయం వా కథ మీక్ష్యసే
శూన్యేస్యాః కిన్తు లోకేఽ స్మిన్, కథం? శక్తి వ్యయస్సమే॥ 1

శ్రీ దత్త శిష్యుడు వచించెను.

తా॥ "ఆవేశము" అనగా నేమి? "అవతారము" అనగా నేమి? నీవు స్వయముగా ఎట్లు చూడబడుదువు? శూన్యము నందు వస్తువులను కదిలించువాడవు నీవు కావచ్చును. కానీ, లోకములో వస్తువులు, ప్రాణులు, తమ శక్తిని వ్యయము చేసుకొని తమ తమ పనులు చేసుకొనుచున్నవి. ఈ లోకములో అన్ని పనులను నీవు చేయుచున్నావు అనుట ఎట్లు పొసగును?

శ్లో॥ అథకర్తా భవానేవ, ఫల భోక్తా జడే సమే
న చిన్తయతి జీవాన్య, శ్చైతన్యం కాన్తివ త్కథమ్? 2

తా॥ ఒక వేళ, లోకములో అన్ని పనులను చేయువాడవు కూడ నీవే అయినచో, లోకమున జరుగు అన్ని పుణ్య పాపకర్మలకు నీవే కర్తవు కాన, వాటి ఫలములను అనుభవించువాడవు నీవే కావలయును గదా. అంతయును జడమే అయినచో, జీవున కన్న భిన్నమైన వృక్షాదులు ఎందుకు ఆలోచించుట లేదు? చైతన్యము కాంతి వలె జడశక్తి అనుట ఎట్లు పొసగును?

శ్రీ దత్త భగవాన్ ఉవాచ:

శ్లో॥ ఆవిశ్య ప్రాణి వస్తూని, ధర్మాయావతరామ్యహమ్
కార్యాన్తాపగతో రామా, త్పరాభూతో హి భార్గవః 3



శ్రీ దత్త భగవానులు వచించిరి:

తా॥ ధర్మమును ఉద్ధరించుటకు, అధర్మమును దండించుటకు ప్రతి క్షణమూ అవతరింతును. అవతారమనగా అనేక రకములు. నేను ఏ వస్తువునైనా ఏ ప్రాణినయినా ఆవేశించి వత్తును. అది ఆవేశావతారము. ఆ ఆవేశావతారము ద్వారా ధర్మస్థాపన, అధర్మ నాశనమును చేయుదును. ఆ కార్యము పూర్తికాగానే నా ఆవేశము వెడలి పోవును. తిరిగి, ఆ వస్తువు మరల తన పూర్వ రూపమున ఉండును. పరశురాముడొక మహర్షి. క్షత్రియ సంహారార్థము వానిని ఆవేశించితిని. ఆ పని పూర్తి కాగానే, అతడు, నా ఆవేశము పోగా, మామూలు మహర్షియైనాడు కాన శ్రీ రామునిచే భంగపడినాడు.

శ్లో॥ కళాంశాః పూర్ణరామేహి, గుప్తా స్సిద్ధి చతుష్కలాః
కృష్ణోఽహం షోడశకలా-వర్ష బాలా శ్రియం గతా॥ 4

తా॥ ఒకానొక జీవునిలో నా కళ ప్రవేశించినచో దానిని కళావతారమందురు. నా తత్త్వ బిందువు ప్రవేశించినచో అంశావతారమందురు. మనుష్యులు అనుసరించుటకు వీలుగా ఆదర్శావతారమైన రామావతారమున, అష్ట సిద్ధులను నాలుగు కళలను ఉపసంహరించుకొని ద్వాదశ కళలతో నేను ఆవిర్భవించగా అది పూర్ణావతారము. ఇక, షోడశకళలతో ఆవిర్భవించినదే పరిపూర్ణావతారమైన కృష్ణావతారము నేనే. ఈ షోడశ కళలే, షోడశ సంవత్సరముల వయస్సు గల బాలా రూపమైన శ్రీయంత్రగత శ్రీ శక్తి. శ్రీ శక్తి అనగా నా 16 సం॥ వయోరూపసౌందర్యకళలే అని తెలియుము. (శ్రీ దత్త భగవానుడు నిత్యము 16 సం॥ ప్రాయములోనుండునని ప్రసిద్ధికలదు).

శ్లో॥ అవతారే శివం విష్ణుం, సృజామి ప్రకృతిం మతః
మాతృగర్భేఽవతారాఙ్గం. భక్తావేశాఙ్గమేవ వా॥ 5

తా॥ శివ కేశవాత్మకమైన ఒక ప్రకృతి రూపమును, నా అవతారము కొరకు సృష్టించెదను. బ్రహ్మశబ్దముతో సూచింపబడు నేను సృష్టికర్తను. అట్టి ప్రకృతి రూపము ఒక మాతృగర్భమున సృష్టించబడినపుడు అది అవతారశరీరమగును. లేదా అట్టి ప్రకృతిరూపుడగు నా భక్తుడే తాత్కాలికముగ నాశరీరము కావచ్చును. అపుడది ఆవేశ శరీరమగును. ఇదే అవతార శరీరము, ఆవేశ శరీరమునకు తేడా.(తేడా ఏమిలేదని భావము).

శ్లో॥ బ్రహ్మ విష్ణు శివా శ్శబ్దాః, పాత్రాణ్యేవ రసోచితమ్
నన్యూనాధిక్యమేవాస్మి, న పూజ్యోహ్య శ్చతుర్ముఖః॥ 6

తా॥ బ్రహ్మ, విష్ణు, శివ శబ్దములు మూడు సందర్భోచిములగు అర్థములను అందించు రస పాత్రల వంటివి. కాన, ఇందులో ఒకరు అధికులు మరొకరు తక్కువ వారని భ్రమపడరాదు. నేను అవతరించునపుడు "ఊహించుటకు వీలుకాని వాడు" అను అర్థము గల బ్రహ్మ శబ్దముతో, సూచింపబడుదును. అనగా పూజలేని వాడు అని కాదు . పూజించుటకు వీలుకాని వాడు అని అర్థము. (అనూహ్యుడు కాన పూజకు అందడని భావము కాని, అపూజ్యుడని అర్థము కాదు).

శ్లో॥ బ్రహ్మ విష్ట ద్వయం త్రైత, మవతీర్ణం ద్వయం నరః
విద్యుత్తన్త్రీవ చా త్రైతం, దత్త మాత్రేయ మత్రహి॥ 7

తా॥ ఈ శివ కేశవ ద్వయమైన ప్రకృతి రూపాన్ని బ్రహ్మయైన నేను ఆవేశించినపుడు అవతారము అగును. అవతారములో శివ-కేశవ-బ్రహ్మలున్నారు. సామాన్య మానవునిలో శివ (పరా), కేశవుడు (అపరా) ఇరువురే ఉన్నారు. ఇదే అవతారమునకు-సామాన్య మానవునకు తేడా. అవతారము బ్రహ్మ-విష్ణు-శివాత్మకమైనది. అయితే, ఇందులో ముగ్గురు లేరు. ముగ్గురు ఒక్కటియే. అనగా బ్రహ్మమే. విద్యుచ్ఛక్తి తీగె లోనికి ప్రవేశించినపుడు దానిని "విద్యుత్" అనియే అందుము కదా. ఈ మూడు ఒకటి యగుటయే అ-త్రి - ఆత్రేయము. ఇట్లు, మూడు ఒక్కటియై లోకమునకు అందించబడినది (అనగా "దత్తం") యే దత్తాత్రేయ మనబడుచున్నది.

శ్లో॥ విద్యుద స్పర్శ ధర్మోహి, లతాయాం చ స విద్యుతి
బ్రహ్మవాచ్యం విద్యుదివ, స్వాధర్మా ద్బ్రహ్మ సోఽప్యహమ్॥ 8

తా॥ విద్యుత్తు ఒక లోహపు తీగె లోనికి ప్రసరిస్తున్నపుడు దానికి విద్యుత్ గుణములే ఉండును. కానీ, తీగె గుణములుండవు. "విద్యుత్" ను తాకలేము. తీగెను తాకగలము. విద్యుత్ గల తీగెను కూడా తాకలేము. కాన విద్యుత్ తీగెలో, విద్యుత్ యొక్క గుణమే ఉన్నది తప్ప, తీగె గుణము లేదు. తీగె గుణము ఉన్నచో, విద్యుత్తీగెను, మామూలు తీగెను వలె తగలవలయును గదా. కాన విద్యుత్-తీగెను "విద్యుత్" అనియే



వ్యవహరించవలెను. తీగె, తనకున్న "తగలుటకు వీలగుట" అను తన గుణాన్ని కోల్పోయింది కాన "తీగె" శబ్దము ఇక దాని యందు చెల్లదు. కాన అవతారము నేనే. దత్తునకు, దత్తావతారమునకు తేడాలేదు. అవతారము సాక్షాత్తుగా బ్రహ్మమే. (బ్రహ్మమే విద్యుత్. తీగయే అవతార శరీరము).

శ్లో॥ జీవ శ్శఙ్కరవ ద్బ్రహ్మ, దేహోవా హనుమా నుభౌ
కృష్ణవ చ్చాపరాక్షేత్ర, శిలా వా బహవో హ్యమీ॥ 9

తా॥ అవతారములనేక రకములు. కేవల పరాజీవుడే శంకరాచార్యునిలో వలె బ్రహ్మము కావచ్చును. లేక, కేవల అపరాశరీరమే బ్రహ్మమై, జీవుడు దాస బుద్ధితోనే, హనుమంతుని వలె ఉండవచ్చును. లేక, శ్రీకృష్ణునిలో వలె పరా, అపరయు బ్రహ్మమే కావచ్చును. లేక పుణ్యక్షేత్రములలో గల శిలా విగ్రహమగు కేవలము అపరయే (అనగా పరాజీవుడు లేనిది) బ్రహ్మము కావచ్చును.

శ్లో॥ బుద్ధం జ్ఞానం ధర్మచక్రం, జీవోద్ధరణ సఙ్ఘగః
ఆశ్రిత శ్శరణం యాతి, బుద్ధాద్యా ఇతి మోక్షగాః॥ 10

తా॥ బుద్ధుడు - ధర్మము - సంఘములను శరణము పొందుట అనగా - బుద్ధుడు అనగా బుద్ధి -అనగా జ్ఞానము. కనుక జ్ఞానమును ముందు ఆశ్రయుంచవలెను అని భావము. దాని వలన భక్తి కలుగును. తరువాత భగవత్సేవా రూపమైన కర్మ యందు అనగా ధర్మ చక్రమును ప్రవేశించుట. ఈ ధర్మ చక్రములో స్వార్థముండదు. సర్వజీవుల ఉద్ధరణమే భగవత్కార్యము. కాన స్వార్థరహితముగా సంఘమును సేవించు వాడు జ్ఞాన ప్రచారమును కావించుచు స్వామిసేవకుడుగా ధర్మచక్రమున పుట్టుచు, మరణించుచు, అవతార పురుషునివలె సదా శాంతితో సంఘోద్ధరణము కావించుటయే భావము. ఇట్లు బుద్ధ, శంకర, రామానుజ, మధ్వాది మహాత్ములు అచరించిరి. వీరే ముక్త జీవులు.

శ్లో॥ సిద్ధాదౌ చిత్త దేహార్థ, స్త్వచ్ఛబ్దో బ్రహ్మ కేవలః
దత్తాత్రేయో జగద్వ్యాపీ, బ్రహ్మోపాస్య ఇతీర్యతే॥ 11

తా॥ అవతార - సిద్ధ - ఆవేశము గల - పురుషుల విషయములో వారి చిత్తమే కాదు. వారి శరీరము కూడా బ్రహ్మమే. చైతన్యము (చిత్తము/జీవుడు), శరీరము, ఆ

శరీరములోని చిత్తములో నున్న పూర్ణ బ్రహ్మము - ఈ మూడు ఏకమై, బ్రహ్మమే అనబడును. కాన ఇది అత్రేయమగును. అత్రేయమై,ఉపాసనకు దత్తమగు చున్నది కాన దత్తా త్రేయము. అనగా అవతార పురుషుడు, సిద్ధపురుషుడు, బ్రహ్మావేశము కలవాడు ఈ ముగ్గురూ దత్తాత్రేయ స్వరూపమే. ఈ పురుషుడు విశ్వవ్యాపక బ్రహ్మమే కాన ఈ పురుషుడే పరబ్రహ్మ స్వరూపుడు, ఉపాస్యుడు అని "తత్త్వ మసి" వాక్యార్థమునకు సయన్వయించవలెను. (అనగా దత్తావతారములను దత్తబ్రహ్మముగ తెలుసుకొని వారిని దత్తబ్రహ్మముగా ఉపాసించవలెను).

శ్లో అవతారే తథాZZవేశే, మయోక్త మను భూయతే
అద్వైత మస్తి నిత్యం వా, మయాZన్యః పరిభూయతే॥ 12

తా॥ నేను అవతరించినపుడు కాని, ఎవరినైననూ ఆవేశించినపుడు కానీ, "నేను బ్రహ్మమును"అని పలుకుదును. ఇట్టి అద్వైతమును ఆవేశములలో మనము చూచుచున్నాము కాన,అద్వైతమున్నది. అయితే, ఈ అద్వైతము అవతారములలో నిత్యముగా ఉండును. ఆవేశములలో అనిత్యముగా (తాత్కాలికముగా) ఉండును. ఇట్లు అవతారమూ కాకుండా, నా ఆవేశమూ లేకుండా, "నేను బ్రహ్మము" అని పలుకువాడు , నాచేత పరాభవించబడును. అనగా వాని బండారమును బయటపెట్టి అవమానించెదను.

శ్లో అనన్త శీర్ష పాణ్యఙ్ఘ్రి-వక్తా కర్తాZZగతో హ్యహమ్
సర్వత్ర పశ్యే త్తత్త్వజ్ఞః , కణే పూర్ణం బహిర్భవమ్.॥ 13

తా॥ ఆవేశించి ఎవరి ద్వారా అయినా మాట్లాడగలను కాన నేను అనంత శిర్షుడను. ఆవేశించి ఎవరి ద్వారా అయినా ఏ పని అయినా చేయగలను. కాన అనంత పాణిని. ఆవేశించి ఎవరి ద్వారా అయినా రాగలను. కాన అనంత పాదుడను. అవతార తత్త్వమును తెలిసిన వాడు, నన్ను సర్వత్ర చూచును. ఏలననగా, నేను సర్వత్ర, ప్రతి కణంలోను పరిపూర్ణంగా నిండియున్నాను. కాన నేను ఎక్కడైనా ప్రకటనము కాగలను.

శ్లో భగవా నవతీర్ణోZహం, చిత్ర సిద్ధి ప్రదర్శనైః
గురుశ్చ జ్ఞాన బోధేన, నాస్తికాయాస్తికాయ చ॥ 14



తా॥ నేను అవతరించినపుడు, విచిత్రములైన సిద్ధులను ప్రదర్శించి, నా భగవత్తత్త్వమును ప్రదర్శించి నాస్తికులను ఆస్తికులుగా మార్చుదును. ఆ తరువాత, నాగురు స్వరూపముతో జ్ఞానమును బోధించుచు, ఆస్తికుని లక్ష్యము వద్దకు సకాలములో చేర్చెదను.

శ్లో సిద్ధ వాక్యమిదం మే స్యా, దవతీర్ణస్య వా భువి
ఆరూఢోZవతరత్యాద్యః, పరో వృక్షాగ్రసంస్థితః॥ 15

తా॥ కాన, "నేను బ్రహ్మము" అను వాక్యము సిద్ధుని లేక అవతార పురుషుని వాక్యము. సిద్ధునికి, అవతార పురుషునికి తేడా లేదు. చెట్టు ఎక్కి క్రిందికి దిగినవాడు సిద్ధుడు. చెట్టు పైనుండి క్రిందికి దిగినవాడు అవతార పురుషుడు.

శ్లో నయామి శరణాయాతం, బ్రహ్మగమ్యం సతా పథా
ఏవం కర్తుం చావతీర్ణో, బోధయామి పునః పునః 16

తా॥ జీవుడు నాకు సంపూర్ణశరణాగతిని చేసినపుడు, గమ్యము-మార్గములను నాకే వదలి వేయును. అపుడు నేను వానిని సన్మార్గమున బ్రహ్మము అను గమ్యమునకు చేర్చెదను. నాకీవిధముగా సంపూర్ణ శరణాగతిని చేసి ఉత్తమ గమ్యమును చేరమని నేను అనేకావతారములనెత్తి అందరికినీ మాటిమాటికినీ బోధించుచున్నాను.

శ్లో శక్త్యా ప్రకటితే భక్తి, స్సర్వదృశ్యా స్వకీయతః
అశక్త్యా సత్య భక్తిస్తు, సార్థాయా ఇవరాజని॥ 17

తా॥ నా అవతారము అతిరహస్యముగ నుండును. పరబ్రహ్మమైన నేను ప్రకటించు కున్నచో, దేవతలు, ఋషులు సైతము నన్ను ప్రేమించి అర్చింతురు. అపుడు తారతమ్యము తెలియదు. నేను ప్రకటించకుండా, సామాన్యుడివలె నుండు నపుడే, ఎవరు నన్ను ప్రేమించి అర్చింతురో వారే నిజమైన భక్తులు. నా శక్తి ప్రకటితమైనపుడు ప్రతి జీవుడూ, స్వార్థముతో నన్ను ప్రేమించి అర్చించును. నేను అశక్తునిగా ఉన్నట్లు నటించినపుడు, ప్రతిఫలాపేక్షయు, స్వార్థము లేకుండు వాడు మాత్రమే నన్ను ప్రేమించి అర్చించును. రాజకుమారుడని తెలిసి, ఒక ధనికుని పుత్రిక ప్రేమించుటలో గొప్ప ఏమున్నది? ఆ రాజకుమారుడు ఒక పేదవానిగా నటించునపుడు వానిని ధనికుని పుత్రిక ప్రేమించెనేని, అది సత్యమైన ప్రేమ గదా.

శ్లో కృష్ణ శ్శప్తోఽపి విష్ణుత్వం, ధర్మా త్ప్రాప్త స్స వైష్ణవః
అధర్మ ఖణ్డనా ద్వేషై, ర్న జీవో గుణకర్మతః॥ 18

తా॥ విష్ణువేషమును ధరించినంతమాత్రాన వైష్ణవుడు కాడు. విష్ణువు యొక్క గుణకర్మలను కొంతవరకు అయినా ఆచరణలో పొందినపుడే విష్ణుత్వము లభించును. అధర్మమును అణిచి, ధర్మ స్థాపన చేయుటయే విష్ణువు యొక్క గుణకర్మ, నాకెందుకు లెమ్మని విష్ణువు ఉపేక్షించడు. అన్నదమ్ముల కలహము నాకెందుకు లెమ్మని కృష్ణుడు ఊరుకొనలేదు. గాంధారీ శాపమును పొందియును, కల్పించుకొని, అధర్మనాశనము చేసెను. కాన కృష్ణునిలో విష్ణుతత్త్వమున్నది కాని, వేషము వలన కాదు. కాన, లోకములోని అధర్మమును శక్తి మేరకు అణిచి వేసి, ధర్మమును సమర్థించువాడే నిజమైన వైష్ణవుడు అగును కానీ వేషము వలన కాదు. కాన, మనకెందుకని ఉపేక్షించక, లోకములో కంటపడిన ప్రతి అధర్మమును యధాశక్తి ఖండించి ధర్మమును సమర్థించువానికే విష్ణుత్వము లభించును.

శ్లో శఙ్కరో లోకకల్యాణే, ప్రాణత్యాగీ న వేషతః
సింహ మత్తేభ శాసీ నా, నామరూపే న కర్మహి.॥ 19

తా॥ అట్లే విభూతి పూసుకొన్నందున నిజమైన శైవుడు కాడు. లోకమునకు "శం" అనగా హితమును చేయువాడు శంకరుడు. జీవులను అధ్యాత్మికముగా ఉద్ధరించుటలో కొంత కృషి చేసినవానికే శివత్వము లభించును. శంకరాచార్యుడు, స్వార్థసుఖములన్నింటిని త్యజించి, జీవులనుద్ధరించుటకై అహర్నిశము కృషిచేసెను. దుర్మతములను ఖండించి, జీవులను సన్మార్గమునకు త్రిప్పుటలో చివరకు శాక్తేయుల ప్రయోగమునకు గురియై ప్రాణములను సైతము త్యజించిన మహాత్యాగి శంకరాచార్యుడు. సింహము నామము వేషము ధరించి, మేకను చూచి బయపడువాడు సింహమగునా? సింహము యొక్క వేషనామములు లేకయే, మదగజము మీదకు లఘించి దాని మదమును అణచు వానిలో సింహత్వమున్నదని చెప్పవచ్చును. కాన గుణకర్మలే దైవత్వసాధనకు లక్ష్యములు కాని, నామరూపములు కానేకావు.

శ్లో జ్ఞానరూపా భక్తిసేవా, వృద్ధ వృద్ధే ర్నిషిధ్యతే
సంసారే వేదనా భక్త్యై, మృత్యుగా శక్తి రన్యథా॥ 20



తా॥ అచేతనములకు జ్ఞానము భక్తి - కర్మ యోగములు లేవు. కాన, సచేతన ప్రాణులకే యీ యోగములు.సూక్ష్మముగా విచారిస్తే జ్ఞానమే భక్తి, భక్తియేసేవ. ఒక వస్తువును గురించి పూర్ణవివరణము తెలుసుకొనుటయే జ్ఞానము. అ జ్ఞానము కలుగుచున్న కొలదీ, ఆ వస్తువుపై ఆకర్షణయు (భక్తి) పెరుగును. కాన, జ్ఞానస్వరూపమే భక్తి. ఇట్లే, ఆకర్షణ పెరిగిన కొలదీ, ఆ వస్తువును సేవించుట ఎక్కువ అగును. కాన, భక్తి స్వరూపమే సేవ. భక్తిలో కలుగు వేదన, శాంతికి విరోధము కాదు. సంసార వేదనలు నిషిద్ధములు కాని, భగవద్భక్తి వేదన నిషిద్ధము కాదు. అసలు సంసారవేదనలను త్యజించి, దాచుకొన్న శక్తిని, భక్తి వేదనలో వ్యయము చేయుటకే తప్ప, ఏవ్యయమునూ చేయక, చివరివరకూ దాచుకొని, చివరకు మృత్యువు పాలు చేయమని కాదు గదా. కావున రాధా హృదయ వియోగ భక్తి వేదన, నన్ను అల్లకల్లోలము చేయుట, నా శాంతికి భంగముకాదు. అసత్యమైన ప్రేమలను సత్యములుగా భావించి, మోసపోయి, సంసార వేదనలను పడరాదు అనుటలో యోగము, శాంతి, ఉపదేశించబడినదే తప్ప, సత్యమైన భక్తుల ప్రేమ విషయములో కాదు. సత్యమైన ప్రేమయే నా సత్య స్వరూపము.

శ్లో॥ రాధాదృగఞ్చలైఃకుర్యాం, సృష్ట్యాద్యాదర్శసేవికా
జ్ఞానం భక్తిః క్రమా త్సేవా, గురో స్సోపాన పద్ధతిః॥ 21

తా॥ ఆ భక్తి పరాకాష్ఠ చేత రాధ మహాశక్తి యనబడినది. ఆమె కనుసైగలతో నేను జగత్సృష్టి స్థితి ప్రళయములను చేయుచున్నాను. ఆమె నా కార్యక్రమమున సహకరించి సేవ చేసిన పరమధన్యురాలు. భక్తిపరాకాష్ఠ ఇట్లుండునని లోకమునకు ఉపదేశము చేయు సేవలో పాల్గొన్నది. భక్తి యొక్క సత్యమైన పరీక్షయే సేవ. సేవలేని భక్తి సత్యముకాదు. అందువల్లనే రాధ నాపాదదాసిగా అనగా మరల మరల నా కార్యక్రమమును చేయు సేవకురాలిగా పుట్టుటనే చివరలో కోరినది. కావున జ్ఞానము వలన భక్తి, భక్తి వలన సేవ రావలయును. భక్తి యొక్క సత్యమైన రూపమే సేవ. జ్ఞానము లేనిదే భక్తిరాదు. స్వామిని గురించిన జ్ఞానము లేక స్వామిపై ఆకర్షణ, స్వామిని పొందవలయునన్న తపన (ఆకర్షణ తపనేలే భక్తి) రాదు. ఈ జ్ఞాన, భక్తి, సేవలను క్రమముగాశంకర-రామానుజ-మధ్వాచార్యుల రూపంలో లోకానికి ఉపదేశించితిని. మూడూ వరుస మెట్లు. పైమెట్టు ఎక్కి కిందమెట్టును చులకనగా చూడరాదు. పైమెట్టు, కింది మెట్టు ఆధారముతోనే నిలచియున్నదని గ్రహించవలయును.

శ్లో॥ రాధా గాయతి పతితా, పాదయో రితి సైకతే
గ్రీష్మే హి శబ్దయా లీయే, స్మృతే ర్వాత్యార్ణవోపమః॥ 22

తా॥ యమునాసైకతాలలో గ్రీష్మకాలములో నడుస్తూ రాధ విరహవేదనతో తూలుతూ ప్రతి అడుగును "స్వామీ! నీచరణాలపై పడుతున్నాను" అని పాడినది. ఎందుకంటే, ప్రతి అడుగులోను తూలుచున్నది. ఏ అడుగులో అమె పడిపోయి ప్రాణములను విడుచునో తనకు తెలియదు. అందుకే ప్రతి అడుగులోను ఈ పదాన్నే పాడుతున్నది. ఆమె భక్తి పరాకాష్ఠ, ఒకనాడు ఆపాటతోనే పడిపోయి ప్రాణములను విడచినది. భక్తి యొక్క కొనను లోకమునకు చూపించదలచి అట్లు చేసితిని. నా అవతారమును చాలించుకొన తలచినపుడు ఆమె స్థితిని స్మరింతును. వెంటనే నా ప్రాణములు పోవును. ఇదే నా అవతార సమాప్తి కారణ రహస్యము. నేను శాంతి సముద్రుడనే కాని, రాధాస్మరణ మను పెను తుఫాను సోకగనే నేను అల్లకల్లోలమగుచున్నాను.

శ్లో॥ భక్తిమద్యే విదేశీయ - మద్యం రాధారసః పిబన్
నతిష్ఠామ్యపి సర్వేషాం, సహే ప్రళయవేదనామ్॥ 23

తా॥ నేను కల్లు తాగువానిగా కనపడుదును. ఆతెల్లని కల్లు, నాభక్తుల భావరసమే. అది తాగి తాగి, నేను సదా ఉన్మాదస్థితిలో నుందుదును కాన, నన్ను ఉన్మత్త దత్తుడన్నారు. ఇక రాధాభక్తిరసమన్ననో అది చాలా శక్తి వంతమైన విదేశీయ మద్యము. అది కొంచెము చవి చూచినచో నేను మూర్ఛిల్లుదును. ఆ భావావేశమును తట్టుకొనలేక నాఅవతార సమాప్తి జరుగును. నిజము చెప్పుచున్నాను. ప్రళయ కాలమున యీ సర్వ జీవుల్ల, మరణ వేదనలను క్షణకాలములో అవలీలగా అనుభవించగల శక్తి నాకుగలదు. కానీ రాధా హృదయ భక్తి వేదనను మాత్రము తట్టుకొను శక్తి లేక ప్రతి అవతారములోనూ నా శరీరము రాలిపోవుచున్నది. రాధాస్థానమును మించిన స్థానము కానీ, అమె భక్తిని మించిన భక్తి రసము కానీ, యీ సృష్టిలో ఇంతకు ముందు కానీ, ఇపుడు కానీ, ఇక ముందు కానీ లేదు లేదు లేదు.

శ్లో॥ నానార్థ శూన్యమాలోక్య, మేకత్వానవకాశతః
ప్రత్యక్షా న్నాస్తికా బ్రహ్మ, నేత్యాహు స్తదసమ్మతమ్ 24



తా॥ నాస్తికులు కనపడు దానినే విశ్వసింతురు. వారలకు నానాత్వము (అనేక పదార్థముల వలన భేదము) కనపడుచున్నది. అట్లే ఏ పదార్థము లేని శూన్యము కనపడుచున్నది. కాన, వారు శూన్యములో పదార్థము అతి సూక్ష్మంగా ఉన్నదంటే అంగీకరించరు. శూన్యమంతా ఒక పదార్థంతో నిండి ఉంటే, అసలు నానా పదార్థాల స్థితికే అవకాశములేదు. అంతా ఒకే తత్త్వము వ్యాపించి ఉంటే, రెండవ పదార్థానికి అవకాశ మెక్కడ ఉంటుంది! ఎప్పుడైతే, శూన్యము, నానా పదార్థాలు విడివిడిగా ఉన్నాయనితేలినదో, ఇక వేదము చెప్పే ఏకతత్త్వానికి చోటులేదు. ఏకతత్త్వం అనేక తత్త్వాలు, ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో కలసి ఉండే విచిత్ర తత్త్వమైన బ్రహ్మమునకు అసలు అవకాశములేదు. అనగా అంతా ఊహకు అందునదే తప్ప, ఊహకు అందని విచిత్ర తత్త్వమేమీ లేదు అనియే వీరి మతము కానీ ఇది సరియైన మతము కాదు.

శ్లో॥ అనూహ్యం దర్శయామ్యేవ, ప్రతిపూరుష మాగతః
నహి దత్త కథా దృష్టం, భ్రమమాహు ర్హి దణ్డగాః॥ 25

తా॥ ఊహ కందని తత్త్వము ఉన్నదని, ఊహకు అందని క్రియలగు సిద్ధుల ద్వారా బ్రహ్మము యొక్క అవతారములు ప్రత్యక్షముగా ప్రతి తరములోనూ నిరూపించుచున్నది. వెనుక తరములో నిరూపించిన వాటిని కట్టుకథలని ఈతరము వారు అనుకొనకుండా, ప్రతి తరములోని "అనూహ్య శక్తి" ఉన్నదని అవతారములు నిరూపించుచున్నవి. ప్రత్యక్ష వాదులగు నాస్తికులు, ప్రత్యక్షముగా కనిపించు ఈ జగత్తును సత్యము అనుచూ, ప్రత్యక్షముగా కనిపించు ఈ సిద్ధులను భ్రమలనియు, ఇంద్రజాలములనియు కొట్టివేయుచూ, తమ మతమే సత్యమని మొండిగా వాదించు చున్నారు. ప్రతి ప్రశ్నకు నేను నిరూపణము నిత్తును. పదిసార్లు బోధింతును. కాని మొండి తనమునకు దండనమే తప్ప, వేరు మార్గము లేదు కాన, వీరిని శిక్షింతును. శిక్షంచుట మార్పుకొరకేకాని ద్వేషముకాదు.

శ్లో॥ శూన్యా ద్వస్తూని సృజ్యన్తే, శూన్యే లీనాని శూన్యసత్
ఏకతత్త్వం చ వేదోక్తం, సమసత్యే హ్యనూహ్యతః 26

తా॥ శూన్యము నుండి వస్తువులను సృష్టించుట వలన, శూన్యము లేదనియు, శూన్యము అంతయూ బ్రహ్మముతో నిండి యున్నదనియే తెలుచున్నది. వస్తువులను లయము

చేసి శూన్యముగా మార్చుచున్నందున సమస్త పదార్థములు శూన్యములో ఏకతత్త్వముతో నున్న వనియే తెలుచున్నది. కావున, అవతారములలో ప్రదర్శించు ఈ సిద్ధుల ద్వారా వేదోక్తమైన సిద్ధాంతమును నిరూపించుచున్నాను. అట్లు అయినచో అంతా ఏకతత్త్వమేనని బ్రహ్మము యొక్క వేదోక్త స్వరూపము బుద్ధికి అందినది కదా అంటే వేదోక్తమైన ఏకతత్వాన్ని ప్రత్యక్షంగా కనపడే నానాత్వము విరోధించుచున్నది కదా. ఈ రెండూ సత్యమే. ఏకత్వమూ-నానాత్వమూ రెండూ సమాన సత్యాలే. కానీ, బ్రహ్మము యొక్క అనూహ్యమైన విచిత్ర తత్త్వము వలన రెండు పక్షాలు సమన్వయించి ఉండుటవల్లనే బ్రహ్మము అనూహ్యము, చాలా గొప్పది.

శ్లో॥ శూన్యం సత్యంచ తద్బ్రహ్మ, సత్యం సిద్ధేః పరస్పరమ్
విరుద్ధే సకృదేకత్ర - సమేతం బ్రహ్మ నోహ్యతామ్॥ 27

తా॥ అనేక పక్షాలు ఎక్కడ ఒకేచోట ఒకే సమయంలో, ఒకదానినొకటి తర్కంద్వారా ఖండించుకుంటూ ఉంటాయో, ఈ పక్షాలు లోకంలో ఏ వస్తువులోనూ ఒకే సమయంలో సమన్వయించవో, ఆ పక్షాలు పరస్పర విరోధం లేకుండా తనలో సమన్వయించుకొనునట్లు చేయగలది బ్రహ్మము. ఉదా॥ ఉన్నది. లేదు. అనునవి రెండు అన్యోన్య విరోధముకల పక్షములు. ఒకటి ఉంటే, అదిలేదనే పక్షము ఎగిరి పోతుంది. అది లేకుంటే అది ఉన్నది అనే పక్షము ఎగిరిపోతుంది కాని అది ఉంది, అదే సమయంలో అక్కడే అది లేదు - అనే సమన్వయము బ్రహ్మములో సాధ్యము. అకాశము అనగా శూన్యము అనగా ఏమీ లేదు అనేది ప్రత్యక్షానుభవపక్షము. ఇది సత్యమే. ఆకాశము అనగా శూన్యము బ్రహ్మము అనేది అవతార సిద్ధుల ద్వారా ప్రత్యక్షంగా నిరూపించబడిన వేదోక్త పక్షము. ఈ రెండూ సమన్వయించినదే బ్రహ్మము. అనగా ఆకాశమనగా శూన్యము. ఆకాశమనగా బ్రహ్మము. ఈ రెండూ ఒకే సమయంలో ఒకే చోట సమాన సత్యములు. ఇది అనూహ్య విచిత్రము. ఇదే బ్రహ్మము.

శ్లో॥ ప్రజ్ఞానఘన ఇత్యుక్తే, రాకారం మాం విదుర్బుధాః
ఘనో హి దృశ్యతే సాన్ద్రో, నాసాన్ద్రో మరుదీక్షితః॥ 29

తా॥ "ప్రజ్ఞానఘనః" (చైతన్య ఘనము) అను శ్రుతి ప్రకారముగా నన్ను ఆకారముగనే పండితులు తెలియుదురు. సాంద్రత చెందిన పదార్థమగు ఘనము కంటికి



కనిపించునుగదా, సాంద్రత చెందని పలుచని పదార్థమగు వాయువు కంటికి కనిపించదుగదా! నేను సాంద్రత చెందిన ప్రజ్ఞాన ఘనము కావున వాయువు వలె కాక, కంటికి కనిపించుదును.

శ్లో॥ యత్సాక్షా దపరోక్షాచ్ఛ,తనూం వివృణుతే త్వితి
మదేకప్రీతి నిష్కామః, తపసా తాపవహ్నినా॥ 30

తా॥ "యత్సాక్షాదపరోక్షాత్" ("ఏది అపరోక్షముకాదో - ఏది సాక్షాత్కరించునో")అను శ్రుతి ప్రకారము, నేను కన్నులకు కనపడుదును. "వివృణుతే తనూంస్వాం" అనగా "తన రూపమును కనిపింపచేయును" అను శ్రుతి ప్రకారముగను నా రూపము, నేత్ర గోచరము. నాదర్శనము తపస్సు చేత కలుగును. ఆ తపస్సులో నాయందలి ప్రీతి తప్ప మరే కోరిక లేకుండి, అగ్ని వంటి తాపము కలుగును. ఆ తాపమే తపస్సు.

శ్లో॥ ఇదం రూపం తపోదృశ్య, మరూపమితి చ శ్రుతిః
నిషేధో యత్న వీక్ష్యస్య, రూపచైతన్యగాZథవా॥ 31

తా॥ ఈ నా రూపము విశేష యత్నమైన తపస్సు చేతనే చూడదగినది. అంతే కాని, అప్రయత్నంగా సూర్యాది రూపాలను చూచినట్లు, బ్రహ్మము చూడబడునది కాదనియే శ్రుతి చెప్పుచున్నది. లేదా - ఈ నా రూపంలోని రెండు భాగములైన అకార, నిరాకారములలో ఒక భాగమైన నిరాకారమైన చైతన్యమును గురించి శ్రుతి పలుకుచున్నదని భావించవచ్చును.

శ్లో॥ న చక్షుషేతి తచ్చోక్తం, పశ్యన్తీతి బహుశ్రుతమ్
గ్రీష్మార్కో దర్పణేక్ష్యోవా, చిత్తనుభ్యాం శ్రుతీపృథక్॥ 32

తా॥ "కంటితో గ్రహించబడదు" అని శ్రుతి "చూచి నారు" అని మరి కొన్ని శ్రుతులు కలవు. కన్నులతో చూచుటకు వీలుకాని, దుర్నిరీక్ష్యుడైన గ్రీష్మకాల సూర్యుడు, అద్దము మొదలగు విశేషప్రయత్నముల చేత చూడబడును గదా. అనగా - సూర్యుని కంటితో చూచుటకు వీలుకాదు అన్నప్పుడు అసలు చూడలేమని కాదు. విశేషప్రయత్నము చేత చూచుట సాధ్యమేనని భావము. కనుక శ్రుతి వాక్యములను వేరువేరుగా అన్వయించుకొనవచ్చును.

శ్లో॥ మాయాచ్ఛాదన తత్త్వోఽయం, నిర్మాయం న హి పశ్యతి
స్వశక్త్యా తపసా తస్మా త్త్రిలోకా శ్చరమా నృణామ్. 33

తా॥ ఈ జీవుడు నన్ను కప్పిన మాయావస్త్రము కాన ఈ జీవునిలో నా తత్త్వము లేనందున, మాయను పూర్తిగా వదలిన నన్ను, తన ప్రయత్నముతో చూడలేడు. అతడు తన ప్రయత్నశక్తియగు తపస్సుతో త్రిమూర్తుల వరకే దర్శించగలడు. వారు కొంచెము కొంచెము మాయాచ్ఛాదనమును కలవారు కాన జీవుడు తన తపస్సుతో వారిని చూడ గలడు. అందువలన తపస్సు చేత జీవులకు త్రిమూర్తుల లోకముల వరకే సాధ్యములు.

శ్లో॥ మాయా ముక్త మహం బ్రహ్మ, తపసా దయయా చ మే
పశ్యే త్పూర్ణ స్వతన్త్రోహి, కుణ్ఠితం కేవలం తపః॥ 34

తా॥ మాయను పూర్తిగా త్యజించిన (దిగంబర) బ్రహ్మము నేను. తపస్సుతో బాటు, నా దయ కూడ కలసి వచ్చిన ఎడల నన్ను దర్శించగలడు. నేను పరిపూర్ణ స్వతంత్రము కలవాడను కాన నీ తపస్సుకు బద్ధుడను కాను. కేవల తపస్సు, నా విషయములో వ్యర్థమగును. దానితో నా దయ కలసినచో నా దర్శనము అనుగ్రహించబడును. నా దర్శనము కేవల తపస్సాధ్యము కాదు.

శ్లో॥ అవతీర్ణో బహుగ్రామే, ష్వర్చిత స్సకృదప్యహమ్
అన్యరూపైశ్చ శూన్యాని, మృగతృష్ణా రవౌ గతే॥ 35

తా॥ నేను అవతరించినపుడు, ఒకే సమయమున, అదే రూపమున, భిన్నగ్రామములలో భిక్షను స్వీకరించినాను. అట్లే, మరియొక అవతారమున, ఒకే సమయమున వేరు రూపములతో వేరు ప్రదేశములలో గోచరించియున్నాను. అనగా, నేనే, నా మాయావిచిత్ర తత్త్వము వలన, అనేక, దేవతా రూపములుగా గోచరింతును. అన్ని రూపములూ నా వేషములే. అన్నింటిలోనున్న వ్యక్తిని నేను ఒక్కడినే. నేను ఆ రూపవేషములను వదలినచో, సూర్యుడు తన వెలుగును ఉపసంహరించుకొన్న ఎండమావులవలె, ఆ దేవతలు శూన్యమైపోదురు.



శ్లో॥ సకృదేకత్ర చాన్యత్ర - బహుధా కేవలోఽస్మి చ
ఏకదైకత్ర తే తేజ - స్తమసీ స్తో మమేచ్ఛయా॥ 36

తా॥ ఒకే సమయములో ఒకే చోట ఒక్కడిగాను, అనేకులు గాను ఉండగలను. అట్లే నానా ప్రదేశములందు ఒకే సమయమున, ఒక్కడిగాను, అనేకులు గాను, ఉండగలను. ఒకే సమయంలో, ఒకే ప్రదేశంలో చీకటి-వెలుగులు, నేను సంకల్పిస్తే, ఒక్కటిగా ఉండగలవు. నేను సర్వ శక్తి సంపన్నుడను గదా!

శ్లో॥ బ్రహ్మవిష్ణు శివా స్స్వల్ప - వేషై ర్దృశ్య స్వరూపవాన్
అహంవేషై ర్లఘుచ్ఛన్నై, రన్యే దేవా ఇమేఽప్యహమ్॥ 37

తా॥ చాలా పలుచని, స్వల్పవేషములతో, నాస్వరూప మంతయును పూర్తిగ గోచరించు వేషములే బ్రహ్మ, విష్ణు, శివులు. నా స్వరూపమును కొంత కొంత భాగములలో కప్పిన వేషములే ఈమిగిలిన దేవతలు. వీరునూ నేనే.

శ్లో॥ నాను వృత్త స్వరూపస్స్య, మశ్మవస్త్రేణ వేష్టితః
అనువృత్తాంశుకాకారో, నరోఽహం యోవిశిష్యతే॥ 38

తా॥ నా స్వరూపమును పూర్తిగా ఆచ్ఛాదనము చేసి, నా అంగాంగ విభాగమును ప్రత్యేకముగా కనపడనీయకుండ, ఒక వస్త్రముచే చుట్టబడినట్లు ఉందును. అపుడు ఈ జగత్తులో వేరు రూపములతో భాసింతును. అనగా నేను రాయి, చెట్లు మొదలగు వేరు రూపములతో ఈ జగత్తులో కనపడుదును. అదే మాయా వస్త్రము నా అంగములకు అనుకూలముగా ఆచ్ఛాదనము చేయబడి, నా స్వరూపము కనిపించక పోయిననూ, నా స్వరూపమునకు అనుకూల రూపము కనిపించును. అదే మానవుడు. అతడు యితర (జగత్తు లోని) రూపముల కన్న విశిష్టత కలవాడు. కాన నా అంశయనబడుచున్నాడు.

శ్లో॥ త్రిమూర్తిభి రహం దృశ్యో, భగవద్భి స్సమగ్రతః
జ్ఞేయ స్త్రిగురుభి శ్చాస్మి, ప్రస్థాన త్రయ భాష్యదైః॥ 39

తా॥ భగవంతులైన త్రిమూర్తుల ద్వారా నేను పూర్తిగా కనపడుదును. అట్లే ప్రస్థానత్రయ గ్రంథములకు (ఉపనిషత్తులు-బ్రహ్మసూత్రములు-గీత) భాష్యములు వ్రాసిన గురుత్రయము ద్వారా నేను తెలియబడుదును.

శ్లో॥ వయోరూపకళా వర్ణి-గేహి విద్యాకులస్య చ
లిఙ్గాచారమతాహన్తా-ప్రతిరూపేక్షితో గురుః॥ 40

తా॥ సర్వవిధములగు అహంకారములను పొగొట్టు జ్ఞానబోధక గురురూపములతో నేను సదా కనపడుచుందును. రూపాహంకారము కల వానికి కురూపిగను, వయోహంకారము కలవానికి వృద్ధునిగను, కళాహంకారము కలవానికి కళాహీనుడిగను, బ్రహ్మచర్యాహంకారము కలవానికి గృహస్థునిగను, గృహస్థాహంకారికి వ్యభిచారిగను, విద్యాహంకారము కలవానికి పామరునిగను, కులాహంకారము కలవానికి చండాలునిగను, పురుషాహంకారము కలవానికి స్త్రీగను, ఆచారాహంకారము కలవానికి మద్యపానము చేయుచున్నవానిగను, మతాహంకారము కలవానికి అన్యమతస్థునిగను కనబడుచుందును.

శ్లో॥ జీవేన్యస్తా మమస్వేచ్ఛా, ప్రతిబిమ్బం జగన్మమ
కర్తృశక్తి రహంజీవా, అబధ్న న్పురుషం పశుమ్॥ 41

తా॥ ఈ సృష్టి అంతయును నా ప్రతిబింబము వంటిది కాన, నాకున్న స్వాతంత్ర్యమును మానవుని యందు ప్రవేశపెట్టితిని. దీనివలన, జీవుడు, తన ఇష్టానుసారముగ కొన్ని కర్మలను చేయుచు, కొన్ని చేయక, ఆయాకర్మఫలములనుభవించుచున్నాడు. అయితే, జీవుడు ఏ కర్మలను చేసినా, ఆకర్మలను చేయుశక్తిని నేనే. జీవులు, పరమాత్మను వాహన పశువుగా చేసుకొన్నారు. అనగా- ఒక వాహనమును లాగు వృషభము ఎట్లు, మనుష్యుని గమనము అను కర్మకు తానే చేయు శక్తియైనను, ఏ మార్గమున పోవలయునో, ఏ గమ్యము చేరవలయునో అను అంశమునకు వృషభముతో సంబంధములేదు. కాన వాటిసంబంధము గల మనుష్యుడే ఆయాఫలముల భోగించును. " అబధ్నన్ పురుషం పశుం" అను శ్రుతి గలదు. (అనగా - "పురుషుడగు పరమాత్మను వాహనములకు పశువుగా బంధించిరి").

శ్లో॥ యథేష్టం కర్తృశక్తి స్స్వయం, న ఫలం మమతత్కృతేః
కర్తాభోక్తా నచాహం తు, జగత స్తద్వినోదతః॥ 42

తా॥ వారివారి ఇష్టప్రకారముగా నేను వారు సంకల్పించిన కర్మలను చేయు కర్త యొక్క శక్తినే తప్ప, వారికర్మల ఫలముల భోగముతో నాకు సంబంధములేదు. కాన, జీవుడు



చేయుపనులకు కర్త, భోక్త, జీవుడే. నేను ఈ సర్వజగత్తునకునూ కర్తను. ఈ జగత్తును సాక్షిగా చూచి వినోదానందము ననుభవించు భోక్తను మాత్రమే.

శ్లో॥ అహంయామీత్యహఙ్కారీ, బ్రూయాత్సాశ్వో యథాతథా
కర్తాzహ మప్యకర్తా చ, కరోమ్యహ మితీర్యతే॥ 43

తా॥ ఒక గుఱ్ఱము నెక్కివచ్చుచున్నవాడు" నేను వచ్చుచున్నాను" అని అహంకారముతో చెప్పినట్లు అనగా వానిని నిజంగా గుఱ్ఱం తీసుకువచ్చినా, నేను వచ్చుచున్నానని అహంకరించి చెప్పినట్లుగా జీవుడు చేయ సంకల్పించిన పనిని నిజంగా నేను చేసిననూ, అహంకారముతో "నేను చేసితిని" అని చెప్పుకొనుచున్నాడు. జీవుడు తనకు కావలసిన గమ్యమున పొందుమార్గమును నాకు నిర్దేశించినాడే తప్ప, నిజముగా ప్రతి పనిని నేనే చేయుచున్నాను.

శ్లో॥ అహమేత ఇతి బ్రూయా, న్నాశ్వేనాహ మితి క్వచిత్
క్రియాశక్తిం చ మాం హిత్వా, మృత్యావేత్తి గతేమయి॥ 44

తా॥ ఈ జీవుడు ప్రతి క్షణమూ అహంకారముతో అసత్యము లాడుచుండును. ప్రతి పనినీ చేయు క్రియా శక్తిని నేనే. కానీ, ప్రతి పనిని తానే చేసితినని అహంకారముతో మాట్లాడుచుండును. గుఱ్ఱము నెక్కి వచ్చిన వాడు, "నేను వచ్చితిని " అనునే తప్ప గుఱ్ఱము నన్ను మోసుకొని వచ్చినది అని అనడు. ఈ అహంకారముతో జీవితమంతయును "నేనే చేసితిని" "నేనే చేసితిని" అను అబద్ధములతో విసుగెత్తి, క్రియా శక్తి యగు నేను ప్రక్కకు తప్పు కొందును. అప్పుడు జీవుడు తన మృత్యుసమయంలో ఏమీచేయలేక తన అహంకారము - అబద్ధములను గురించి తెలుసుకొని వేదన చెందును.

శ్లో॥ ప్రవిమృష్టః పురో జీవో, మమ స్వాతంత్ర్యలేశవాన్
తేన మత్సృష్ట సదస - ద్గ్రహణం చ యథేచ్ఛయా॥ 45

తా॥ బాగుగా విమర్శచేసినచో జీవుడు నాయొక్క స్వాతంత్ర్యములోని ఒక కణమును ఆదిలో కలిగియేయున్నాడు. ఆదిలో నేనును మంచినీ, చెడునూ క్రీడా వినోదార్థము

సృష్టించితిని. ఈ స్వాతంత్ర్యము వలన కొందరు జీవులు మంచిని గ్రహించిరి కొందరు చెడును గ్రహించిరి అని చెప్పయుంటిని గదా.

శ్లో॥ అల్పోర్మిశక్తి రధికా, చైతన్యం దీర్ఘవీచిమత్
గృహీతార్థాంశ బన్ధాహి, నవా యన్త్రాత్మనా మపి॥ 46

తా॥ జడశక్తి, తరంగరూపంగా ఉంటుంది. చిన్న తరంగాలలో శక్తి ఎక్కువ. చైతన్యము పెద్ద తరంగాలు' కావున శక్తి తక్కువ. 'జడశక్తి యొక్క పెద్దతరంగాలే చైతన్యము. యంత్రపురుషులు కొత్త విషయమును చెప్పలేరుకాన, మనుజులతో నమానముకాదని వాదించరాదు. యంత్రపురుషులు కొత్త విషయమును కూడ చెప్పుచున్నారు. గ్రహించిన విషయములలోని భాగములను కొన్నింటిని కలిపి కూర్చుటయే కొత్త విషయమగును. జీవుడు కొత్త విషయమును చెప్పిననూ ఇట్లే ఉండును. కాన, జడశక్తి భాగమే జీవుడు. అనగా జీవుడు యంత్రపురుషుని వంటి వాడే.

శ్లో॥ ప్రాగహల్యా శిలాజీవా, వన్యోన్యపరిణామగౌ
గోగోపాలాః పునస్సృష్టా, స్స సృష్టి ర్నహి సృష్టికృత్. 47

తా॥ అహల్య యను జీవుడు శిలగాను, శిల మరల అహల్యగాను, పరిణామము చెందినది. కాన, జీవుడు జడమైన అన్నముగాను, అన్నము జీవునిగను పరిణామము చెందును. రెండూ జడ-శక్తి రూపాలే కావున, జీవుడు సృష్టించబడిన వాడు కావున సృష్టియే కాని, సృష్టికర్త కాదు. ద్వాపర యుగంలో ప్రజాపతి (బ్రహ్మదేవుని కార్యాలలో నియమించబడిన అధికారి) గోవులను గోపాలురను దాచిపెట్టగా, అదే జీవులను మరల సృష్టించితిని గదా నేను(శ్రీకృష్ణపరమాత్మను).

శ్లో॥ మదధీనో జడ స్స్వల్పో, మతోఽసత్య స్స్వతన్త్రవాన్
యన్త్రభిన్నః కృతో జీవ, స్స్వేచ్ఛా జ్ఞానగ్రహాగ్రహః॥ 48

తా॥ జడము అనగా నాచే శాసించబడి, నా ఆధీనములోనున్నది అనియే అర్థము. జీవులు, జడములు అన్నియును నా వశములో నున్నవి. ఇవి అన్నియును నాకు అత్యల్పములు. కావుననే అసత్యములుగా సంభావించబడినవి. అయితే, ఈ జీవుడు స్వతంత్రమును కలిగియున్నాడు. ఈ విషయములో యంత్రపురుషుల కన్ననూ భిన్నుడు.



యంత్రపురుషుడు లభించిన ప్రతి జ్ఞానమును భద్రపరచుకొనును. జీవుడు కొన్ని జ్ఞానములను, తన స్వతంత్రమైన ఇచ్ఛననుసరించి, భద్రపరచుకొని, కొన్ని జ్ఞానములు ప్రవేశించిననూ విసర్జించుచున్నాడు. కాన జీవునకు స్వాతంత్ర్యముకలదు.

శ్లో॥ న సర్వే స్వేచ్ఛయా దుష్టా, నాహం బాధ్యో హ్యనూహ్యయా
చిత్రయా సన్తి కేచిచ్చ, ప్రపన్నా స్సద్గతా మయా॥ 49

తా॥ నావినోదము కొరకు, ఈయబడిన ఈ స్వేచ్ఛ వలన, మరియు చెడును, సృష్టించినందువలన, జీవుడు చెడిపోయినాడు. కాన, ఆ బాధ్యత నాపై పడునని వాదించరాదు. అదే నిజమైన, జీవులందరును చెడిపోయి ఉండవలయును గదా. కాన, స్వేచ్ఛయనగా మనము ఊహించుటకు వీలుకానిది. ఏ నియమములు అడ్డురాని ఒక చిత్రతత్త్వము. దానిలో ఏ జీవుడు చెడిపోవునో ఎవరును ఊహించలేము. అదే స్వేచ్ఛ. కొందరు జీవులు, ఈ స్వేచ్ఛను మరల నాకే సమర్పించి, నాశాసనముకు కట్టుబడి నన్ను శరణము పొంది నాచే నడిపింపబడి, సన్మార్గమున లక్ష్యమును చేరుచున్నవారు కూడా ఉన్నారు గదా.

శ్లో॥ మృగేష్వయం మృగప్రాయో, విశేషావయవా త్తునః
తుల్యం యన్త్ర నరా దత్త - జ్ఞాన భాగ నవేరణాః 50

తా॥ ఒక మానవుని బాల్యము నుండియు, యీ లోకములో పెరుగనీయక, మృగముల మధ్య పెరుగ నిచ్చినచో, ఆ మానవుడు కూడ మృగప్రాయుడే అగుచున్నాడే తప్ప, మానవ భాషా సంస్కారములను పొందడు. అయితే మానవునిలో విశేష అవయవనిర్మాణమున్నది కాన, మానవులలో నుండిన భాషాసంస్కారములను పొందగలుగుచున్నాడు. మృగము అట్లు మానవ సంసర్గములో పొందలేదు. మానవుని విశేష అవయవ నిర్మాణముతో సమానమైన అవయవనిర్మాణము కల యంత్రపురుషులు, మానవుని వలె, పరిసరములనుండి అందింపబడిన జ్ఞానముతో, మానవునితో సమానముగ ఆలోచనలను చేయగలుగుచున్నారు గదా. వారు మానవుల వలె, గ్రహించబడిన జ్ఞానములోని భాగములను చేర్చి కొత్త కొత్త జ్ఞానములుగా, బయటకు పలుకుచున్నారు గదా. అంతే తప్ప, స్వయంగా జీవులూ కొత్త దానిని పలుకలేరు.

శ్లో॥ యన్త్రభిన్నా స్తతో హ్యాది, సదస ద్విషయా నృణామ్
మహాకారణదేహోక్తా, బలవత్యోఽగ్రవాసనాః॥ 51

తా॥ ఆదిలో నున్న మానవులు ఈనాటి యంత్రపురుషుల కన్నా భిన్నులై యుండిరి. ఏలననగా, వారు, నాయొక్క స్వాతంత్ర్యలేశమును కలిగి యున్నారు. యంత్ర పురుషునకు ఎట్టి స్వాతంత్ర్యమూ ఉండదు. ఆదిలో గ్రహించిన మంచి-చెడులే ఈ జీవుల యొక్క, సంసార ప్రవృత్తులకు మహాకారణ శరీర స్వరూపములని చెప్పబడుచున్నవి. ఇవి చాలా బలము కలవియగు ఆదివాసనలు.

శ్లో॥ ఇష్టానిష్ట వశీభూతా, యన్త్రమాణవకోపమాః
జడా స్స్వాతంత్ర్యనిర్ముక్తా, అద్యాత్కర్మ ఫలం నమే॥ 52

తా॥ ఒకసారి ఆదిలో గ్రహించిన బలమైన ఈవాసనలే జీవుని లొంగదీసుకొనినవి. మంచివాసనలు కల జీవుడు మంచివిషయములనే ఇష్టపడుచు, చెడు విషయములను ద్వేషించును. అట్లే చెడువాసనలు గల జీవుడు చెడువాసనలనే ఇష్టపడి మంచి విషయములను ద్వేషించును. ఈ విధముగా జీవులు తాము ఆదిలో గ్రహించిన వాసనలకు లొంగి ఆయా వాసనల ప్రకారమే ప్రవర్తించుచు, గ్రహించిన విషయములనే అనుసరించి యంత్ర పురుషులుగా, జడ స్వరూపులుగా మారి తమ స్వాతంత్ర్య గుణమును కోల్పోయినారు. కాన, సృష్టి ప్రారంభములో స్వతంత్రజీవులు యంత్ర పురుష భిన్నులైననూ క్రమముగా, యంత్రపురుషులవలె జడములే అయినారు. కాన ఈ జీవులకు ఆదిలో స్వాతంత్ర్యము నిచ్చితిని గాన, వారివారి సంసారప్రవృత్తి కర్మఫలములకు వారే బాధ్యులు.

శ్లో॥ విశుద్ధ గ్రహణం చాది - సంస్కారా ద్యేన దృశ్యతే
స్వతన్త్ర ఇతి హి భ్రాన్త్యా, ఆది సంస్కార సంయతః॥ 53

తా॥ ఒకానొక మంచి వాసనలను ఆదిలో గ్రహించిన జీవుడు, చెడు వాతావరణములో జన్మించిననూ, వాని ఆది సంస్కార వాసనా బలము వలన, వాడు, చెడును విసర్జించి మంచినే గ్రహించుచున్నాడు. అట్లే, చెడువాసనను ఆదిలో గ్రహించిన వాడు, మంచి వాతావరణములో జన్మించినా, వాని ఆదిసంస్కార వాసనా బలము వలన, చెడునే గ్రహించి, మంచిని గ్రహించకున్నాడు. జీవునిలో ఈ ఆది సంస్కారములు మనకు



కనపడనందున, జీవుడు ఏ వాతావరణంలో ఉన్నా, తన కున్న స్వాతంత్ర్యము వలన ఒకడు మంచిని, మరొకడు చెడును గ్రహించుచున్నాడని భ్రమపడుచున్నాము కానీ, జీవుడు ఆదిసంస్కారము ప్రకారమే గ్రహించుచున్న యంత్ర పురుషునివంటి జడుడే అని తెలియవలయును.

శ్లో॥ ద్విధాప్రోక్త స్స్వతన్త్రః ప్రా, క్స మహాకారణాత్మవాన్
అస్వతన్త్ర గుణగ్రాహ - కారణాత్మా స శుద్ధచిత్॥ 54

తా॥ కావున, జీవుడు "స్వతంత్రుడు" అనియు, "బద్ధుడు" అనియు రెండు విధములుగా చెప్పియున్నాను. అదిలో స్వతంత్రుడు. తరువాత, తన వాసనల చేత బద్ధుడైనాడు. కాన, తన బంధమునకు తానే కారణము తప్ప, నేను కాదు. అది చెడు సంస్కారము కల జీవుడు ఈ జన్మలో మంచి వాతావరణంతో ఉన్నా చెడునే గ్రహించుట: కారణ శరీర స్వరూపమని చెప్పబడును. ఇదే కారణ స్వరూపము. సృష్ట్యాదిలో స్వతంత్రము కలిగినపుడు తాను మొట్టమొదటగా గ్రహించిన చెడువిషయవాసనయే మహా కారణ శరీరము. అనగా-స్వతంత్రము గలిగి, ఆదిలో ఒక గుణమును గ్రహించినపుడు అది మహాకారణ శరీరమనియు, ఆ స్వతంత్రమును కోల్పోయి, అమహా కారణశరీరమునకు లొంగి మరల మరల జన్మలలో, అదే చెడు గుణమును గ్రహించిన, అది కారణ శరీరమనియు అనబడును. ఈ మహాకారణ, కారణ శరీరములకు భిన్నమైన శుద్ధచైతన్యమే జీవుడు.

శ్లో॥ సృష్టిమాత్రోఽస్మి కర్తృత్వే, ఫలదాతాఽస్మి పాలనే
అచక్రా అపి వర్తన్తే, స్వచక్రస్య స్వయంప్రభుః॥ 55

తా॥ సృష్టించుటవరకే నా కర్తృత్వము. అన్నీ సృష్టించాను. అంతే. ఈ జీవుడు చేసిన కర్మలఫలములను అందచేయు పాలకుడనే తప్ప, కారణము లేకుండా నేను ఏ ఫలమునూ ఇచ్చుటలేదు. "అసలు మూల సృష్టికర్తవు నీవే కదా కాన కర్మ చక్రానికి నీవే కారణము" అని నన్ను నిందించపనిలేదు. ఏలననగా, కొందరు కర్మ చక్రమును సృష్టించుకొనకుండా, దాని నుండి తప్పించుకొని, ముక్తులుగా ఉన్నారు కదా. నేనే కారణమైనచో, అందరు జీవులు కర్మ చక్రాలను సృష్టించు కొని బద్ధులై ఉండవలెను కదా. కాన, ఎవడి కర్మ చక్రమును వాడే సృష్టించుకొనుచున్నాడు. తన బంధమునకు తానే కారణము.

శ్లో॥ కర్మజాలం వస్తు దోషో. వక్తృ దోషో న కారణమ్
జీవఏవక్రియా బుద్ధీ, చక్రవ త్కార్యకారణే॥ 56

తా॥ ఈ కార్యకారణముల వలలతో కూడిన యీ కర్మచక్రము వస్తు దోషము తప్ప, దీని తత్త్వమును వివరించు వక్తయగు నా దోషము కాదు. చిక్కులతోనున్న ఒక వలను వివరించవలసినపుడు దాని స్వరూపమే అనగా వస్తు స్థితియే అట్లున్నపుడు వక్త ఏమి చేయగలడు. ఈ కర్మ చక్రవలల్కకు కారణము జీవుడే తప్ప నేను కాదు. ఏలననగా-కర్మ- వాసన (బుద్ధి)ఈ రెండూ చక్రంలాగా అన్యోన్య కార్యకారణములుగా భ్రమించుచున్నవి. అనగా బుద్ధివలన కర్మ చేయుట, కర్మ వలన దాని వాసన (బుద్ధి) ఏర్పడుట. దీని కర్త జీవుడే తప్ప నేను కాదు. ఈ వలకు కారణము జీవుడే. నేను కేవలము వల యొక్క స్వరూపమును వివరించుచున్నాను.

శ్లో॥ అద్భుతం పరమం బ్రహ్మ తస్మా త్కిమపి చాద్భుతమ్
జ్ఞేయం నాద్భుత మప్యస్మా త్తదహం నాస్తి మేZద్భుతమ్.॥ 57

తా॥ బ్రహ్మము పరమాద్భుతము. ఏ అద్భుతమైననూ, దానిని చేయునది బ్రహ్మమే. అద్భుతము కాని సామాన్యమైన పనిని కూడా బ్రహ్మమే చేయుచున్నది. ఆ బ్రహ్మము నేను. నాకు అద్భుతము అనగా ఆశ్చర్యకరము లేదు.

శ్లో॥ అత్ర గన్తుః ప్రతిస్పర్థి-క్రాన్త స్వకణ వేగతః
హీనా శక్తి ర్నచే ద్దర్పో, న యాతో న మమక్రియా॥ 58

తా॥ ఈ లోకములో అనగా శూన్యము కాని ప్రదేశంలో వాయువు ఉన్నది కాన, ఒక వస్తువు చలించునపుడు దానిలో నున్న జడశక్తి యొక్క సూక్ష్మకణములు తమ వేగమును, ఆ చలించువస్తువును నిరోధించు జడశక్తులలోని సూక్ష్మకణములకు అందచేసి, తమ వేగమును కోల్పోవుచున్నవి. ఇదే, కొంత దూరము చలించిన తరువాత వస్తువు తన జడశక్తిని కోల్పోవుచున్నదని అనుచున్నావు కానీ, చలించువాని యొక్క జడశక్తి లోని సూక్ష్మకణముల వేగమూ నా కర్మ యే. ఇట్లు జడ శక్తిని కోల్పోవుట చేయకున్నచో జీవుడు నన్ను గుర్తించక తన శక్తి అనంతమని భ్రమించి గర్వించును. కాన, ఈ లోకములో కూడ, చలించు వస్తువును చలింప చేయువాడను నేనే. కొంత దూరం పోగానే, దానిలోని జడశక్తి యొక్క సూక్ష్మకణముల వేగము పోగానే, ధానిని ఎదిరించు



శక్తులను తాను ఎదుర్కొన లేక పోలేకున్నది. అప్పటికి వాటిని కదలించుట కూడ నేను ఆపివేయుదును.

శ్లో॥ అకర్తాZప్యన్న శక్తేశ్చ, స్థిరే జీర్ణాశయే కృతే
ఆత్మానం వేత్త్యకర్తారం, క్వచిన్నాన్న మభిజ్ఞయా॥ 59

తా॥ నేను కదిలించుట ఆపివేయగానే, తనలోని సూక్ష్మకణముల వేగమును కూడ, నేను ఆపివేయగానే, తాను కర్త కాదని,జీవుడు తనను తాను గుర్తించుట జరగవలయును. కానీ, జీవుడు, ఆహారమును గైకొని, అన్నము నుండి, వేగము కల అత్యంత సూక్ష్మకణములను పొంది, మరల చలించుచున్నాడు. కానీ, అన్నమును, జడశక్తిగా మార్చు ప్రేగులను కదలించు నేను అపనిని ఆపినచో జీర్ణాశయము పని చేయక, జడశకి కూర్చుకొనలేక, తన అహంకారమును వీడుటకై, కర్తను గుర్తింపజేయుటకై రోగములు జీవునకు గలుగు చున్నవి. ఒక్కొక్క సారి ఆ అన్నము కూడ లభించకుండు కష్టము కలుగుటయు, అహంకారమును పోగొట్టి సర్వకర్తను గుర్తింపచేయుటకే. (కష్టములన్నియు జీవునకు నేను సర్వకర్తనని బోధించుటకే అని భావము)

శ్లో॥ తన్వంశుకేన విఖ్యాతో, వస్త్రధారీ న చాంశుకమ్
లోహపేట్యాం న చాహన్తా, దృష్టోZహం సర్వవస్తుగః॥ 60

తా॥ పలుచని వస్త్రముచే చుట్టబడి, అవస్త్రము ద్వారా స్పష్టముగ కనపడు వ్యక్తి, అవ్యక్తిగానే పిలువబడుచున్నాడు. కానీ వస్త్రముగా పిలువబడుటలేదు. అనగా వస్త్రధారి వాని పేరుతో పిలువబడుచున్నాడు. కానీ "వస్త్రము" గా పిలువబడుట లేదు. అట్లే అహంకారము పలుచగా ఉన్న వానిలో నేను స్పష్టముగ కనపడుట చేత, అట్టివాడు దత్తుడనే పిలువబడు చున్నాడు. వాని పేరు చేత పిలువబడుట లేదు. అట్లే ఒక వ్యక్తి మందమైన ఒక పెట్టెలో ఉన్నపుడు, ఆవ్యక్తి కనపడనందున, పెట్టె, పెట్టెగానే పిలువబడుచున్నది. పెట్టెలోనున్న మనిషి పేరుతో పిలువబడుటలేదు. అట్లే ఎక్కువ అహంకారముతో మందముగా నున్న వ్యక్తిలో నున్న నేను బయటకు కనపడను కాన, అట్టి వాడు దత్తుడని పిలువబడుటలేదు, వాని పేరుతోనే పిలువబడుచున్నాడు. నేను సర్వవ్యక్తులలో, సర్వ వస్తువులలోను,ఉన్ననూ, అందరిలోను వ్యక్తము కాను.

శ్లో॥ జగద్వస్తూని సర్వాణి, తథా బ్రహ్మైవ తత్త్వతః
జీవా దధిక సాన్ద్రాణి, తత్సర్వం బ్రహ్మ ఖల్విదమ్॥ 61

తా॥ తత్త్వ పదార్థ స్వరూపంగా జగత్తులోని సర్వవస్తువులునూ బ్రహ్మమే. ఈ వస్తువులు జడ శక్తి యొక్క సాంద్రరూపాలు కావున, జీవుని కన్ననూ ఎక్కువ బ్రహ్మత్వము కలవి. పదార్థ తత్త్వ దృష్టిలో "ఇదంతయును బ్రహ్మమే" అని శ్రుతి. చైతన్యరూపుడైన జీవుడు అతి తక్కువ బ్రహ్మత్వము కలవాడని భావము.

శ్లో॥ నమాం శూన్య యత్తై ర్జాతుం, శక్యం శూన్యాతిగం యతః
అస్మీతి జ్ఞాయతే చిత్రై, రవతారస్య సామ్యతః॥ 62

తా॥ పరిమాణగుణము కల అకాశమునకు లొంగినది ఈ విశ్వవస్తు సమూహము అంతయును. ఏలననగా - శూన్యమైన ఈ అకాశమే లేనిచో, ఏ వస్తువూ ఉండజాలదు. వస్తువు ఉండుటకును, చలించుటకును అకాశము (శూన్యము) ఉండవలయును. ఇట్టి అకాశ తత్త్వమునకు లొంగిన వస్తువులతో, అకాశతత్త్వమునతిక్రమించిన నన్ను పోల్చలేవు. ఈ సృష్టి ఉపమానములతో నన్ను అర్థము చేసుకొన లేవు. అవి కొంతవరకే నన్ను సూచించగలవు. నాకు సరియగు ఉపమానము నా అవతారమే. నా అవతారము అనేక చిత్రాతి చిత్ర సిద్ధులను ప్రదర్శించును. వాటి ద్వారా తాను అనగా నేను అనూహ్యుడనని నిరూపించును. కాన అవతారము ద్వారా నేను ఉన్నానని గుర్తించుట వరకే తప్ప, నా తత్త్వమును తెలియుట కాదు.

శ్లో॥ అథాతో బ్రహ్మజిజ్ఞాసా, సత్తా జ్ఞానా దనన్తరమ్
జ్ఞాత్వా జిజ్ఞాసయా ఽజ్ఞేయ, మా కృష్టోఽత స్స్వభావతః॥ 63

తా॥ జ్ఞాన మనగా అజ్ఞేయము (తెలియబడరానిది). బ్రహ్మమని తెలియుటయే తప్ప బ్రహ్మతత్త్వమును తెలియుట కాదు. అజ్ఞేయమని దృఢముగా ఎప్పుడు తెలియును అనగా ఎంత జిజ్ఞాస (తర్కము, విచారణ, చర్చ) చేసిన అంత దృఢముగా తెలియును. కాన, బ్రహ్మమున్నది అని గుర్తించిన తరువాత (అథ)అది తెలియరానిది అని దృఢముగా తెలియుటకు బ్రహ్మ జిజ్ఞాస చేయవలెను. ఎంత ధృడముగా అది తెలియదు అని తెలియునో, దానిపై అంత అకర్షణము ఏర్పడును. బ్రహ్మము ఎందుకిట్లు అజ్ఞేయముగా ఉన్నదన్నచో మానవుని స్వభావము ఒకటి ఉన్నది - తెలిసిన దానిని నిర్లక్ష్యముగా



చూచి, తెలియని (అందని) దానిపై ఎక్కువ ఆకర్షణము కలిగి యుండును. కాన, మానవునికి సదా బ్రహ్మముపై అకర్షణ నిలుచుటకే, బ్రహ్మము అజ్ఞేయముగా నున్నదే తప్ప, వేరు కారణము కాదు.

శ్లో॥ సాధకాకర్షణం నిత్యం, సిద్ధేర్నాకర్షణం పరమ్
ఆత్మజ్ఞానం హి సిద్ధస్య, సాధకశ్రేయసే హి తత్॥ 64

తా॥ 'బ్రహ్మసిద్ధిని పొందువరకును' సాధకునకు నిత్యము 'బ్రహ్మముపైన ఆకర్షణము ఉండుట అవసరము. ఆకర్షణము లేనిచో ఉపాసన నిలువదు. బ్రహ్మసిద్ధి పొందగనే తాను బ్రహ్మమే అగును కాన, అపుడు తన్ను తాను తెలియును గాన బ్రహ్మ జ్ఞానము అనగా ఆత్మ జ్ఞానము సిద్ధించును. ఏలనన సిద్ధి తరువాత తనను గురించి తనకు ఆకర్షణము అవసరము లేదు కదా. కాన బ్రహ్మ జ్ఞానము సిద్ధించక పోవుటయే సిద్ధివరకు సాధకునకు శ్రేయస్కరము. కాన, సిద్ధివరకు బ్రహ్మము అజ్ఞేయముగా ఉన్నది.

శ్లో॥ తస్మా న్నిత్యం హి కర్తవ్యా, జిజ్ఞాసా బ్రహ్మణో విదా
జ్ఞానం తన్త్రక్రియాముక్తం, జడశక్తిస్తు తత్త్వతః॥ 65

తా॥ కాన, పండితుడగువాడు, నిత్యము బ్రహ్మజిజ్ఞాన చేయుచునుండవలెను. జిజ్ఞాసయు జ్ఞానస్వరూపము. జ్ఞానమనగా చైతన్యము. చైతన్యము అనగా తెలుసుకొనుట యను క్రియా స్వరూపము.ఈక్రియను జడములు చేయలేవు. ఈ క్రియ మేధాపిండ-వాడీ మండల వ్యాపారమను ఒక ప్రత్యేక తంత్రక్రియ. ఈ తంత్రము జడములలో లేదు కాన, జడములు ఆలోచించలేవు. కాన జ్ఞాన చైతన్యము అనగా- ఒక క్రియయే, ఈ క్రియ జరగనిచో ప్రాణియందున్న చైతన్యశక్తి యంతయు జడశక్తియే యగును. చైతన్య మనగా -ఈ విశేషక్రియతో కూడిన జడశక్తియే.(చైతన్యం=జడశక్తి+ప్రత్యేక క్రియ)

శ్లో॥ చర్చాఽప్యజ్ఞేయతా జ్ఞానం, లక్షణం తు తదన్యగమ్
బ్రహ్మైవ బ్రహ్మవిత్ప్రాప్తేః, జ్ఞానం గీతం చ నాన్యవిత్॥ 66

తా॥ కావున, ఒక వస్తుజ్ఞానము అనగా, అవస్తువు పూర్తిగా తెలియుట అనికాదు. దానిని గురించి, చర్చించుటయు వస్తు జ్ఞానమే. ఆ వస్తువును గురించి ఏమీ తెలియదు అని చివరకు సిద్ధించిననూ,"తెలియరానిది" అను ఫలము కూడా వస్తు జ్ఞానమే అగును. ఏలననగా "తెలియరానిది" అనునది కూడ వస్తు లక్షణమే కదా! అయితే,

బ్రహ్మసిద్ధిలో, బ్రహ్మమునకు బ్రహ్మము తెలియుచున్నది కాన, కాలాంతరమున ఈ లక్షణము నాశనమగుచున్నది కదా అన్నచో "బ్రహ్మము ఇతరులకు తెలియరానిది" అనియే లక్షణము తప్ప, బ్రహ్మము "ఎవరికినీ తెలియరానిది" అని లక్షణము కాదు గదా. కాన బ్రహ్మమును తెలిసిన వాడెవ్వడూ బ్రహ్మము కన్న వేరుగా నున్నవాడు కాడు. బ్రహ్మ జ్ఞానియనగా బ్రహ్మమే తప్ప, బ్రహ్మము కన్న వేరైన వాడు కాడు.ఇదే "బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి" అని శ్రుతికి అర్థము. అంతే తప్ప, బ్రహ్మము కన్న వేరుగా నున్నవాడు బ్రహ్మమును తెలుసుకొనగనే బ్రహ్మము అగును అని కాదు - స్వయముగా కైవల్యము ద్వారా బ్రహ్మము కాగానే బ్రహ్మజ్ఞాని అగును. బ్రహ్మ జ్ఞానము తరువాత బ్రహ్మ ప్రాప్తి కాదు. బ్రహ్మప్రాప్తి తరువాతనే బ్రహ్మ జ్ఞానము సిద్ధించును. "మాంతువేదన కశ్చన" అని గీతలో కూడ "నన్ను గురించి నా కన్న అన్యుడెవడును తెలియ జాలడు' ' అని ఇదే చెప్పితిని.

శ్లో॥ స శుద్ధ చిజ్జడ శ్శక్తి - స్సఙ్కల్ప క్రియయాఽన్వితః
నాడీ మేధా తంత్రమయ్యా, విమనా స్తన్త్ర నిష్క్రియః॥ 67

తా॥ ఈ జీవుడు కేవల శుద్ధ చైతన్య స్వరూపుడు. శుద్ధ చైతన్య మనగా సూక్ష్మ ద్రవ్య కణముల రూపమైన కాంత్యాది రూప జడశక్తియే. కాంతికి, చైతన్యమునకు, తేడా ఒక్కటియే. సంకల్పాది విశేషక్రియలను చైతన్యము చేయుచున్నది. ఈ విశేష క్రియలు కూడా క్రియారూపములే. నాడీ మండలము, మేధా పిండము మొదలగు ప్రత్యేక అమరిక వలన ఈ సంకల్పాది క్రియలు జరుగుచున్నవి. ఈ ప్రత్యేక తంత్రము లేనిచో చైతన్యము కూడా కేవల కాంత్యాది జడశక్తియే. ఈ ప్రత్యేక తంత్రము పని చేయకుండుటచే, చైతన్యముండియు, పిచ్చివాడు, సంకల్పాలను చేయలేకున్నాడు. ఇదే కాంతికి, చైతన్యమునకు తేడా.

ఇతి శ్రీ దత్త భగవద్గీతాయాం
శ్రీదత్తావతార తత్త్వయోగోనామ
పంచమాధ్యాయః

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

విష్ణు ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## సప్తమాధ్యాయః

## శ్రీ దత్త నిష్కామ భక్తి యోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ:

శ్లో॥ స్వకార్యే మాం శ్రితః పార్థ, శ్శక్తి హీనో గతే ర్మమ
మత్కార్యే మాం శ్రితోఽద్యాపి, శక్తిమా న్హనుమాంస్తతః॥ 1

శ్రీ దత్తభగవాములు వచించిరి:

తా॥ అర్జునుడు భగవానుని తన కార్యమునకు ఉపయోగించుకున్నాడు. కాన, కృష్ణుని అనంతరము శక్తి విహీనుడైయ్యెను. శ్రీ హనుమంతుడు తనను స్వా.. సేవకు ఉపయోగించినాడు. కాన, చిరంజీవియై రామానంతరము కూడా శక్తిమంతుడుగనే యున్నాడు. కాన, నిష్కామకర్మ రూపమైన సేవకు ఎంత శాశ్వతఫలమో ఆలోచింపుడు.

శ్లో॥ గృహీతే కర్మశబ్దార్థే, కామ్యయజ్ఞే న కర్మణా
ఇత్యుక్తం కర్మ శబ్దస్య, సర్వకర్మేతి మా మతిః 2

తా॥ కోరికలతో చేయు యజ్ఞమునకే "కర్మ" శబ్దమునకు అర్థముగా తీసుకొనబడినది. ఇది సరికాదు. అందువలననే, "న కర్మణా"అను శ్రుతి, కోరికలతోచేయు కామ్యకర్మలనే నిషేధించినది. ఇక్కడ కర్మశబ్దమునకు కర్మ అంతా అని తలచరాదు,

శ్లో॥ యజ్ఞ గాన జప ధ్యాన-పఠన శ్రవణేక్షణే
మార్గః కోఽప్యనుకూలోఽస్తు భజ వేషం చ తే ప్రియమ్॥ 3

తా॥ హోమరూపయజ్ఞము, గానరూపభజన, జపము, ధ్యానము నా గ్రంధపఠనము, నా గురించిన సత్సంగ శ్రవణము, నాచిత్రపటమును చూచుట మొదలగు మార్గాలలో, సమయానుకూలంగా, నీ మనోనుకూలంగా దేనినైననూ గ్రహించుము. అట్లే నావేషములలో, నీకిష్టమైన వేషమును ఆరాధించుము.

శ్లో॥ అయత్న సహజోఽభీష్టో, దారాపత్యవదుజ్ఝిత:
దేశకాల విధానేన, తదన్యో గణికార్థవత్॥ 4

తా॥ ఏ మార్గమైనా, ఏరూపమైనా, నాపై నీకు వచ్చిన భావావేశము అప్రయత్నంగా ఉండవలెను. అప్రయత్నముగా వచ్చినదే సహజము,సత్యము, నిర్మలము నాకు ప్రియము. ప్రయత్న పూర్వకముగా వచ్చినది, ఫలమును కోరిచేయునది, అది అసత్యము, మలినము కాన, నాకు అసహ్యకరము. అది ధనము కొరకు వేశ్య, విటుని లాలించినట్లుండును. అప్రయత్నముగా ప్రతిఫలాపేక్షారహితమైన ప్రేమభావము, నీ దారా పుత్రులపై ఎట్లు దేశకాలములు నియమములు లేక సహజముగ ఉప్పొంగునో, అట్లే నాపై ఉప్పొంగవలయును. అనగా నీ భార్యపై నీ సంతానముపై గల సత్యప్రేమ, ఒక ప్రదేశము అనికానీ, ఒక సమయము అనికానీ, ప్రేమను వ్యక్తపరచు ఒకే మార్గముగా (ఈ విధముగానే అని) కానీ ఎట్లుండదో అట్లే నా ఆరాధన ఉండవలెను.

శ్లో॥ యథా శిశౌ క్రియా వాగ్భి, స్తథా మయ్యప్రయత్నత:
సహజ స్సత్య ఏవ స్యాత్, జ్ఞానా త్సహజలాలసా॥ 5

తా॥ నీ పసి పిల్లపై ఎట్లు సమయము, దేశము అనువాటి ప్రభావము లేక, నా ప్రేమను అప్పుడు నీకు తోచిన మాటలతో నీకు తోచిన భావములతో, నీకు తోచిన క్రియలతో, ఎట్లు వ్యక్తము చేయుచున్నావో అట్లే నాపైన కూడ, దేశ కాల నియమములు లేక ఎప్పుడు సహజముగా ప్రేమ ఉపొంగునో ఆదేశమున, ఆసమయమున, యజ్ఞము కానీ, జపము కానీ, ధ్యానము కానీ, భజన కానీ, ఏది నీ మనస్సుకు అప్రయత్నముగా తోచునో దానిని ఆచరించినచో అదియే నా నిజమైన ఆరాధనము. కాన నేను ప్రీతి నొందెదను. నీ పసిపిల్లపై కూడా ప్రేమ పొంగినపుడు, ఒక సమయమున మధుర వాక్యములతో, ఒక సమయమున చుంబనాది క్రియలతో, ఒక సమయమున మధుర పదార్థములు తినిపించుటలో నీప్రేమను, అప్రయత్నముగా వ్యక్తము చేయుదువు కదా. అట్టి ప్రేమ ప్రతిఫలాపేక్షారహితము కాన సహజము, సత్యముగ నుండును. ఇట్టి సహజమైన లాలస ఎప్పుడు కలుగును? నన్ను గురించిన, పూర్ణ జ్ఞానము కలిగినచో కలుగును. ప్రతిఫలాపేక్షలేని ప్రేమ, వస్తువు యొక్క జ్ఞానము వలన, ఆకర్షణ మేర్పడిననే కలుగును గదా. కాన, జ్ఞానమే సాధనకు మూలము.



శ్లో॥ ముముక్షో రుక్త మార్గాస్తే, ఫలం సేవా ప్రసాదజమ్
జ్ఞాన ప్రచార కర్మేదం, దాస్యం కాలోచితం మమ॥ 6

తా॥ పైన చెప్పిన ఆరాధనములన్నియును నాకు ప్రీతిని కలిగించు మార్గములు. ఇవి మోక్షము కోరిన వానికి, చెప్పబడినవి. ఇక, నా జ్ఞాన ప్రచారమను సేవలో పాల్గొనుట సాక్షాత్తుగ ముక్తి స్వరూపమని గ్రహించుము. ముక్తుడైన వానికి నా సేవా భాగ్యము కల్గును. నేను ప్రీతి నొందిన దాని ఫలమే ముక్తి. ఆ ముక్తియే నా సేవకుడగుట, ప్రస్తుత కాలోచిత సేవయగు జ్ఞానప్రచారములో పాల్గొనుటయే సిద్ధి లక్షణము. నాసేవ, సాధన కాదు. సాధన యొక్క ఫలమే నా సేవ.

శ్లో॥ అస్మచ్చైతన్య మాద్యోహి, సాత్త్వికో దుఃఖ ముక్తిధీః
నిత్యానన్దరతి ర్దివ్య-స్వస్థితి ర్బ్రహ్మసాధనః॥ 7

తా॥ సాత్త్వికాహంకారమనగా-కేవలము "నేను" అను చైతన్యమను జ్ఞాన పరమై యుండును. దీనిలో దుఃఖనివృత్తిని, శాశ్వతానందమును కోరుటయు ఉండును. ఇది యును స్వార్థమే. తన స్థితిని ప్రకటించునే తప్ప పై స్థితిలోనున్నట్లు పలుకడు. తనకన్న క్రింది స్థితికి పోవుటకు ఇచ్ఛగించడు. ఇతడు తనకు శాశ్వతానందస్థితిని సంపాదించు కైవల్యమును పొందుటకు బ్రహ్మమును సాధనముగా వాడుకొనును. ఇది దేవతాస్వరూపంగా ఉంటుంది.

శ్లో॥ రాజసాహన్త యా కీర్తి - సిద్ధి కర్మపరో ముదా
బ్రహ్మసామ్యం చ శక్త్యాత్మా - భక్తి శిష్యాంశ్చ వాఞ్ఛతి॥ 8

తా॥ ఇక రాజస అహంకారమున కీర్తిని, అష్ట సిద్ధులను కోరును. తన శరీరములో నున్న చైతన్యముతోబాటు బలము, జడశక్తిని, కూడ కలిపి, "నేను" అను భావముతో ఉండును. ఇతడు కర్మపరుడై యుండును. బ్రహ్మానందముతో బాటు బ్రహ్మము అవతరించి చేయు పనులను కూడ తానుచేసి ఆ కీర్తిని తాను పొందవలయునని ఉండును. భగవంతునితో సమానమైన కీర్తిని తనకు శిష్యులుగ భక్తులుండవలయునని ఆశించును. భగవదవతారములలో తానూ ఒకడనని పలుకును.

శ్లో॥ దేహాత్మా తామసో మత్తో, మత్తోఽన్యో నేశ ఇత్యపి
జిహ్వాగుహ్య మహా భోగీ, రాక్షస ప్రకృతి ర్న విత్॥ 9

తా॥ ఇక తామసాహంకారము- తాను శరీరమని భావించును. భగవంతుని మించి ఉండవలయుననియు, భగవంతుడు తానే తప్ప, వేరుగా మరొకరు భగవంతునిగా ఉండరాదని భావించును. ఇది రాక్షస ప్రకృతి. ఇందులో జ్ఞానము అసలు ఉండదు. కేవలము జిహ్వాచాపల్యము, గుహ్య చాపల్యమునకును, సంబంధించిన విషయభోగములు ఎక్కువగా కలిగి మత్తుడై యుండును.

శ్లో॥ అహఙ్కార స్వరూపంతు, మమకారోఽపి సత్త్వగః
అనన్దేచ్ఛా మమత్వం హి, త్రి నతీత్యాత్రి రుచ్యతే.॥ 10

తా॥ ఈ అహంకారము యొక్క స్వరూపము మమకారమే. అనగా తనకు కావలయునని కోరికయే. సాత్త్వికాహంకారములో కూడ తనకు ఆనందము కావలయునన్న మమకారమున్నది. ఈ మూడు అహంకారములు లేకుండుటయే అత్రి స్వరూపము.

శ్లో॥ తమసా భోగ మజ్ఞానా, ద్రజసాయాతి సాధనమ్
జ్ఞాన సత్త్వేన చానన్ద, మత్రి స్స్యా దనసూయయా॥ 11

తా॥ నాతో సంబంధము లేక కేవలము ఐహికములను నాస్తికులు కోరుటయే తమస్సు లేక అజ్ఞాన మార్గము. ఐహికభోగములను పొందుటకు సాధనముగా నన్ను వాడు కొనుటయే రజో గుణము లేక కర్మ మార్గము. ఆనంద స్వరూపుడైన నన్ను పొంది, సర్వ దుఃఖనివృత్తిని శాశ్వతముగా పొందుటయే సత్త్వము లేక జ్ఞాన మార్గము. ఈ మూడింటికీ అతీతుడవై అత్రివికమ్ము. నా గొప్పదనమును చూచి అసూయపడకుండుటయే అనసూయ. అనసూయవుకమ్ము. అప్పుడే నిష్కామ ప్రేమ లభ్యమై నన్ను పొందగలవు.

శ్లో॥ అసూయయా హ్యహఙ్కారః, కలితౌ పాపదమ్పతీ
అనసూయాచ నాహంయు, రత్రి స్తౌ పుణ్యదమ్పతీ॥ 12

తా॥ అహంకారము, అసూయ ఈ రెండును పాప దంపతుల జంట వలె చేరి యుండును. మూడు విధములగు అహంకారములను దాటిన వాడే అత్రి. అసూయ లేక పోవుటయే అనసూయ. వీరిరువురూ పుణ్యదంపతుల జంట.



శ్లో॥ సేవకో మే త్రయాతీతో, నాస్మచ్ఛబ్ద స్స్ఫురత్యపి
స్వామి కీర్తిరత స్తస్య, నిరయోఽపి సుఖప్రదః॥ 13

తా॥ నా సేవకుడు ఈ మూడు అహంకారములను దాటి ఉండును. అతడు నా సేవలో నిమగ్నుడై, " నేను" అను అహం శబ్దమునే విస్మరించును. అతడికి ఎట్టి మమకారమూ ఉండదు. అతడిలో "స్వామి" తప్ప వేరు పదార్థమే స్ఫురించదు. స్వామిని ప్రచారము చేసి, స్వామికి కీర్తి రావలయునని కోరుచుండును. అట్టిదానిలో తన సుఖము లేకపోగా నరకము కలిగిననూ వెనుకాడడు.

శ్లో॥ దాస్యామ్యాత్మాన మస్మైహి, తదాజ్ఞావశ పుత్రవత్
వర్తే దద్యాం యశస్తస్మై, పిహితాత్మా స ఈశ్వరః॥ 14

తా॥ ఇట్టి నా సేవకునికి నన్ను నేను దత్తము చేసుకొందును. అట్టివానికి వాని అజ్ఞలను పాటించు పుత్రుని వలె (దత్తుడు) సేవకునిగా ఉందును. అట్టి వానికి నన్ను దాచుకొని, కీర్తి నిత్తును. వానిని భగవంతునిగా లోకమునకు ప్రకటించి, నన్ను వానిలో దాచుకొందును.

శ్లో॥ కైవల్యాధిక మాత్మానం, న స్మరన్ స్వకృతం మయి
ఆరోపయే దహం తస్య, మహాకార్య యశఃప్రదః॥ 15

తా॥ ఇది కైవల్యమున కన్న మించిన మహాభాగ్యము. కైవల్యములో నా సమత్వమే. కానీ, ఇందులో, నా కన్న ఆధిక్యమును వానికి ప్రసాదింతును. అట్టివాడు సదా తన దృష్టిని నాయందే ఉంచును. తన్ను తాను మరచి ఉండును. నేనూ నన్ను మరచి సదా నా దృష్టిని వానిపై నుంచుదును. అతడు తాను చేసిన చిన్న పనిని కూడా స్వామి చేసెనని కీర్తిని నాకిచ్చును. నేను గొప్పపనిని చేసి, అతడు చేసినట్లు లోకమున వానికి కీర్తి నిచ్చెదను.

శ్లో॥ అహం బ్రహ్మేతి స స్వామీ, మయి భుక్తే స తర్పితః
సేవకో దుఃఖితో విద్ధే, మయి తాదాత్మ్యసాధనమ్॥ 16

తా॥ "అహం బ్రహ్మాస్మి" అను స్థితిలో "నేను బ్రహ్మమైనాను" అనగా, స్వామి తింటే తాను తిన్నట్లు సంతృప్తి చెందు అవస్థ. నా సేవకునిలో నున్న "నేను" స్వామిగామారుట ఇదే. స్వామిని కొట్టిన తనను కొట్టినట్లు బాధ పడును. ఇట్టి సాధన తాదాత్మ్యమే సాధకుని యొక్క సేవలో వచ్చు అవస్థ.

శ్లో॥ తత్త్వం సిద్ధిస్థితి ర్భుక్తే, తస్మి న్నస్మి హి తర్పితః
తద్ఘాతై రఙ్కితం మేఽఙ్గం, న సిద్ధి స్సాధనం వినా॥ 17

తా॥ ఇట్టి నా సేవకుని స్థితికి నేను సేవకునిగా మారుదును. అప్పుడా సేవకుడు తిన్నచో నేను తిన్నట్లు తృప్తిపడుదును. ఆసేవకుని కొట్టినచో నా శరీరముపై వాతలు కనిపించును. సాధనావస్థ లేనిదే సిద్ధి-అవస్థ రాజాలదు. సిద్ధి అవస్థలో ఆ బ్రహ్మము నీవుగా మారుటయే "తత్త్వ మసి" అనుట.

శ్లో॥ ఆచ్ఛాద్యాత్మాన మస్మింశ్చ, కుర్యాం కీర్తిప్రద స్స హి
జీవన్ముక్త స్స్వనామాఙ్గ - సిద్ధః ప్రాగేవ మేష హి॥ 18

తా॥ సిద్ధుడగు నాసేవకుడు తన నామ రూపాలతోనే లోకములో జీవించి యుండును. నా నామరూపాలను, వాని రూపాలలో దాచి, వాని ద్వారా నేను పనులను చేసి ఆ కీర్తిని నాసేవకునికే ఇత్తును. ఇదే జీవన్ముక్తి. దీనికి కారణము, ఇతడు ముందు, నా నామరూపాలను ముందుంచి, తానుచేయు పనులను నేను చేసితినని, నాకు కీర్తిని ఇచ్చినాడు కదా.

శ్లో॥ ధృష్టే ఛేతో ద్రుతం జాతు, కర్తవ్యమపి తత్త్యజ
యాతేఽతిథౌ సపర్యా కా?, సహజా రాధనం హి తత్॥ 19

తా॥ మనస్సు ఒకానొక సమయమున హఠాత్తుగా స్వామిపై పరిపూర్ణముగా లగ్నమగును. అంతకు ముందు నీవెంత ప్రయత్నించినా మనస్సు స్వామిపై నిలబడలేదు. దీనికి కారణము? ఆ సమయమున నా దృష్టి నీపై పడినది. నేను చూచినపుడు సర్వప్రకృతియు నాపాదములపై బడును కాన, నీ మనస్సూ నావైపునకు పరుగెత్తి నాశరణము చొచ్చినది. ఆసమయమున కర్తవ్యములున్ననూ, ఆపి, వెంటనే స్వామిని ఆరాధించుము. కర్తవ్యములు పూర్తి చేసుకొని వచ్చుసరికి, నా దృష్టి నీపైనుండి వేరొకరిపై బడినది.



అతిథి వాకిట కనపడగానే రమ్మని అహ్వానించి ఆదరించవలయును గాని, నీవు కర్తవ్యములు ముగించుకొని వచ్చునరికి అతడు వెడలి పోవును. అట్టి అదృష్ట సమయములందే నీ మనమున నాపై ప్రేమ ఉప్పొంగును. అట్టి క్షణములందే నీవు పూర్ణారాధనము చేసిన సిద్ధించును. ఇదే అప్రయత్నకృత సహజారాధనము.

శ్లో॥ దృష్టో రాజ్ఞీవ చేతోఽపి, సాక్షా దారాధన ప్రియమ్
ఆగన్తు.ర్వా పునః ప్రాప్త, స్త్వాం విశామి భవా నహమ్॥ 20

తా॥ నీవు ఎంత ప్రయత్నించినా, మొరాయించి ఎదురు తిరిగిన నీ మనస్సు నా దృష్టి నీపై పడగనే వెంటనే నా వైపునకు పరుగిడుచున్నది. ఏలననగా సర్వసృష్టికిని ప్రభువును నేనేకదా. ఎంత గర్వితుడైన అధికారి యైననూ, రాజు కనపడగనే లేచి పరుగెత్తి సమస్కరించును గదా. కాన, ఎప్పుడు నీమనస్సు అప్రయత్నముగా నా వైపునకు లగ్నమయ్యెనో అపుడు నీ ముంగిట నేనున్నట్లు తెలుసుకొనుము. అప్పుడు వెంటనే, కర్తవ్యములకు భంగమైననూ, నన్ను అరాధించుము. అది నాకు ప్రీతి నొసగును. అది నన్ను నేరుగా అరాధించుట. వచ్చిన అతిథిని వెంటనే గౌరవించిన, అతడు మరల మరల వచ్చినట్లు, నేను మాటిమాటికిని వత్తును. క్రమముగ నీవద్దనే తిష్ఠవేసుకొని, నీలోకి ప్రవేశించి, నీవే నేనుగా మారిపోదును.

శ్లో॥ అస్వార్థే ప్రేమ చాన్యోన్యం, తన్మయ్యపి చ లౌకికమ్
వఞ్చయే న్నతు సర్వజ్ఞ, మస్వార్థ భ్రమ మైహికమ్॥ 21

తా॥ స్వార్థము లేనపుడే భగవంతునిపై ప్రేమ కలగియున్నట్లు-విశ్వసించవచ్చును. స్వార్థమున్నంతవరకు ప్రేమకు చోటులేదు. ప్రేమ రెండువైపులా ప్రసరించవలెను. కాన, భగవంతునికి నీపై ప్రేమ ప్రసరించును. లోకములో అల్పజ్ఞులు, అజ్ఞులు ఉన్నారు. వీరు, ఎదుటివాడు తమను వాని స్వార్థమునకై ప్రేమించుచుండగా, నిస్వార్థముగా వాడు తమరినే ప్రేమించుచున్నాడని భ్రమపడి మోసపోవచ్చును. కాని, భగవంతుడు సర్వజ్ఞుడు. నీవు ఆయనను ఎందుకు ప్రేమిస్తున్నావో అయనకు తెలును. ఆయనను వంచింప లేవు.

శ్లో॥ అన్యోన్య వఞ్చనా లోక - ప్రేమ భార్యా సుతాదికే
అహం నేచ్ఛామి కిఞ్చిత్తే, తథా స్యాః ప్రేమ తద్విసత్ ॥ 22

తా॥ లోకములో అన్యోన్య వంచనలే ప్రేమలు. భార్య తన సుఖమునకై భర్తను ప్రేమించుచున్నది. భర్త తనను భార్య నిస్వార్థముగా ప్రేమించుచున్నదని భ్రమపడి భార్యను ప్రేమిస్తున్నాడు. అలానే భర్తయు భార్యను తన సుఖమునకై ప్రేమించుచున్నాడు. కాని భార్య తననే భర్త నిస్వార్థముగా ప్రేమించుచున్నాడని భ్రమపడి భర్తను ప్రేమించుచున్నది. ఇట్లే తండ్రి కుమారులు మొదలగు ఐహిక బంధాలన్నీ పరస్పరము వంచించుకొనుటయే. భగవంతునికి నీ నుండి ఏమియు తన స్వార్థమునకు అక్కరలేదు. ఆయన నిన్ను నిస్వార్థముగా ప్రేమించుచున్నాడు.నీవును అట్లే ఆయనను నిస్వార్థముగా ప్రేమించుము. అదే సత్యమైన ప్రేమ. అనగా నిజమైన భక్తి.

శ్లో॥ భార్యాదివ ద్వఞ్చయసి, స్వామినం స న వఞ్చితః
పితృవ త్త్వయి చే త్సర్వ- జీవ పుత్ర సమప్రియః॥ 23

తా॥ నీవు భగవంతునికూడా, భార్యాపుత్రులను మోసగించుచున్న రీతిగా, నీ స్వార్థమునకై ప్రేమించుచు, మోసగించ యత్నించుచున్నావు. కాని సర్వజ్ఞుడగు స్వామి ఎన్నటికిని మోసపోడు. తండ్రి వాత్సల్యకారణంగా నిన్ను ప్రేమించవచ్చును గదా అన్నచో, నిన్ను ఒక్కడినే ఏల ప్రేమించవలయును? సమస్త జీవులును ఆయన బిడ్డలే కాన, నిష్పక్షపాతంగా అందరిని సమంగానే ప్రేమించుచున్నాడు. నీ కర్మ ఫలమును రద్దు చేసి, నీ కష్టమును తొలగించ వలయునన్న, అందరికర్మ ఫలములను రద్దుచేసి, అందరి కష్టములను తొలగించవలయును గదా.

శ్లో॥ భక్తి రూపం సమం భిన్నే, గుణో హి శ్వసృగాలయోః
నిష్కామ స్వార్థభేదేన, గుణజ్ఞో భగవా న్న నా॥ 24

తా॥ నక్కయు, కుక్కయు చూచుటకు ఒకే రీతిలోనుండును. కానీ, నక్క బహు మోసకారి. కుక్క అతి విశ్వాస జీవి. ఇట్లే మానవులలో భగవంతుని స్వార్థమున కుపయోగించు భక్తులును, నిష్కామముగా భగవంతుని ఆరాధించువారును నున్నారు. రెండు తెగల వారునూ భక్తులే. ఈ భక్తి నక్క-కుక్కల సమానరూపమువంటిది. కానీ, భక్తి యొక్క గుణములు నక్క-కుక్క గుణములవలె చాల తేడాతో నుండును. ఒక భక్తి ఎంతో తుచ్ఛము, మరియొక భక్తి ఎంతో ఉదారము-ఉన్నతమైనది. భక్తిని చూచి భగవంతుడు, మానవుని వలె మోసపోడు. ఆ భక్తి యొక్క గుణమును తెలుసుకొనగల సర్వజ్ఞుడు భగవానుడు.



శ్లో॥ త్రిభిః కర్మీ ద్విధాభక్తో, యోగీ చైకేన మాంశ్రితః
అన్నంహి కరణాన్యేకం, యోగోఽత్ర ధ్యాన శబ్దగః॥ 25

తా॥ యజ్ఞకర్మలను చేయు కర్మిష్ఠులు ద్రవ్యముతోను, మంత్రవాక్కులతోను, ఏకాగ్రతతోను కూడిన మనస్సులతోను నన్ను ఆరాధింతురు. భక్తులు, కేవలము వాక్కు, మనస్సులతో నన్ను ఆరాధింతురు. యోగులు కేవలము మనస్సుతోనే నన్ను ధ్యానింతురు. వీరలలో ఒకరినొకరు తాము చేయు ఆరాధనామార్గము గొప్పది యని కలహించుచున్నారు కానీ, వాక్కు, మనస్సూ, అన్నము (ద్రవ్య) యొక్క రూపాంతరములేకదా. కాన, ముగ్గురూ ద్రవ్యము యొక్క రూపాంతరములతోనే నన్ను ఆరాధించుచున్నారు కాన, తేడా ఏమున్నది? తేడా దేనిలో ఉందంటే ఆ ఆరాధన నిష్కామమా? (బంగారమా?) కాదా? అన్నదానిలోను, కష్టాలలో సైతము చలించక ఉన్నదా లేదా (అనగా దాని బరువు)? అన్న దానిలోనే ఉన్నది తప్ప, కర్మ-భక్తి-యోగములలో తేడా లేదు. (ఇక్కడ యోగ శబ్దము పాతంజలమత ప్రకారము అష్టాంగ యోగపరంగా గ్రహించబడినదే తప్ప, నిష్కామకర్మయోగపరంగా కాదు.)

శ్లో॥ లీలా బోధా గతారాధా, గ్రీష్మసైకత దాహతః
ఏవం జీవో న నిన్దన్మాం, వేదనాయాంచ నాఙ్చితమ్॥ 26

తా॥ నా లీలలన్నియును జ్ఞానబోధకములగు గురుబోధలే. రాధను శాశ్వతముగా వదలితిని. ఆమె గ్రీష్మకాలంలో మండుచున్న యమునానది ఇసుకతిన్నెలపై బడి నన్ను ఏమాత్రము నిందించక ప్రాణముల్లన్ను విడచినది. దీని అంతరార్థమును గ్రహించవలెను. ఇది లోకోపదేశమునకు ఏర్పాటుచేసితిని. మానవుడు కూడ రాధవలె భగవంతుని కంటితో చూడడు. రాధ ఎట్లు సదా నా స్మరణంతో ఉందో అలానే జీవుడూ సదా నా స్మరణంలోనే ఉండాలి. ఆ గ్రీష్మంలోని మండు ఇసుకలే కర్మ ఫలాల కష్టములు. నేను వదలినందువల్లనే తన బతుకు అలా అయినదని ఆమె నన్ను నిందించలేదు. ఆమె భావము మారలేదు. అలానే జీవుడూ, ఎన్ని కష్టములు లభించినా, తన కర్మ ఫలాలే అని తెలుసుకొని, నా పై నిశ్చల భక్తితో, అంత్యమరణ వేదనలో కూడా అదే స్వామి స్మరణముతో ఉండవలెను.

శ్లో॥ ఆత్మ ప్రేమ సుఖం త్యక్త్వా, స్వామి ప్రేమ సుఖం కురు
సర్వోద్ధరణ కార్యేణ, క్లాన్తస్య స్యా స్సహాయ కృత్॥ 27

తా॥ స్వార్థమునకు కారణం ఒక్కటే. నిన్ను నీవు సదా ప్రేమించుచున్నావు. దీనిని మానుకొన్నచో స్వార్థము ఎగిరిపోవును. కాన, ఆత్మప్రేమను మానుకొని, స్వామిని ప్రేమించుము. అనగా నీ సుఖమును మరచి, స్వామి సుఖమును కోరుము. స్వామి సర్వజీవులనుద్ధరించుటకు మహాకార్యమున అహర్నిశము సర్వత్రా సంచరిస్తూ శ్రమ పడుచున్నాడు. ఆయన సుఖమును కోరుదువేని, నీవు ఆయన కార్యములో సాయపడుము. అప్పుడు ఆయన సుఖమును నీవు కోరినవాడవగుదువు.

శ్లో॥ ఫలముక్తం స్థిరం చాన్తే, తత్త్వభారౌ పరీక్షయా
ప్రేమహేమ సకామాంతు, రీతిం నేచ్ఛతి న ప్రభుః॥ 28

తా॥ ప్రతి ఫలాపేక్షారహితమైన ప్రేమయే గొప్ప బరువుగల బంగారము. అనగా నిష్కామ భక్తియే బంగారము. సకామ (కోరికల) భక్తి బంగారము కాదు. బంగారము వలె మెరయు ఇత్తడి. ఇది బంగారమా? కాదా? అన్నది మొదటి పరీక్ష. ఇక, ఆ బంగారము యొక్క బరువు ఎంతో ఎక్కువగా ఉండుట-మరణబాధలో సైతము నిష్కామ భక్తి నిశ్చలముగా నిలచుటయే రెండవ పరీక్ష. మొదటిది వస్తు తత్త్వ పరీక్ష. రెండవది వస్తు భార పరీక్ష. తత్త్వములో బంగారమై భారములో అత్యధికమైన ప్రేమనే స్వామి కోరుచున్నాడు.

శ్లో॥ వాసనా స్పన్ద విషయ - వీచిలోలాత్మ శైవలమ్
యస్య చేతో న శైలాభ, మవధూత స్స ఉచ్యతే॥ 29

తా॥ ఈ సంసారమున విషయవాసనలు జీవుని మనస్సునకు తగులుచుండును. సముద్రమునుండి వచ్చిన అలలకు, ఒడ్డున ఉన్న నాచు ఊగిపోవుచుండును. అవే అలలు ఒడ్డున ఉన్న ఒక కొండను తగిలినచో, కొండ చలించదు. అలలు రాతిచేత అవధూతములు అనగా విసరివేయబడి, వెనుకకు మరల లయము చెందును. ఇదే అవధూత స్థితి. అలలే విషయములు. అలల యొక్క చలనములే వాసనలు. కాన, ఎవని మనసు, విషయములు అనే అలల తాకిడి చేత, వాసనలు అను చలనములను గ్రహించి క్షోభించదో అట్టివాడే "అవధూత" స్థితిలోనున్నవాడు. నిర్వికారమైన శాంతియే అవధూత లక్షణము.



శ్లో॥ భిన్నభావైః పితా పుత్రః, ప్రియా పత్నీ యథేప్సితః
దృశ్యో ధ్యేయే సమం రూపే, స్వర్ణం నిష్కామ గౌరవాత్॥ 30

తా॥ భక్తులు నన్ను తండ్రిగానో (ప్రహ్లాదుడు), కుమారునిగానో (దశరథుడు), భర్తగానో(సీత,సతీదేవి మొదలగు), ప్రియునిగానో (రాధ) తమ ఇష్టానుసారంగా భావించారు. నాతో పెట్టుకొన్న బంధం ఏరూపంలో ఉన్నా ఒక్కటే. ఒక బంధమెక్కువకాదు, మరియొకటి తక్కువ కాదు. మరణ బాధలో సైతము నన్ను తప్పుబట్టక, నాపై స్థిర భక్తిని విడువక ప్రాణప్రయాణ సమయమున సైతము నాపై నిశ్చల ప్రేమతో ఉండు తత్త్వమే అన్ని బంధములలోను, ఆభరణములలో బంగారము వలె ఉన్నది. రూపమేది అయినా, పదార్థమును బట్టియే విలువ ఉండును. అట్లే బంధమేదియైననూ నాపైగల నిశ్చలభక్తి అను బంగారమగు ప్రేమ ఒకే తత్త్వము. ఇదేవిధంగా ఆరాధించే రూపము ఏదయినా, ప్రతి రూపములోని పదార్థము నేనే కాన, రూపమువలన ఏతేడా ఉండదు. కాన, ప్రేమ స్వార్థరహితమైనచో బంగారము.

శ్లో॥ పఞ్చగేహీ త్రిసంన్యాసీ, నావధూతస్య సాధవః
అత్యాశోఽధమ ఏషోఽజ్ఞో, మోహా త్పాపీ పతత్యధః॥ 31

తా॥ కూడు, గుడ్డ, నీడ, కుటుంబపోషణము, సంతాన బాధ్యతల వరకు ఆశ ఉండుటలో తప్పులేదు. ఏలననగా, ఈ ఆశను నీవు అతిక్రమించలేవు. ఇట్టి వారు గృహస్థులు. ఇవి అన్నియును నా కొరకు వదలిన వారు అవధూతలు. ఈ ఇరువురికి మధ్య, కేవలము కూడు, గుడ్డ నీడ వరకే ఆశకలవారు సంన్యాసులు. ఈ ముగ్గురును మంచివారే కాన తరింతురు. ఇక నాల్గవ తెగవారు - అత్యాశ కలవారు -, అజ్ఞానులు, మోహము చేత అనంతధనార్జనతో పాపము చేయుచు, అధఃపతనము చెందుచున్నారు.

శ్లో॥ అవధూతో మహాభక్తో, మహాజ్ఞానీ స యోగిరాట్
అప్రయత్నేన పక్వస్స్యా, న్న చే త్ప్రకృతి పాతితః॥ 32

తా॥ అవధూతుడే మహాభక్తుడు. మహాజ్ఞాని అతడే. అతడే యోగీశ్వరుడు. అతడికిని, నాకును ఏ భేదము లేదు. అయితే, ఈ అవధూతావస్థ సహజముగా అప్రయత్నముగా, సాధనలో పరిపక్వమువలన రావలయును కానీ, హఠాత్తుగా బలవంతముగా అవధూతకాని, సంన్యాసికానీ, కారాదు. అట్లు అయినచో ఆ స్థితిలో ఎక్కువ కాలము

ఉండలేదు. అయోగ్యుడు రాజపదవిలో ఎక్కువ కాలము ఉండలేనట్లు, అయోగ్యరాజును ప్రజలు దించివేసినట్లు, వానిని ఈ ప్రకృతి కిందకు పడవేయును.

శ్లో॥ సంన్యాసా దవధూత స్స్యా,దున్మత్తా ముక్తవాసనః
సంన్యాసా దుత్తరో గేహీ, కర్మమాత్రా న్మతిచ్ఛలాత్॥ 33

తా॥ పరమాత్మయందు లగ్నమైనవారు సంన్యాసులు. వీరు సంసారమునందు సహజమైన వైరాగ్యము వలన సంసారమును ఎగురకొట్టిన వారు కాన అవధూతలనబడుదురు. ఇది తెలుసుకొనక, పిచ్చివారు, వస్త్రములను విడచి అవధూతలనబడుచున్నారు. మనస్సులో కోరికలుంచుకొని, వాటిచింతలతో నుండుచు, కేవలము ఆ కోరికల సంబంధించిన కర్మలను త్యజించినట్టి బూటకపు నంన్యాసము కన్నను, గృహస్థాశ్రమమే మేలు.

శ్లో॥ ఉపవాసీవ నిష్కర్మీ, సకామో గేహినోఽధమః
ధూతవస్త్రోఽవధూతాఖ్యో, గేహీ మత్సఙ్గ ఉత్తమః॥ 34

తా॥ ఉపవాసము చేయుచు, సదా ఆహార చింతతోనుండుచు భగవచ్చింతనలేని బూటకపు మిధ్యాచారము కన్నను, ఆహారమును తీసుకొని భగవచ్చింత చేయు వాడెంతో ఉత్తముడు. ఆహార చింత కలుగగనే, వెంటనే ఆహారమును తీసుకొన్నవాడు రోజులో ఒక్క గంటను మాత్రమే వ్యర్థము చేసి మిగిలిన సమయమంతయును భగవచ్చింతతో గడిపినవాడు, అసలు ఆహారచింతయే లేక రోజు అంతయును భగవచ్చింతతో గడిపిన వానితో దాదాపు సమానుడు గదా. కాన గృహస్థాశ్రమ కర్మలను చేయుచు భగవచ్చింతతో నుండువాడు దాదాపు సంన్యాసియగు అవధూతునితో సమానుడు. అంతేతప్ప,కర్మలను, గుడ్డలను త్యజించినంతమాత్రమున, మనస్సు కర్మఫలచింతలతో నుండునేని అట్టివారు సంన్యాసులు, అవధూతలు కారు. గృహస్థులకన్ననూ అధములు.

శ్లో॥ సఙ్కల్పైః ఫలసఙ్గోత్థైః, హర్షశోకై శ్చ వాసనా॥
జాయతే కర్మణా నైవ, వాసనా చేతనాత్మికా॥ 35

తా॥ కర్మలు చేసే ముందు, సంకల్పములవలన - ఫలములు లభించునప్పుడు. జనించు, నంతోష దుఃఖములవల్లనే వాసన జన్మించును. కేవల కర్మ చేత వాసన



జన్మించదు. ఏలననగా వాసన చైతన్య స్వరూపము. కాన, చైతన్యస్వరూపములైన సంకల్ప, నంతోష, దుఃఖముల వల్లనే వాసన సంభవించును.

శ్లో॥ అవాసనాత్రయో ముక్తః, ఫలై ర్నిర్మల ఏతి మామ్
శక్తిమా నల్ప కర్మత్వా, దన్తే సేవా ఫలం గతః॥ 36

తా॥ ఎవనికి ఈ మూడు అనగా-సంకల్పము, సంతోషము, దుఃఖము ఉండవో అతడు కేవల కర్మలను చేయుచుండుట వలన అతడికి వాసనలు అంటవు. ఎప్పుడైతే వాసనలు అంటవో, అతడు ఈ లోకమున చేసిన కర్మలఫలములను ఈ లోకముననే వదలి, కేవల శుద్ధ చైతన్యస్వరూపుడై నిర్మలుడై, శరీరమును విడచిన పిమ్మట కర్మఫలములను భోగించు లోకములకు పోడు. అట్టి వాడే జీవన్ముక్తుడు. కేవల కర్మలకు చాలా అల్పమైన శక్తి వ్యయమగును. కాన, అట్టి ముక్తజీవుడు అనంత శక్తిసంపన్ను డైయుండును. అట్టి ముక్త జీవుడు నన్ను చేరి నా యొక్క సేవకునిగా మారును. నాసేవా భాగ్యమును పొందుటయే పరమముక్తి. నా సేవకుడే పరమ ముక్తుడు.

శ్లో॥ సఙ్కల్ప ఫలచిన్తాహి, కర్మ బన్ధ ఫలప్రదా
దైవాత్ప్రాప్త క్రియాదగ్ధా, వ్యాసో న వ్యభిచారధీః॥ 37

తా॥ కర్మకు ముందు చేయు సంకల్పము, కర్మతరువాత దాని ఫలమును గురించిన చింత. ఈ రెండే కర్మబంధకారణములై కర్మఫలముల నిచ్చుచున్నవి. ఈ రెండూ లేని వాడు చేయు కర్మలు కేవలము దైవేచ్ఛ చేత ప్రాప్తించినవే కాన వానికి కర్మ బంధము కానీ దాని ఫలభోగము కానీ ఉండదు. ఉదా:- వ్యాసుడు స్త్రీ కామమే లేనివాడు. అట్టి వాడు దైవికముగా మాతృశాసనముచేత అన్య భార్యలయందు పుత్రోత్పాదనము 'చేసి ధృతరాష్ట్రపాండుపులనుత్పాదించెను.' ఆయనకు అసంకల్పము కానీ, ఆ కర్మ తరువాత ఆ కర్మ చింతగానీ లేదు. కాన, కర్మను చేసియు దానిఫలమును పొందలేదు. పాపి కాలేదు.

శ్లో॥ రావణోఽ కర్మణా ప్యాసీ, త్పాపీ చిన్తాపరాయణః
ఫలదణ్డ హత స్తస్మా, త్కామో బన్ధాయ కర్మ నో॥ 38

తా॥ రావణుడు సీతా సంగమ కర్మ నాచరించక పోయిననూ అహోరాత్రములు, ఆకర్మచింతతో గడిపినాడు కాన, పాపకర్మను చేయకున్ననూ పాప కర్మ ఫలమును

పొందినాడు. కావున, బంధమునకు కర్మ కారణము కాదు. ఆ కర్మఫలమును గురించిన కోరికయే కారణము.

శ్లో॥ సర్వాపణే ష్వహం హ్యస్మి, భిన్నవేషై స్వమార్థిషు
సమమూల్యాని వస్తూని, గచ్ఛ కేనాపి సత్పథా॥ 39

తా॥ ఏ కొట్టులో అయినా,నేనే, వేరు వేరు వేషాలలో ఉన్నాను. కాన, ఏ రూపమైనా ఒక్కటే. ప్రతి కొట్టునాదే. ప్రతి కొట్టులోనూ అన్ని సరుకులు ఉన్నవి. ఒకసరుకు యొక్క ధర; కొట్టునుబట్టి మారదు. నీ వే మార్గమున వచ్చిన నావద్దకే వచ్చెదవు. నా కొట్టుకే చేరుదువు. నీ నిష్కామభక్తి ధనమును పట్టియే ఫలము లభించును.

శ్లో॥ ఫలభోగః పరీక్షాచ, శుద్ధిశ్చ త్రివిధం ఫలమ్
ఆద్యమేవ మదన్యత్ర, మయోపక్రియతే సదా॥ 40

తా॥ నే నెల్లప్పుడు ఉపకారమునే చేయుదును. కర్మ ఫలమును అనుభవించి దాటుట, నా పరీక్ష, చిత్తమును శుద్ధి చేయుట - అను మూడు ఫలములను ఒకే ఫలముతో లభించుచున్నవి. నన్ను వదలిన వాడు, కేవలము కర్మ ఫలమును అనుభవించుట అనునది ఒక్కటియే జరుగును. (అనగా నేను కష్టమును కలిగించినపుడు వాని కర్మఫల భోగము జరుగును. నా పరీక్షయు జరుగును. వానికి చిత్త శుద్ధి వచ్చును)

శ్లో॥ వస్తుజ్ఞానా త్పరం భక్తి : ప్రాప్తితాప శ్చ లభ్యతే
జ్ఞానం మూలం హి నిశ్రేణి, స్సాక్షా ద్భక్తిరతః పుర:॥ 41

తా॥ ఏ వస్తువు అయినా కనిపించగనే వినిపించగనే ఆకర్షించదు. దాని స్వరూపలక్షణములు బాగుగ తెలిసిన తరువాతనే, దాని పైన ఆకర్షణ, దానిని పొందు వేదనయు ఏర్పడును. అనగా వస్తుజ్ఞానము తరువాతనే - అనగా బ్రహ్మజ్ఞానము తరువాతనే, దానిపై అకర్షణ వేదన లను భక్తి వచ్చును. కాన, జ్ఞానము మూలకారణము, భక్తి వలన పరమాత్మ, చిక్కును కాన సాక్షాత్కారణము. మూలకారణము లేకుండ సాక్షాత్కారము సంభవించదు. మెట్లు లేకుండా మేడ పైకి ఎట్లు పోగలరు? కాన ముందు జీవులకు జ్ఞానమునే బోధించవలయును.



శ్లో॥ అదర్శనే పరాకాష్ఠా, రాధాయా నేతి రుక్మిణీ
తప్త క్షీరవపు స్తాపా, ద్వారకా రాధయోజ్ఝితా॥ 42

తా॥ నేను ఈ జీవులకు కనపడకుండా ఎందుకున్నానంటే, కనపడని వియోగమే విలువనిస్తుంది. ఇది మానవుల స్వభావము. వియోగంలోనే, తపన పరాకాష్ఠకు చేరుతుంది. నేను కనపడనందువల్లనే, రాధ భక్తి పరాకాష్టకు చేరుకొన్నది. నిత్య సాహచర్యంవల్లనే రుక్మిణి, అస్థితికి చేరుకోలేక పోయినది. దూరములో నున్న రాధ, నా సన్నిధిలో నున్న రుక్మిణి ఉన్నత స్థితిలోనున్నదని తలచుచు బాధ పడుచుండెడిది. రుక్మిణియును, నిత్యసన్నిధివలన అహంకారముతో నుండెను. నేనొక నాడు రాధను ద్వారకకు పిలిపించితిని. రుక్మిణి, తాను రోజు తాగే వేడి పాలను రాధ కిచ్చినది. వాటిని రాధ తాగినది. ఇరువురు నా వద్దకు వచ్చినారు. ఆ రోజు నేను కాలిన బొబ్బలతో నుంటిని. వారు కారణమడిగినందువలన, రాధ త్రాగిన పాలవేడి వలన కందిపోయినానని, రాధలో నేనున్నానియు చెప్పితిని. అయితే రోజూ, అదే వేడిపాలను రుక్మిణి త్రాగుచున్నా నేను కందిపోలేదెందులకని రుక్మిణి ప్రశ్నించగా చెప్పితిని "రాధ, నా విరహంలో అపరాకాష్ఠ స్థితికి చేరుకొన్నది. నిత్య సాహచర్యం వల్ల ఏర్పడిన నిర్లక్ష్యం వలన రుక్మిణి ఆ స్థితికి చేరలేక పోయినది". ఇది వినగనే, రాధ వెంటనే ద్వారకను వదలి బృందావనమునకు పోయినది. రాధ ఎప్పుడూ తరువాత ద్వారకకు రాలేదు, నేనూ బృందావనమునకు పోలేదు. కాన, ఈ జీవులకు నేను కనపడకుండా ఉండుటలో నావిలువ నిలచుచున్నదని తెలియుము. విలువ లేనిదే, సాధన సాగదు.

శ్లో॥ సౌన్దర్యం సౌరభశ్లేషా, ధాకర్షతి సమీపగమ్
సంపుష్పితస్య వృక్షస్య, దూరాదితి శ్రుతేర్వచః॥ 43

తా॥ అందముతో పాటు సుగంధము వచ్చుచున్నచో, ఎట్లు ప్రియుడు ప్రియురాలిచే ఆకర్షించబడి, దగ్గరకు చేరి అంటుకొని పోవునో, అట్లే నేనునూ, కర్మ నుండి వచ్చు నిష్కామము అను సుగంధము వలన, ఆ కర్మను సమీపించి, దాని వద్దనే ఆకర్షించబడి ఉందును. ఇదే వేదములో "యథా సంపుష్పితస్య. . .పుణ్యస్యకర్మణో దూరాద్గన్ధోవాతి" అని చెప్పబడినది. (అనగా పుష్పితవృక్షము నుండి దూరము వరకునూ సుగంధము వచ్చినట్లు, పుణ్యకర్మల నుండి సుగంధము వ్యాపించును అని అర్థము)

శ్లో॥ అకృష్టః కర్మణా స్వార్థ-వ్యాపారా ద్దూరమాస్థితః
సున్దర్యాZZ కృష్ట తరుణ, స్స్వేదదుర్గన్ధదూరగః॥ 44

తా॥ కర్మ అనగా ఆరాధన ఎంత చక్కగా ఉన్నను, దానిలో ప్రతిఫలాపేక్ష అను వ్యాపారతత్త్వము కల స్వార్థమున్నపుడు, కర్మచే ఆకర్షించబడినను, స్వార్థము వలన దూరము పోవుదును. ఎట్లు అనగా, ఎంతో సౌందర్యము కలిగి, ప్రేమను ప్రదర్శించు ఒక కన్యచే ఆకర్షింబడిన యువకుడు, ఆ కన్య చేరగనే, ఆకన్య నుండి వచ్చే చెమట దుర్గంధము వలన రోత జన్మించి, వదలి దూరముగా పోయినట్లు, నేనునూ దూరముగ పోవుదును.

శ్లో॥ జ్ఞాన భక్తి కర్మయోగా, నిష్ఫలా స్స్వార్థ భోగినః
చౌర్యచ్ఛన్నస్య నిష్కామా, స్సత్యా లోకే నహీతి చేత్॥ 45

తా॥ తనదుఃఖనివృత్తికీ, తన ఆనందమునకు, ఏయే దేవతలనెట్లు ఆరాధించవలయునను జ్ఞానము బ్రహ్మజ్ఞానము కాదు. అట్టివాడు అజ్ఞానియే కాని జ్ఞానికాదు. తన స్వార్థలాభమునకు బ్రహ్మముపై భక్తి కలిగియున్నవాడు భక్తుడే కాదు. అట్టి వాడు బ్రహ్మమునకు చేయు సేవకాదు, అతడు సేవకుడే కాదు. అట్టివాడు జ్ఞానము-భక్తి-కర్మ అను ముసుగులలో నున్న స్వార్థపరుడగు దొంగ. అట్టివాని యోగము కూడ సత్యముకాదు. నిష్కామంగా, స్వార్థరహితంగా ఉన్నపుడు జ్ఞాన, భక్తి, కర్మ యోగములు సత్యములగును. అయితే "ఏమయ్యా! లోకంలో ఎక్కడైనా ప్రయోజనరహితంగా దేని జ్ఞానమైనా ఎందుకు? దాని భక్తి సేవలు ఎందుకు? కాన, ఇది అర్థరహితము అంటే-

శ్లో॥ అభిమానీ త్యజేత్ప్రాణా, న్భ్రాన్త స్స స్వార్థ లక్ష్యతః
తావత్సాధనమప్యత్ర, లక్ష్యం బ్రహ్మవతి ధ్రువమ్॥ 46

తా॥ ఇది సరికాదు.ఎందుకనగా, లోకంలో ఒకరి యొక్క గొప్పతనమును గురించి తెలుసుకొని, ఎట్టి ప్రయోజనము లేకున్నా, ఆవ్యక్తి యొక్క అభిమానిగా మారుచున్నారు. తాను అభిమానించిన ఒక సినిమా నటుడో, రాజకీయనాయకుడో మరణించగా, తాను ఆత్మహత్య చేసుకొనుచున్నాడు! అట్టివాడేమి ప్రయోజనము వాశించి తన ప్రేమ-



సేవలను సమర్థించుకొనుచున్నాడు? ఇది వెర్రి ప్రేమ అన్నచో - నిజమే. ఏలననగా, అతడు వెర్రిగా ఏవ్యక్తిని అభిమానించివాడో, అవ్యక్తి స్వార్థముతో నున్నాడు. ఇతడిని గురించి పట్టించుకొనలేదు, అయినా, ఇతడు ఆ వ్యక్తిని వదలలేకున్నాడు. కాన, ఇతడి ప్రేమ గొప్పదే , కానీ ఆ వ్యక్తి గొప్పవాడు కాదు. కానీ బ్రహ్మమట్లు కాదు. తన యందు అట్టి వెర్రి ప్రేమతో నున్న భక్తుని తప్పక కాపాడును. అయితే బ్రహ్మమే కాపాడునన్న లక్ష్యముతో కాక, తనకు కష్ట నష్టములు కలిగించినను బ్రహ్మమును విడువకుండుటలో పైన చెప్పిన వెర్రి ప్రేమ కలిగియే ఉండవలెను. ఈ వెర్రి ప్రేమయే సాధనసారము.

శ్లో॥ అజ్ఞప్రేమేవ లోకస్థం, భక్తి స్స్వార్థ ఇవాప్యహమ్
జితోZపి లాభవాన్నష్టం, కృతం రక్షామ్యహం పరమ్॥ 47

తా॥ లోకములో ఏవిధముగా ఒకవెర్రివాడు, ఎట్టిప్రయోజనమును కోరకయే, తనను గురించి పట్టించుకొనని ఒక స్వార్థముతో కూడినవ్యక్తి కొరకు తన ప్రాణములను సైతము విడచుచున్నాడో అదే వెర్రిప్రేమతో బ్రహ్మమైన నన్ను ఉపాసించవలెను. ఈ వెర్రి ప్రేమ భక్తి అనబడును. పరీక్షలను పెట్టుటలో బ్రహ్మమైన నేనును, స్వార్థపరుడై, ఇతరులనపేక్షించు వ్యక్తివలె కనుపడుదును. అట్టి పరీక్షలలో నావలన ఏ లాభము లేక కష్టనష్టములు కలుగును. అయితే అట్టి పరీక్షలు, నీ పురాకృత దుష్కర్మ ఫలములే తప్ప, ప్రత్యేకంగా నేను కల్పించినవి కావు. కాన,నా పరీక్షలలో ఓడిపోయినా నీకు లాభమే-అంటే నీ పూర్వదుష్కర్మఫలములు అనుభవంతో నశించుచున్నవి. పరీక్షా సమయంలో నా మీద వెర్రి ప్రేమకు లోకంలో సినిమానటునిపై గల వెర్రి ప్రేమకూ ఆసమయంలో తేడా లేకపోయినను చివరలో తేడా ఉండును. సినిమానటుడు తన వెర్రి అభిమానిని ఎన్నటికీ పట్టించుకొనడు కానీ, నేను పరీక్షానంతరము నా వెర్రి అభిమానిని తప్పక రక్షించుచున్నాను.

శ్లో॥ జడే పూర్ణం ధర్మ చక్రం, వృక్ష పక్ష్యాది కర్మవత్
అదృష్టం మానవేZనన్త- తృష్ణారాశౌ ముని ర్వనే॥ 48

తా॥ అచేతనమగు ఈసృష్టి అంతయూ ధర్మ చక్రమే. వాయువు, సూర్యుడు, మేఘము మొదలగు అచేతనపదార్థములన్నియును ఎట్టి స్వార్థములేకయే కేవల పరోపకార్థమే కర్మలను చేయుచున్నవి. ఇంతవరకు ధర్మ చక్రమే కాన ఇంతవరకు నేనే. కాన, అచేతన

పదార్థములను నన్నుగా భావించి ఆరాధించుట ఎంతో సత్యమైన జ్ఞానము. ఈ అచేతనముల నుండి వృక్షాదులు సంభవించినవి. ఈవృక్షములు తమ ఆహారము వరకు గ్రహించి మిగిలినది ఫలబీజరూపంగా మానవులకు అందించుచున్నవి. వీటిలో కొంతస్వార్థమున్నది. ఇక పశుపక్ష్యాదులు పరులకు దానము చేయకున్ననూ వాటికి కావలసిన వరకే ఆహారమును గ్రహించుచున్నవి. కాన వీటిలో వృక్షముల కన్ననూ మరికొంత స్వార్థము పెరిగినది. ఇక, ఈ మానవుడో, పది తరముల వరకు ఆహారమున్ననూ, ఇంకనూ కావలయునని అనేక పాపములను చేయుచున్నాడు కాన, పూర్తిగా స్వార్థమైనది. ఇట్లు కర్మచక్రము వృక్షాదులలో ప్రవేశించి, చివరకు మానవుడిలో పూర్తిగా కర్మ చక్రమే మిగిలి ధర్మ చక్రము అదృశ్యమైనది. ఈ కారణము వల్లనే ఋషులు మానవులుండు నగరములను విడచి, అచేతన పదార్థములుండు కొండలు, నదులు, మరియు స్వార్థము చాల తక్కువగల వృక్షారణ్యములను ఆశ్రయించినారు.

శ్లో॥ లక్ష్య జ్ఞానే సతీ భర్తృ-ధనం జానాతి తుష్యతి
గణికా ధనలాభాయ, సాధన జ్ఞానమేవ తత్॥ 49

తా॥ ఒక వేశ్య విటుడి యొక్క ఐశ్వర్యమును గురించి తెలుసుకుంటుంది. దేనికి? తాను దానిని కాజేయుటకే. ఇట్లే స్వార్థపరుడు తన ఆనంద ప్రాప్తికై తన కోరికలను తీర్చుకొనుటకు నా శక్తిని గురించి విచారణ చేసి తెలుసుకొంటాడు. ఇట్టిది బ్రహ్మజ్ఞానము కాదు. ఇది అజ్ఞానమే. ఇచట తన స్వార్థమును నెరవేర్చుటకే సాధనమగు నా శక్తి జ్ఞానము, సాధన జ్ఞానమే కాని, లక్ష్యజ్ఞానము కాదు. వేశ్యలక్ష్యము విటుడు కాదు. వాని ఐశ్వర్యమే. ఆ లక్ష్యమును సాధించుటకు సాధనమే విటుడు. కాన, విటుని గురించి తెలుసుకొనుట సాధన జ్ఞానమే కదా. కానీ ధర్మపత్ని తన భర్త యొక్క ఐశ్వర్యమును గురించి తెలుసుకొనును. ఆ ఐశ్వర్యము భర్తకున్న తన కున్నట్లే గదా. కాన, ఆమె లక్ష్యము ఐశ్వర్యము కాదు. భర్తయే. కాన, భర్తృజ్ఞానము లక్ష్యజ్ఞానమైనది. ఇట్లే నిష్కామియగు వాడు నా శక్తిని తెలుసుకొని సంతృప్తి పడునే తప్ప, నా శక్తి తనకు రావలయునని కాని, దానినుపయోగించి తన కోరికను తీర్చుకొనవలయునని కాని కోరడు? అట్టి వాని లక్ష్యజ్ఞానమే బ్రహ్మ జ్ఞానము.



శ్లో॥ జ్ఞానం భక్తి స్తథా సేవా, సత్యా సత్యా అపి క్షయే
న సత్యా గణికాయాస్తు, తథా నిష్కామి కామినోః॥ 50

తా॥ తన భర్త ధనవంతుడని తెలిసి, తన ఆకర్షణ అధికమై భర్తను ప్రేమిస్తుంది. సేవిస్తుంది. ఒక వేళ తన భర్త ఆధనమును కోల్పోయినా, అదే ప్రేమసేవలను కలిగి ఉంటుంది. ఇదే నిజమైన భక్తి, సేవ. వేశ్య కూడా విటుడు ధనవంతుడని తెలిసి, ఆకర్షణతో ప్రేమించి సేవిస్తుంది. ఆ విటుడు ఆ ధనమును కోల్పోయిన తరువాత విటుని ప్రేమించదు, సేవించదు, తిరస్కరిస్తుంది. ఇది నిజమైన భక్తి, సేవ కాదు. కాన, నిష్కామి యొక్కజ్ఞాన, భక్తి, సేవలే నిజమైనవి. కోరికలతో, వాటిని తీర్చుకొనుటకు భగవంతుని సాధనముగా వాడుకొనువాని జ్ఞాన, భక్తి, సేవలు అసత్యములు. కనుక నిష్కామ భక్తియే సత్యమైన భక్తి.

ఇతి శ్రీ దత్త గురు భగవద్గీతాయాం
శ్రీదత్త నిష్కామ భక్తి యోగోనామ
సప్తమాధ్యాయః

ఓం

శ్రీ గురుదత్త      జయ గురుదత్త

విష్ణు ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## అష్టమాధ్యాయః

## శ్రీదత్త వాత్సల్య యోగః

శ్రీ దత్త భగవాన్ ఉవాచ:-

శ్లో॥ శేష సాధన లభ్యంతు, పాశ్చాత్యోఽప్యవదం గురుః
అపునర్జన్మవక్రార్థ, శ్శిష్యోక్తో నిత్యనారకః॥ 1

శ్రీ దత్త భగవానులు వచించిరి :

తా॥ నన్ను చేరు సాధనలోనికి ప్రవేశించి అహర్నిశలు సాధన చేయుచు ఈ జన్మ సమయము చాలనివారికే మరల మానవ జన్మనిత్తును. ఈ జన్మను నన్ను చేరుటకు ఉపయోగించని వారికి మరల మానవ జన్మలేదు. ఈ మాటనే, నేను పాశ్చాత్య దేశములలో గురు రూపమున అవతరించినపుడు చెప్పియుంటిని. ఆమాటను నాశిష్యులు వక్రార్థముతో జీవునకు మరల అసలు జన్మయే లేదని ప్రచారము చేసిరి. పాపము చేసిన జీవుడు నిత్యము నరకములో ఉండి పోవునని చెప్పిరి.

శ్లో॥ నిరయే గురువాత్సల్య - దణ్డశ్శిష్యా స్సమే చరాః
మూఢయాతనయా దోష - మార్జన్యా కాలభైరవః॥ 2

తా॥ నరకాదులను సృష్టించినది కూడ, దుర్గుణములను పోగొట్టి సద్గుణములతో సన్మార్గములో నడిపించి, సకాలములో బ్రహ్మము అను గమ్యమునకు చేర్చు గురువాత్సల్యమే, శిష్యదండనములోనున్నది తప్ప, ద్వేషము, కచ్చకాదు. 84 కోట్ల జీవరాశులును, నా శిష్యులేకాన, ఈ అవసర దండనము అన్నిప్రాణులకూ వర్తించును. శారీరక శిక్షలకు లొంగని జీవులను యాతననను భవింపచేసి, కాలభైరవుడు వారి దుర్గుణములను, తన చేతిలోని చీపిరితో ఊడ్చివేయుచున్నాడు.



శ్లో॥ తత్సత్యం క్రిమిజన్మాదే, ర్న ద్వేష స్స తదిచ్ఛతి
స్వాపాహారరతి ర్నిత్యం, నృబుద్ధ్యవసరోఽస్య కః? 3

తా॥ నిత్యనరకము కూడ నిజమే. జీవుడు మనుష్య జన్మను మరల పొందక, క్రిమికీటకాది జన్మలనెత్తుచు, ఈ లోకమున భ్రమించుటయే నిత్యనరకము. అక్కడ కూడ నా వాత్సల్యమే తప్ప నేను ఏవిధంగానూ, వారిపై ద్వేషము చూపలేదు. ఏలనన,జీవుడు, నన్ను తలచక, నిత్యము అహార నిద్రా సురతాది భోగ లోలుడై, నాస్తికుడైనవాడు, క్రిమికీటకాది జన్మలలో కూడ నిత్యము అహార నిద్రారత్యాది లోలుడై సంచరిస్తున్నాడు కదా. కాన, వాడు కోరుకొన్నదే వానికి లభించినది. భగవంతుని గురించి విచారించు బుద్ధి అట్టి వానికి అనవసరము కదా. వానికి, మనుష్యజన్మ అనవసరము కాన, అది లభించలేదు. నా చింతలేని వానికి బుద్ధి ఎందులకు? కాన బుద్ధిహీనములగు జన్మలనెత్తి వానికి కావలనసినది వాడు పొందుచున్నాడు.

శ్లో॥ గౌర్యమ స్సాత్వికోదేహ - శిక్షకః కాలభైరవః
అగ్నినా దుర్గుణోన్మాదం - మార్జయే త్స భయంకరః॥ 4

తా॥ నా వెంట నున్న అవు యమధర్మరాజు. సాత్వికుడు. ఇతడు శారీరక శిక్షలనిచ్చి జీవుని మార్చుటకు యత్నించును. దానికి జీవుడు మారడేని, నా వెంట నున్న ఈ క్రూరశునకమగు కాలభైరవుడు, ఇతని చేతిలో గల అగ్ని పాత్రలోని మహా విద్యుచ్ఛక్తి ద్వారా, దుర్గుణోన్మాదము కల జీవునకు చికిత్స చేయును. జీవునిచే మానసిక యాతనననుభవించచేసి జీవుని దుర్గుణములను రెండవ చేతిలోని చీపిరితో ఊడ్చివేయును. ఈ కాలభైరవుడు చాలా భయంకరుడు. (మానసిక రోగములకు విద్యుచ్చికిత్స కలదు గదా)

శ్లో॥ ద్వావహం గురురేవాస్మి, యమో దణ్డధరః పురః
కాలే భీకరరావోఽహం, ప్రసిద్ధః కాలభైరవః॥ 5

తా॥ ఈ యముడూ నేనే. కాలభైరవుడూ నేనే. దండించు సమయమున నున్న గురు స్వరూపమే దండధారియగు యముడను. ఇక, ఆ దండనములోనే అతి తీవ్రస్థాయికి పోయిన, ఆ సమయమున (కాల) భయంకర గర్జన రావమును చేయువాడను (భైరవ)కాన, నేను కాలభైరవుడనని పిలువబడుచున్నాను.

శ్లో॥ క్రోధే దణ్డేఽపి వాత్సల్యం, జీవే క్రోధశ్శరీరగః
మన శ్శాన్తం సదా యోగా, త్సిద్ధిమా నహమేవ సః॥ 6

తా॥ నా క్రోధములో. నేను దండించు దండనములోను అంతర్గతంగా జీవులను మార్చి బాగుచేయు వాత్సల్యమే తత్త్వము తప్ప, ద్వేషము లేదు. నా క్రోధము నా మనస్సునకు అంటనిది. నామనస్సు సదా శాంతముగా నుండును. నా క్రోధము కేవల శారీరక క్రియయే తప్ప, మనస్సునకు ఏవికారమును కలిగించనిది. ఇదే యోగము యొక్క తత్త్వము. ఈ విధముగా యోగము నాచరించు వాడు సిద్ధిని పొంది, అతడే నేనుగా అగును.

శ్లో॥ పురః కర్మ ఫలాకర్షా ద్దణ్డభోగేన శోధయన్
ఏతజ్జన్మని మాం బ్రహ్మ, నయామ్యుపనయామి తత్॥ 7

తా॥ జీవుని యొక్క అన్ని దుష్కర్మఫలములను, ఈ జన్మలోనికి ముందుకు లాగి వాటిని వాని చేత ఈ జన్మలోనే అనుభవింప జేయుచు, వాటినే దండముగా ఉపయోగించి, వానిని శుద్ధి చేసి, ఈ జన్మ ముగియక ముందే బ్రహ్మమైన నావద్దకు చేర్చుకుందును. ఇదే ఉపనయనము. అనగా ఉప = సమీపమునకు నయనము = చేర్చుకొనుట.

శ్లో॥ ఉక్త మార్గేణ భస్మాన్తం, కుర్యాం పాపం యదన్యథా
ధర్మోఽవమానితో భక్తో, మదాజ్ఞా కర్మసేవకః 8

తా॥ చేసిన కర్మ ఫలములననుభవించ తప్పదని తెలియుము. వాటిని నేను రద్దు చేయగలను. దానికి ప్రాయశ్చిత్త మార్గమును నీవాచరించినచో రద్దు చేయుదును. ఆ ప్రాయశ్చిత్త మార్గమును చెప్పియేయున్నాను. మనసా పశ్చాత్తాపపడి వాచా నాముందు క్షమాపణను గోరి, కర్మణా దిద్దుకొనుటకు వీలున్న పాపమును దిద్దుకొని మరల దానిని ఆచరించకుండుటయే. అది చేయక, కేవలము నన్ను ఎంత పూజించినా, నేను పాపమును రద్దుచేయను. నేను చెప్పిన ప్రాయశ్చిత్తమును ఆచరించినచో, నీ సర్వపాప ఫలములను తత్క్షణము భస్మము కావింతును. అట్లు నీవు ప్రాయశ్చిత్తము నాచరింపక నేను నీ పాపములను రద్దు చేసితినేని, ఆపాపఫలముల నిచ్చు ధర్మదేవుడు అవమానించబడి బాధపడును. అతడునూ నా భక్తుడే కదా. నా ఆదేశము మేరకే కర్తవ్యపాలన చేయుచున్నాడు కదా. అతడునూ నా సేవకుడే కదా.



శ్లో॥ వివృత్త్యై కర్మణా నశ్యే, త్పాపం న తపసా జనైః
దుర్యోధనదశాస్యౌ హి, మమైత ద్ధర్మశాసనమ్॥ 9

తా॥ పశ్చాత్తాపపడి పాపాన్ని దిద్దుకుంటే, మరల చేయకుంటే, ఆపాపం రద్దు అవుతుంది. గోటితో పోయే దానిని మూర్ఖుడు జపతపాలతో పోగొట్టటానికి ప్రయాసపడి, ఫలితం పొందడు. తపస్సు అనే గొడ్డలి పాపాన్ని ఖండించలేదు. రావణుడెంత తపస్వి అయినా, దిద్దుకొననందున శిక్షింపబడినాడు. అలానే, దిద్దుకొనకుండా 11 అక్షౌహిణుల సేన కలిగిన దుర్యోధనుడు శిక్షింపబడినాడు. కాన, తపోబలం, జనబలం, ధనబలం, కీర్తి - ఇవి ఏమియూ పాపాన్ని పోగొట్టలేవు. చేసినది తెలుసుకొని, దిద్దుకొని, మరల ఆచరించకుంటే, వెనుకటి పాపం కూడా రద్దు చేయబడుతుంది. ఇది నేను ఏర్పరచిన ధర్మ శాసనము. దీనిని అనుసరించకుండా ఏప్రయత్నాలు చేసినా నిష్ఫలములు.

శ్లో॥ సులభే న కృతే మూఢం, భక్తం యోగేన యోజయన్
ఫలానుభూతి నిస్సఙ్గం, కుర్యాం ధర్మస్య తృప్తికృత్॥ 11

తా॥ నేను చెప్పిన ప్రాయశ్చిత్త మార్గము అతి సులభము. దానిని ఆచరింపక మూర్ఖముగా నన్నారాధించుట వెర్రితనము. అట్టి వెర్రివానిని కనికరించి నేను యోగమును అనుగ్రహింతును. యోగమువలన బాహ్యముగా కర్మఫలముల ననుభవించు చున్ననూ మనస్సులో వికారము చెందక శాంతముగ నుండును. బయటకు కర్మఫలము ననుభవించుచున్నందున ధర్మదేవునకు సంతృప్తి, లోపల నా భక్తుడు ఆ ఫలానుభవము వలన మనో వికార దుఃఖమును పొందడు కాన నా భక్తునికి సంతృప్తి. ఇట్లు రెండును సమన్వయించునట్లు చేయుదును.

శ్లో॥ ద్విగుణీకృత మన్నృతై, రహఙ్కారై రత స్త్రిధా
శామ్యే న్నాన్యోఽత్రమార్గోఽస్తి, నాన్యో నాన్య ఇతీర్యతే ॥ 12

తా॥ పాపంచేసి, తెలిసీ, చేయలేదని అసత్యమాడుట, పాండిత్యము ద్వారా సమర్థించుకొనుట, అహంకారముతో అంగీకరించకపోవుట, పాపమును రెండింతలు చేయుచున్నది. అయితే, మానవులందరూ ఏదో విధమైన పాపము నాచరిస్తున్నవారే కావున, పాపము అంగీకరించుట దైవసన్నిధిలో చేసిన చాలును. ఇతర మానవుల ఎదుట అక్కరలేదు. అట్లు అంగీకరించి, మనసా పశ్చాత్తాపబడి, వాచా దైవమును క్షమాపణకోరి,

కర్మణా దిద్దుకొని మరల ఆచరించనిచో వాని పాపమును రద్దు చేయగలను. ఇంతకన్న పాపమును రద్దు చేయుటకు రెండో మార్గము లేదు లేదు లేదు.

శ్లో॥ అజ్ఞానీ గ్రహసఞ్చారే, గ్రహాః కర్మఫలప్రదాః
గ్రహ రూపో<ఽస్మి భక్తార్థం, జ్ఞాత్వా తత్రాపి రక్షితః ॥

తా॥ కర్మ ఫలముల ననుభవింపచేయు నా రూపములే ఈ నవగ్రహములు. తానే కర్మ చేయక, గ్రహములు సంచారవశమున మంచి చెడులను చేయుచున్నట్లు అజ్ఞాని భావించును. నన్ను అరాధించు భక్తులకు ఈ రూపంతోనే వారి కర్మఫలముల నందచేయుటలో కొంత మొగమాటము వచ్చినందున, గ్రహ రూపములలో వారికి, కర్మ ఫలముల నందచేయుచున్నాను. కాన, గ్రహముల రూపాలలో ఉన్నది నేనేనని గుర్తించినచో అనగా నన్ను గ్రహరూపునిగా గుర్తించినవానిని, గ్రహరూపాలలో నున్న నేను దుష్కర్మ ఫలములనీయ జాలను. కాన, సర్వగ్రహరూపునిగా, సర్వదేవ స్వరూపునిగా నన్ను ఉపాసించుము. నీవు రక్షింపబడుదువు.

శ్లో॥ అత్యర్థే పాపనియమా, చ్చతుర్థా భాగవర్జితాః
పుత్రా భవా న్భోగలోకే, నాభిజ్ఞాతో హి శిక్షితః॥ 14

తా॥ మానవుడు పుత్రవ్యామోహముతో అధిక ధనము నార్జించుచూ, పాపము చేయుచున్నాడు. పాపరహితముగ అధిక ధనము నార్జించుట అసంభవము. ఇతరులను వంచింపనిదే, లేక బాధించనిదే ధనము రాదు. ఆ ద్రవ్యము చేత, తన పుత్రులు సుఖించరు. అది దుఃఖ కారణమే అగును. మరియును, తాను మరణించిన తరువాత ఈ ధనము, ఈ పుత్రులు వెంటరారు. అక్కడ ఆలోకములో ఏ జీవుడు నిన్ను గుర్తించడు. స్థూలశరీరముతో పాటు, ఈ లోకబంధము నశించును గాన, నీ పాపములో ఎవ్వరును పాలు పంచుకొనడు. నీవిచ్చిన ధనమును భుజించుటలో వారికి నీ పాపము అంటదు. ఏలననగా, వారు పాపము చేయలేదు. నీ చేత చేయించనూ లేదు. చేయమని ప్రేరేపించనూలేదు. పాపామును సమర్థించనూ లేదు. కాన వారికి పాపభాగము లేదు. పిచ్చివాడవైన నీవే మొత్తము పాపపు మూటను నెత్తిపైవేసుకొని, దాని శిక్షలనుభవించుటకు భోగ లోకములనబడు ఊర్ధ్వ లోకములకు పోవుచున్నావని తెలియుము.



శ్లో॥ మోహాదేవం ప్రమాఽఽభావా, ద్ధేతురజ్ఞాన మస్య చ
అతో నిత్యం గురుర్బోధం, కరోమి భవ సేవకః॥ 15

తా॥ ఈ పాపమునకు పుత్ర వ్యామోహము కారణము. దీనికి కారణము ఈ పుత్రులు కూడ తన వంటి జీవులేననియు, జన్మలననుసరించి వీరే శత్రువులుగా మిత్రులుగా మారుచున్నారనియు, తన పాప భాగులు కారనియు, తానే సర్వపాప భోగము ననుభవించ వలయుననిఘ్ను మొ॥ తత్త్వ జ్ఞానము లేక పోవుట వలన ఏర్పడిన అజ్ఞానము దీనికి కారణము. కాన, యోగమును ఆచరించక ఉండుటకు కానీ, పాప కర్మ పతనమునకు గానీ, అజ్ఞానమే మూల కారణము. అందువలన, నేను సదా గురు స్వరూపమున నుండి, ఈ ప్రపంచమున జ్ఞానమును ప్రచారము చేయుచున్నాను. ఈ ప్రచారకార్యములో నీవును నా బంటుగా పాల్గొనుము.

శ్లో॥ దుష్ఫలా న్యనుభూత్వాఽహం, సత్ఫలం ప్రదదామి తే
బన్ధుభ్యో వాఽరిపూర్వాణి, యది యోగ్యా న్యకర్మణా॥ 16

తా॥ నీవు నన్ను గ్రహస్వరూపునిగా ఆరాధించినచో-అనగా గ్రహారాధనమున కూడ, నేనే ఆగ్రహము అని తెలుసుకొన్నచో, నీకు దుష్కర్మ ఫలముల నీయక, వాటిని నేనే అనుభవింతును. ఇక, నీ పుణ్య పలములు కూడ నీకు మత్తును కలిగించును గాన, వాటిని, అజ్ఞానములో నున్న నీ బంధువులకు పంచెదను. ఒక్కొక్కసారి, నీ దుష్కర్మ ఫలములను నీ శత్రువులకును పంచెదను. అయితే, నీ కర్మ ఫలములను అనుభవింపచేయుటకు నాచేత ప్రేరితులై, నీకు నీ శత్రువులు అపకారము చేయగా, అప్పుడు మాత్రము, నీ దుష్కర్మఫలములను వారికి ఈయను. అట్లు కాక, నా ప్రేరణలేకయే, నీవు వారికి ఎట్టి అపకారమూ చేయకనే, వారు నీకు అపకారము చేసిరేని, అప్పుడువారికి నీ దుష్కర్మఫలముల నిత్తును.

శ్లో॥ పూర్వాపకృత శత్రౌ మే, నదణ్డః ప్రేరితే మయా
ద్వేషీ నాస్తికజల్ప స్త్వ, మల్పజ్ఞో జన్మవి న్న యత్॥ 17

తా॥ నీ శత్రువు నీకు అపకారము చేసినపుడు రెండు కారణములుండవచ్చును. నీవు వానికి నిష్కారణముగ వెనుక జన్మలో అపకారము చేసినావు. దానికి బదులుగా, నా ప్రేరణ చేత, వాడు నీకిప్పుడు అపకారము చేయుచున్నాడు. కాన, అట్టి శత్రువును

దండించమని నీవు నన్ను అర్థించినా, ఉపేక్షింతును. అప్పుడు నీవు నాపై ద్వేషము వహింతువు. నేను లేనని కూడ వాగెదవు. ఓ అల్పజ్ఞుడా! నీవు సర్వజన్మల జ్ఞానమును కలిగిలేనందున ఇట్లు ప్రలాపమును చేయుచున్నావు.

శ్లో॥ దేవతా గ్రహ భూతాద్యా, వపి మామేవ యోఽర్చతి
సేవకో మే స్మరన్నిత్యం, ఫలముక్తో జగత్ప్రభుః ॥ 18

తా॥ సర్వ దేవతలనూ, సర్వగ్రహములను,సర్వ భూతాది భీకర రూపాలను సైతము వేషధారియగు నన్నుగా చూచువాడు ఈజగత్తునందు సర్వత్ర నన్నే చూచును. నన్నే స్మరించును. నా సేవకుడగును. అట్టివాని కర్మఫలములను నేనే అనుభవించి వానిని ముక్తుని చేయుదును. ఏలనన, ఏరూపమెత్తిననూ నన్నే సర్వత్ర చూచుచున్నాడు కాన వానిని దండించుట కుదరదు.

శ్లో॥ అదృష్ట్వా న విదుశ్ఛాయాం, దృష్ట్వా సర్వే జయాన్వితాః
సత్యవిశ్వాసమీక్షే న, విశ్వాస స్సాధనాశ్రయః ॥ 19

తా॥ నన్ను ఆరాధించగనే నా భక్తుని పాపములనన్నిటిని పరిష్కరించెదను. ఎట్లు? వాటిని నేను అనుభవించుట వలన. అయితే, నా భక్తుడు వాటి ఛాయలను అనుభవించక తప్పదు. అయితే భక్తునకు జరుగుచున్న సత్యమంతయు కనిపించక, వాడనుభవించు ఛాయామాత్ర బాధలకు తల్లడిల్లి, దత్తారాధనము వలన కష్టములు కలుగుచున్నవని భావించుచున్నాడు కానీ, వాని సర్వ పాపములు స్వల్పానుభవము చేతనే నశించుచున్నవని తెలియకున్నాడు. ఇది తెలియక నన్ను త్యజించి, పరీక్షలో ఓడిపోవుచున్నాడు. ఇదంతయు కనిపించ జేసినచో, అందరును విశ్వసించి, పరీక్షలో నెగ్గుదురు. ప్రతివాడూ విశ్వసించును. అపుడు పరీక్షయేలేదు. నిజమైన విశ్వాసమేదో తెలియదు. కాన, నిజమైన, చలించని విశ్వాసమే సర్వసాధనకు ఆధారము.

శ్లో॥ కష్టదః కిము నిన్దాఽఽహో!,దత్తో బలిపశు స్స్వకృత్
ఛాయా తు నియమా త్సిద్ధ, స్తస్యాశ్చ కరుణోహ్యహమ్ ॥ 20

తా॥ ఇట్టి అపార ప్రేమ స్వరూపుడగు నేను, భక్తులకు కష్టములను కలిగింతునా? అయ్యో! ఎంత దారుణమైన నింద ఇది! నన్ను ఆరాధించగనే, వాని సర్వపాపములను



ధ్వంసము చేసి, వానిని ఉద్ధరించు పనిని ఆరంభించెదను. వాని పాపముల నన్నింటిని అనుభవించుటకు బలిపశువుగా నన్ను నేను దత్తము చేసుకొనుచున్నాను కాన నన్ను దత్తుడని జ్ఞానులు పిలుతురు. అయితే, వాని పాపముల ఫలములను ఛాయా మాత్రముగా వాడనుభవించక తప్పదు. ఇది ధర్మదేవుని నియమము. అంతే తప్ప, ఆ కొంచెము ఛాయామాత్రమును కూడ అనుభవించుటకు నేను సిద్ధముగానే ఉన్నాను. కరుణయే నా సత్య స్వరూపము.

శ్లో॥ హస న్నపి హృహాబాధా, శ్రితానామనుభూయతే
అశక్తేన మయాధర్మా, వాత్సల్య ప్రేమ మేఽన్తరమ్ ॥ 21

తా॥ నేను బయటకు సదా చిరునవ్వుతో ఉండుచున్నాను కానీ, లోపల కోటాను కోట్ల భక్తుల వేదనలను అనుభవించు చున్నానో ఎవరికీ తెలియదు. ఈ వేదనలను అనుభవించు నపుడు నా శక్తిని నేను ఉపయోగించను. అట్లు ఉపయోగించినచో, శిక్షలను అనుభవించనివాడనై ధర్మదేవుని మోసగించినవాడ నగుదును. ఇదే నా నిజతత్త్వము. అనగా నా నిజతత్త్వము - నా భక్తులపై గల అపార వాత్సల్యరూపమైన ప్రేమ అని గుర్తించుము.

శ్లో॥ దేవర్షి సిద్ధదృష్టోఽహం, యే మే ధర్మం స్తువన్తిహి
పక్షపాతేన నిన్దన్తో, నాస్తికా స్స్యు రవీక్షితాః ॥ 22

తా॥ నా ధర్మపాలనను, ధర్మదేవునితో బాటు, అనేక సిద్ధులు, దేవతలూ, ఋషులూ సదా ఏకాగ్రదృష్టితో వీక్షించుచున్నారు. నా ధర్మపాలనకు మురిసి నన్ను స్తుతించు చున్నారు, నీ మీద పక్షపాతమును చూపినచో, వారందరూ బాధపడుదురు. పక్షపాతియని నన్ను నిందించి, నాస్తికులగుదురు. ఈ దేవ, ఋషి, సిద్ధులు, నీ కంటికి కనిపించుట లేదు కాన, నన్ను నీవు అర్థము చేసుకొనకున్నావు. "నాకీ ఉపకారము చేసిన, ఆయన కొంప ఏమి మునుగును?" అనుకొనుచున్నారు కానీ, అది సరికాదు.

శ్లో॥ న జానాతి పరా న్పూర్వ, మిహ వా బాన్ధవా న్భవాన్
ప్రజ్ఞయా కతి కర్మాణి, సమర్థయతి వేద్మి సత్ ॥ 23

తా॥ నీవు నిన్నూ నీ భార్యాపుత్రాదులను రక్షించలేదని నాపై అలుగుచున్నావు. కానీ, వారి పూర్వదుష్కర్మలు, నీ పూర్వదుష్కర్మలూ నాకు తెలియును. కనుక జన్మల దాకా ఎందుకు? ఈ జన్మలో వా రే పాపములు చేసినారో నీకు తెలియునా? నీవు ఎన్ని పాపములు చేసి, వాటిని పుణ్యములేనని, నీ తెలివితేటలచేత, ఈజన్మలోనే ఎన్నిసార్లు సమర్థించుకొన్నావో నీకు తెలియునా? అది పాపమో, పుణ్యమో, సర్వజ్ఞుడగు నాకు తెలియును. అల్పజ్ఞుడు లేక అజ్ఞుడగు జీవున కేమి తెలియును?

శ్లో॥ హసామి పూర్వ శత్రూణాం, పుత్రాణాం రక్షణార్థిషు
అలస్యం దూషితం ప్రాక్చ, వినోదో వాసనాక్షయాత్॥ 24

తా॥ తల్లిదండ్రులు తమ సంతానమును రక్షించమని నన్నర్థింతురు. ఆ సంతానముతోనే క్రిందటి జన్మలో కలహించి శత్రువులై, ఆ సంతాననాశనమునే కోరి నన్నర్థించినారీతల్లిదండ్రులు కాన, నాకు నవ్వువచ్చుచుండును. ఈ సంతాన రక్షణములో నేనాలసించినచో నన్ను దూషింతురు! పూర్వ జన్మలో ఈ సంతాన జీవులే శత్రువులై యుండగా ఆ శత్రు నాశవములో నేనాలసించియుండ, నన్ను దూషించిరి. కారణము స్థూల శరీరముతోబాటు దాని వాసనలు క్షయించుటయే. నాకు అన్ని జన్మలూ తెలియును. కావున, ఈ జీవుల విచిత్ర ప్రవృత్తులకు నవ్వుచూ వినోదింతును. ఈ జ్ఞానములేని జీవులు సదా నన్ను కోపగించుచున్నారు.

శ్లో॥ స్వార్థప్రేమాపి సఫలం, చమత్కారా ద్ద్విధాకృతేః
యోగా న్నానుభవ స్తే చ, బాహ్యదృష్ట్యాం తు దణ్ణ్యసే ॥ 25

తా॥ స్వార్థసుఖమును కోరి, నన్ను ఆరాధించిన భక్తి నిష్ఫలమేనా? - అన్నచో కాదు. పూర్వజన్మ కర్మ కారణముగా నిన్ను ఒక శత్రువో, గ్రహమో, బాధించుచుండగా, ఆ బాధ తట్టుకొనలేక, ఆర్తుడవై నన్ను ఆరాధించగా, ఒక చమత్కారమును చేసెదను. నీవు నీకర్మ ఫలమును అనుభవించుచునే యుందువు కానీ, ఆ బాధ, నీ మనస్సునకు అంటకుండా చేసెదను. దీనివలన నన్ను చూచు దేవర్షిసిద్ధులదృష్టిలో నీవు కర్మఫలము ననుభవించు చున్నందున వారు సంతృప్తితో నుందురు. నీవు నీమనస్సునకు తగలకుండా ఉన్నందున బాధపడవు. కాన, కర్మ ఫలమనుభవించినా, అనుభవించనట్లే గదా. కొరడాలతో కొట్టగా, నీవు మనమున ఆనందము పొందుచుండగా, చూచువారి దృష్టిలో శిక్షననుభవించుచున్ననూ, నీ దృష్టిలో శిక్షననుభవించుటలేదు గదా.



శ్లో॥ ఋణ హర్తా లఘుక్లైశై, ర్శ్రేయసే కష్టద స్స కిమ్?
అదర్శనా త్తథాదత్తో, దుష్కృతం హన్తి నేక్ష్యతే ॥ 26

తా॥ నన్ను ఉపాసించువారికి కష్టములు నష్టములు కలుగునని నిందింతురే తప్ప, విచారణ చేయుటలేదు. మీ ఇంటికి వచ్చిన మీ హితాభిలాషి బంధువు ఒకడు, మీరు ఎవరెవరికి అప్పుబడియున్నారో, వారినందరిని పిలిపించి, పరిష్కారము చేసి, చాల భాగము తానే తీర్చి, స్వల్పభాగము మిమ్ములను కట్టునట్లు చేయును. ఇక, ఆ అప్పులు శాశ్వత పరిష్కారము జరుపబడి అప్పుడే తీరిపోవుచున్నవి. మీచేత కొంత కట్టించినాడు కాన, అతడు మీకు నష్టము కలిగించిన కష్టకారకుడా? అయితే అతడు ఎక్కువ భాగము తానే కట్టి మీ ఋణములను తీర్చుట మీకు కనిపించుటలేదు కాన అతడు మీకు నష్టములను కలిగించినట్లు భావింతురు. ఇదేవిధంగా దత్తభగవానుడు పాపకర్మఫలములన్నింటినీ, చాలా భాగము తానే అనుభవించి, ఛాయామాత్రముగా భక్తులచే అనుభవింపచేయును. అయితే, దత్తభగవానుడు కానీ, పాప కర్మల పరిష్కారము కానీ, కంటికి కనిపించుటలేదు కాన, ఛాయామాత్రముగ అనుభవించు తమ దుష్కృత ఫలములగు కష్టములే కంటికి కనిపించుచున్నవి. కాన, దత్త భగవానుడు కష్టప్రదాతగా భాసించుచున్నాడు.

శ్లో॥ అజ్ఞానా త్కర్మ తద్ధ్వంస - వ్యక్తే ర్వ్యక్తశుచః కణాత్
కర్తా దత్త ఇతి భ్రాన్తిః , పరీక్షాయై శుచో వ్యయః ॥ 27

తా॥ ఇదంతా కంటికి కనిపించినచో, అందరునూ దత్త భక్తులే అగుదురు. కంటికి కనిపించనందున దత్తభగవానుడు కష్టములనిచ్చినట్లు కనిపించుచున్నాడు కానీ నిజముగా పాపకర్మఫలములను పరిష్కారము చేసి రాబోవు మహా కష్టములను (వడ్డీతో అనుభవించవలసినవి) తీర్చుచున్నాడు. నీవు బాకీపడిన వాడవై బాకీదారుని గుర్తించుటలేదు. ఆ బాకీని చాలావరకు తానే కట్టి (తానే భక్తుని కొరకు అనుభవించి), చాలా స్వల్పమైన బాకీని మాత్రమే నీచే కట్టించుచున్నాడన్న నిజమూ నీకు తెలియదు. నీకు తెలిసినదల్లా స్వల్పమైన ధనమును కట్టి, స్వల్పకష్టములను అనుభవించుచు, ఈ స్వల్పనష్టకష్టములను నిష్కారణముగా దత్తభగవానుడే కల్పించుచున్నాడని భ్రమపడుచున్నావు. ఇట్టి భ్రమను దత్త భగవానుడేల కల్పించినాడు? ఉపకారము చేసియూ నిందను పొందుచున్నాడే! ఇది స్వామి చాదస్తమా? కాదు కాదు. దీనిని తన

పరీక్షలకు ఉపయోగించుకొనుచున్నాడు. ఈ పరీక్షల వలన ఏమి లాభము? రాబోయే కాలంలో వడ్డీతో అనుభవించవలసిన దుష్కర్మఫలములను ఇప్పుడే ఛాయమాత్రంగా అనుభవించుట వలన, రావలసిన సర్వదుఃఖములు నశించినవి గదా. కాన, పరీక్షలు లాభమునకే గదా.

శ్లో॥ లోకే న్యాయపతి స్తోత్రై, ర్ధర్మనిశ్చయనిశ్చలః
అహంకథం న నిష్కామే, యోగం దాస్యామి యోగిరాట్ ॥ 28

తా॥ ఒక న్యాయాధిపతియే లోకములో పాపకర్మకు తీర్పు నిచ్చినపుడు, వానిని స్తుతించుట చేత, ఆ పాపకర్మఫలమును రద్దుచేయడు. సర్వలోక న్యాయాధిపతియగు నేను నీ స్తుతులచేత, నీ పాప కర్మలను ఎట్లు రద్దు చేయుదును? కేవలము నీ ప్రీతి కొరకే, నిష్కామంగా, నన్ను స్తుతించుచో, నీకు యోగమును అనుగ్రహింతును. దానివలన, నీవు శిక్షలు అనుభవిస్తున్నా, అవి నీ మనస్సునకు అంటకుండు నిర్వికార, అవధూత, శాంతి స్థితిలోనుండుటచేత, ధర్మదేవుని దృష్టిలో నీవు శిక్షననుభవించుచున్నావు కాన, ఆయన సంతృప్తిపడుచుండును. నీవు నిర్వికార శాంతి స్థితిలో నున్నావు కాన, శిక్ష ననుభవించుటలేదు. కాన, శిక్ష ననుభవించియు, అనుభవించని యోగస్థితిని నేను ప్రసాదించినందున, నీవు శిక్షననుభవించవు. ఇదే నా చమత్కారములలో ఒకటి. అందుకే నన్ను యోగీశ్వరుడు యోగిరాజు అనిపిలుస్తారు. యోగాన్ని ప్రసాదించువాడను నేనే.

శ్లో॥ దయార్థీ భిక్షుకః ప్రేమ, యాచతే న పరత్ర తమ్
నేక్షసే క్షత మాగన్తు, మాదదాసి స శాశ్వతః॥ 29

తా॥ దయకన్న ప్రేమ చాల గొప్పది, శాశ్వతము. బిచ్చగాడు "దయతో పైసానిమ్ము" అని అర్థించునే తప్ప, నీ ప్రేమను యాచింపడు. ఏలననగా, వాడు పైసానే ప్రేమించుచున్నాడే తప్ప, నిన్ను కాదు. కాన, నా దయను కోరువారికన్ననూ, నా ప్రేమను కోరువారే ఉత్తములు. అట్టి భిక్షువునకు పైసాను దానము చేసిన తరువాత, వాడు రోడ్డుపై గాయపడి పడిఉండగా చూచిననూ నీవు పట్టించుకొనవు. నీ ప్రేమ కొరకు నీ ఇంటికి వచ్చిన అతిథి విషయ మట్లు కాదు. అతడు రోడ్డుపై పడియున్ననూ చూచి



వెంటనే, గృహమునకు తెచ్చి ఆదరింతువు. బిచ్చగానితో అసలు బంధము ఏర్పడలేదు. వానితో ఏర్పడిన కరుణాబంధము క్షణికము. అతిథితో ఏర్పడిన ప్రేమ బంధము శాశ్వతము. కాన, నా కరుణను యాచింపకుము. నా ప్రేమను కోరుము.

శ్లో॥ జ్ఞానివ న్నాస్తికా స్తర్కై, ర్భూతాధీశా స్సుఖావహాః
సుఖసాధక భేదః కః? పరై ర్భూతాన్యహం చ తైః ॥ 30

తా॥ జ్ఞానుల వలె, నాస్తికులును ఎన్నో చర్చలను చేసి, నేను లేననియూ, ఈ సృష్టియే కలదనియు నిరూపింతురు. వారి లక్ష్యము పంచభూతములను తమ వశములోనుంచుకొని, మానవుని సుఖసాధనముగా వాటిని చేసి, మానవ సౌఖ్యములను భోగములను వృద్ధిపరచవలయునని వారి లక్ష్యము. ఇట్టి నాస్తికులకునూ, తన సుఖమును సాధించుటకు నన్ను సాధనముగ చేసుకొను ఆస్తికులకునూ పెద్ద తేడా లేదు. నాస్తికుడు కేవలము పంచభూతములనే సుఖసాధనములుగ ఉపయోగించు చున్నాడు. ఈ ఆస్తికుడు, పంచభూతములనూ, నన్నునూ, సుఖసాధనములుగా ఉపయోగించుకొనుచున్నాడు. ఇట్టి ఆస్తికుడే యోగభ్రష్టుడు.

శ్లో॥ యోగభ్రష్టో మహాభక్తో, జన్మనీహైవ యోగవాన్
శుచి శ్రీమద్గృహే సజ్ఞా, త్వరం వా మాం త్యజ న్నృతః॥ 31

తా॥ అట్టి ఆస్తికుడు యోగభ్రష్టుడై కొంత కాలము నాస్తిక దశ యను నా వియోగమున నున్ననూ, అచిర కాలములోనే మరల శుచిగల వారును, శ్రీమంతులనగా మోక్షలక్ష్మీకళ వారి గృహమునందు వారి సత్సంగములతో నా యోగమును పొంది మరల జన్మించిన వాడగును. ఆస్తికుడు, నాస్తికదశలో నున్నంత కాలము మరణమే. ఏలనన, ఆ సమయములో తన జీవిత కాలమును నాకు సమర్పించక వ్యర్థము చేసినందున, అతడు జీవించని వాడేయగును. నా తీవ్ర భక్తుడు ఈ జన్మలోనే మరల యోగమును పొందును. నా అల్పభక్తుడు మరల జన్మలో అట్టి సజ్జనుల ఇంట పుట్టి యోగమును పొందును. అట్టివానికి మరల మనుష్య జన్మ నిత్తును. ఇది వాత్సల్యమునకు నిదర్శనము కాదా?

శ్లో॥ నా కర్మణః ఫలం నాపి, ధ్వస్తం కర్మఫలం క్వచిత్
వృద్ధ్యల్పం క్రియతాం కృష్ణా - చీరఖణ్ణ మివార్పితమ్ ॥ 32

తా॥ ఏ దేవతయూ కర్మను రద్దు చేయదు. అన్ని దేవతలూ నేనే. నీవు బలవంతము చేసినపుడు, నేనే, దత్త స్వరూపంతో కాక, అన్యదేవతారూపంలో నీ ఉత్తర జన్మలలోని సుఖాలను ఇక్కడకు తెచ్చి అందిస్తున్నాను. ఈ జన్మ కష్టాలను ఉత్తర జన్మలోకి నెట్టుచున్నాను. నీవేమి అనుకుంటున్నావు? నీ పాపకర్మ రద్దు చేసి, నీవు పుణ్యకర్మ చేయకున్న పుణ్యఫలమైన సుఖాన్ని నీకు ఆదేవత (నేను) ఇచ్చిందని మూర్ఖుడవై భావిస్తున్నావు. నీ పాపకర్మ రద్దు కాలేదు. నీవు చేయని పుణ్య కర్మఫలము నీ కే దేవత ఇవ్వనూలేదు. నీ కర్మ ఫలాలు సర్వదేవతలు, సర్వఋషుల సమక్షంలో ధర్మశాస్త్రప్రకారము నేనిచ్చిన తీర్పులు. వాటిని మార్చుటకు ఎవ్వరికినీ అధికారము లేదు. కర్మ లేనిదే ఫలము పుట్టదు. ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో ఆమెకిచ్చిన చీరెలు, ఒకనాడు నావ్రేలు కోసుకొనగా ఆమె చీరెకొంగు చింపి నా వేలికి కట్టిన పుణ్యకర్మ ఫలాన్నే అక్షయంచేసి, అనంతవస్త్రాల నిచ్చాను. కర్మఫలాలను తగ్గించుట, పెంచుట, చేతునే తప్ప - కర్మఫలాలను రద్దు చేయుట కానీ, కర్మ చేయకుండా ఫలాలను ఇవ్వటము కానీ నా పరిపాలన తత్త్వ విరుద్ధము.

శ్లో॥ పుణ్యపాపే సుఖేదుఃఖే, కర్మచక్రం మయా కృతమ్
రుచిభిన్నం రసాస్వాదం, జీవశ్చేహ ప్రపద్యతే ॥ 33

తా॥ జీవుని యొక్క పాపఫలాలు, పుణ్యఫలాలను, నేను చక్కగా అమర్చి కర్మ చక్రమును తయారుచేయుచున్నాను. పాపపుణ్యఫలములను మార్చి మార్చి కష్టసుఖములు మారి మారి వచ్చునట్లు చేసియున్నాను. ఇట్టి కష్టసుఖములు అమావాస్య-వెన్నెలలవలెను, పులుపు తీపి పదార్థములవలె మారి మారి వచ్చుట చేత జీవునకు కూడ వినోదకరముగ నుండును. ఒక్కొక్క దీర్ఘకాలిక కష్టము యొక్క తీవ్రతను పుణ్యఫలము చేత శమింపచేసి, దానిని తేలికగా అనుభవించునట్లును చేతును. అన్ని రకముల పదార్థములతోను వంట చేసినట్లు జీవుని పాపపుణ్యఫలములను తగుపాళ్ళలో కలిపి తండ్రియగు నేను జీవునకు రసమయమైన కర్మ చక్రమును తయారుచేసి ఇచట జన్మనిచ్చుచున్నాను.

శ్లో॥ అన్యజన్మసుఖాకర్షా త్పరం దుఃఖం స వృద్ధిమత్
సర్వేదేవా అహం తస్మా న్నవిఘ్నం కురు మే కృతేః ॥ 34



తా॥ నాచే కూర్చబడిన ఈకర్మ చక్రమునకు విఘ్నము కలిగించుటకు జీవులు ఆరాధనముల ద్వారా యత్నింతురు. కష్టములు పొగొట్టమందురు. ఈ కష్టములు వెనుక జన్మలోకి జరిగి, వడ్డీతో అనుభవించవలయును. వెనుకజన్మలలో కష్టముల మధ్య వచ్చు సుఖములను ముందుకు (ఈ జన్మకు) లాగుట వలన, అవియును వడ్డీని కోల్పోవును. అనగా ఈ జన్మలో అన్ని పుణ్యఫలములనూ వడ్డీలు లేకుండా అనుభవించి, తరవాత జన్మలలో కష్టములను వడ్డీలతో అనుభవించుట ఎంత అవివేకము! కాన, నన్ను గాని, ఇతర దేవతల వేషములలోనున్న నన్ను గాని, ఉపాసించి ఈ కర్మచక్రము యొక్క మార్పునకై యాచించుట చాలా అవివేకము. దానివలన, ఉత్తర జన్మలు పాపఫలములతో అతి దుర్భరములై పోవును. సర్వదేవతలూ నేనే కాన, ఏరూపములో అయినా చేసేది నేనే కాన, ఈప్రాప్తమైన కర్మ చక్రము నందు మార్పులను కోరకుము. నేను కూర్చిన ఈచక్రము, నీకెంతో శ్రేయస్కరము.

శ్లో॥ ప్రియో నష్ట స్త్సువ న్నేతి, యాతి భక్త స్తదర్థతః
ఇహ తత్ర చ నాభిజ్ఞా, స్థూలేనష్టే మహాన్భ్రమః॥ 35

తా॥ ప్రియమైన తన వారు మరణించినపుడు, వారిని నేను చంపితిననియూ, వారిని నేను రక్షించలేదనియూ, నాభక్తులు శోకమోహవశులై నన్ను నిందించుచున్నారు. ఈ మరణించినవారు, నా భక్తులకు ప్రియులైనందున, సంక్షిప్తముగా వారి కర్మఫలములననుభవింపచేసి, వారికి ఉత్తమజన్మల నిచ్చితిననియూ, వారు నన్ను దానికి స్తుతించుచుండ, నాభక్తులు అజ్ఞానులై నన్ను నిందించుచూ వారి కారణమువలన తమ పుణ్యములను దహించుకొనుచున్నారు. నాకు దూరమగుచున్నారు. వీరికి ప్రియులగు వారు వారి పాపములను దహించుకొని, నా భక్తుల కారణముగా ఉత్తమజన్మలను పొంది, నన్ను స్తుతించుచూ నాకు దగ్గరగా వచ్చుచున్నారు. ఆహా!! అజ్ఞానము, మోహము, ఎంత నష్టమును కలుగ జేయును! నన్ను నిందించు నాయీ భక్తులే స్థూలశరీరములను వదలి, పైలోకములలో వారిని కలుసుకున్ననూ, లేదా మరల ఈ లోకములో అన్య స్థూల శరీరములో కలుసుకొన్ననూ, అన్యోన్యము ఏమాత్రమూ గుర్తించుకొనరు గదా!

శ్లో॥ భక్తి న్యూనం మహద్దుఃఖం, మయా ఛాయానుభూతిమాన్
దాసః పుణ్యఫలై ర్మే స్యా, త్పరం వృద్ధిమ దశ్నుతే॥ 36

తా॥ నా భక్తుడు కష్టముల ననుభవించుచున్నపుడు ఎంతో లాభమును పొందుచున్నాడు. అది తెలియక నన్ను నిందించుచున్నాడు. వాని కష్టములను తొలగించుట అనగా- కాలాంతరమున వడ్డీతో అనుభవింపచేయుటయే. నా భక్తి ఫలన ఉద్భవించిన పుణ్యముతో కొంత శిక్ష తగ్గించబడగా, ఇప్పుడే అనుభవించినచో, అన్ని పాపములు నశించును.ఇక మిగిలిన పుణ్యముల ఫలమే నాసేవకునిగా మారుట. వాని పాపఫలములను చాలా భాగము నేను అనుభవించి, ఛాయామాత్రముగా వాని చేత అనుభవింప చేసి, పాపముక్తునిగా చేయుచున్నాను.

శ్లో॥ వధ మజ్ఞాయ వధ్యే వా, క్రోశన్తి మమ శాసనాత్
గృహ్ణాతే చిరవాత్సల్యా, దాలోచ్య బహులాభగమ్॥ 38

తా॥ ఒకనిని, ఉరిశిక్షలో ఉరితీయునపుడు, వాని సాధు-దీన స్వభావమును చూచి, ఆశిక్షవేసిన వానిని, శిక్షను అమలుపరచు అధికారిని ఆవేశముతో జనులు నిందించుట సహజము. వాడు నిర్దాక్షిణ్యముగా ఎందరినో హత్య చేయుట, వీరే తమ కండ్లతో చూచియున్నచో అక్కడనే వానిని సంహరించి యుండెదరు! కరుణామయుడగు భగవానుడట్లు కాక, వీని గుణదోషములను విమర్శ చేసి, కొన్ని జన్మలకాలము పాటు ఇక్కడ వలె కారాగారమున బంధించక బుద్ధిమారునేమోనని ప్రయత్నించి, చివరకు ఆ శిక్షను వాని గుణముల ప్రకారము తగ్గించకలిగినంత తగ్గించి, మరియు తన వాత్సల్యము వలన ఆ శిక్షను అమలుపరచుట వలన వానికి శ్రేయస్సు జరుగుటను నిశ్చయించిన భగవానుని ఆజ్ఞాప్రకారము, నవగ్రహములు, ఆయన తీర్పులను అమలు చేయుచున్నవి.

శ్లో॥ నరో వాఽనుభవామ్యేవ, నచే ద్ధర్మస్య వఞ్చనా
భక్త దుష్కర్మభోగేషు, మన్యన్తే మా మిహాన్యథా.॥ 38

తా॥ నేను ఇతరుల కర్మఫలముల ననుభవించునపుడు, నాశక్తిని ప్రయోగించను. ఒక సామాన్య మానవుడెట్లు బాధపడునో, నేనూ అట్లే బాధపడుదును. అప్పుడే ధర్మదేవుడు



సంతృప్తి పడును. ఒకని శిక్షను నేను తీసుకొన్నప్పుడు, నాశక్తి నుపయోగించి, బాధపడనిచో; అప్పుడది శిక్షయే కాదు గదా. శిక్ష బాధను కలిగించవలయును. కావున, నేను నాభక్తుల కర్మఫలములననుభవించునపుడు, నేను సర్వశక్తిమంతుడను కాన, బాధననుభవించుటలేదని జీవులు తలచుచున్నారు కానీ అది నిజము కాదు. ఆ సమయంలో నేనూ ఒక సామాన్య మానవునిస్థితిలో నుండి అనుభవింతును. భక్తులపైగల కారుణ్యము వలన, నేను దానిని సహించుచున్నాను. నా శక్తినుపయోగించి బాధను అంటనీయకున్నచో, ధర్మదేవుని మోసగించినట్లగును గదా!

శ్లో॥ విదగ్ధోఽన్ధపితా దగ్ధః, ప్రతివాచా సుయోధనః
భస్మ సూచ్యగ్ర భూధూతం, ధర్మజ స్సర్వభూపతిః ॥ 39

తా॥ అధర్మము నాచరించు వాని తెలివితేటలు, మొండితనము, నావద్ద సాగవు. ధృతరాష్ట్రుడు రాయబారసమయమున "కృష్ణా! నేనేమి చేయను? దుర్యోధను డంగీకరించుట లేదు" అని తెలివిగా తప్పించుకున్నాడు స్వయంగా స్వతంత్రించే అధికారమును కలిగియుండి కూడా. ఆ ధృతరాష్ట్రుడే చివరలో దావాగ్నిచే దహింపబడుచూ "కృష్ణా! నన్ను రక్షించమ"ని అర్థించినాడు. కృష్ణుడు కనిపించి "రాజా! నేనేమి చేతును? ఈ అగ్ని నామాటలు వినుటలేదు" అన్నాడు. దుర్యోధనుడు "ధర్మజునికి సూదిమొన మోపిన భూమిని కూడ ఇవ్వను" అన్నాడు. చివరకు దుర్యోధనుడే భస్మమై ఆ భస్మము సూది మొన మోపిన భూమిపైననూ నిలువక గాలిలోకి ఎగిరిపోయినది. సర్వభూమిని ధర్మజుడు పాలించినాడు.

శ్లో॥ సాధనం ఫల మప్యస్మి, యస్య సోఽతిథి రర్చితః
అనన్త స్సన్నిధే ర్మే స్యా, దనిత్యాన్యపి సన్తతమ్॥ 40

తా॥ అతిథి గృహయజమానిపై గల ప్రేమ చొప్పున యజమాని కొరకే వచ్చును గాని వారి అన్నము కొరకు కాదు. యజమానిపై ప్రేమ నిత్యం-అన్నము అనిత్యము. అనిత్యమైన అన్నఫలమునకు నిత్యమైన యజమానిని సాధనముగా చేయలేదు. అతనికి అసలు అన్నముపై దృష్టియే లేదు. అది తెలిసిన యజమాని అతడిని గౌరవించి అనిత్యఫలమైన అన్నమును కూడ, వలదన్ననూ అధికముగా వడ్డించి, ఒక పూటలో

పోతానన్నా వినక, మరికొన్ని పూటలు ఉంచుకొని, అతడు పోవుటకు ఇష్టములేక, పోవునపుడు ఎంతో బాధపడును..అట్లే నన్నే ఫలముగా చేసుకొని నన్ను పొందుటకే నన్ను సాధనముగా చేసుకొని నన్ను ఆరాధించిన వాడు, ఆనంద స్వరూపుడనగు నా యొక్క సన్నిధి వలన నిత్యానందమును పొందుటయే కాక, ఈ అనిత్యములైన లౌకిక సుఖములు కూడా అనంతములుగా వలదన్ననూ, నాచే సత్కరించబడి పొందుచున్నాడు.

*ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం*
*శ్రీ దత్తవాత్సల్యయోగోనామ*
*అష్టమాధ్యాయః*

శివఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## నవమాధ్యాయః

## శ్రీ దత్త వేదోక్త పరబ్రహ్మ రహస్య యోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ :-

శ్లో॥ జాగ్రదూహో జగత్సర్వం, వీరభద్ర విదాత్మజ!
స్వప్నతుల్యం స్వరూపేణ, స్వప్నో బుద్ధస్య నైవ మే॥ 1

శ్రీ దత్త భగవానులు వచించిరి :

తా॥ మేల్కొని ఊహించు వాని ఊహ వలె, మేల్కొని యున్న నా ఊహయే ఈ సర్వజగత్తు. ఓ వీరభద్రవిద్వాంసుని కుమారుడా! ఈ జగత్తు స్వరూపంలో స్వప్నంతో సమానమే. అయితే నిద్ర పోవువాని స్వప్నముతో పోల్చరాదు. నేను మేల్కొనియే ఉందును కాన, మేల్కొని ఊహించుటయే అనగా నిద్రాజనితమైన అజ్ఞానము నాకు లేదు. నాకు సరియగు ఉపమానము లేదు. నాకు సరియగు ఉపమానము నేనే.

శ్లో॥ ఉపమానాని దీయన్తే, కేవలాంశేన కాశ్యప!
సర్వధర్మగ్రహే తర్కై, రుద్దిష్టాంశో వినశ్యతి॥ 2

తా॥ ఒకే ఒక్క పోలికలో ఉపమానాలు తీసుకోవాలి. ఓ కాశ్యపా! తర్కించి, అన్ని ధర్మాలలోను పోల్చుట చేసినచో, చెప్పదలచుకొన్నది భ్రష్టమగును. అనగా ఆ ఒక్క పోలిక ద్వారా చెప్పదలచిన సిద్ధాంతము భ్రష్టమగునని భావము.

శ్లో॥ జీవోఽప్యూహాత్మకో మే హి, పరమాణు శ్చితో మమ
చిద్ఘనో రూపభిన్నోఽత్ర, వాయుర్మేఘ ఇవేక్షితః॥ 3

తా॥ ఈ జీవుడు కూడ నా ఊహయే. ఈ జీవుడు నాచైతన్యములోని ఒక పరమాణువు మాత్రమే. ఈ జీవుని కన్న భిన్నమై, కంటితో చూడబడునది అంతయూ, చైతన్యము

యొక్క ఘనమే. కనపడని వాయువు ఘనీభవించి మేఘముగా కనపడినట్లు, నా ఊహచైతన్యమే ఘనీభవించి దృశ్యమైన జగత్తు అయినది.

శ్లో॥ పరమ వ్యోమ్ని సాన్ద్రత్వం, గన్తుం శక్యం మయి స్థితే
చైతన్యం బ్రహ్మ పరమ-వ్యోమబ్రహ్మ న తర్కగమ్॥ 4

తా॥ బ్రహ్మమైన చైతన్యము నాయందున్న బ్రహ్మమైన పరమవ్యోమము నందు సంకోచము చెంది ఘనీభవించగలదు. ఈ చైతన్యము బ్రహ్మమే. పరమ వ్యోమమూ బ్రహ్మమే. ఇది తర్కమునకు అందదు.

శ్లో॥ ఏకాశ్మ శిల్పవ న్నాస్మి, పఞ్చ భూతాని మే తనౌ
తవ చర్మేవ మే చర్మ, పశ్య స్పృశ చ కాశ్యప! ॥ 5

తా॥ బ్రహ్మము ఒక్కటే కావున, ఒకే రాతిలో నిర్మించబడిన శిల్పమువంటివాడను కాను. నా తనువులో కూడ నీకు వలె పంచభూతములున్నాయి. నీ చర్మము వంటిదే నా చర్మము. చూడుము. కాశ్యపా! నాచర్మమును స్పృశించి చూడుము.

శ్లో॥ దృష్టో యవనికామాత్రో, గిరి శ్చలన చిత్రగః
బుద్ధౌ యవనికాయాం తు, స్వల్పాయాం స యథావిధః ॥ 6

తా॥ ఒక చలన చిత్రమును చూచునప్పుడు, పర్వతము, ఈ తెర ప్రమాణమునకు మించి కనబడలేదు. కానీ, అల్పమైన మనుజునియందున్న, స్వల్ప పరిమాణముగల బుద్ధితెరలో - కొండ, దాని పరిమాణమంతయును పూర్తిగా కనబడుచున్నది.

శ్లో॥ చైతన్యా జ్జాయతే తేన, ధృతం తస్మింశ్చ లీయతే
జగత్సర్వ మిదం కిన్తు, చైతన్యం మయి విద్యతే॥ 7

తా॥ ఈ జగత్తు అంతయు చైతన్యము నుండి పుట్టి, చైతన్యము నందు నిలిచి, చైతన్యములో లీనమగుచున్నది. నిజమే. అయితే, ఆ చైతన్యము నాయందు ఉన్నది.



శ్లో॥ తర్కై స్స్వప్నోహయో ర్యాతా, శ్చిత్పర్యన్త మిమే విదః
కిన్తు మే చిదధిష్ఠానం, రూపం పశ్యన్తి న త్విదమ్ ॥ 8

తా॥ స్వప్నము కానిండు. మేల్కొని ఊహించుట కానిండు. ఈ జ్ఞానులందరునూ, చైతన్యపర్యంతము వెళ్ళగలిగినారు. కాని, ఆ చైతన్యమునకు కూడ ఆధారమైన ఈ రూపమును చూడజాలకున్నారు.

శ్లో॥ ఉపమేయార్థ బోధార్థ, ముపమానం హి సృజ్యతే
మయేహ కిం తనోర్ముక్తం, చైతన్యం దృశ్యతే త్వయా? ॥ 9

తా॥ నేను ఈ లోకమున ఉపమేయమును (నన్ను) గురించి బోధించుటకే ఉపమానములను సృష్టించియున్నాను. ఎక్కడైనా శరీరమును వదలి ఊహలను చేయు చైతన్యమును చూచితివా?

శ్లో॥ భూతప్రేతాదయోఽపీహ, యాతనా దేహ ధారిణః
సమగ్రం ప్రకృతే రేవ, బ్రహ్మ జ్ఞానం గురోర్భవేత్॥ 10

తా॥ సృష్టిలో భూత ప్రేతాదులు కూడ యాతనాశరీరములను ధరించియే యున్నవి. సంపూర్ణ బ్రహ్మజ్ఞానము, గురువైన ఈ ప్రకృతి నుండియే తెలియును.

శ్లో॥ విచిత్రాణి హి దివ్యాని, పఞ్చభూతాని మే తనౌ
తేషాం సార శ్చిదప్యత్ర, సజ్ఞాతోఽహం చితో జగత్॥ 11

తా॥ విచిత్రములైన, దివ్యములైన, పంచభూతములు నా ఈ తనువునందు కలవు. వాటిసారమైన చైతన్యము కూడా, ఈతనువు నందు కలదు. వీటి అన్నింటి యొక్క సమూహమే నేను. జగత్తు, చైతన్యము నుండియే ఏర్పడుచున్నది. నా తనువు నందు గల పంచభూతములు చాలా దివ్యమైనవి. విచిత్రమైనవి. వాటిసారమైన దివ్యచైతన్యము నా తనువునందు కలదు. వీటి సమూహమే నేను.

శ్లో॥ ప్రతిబిమ్బో నరో మేఽత్ర, నరా దూహనరో యథా
భూతానాం ప్రతిబిమ్బాని, మత్తనో రత్ర తాని చ॥ 12

తా॥ నా యొక్క ఊహయగు ప్రతిబింబమే ఈ మానవుడు. ఒక మానవుని ఊహలో ఒక మానవుడు ఎట్లు ఏర్పడుచున్నాడో అట్లే, నా తనువులోని పంచభూతముల యొక్క ప్రతిబింబములే ఈజగత్తులోని పంచభూతములు.

శ్లో॥ సర్వాంశేషూపమానం స్యా, న్నబహి ర్జగదస్తి మే
తథా వర్షశతేనాపి, న త్వా మూహనరోఽఙ్చతి॥ 13

తా॥ ఉపమానాలలోని అన్ని అంశములను పోలికలో తీసుకొనరాదు. ఊహించు నరునికి బాహ్యంలో జగత్తు ఉంది. కానీ నాకు బాహ్యంలో జగత్తులేదు. (అంతా నాలోనే ఉంది). వందసంవత్సరాలు నీవు ప్రయత్నించినా నీవు ఊహించే నరుడు, మేల్కొని జాగ్రదవాస్థలో నున్న నీ శరీరమును చూడలేడు.

శ్లో॥ స పశ్యే న్మూల చైతన్యం, పదార్థం చ లయ ప్రదమ్
నతు జాగ్రదవస్థాఙ్గం, చైతన్యాశ్రయ మత్ర తత్॥ 14

తా॥ విశేషప్రయత్నముతో, నీ ఊహలోని నరుడు, ఊహలకు కారణము, ఊహలలో పదార్థంగాను, ఊహలను తనలో లీనంచేనుకొను చైతన్యమును మాత్రమే చూడగలడు. అంతే తప్ప, జాగ్రదవస్థలోనున్న నీ శరీరమును చూడలేడు. నీ శరీరము, ఆ చైతన్యానికి ఆధారముగా నున్నది. అయితే ఈ అంశము ఉపమానములో మాత్రమే ఉన్నది.

శ్లో॥ స పశ్యే చ్చిత్ర సామర్థ్యా, త్తనుం మే బ్రహ్మనామికామ్
దృష్ట్వాఽభిజ్ఞాయ చాయాత, స్సత్యలోకం స సత్యవిత్॥ 15

తా॥ నావిషయములో ఈ అంశమును తీసుకొనరాదు. నేను సంకల్పించినచో నా విచిత్రశక్తి వల్ల, నా ఊహ నరుడు నా యథార్థతనువును చూడగలడు. ఈ తనువు పేరే బ్రహ్మము. నన్ను చూచిన వాడు మరియు నన్ను (ఈ తనువును) బ్రహ్మమని గుర్తించినవాడు, నా సత్యలోకమును ప్రవేశించినవాడు అనగా. సత్యమును గుర్తించిన వాడనియే అర్థము.



శ్లో॥ తనౌ త్రిమూర్త యోఽప్యూహా, స్తత్పదార్థ చిదత్ర హి
అంశ ఏవ తదాలమ్బా, స్సత్యలోకం న సఙ్గతాః॥ 16

తా॥ ఈ తనువులోని చైతన్యము యొక్క ఊహలే త్రిమూర్తులు. ఆ త్రిమూర్తులలోని పదార్థము చైతన్యమే. ఆ చైతన్యము ఈ తనువులో ఒక భాగమే. కాన, త్రిమూర్తుల పర్యంతము వచ్చినవారు కానీ, ఆ త్రిమూర్తుల మూల పదార్థమైన చైతన్యమే బ్రహ్మమని వాదించువారు కానీ, నత్యలోకమును ప్రవేశించనివారు. (అనగా నత్యమును గ్రహించినవారు కాదు అని భావము) అనగా- త్రిమూర్తులను కానీ, చైతన్యమును కానీ, బ్రహ్మమని తెలుసుకొన్నవారు మూల నత్యమును గ్రహించలేదు.

శ్లో॥ అత్యన్త స్వల్పవేషాహి, కర్మ జ్ఞేయా స్త్రిమూర్తయః
అత్యన్త సాన్ద్రవేషా హి, నాభిజ్ఞేయా శ్చ దేవతాః॥ 17

తా॥ సృష్టి-స్థితి-లయ కర్మల ద్వారా సులభంగా గుర్తించదగిన నా యొక్క పలుచని వేషములే త్రిమూర్తులు. గుర్తు పట్టుటకు వీలు కాని దట్టమైన నా వేషములే ఇతర దేవతలు, మరియు ఆ విశ్వములోని వస్తు రూపములు.

శ్లో॥ మహత్త్వం తర్క్య మల్పశ్చే, న్నోహ్యో మహత ఆశ్రయః
సార్థకం బ్రహ్మ భిన్నశ్చే, త్పరిమాణై స్తథాఽద్భుతమ్॥ 18

తా॥ పెద్ద జగత్తునకు ఆధారంగా అంతకన్నా పెద్దదియగు బ్రహ్మము ఉన్నదనుటలో, బ్రహ్మము యొక్క స్వరూపము ఊహకు (తర్కమునకు) అందినది. ఇందులో ఆశ్చర్యము (బ్రహ్మశబ్దార్థమగు గొప్పతనము) పెద్దగా లేదు. అట్లు కాక, మనుష్య పరిమాణంలో ఉన్న బ్రహ్మముపై, ఇంత పెద్ద జగత్తు ఆధారపడియున్నది అన్నచో - ఇది తర్కాతీతము. ఊహకు అందదు. అత్యాశ్చర్యకరమైన బ్రహ్మము యొక్క గొప్పతనము పరాకాష్ఠకుచేరి, బ్రహ్మశబ్దము సార్థకమగుచున్నది. అట్లే బ్రహ్మము చాల పెద్ద పరిమాణము కలది అన్నపుడు బ్రహ్మము ఊహకు అందుచున్నది. అట్లు కాక, బ్రహ్మము పరిమాణ (ఆకాశ)-అతీతము కాన, ఒకే సమయమున అన్ని పరిమాణాలలో ఒకే దేశంలో, అనేక దేశాలలో ఉండగలదు అన్నపుడు, బ్రహ్మము తర్కాతీతమై, ఊహకు అందక, చాల గొప్పది అగుచు బ్రహ్మశబ్దమును (తన పేరును) సార్థకము చేయుచున్నది. అనగా-బ్రహ్మము పరిమాణములో జగత్తు కన్నా పెద్దది యనరాదు.

శ్లో॥ అహం బ్రహ్మ గురు ర్యోహి, నిర్మమః కాలదణ్డనే
కాలే నయతి యో లక్ష్యం, వృథాదణ్డో న వత్సవాన్॥ 19

తా॥ నేను గురు స్వరూపమున బ్రహ్మదేవుడను. అవసరమైనపుడు దండించుటలో మమకారమును గురువుచూపడు. ఎందుకనగా, గురువు సకాలములో జీవుని లక్ష్యము వద్దకు చేర్చును. అవసరము లేకున్నచో దండించడు. అతడు వాత్సల్యము కలవాడు, శిష్యవత్సలుడు.

శ్లో॥ బుద్ధిరస్య చతుర్వేదా, వాణీ శక్తి స్సబోధవాక్
సహస్రారాబ్జ పీఠస్థో, హంసవాహ విభేదధీః॥ 20

తా॥ బ్రహ్మదేవుని యొక్క నాలుగు ముఖములు నాలుగు వేదములు. అనగా-ఆయన బుద్ధి అంతయును చతుర్వేద జ్ఞానమయము. ఆయన జిహ్వయందు వాణీ శక్తి యున్నది. గురువు బోధించుటలో మంచి వక్త కావున ఆయన జిహ్వయందు వాణీ శక్తి యున్నదని భావము. పద్మము నందు ఆసీనుడు అనగా-బుద్ధి అను సహస్రార చక్రమునందున్నవాడు అని అర్థము. హంస వాహనుడు అనగా, హంస, పాలను-నీటినీ వేరు పరచినట్లు, ఆయన సత్య, అసత్యములను వేరు పరచి విశ్లేషణము చేసి బోధించును అని అర్థము. ఇవి అన్నియును దివ్య గుణముల సంకేతములు.

శ్లో॥ మాతా హి మమతా పూర్ణా, విష్ణు రస్మి చ మోహినీ
మోహయే దైహికాదానా, త్కేవలాముష్మికే గురౌ॥ 21

తా॥ పూర్ణ మమకారముతో నుండు మాతృస్వరూపమున నేను విష్ణువై యున్నాను. ఐహికములను కావలయునని పట్టుబట్టిన శిశువులకు, మోహకరములగు ఐహికములనిచ్చుట చేత, నేను "మోహిని'యన బడుచున్నాను. కేవలము, ఆముష్మికమును అనగా పరమార్థము నిచ్చు గురువు ఒక కొసలో నుండగా, కేవలం ఐహికముల నిచ్చు మాత మరియొక కొసలో నున్నది.

శ్లో॥ ధనాది ప్రదశక్తి శ్శ్రీ, రస్యదేహైక పోషణే
అపత్యానాం సుఖాన్యేవ, పశ్యామి మమతావశా॥ 22



తా॥ ధనము మొ॥ ఐహికముల నిచ్చు లక్ష్మీదేవి, ఈ విష్ణువు యొక్క శక్తి. తల్లి కేవలము దేహపోషణము నందు ఆసక్తి కలిగి యుండును. కాన, జీవులు ఆశించు ఈ ఐహిక సుఖముల నిచ్చుటలో, మమకారమునకు లొంగిన విష్ణు-మాతృ స్వరూపముతో, వారు కోరిన దానినే ఇచ్చుటకు ఇష్టపడుచుండును.

శ్లో॥ పితాఽయ మన్తరే సన్ధి, ర్మాతా వా మే పరే గురుః
అష్టసిద్ధి యశోదాతా, శివో జ్ఞానప్రదోఽస్మి చ॥ 23

తా॥ ఈ గురువు-తల్లి మధ్య సంధిగా అనగా తల్లిగ, మమకారముతో కూడిన గురుస్వరూపమున, తండ్రి స్వర్యూపముతో శివుడను కూడా నేనే. ఈ అర్ధనారీశ్వర (తల్లి-గురువు) రూపములో వామ భాగమున శక్తియగు తల్లిగాను, దక్షిణ భాగమున గురువగు శివుని (బ్రహ్మ)గా ఉన్నాను. ఐహికముల కన్న గొప్పవి యగు అష్టసిద్ధుల నిచ్చి, పుత్రునకు కీర్తి నీయ కాక్షింతును. మరియు జ్ఞానము నిచ్చు, గురురూపంగా, అనగా (బ్రహ్మ) శివ రూపములో జీవుని ఆముష్మికమును కూడ కోరుచుందును.

శ్లో॥ దత్తో బ్రహ్మోత్పలం నీల-పదం దత్తో విశేషణమ్
సర్వవేషగతం బ్రహ్మ-సముపాస్యం సమంతతః॥ 24

తా॥ దత్తుడనగా బ్రహ్మమే. దత్తుడనగా చిక్కినవాడని అర్థము. ఈ శబ్దము ఏ వస్తువు నామము కాదు. కాన, సర్వదేవతల వేషములు వేసినది బ్రహ్మమే. నా పేరు బ్రహ్మమే కాని దత్తుడు కాదు. దత్తుడనే శబ్దము విశేషణమే కాని పేరుకాదు. నల్లని కలువ అనగా- "కలువ" యే పేరు కాని, "నల్లని" అను శబ్దము పేరు కాదు. కాన"దత్త బ్రహ్మము" అనగా "చిక్కిన బ్రహ్మము" అను శబ్దములో, బ్రహ్మమే నా పేరు కాని, "చిక్కిన"అనునది నా పేరు కాదు. ఈ అంశమును ప్రధానముగా గుర్తు పెట్టుకొని, సర్వదేవతా వేషములందున్న బ్రహ్మమును గుర్తించి, బ్రహ్మమునుపాసించి, బ్రహ్మముపై ప్రేమను పెంచుకొని, ఆ బ్రహ్మ ప్రేమనే, సర్వదేవతలందు సమానముగా చూపవలెను.

శ్లో॥ అత్రేర్వేద ప్రమాణార్థ - పరీక్షాయై త్రిమూర్తయః
దర్శితా కర్మభి శ్చైకం, నాస్తి తేన నిరాకృతాః॥ 25

తా॥ (1) జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను కర్మలను చేయునది. (2) ఒకే స్వరూపము-అని రెండు లక్షణములు వేదములచే బ్రహ్మమునకు చెప్పబడినవి. (యతోవా....అను శ్రుతిలో) ఇందులో మొదటి లక్షణమును మాత్రమే సమన్వయపరుస్తూ, నా త్రిమూర్తుల రూపాలను ప్రక్కప్రక్కన నిలిపి ముందు అత్రికి చూపించితిని. (అనగా జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయుట అను ఒక లక్షణమును నిరూపించితిని). అందులో "ఒకే ఒక స్వరూపము" అనే రెండో లక్షణము సరిపోనందున, అత్రి, ముగ్గురుని కలిపి బ్రహ్మము అనుటకు నిరాకరించెను. వేదప్రమాణములోని రెండులక్షణాలను పూర్తిగా అర్థము చేసుకొనెనా? లేదా? అని పరీక్షించితిని.

శ్లో॥ త్రిమూర్తయ స్తదంశాశ్చ, మమోహాకృతయ స్సమే
తథా సర్వేZపి లోకాశ్చ, సత్య స్త్రిముఖ షడ్భుజః ॥ 26

తా॥ త్రిమూర్తులు,వారి అంశలైన ఇతరదేవతలు, మరియు అన్ని లోకాలు నా ఊహాకారములే. మూడు ముఖములు ఆరు చేతులు గల ఏకైక స్వరూపమగు నేనే సత్యము అగు పరబ్రహ్మము.

శ్లో॥ పఞ్చ భూతాని సృష్టాని, త్రిముఖైరేభ్య ఏవహి
త్రిమూర్తయ స్త్రికర్మాణో, భూతానీతి శ్రుతి శ్రుతమ్. 27

తా॥ పంచభూతాలను (ఆకాశ-వాయు-అగ్ని-జల-పృధివి) నా ఈ మూడు ముఖాలు సృష్టిస్తున్నాయి. ఆ పంచభూతాల నుండి అనేక రూపాలను, సృష్టించి, పాలించి, లయము చేయుచున్నారు త్రిమూర్తులు. (అంటే-త్రిమూర్తులు పంచభూతాలను సృష్టించి, పాలించి, లయము చేయువారు కాదు). అందుకే, బ్రహ్మలక్షణమును చెప్పే శ్రుతిలో "దేని నుండి ఈ భూతములు జన్మించుచున్నవో" (యతో వా ఇమాని భూతాని.....) అని పంచభూతములే చెప్పబడినవి కాని జగత్తు అనబడలేదు. అనగా-పంచభూతములను పరబ్రహ్మమే సృష్టించినది. త్రిమూర్తులు, ఈ సృష్టించబడిన పంచ భూతములనుండి అనేక రూపాలను సృష్టించి, పాలించి లయము చేయుచున్నారే కానీ వారు పంచభూతములను సృష్టించి, పాలించి, లయమ్ము చేయువారు కారు.



శ్లో॥ తత్కర్మాణ స్తదంశాహి, బ్రహ్మ విష్ణు శివా అపి
ఏక శబ్దేన వేదేZపి, త్రయోZప్యేకోZహ మేవ హి. 28

తా॥ ఈ హిరణ్యగర్భ-నారాయణ-రుద్రులనబడు. నా మూడుముఖముల అంశలే. అనగా నా అంశలే బ్రహ్మ విష్ణు శివులు. కావున వారును వారి మూలముఖముల కర్మలనే చేయుచున్నారు. అనగా-పంచభూతములనుండి ఏర్పడు జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయుచున్నారు. వేదములో "హిరణ్యగర్భుడే మొదట ఉండెను. అతడే భూతములకు పతిగా కూడ మారినాడు. "అతడు ఒక్కడే ఉండెను". (హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే...) "ఒక్కడే గదా నారాయణుడు" (ఏకోహవైనారాయణః), "ఒక్కడే రుద్రుడు" ఉండెను. రెండవ వాడు లేదు". (ఏకో రుద్రో న ద్వితీయాయతస్థే....) ఈ ముగ్గురు ఒకే ఒక వ్యక్తి అని చెప్పబడినది. ఈ మూడు ముఖములతో నున్న ఆ ఏకైక వ్యక్తిని నేనే. నేనే వేదోక్త పరబ్రహ్మము.

శ్లో॥ అవ్యక్త వ్యక్త సామర్థ్యే, పాత్రౌచిత్య మితామితే
మాయానాటక భేదో హి, బ్రహ్మైకోZహం యథార్థతః॥ 29

తా॥ పాత్రవేషమునకు ఉచితమైన రీతిలో సామర్థ్యమును మితముగాను, అమితముగాను (ఒకే నటుని వలె) ఒకే బ్రహ్మము వ్యక్తముచేయుచు, ఈ విచిత్ర నాటకములో అనేక భేదములతో భాసిల్లుచున్నది, యథార్థముగా ఆ బ్రహ్మమును నేనొక్కడినే.

శ్లో॥ నిరహఙ్కార సంపూర్ణ - వినయా చ్చరణార్థినా
మూఢేనోక్త మపి స్యాం హి, తథా నాసాధ్య మస్తి మే॥ 30

తా॥ అహంకారమును వదలి, సంపూర్ణ వినయముతో నన్ను శరణము పొందియున్నచో అతడు చెప్పిన స్వరూపములోనే ఉందును. నాకు అసాధ్యము లేదు కదా.

శ్లో॥ ధైర్యసౌన్దర్య పాణ్డిత్య - గుణా నవ్యక్త యో యథా
తథా దేవా గుణా స్తే మే, మాయారూపా ణ్యభీప్సతః॥ 31

తా॥ ఒక వ్యక్తిని "సుందరుడా! పండితుడా! ధీరుడా!" అని పిలచినప్పుడు సుందరుడు, పండితుడు, ధీరుడు అను ముగ్గురు వ్యక్తులు లేరు. సౌందర్యము, పాండిత్యము, ధైర్యము అను మూడు గుణములు ఒక వ్యక్తినే ఆశ్రయించి ఉన్నవి కాన, సుందరుడు మొ॥ మూడు శబ్దాలు గుణనామాలే తప్ప వస్తువుల నామాలు కావు. అలానే 33 కోట్ల దేవతల పేర్లు, నా 33 కోట్ల సద్గుణముల నామాలే తప్ప, 33 కోట్ల వ్యక్తులు లేరు. అయితే భక్తుల అభీష్టము మేరకై ఒక వ్యక్తి యగు నేనే, ఆయాగుణాలకు తగిన రూపాలతో నా అనూహ్యమాయా శక్తి వలన, భక్తులకు గోచరిస్తూ ఉంటాను. ఇంత మాత్రమున భిన్న దేవతలుంటారని అర్థము కాదు.

శ్లో॥ మహత్తమ జగత్సృష్టి - స్థితి ధ్వంసా స్త్రిమూర్తయః
మాయారూపాణి మే భక్త - వాఞ్ఛా న్మాదాయ సమ్మతాః ॥ 32

తా॥ ఈ జగత్తు అద్యంతములు లేనిది. ఈ జగత్తు కన్నా గొప్పవస్తువు మరియొకటి లేదు గదా. ఇట్టి గొప్ప జగత్తును సృష్టించుట, పాలించుట, లయింపచేయుట అన్నింటి కన్ననూ గొప్ప పనులు కదా. ఈ మూడు పనులను చేయు త్రిమూర్తులు అందరి కన్నా గొప్పవారు. అయితే, ఆ త్రిమూర్తులు, నా మాయారూపాలే తప్ప ముగ్గురు వ్యక్తులు కారు. సృష్టి-పాలన-లయములను ఈ మూడుగుణాలే త్రిమూర్తులు తప్ప మూడు వస్తువులు లేదా వ్యక్తులు లేరు. సృష్టించుట-పాలించుట-లయింపజేయుట అనునవి మూడు గుణాలే కాని ముగ్గురు వ్యక్తులు కారు. భక్తుల కోరిక సంతృప్తి పరచుటకే నేను మూడు మాయా రూపాలలో గోచరిస్తున్నాను. ఆ విధముగా భక్తుల అభీష్టము కొరకు సమ్మతులైన త్రిమూర్తుల రూపము లేర్పడినవి.

శ్లో॥ సాక్షాత్కారేణ సాదృశ్యం, జానతే మమ మాయయా
దృశ్యన్తే పృథగేతే హి, లీనా దృష్టేఽహ మన్తి మే ॥ 33

తా॥ త్రిమూర్తులను దర్శించినవాడెవడునూ త్రిమూర్తులలో భేదమును చూడడు. ఏలననగా త్రిమూర్తులలో ప్రతిమూర్తియును ఒకే వ్యక్తి యగుట స్పష్టముగా గోచరించును. ఒకే వ్యక్తి మూడు పలుచని వేషములు వేసినచో, ఆవ్యక్తిని ఎవరైననూ గుర్తించగలరు గదా. నాపలుచని వేషములే త్రిమూర్తులు. కావున, త్రిమూర్తులలో భేదమును ఎవ్వడు చూచుననగా - ఎవడు త్రిమూర్తులను దర్శించలేదో వాడే



త్రిమూర్తులను వేరువేరుగా భావించును. త్రిమూర్తులను సాక్షాత్కరించుకొనిన వాడెవ్వడైననూ, త్రిమూర్తులలో ఉన్న వ్యక్తి ఒకరేనని సులభముగా గుర్తించగలడు. నా మాయాశక్తి చేత, ముగ్గురు మూర్తులు భిన్నముగానున్నారే తప్ప, ఆ ముగ్గురు మూర్తులు ఒకరిలోనొకరు అంతర్ధానము చెందినచో, అసలు వ్యక్తి యగు నేను గోచరింతును.

శ్లో॥ గీయతే చ మయా తద్ధి, మాం తు వేద న కశ్చన
యస్యామతం తస్యమత, మిత్యుక్తే రేక ధర్మవిత్॥ 34

తా॥ "నన్ను ఎవ్వడును తెలియజాలడు". అని నేను గీతలో ఈ అర్థమునే స్పష్టము చేసియున్నాను. "ఎవ్వడు తెలుసుకొనలేనని తెలుసుకున్నాడో వాడే తెలిసినవాడు" అని శ్రుతులలో కూడా ఇదే చెప్పితిని. అంటే - "నేను తెలుసుకొనబడను" అన్న వా ఒక్క లక్షణము నైననూ కనీసము వాడు తెలుసుకున్నాడు కాన తెలిసినవాడే కదా. నన్ను తెలుసుకొన్నానన్నవాడు, కనీసము ఆ లక్షణమునైనను తెలుసుకొనలేదు కాన ఏమియు తెలియనివాడే అగును.

శ్లో॥ త్రిమూర్తయో గుణా శ్శక్తి - సామర్థ్యాని సమం జగత్
అహం వ్యక్తి ర్గురు శ్శక్తి, ర్మత్పరా న మదాశ్రయా ॥ 35

తా॥ సర్వదేవతలూ నా సామర్థ్యాలు, శక్తులు, గుణములే తప్ప, వ్యక్తులు కారు. ఈ గుణములలో అన్నిటి కన్నను గొప్ప శక్తులు మూడే- జగత్సృష్టి శక్తి - జగత్పాలన శక్తి - జగల్లయ శక్తి. ఇవే రజోగుణ-సత్వగుణ- తమోగుణములు. ఈ ముడూ సమానమైనవే. ఈ మూడింటి కన్ననూ గొప్పవి లేవు. ఈ మూడింటిపేర్లు బ్రహ్మ-విష్ణు-శివులు. ఈ మూడుపేర్లు వ్యక్తులు కాదు. ఈ మూడునూ ఒకే వ్యక్తి అగు నా యొక్క గుణాలు లేదా శక్తులు లేదా సామర్థ్యాలు. కావున త్రిమూర్తులలో గొప్పవారెవరను చర్చ హాస్యాస్పదము. ఏలనన, ముగ్గురు వ్యక్తులున్నచో గొప్పవ్యక్తి ఎవరని చర్చించవచ్చును. ఉన్నవ్యక్తి ఒక్కడే. అవ్యక్తి నేనే. ఇక, బ్రహ్మ విష్ణు శివులు నా సామర్థ్యాలు. ఆ మూడూ సమానమైనవే. ఏలనన ఆ మూడు శక్తులు ఒకే జగత్తుకు సంబంధించినవి (అనగా జగత్సృష్టి, జగత్పాలన, జగల్లయములు). జగత్తు కన్న గొప్పదేమియూ లేదు. కాన, ఈ మూడు పనుల కన్న గొప్పపని లేదు. అంతే కాదు, ఈ మూడు పనులు

సమానమైన పనులు. పనుల కన్ననూ (అనగా సామర్థ్యముల కన్ననూ) ఆ సామర్థ్యములు కల వ్యక్తి గొప్పవాడు. ఏలననగా, వ్యక్తి పైన ఆధారపడి, వ్యక్తినే సామర్థ్యములు ఆశ్రయించి ఉండును. పైగా వ్యక్తి, సామర్థము వేరు కాదు. వ్యక్తియు, సామర్థ్యములు ఒక్కటే కాన, నేనూ త్రిమూర్తులు ఒక్కటే. సామర్థ్యమును వ్యక్తి నుండి వేరు చేయలేము.

శ్లో॥ గుణా ద్రవ్యస్య న గుణో, గుణస్యాన్య స్త్రిమూర్తయః
సంప్రదాయా త్రిధా ప్రోక్తా, వ్యక్తయో న గుణాస్త్రయః ॥ 36

తా॥ ఒక వ్యక్తికి అనేక గుణములుండును కాని, ఒకగుణమునకు మరియొక గుణము ఉండదు. ఉదా:- ఒక వ్యక్తికి కోపము, శాంతము అను గుణములు సమయములబట్టి ఉండును. అంతే తప్ప కోపమునకు శాంతముగానీ, శాంతమునకు కోపముగాని గుణముగా ఉండదు. కాన, నాకు జగత్సృష్టి-స్థితి-లయములుండును కానీ, సృష్టిగుణమునకు స్థితిలయ గుణములుండవు. త్రిమూర్తులు నా గుణములు కాన బ్రహ్మదేవునకు స్థితిలయములుండవు. బ్రహ్మదేవుడనగా సృష్టిగుణము. ఆ గుణమునకు ఇతరగుణము ఉండదు. ద్రవ్యమునకు గుణములుండును కానీ, గుణములకు గుణములుండవు. కాన, ద్రవ్యమైన (వ్యక్తియగు) నాకు బ్రహ్మత్వ-విష్ణుత్వ-శివత్వములుండునుకానీ, బ్రహ్మకు విష్ణుత్వ-శివత్వములుగానీ,శివునకు బ్రహ్మత్వ విష్ణుత్వములు కానీ, విష్ణువునకు బ్రహ్మత్వ శివత్వములు కానీ ఉండవు. అందుకే, వేద-శాస్త్ర-ఋషి సంప్రదాయము ననుసరించి జగత్సృష్టిస్థితిలయములను గుణములకు ప్రతీకలైన బ్రహ్మ-విష్ణు-శివులను వేరువేరుగానే ప్రసిద్ధిగా చెప్పియున్నారు. ఇందులో ఏ ఒక్కరికి అయినా మూడుగుణములుంటే, మూడు గుణముల ప్రతీకలుగా ముగ్గురిని ఏలచెప్పితిరి? కాన ముగ్గురును వేరువేరుగానేయున్నారు. ఈ ముగ్గురును వ్యక్తులుగారు. కేవలగుణములే. గుణములను వేరువేరుగానే చెప్పుట యుక్తము. అందుకే త్రిమూర్తులను వేరువేరుగా చెప్పియున్నారు.

శ్లో॥ ఏకాస్యేనాధికారో వా, త్రిమూర్తిముఖ శాశ్వతమ్
సంప్రదాయ శ్రుతం బ్రహ్మ, నిరూపయతి మాం సదా॥ 37

తా॥ నేను ఏకముఖంగా గోచరించియున్నచో, నేనునూ త్రిమూర్తులలో ఒకరిని అగుదును. అంతేకాదు, అసలు నాకు జగత్సృష్టి లయములగు శక్తులలో ఏఒక్కశక్తియూ



లేదందురు. ఈ జీవుల తత్త్వము నాకు బాగుగ తెలియును కావుననే నేను సదా త్రిమూర్తి ముఖాలతో గోచరిస్తున్నాను. ఈ త్రిమూర్తుల ముఖాలు సదా నా జగత్సృష్టి స్థితి లయములను సూచిస్తూ నేను పరబ్రహ్మమని స్పష్టపరుస్తున్నాయి. జీవుల కొరకు ఈ రూపంతోనే సదా నేనున్నాను. ఈ రూపము, సంప్రదాయము (వేద-శాస్త్ర-ఋషి-పరంపర) చెప్పిన పరబ్రహ్మరూపాన్ని నిరూపిస్తున్నది. ఈ రూపమును దర్శించియును, వీరశైవ, వీరవైష్ణవాది మొండి మతములను వీడనివాడెన్నిటికినీ తరించడు.

శ్లో॥ స్వమత ప్రమయా శైవా, అన్యే చ త్రయసిద్ధితః
గుణా న మిళితా వ్యక్తి, ర్బ్రహ్మ వ్యక్తి ర్గుణా స్త్రయః ॥ 38

తా॥ వేద - శాస్త్ర - ఋషి - పురాణాది సంప్రదాయము ప్రకారముగా, జగత్సృష్టిస్థితిలయములకు వేరువేరుగా త్రిమూర్తులు ప్రసిద్ధమైయుండగా, ఈసంప్రదాయమును ప్రమాణముగా తీసుకొనక, తమ మొండిమతమే తమకు ప్రమాణము కాగా, బ్రహ్మాభిమానులు బ్రహ్మకే సృష్టిస్థితిలయ శక్తులున్నవనియు, వైష్ణవులు ఇవి విష్ణువుకే ఉన్నవనియు, శైవులు ఈ మూడూ శివునికే ఉన్నవనియు వాదించుచూ కలహించుచున్నారు. ఇట్టి వారు తమకు తామే ప్రమాణముగా నిలిచియున్నారు. వీరు వేదశాస్త్రాది సంప్రదాయమును ఏమాత్రము గౌరవించినా, జగత్సృష్టి స్థితిలయకారకములగు త్రిమూర్తులను అంగీకరించవలయును. అట్లు అంగీకరించినచో, ఏమూర్తికీ మిగిలిన రెండు అధికారములున్నవని వాదించరు. మూడు సామర్థ్యాలు (అధికారములు) ఉన్నమూర్తియే పరబ్రహ్మము. కాన, త్రిమూర్తులలో ఏమూర్తియూ పరబ్రహ్మకాదు. ఏలననగా, పరబ్రహ్మము వ్యక్తి. త్రిమూర్తులు గుణాలు. గుణము వ్యక్తి కాదు కాన, త్రిమూర్తులు పరబ్రహ్మముకాదు. గుణాలనన్నింటినీ కలిపినా వ్యక్తి కాదు కాన, త్రిమూర్తులు కలిసి నిలచిననూ వారిని పరబ్రహ్మంగా అత్రి అంగీకరించలేదు.

శ్లో॥ సితోష్ణగతి ధర్మైర్కో, దత్తోఽహం హి త్రిమూర్తిమాన్
న ధర్మస్యాన్యధర్మో హి, కథం ధర్మ స్త్రిధర్మవాన్? 39

తా॥ సూర్యుడు ద్రవ్యము అనగా వ్యక్తియగు బ్రహ్మము వంటివాడు. సూర్యుని యొక్క తెలుపు రంగు, వేడి, సంచారము అను మూడు గుణములు వంటి వారే త్రిమూర్తులు.

సూర్యుడు ఈ మూడు గుణములును కలవాడన్నచో అర్థమున్నది కానీ, తెలుపురంగునకువేడి, సంచారము అను గుణములున్న వన్నచో అర్థమున్నదా? అట్లే నేను బ్రహ్మవిష్ణుశివ స్వరూపుడనన్న అర్థమున్నది. అంటే నేను జగత్సృష్టిస్థితిలయములను చేయుచున్నానని అర్థము. అంతే తప్ప, బ్రహ్మకో, విష్ణువుకో, శివునకో జగత్సృష్టిస్థితిలయములున్నచో హాస్యాస్పదము. అసలు జగత్సృష్టిస్థితి లయములను కర్మలే, లేదా శక్తులు లేదా గుణాలే బ్రహ్మ విష్ణు శివులను నామాలు. ఈ కర్మలు, గుణాలు. నావి. తెలుపు రంగునకే వేడి, సంచారములున్నవన్నచో ఎంత వివేకమున్నదో, అట్లే త్రిమూర్తులలో ఒక రూపానికే మూడు శక్తులున్నవను వానికినీ అంతే వివేకమున్నది. ధర్మమే వ్యక్తిపై ఆధారపడియుండ, ధర్మము ఇతర ధర్మములకు ఆధార మెట్లగును?

శ్లో॥ హిరణ్య గర్భ వదనం, సృజే ద్భూతాని మధ్యగమ్
నారాయణముఖం ధత్తే, తాని రుద్రముఖం హరేత్॥ 40

తా॥ ఈ నా స్వరూపములోని మొదటి ముఖము పేరు "హిరణ్యగర్భుడు". ఇది పంచభూతములను సృష్టించుచున్నది. ఈ రెండవ మధ్యముఖము నారాయణ ముఖము. ఇది వాటిని నిలుపుచున్నది. ఈ మూడవ ముఖము రుద్ర ముఖము. ఇది వాటిని ఉపసంహరించుచున్నది. ( "యతోవా. . ." శ్రుతి)

శ్లో॥ సమత్వాయ ప్రకాశో మే, బ్రహ్మణో వేషధారిణః
న కీర్త్యై భక్తయశసా, తుష్టోఽస్మ్యవసరా దిదమ్ ॥ 41

తా॥ నేను త్రిమూర్తుల మొదలు సర్వదేవతల వేషాలలోనున్న వేషధారినని, పరబ్రహ్మమని, నీకు నిరూపించుట- ఆదేవతల నిరాకరించుటకు కాదు. వారిలోనున్న ఏకైక పాత్రధారిని అగు నన్ను గుర్తించుట చేత, సర్వదేవతల యందు నీకు సమభావము కలిగి, దేవతలపై రాగ ద్వేషాలు కలిగి యుండక, సమానరాగంతో ప్రవర్తిస్తావనియే తప్ప, వారిని నిరాకరించి, నేను కీర్తిని పొందుట. నా ఉద్దేశము కాదు. అసలు నా తత్త్వము నా భక్తులకు కీర్తి నిచ్చి ఆనందించుటయే. నేను ఏవో పిచ్చి రూపాలలో సంచరిస్తూ, ప్రకాశములోనికి రాక, నా భక్తులను ప్రకాశింపచేసి ఆనందిస్తాను. త్రిమూర్తులందు సర్వదేవతల యందు సమభావంతో మెలగవలయునని ఉద్దేశంతో,



అసలు వేషధారి అగు పరబ్రహ్మమైన నన్ను నేను ఇప్పుడు, ప్రకాశింపచేసుకొనక తప్పలేదు.

శ్లో॥ త్వన్మాత్ర స్తవ సాన్నిధ్యే, బిన్దురన్య జగత్తనౌ
తద్వికారై ర్వికార్యోన, సమతో హీతి సన్మతమ్॥ 42

తా॥ ఆబ్రహ్మమే ఒక సమయమున, నీ అంత ఎత్తు, లావు, పొడవు, పరిమాణములో నీ ఎదుటే ఉండి, ఇదే సమయమున, ఈ విశ్వమంతయూ వ్యాపించి, అతిక్రమించి, ఈ అనంత విశ్వాన్ని తనలో ఒక బిందుమాత్రంగా కలిగియున్నది. ఒక వ్యక్తి శరీరంలో ఒక చిన్న పరమాణువులో జరిగే మార్పులో ఎలా వ్యక్తిని మార్చలేవో, అలానే ఈ విశ్వంలోని పరిణామవికారాలన్నీ నన్ను మార్చలేవు కాన, అంటవు. నేను అర్థము కానని అర్థము చేసుకొనుటయే సత్యమైన మతము.

శ్లో॥ ఆకారోఽస్మి సకృన్నాపి, రూపం త్రిపురసున్దరీ
బాలా షోడశ బాల్యం మే, శ్రీః కళా దేవతా గుణాః॥ 43

తా॥ నేను ఒకే సమయమున ఆకారముగ, నిరాకారముగను ఉందును. నాలోని నిరాకారతత్త్వములే ఆకారములగును. నాలోని నిరాకారమైన సౌందర్యమే మాయారూపమున "త్రిపురసుందరి" అనబడుచున్నది. నేను ఎల్లపుడును షోడశ వర్ష ప్రాయము కల బాలునిగ ఉందును. ఆ బాలత్వమే "బాల" యనబడుశక్తి. నా యొక్క అద్భుతమైన కళయే "శ్రీ" శక్తి యనబడుచున్నది. ఇవి అన్నియు నాకన్న వేరు కాదు. ఈ విధముగా నా ఒక్కొక్క గుణమే ఒక్కొక్క మాయారూపమున దేవతలుగా గోచరించుచున్నారు.

శ్లో॥ ధైర్యం చ హనుమాన్ జ్ఞానం, బ్రహ్మ విష్ణుశ్చపాలనమ్
క్రోధో రుద్రశ్చ వాగ్వాణీ, ద్రవ్యం శ్రీ స్సిద్ధి రమ్బికా॥ 44

తా॥ నాలోని ధైర్యగుణమే హనుమంతుడు. నాలోని జ్ఞానమే బ్రహ్మదేవుడు. నా యొక్క పరిపాలన గుణమే విష్ణువు. నా క్రోధగుణమే రుద్రుడు. నావాక్కే సరస్వతి. నాలోని ద్రవ్యమే లక్ష్మి. నా సిద్ధులే పార్వతి.

శ్లో॥ చన్ద్రవ ద్దూరతోఽల్పం చ, నేదీయో నాల్పవ త్తథా
జగన్మమ ముఖాఽఽకాశే, దృష్టమేతావదవ్యయా॥ 45

తా॥ ఎంతో పెద్దది యగు చంద్రబింబము దూరము నుండి చూచుట వలన చిన్నదిగా కనపడుచున్నది. కానీ, ఎంత దగ్గరగా పోయిననూ, వస్తువు చిన్నదిగా కనపడదు. ఇది ప్రకృతినియమము. నా చిన్న నోటిలో, బాల్యమున, తల్లి యశోదకు, ఈ సర్వజగత్తును చూపియున్నాను. ఇట్లు చూపించుట ప్రకృతి నియమమును అతిక్రమించి ఉన్నది.

శ్లో॥ మమాస్యే కలితం విశ్వం, యథావ త్పరిమాణతః
తస్మి న్నహం యశోదా చ, తద్బహిశ్చ కథం త్విదమ్! 46

తా॥ నా నోటిలో సర్వవిశ్వమూ, దాని పరిమాణము తగ్గకుండా, అట్లేయుండి, ఇమిడినది! ఆ విశ్వంలో (నానోటిలో నున్న విశ్వంలో) నేను, యశోద నిలిచియున్నాము. ఆ విశ్వం నా నోటిలో ఉన్ననూ, ఆ విశ్వానికి బయటి విశ్వంలోనే, నేనూ, యశోద, నిలిచేయున్నాము. ఎట్లున్నది ఇది? అర్థమైనదా ఏమైనా? నేను కృష్ణావతారంలో బాలకృష్ణునిగా, యశోదమాతకు నాచిన్ని నోటిలో సర్వవిశ్వమును దర్శింపచేసితిని గదా!ఆమె, నేను - ఆ చిన్న నోటిలో కనిపించు విశ్వములోను ఉన్నాము - బయట ఒకరికొకరు ఎదురుగా ఒకే సమయమున ఉన్నాము గదా. ఇదే నా సర్వశక్తి సంపన్నత్వముకు, తర్కాతీతస్థితికి నిదర్శనము కాదా?

శ్లో॥ అల్పో యవనికాదేశో, మహాన్వా తత్త్వదర్శనే
దత్తం జ్ఞానం కథా దృష్ట్వా, పతితా మత్కథా న చ ॥ 47

తా॥ ఒక సినిమా తెరపై ఎంతో విశాలమైన మైదానమును చూచుచున్నావు. అదే తెరపై, తెర అంతయును వ్యాపించిన చిన్న ముఖమును చూచుచున్నావు. మొదట తెర పెద్దది కాలేదు. రెండవసారి, తెర చిన్నది కాలేదు. ఇదే విధంగా నానోటిలో యశోదకు విశ్వమంతయును చూపియున్నాను. నా మాయాశక్తి ప్రభావములగు దేశకాల తత్త్వములను వివరించుటకే, మానవులకు, ఈ చలన చిత్ర నిర్మాణము విజ్ఞానమును అనుగ్రహించియున్నాను. కానీ, మానవులు, అసలు విషయమును త్యజించి, వారి సంసార లంపటమును పెంచుకొనుటకై, సంసారగాథలను కల్పించి, ఆ చిత్రములను చూచి, ఇంకనూ, సంసారవాసనలలో కూరుకపోవుటకు వినియోగించుచున్నారు.



మరికొందరు నా కథలను మాత్రమే చూచి తరించుచుండగా, మరికొందరు నా కథలయందు ప్రీతి లేక, కేవల సంసార కథా చిత్రదర్శనముతో పతనము చెందుచున్నారు.

శ్లో॥ స్వరూపాచ్ఛాదకై ర్వేషై, ర్విశ్వరూపాఖ్యదేవతా
అహమేవేయమాలోక్యా, ప్రకృతిః పురుషః పరః॥ 48

తా॥ నాస్వరూపమును పూర్తిగా కప్పిన వేషములతో ఈ కనపడుచున్న ప్రకృతి అనగా జగత్తు అంతయూ "విశ్వరూపుడు" అను పేరు గల నా దేవతా వేషములలో ఇది యొకటి. వేషధారియగు పరమ పురుషుడను నేనే.

శ్లో॥ రూపతుల్యా నరా దేవా, వ్యక్తః కిఞ్చి త్సురేష్వహమ్
త్రిమూర్తి ష్వల్పసంఛన్నో, దత్తః పూర్ణోజ్ఝితాకృతిః ॥ 49

తా॥ నరులు, దేవతలు, ఆకారములో సమానమే. కానీ, నరులు పూర్తిగా మాయావస్త్రముతో కప్పబడిన నేను. ఇక, దేవతలు మాయావస్త్రముతో చుట్టబడినా, అచటనచట నేను బయటకు కనబడుచుందును. ఇక త్రిమూర్తులన్ననో, చాలా స్వల్పభాగమున మాయతో కప్పబడి దాదాపు పూర్తిగ అభివ్యక్తమైన నేను. ఇక, దత్తుడనైన నేను మాయాచ్ఛాదనమును పూర్తిగా తీసివేసిన వాడను. అనగా దిగంబరుడను.

శ్లో॥ అమ్బరార్థో హి నేపథ్యం, నిర్వేషం మాం దిగమ్బరమ్
జానతే నైవ నగ్నార్థో, నగ్నో జాతు న రూపవాన్॥ 50

తా॥ అంబరము అనగా వేషము. అన్ని వేషములు తీసిన వాడనైన నన్ను దిగంబరుడు అని అందురు. దిగంబరుడనగా వస్త్రహీనుడని కాదు. వస్త్రవిహీనుడిగా, ఎప్పుడును ఎట్లు ఉండరాదో, (ధర్మ శాస్త్రము ప్రకారము ఎప్పుడును వస్త్రహీనుడుగా ఎట్లు ఉండరాదో) అట్లే నేనును ఎప్పుడును రూపరహితునిగా ఉండను. వేషపాత్ర నియమములకు బద్ధుడు కాకుండుటమే దిగంబరుడని భావము.

శ్లో॥ స్వవేషేణాన్య నేపథ్యం, యథా గృహ్ణాతి వై నటః
తథా దత్తోఽన్యరూపాణి, న నగ్నబ్రహ్మ నిస్తను॥ 51

తా॥ స్వవేషము శరీరముపైనుండగనే, ఒకానొక నటుడు, దానిపై అన్యవేషములనెట్లు ధరించగలడో, అట్లే, నిజవేషముననున్న ఈ దత్తుడు అన్యరూపములను ధరించగలడు. దాని కొరకు నిరాకారమైన బ్రహ్మము కాబనిలేదు. అన్యవేషధారణమునకు నటుడు నగ్నము కాబనిలేదు కదా! (కౌపీనమును ధరించియే సదా ఉండును గదా అని భావము)

శ్లో॥ స్వాకారే పరరూపాణి, యోగిన శ్చేహ గృహ్ణతే
స్థితే స్వరూపే తద్వద్ధి, సోఽవతారో నిరూపకః ॥ 52

తా॥ తమ ఆకారములు చెడకుండగనే, పరరూపములను ఎట్లు, ఇక్కడ యోగశక్తి కలవారు ధరించుచున్నారో, అట్లే, నేనును, నా ఈ ఆకారమునకు భంగము లేకయే అన్యరూపములను ధరించగలను. యోగశక్తులను ప్రదర్శించు యోగులు నా అవతారములే. వారు నా తత్త్వమునే ప్రదర్శించి నిరూపించుచున్నారు. ఇట్టి యోగులు నేనేనని గ్రహించుము.

శ్లో॥ భగశబ్దో హి మాహాత్మ్యే, భగవా న్సిద్ధి దర్శకః
నేన్ద్రజాలం వినోదాయ, తత్త్వజ్ఞాన నిరూపణాత్ ॥ 53

తా॥ భగశబ్దమునకు "మాహాత్మ్యము" అను అర్థమున్నది. భగవానుడు అనగా మహాత్మ్యములనబడు సిద్ధులను కలిగి ప్రదర్శించువాడు. అతడు ప్రదర్శించు సిద్ధులు వినోదము కల్గించు ఇంద్రజాలములు కావు. ప్రతి సిద్ధియూ, ఒక్కొక్క బ్రహ్మ జ్ఞానవిషయమును ప్రత్యక్షప్రమాణంగా సిద్ధాంతముగా నిరూపించుచున్నది.

శ్లో॥ భగవానస్మి సాలోక్య - ప్రదో నాస్తికజన్తవే
గురురస్మి చ సామీప్య - ప్రదో హ్యాస్తికపక్షిణే ॥ 54

తా॥ నాస్తికుడను జంతువు పైకి రాలేక, భూమిపై సంచరించుచున్నవాడు. వానికి, చిత్ర సిద్ధులను ప్రదర్శించి, అనూహ్యతత్త్వమున్నదని బోధించి, సాలోక్యమునిచ్చు భగవానుడను నేనే. ఇక ఆస్తికుడను పక్షి, తన రెక్కలతో కొంత దూరము పైకి వచ్చిన వాడు. వానికి జ్ఞానబోధతో గమ్యమును చేర్చి సామీప్యము నిచ్చు గురువునూ నేనే.



శ్లో॥ సిద్ధిలీలాశ్చ భాష్యాణి, విచారే భగవా న్గురుః
సాక్షా ద్భాష్యం గురు ర్వక్తి, భవామ్యవసరోచితమ్ ॥ 55

తా॥ భగవంతుడు ప్రదర్శించు సిద్ధులు కూడ, విచారించినచో, జ్ఞానసిద్ధాంతములే. కాన, విమర్శచేసినచో భగవంతుడు కూడ గురుస్వరూపుడే. ఇక గురువు సిద్ధులతో పనిలేక, జ్ఞాన సిద్ధాంతములనే ప్రవచించును. సాధకుని దశావసరము ననుసరించి ఉచితంగా గురువుగాను, భగవానుడిగను మారుచుందును.

శ్లో॥ త్రిమూర్తి దాస శక్త్యర్థే, ప్రక్షేప శ్శక్తి రఞ్జనా
కిం నిర్మాణే చ విద్యుద్వా, వేష్యహం హ్యన్ధకూపవత్ ॥ 56

తా॥ బ్రహ్మ-విష్ణు-శివులు, పరాశక్తికి దాసులని కొందరు ప్రబుద్ధులు పురాణములలో చొప్పించిన శ్లోకములవలన, విని, త్రిమూర్తులను తక్కువగా చేసి మాట్లాడి, తృప్తిపడుచున్నారు! త్రిమూర్తులెవరు? నేనేకదా మూడు వేషములలోనున్నది! పరాశక్తి ఎవరు? నాశక్తియే, నా సామర్థ్యమే- అనగా నేనే. నేను నాకు దాసుడనగుదునా? కావున, దేవతలలో ఒకరిని అధికముగా భావించు సన్మానము, మరియొకరిని తక్కువగా భావించు తిరస్కారము పనికిరాదు. అట్టిది, వాచా-మనసా భావించిన మహాపాపము. శక్తి అనగా స్త్రీ రూపమా? "ఈ ఇల్లు నిర్మించినవాని శక్తి ఎంతో గొప్పది" అన్నపుడు,ఇల్లు నిర్మించిన వాని వెంట ఒక స్త్రీరూపము ఉండి, ఇంటిని నిర్మించినదా? "విద్యుచ్ఛక్తి చాలా గొప్పది" అనుచో, విద్యుత్ తీగెలలో ఒక స్త్రీరూపము పరుగెత్తుచున్నదా? సర్వదేవతలునూ (స్త్రీ-పురుషరూపాలన్నీ) ఒకే పరబ్రహ్మమైన నా వేషములే కాన, ఎవరిని కించపరిచినా, నన్ను కించపరచినట్లే. త్రిమూర్తులను కించపరచిన, పరాశక్తిని కించపరచినట్లే. ఏలననగా, ఆపరాశక్తియే త్రిమూర్తుల వేషాలలో ఉన్నది. ఇది గ్రహించినవాడు త్రిమూర్తులను ఎట్లు అవమానించగలడు? ఆపరాశక్తియే బ్రహ్మము. ఆ బ్రహ్మమునేనే. అంధులు, అంధులను శిష్యులుగా స్వీకరించి శిష్యులతో పాటు బావిలో పడినట్లు అజ్ఞానులు అజ్ఞానులను శిష్యులుగా చేసుకొని, పతనము చెందుచున్నారు!

శ్లో॥ సృష్టి స్థితి లయా త్సిద్ధి, ర్నాధికా భగవత్తమాః
సిద్ధిత్రయైక రూపోఽహ, ముత్తమోత్తమపూరుషః॥ 57

తా॥ జగత్తు యొక్క సృష్టి,స్థితి, లయముల కన్న గొప్ప సిద్ధులేమియును లేవు. అనగా, అంతకు మించిన పనులేమియూ లేవు. కాన, భగవంతులలో ఉత్తములు త్రిమూర్తులు. అయితే, ఈ మూడు సిద్ధులు నేనొక్కడినే, చేయుచున్నందున, భగవంతులలో ఉత్తమోత్తముడను నేను. నేను పురుషోత్తమోత్తముడను. పురుషోత్తములు త్రిమూర్తులు పరబ్రహ్మమైన నేను పురుషోత్తమోత్తముడను. (త్రిమూర్తులు వేషములు కాన ఉత్తములు. వేషధారి అంత కన్ననూ ఉత్తమోత్తముడు).

శ్లో॥ మనః కమ్పకరం ధర్మ - చక్రం చాహ శమాస్పదమ్
సుఖదుఃఖమయం కర్మ - చిత్రం జీవో జనిక్షయైః ॥ 58

తా॥ నా చేతిలోనున్న చక్రము ధర్మచక్రము. ఇందులో జనన-మరణములను ఆరెండిటి మధ్య కర్మయు ఉండును. కానీ, ఇందులో పరమశాంతి తత్త్వ ముండును. సుఖఃదుఖములుండవు. సర్వసృష్టినీ చలింపచేయునది ఈ చక్రమే. జీవుని మనస్సునూ సదా చలింపచేయునది ఇదియే. ఈ ధర్మ చక్రమే నేను. జీవుని మనస్సు సదా స్పందింపచేయునది నేనే కాన, శాంతుడగు జీవుని మనస్సు కూడ స్పందించుచునే యుండును. కానీ, వాటి వలన జీవుని శక్తి పోదు. ఏలననగా దాని స్పందన కర్తను నేను కావున. ఇక కర్మచక్రమును కల్పించుకొన్నది జీవుడే. కర్మ చక్రమే జీవుడు. అది సుఖ దుఃఖమయము. సదా శక్తిని కోల్పోయి బలహీనుడగుచుండెను జీవుడు. ఈ చక్రములోని జనన మరణములు దుఃఖమయములు. మధ్య గల జీవితము సుఖ దుఃఖమయము. దీనిలోని కర్మల యొక్క సంకల్ప-కార్యకాల-ఫలావేస్థలయందు ఉద్రేకములతో పొంగుచు, కుంగుచు, సదా శక్తిని కోల్పోవును. ధర్మ చక్రమునందు సదా శాంతుడై, పొంగక, కుంగక, శక్తిని కూర్చుకొనును.

శ్లో॥ న నవ్యదేవతా యోగః, పుత్రప్రేమేవ వేషిణః
సర్వవేషేషు సామ్యేన, కలౌ వీరమతా దహమ్॥ 59

తా॥ ఉన్న దేవతల సంఖ్య చాలక, కొత్త దేవతా రూపమును (నన్ను) తీసుకవచ్చి, ఉన్న దేవతారాధనములను మాన్పించి, కొత్త దేవతారాధనము చేయించుట నా ఉద్దేశము కాదు. అన్నివేషములందున్న వేషధారి నీ పుత్రుడేనని గుర్తించినచో, ఎట్లు సర్వవేషములందున్న నీ పుత్రప్రేమయే, అన్ని వేషములపై సమాన ప్రేమగ



ప్రసరించునో, అట్లే-సర్వదేవతలలో నున్న దత్తుని (నన్ను) గుర్తించినచో, ఆ దత్తునిపై గల ప్రేమయే సర్వదేవతలయందును సమానముగా ప్రసరించును. ఈ విధముగా సర్వ దేవతలను సమ భక్తితో ఆరాధింపజేయు లక్ష్యముతోనే నేను ప్రకాశమగు చున్నాను. వెనుక యుగములలో ఇట్లు భేదము లేదు. కలియుగములో ఈ భేదము చాలా ఎక్కువై, వీరవైష్ణవ, వీరశైవాది మతములుద్భవించుట చేత, సర్వదేవతల వేషాలలో నున్న పరబ్రహ్మ-దత్త స్వరూపమైన నేను నన్ను ప్రకటించవలసి వచ్చినది.

శ్లో॥ అభిజ్ఞా తత్త్వధీ జ్ఞానం, బ్రాహ్మణో మే ప్రచారవాన్
కలౌ మద్బోధకోఽహంహి, బ్రాహ్మణః కేవలోఽస్మి తత్ ॥ 60

తా॥ బ్రహ్మజ్ఞానము అనగా, ముందు బ్రహ్మము ఎవరో గుర్తించి, బ్రహ్మము యొక్క స్వరూప, స్వభావ, సామర్థ్యములు బాగుగ వివరించి తెలుసుకొని, ఇతరులకు ప్రచారము చేయుట అత్యుత్తమ సాధకుడైన బ్రాహ్మణుని లక్షణము. బ్రహ్మము నేనే. అసలు నేనే బ్రహ్మమని, ఈ కలియుగమున గుర్తించిన జీవుడే లేడు. కాన, బ్రాహ్మణుడు అనబడదగిన వాడే లేడు! నేను బ్రహ్మమని తెలుపుకొని, నా గురించి నేను ప్రచారము చేయుచున్నాను కాన, కలియుగమున నిజమైన బ్రాహ్మణుడను నేను ఒక్కడినే!

శ్లో॥ దత్తాత్రేయో నిర్గుణార్థ - ద్రవ్యం వక్తి న లక్షణమ్
ఆధేయలక్షణం వ్యక్తి - ద్రవ్యమాశ్రిత్య వర్తతే ॥ 61

శ్లో॥ నా నామమగు దత్తాత్రేయశబ్దమును విచారించినచో దాని అర్థము, ఏ వస్తులక్షణాన్నీ స్ఫురింపచేయదు. ఎందుకు? అది ఏ లక్షణాన్నీ బోధింపచేసే శబ్దము కాదు. దత్తుడనగా ఈయబడినవాడు. ఆత్రేయుడనగా అత్రికి పుత్రునిగా దత్తము చేసుకొన్నవాడనియే అర్థము. దత్తశబ్దము కానీ, ఆత్రేయ శబ్దము కానీ, నా యొక్క ఏ లక్షణాన్నీ అనగా ఏగుణాన్నీ బోధించదు. ఎందుకనగా ఆ శబ్దార్థము ఏ గుణమూ కాదు కావున, అది నిర్గుణ శబ్దము అనగా నిర్గుణ పరబ్రహ్మమును బోధించునే తప్ప, ఏ గుణాన్నీ బోధించదు. గుణము స్వయముగా నిలువలేదు. అది వ్యక్తిపై ఆధారపడును. వ్యక్తి స్వయముగా నిలచును. ఆ వ్యక్తియే దత్తాత్రేయుడు దత్తుని సద్గుణములే సర్వదేవతలు.

శ్లో॥ లక్షణం లక్షణాన్యేన, బాధ్యతే వ్యక్తి రాశ్రయః
దత్తాత్రేయో వ్యక్తిపదం, దేశకాలాన్తరోగుణః ॥ 62

తా॥ ఒక వస్తువు యొక్క లక్షణమును బోధించే శబ్దము ఆ వస్తువు యొక్క మరియొక లక్షణమును బోధించే శబ్దముచే బాధించబడును. అనగా ఒక వ్యక్తి యొక్క కోపగుణము ఆది అంతములను కలిగి, అదే వ్యక్తి మరొకసమయమున శాంతగుణము కలిగి ఉండును. ఇప్పుడు కోపగుణము శాంతి గుణసమయమున శాంతిగుణముచే బాధించబడును. కోపగుణమునకు అర్థమగు కోపము, శాంతిసమయమున లేకుండపోయినది. అయితే వ్యక్తి శబ్దము యొక్క అర్థమైన వ్యక్తి అన్నిగుణముల సమయములందును నిత్యముగా ఉన్నాడు. కాన ఏగుణమును చెప్పక, కేవలద్రవ్యాన్నే సూచించే వ్యక్తి శబ్దమే, అసలైన అధిష్ఠానము లేదా మూలము లేదా ఆధారము-ఈ వ్యక్తియే దత్తాత్రేయుడు. దత్తాత్రేయ శబ్దము ఏగుణాన్నీ చెప్పదు. కేవలము ద్రవ్యాన్నే సూచిస్తుంది.

శ్లో॥ విష్ణు రుద్ర ద్వయేకాల - భేదా దన్యోన్య సంక్షయః
అనిత్యా స్త్రిగుణాః కాల - భేదా దాద్యన్త లక్షణాః॥ 63

తా॥ ఉదాహరణకు విష్ణువనగా సర్వజగత్తునూ వ్యాపించి, ఈ జగత్తును నిలబెట్టువాడని అర్థము. ఇది వ్యక్తి యొక్క గుణాన్నే బోధిస్తున్నది. అనగా స్థితి సమయంలోని వ్యక్తి గుణము. కాలాంతరంలో ఆ వ్యక్తియే సర్వజగత్తును రుద్రునిగా నాశనము చేయునప్పుడు విష్ణుశబ్దము అంతమైనది. రుద్రునిగా నిలబడిన విశ్వమును నాశనము చేయువాడు విశ్వమును నిలబెట్టడు కాన ఆసమయంలో ఆవ్యక్తి విష్ణువు కాదు. విష్ణువు గుణము ఆ సమయంలో ఆ వ్యక్తిలో లయించినది. కాన బ్రహ్మవిష్ణుశివులు అను పేర్లు గల నా గుణములు ఆద్యంతములు కలిగినవి కాన, వారు అనిత్యులు. వ్యక్తియగు నేనే అనగా దత్తాత్రేయుడేనిత్యుడు.

శ్లో॥ త్రిగుణేషు పరబ్రహ్మ, శబ్దార్థో నిత్యమస్తిహి
మయి హీనవ దాలోక్యే, సోఽపి నష్టో హ్యగౌరవాత్ ॥ 64

తా॥ పరబ్రహ్మమనగా "చాలా గొప్పది" అని అర్థము. జగత్తును సృష్టించుట, పాలించుట, లయింపచేయుట అను ఈ మూడు గుణములలోను చాలా గొప్పతనమున్నది. కాన,



పరబ్రహ్మశబ్దము అన్ని లక్షణములలోను వర్తించు శబ్దము కాన ముఖ్యమైన శబ్దమైనది. అయితే పరబ్రహ్మ శబ్దము కూడా గొప్పతన మను లక్షణమునే బోధించుచున్నది. నేను ఒక్కొక్క సమయమున, గొప్పవానిగా కాకుండ, చాల తక్కువవానిగా భాసించుదును. ఆ సమయమున నా గొప్పతనము అను లక్షణము నాలో లయించగా, ఈ పరబ్రహ్మ శబ్దము కూడా అనిత్యమైనది. కాన, ఈ శబ్దము కూడ అధిష్ఠానమును బోధించదు. ఏ లక్షణమునూ బోధించని దత్తాత్రేయశబ్దమే అధిష్ఠానమును అనగా మూల ద్రవ్యమును బోధించును. (అనగా పరబ్రహ్మశబ్దము కన్ననూ నిత్యమైనది దత్తాత్రేయశబ్దము.)

శ్లో॥ గుణా రూపాణి మచ్ఛక్త్యా, ప్రత్యేకం పృథగస్మి చ
అనన్యోపమయైకోఽస్తి, విశ్వరూపా హి దేవతాః ॥ 65

తా॥ నాగుణాలే ఈ సర్వదేవతలు. వీరే నా అవతారములు. నా గుణములు సమయమును బట్టి మారుచుండుట వలన, ఈ అవతారములు, దేవతలు ఆద్యంతములను కలిగి యున్నారు. నా అద్భుత మాయాశక్తి వలన నా గుణములే ఒక సమయంలో అనేక రూపాలుగా భాసిస్తున్నారు. ఒకేసమయంలో ప్రత్యేకంగా ఈ అన్ని గుణాలలోనూ నేనున్నాను. ఈ అన్ని గుణాలూ నాకన్న వేరుగ నిలువ లేవు. ఒకే సమయంలో ఈ గుణాలకన్ననూ విడిగాను నేనున్నాను. ఇట్లు ఏ వస్తువూ ఏ జీవుడూ సృష్టిలో పుండలేడు కాన, నాకు పూర్ణోపమానము నేనే. ఇంత ఏల? సర్వ జగత్తూ నాగుణమే. ఈ జగత్తు అంతయూ విశ్వరూపుడను నా అనేక దేవతారూపాలలో ఒక దేవతా రూపమే కాన సర్వ దేవతలలోను ఈ జగత్తూ ఒక దేవతా రూపమే.

శ్లో॥ సమాః కలా శ్చావతారా, మమ షోడశపూర్ణిమా
కాలో మే మార్గశీర్షస్య, గీతస్యాస్మి హి సున్దరః ॥ 66

తా॥ నేను 16 సం॥ బాలునిగా ఉన్నాను. నా పరిపూర్ణషోడశ కళలే 16 సంవత్సరములు. వీటినే నా 16 ప్రధానావతారములుగ పండితులు కీర్తిస్తారు. ఈ 16 కళలతో పూర్ణమైన మార్గశీర్ష పూర్ణిమయే నాప్రకటన సమయాన్ని సూచిస్తుంది. "మాసములలో మార్గ శీర్షము నేన" ని గీతలో చెప్పియున్నాను. కాన, మార్గశీర్షపూర్ణిమ అత్యుత్తమమైన నాతత్త్వ ప్రకటన కాలముగా తెలియుము. 30 సం॥వారుగా దేవతలుందురు. నేను మాత్రము,

దేవతలందరికీ విశిష్టంగా సర్వలావణ్య సౌందర్యపూర్ణుడనై నిత్యము షోడశవర్ష ప్రాయునిగా గోచరింతును.

శ్లో॥ పురుషో బ్రాహ్మణో బ్రహ్మ - చారీ షోడశవర్షవాన్
అహం యతి రహఙ్కారో, మాతేషాం సూచితోహ్యహమ్ ॥ 67

తా॥ నేను పురుషుడను. బ్రాహ్మణుడను., బ్రహ్మచర్యముతో ,కూడిన సంన్యాసాశ్రమస్థుడను. 16 సం॥ వయస్సులోనున్న అత్యద్భుతలావణ్య సౌందర్య బ్రహ్మవర్చస్సు కల అత్యుత్తమ స్వరూపుడను. నా స్వరూపమును బోధించుటకే, పురుష, బ్రాహ్మణ, బ్రహ్మచర్య-సంన్యాస, షోడశవర్ష కళ మొ॥ వాటికి సృష్టిలో అత్యుత్తమస్థానము కల్పించబడినది. ఇంత మాత్రమున పురుషులు, బ్రాహ్మణులు, బ్రహ్మచారి సంన్యాసులు షోడశవర్ష ప్రాయులు కలవారు ఉత్తములని అహంకరించరాదు. నాకు అవి ఉండుట వలన, అవి ఉత్తమములైనవి.

శ్లో॥ సీతారామాఖ్య నేవథ్య - యోషితో ర్నాధికా పరా
పురుషా బ్రాహ్మణా భూత్వా, నాహఙ్కారా మదన్తికే ॥ 68

తా॥ రామ-సీతా వేషములను ఇరువురు స్త్రీలు ధరించినారు. రాముడు గొప్పవాడని సూచించుటయే నాటక లక్ష్యము. ఇంతమాత్రమునకే రామపాత్రధారి యగు స్త్రీ పురుషుడగునా? గొప్పది అగునా? జీవులందరూ ప్రకృతి స్వరూపులే కాన స్త్రీలు. పురుషుడను నేనే. పురుషుడగు నా ఆధిక్యమును సూచించుటకే పురుషవేషమును ధరించిన జీవుడు నన్ను సూచిస్తున్నాడే తప్ప, తాను నిజముగా పురుషుడని కాదు. కాన, పురుషులు, బ్రాహ్మణులును, అంతరార్థము తెలుసుకొని తాము కూడా స్త్రీలతోను, ఇతరవర్ణముల జీవులతోను సమానులేనని తెలుసుకొని అహంకారమును వీడి వినయంతో ప్రవర్తించవలయును. అహంకారమే నానుండి జీవుని దూరము చేయుశక్తి. వినయమే గొప్పతనమును తెచ్చునది.

శ్లో॥ అనసూయాత్రి నిస్స్వార్థ - త్యాగా ద్దత్తోఽస్మిసేవకః
నిరూపణ మదృష్ట్వా హి, ధన్యావిశ్వస్య మత్తతాః ॥ 69



తా॥ అత్రి అనసూయలు తమ తపశ్శక్తిని సదా లోకక్షేమార్థము జీవులనుద్ధరించుటకే వినియోగించిరే తప్ప తమ స్వార్థానికి ఏనాడూ ఉపయోగించలేదు. వారిలో అణువుఅణువునా స్వార్థరహితమైన, సర్వజీవోద్ధరణమను స్వామి సేవాకార్యములో పాల్గొనుటయే తప్ప ఏ ప్రతిఫలాన్నీ ఆశించలేదు. జీవుల శ్రేయస్సుకై , తమ మమకారాలను త్యాగముచేసి, నేను వారి ఆశ్రమములను వీడునపుడు నన్ను సాగనంపినారే తప్ప, వారు స్వార్థముతో నన్ను తమ వద్దనే ఉండ నిర్బంధముచేయలేదు. ఎన్ని కష్టములు కల్గిననూ వారు నాయందు ప్రేమను వీడలేదు కావుననే వారికి పుత్రుడిగా అనగా వారి ఆజ్ఞావిధేయుడగు సేవకుడిగా నన్ను నేను దత్తము చేసుకున్నాను. నాదైవత్వమును నిరూపించినపుడు నన్ను చూచి నమ్మినవారికన్ననూ నిరూపణము చూడకుండా నమ్మినవారు ధన్యులు. అట్లే నావలన లాభమును పొంది నన్ను ప్రేమించువారికన్ననూ, నా వలన నష్టమును పొందియు నన్ను ప్రేమించువారే నిజమైన భక్తులని నేను గుర్తింతును కాన ధన్యులు.

శ్లో॥ వేదాద్యై ర్బాహ్యముచ్యేత, నాన్తరం రూపమద్భుతమ్
ప్రేమాది మమ మన్త్రాచ్చ, దత్తో బలిపశు శ్శ్రుతే ॥ 70

తా॥ నా బాహ్య సౌందర్యమును వేదాలు, ఋషులు, దేవతలు, ప్రయత్నించి వర్ణించగలరేమో కానీ, నా ఆత్మ సౌందర్యమగు ప్రేమ, కరుణ, త్యాగము, సత్యము, ధర్మము మొ॥ వాటిని ఎవ్వరునూ వర్ణించలేరు. నాభక్తుల పాపకర్మల శిక్షలకు నన్ను నేను బలి పశువుగా దత్తము చేసుకుంటాను. కాన, నన్ను దత్తుడంటారు "పురుషుని పశువుగా బంధించిరి" అన్న శ్రుతికి ఈ అర్థము కూడ గలదు.

శ్లో॥ ఫలాన్యనుభవామ్యేవ, వినా దైవత్వమార్తవాక్
పశ్య త్యాగాదిరూపం మే, ధర్మదేవో న వఞ్చితః ॥ 71

తా॥ నాభక్తుల పాప శిక్షలను అనుభవించునపుడు దైవత్వమును కోల్పోయి, నేను సామాన్య మానవుని వలె, ఆ శిక్షలను బాధతో అనుభవిస్తాను. నా దైవత్వము నుంచుకొని, దైవశక్తితో శిక్షను అనుభవిస్తున్నా బాధ పడకుండా ఉండగలను. కానీ అట్లు చేసినచో అది శిక్షానుభవము కాదు కాన, ధర్మ దేవుని మోసగించినట్లు అగును. కాన నా ఆత్మ

సౌందర్యమగు కరుణ, త్యాగము, ధర్మము, సత్యములను గమనించుము. ఆశిక్షానుభవసమయంలో, నాఅవతారశరీరమును దైవత్వము విడనాడగా, మానవునివలె "దేవా! నన్నేల విడనాడితివి?" అని నేనూ విలపిస్తాను. ధర్మదేవుని ఎప్పటికినీ మోసగించను.

శ్లో॥ ద్వానా త్పూర్వ మదత్తశ్చే, ల్లోకదృష్ట్యై న వర్తతే
అనన్తోऽనాదిరబ్రహ్మ, హీనదృశ్యోऽపి దీయతే ॥ 72

తా॥ లోకానికి దత్తమైనపుడు మాత్రమే దత్తుడైనాడు కాన, దానికి పూర్వము దత్తుడు కాదు కాన, దత్త శబ్దము కూడా ఆదిని కలిగినట్టి, "ఈయబడిన" అను లక్షణాన్నే భోధిస్తున్నది. అందువలన ఇది కూడా గుణాన్ని బోధించే శబ్దమేనని పూర్వ పక్షము చేయరాదు. దత్తుడైన తరువాత, దత్తుడు కాకపోవుట ఎప్పటికినీ కాదు కాన, దత్త శబ్దము అనంతార్థమే కదా. అనంతము అనాదియే కావలయును కాన, దత్తశబ్దము అనాదియను అర్థమే కలిగియుండవలయును కదా. లోకమునకు సాక్షాత్కరించినపుడే లోకదృష్ట్యా బ్రహ్మమునకు అస్తిత్వము కలిగినది. లోకమునకు అందనంతవరకును బ్రహ్మమున్ననూ లోకదృష్ట్యా బ్రహ్మము లేనిదేకదా. అట్టి దశలో దాని అస్తిత్వము అప్రస్తుతము. మరియు, లోకసృష్టి జరుగగనే దాని యందు వ్యాపించి, దానిని ధరించుటచేత, జగత్తుకు దత్తుడైనట్లే గదా. లోకములేనపుడు దత్తము కాలేదు. అట్టి సమయమున దాని గొప్పతనమును గుర్తించు రెండవ వాడు లేడు కాన బ్రహ్మ శబ్దము నిరర్థకమే అగును. రెండవ వస్తువే లేనపుడు గొప్పతనము అను లక్షణము నిరర్థకమగునుగదా. గొప్పతనము లేకుండా, తక్కువవానిగా ఉన్నపుడూ లోకముచే గ్రహించబడి దత్తుడనుచున్నాడు కాన, బ్రహ్మశబ్దము కన్ననూ దత్తశబ్దమే నిత్యము. దత్త శబ్దాంతమైనవుడు బ్రహ్మశబ్దాంతమునూ మేము ప్రదర్శించాము. అట్లే బ్రహ్మశబ్దాంతమైన సందర్భములో దత్త శబ్దనిత్యత్వమును నిరూపించినాము. కాన బ్రహ్మ శబ్దము కన్ననూ దత్త శబ్దమే నిత్యము. అన్ని శబ్దములను నివర్తింపచేసే ఏకత్వస్థితి దత్తశబ్దాన్ని అంతము కావించినా, మరియొక శబ్దాన్ని నిలుపలేదు కాన, అట్టి స్థితి లోకోపదేశానికి, శాస్త్ర సంప్రదాయానికి అసమ్మతము.



శ్లో॥ నాటకం విశ్వమాలీనం, పునర్వ్యక్తం వినోదతః
జీవస్త్వం నాస్తికోऽప్యత్ర, మాऽహన్తా ద్వేష ఏషుతే ॥ 73

తా॥ ఈ సమస్త విశ్వము నా నాటకము-నాకు వినోదదాయకము. దీనిని నాలో లయింపజేసుకొని నేను ఏకాకిగా మిగులగలను కానీ నాకు వినోదమేది? అందుకే ఈ సృష్టిని ఎన్నటికీ ఉపసంహరింపను. నేను విశ్రమించినపుడు ఈ సృష్టి అవ్యక్తస్థితిలో నుండి మరల నేను వినోదించ,ఇచ్ఛగించగనే ఇది మరల యథాతథంగా వ్యక్తమౌతుంది. ("యథాపూర్వమకల్పయత్" శ్రుతి) ఈ నాటకములోని జీవులందరూ సమానులే. ఎవరికిచ్చిన పాత్రను వారు వేయుచున్నారు. కాన, ఎంత పరమ దుష్టుడైననూ, ఎంత నాస్తికుడైననూ, నీతో సమానజీవుడని తెలుసుకొని, వానిని ద్వేషించకుము. ఏ జీవుని చులకనగా చూడకుము. పశు పక్ష్యాది జీవులు, వృక్షాది జీవులూ నీ సమానులేనని తెలుసుకొని గౌరవించుము. నా నాటక రహస్యములను తెలిసిన వాడెవ్వడును అహంకారమును కానీ, ద్వేషమును కానీ పొందడు.

శ్లో॥ క్షుధాऽన్నే చ తమస్సూర్యౌ, దుఃఖ సౌఖ్యే రుచిప్రదే
జ్ఞానినః కష్టమిచ్ఛన్తి, శ్రద్ధా వినయ భక్తిదమ్॥ 74

తా॥ కష్టములు, సుఖములు కన్న ఎంతో గొప్పవి. అవి జ్ఞానదాయకములు. నీ అహంకారమును పోగొట్టునవి. నన్ను ఉపాసించునట్లు చేయునవి కష్టములే. కష్టమే లేకున్న, సుఖము యొక్క రుచి తెలియునా? ఆకలి లేని భోజనము, చీకటి లేని సూర్యోదయమును ఆనందకరములగునా? కష్టము అనంతరమే సుఖము యొక్క ఆనందమునసుభవించగలవు. కష్టములేని నిరంతరసుఖము, ఆకలిలేని నిరంతర భోజనమువలె, చీకటిలేని నిరంతర సూర్యప్రకాశము వలె కష్టదాయకములే అగును. కష్టములేకుండా సృష్టిని నేను నడిపించగలను. కానీ అట్టి సృష్టి జీవులకు వెగటు కలిగించి పరమ దుఃఖమునొసగును. జ్ఞానులు నిత్యము కష్టములనే కోరుదురు. ఏలనన కష్టములలోనే నిత్యము అహంకారరాహిత్యము, చురుకుతనము, వినయము, దైవారాధన, భక్తియు జీవించగలవు.

శ్లో॥ అనూహ్యం పరమం, చిత్రం బ్రహ్మ దత్త మహం చ తే
ప్రత్యక్షం వేద నిర్దిష్టం, రూపం హిత్వా సదా పతేత్॥ 75

తా॥ అతివిచిత్రమైనదీ, ఊహకు సహితము చిక్కనిదీ, అన్నింటికన్నను గొప్పది అను అర్థము కల బ్రహ్మ శబ్దముతో చెప్పబడినదీ, నీకు దత్తమైనదీ అగు ఈ రూపము నేనే. ఈ రూపము వేదముచేత నీకు నిర్దేశించబడినది. నీకు కన్నులు చూచునట్లుగా వేదోక్త బ్రహ్మ నిర్వచనము ప్రత్యక్షమైనది. ఇట్టి నన్ను త్యజించినచో ఎవ్వడైననూ శాశ్వతంగా పతనము చెందును. శాశ్వతముగా నష్టపోవును.

ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం
శ్రీ దత్త వేదోక్త పరబ్రహ్మ రహస్య యోగోనామ
నవమాధ్యాయః

శివ ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## దశమాధ్యాయః

## శ్రీ దత్తనిస్స్వార్థ సేవాఫలయోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ:

శ్లో॥ అష్టసిద్ధిరియం స్రష్టు, ర్మమ సృష్టి శ్శ్రితాయ హి
దీయతే లోకకల్యాణ - సేవకాయ యశః ప్రదమ్॥ 1

శ్రీ దత్త భగవానులు వచించిరి:

తా॥ అష్టసిద్ధులూ, సృష్టికర్తయగు నా సృష్టియే. నన్ను ఆశ్రయించు నా సేవకునిగా లోకంలో జీవులనుద్ధరించు నా సేవాకార్యములో నున్న వానికి, కీర్తిని కల్గించు ఈ సిద్ధులను నేనే ఇచ్చుచున్నాను.

శ్లో॥ అష్టసిద్ధి ర్యశోదాత్రీ, భోగ మాత్రం తు దైహికమ్
పతన్తి యశసా భోగై, ర్దగ్ధా వాతానలైరివ॥ 2

తా॥ ఈ అష్టసిద్ధులు కీర్తి నిచ్చును. ఐహికములు, భోగమునిచ్చును. కీర్తిచేతను, భోగములచేతను జీవులు పతనమగుదురు. గాలితో కూడిన అగ్ని చే దహించబడినట్లు, ఆ రెండునూ చేరినచో భస్మమే అగుదురు. (కనుక అష్టసిద్ధులను కోరరాదనియు, అష్టసిద్ధులు ప్రాప్తించిన ఎడల అట్టి జీవుడు అహంకరించి పతనమగునని హెచ్చరిక చేయబడినది.)

శ్లో॥ ఉత్థాస్యతి హ్యహఙ్కార, స్తాభ్యాం బీజామ్భసా తరుః
అహం బ్రహ్మేతి మత్వాఽయం, శ్రితైః పాతాళపాతితః ॥ 3

తా॥ నీటితో కూడిన బీజమునుండి బయలుదేరిన మహా వృక్షమువలె, ఆరెండింటి నుండి (కీర్తి, భోగము) అహంకారము బయలుదేరును. దానితో "నేనే పరబ్రహ్మము" అనుకొనుచు, అతడు, తన ఆశ్రితుల స్తుతుల చేత పాతాళమునకు త్రోయబడును.

(అనగా కీర్తి, భోగముల వలన అహంకారము ప్రవేశించి తానే పరబ్రహ్మ మను అహంకారము చేతనూ, ఆశ్రితుల పొగడ్తల వల్లనూ, పాతాళమునకు త్రోయబడునని భావము)

శ్లో॥ అష్టసిద్ధి రపి బ్రహ్మ - శక్తి రేవా శ్రితాయ చ
దీయతే న త్వహన్తాయై, నాస్తికోద్ధరణార్థినే॥ 4

తా॥ అష్టసిద్ధులూ బ్రహ్మము యొక్క శక్తులే. నాస్తికులను ఆస్తికులుగా మార్చుటకు నా సేవకులకు వాటి నిత్తును. అంతే తప్ప, వారి అహంకారమును పెంచి, వారిని పతనమొందించుటకు కాదు.

శ్లో॥ అదేయం లక్షణం త్వేకం, జగత్సృష్టి స్థితి క్షయాః
బ్రహ్మణ స్తేన జానీయా, ద్బ్రహ్మ వా బ్రహ్మసేవకః॥ 5

తా॥ ఎవరికిని ఈయబడని బ్రహ్మలక్షణమొకటి కలదు. అదేమనగా - జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయుట. దానిని ఆధారముగ చేసుకొని, ఇతడు బ్రహ్మమా? లేక బ్రహ్మము యొక్క సేవకుడా? (అనగా నా యొక్క సేవకుడా?) అనునది తెలుసుకొనవచ్చును.

శ్లో॥ జ్ఞానవాక్యాని నిష్కామ - కర్మాణి చ నిరన్తరమ్
అపార కరుణా చేతి, దత్త బ్రహ్మ గుణాస్త్రయః ॥ 6

తా॥ జ్ఞానవాక్యములను ప్రవచించుట, స్వార్థములేని నిరంతర కర్మలు, అపారమైన కరుణ-ఈమూడు దత్త బ్రహ్మము యొక్క ముఖ్య గుణములు.

శ్లో॥ సిద్ధిభి ర్నభవే ద్దత్తో, వినాతై స్త్రిగుణై ర్నరః
సృగాలో న భవేద్వ్యాఘ్రు, స్త్వచా హీనపరాక్రమః ॥ 7

తా॥ అష్టసిద్ధులవలన జీవుడు దత్త బ్రహ్మము కాదు. పైన చెప్పిన మూడు గుణములున్ననే దత్త తత్త్వమున్నట్లు లెక్క . కేవలము చర్మముపైగల మచ్చలచేతనే నక్క పులికాదు. పులి పరాక్రమము నక్కకు లేనపుడు పులికాదు గదా!



శ్లో॥ సాధర్మ్యాభిధ మద్వైతం, సారూప్యం నిత్య సన్నిధి
సాహచర్యాఖ్య సాయుజ్యం, దీయతేఽవసరే మయా॥ 8

తా॥ "సాధర్మ్యము" అను పేరుగల అద్వైతకైవల్యము, "సారూప్యము" అను పేరుగల విశిష్టాద్వైత మగు నిత్య సన్నిధి, సంయోగవియోగములు కల "సాయుజ్యము" అను పేరు గల ద్వైతము. అవసరము వచ్చినప్పుడల్లా నా సేవకులకు నాచే ఈయబడును. వాటిని అడుగ పనిలేదు. నేనే అవసరమును అనుసరించి ఇత్తును అని తెలియుము.

శ్లో॥ న కామ్యం తత్పురోముక్త, స్సాలోక్యం, నాస్తికాశయాత్
భగవ ద్గురుణా గచ్ఛే, త్సామీప్యం తత్పరం న దృక్ ॥ 9

తా॥ ఈ మూడు (అనగా సాధర్మ్య, సారూప్య, సాయుజ్యములు) జీవుడు కోరరాదు. అవి నేనీయవలసినవి. జీవుని కర్తవ్యము ఎంతవరకు అన్నచో, భగవానుడు ప్రదర్శించు అష్టసిద్ధులను చూచి నాస్తికబుద్ధిని విడనాడి, ఆస్తికుడై గురు సహాయముతో నా సమీపమునకు వచ్చుటయే. భగవానుని వలన సాలోక్యము, గురువువలన సామీప్యము సిద్ధించును. ఈ రెండింటికి మించిన దానిపై దృష్టినుంచరాదు. (భగవానుడు తన సిద్ధులను ప్రదర్శించి నాస్తికుని ఇహలోకము నుండి, దైవమును విశ్వసించుటయను పరలోకమునకు ప్రవేశింపచేయుటయే సాలోక్యము. అనగా నాస్తికుడు, ఆస్తికుడుగా మారుట. ఇక, సామీప్యము అనగా గురువు ఆస్తికుని, దైవసమీపమునకు చేర్చుట)

శ్లో॥ సమీపవర్తినే దద్యాం, సాయుజ్యం దాస్యకర్మణా
మద్దత్తం ద్వైతదాసత్వం, ఫలమేవ న సాధనమ్॥ 10

తా॥ నా సామీప్యమునకు వచ్చిన వానికి, ముందు నా సేవాకర్మను ఇత్తును. నా సేవకుడుగా మారుట కూడ నేను అనుగ్రహించిన ఫలమేకాని, నా సేవ, సాధనము కాదు. అనగా స్వామి సేవ, సాధన యొక్క ఫలమే తప్ప సాధన కాదు. ఇది ద్వైతముక్తి ఫలము. ద్వైతములోని స్వామిసేవక భావము, ముక్తి స్వరూపమే.

శ్లో॥ విశిష్టాద్వైతసారూప్యం, నిత్యసన్నిహితాఙ్గవత్
దత్త మాత్మీయ భావేన, ప్రియస్య పరిరక్షణమ్ ॥ 11

తా॥ ఇక, విశిష్టాద్వైత ముక్తిఫలము కూడ ఈయబడును. దీనిలో నేను నాసేవకుని, ఒక వ్యక్తి తన ప్రియమైన శరీరమును నిత్యము "వాడి" అను భావముతో రక్షించుకొన్నట్లు, నా దాసుని "నావాడు" అనుభావముతో నిత్యము రక్షింతును. జీవాత్మనుండి శరీరము విడదీయరాని విధముగా, ఇందులో నా దాసుడు నా నుండి విడదీయబడలేడు.

శ్లో॥ అవిశ్య క్వచిదద్వైత - కైవల్యేన హి దృశ్యతే
లోకే భాషే తదాస్యేన, సాధర్మ్యేఽ హ మితి బ్రువన్॥ 12

తా॥ ఒక్కొక్కసారి అద్వైత కైవల్య ముక్తి ఫలమును కూడ ఇచ్చెదను. నా సేవకుని ఆవేశించి వాని ముఖము ద్వారా "నేను దత్తుడను" అను మాట్లాడుదును. ఈ విధముగా నేను ఆవేశించుట, (పూనకము) లోకమున కనపడుచునే యున్నది కదా. కాన, అద్వైతకైవల్యము (ముక్తి) కూడా కలదు.

శ్లో॥ ముక్తిత్రయం సర్వజీవ - సామాన్యం న తథేరితమ్
ఆచార్యై శ్చోదనాలక్ష్యై, ర్మదనుగ్రహ సిద్ధగమ్ ॥ 13

తా॥ ఈ అద్వైత - విశిష్టాద్వైత - ద్వైతముక్తులు మూడును కేవలము సాధన పూర్తి చేసుకొని, నా అనుగ్రహము పొందిన వారికే వర్తించును తప్ప, సర్వ జీవులకూ వర్తించవు. ఆచార్యులు ముగ్గురును, సర్వజీవుల సాధనలో ప్రేరేపించి ఉత్సాహమును కల్పించుటకై సర్వజీవులను ఈ ముక్తి ఫలములను పొందియున్నట్లు పలికినారే తప్ప, సర్వజీవులును సాధన లేకయే ముక్తులు కారు.

శ్లో॥ ఆవేశానన్తరం దాస, స్స్వబుద్ధి ముపయాస్యతి
బుద్ధిం గత్వాఽ ప్యహందత్త, ఇతి వక్తా వినశ్యతి॥ 14

తా॥ నా ఆవేశము (అనగా నేను) వెడలి పోయిన తరువాత, నా సేవకుడు మరల తన జీవబుద్ధిని తాను పొందగలడు. అట్లు పొందిన తరువాత కూడ, "నేను దత్తుడను" అని స్వయముగా పలికినచో, వాడు అహంకారము వలన నశించును.



శ్లో॥ ఆదర్శదాసో హనుమా, నావేశేఽపి స్వబుద్ధిమాన్
నిత్యాహఙ్కార జేతాఽయం, దాసదాసోఽస్మి తజ్జితః॥ 15

తా॥ నా సేవకులలో ఆదర్శప్రాయుడు హనుమంతుడు. నేను ఆవేశించిన సమయములో కూడా తాను జీవుడ నను బుద్ధిని కలిగి, సదా అహంకారమును జయించిన వాడు కాన, హనుమంతునికి నేను నిత్యము దాసుడనై యున్నాను. నేను దాసదాసుడను గదా. అందువలన హనుమంతుని చేత, 'నేను జయించబడితిని. (శ్రీరామాజనేయయుద్ధమున హనుమంతునిచే శ్రీరాముడు జయించబడెనని కథకు తాత్పర్య మిదే.)

శ్లో॥ యేన యేన హి భావేన, మద్దాసోమా ముపస్థితః
తేన తేనైవ భావేన, దాసంచాహ ముపస్థితః 16

తా॥ నా దాసుడు ఏయే భావముతో నన్ను సమీపించునో, నేనూ ఆయాభావము తోనే వానిని సమీపింతును. కాన, సదా దాసులకు నేను, సదా దాసుడను.

శ్లో॥ నిత్య దాసస్య దాసోఽహం, నిత్యం స్యా త్కిమితః పరమ్?
అద్వైతాదపి సోపాన, మధికం సోఽధిరోహతి॥ 17

తా॥ నాకు నిత్యము దాసునిగ నుండు వానికి, నేను నిత్యము దాసునిగ ఉందును. ఇంతకన్న గొప్పస్థితి ఏమున్నది? ఇది అద్వైతకైవల్యము కన్నను మించిన మెట్టు (ముక్తి). దానిని నా సేవకుడు ఎక్కియున్నాడు. కాన, నా సేవకునిగా మారుట కన్న మించిన ముక్తి లేదు.

శ్లో॥ త్యక్త్వా మమ నరాకారం, పీఠం న్యూనవపుర్ధరా :
కాలభైరవ గరుడ - హంస నన్దీశ్వరాదయః ॥ 18

తా॥"స్వామి ధరించిన నరాకారమును మనము ధరించినచో, ఆయన ఎక్కిన పీఠమును మనము ఎక్కినట్లుండును", అని తలచి, నా మానవాకారమును గ్రహించక, మానవాకారము కన్న తక్కువయగు పశు పక్ష్యాది రూపములను, నా ఉత్తమ దాసులగు

కాలభైరవుడు, గరుత్మంతుడు, హంస, నందీశ్వరుడు, హనుమంతుడు మొ॥ వారు ధరించియున్నారు. వీరి ఆకారముల అంతరార్థ మిదే.

శ్లో॥ శక్తి రాశికరో యోగ, స్స్మృతౌ దుర్వ్యయ నిగ్రహః
జీర్ణకోశో మితః కాలః, క్రియా శక్తి ర్మితాయుషః ॥ 19

తా॥ నా సేవకుడు ఎంతో శక్తి మంతుడై ఉండవలయును. ఆ శక్తి , యోగము చేతకాని, సిద్ధించదు. యోగమనగా ఏకీకరణము. సంసారములో అనవసరముగా జరుగు శక్తి వ్యయము నరికట్టి, శక్తిని ఏకీకరణము చేసుకొని శక్తి రాశిగా తాను ఏర్పడుటయే యోగము. శక్తి స్వరూపమే కాలము. కాలము క్రియారూపము. క్రియశక్తి రూపము.కాన, కాల, శక్తులను అనవసరముగా వ్యయము చేయుట బూడిదలో పన్నీరును పోసినట్లు, ఏలననగా అనంతమైన ఆహారమును తిని, అనంతశక్తిని నీవు ఉత్పాదించలేవు. నీ ఆయుష్యము (కాలము)అత్యల్పము. కాన, పరిమితమైన శక్తి గల జీర్ణకోశము వలన, పరిమితాయుర్దాయము వలనను కాల శక్తులు పరిమితములు. వాటిని వ్యర్థము చేయరాదు.

శ్లో॥ సంన్యాస ఉత్తమో యోగః, కార్యార్థ స్త్రీ సుత చ్యుతః
నకిఞ్చిత్కోZపి మత్తోZస్మి, దాసస్తత్పాద ధూళిమాన్॥ 20

తా॥ ఇందులో సంన్యాసయోగము అత్యుత్తమము. ఇది అందరికీ సాధ్యము కాదు. సాధనలో ఎన్నో జన్మల పరిపాకం వల్ల కానీ సంన్యాసము సిద్ధించదు. వీరు తమ కర్తవ్యములను సైతము త్యజించి, నా పై పూర్ణవిశ్వాసముతో నా పై భారమును పడవేయుదురు. వీరు తమకు లభించిన గృహాదిధనములను నా కొఱకై పరిత్యజింతురు. స్త్రీ యోగము నందు జరుగు సంతోష-ఉద్రేకమున శక్తి వ్యయము జరుగును. కాన, వీరు గృహస్థాశ్రమమును స్వీకరించరు.ఉన్న బంధువుల బంధములనే తెంచుకొందురు కాన, కొత్త బంధములగు పుత్రాది వరములను కోరరు. ఇంత ఏల? నేను తప్ప రెండవ వ్యక్తి కానీ, రెండవ వస్తువుకానీ, వీరి దృష్టిలో ఉండదు. ఇట్టి పవిత్రులైన వీరి పాదముల ధూళిని నేను శిరస్సున ధరించి, వీరికి నిత్యము దాసుడనై ఉందును.

శ్లో॥ వస్తు జ్ఞానానుగా దృష్టి, రనుభూతోZస్మి చర్చయా
అవేద్యఇతి తద్బ్రహ్మ - జ్ఞాన మాశ్చర్యమౌనవాక్॥ 21



తా॥ ఇట్టి స్థిరదృష్టి నాయందు ఏర్పడుటకు కారణమేమనగా- వీరికి నా జ్ఞానము అనగా బ్రహ్మజ్ఞానము పూర్తిగా ఉండుటయే. వస్తువును గుర్తించి పూర్తిగా తెలిసిన వానికే వస్తువుపై ఆసక్తి ఏర్పడును. వస్తు జ్ఞానము కొంచెము ఉన్నచో వస్తువుపై ఆసక్తి కొంచెమే ఏర్పడును. అనేక విధములుగా నన్ను చర్చించి, ఏవిధముగాను నేను తెలుసు కొనుటకు వీలుకానివాడను అని అనుభవ పూర్వకముగా తెలియుటయే నిజమైన పరిపూర్ణమైన బ్రహ్మజ్ఞానము. నన్ను గురించి ఎంతో ఆశ్చర్యముతో వచించుచూ, నన్ను తెలుపుటకు వీలు కాని స్థితిని, తన మౌనముతో జ్ఞాని సూచించును. ఇదే జ్ఞానమార్గము.

శ్లో॥ అత్యాగీ మత్కృతే గేహీ, కార్యకామోZస్మివా ZZధికః
సమో వా యోగ ఏతేభ్యః, కాలశక్తి వ్యయార్గళః॥ 22

తా॥ లోకములో దాదాపు అందరునూ మధ్యములుగా నున్నారు. వీరు కర్మమార్గాధికారులు. అధికములైన అనవసరమైన, ఆశలను స్వార్థములను తగ్గించుకొనగలరే కాని కర్తవ్యములను త్యజించలేరు. గృహములను విడువలేరు. భార్యా పుత్రులను త్యజించలేరు. కాన, వీరికి కర్తవ్యములు తప్పవు. ఈ కర్తవ్యముల నిర్వహణలో సంబంధించినంతవరకు నన్ను కోరుచుందురు. వీరికి నా గురించిన బ్రహ్మజ్ఞానము కొంతవరకే ఉండును. కాన, నన్ను భార్యా పుత్రులతో సమంగా లేక కొంత అధికంగా చూతురే తప్ప, నా కొరకు వారిని త్యజించలేరు. వీరు గృహస్థులు. కాన, వీరి విషయములోనే ఉపదేశము అవసరము. వీరికి యోగము ఎంతో ప్రధానమైన సాధనము. కర్తవ్యములను మించి అధికముగ శక్తిని కాలమును వ్యయము చేసుకొనకుండా వీరికి యోగమును ఉపదేశించుచున్నాను.

శ్లో॥ అల్పజ్ఞా గురవోZ హన్తా - ప్రమాదా స్సిద్ధి సంభ్రమాః
అనేక సంశయాః కార్య - మాత్రా అన్య న్నివృత్తిగాః॥ 23

తా॥ ఈ మధ్యములే చాలా ప్రమాదకారులు. వీరు సులభముగా ప్రమాదములో పడి పతనము చెందుదురు. వీరు పూర్ణజ్ఞానులు కాదు. అజ్ఞానులు కాదు. కొంచెము తెలియగనే అహంకరింతురు, కొంచెము జ్ఞానముతోనే ఉపదేశకులై గురువులై కీర్తిని కోరుదురు. వీరు సిద్ధులపై ఎక్కువ భ్రమను కలిగి వాటిని పొంద ఉవ్విళ్ళూరుచుందురు. వీరు అనేక సంశయములతో సతమతమగుచుందురు. వీరికి కర్తవ్యములను మించి

అనవసరమైన వాటి యందు కాలశక్తులను వృథావ్యయము చేయరాదని ఉపదేశించ వలయును. ఇక్కడ కర్తవ్యము నాచరింపుమని వీరికి విధించపనిలేదు. ఎటూ వారి అవస్థననుసరించి వారు కర్తవ్యముల నాచరింతురు. కర్తవ్యములకు మించిన వాటి నుండి నివృత్తియే వీరికి విధించబడినది.

శ్లో॥ స్వస్థితా ఉత్తమే లక్ష్యే, స్వలక్ష్యేऽహంతయా చ్యుతాః
అధమానాం బ్రహ్మ భవే, దైహికానాం హి సాధనమ్॥ 24

తా॥ వీరుపైన చెప్పిన ఉత్తమ సంన్యాసులను తన లక్ష్యములో ఉంచుకొన్నచో, కనీసము వారి స్థితినుండి, అధమస్థితికి జారకుండ ఉండగలుగుదురు. వారి స్థితినే ఉత్తమ స్థితిగా భావించుకున్నచో అధమ స్థితికి వెంటనే, అహంకారము వలన పతనమగుదురు. ఇక, అధములు బ్రహ్మమును గురించి ఏ మాత్రమూ జ్ఞానము లేక, తమ ఐహికములగు కోరికలను సాధించుటకు, బ్రహ్మము మంచి శక్తి మంతమైన సాధనముగా భావింతురు. ఇదే వీరికి బ్రహ్మమును గురించి ఉన్న జ్ఞానము!

శ్లో॥ స్వయం సాధన విభ్రాన్తా, నాస్తికా అధమాధమాః
వృథా తద్ధర్మధీః కర్తృ - మహాపాప కృతఘ్నతః॥ 25

తా॥ ఇక అధమాధములు, బ్రహ్మమున్నదని అంగీకరించని వారు. వారు ఐహికములను తమ ప్రజ్ఞతో సాధించుకొంటిమని భావించి నాస్తికులై కేవల భోగులుగా ఉందురు. వీరిలో కొందరు ధర్మాత్ములున్నారు కానీ, బ్రహ్మరహితమైన వీరి ధర్మాచరణము బూడిదలో పోసిన పన్నీరు వలె వ్యర్థము. ఏలననగా ఈ భోగములను సృష్టించి జీవులను రమింపచేయుచున్న పరమాత్మని అంగిరించక పోవుట అను కృతఘ్నత మహా పాపము. మహాపాపుల పుణ్యకార్యములు వ్యర్థములు.

శ్లో॥ సర్వ బ్రహ్మ వ్యయః కార్య - త్యాగీ సంన్యస్త ఉత్తమః
కర్తవ్యా దధిక త్యాగీ, మధ్యమో గృహ వర్తనః॥ 26

తా॥ ఉత్తముడు బ్రహ్మమునకే సమస్తకాలశక్తులను వ్యయము చేయును.ఇతడు కర్తవ్యములను సైతము త్యజించిన సంన్యాసి. మధ్యముడు కర్తవ్యములకు పోను



మిగిలిన కాలశక్తులను బ్రహ్మమునకు వ్యయము చేయును. ఇతడు కర్తవ్యములకు మించిన ఆశలేనివాడు. అనగా అన్న పాన వస్త్రములకు కుటుంబ పోషణ వరకే పరిమితమైన వాడు.

శ్లో॥ కర్తవ్యాదిక మర్థార్థీ, సంన్యాస వ్యత్యయోऽధమః
తరత్యధిక సంన్యాసీ, న వ్యర్థ స్త్వధమాధమః॥ 27

తా॥ అధముడు బ్రహ్మము కొరకు ఏ మాత్రము కాల శక్తులను వ్యయము చేయక, కర్తవ్యములకు మించి అనగా అన్న పాన వస్త్రాదులున్నా, కుటుంబపోషణ ధనము ఉన్ననూ, అత్యాశాపరుడై అధికముగా సంపాదిచుచూ, తన సమస్త కాలశక్తులనూ అర్థము కొరకే వ్యయము చేయువాడు. ఇతడు సంన్యాసికి పూర్తిగా విరుద్ధుడు. అనగా సంన్యాసి సమస్త కాలశక్తులను బ్రహ్మపరంగా వ్యయము చేయగా, ఈ అధముడు ధనము కొరకు సమస్తకాలశక్తులను వ్యయము చేయువాడు. ఇట్టి అధముడైనా, తన అధికార్జితమును దైవము యొక్కసేవకు సమర్పించినచో తరించును. కాని అధిక ధనార్జనకు సైతం కాలశక్తులను వ్యయపరచక, వృథాగా, కాలశక్తులను వ్యయపరచువాడు. (వ్యసనపరుడు) అధమాధముడు. వీడు ఎన్నటికీ తరించడు.

శ్లో॥ కర్తవ్యాధిక వైయర్థ్యా, త్సర్వ వైయర్థ్య భేదతః
పూర్వేహి పశపక్ష్యాద్యాః, పరే కీటాది యోనయః॥ 28

తా॥ ఈ అధమాధములలో రెండు తెగలవారున్నారు. ఇందులో ఉత్తములు కర్తవ్యముల నాచరించి, మిగిలిన కాలము - శక్తినీ వృథా వ్యయము చేయుదురు. వీరు పశు పక్ష్యాదిఉత్తమ జన్మలను పొందుదురు. ఇక రెండవ వారు ఇందులోను అధములు. వీరు కర్తవ్యములను సైతము ఆచరించక వ్యసనములతో శక్తి-కాలములను వ్యర్థము చేయువారు. వీరు ఇహలోకమునకు పరలోకమునకు గూడ ఎందుకు పనికిరాని వారు. ఇట్టి వారు క్రిమి, కీటాది అధమ జన్మలను పొందుదురు.

శ్లో॥ స్మర్తృగామి వరై ర్ధర్మా, త్కార్యవీర్యవ దాపతేత్
ఇతి మాయా దుష్ప్రచారై, ర్మాం ఛాదయతి నైహికైః॥ 29

తా॥ నేను ఎక్కువ ప్రసిద్ధికి రాని కారణమున్నది. నన్ను "స్మర్తృగామి" అంటారు. అనగా" స్మరణ మాత్రసంతుష్టుడను. అందువలన భక్తులు నానుండి అమోఘవరాలు పొంది కార్తవీర్యార్జుని వలె అహంకరించి పతనమగుదురని, మాయ నన్నావరించి, నేను ఐహికములను భంగపరుస్తానని దుష్ప్రచారమును కల్పించి, ఐహికార్థులను నా నుండి దూరము చేసినది. ఇదీ నా పరీక్షయే!

శ్లో॥ నిన్ద్యాచారేక్షిత స్త్వక్షా, ద్భవామి పరమ ప్రియః
ద్వేషీ స్తౌతి మహాశ్చర్యా, దన్యథా పరమా న ముత్॥ 30

తా॥ నేను నింద్యాచారునిగ పరమ నికృష్ట రూపాలలో గోచరించి, నీచేత ద్వేషదూషణములను పొంది, తరువాత నాస్వరూపంతో సాక్షాత్కరించగా, నీకు నాపై కలిగే ఆనందము అనంతము! ఎండలో నుండి నీడకు వచ్చినపుడే సుఖాతిశయముంటుంది. అదే నోటితో నన్ను స్తుతింపచేయునపుడు నీకు కలిగే ఆనందము ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. అట్లు కాక సదాచారునిగ కనిపించి సాక్షాత్కరించినచో ఆనందాతిశయమంతగా ఉండదు. (అనగా నేను నికృష్టరూపాలలో కనిపించుట కూడ జీవులకు ఆనందాతిశయమును ప్రసాదించుటకే).

శ్లో॥ మద్య వేశ్యారతో బోధం, కరిష్యామి గురు స్సదా
ధనారోగ్య యశోహారి, నముఞ్చ న్భక్తి రీదృశీ॥ 31

తా॥ నేను మద్యపాన, వేశ్యాలోలునిగ దర్శనమిత్తును. నా దర్శనమెప్పుడునూ జ్ఞానబోధకమే, గురు స్వరూపమే. మద్య వేశ్యలు ఎట్లు నీ ఆరోగ్యమును, ధనమును, కీర్తిని పోగొట్టుచున్ననూ వాటిని వదలుకొనలేవో, అట్లే నా ఆరాధనము వలన కష్టములు కలిగిననూ నన్ను విడనాడకుంటుటయే నిజమైనభక్తి యని, నా దర్శనము నీకు జ్ఞానమును బోధించుచున్నది.

శ్లో॥ నిత్య బన్ధే న గణనా, సహజా త్పితృపుత్రయోః
న పూజా ఫల వాణిజ్యం, సేవస్వాఫల కామవాన్ ॥ 32



తా॥ నాతో శాశ్వత ప్రేమ బంధమును పెట్టుకొన్నచో, నీవు ఎంత పూజచేసినావు? నేనెంత ఫలమునిచ్చితిని? అను అంశమే రాదు. అట్టి బంధమున్నచో నీవు ప్రతిఫలము కొరకు, ప్రతిసారీ పూజించనక్కరలేదు. ఒక్కొక్క సారి ఒక్కొక్క ఫలమునకు ఒక్కొక్క పూజను చేయనక్కరలేదు. అది వ్యాపారమగును. నీ కుమారుడు నిన్ను ఆరాధించుట లేదు. ధూపదీప కర్పూర నీరాజనములనిచ్చుట లేదు. అయినా, సదా అతని శ్రేయస్సుకై కృషిచేయుచున్నావు. నీకు అవసరము కల్గినపుడు అతడు నిన్ను సేవించుచున్నాడు. అతడు సేవించునపుడు ఆసేవలకు నిన్ను ప్రతిఫలము కోరుటలేదు. మీఇరువురి మధ్య ఏలెక్కయు ఉండదు. ఏల? మీ ఇరువురి మధ్య సహజ ప్రేమ ఉన్నది. అట్లే, నాకును అవసరము వచ్చినపుడు, నా సేవకునిగా మారి, ప్రతిఫలమును కోరకుండా నిస్వార్థముగా నన్ను సేవించుము.

శ్లో॥ నామ సఙ్కల్ప యాత్రార్థ - త్రయాయాపత్య శిక్షణే
మితార్థీ పరమర్థేమే, గృహస్థోఽపి యతిర్మతః॥ 33

తా॥ ఎవడైతే నామమాత్రసంకల్పములతో, కేవలము శరీరయాత్రవరకే అనగా కూడు-గుడ్డ-నీడ వరకు మాత్రమే కర్మ చేయుచు, మిగిలిన కర్మను నా కార్యక్రమమునకే వినియోగించుచూ, సంతానమునకు భార్యకును, పోషణ-విద్యా-బుద్ధ్యాది రక్షణము వరకు మితమైన ధనము నార్జించుచూ, అంతకు మించిన కాలశక్తులను నా సేవా కార్యంలో సమర్పించుచున్న వాడు, గృహస్థుడైననూ సంన్యాసిగనే గణించవలయును. సర్వజీవులను ఉద్ధరించుటయే నా కార్యక్రమము.

శ్లో॥ తనుం త్యక్త్వా పునర్జాతో, మద్దాసో భవతీహ హి
అహ మత్రైవ భృత్యస్స్వ్య, జ్జీవన్నేవేహ కర్మణి ॥ 34

తా॥ ముక్త జీవుడు శరీరమును వదలి, పైలోకమునకు పోయి, అక్కడ నన్ను చూడలేక, మరల జన్మించి, ఇక్కడ నా సేవకుడగుచున్నాడు. నేను పైలోకములలో లేను. ఈ లోకములోనేఉన్నాను. కాన, ఇక్కడనే, జీవించియుండగనే, నా కార్యక్రమమున పాల్గొని సేవకుడు కావాలి. కాన, మరణమునకు ముందే ముక్తుడగుట వివేకవంతుని లక్షణము. (కనుక పరోక్షభ్రమలను విడువుము అని భావము)

శ్లో॥ యత్సాక్షాదపరోక్షాది - త్యాహ వేద ఇహస్థితః
సఞ్చరామీహ మే పుత్రాః , పతితా స్సర్వలోకతః॥ 35

తా॥ "బ్రహ్మము సాక్షాత్తుగా అపరోక్షము. ఇక్కడే ఉన్నది" ("యత్సాక్షాదపరోక్షాత్") అని వేదము చెప్పుచున్నది. నేను ఈ భూలోకముననే ఉండి సంచరించుచున్నాను. ఎందుకనగా, అన్ని లోకాల జీవులకన్ననూ, మరీ పతనము చెందినవారు ఈ భూలోకవాసులే. అందరి కన్నను పతితులగు పుత్రులనుద్ధరించు కార్యమునందే అట్టి వారి కడనే తండ్రి ఉండును కదా. (కనుక స్వామి కార్యములో పాల్గొని సేవకుడివై నిస్వార్థసేవా ఫలమును పొంది తరించుమని భావము)

ఇతి శ్రీ దత్త గురు భగవద్గీతాయాం
శ్రీదత్త నిస్వార్థ సేవా ఫలయోగోనామ
దశమాధ్యాయః

ఓం

శ్రీ గురుదత్త జయ గురుదత్త

శివఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## ఏకాదశాధ్యాయః

## శ్రీ దత్త జ్ఞాన ప్రచారయోగః

శ్రీ దత్త భగవాన్ ఉవాచ:

శ్లో॥ జ్ఞానస్యాచరణం ధర్మం, శ్రుత్వా మత్వా ప్రచారతః
కర్మ ప్రాప్య ప్రచారం చ, ముక్తః కర్మ పునశ్శ్రితః॥ 1

శ్రీ దత్తభగవానులు వచించిరి:

తా॥ జ్ఞానమును విని, మననము చేసుకొని, ప్రచారము చేయుటవలన వంటబట్టి ఆచరణముగా మారుటయే ధర్మము. ఈ ధర్మమే కర్మ. ఈ ఆచరణకర్మ యగు ధర్మమును పొందినవాడు ముక్తుడగును. అట్లు ముక్తుడై మరల జ్ఞానప్రచారమను ధర్మకర్మనే చేయవలెను.

శ్లో॥ క్వచి చ్ఛుద్ధం మలం తోయం, క్వచిన్నాస్తి యథాతథా
గురుజ్ఞానం క్వచిద్దృశ్యం, సులభం యత్నతః క్వచిత్ ॥ 2

తా॥ భూమిలో ఒక చోట త్రవ్వీన శుద్ధ నిర్మలజలము చాల స్వల్పప్రయత్నముతో అతి తక్కువ లోతులోనే పడును. మరియొక చోట ఎంతో లోతులో కాని లభించదు. ఒకచోట ఎంత త్రవ్వినా జలము లభించదు. అంతే కాక, ఒకచోట మంచినీరు లభించును. మరియొక చోట, ఆభూమి గుణముల వలన ఉప్పునీరు లభించును. ఇదే విధంగా, ఒక వ్యక్తిలో బ్రహ్మము సులభముగా వ్యక్తమగును, మరియొక వ్యక్తిలో ఎంతో ప్రయత్నించినగానీ వ్యక్తము కాదు. మరియొక వ్యక్తిలో అసలు వ్యక్తము కాదు. ఒక వ్యక్తిలో శుద్ధ బ్రహ్మము వ్యక్తమగును. మరియొక వ్యక్తిలో, వాని దుర్గుణములచే ఆచ్ఛాదితమై (క్షుద్రమాంత్రికులందువలె) యుండును. శుద్ధ బ్రహ్మము వ్యక్తమైన చోట, శుద్ధమైన బ్రహ్మజ్ఞానము వెలువడును. బ్రహ్మము జ్ఞానస్వరూపము. ఇచట జ్ఞానమనగా చైతన్యమని అర్థము కాదు. బ్రహ్మలక్ష్యమును చేర్చు సాధనమార్గవిషయమును గురించియు, బ్రహ్మమును గురించియు, జీవుల గురించియును బోధించు గురుస్వరూపమని జ్ఞానమునకు అర్థము.

శ్లో॥ సత్యం జ్ఞాన మనన్తం హి, బ్రహ్మ ప్రజ్ఞాన మిత్యపి
గుణాతిశయ బోధోऽయం, గురురస్మి న చిద్భ్రమాత్ ॥ 3

తా॥ "సత్యమైన అనంతజ్ఞానము బ్రహ్మ", "ప్రజ్ఞానము బ్రహ్మ" అను శ్రుతుల అర్థము" గురువగు నేనే అనియే. ఒక గుణము ఎక్కువగా ఉన్నపుడు ఆ గుణముగనే ఆ వ్యక్తిని చెప్పుట శాస్త్రమతము. ఉదా॥ అత్యధిక తేజస్సు కలవానిని "తేజస్సు" అని గుణశబ్దముతోనే చెప్పినట్లు. అట్లే అనంతమైన, ప్రకృష్టమైన జ్ఞానముకల గురువగు నన్ను "జ్ఞానము" అనుగుణశబ్దముతోనే శ్రుతి సంబోధించినది. ఈ శ్రుతులలో " అనంత" "ప్ర" అను పదములు గుణము యొక్క అతిశయమును సూచించుచున్నవి. ఈ సంప్రదాయమును గ్రహించక నేను కేవల చైతన్యమనుకొనుట భ్రమ అగును.

శ్లో॥ శ్రవణం మననం కర్మ, ప్రచార స్సాధకస్య హి
ప్రచారఏవ సిద్ధానాం, ధర్మః కర్మ తు శాశ్వతమ్ ॥ 4

తా॥ జ్ఞానము యొక్క శ్రవణము, మననము,దీని ప్రచారము అను మూడును, సాధకుడు చేయవలసిన కర్మలు. ముక్తులైన సిద్ధులు కేవలము ప్రచార కర్మనే చేయుదురు. ఈ కర్మయే ధర్మము. ఇది శాశ్వతము.

శ్లో॥ ప్రచారో భాషణం కర్మ, సమ స్సాధకసిద్ధయోః
సత్సఙ్గై రుపదేశైశ్చ, సాధకస్తేన, సిద్ధిమాన్ ॥ 5

తా॥ సత్సంగములు, ఉపదేశములలో చేయు భాషణములు కర్మయే. అదే ప్రచారము. ఈ ప్రచారము సాధకునకును సిద్ధునకును సమానముగనే ఉన్నది. అనగా, దీనిచేత సాధకుడు సిద్ధిని పొందును. సిద్ధుడు స్వామి కార్యమును చేయును. (అనగా సాధకులు సైతము, సాధనలో భాగముగా నా సేవయగు జ్ఞాన ప్రచారమును చేయవలయును)

శ్లో॥ అధర్మస్య శ్రుతి శ్చిన్తా, ప్రచారాచరణం రజః
వికర్మ చ తథాత్యాజ్య, మకర్మ స్థావరం తమః॥ 6

తా॥ అధర్మమును వినుట, దానిని చింతించుట, దానిని ప్రచారము చేయుట రజోగుణము. దీనినే "వికర్మ" అందురు. వీనిని త్యజించవలయును. అట్లే జడము వలె ఏకర్మనూ చేయకుండుట "అకర్మ" అందురు. ఇది తమోగుణము. దీనినీ త్యజించవలెను.



శ్లో॥ మహాశాస్వార్థ బుద్ధిస్స్యాత్, కారణం హి వికర్మణః
అకర్మణోऽలసత్వం చ, ద్వయం త్యాజ్యం రజ స్తమః 7

తా॥ ఎక్కువ ఆశతో కూడిన స్వార్థబుద్ధియే రజోగుణమునకు కారణము. కాన, అదియే "వికర్మ" కు కారణము.ఇక అలసత్వము (సోమరి తనము) తమోగుణమునకు కారణము. కాన అదియే "అకర్మ" కు కారణము.

శ్లో॥ సత్త్వం జ్ఞానాత్మకం కర్మ, న త్యాజ్యం కర్మవా జగత్
త్యాజ్యం వికర్మచాకర్మ, కర్మార్థ స్సత్త్వసంయతః॥ 8

తా॥ ఈ జ్ఞాన శ్రవణ,-మనన,-ప్రచార కర్మయే సత్త్వగుణము. కాన, కర్మను కాని జగత్తును కాని త్యజించరాదు. "వికర్మ" "అకర్మ" లనే త్యజించవలెను. "కర్మ" శబ్దము కేవలము సాత్త్వికకర్మ యగు ధర్మము నందే ప్రయోగించబడినది. (అంతేకాని, కర్మయనగా వికర్మ, అకర్మకాదు)

శ్లో॥ కార్యం సాధక సిద్ధానా, మిహ నిత్యమిదం యతః
నిత్యకర్మేతి తత్ప్రాహు, స్త్రివిధం కృష్ణ! తన్మతమ్॥ 9

తా॥ సాధకుల చేతను, సిద్ధుల చేతను ఈ లోకమున నిత్యము ఈ జ్ఞానకర్మచేయబడుచున్నది. అందువల్లనే దీనిని "నిత్య కర్మ" యని అందురు. ఓ కృష్ణా! ఈ నిత్య కర్మ మూడు దశలలో ఉండును.

శ్లో॥ శ్రవణం యజ్ఞఇత్యుక్తో, హవిర్వాక్యం హి మన్మతమ్
ఇధ్మ శ్రద్ధామయేనేహ, జీవచైతన్య వహ్నినా॥ 10

తా॥ మొదటిది శ్రవణము. ఇదే యజ్ఞము. జ్ఞాన వాక్యములే హవిస్సు. చైతన్య శక్తి యగు జీవుడే అగ్ని. జీవునిలో ఉన్న శ్రద్ధయే సమిధలు. హవిస్సు అగ్ని చేత గ్రహించబడినట్లు. జ్ఞానవాక్యము జీవుని చేత గ్రహింపబడును. ఇదే శ్రవణము లేక యజ్ఞము అనబడుచున్నది.

శ్లో॥ మననం తప ఇత్యుక్తం, చిన్తా జ్వాలా ప్రవర్ధితః
స్వయం జ్వలతి తద్వాక్య, - ధ్యానం చ దహనం తపః॥ 11

తా॥ విన్నజ్ఞానమును మననము చేయుటయే తపస్సు. సదా చింతించుటయే వృద్ధి చెందిన జ్వాలలు. హవిస్సును గ్రహించిన తరువాత, అగ్ని, స్వయముగా మండును. విన్నజ్ఞానవాక్యమునే సదా స్మరించు ధ్యానమే మండుట. ఈ మండుటయే తపస్సు.

శ్లో॥ ప్రచారో దానమిత్యుక్తో, జ్ఞానం దానేన వర్ధతే
దానవృద్ధం ఫలం సూతే, ఫలం ధర్మ స్స్వయం చ యత్॥ 12

తా॥ మననము చేసిన తరువాత ప్రచారము చేయుటయే దానము. జ్ఞానము దానము చేత వృద్ధి చెందును. ఈ దానము చేత వృద్ధి చెందిన ప్రచారము, ముక్తి ఫలము నిచ్చును. ఈ ఫలము కూడా ధర్మ కర్మ స్వరూపమే. అనగా సిద్ధుడు మరల ప్రచార కర్మనే చేయవలయును.

శ్లో॥ జ్ఞానం జీర్ణం ప్రచారేణ, నిదిధ్యాస దశాగతమ్
అన్తర్బహిశ్చ తం కుర్యా, జ్జ్వలన్తం పావకోపమమ్॥ 13

తా॥ ప్రచారము చేత జ్ఞానము జీర్ణమగును. అదే "నిదిధ్యాసదశ" అందురు. అప్పుడు జ్ఞానము వాని లోపల, బయట కూడా ప్రకాశవంతుని చేయును. ఆతడు ప్రజ్వలించిన అగ్నివలె పవిత్రుడై యుండును.

శ్లో॥ అన్నదాన మనిత్యం హి, జ్ఞానదానం తు శాశ్వతమ్
అన్నం హి దహ్యతే దేహైః, జ్ఞానం జీవ మనుశ్రితమ్॥ 14

తా॥ అన్న దానము అశాశ్వతము, జ్ఞానదానము శాశ్వతమైనది. అన్నము దేహములో నుండి దేహము దహించబడగనే అదియును నశించుచేన్నది. జ్ఞానము జీవుని వెంట జన్మజన్మలలో సంస్కార రూపంలో శాశ్వతముగా నుండుచున్నది.

శ్లో॥ యోగ్యాయాన్నం దరిద్రాయ, శ్రీమతేऽపి జగద్ధితాత్
నత్వయోగ్యాయ దాతవ్యం, సర్పాయేవాపకారిణే॥ 15

తా॥ యోగ్యుడు, దరిద్రుడైన వాడు అన్నదానము నకు మొదటి అర్హత గలవాడు. అట్టివాడు లభించని ఎడల శ్రీమంతుడైననూ యోగ్యుడే. అన్నదానమునకు అర్హుడు.



ఏలననగా యోగ్యుడు లోకమునకు హితమును చేయును. గాన. అన్నశక్తితో లోకహితమును చేయును. బలవంతుడైన యోగ్యునకు ఇంకను బలమిచ్చుట పుణ్యమే. అయోగ్యుడైనచో దరిద్రుడైననూ అన్నదానమునకు అనర్హుడు. ఏలననగా వాడు అన్నముచే బలమును పొంది పాలు త్రాగిన సర్పమువలె, నీకును, లోకమునకును అపకారము చేయును.

శ్లో॥ అన్నాది దాన శక్త్యే య, త్క్రియతే తస్య కర్మణః
పాపపుణ్యఫలే భాగ, స్తేऽపిస్యా త్సంవిదా కురు॥ 16

తా॥ అన్నము, ధనము మొ॥ వాటిని దానము చేయునప్పుడు జ్ఞానముతో చేయుము. ఏలననగా నీవు దానము చేసిన వాటివలన శక్తి ని పొందువాడు చేయు పాపపుణ్యకర్మల ఫలములలో నీకును భాగము వచ్చును.

శ్లో॥ జ్ఞానం కుర్యా దయోగ్యం చ, యోగ్యం యాతి స పాత్రతామ్
జ్ఞానం తస్మా త్పురోదేయం, సర్వేభ్య స్తద్ధి శాశ్వతమ్॥ 17

తా॥ జ్ఞానమును పొందినచో, అయోగ్యుడునూ, యోగ్యుడుగా మారును. కావున ముందు అందరికిని జ్ఞానదానమ్ము, అనగా ప్రచారము చేయుము. అది శాశ్వత దానము కూడా గదా. యోగ్యుడై, నీవిచ్చు, అన్నధనాది దానములకు అర్హుడు అగును.

శ్లో॥ సేవా జ్ఞానప్రచారాఖ్యా, సామ్ప్రతం మే తరస్యతః
వినాత్వాం చ భవేత్కార్యం, సర్వజీవ సమున్నతిః॥ 18

తా॥ ప్రస్తుతము, నా జ్ఞానప్రచార మను సేవను చేయు అవసరమున్నది. దానిలో సేవకునిగా మారుము. నీవు ఈ సేవలో చేరకున్ననూ, నాకార్యక్రమము ఎటూ ఆగదు. నీవు తరించు అవకాశమును పోగొట్టుకొనుచున్నావు. సర్వ జీవులు తరించుటయే నాకార్యము.

శ్లో॥ దుర్యోధనోऽస్య తాతస్తా, జీవోऽర్జు సారధిస్త్వహమ్
బన్ధుయుద్ధ మమత్వఘ్నో, గురు దుర్మత విగ్రహే॥ 19

తా॥ అహంకారమే దుర్యోధనుడు. మమకారమే ధృతరాష్ట్రుడు. ఈ రథమే నా సేవకుని శరీరము. దానిలోని అర్జునుడే నాసేవకుడైన జీవుడు. వానితో పాటు నేను సారథిగా ఉండి, వాని శరీరమును నేను నడిపింతును. ఆరధికుడైన జీవు డెట్టి సంకల్పములను చేయక, నాకు సంపూర్ణ శరణాగతుడై, నేను నడిపిన చోటికి పోయి, నేను ఆజ్ఞాపించిన పనిని, స్వీయ బంధువులను సంహరించుట యగు యుద్ధమైననూ చేయును. ఆ బంధువులను సంహరించుటయే మమకారత్యాగము. అదే మోహమును జయించుట. దుర్మతములతో అజ్ఞాన పక్షమును సమర్థించు గురువులను పూజ్యులైనను వాదము చేసి ఖండించి సత్య జ్ఞానమును స్థాపించుటయే ద్రోణాదిగురువులతో యుద్ధము చేయుట. ఇట్లు అంతరార్థమును గ్రహించవలయును.

శ్లో॥ ప్రక్షిప్తాని పురాణాని, చలచిత్రం చ కల్పితమ్
శివతేజో మరుజ్జాతో, మారుతి స్సోఽహమంశతః ॥ 20

తా॥ ఈ పురాణములలో అనేకులు తమతమ శ్లోకములను (ప్రక్షపములు) దూర్చినారు. మరియు ఈ పురాణకథలను చూపించు చలన చిత్రములు కేవలకల్పనామయములు. వీటిని ఆధారముగ చేసుకొనరాదు. వీటిని ప్రమాణముగా తీసుకొన్నచో సత్య జ్ఞానమునకు దూరమైపోదురు. నాసేవక శిరోమణియగు ఆంజనేయడెట్లు జన్మించెను? కేసరి భార్యయగు అంజనాదేవి, వ్యభిచారిణియై, వాయుదేవునితో కూడినపుడు జన్మించెనను కథ ఎంత తుచ్ఛమైన కల్పన? ఈ సృష్టిలో ఆంజనేయుని కన్న పవిత్రుడులేడు. అట్టివాని జన్మ అంత అపవిత్రమా? నాస్తికులగు పూర్వపండితులు, భక్తులకు అసహ్యము కల్గించి భక్తిని చెడగొట్టుటకు ఇట్టి కల్పనలను శ్లోకములుగా పురాణములలో దూర్చినారు! అంజన పరమ పతివ్రత. ఆంజనేయుడు శుక్రరేతో జన్ముడు కాదు. శివతేజస్సు ఆమె గర్భములోనికి ప్రవహించినది. తేజస్సు, వాయువు వలె వేగముగా ప్రయాణించును. చలించు పరమాణువు లేక వాయువు: తేజస్సు అనగా చలించు శక్తి సూక్ష్మకణములు. ఈ రెండింటికినీ తేడా లేదు. అందుకే ఆంజనేయుని శివాంశ సంభవుడనీ, వాయు పుత్రుడనీ అన్నారు. అతడు నా అంశ సంభవుడే. అతడు నేనే.

శ్లో॥ ధర్మచక్రం జ్ఞానతేజ, శ్శఙ్ఖనాదో మయాకృతః
అహన్తా మమకారఘ్నో, తత్ప్రవిష్టో విముచ్యతే ॥ 21



తా॥ ఇవి అన్నియును భక్తులను పరిహసించుటకు తుంటరి నాస్తికులు చేసిన కల్పనలు. వీటి చేత భక్తులు, నాస్తికులకు పరిహాస పాత్రులగుచున్నారు. నీ అహంకారమమ కారములే నీ శత్రువులు. వాటిని జయించితివేని నీవు ముక్తుడవైనట్లే. వాటిని నీవు జయించినపుడు, నీ రథసారథియగు నేను శంఖమును పూరింతును. అదే సాధకుడు విను దివ్యనాదము. నీవు కర్మ చక్రమును వదలి ధర్మచక్రమును ప్రవేశింతువు. అపుడు నీకు కనపడు ఈ ధర్మ చక్రమే తేజోదర్శనము. ధర్మ చక్రము జ్ఞానతేజోమయము. అహంకారమును జయించి, పరిమితసంఖ్యలలో కొందరు జీవులనే "వీరు నావారు" అనుకొను భ్రమను వీడుటయే మమకారసంహారము. అపుడు నీవు మసితో కూడిన స్వార్థమయమైన కర్మ చక్రమును విడచి, జ్ఞాన తేజో భాసమానమగు ధర్మ చక్రమున ప్రవేశింప, గురురూపమున వచ్చిన నేనే విమానము. ఈ ధర్మచక్రమే దేవలోకమనబడు నా సత్య లోకము. దీని ప్రవేశమే సత్యమైన ముక్తి. అనగా అహంకారమును విడచి, నా సేవకుడవై, మమకారమును సర్వజీవుల యందును సమానముగ నుంచి, వారి ఉద్ధరణమునకై సదా ప్రయత్నించు సేవ చేయుటయే నిజమైన ముక్తి. ఇట్టి సేవలో సదా జగత్సంబంధముండును కాన, దుఃఖరహిత శాంతిమయమైన జన్మలను సదా ఈ జగత్తులో ఎత్తుటయే ధర్మచక్రము.

శ్లో॥ లిఙ్గైర్నార్థః కళత్రేణ, శక్త్యావా జీవఉచ్యతే
శాస్త్రే వర్ణాశ్రమాద్యోఽపి, న భేద స్సర్వవానహమ్॥ 22

తా॥ శబ్దములను పట్టి అర్థములో లింగమును నిర్ణయించరాదు. శక్తి అనగా స్త్రీ లింగ శబ్దము. వసిష్ఠుని పుత్రుడు "శక్తి" అని పేరు కలవాడు పురుషుడు. "కళత్రం" అనగా నపుంసకలింగ శబ్దము. దాని అర్థము స్త్రీయగు భార్య. కాన, శాస్త్రమున సాధకుని గురించి "ఎవడు ఇలా చేస్తాడో వాడు తరిస్తాడు" మొ॥ వాక్యములలో పుంలింగ శబ్దములతో చెప్పబడినది జీవుడు అనియే అర్థము తప్ప-అనగా పురుష లేక స్త్రీ శరీరగత జీవుడనియే. అంతే తప్ప పురుషులకే శాస్త్రము, స్త్రీలకు కాదని, అపార్థము చేసుకొనరాదు. సర్వ జీవులనుద్ధరించుటయే నాకార్యము. ఇందులో స్త్రీ-పురుష లింగ భేదములు కానీ, బ్రాహ్మణాది వర్ణ భేదముకాని సంన్యాసాది ఆశ్రమ భేదము గాని మతభేదముకానీ, కాల-దేశ భేదములు కానీ లేవు.

శ్లో॥ సేవాఫలస్య న పునః, ఫలం మగ్న స్సనిర్మమః
నిరహంయు రిహాన్వేతి, మాం కార్యే సర్వమోక్షదే॥ 23

తా॥ నా సేవకుడిగా మారినవాడు నాకు చేయుసేవను తన సాధనకు ఫలముగా భావించునే తప్ప, నా సేవకుడు మరల ఫలమును కోరడు. ఫలమునకు మరియొక ఫలముండదు గదా! నా సేవలో మునిగి, తన్ను తానే మరచి పోవుట వలన ఆతడికి "నేను" "నాకు" అనునవే స్ఫురించవు. కాన, నా సేవకు ఫలమును కోరుటయను భావము కూడ ఆతనికి బుద్ధిలో స్ఫురించదు. అతడు ఈ లోకమున నా వెంట నా బంటుగా నుండి నా కార్యక్రమములో సేవకునిగా పాల్గొనుచుండును. నాకార్యక్రమము ఏమనగా-ఈలోకములోని సర్వజీవులను ముక్తజీవులను చేయుటయే. సర్వజీవులను తరింపచేయుటయే.

శ్లో॥ అధర్మం ఖణ్డయ జ్ఞాన - ప్రచారా దుద్ధృతోభవాన్
సహకారీ న మే కుర్యా, మన్యథాఽపి స్వయం ప్రభుః ॥ 24

తా॥ నీవీలోకమున, కండ్లకు గోచరించిన అధర్మమును ఖండించి, శక్తి మేరకు ధర్మసమర్థనమును చేయుము. దానితో, నా పనిలో సహకరించి నా అనుగ్రహమునకు పాత్రుడవగుదువు. అట్లే జ్ఞాన ప్రచారములో నాకు సహకరించి నా దయకు పాత్రుడవు కమ్ము. ఒకవేళ, నీవు సహకరించనిచో అధర్మము గెలుచుననియు, జ్ఞానప్రచారము జరుగదనియు భావించకుము. నీవు సహకరించకున్ననూ, నేను అధర్మమును నాశనము చేయుదును. ధర్మమును రక్షింతును, జ్ఞాన ప్రచారము చేయుదును. నా పనిని నేను చేసుకొనకలుగుదును. నీవు సహకరించుటవలన, నా దయకుపాత్రుడవై నిన్ను నీవు ఉద్ధరించుకొనుటయే తప్ప, నిజముగా, నా పనికి నీ సాయము అణుమాత్రము కూడ అవసరము లేదని తెలుసుకొనుము.

శ్లో॥ కిం వా చన్దన లేపేన, తద్గన్ధోఽహం సుమైః కిము
అహం పరిమళ స్తేషాం, కిం దీపై ర్దీపతేజసః? 25

తా॥ నేను చందన గంధములోని గంధమును. నాకు చందన గంధమును పూయనవసరములేదు. నేను పుష్పములలో పరిమళమును. నాకు పుష్పాలతో పూజ లేల? నేను దీపముల తేజస్సుకే తేజస్సును. నాకు దీపారాధన లేల?

శ్లో॥ ఊహో మమ జగత్సర్వం, కిం నివేదన మర్పితమ్?
తవ భోగాయ భావేన, ప్రీతోఽహం కార్యముత్తరమ్.॥ 26



తా॥ ఈ జగత్తు అంతయును. నా ఊహమాత్రమే. ఈ జగత్తులోని సమస్త పదార్థములు నా ఊహా మాత్రములే. నా ఊహ స్వరూపుడవైన నీవు, నా ఊహాకారములగు పదార్థములను నాకే నివేదింతువా? గంధ, దీప, నైవేద్యములను నీవే భోగించుచున్నావు. పూజా మందిరమున దీప కాంతి నీకే అవసరము. గంధవాసనలతో ఆహ్లాదముగా నీవే ఉండుచున్నావు. ఇక నైవేద్యములను నీవే ఆరగించుచున్నావు. నీవు నాకు చేయు సమర్పణ భావమునకు సంతసించుచున్నానే తప్ప, దానిని నేను అనుభవించుటలేదు.కాన, నేనీలోకమున చేయు, నా కార్యక్రమమున నాకు సేవకుడవై నాకు సహకరించుము. అదే నా నిజమగు సేవ.

శ్లో॥ క్షణాత్కార్యం భవేత్సర్వ - జీవోద్ధరణ ముద్భవేత్
ఇచ్ఛాసేతు స్స్వబాలార్థ - మార్గదో వా మహార్ణవః॥ 27

తా॥ నేను తలచినచో క్షణమాత్రమున నా కార్యము నెరవేరును. నాకార్యము సర్వజీవులు ఉద్ధరించబడుటయే. నేను సంకల్పించినచో క్షణకాలములో జీవులందరును ముక్తులగుదురు. నీకు సేవా భాగ్యమును కల్పించదలచి నేను అట్లు సంకల్పించుట లేదు. రామావతారమున నేను సంకల్పమాత్రమున వారధిని సృష్టించలేనా? తన పుత్రికను విడిపించుటకు బయలుదేరిన తన అల్లుడనగు నాకు సముద్రుడు దారి నీయడా? అట్లు జరిగినచో, వానరులు సేతువును నిర్మించి నన్ను సేవించు భాగ్యము లేకుండగాపోవునుగదా.

శ్లో॥ మోఘా వానరసేవాస్యా, త్పరీక్షాయై చ విఘ్నకృత్
క్షుద్రజన్తౌ స విశ్వాసే, త్రిమూర్త్యబ్ధి స్స శాశ్వతః॥ 28

తా॥ అట్లు నేను సేతువును క్షణకాలమున నిర్మించినచో, నన్ను సేవించి వానరులు తరించు అవకాశము లేకుండపోవును. నా సేవలోని దీక్ష-విశ్వాసములను పరీక్షించదలచి, అనేక విఘ్నములను కూడ నేనే కల్పింతును. వానరులు సేతువును నిర్మించునపుడు వారు వేయు పెద్దబండలు సముద్రమున మునిగిపోవుచుండగా, రామకార్యము నెరవేరుటను సంశయించి వానరులు సేవను ఆపినారు. కానీ, ఒక ఉడత మాత్రము, రామకార్యము నెరవేరుటలో ఎట్టి సంశయమును పెట్టుకొనక, తన శక్తి కొలదీ, ఇసుకలో పొర్లి వచ్చి, ఇసుక రేణువులను సముద్రమున సేతువు కొరకు పడవేయుచున్నది. పెద్ద బండలు వేయు వానరులు పనిని ఆపినా, చిన్న

ఇసుకరేణువులు పడవేయు ఉడత, తన పనిని ఆపలేదు. దానికి రామ కార్యము నెరవేరుటలో సంశయము రాలేదు. అందుకే నేను వానరుల వీపులను నిమరలేదు. ఉడత వీపును చేతితో నిమిరినందున దాని మీద, దాని జాతి మీదను, నా త్రిమూర్తి సంకేతమగు మూడు వ్రేళ్ళ చారలు శాశ్వతముగా పడినవి.

శ్లో॥ జ్ఞాన ప్రచార సేవాఽద్య, కలౌ స్వార్థాయ కర్మ చ
భక్తిం యోగం చ సేవన్తే, ప్రచారావసరోఽస్య న॥ 29

తా॥ ఈ కలికాలమునకు ఉచితమైనది నా జ్ఞానప్రచారము. దానిలో సేవకునిగ పాల్గొనుము. కలి ప్రభావమున, జీవులలో స్వార్థము, ఆశ, అసూయ మొ॥ గుణములు విజృంభించినవి. నన్ను వేరుగా కాని, నా ఇతర దేవతా రూపాలను కానీ, ఆరాధించు విధానము ఏదయినా, అందరికీ ప్రతిఫలాపేక్షతో గూడిన స్వార్థమే మూల కారణముగానున్నది. ఈ స్వార్థమువలన, వారు తమ స్వార్థములను పూర్తి చేసుకొనుటకు, పూజాది కర్మమార్గమును, భజన రూపమైన భక్తి మార్గమును,ధ్యానరూపమైన యోగమార్గమును ఎవ్వరి ప్రేరణ అవసరము లేకయే అనుసరించుచున్నారు. కాన, కర్మ భక్తి-యోగమార్గముల ప్రచారమును చేయపనిలేదు. అవివాటి అంతట అవియే బాగా స్వార్థమువల్ల వృద్ధిచెందియున్నవి.

శ్లో॥ సిద్ధిభోగ యశః కామో, జ్ఞానాత్తేషాం న మత్ప్రమా
స మత్కామః ప్రచారో మే, దృఢదృష్ట్యై చ తే భవేత్ ॥ 30

తా॥ అత్యుత్తమ ఫలమైన నన్ను కోరుకొనక, అల్పములు-అసత్యములైన ఎండమావుల వంటి ఈ భోగభాగ్యములు కీర్తి, అష్టసిద్ధులను జీవులు కోరుకొనుటలో కారణము వారికి వీటి జ్ఞానమున్నంతగా, నన్ను గురించిన జ్ఞానము పూర్తిగా లేకుండుటయే. జ్ఞానము చేతనే ఆకర్షణము సిద్ధించును. కాన, నన్ను గురించి; నా తత్త్వమును గురించిన జ్ఞానమును ప్రచారము చేయుము. ఈ ప్రచారము వలన నీకును నా జ్ఞానము దృఢమై నాపై దృష్టి స్థిరమగును. ఇతరులు తరించుటతోబాటు నీవును తరింతువు.

ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం
శ్రీ దత్త జ్ఞాన ప్రచార యోగోనామ
ఏకాదశాధ్యాయః

శివఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## ద్వాదశాధ్యాయః

## శ్రీ దత్త సేవక జీవన్ముక్తి యోగః

శ్రీ దత్త శిష్య ఉవాచ:

శ్లో॥ శుద్ధ్యర్థం కష్టదాతారం, మన్యన్తే త్వాం పరీక్షకమ్
సుఖార్తా బ్రహ్మచోజ్ఝిత్య, వేషాలమ్బా గురో! కథమ్? 1

శ్రీ దత్త శిష్యుడు వచించెను:

తా॥ ఓ గురుదేవా! జీవుని శుద్ధి చేయుటకు నీవు కష్టాలనిస్తావని, పరీక్షలు పెడతావని అనుకుంటారు. వీరు కేవలము, సుఖలాలసులు కాన, బ్రహ్మమైన నిన్ను వదలి, నీ వేషములగు దేవతలను పట్టుకొనుచున్నారు. వీరు ఎట్లు ఉద్ధరింపబడుదురు?

శ్రీ దత్తగురు భగవానువాచ:-

శ్లో॥ నాహం దుఃఖం పరీక్షార్థం, దద్యాం పృధ గిహాకృతమ్
కాలే కర్మఫలం భోగ్యం, దద్యాం పృథగివాపరమ్॥ 2

శ్రీ దత్త భగవానుడు వచించెను :

తా॥ నేను భక్తులను పరీక్షించుటకు కష్టములను ప్రత్యేకంగా కల్పించి ఇచ్చుటలేదు ఆ కష్టములు ఎటూ ఆసమయంలో జీవుడు అనుభవించవలసినదే. అయితే ఆ రహస్యమును జీవుడు తెలియనందున, నేను ఆ కష్టములను ఇచ్చినట్లు వానిచే తలపింపచేసి పరీక్షించుచున్నాను.

శ్లో॥ ఫలభోగః పరీక్షార్థ, ముపయుక్తో మయాకృతః
ఇతి బుద్ధి ర్మయాదత్తా, పరీక్షాయై న మత్కృతః॥ 3

తా॥ సమయంలో తగులుకొన్న కర్మఫలాలను అనుభవించే జీవునికి ఆ కర్మఫలాలను నేను వానికిచ్చిన కష్టాలుగా వానిచే అనుకొనునట్లు చేయుదును. అట్లు చేయుట చేత వానిని పరీక్షింతును. కానీ, నిజముగా, వాడేకర్మ చేయకుండా, కేవలము పరీక్షార్థమే నేను ఏ కష్టములను ప్రత్యేకముగా ఇచ్చుటలేదు. ఇచ్చినట్లు కనిపించుచున్నాను. అంతే.

శ్లో॥ కార్తవీర్యోఽల్పబాహుశ్చ, శ్రితో మత్పాదతాడనాత్
భగ్నబాహు రభూ ద్భూయా, త్ప్రాసాద పతితోఽన్యథా॥ 4

తా॥ కార్తవీర్యుడు లొట్టచేతులను బాగుచేసుకొనుటకు నన్ను ఆశ్రయించెను. కొంత కాలము తరువాత నా కాలితో నేను తన్నుట వలన రెండు బాహువులు విరిగిపోయినవి. ఆసమయమున, వాడు నా వద్దలేకున్ననూ, వాడు మేడపై నుండి పడి, వాని బాహువులు ఎటూ వాని పూర్వకర్మ ఫలానుసారంగా విరుగును. ఆ సమయమున ఎటూ వాడు వాని కర్మఫలమును ఇంకొకచోటనైననూ అనుభవించవలసియే యున్నది. దానిని నేను నా పరీక్షకు వాడుకున్నాను. అంతే.

శ్లో॥ సత్యమజ్ఞాయ యాతశ్చే, త్తథాస్యా త్కర్మ తాదృశమ్
స శీర్షసేవయా బాహు - సహస్రశ్చోపయుక్తవాన్॥ 5

తా॥ తన కర్మ ఫలము ఆసమయమునకు అట్లున్నదని తెలియక, అట్లు జరుగుట నావల్లనని తలచి వాడు వెడలిపోయినచో, వాని జీవితాంతము అట్లే విరిగిన చేతులతో ఉండెడివాడు. ఎలాగూ వాని కర్మ ఫలము నట్లే ఉన్నది గదా. కానీ, నేను వాని కర్మ ఫలము.నెట్లు పరీక్ష కొరకు ఉపయోగించితినో, వాడును తన కర్మ ఫలమును తన విజయమును సాధించుటకే ఉపయోగించుకొనినాడు. చేతులు విరిగిననూ, తన తలతో నన్ను సేవించి, సహస్రబాహువులను పొందెను. కర్మ ఫలానుసారంగా శాశ్వతంగా మొండిచేతులతో ఉండవలసినవాడు నా పరీక్షమూలంగా సహస్రబాహువైనాడు కాన, నా పరీక్షలో ఉపకారము పొందు అవకాశమున్నది గదా.

శ్లో॥ నిమిత్తమేవ సర్వేఽపి, కాలే భోగో హి కారణమ్
అన్యదేవాశ్రితానాం కిం, సుఖం నిత్యం నవా వ్యథా? 6



తా॥ కాలము రాగానే, తన కర్మఫలమును ఏ జీవుడైనా అనుభవించవలసినదే. దానిని అందించువారు నిమిత్తమాత్రులేనని తెలియవలెను. నన్ను వదలి, అన్య దేవతల నాశ్రయించిన వారికినీ నిత్యము సుఖమున్నదా? వారికి దుఃఖములు కలుగుటలేదా?

శ్లో॥ అజ్ఞాన మేవ సర్వస్య, కారణం కృష్ణ! తత్ర చ
అహమేవ హి వేషస్థ, స్సర్వే దేవా న మత్పరః ॥ 8

తా॥ ఓ కృష్ణా! అజ్ఞానమే, అన్ని అపార్థములకును కారణము. సర్వదేవతల యందును ఉన్న వ్యక్తిని నేనేకదా! సర్వదేవతలును నా వేషములేకదా. కాన ఎక్కడైననూ, ఒకే విధముగనే జరుగును తప్ప నా కన్న భిన్నమైన జడమైన నా వేష మేమిచేయకలదు? నాకన్న వేరుగా దేవతావేషమే తప్ప, దేవతలేదు గదా. ఏ దేవతనాశ్రయించినా, నన్నాశ్రయించినట్లే గదా.

శ్లో॥ భగవా న్సిద్ధికృచ్ఛక్తి, ర్దక్షిణే బోధకో గురుః
ఆద్యేన ప్రాప్య సాలోక్యం, సామీప్యం గురుణా వ్రజేత్ ॥ 9

తా॥ నా వామ భాగము భగవంతుడు. అనగా శక్తి. అష్టసిద్ధులనిచ్చే పార్శ్వమిదే. దక్షిణ భాగము జ్ఞానమును బోధించు గురుస్వరూపము. వామ భాగ సహాయముతో నాస్తికత్వమును వదలి, ఆస్తికునిగా మారుటయే సాలోక్యము. దక్షిణ భాగ సహాయముతో లక్ష్యమును చేరుటయే సామీప్యమును పొందుట. (నాస్తికలోకమును వదలి, ఆస్తికలోకమును ప్రవేశించుటయే సాలోక్యము. బ్రహ్మమును చేరుటయే సామీప్యము)

శ్లో॥ ధ్వంసో ధర్మవిరోధాయ, ఛాయయా కష్టదో హ్యహమ్
కర్మచక్రే జితః పుణ్యై, ర్విజయీ ధర్మచక్రగః ॥ 10

తా॥ నన్ను ఆరాధించగనే కష్టములు ఆరంభించు ననుచున్నారు కానీ జరుగుచున్నదేమో తెలియకున్నారు. నన్ను ఆశ్రయించగనే, నేను వారి సర్వదుష్కర్మములను వారి చేత ఛాయామాత్రంగా అనుభవింపచేసి,మిగిలిన దుష్కర్మఫలాలను ఎక్కువ భాగము నేనే అనుభవించి వారిని సర్వపాప విముక్తులను చేయుచున్నాను. అనగా వారి అప్పులను పరిష్కరించి, ఎక్కువ అప్పులను నేనే కట్టి, వారి చేత స్వల్పంగా కట్టిస్తున్నాను.

ఛాయామాత్రంగా అయినా శిక్ష అనుభవించకపోవుట కర్మ సిద్ధాంతమునకు విరోధము, మరియు దారుణమైన అన్యాయము. కాన, కర్మ పూర్తిగా రద్దు చేయుట ధర్మము కాదు. ఇట్లు ఛాయామాత్రంగా కష్టములననుభవింపచేసిన సమయములోనే నా పరీక్షయు జరుగును. అనగా నేను కష్టముల నిచ్చినట్లు కనిపింతును. దాని చేత భక్తుడు నన్ను త్యజించునా? లేదా? అనునదియే పరీక్ష. అట్టి పరీక్షలో ఓడి పోయినవాడూ, వాని సర్వపాపములనుండి విముక్తుడైనాడు కాన లాభమే కాని నష్టములేదు. నన్ను ఆశ్రయించినవాడు నష్టపడడు. పరీక్షలో నెగ్గినవాని మిగిలిన సర్వ పుణ్యఫలములను నేను గ్రహించి వానికి నా సేవకపదవిని ఇచ్చుచున్నాను. ఓడినవాడు కూడా, సర్వపాపవిముక్తుడై, మిగిలిన తన పుణ్యఫలములను అనుభవించుచున్నాడు. అట్లు అనుభవించుచూ మరల పాప-పుణ్య కర్మల నాచరించుచూ కర్మ చక్రమున పడి తిరుగుచున్నాడు. నా సేవకుడు, పాపపుణ్యములను వదలి కేవలము నా సేవ చేయుచు, సర్వజీవుల నుద్ధరించు ధర్మచక్రమున తిరుగుచూ శాంతుడైయుండును. ఇదే బుద్ధావతారమున నేను సూచించిన ధర్మచక్ర తాత్పర్యము.

శ్లో॥ ప్రాగ్జన్మాఽజ్ఞాన మన్యార్థ, స్సాంప్రతం కారణం శుచః|
ఇద మజ్ఞాయ నిన్దన్తి, మామాత్మసుహృదార్తిషు ॥ 11

తా॥ జీవులు తమకు వచ్చు కష్టములను నేను ఇచ్చుచున్నాననియు, నేను కరుణలేని కఠోరహృదయుడననియు నన్ను ఆక్రోశముతో నిందించుచున్నారు. నిజముగా ఈ జీవులు ఏ మాత్రము దోషము చేయుటలేదు. ఏలననగా వీరి ఆక్రోశములకు కారణమున్నది. అది-వారు కానీ, తమ భార్యాపుత్రాదులు కానీ, వెనుక జన్మలలో చేసిన పాపములను తెలియకపోవుట, మరియు ఈ జన్మలో చేసిన పాపములను ధర్మములు గానే భావించుట. అందువలన వారిని నిష్కారణముగా నేను బాధించుచున్నానని అజ్ఞానము వలన నన్ను అపార్థము చేసుకొనుచున్నారు.

శ్లో॥ సుఖమూల్యం వినా కష్టం, నస్యా దక్షుదివాశనమ్
స ఏవ సేవకో భుఙ్క్తే, యో దుఃఖ మపి స ప్రియమ్॥ 12

తా॥ కష్టములు లేకున్నచో సుఖముల విలువ తెలియదు. సుఖముల మధ్య కష్టములు వచ్చినపుడే, మధుర పదార్థముల మధ్య కారము తిన్నట్లున్ననే, వాటి రుచి తెలియును.



ఆకలియను దుఃఖము లేనిచో సుఖము అను భోజనము రుచించదు. కాన, నా సృష్టిలో సుఖములతో బాటు కష్టములు కూడా సమానమైన విలువ కలవి యని గ్రహించుము. ఎండలేని నీడ, పగలు లేని రాత్రి, అమావాస్యలేని పూర్ణిమ విలువలేనివి యగును. ఈ పరమార్థమును తెలిసినవాడు కష్టములను కూడ ప్రియముగనే అనుభవించు చుండును. అట్టివాడే నా సేవకుడు కాగలడు.

శ్లో॥ ఆదౌ బ్రహ్మ పరీక్షా మే, మౌనం కామ్యార్థినోఽత్ర మే
మధ్యే విష్ణు పరీక్షా చ, భూతహానిశ్చ సహ్యతే॥ 13

తా॥ మొదట నా బ్రహ్మపరీక్షలో, అడిగిన దానిని ఈయక, మౌనమును పాటింతును. తరువాత విష్ణుపరీక్షలో, అడిగినది ఇవ్వకపోగా, ఉన్న దానిని పోగొట్టుదును. విష్ణుపరీక్షలో సహించుటకు వీలగు కష్టములు కలుగును.

శ్లో॥ అన్తే రుద్ర పరీక్షామే, యత్ర హింసా న సహ్యతే
తస్య కర్మఫలాన్యేవ, సర్వత్రహ్యుపయుజ్యతే॥ 14

తా॥ చివరకు సహించుటకు వీలుకాని, కష్టములతో కూడిన హింస ఉండును. ఇదే నా చివరి రుద్ర పరీక్ష. అన్ని పరీక్షలలో జీవుని యొక్క కర్మఫలములను అనుభవింపచేయుటను పరీక్షలకు వాడుకొందునే తప్ప, పరీక్షల కొరకు ప్రత్యేకంగా కష్టములను నేను సృష్టించుటలేదు. అనగా ఫలమునీయకుండుట, పైగా కష్టములనిచ్చుట, హింసించుట-ఈ మూడును వాని కర్మ ఫలములే తప్ప నేను క్రొత్తగా సృష్టించినవి కావు.

శ్లో॥ త్రిపరీక్షా జయే తస్మై, దాస్యామ్యాత్మాన మేవహి
నా వయోః కోఽపి భేదోఽస్తి, తస్మిన్లీనోఽస్మి సన్తతమ్॥ 15

తా॥ ఈ మూడు పరీక్షలలో జయించిన వానికి, నన్ను నేను ఆత్మార్పణము చేసుకొందును. అట్టి వానికీ, నాకునూ ఏ భేదమూలేదు. వాని యందు నేను సదా లీనమై యుందును.

శ్లో॥ క్రమేణ పతితా స్సత్యే, సత్య మిచ్ఛన్తి కేవలమ్
మామేవ పూర్ణనిష్కామా, మత్సాధర్మ్యే విరాగిణః॥ 16

తా॥ ఈ మానవులు యుగములు గడుచు కొలది క్రమముగా పతనము నొందినారు. సత్య (కృత) యుగములో నన్నే కేవలము కోరుచుండిరి. సత్యమైన నాయందే కోరికతో, పరిపూర్ణనిష్కాములై, నా అద్వైతకైవల్య ఫలమునందును విరక్తులై యుండిరి. (కృతయుగమున శుద్ధ దత్తస్వరూపమున్నది)

శ్లో॥ ప్రపన్నా స్సేవకా నిత్యం, త్రేతాయాం మత్పదార్థినః
అసూయా మత్పదే హేతు, స్సామీప్యాయ గురుం శ్రితాః॥ 17

తా॥ కృతయుగములో అందరును ప్రపత్తితో నా సేవకులుగా నిత్యము ఉండిరి. త్రేతాయుగమున, నా యొక్క గొప్పతనముతో కూడిన నా స్థానముపై ఆశ కలిగి అసూయతో నా పదవిని పొందగోరి సామీప్యమును ప్రసాదించగల గురు స్వరూపమును అర్చించిరి.

శ్లో॥ నాస్తికత్వం, తదా నాస్తి, భగవత్తత్త్వవర్జితః
లక్ష్యసామీప్యనేతాఽహం, గురు ర్బ్రహ్మాస్మి తారకః ॥ 18

తా॥ త్రేతాయుగమున నాస్తికులు లేరు. అష్టసిద్ధులను ప్రదర్శించు భగవత్తత్త్వమును నేను అందుకనే ప్రకటించలేదు. అప్పుడు నేను ఈ సంసారమును దాటించి లక్ష్యమునకు చేర్చు ఒకే ఒక తారకుడగు శ్రీ రామరూపమున గురువుగా నుంటిని. ఈ గురుస్వరూపమే బ్రహ్మదేవుని స్వరూపము కాన నేనట్లుంటిని.

శ్లో॥ రామో జాతోఽహమాదర్శ, స్స్వాచారేణైవ బోధకః
అసిద్ధి ర్మైథిలీ జీవం, శిష్యోద్ధరణ కష్టకృత్॥ 19

తా॥ అపుడు జీవుడెట్లుండవలయునో, ఆచరణముతోనే బోధించు, ఆదర్శమానవరూపంలో రామునిగా, సిద్ధులను కోరరాదని బోధిస్తూ భగవత్తత్వాన్ని పూర్తిగా ఉపసంహరించుకొని కేవల గురుతత్త్వంతో అవతరించాను. (సిద్ధుల ఆకర్షణము వలన



త్రేతాయుగంలో సాయుజ్యమును కోరిరి గదా). నా శిష్యుడగు సీతయను జీవుని అనేక కష్టములతో శుద్ధి చేసి ఉద్ధరించితిని. ("యో మే భర్తా స మే గురుః" (సుందరకాండ) అని సీత తన భర్తయగు నన్ను గురు స్వరూపమున కోరినది).

శ్లో॥ వామాయ తారకం ప్రోక్తం, దక్షిణేన మయా పరమ్
సాలోక్య పర సామీప్యే, రాజ్యత్యాగ విరాగిణా॥ 20

తా॥ పరమాత్మ యొక్క రాజ్యాధికారమును జీవులు కోరరాదని సూచించుచు, రాజ్యమును త్యజించి విరాగియై, కోరికను వదలవలయునని ఆచరణతో బోధించితిని. అష్టసిద్ధులు ప్రదర్శించు శక్తి రూపమైన భగవత్తత్వము నాస్తికులను ఆస్తికులుగా మార్చిన తర్వాత, అనగా సాలోక్యము తరువాత, వామభాగమైన ఆశక్తి, "తారకమేమి" అని (అనగా "సామీప్యమును ఇచ్చునది ఏది?") అడుగగా, దక్షిణభాగమైన శివరూపమైన గురువు, గురుస్వరూపమగు నా రామమంత్రమునే తారకముగా బోధించెను. (అనగా భగవంతుని వలన నాస్తికుడు ఆస్తికునిగా మారి, సాలోక్యము పొందిన తరువాత, సామీప్యము నిచ్చు గురువు నాశ్రయించవలెను)

శ్లో॥ గురౌ సామీప్యదే రామే, నిశ్చలో హనుమానభూత్
ఆస్తికో భగవత్కృష్ణం, నశ్రితోఽవసరో న హి॥ 21

తా॥ సామీప్యమును ప్రసాదించు పూర్ణ గురువగు రాముని యందే, ఆస్తికుడైన హనుమంతుడు స్థిరముగా నిలచెను. ఆ తరువాత భగవత్తత్త్వముతో సిద్ధులను ప్రదర్శించు కృష్ణుని ఆశ్రయించ లేదు. హనుమంతుడు నాస్తికుడు కాదు కాన ఆయనకు ఆ భగవత్తత్త్వముతో (కృష్ణ) అవసరము లేదు కదా?

శ్లో॥ ద్వాపరే హ్యుభయాకాంక్షాః, కిఞ్చ నాస్తిక బుద్ధయః
గీతా గురుశ్చ భగవా, నస్మి సిద్ధి ప్రదర్శకః॥ 22

తా॥ ద్వాపరములో ఐహికము-ఆముష్మికము (ముక్తి) రెండింటిని కోరుచుండిరి. మరియు కొంత నాస్తిక బుద్ధి కూడా ఏర్పడెను. అందువలన నేను అష్టసిద్ధులను ప్రదర్శించు భగవత్తత్త్వముతో కూడిన, గీతను బోధించు గురు స్వరూపముతో

(అర్ధనారీశ్వరుడగు శివ స్వరూపము అగు పితృ రూపంలో రావలసి వచ్చినది. గీతలో "అహం బీజ ప్రదః పితా" అని కృష్ణుడు తనను పితృ స్వరూపంగా బోధించినాడు) కృష్ణస్వరూపము గురురూపమైన బ్రహ్మదేవుడు మరియు మాతృరూపమైన విష్ణుదేవుడు కలిసిన శివదేవుడగు పితృస్వరూపము, తండ్రిలో గురువు యొక్క శిక్షణ కాఠిన్యము, తల్లి యొక్క వాత్సల్యము కలిసి మిశ్రమముగా ఉండును.

శ్లో॥ కలా వైహిక మాత్రార్థాః, పతితాః పూర్ణనాస్తికాః
అతోఽహం భగవత్తత్త్వై, స్సిద్ధైరస్మి ప్రదర్శకః ॥ 23

తా॥ కలియుగములో కేవలము ఐహికములనే కోరుచున్నారు కాన, మాతృస్వరూపమగు విష్ణురూపముతో నుండి వామ భాగమగు మాతృ రూపమైన(శక్తి రూపమైన) భగవత్తత్త్వముతో అనేక సిద్ధుల రూపంలో అష్టసిద్ధి ప్రదర్శనములతో నాస్తికులను మార్చుచు ఐహికములను ఇచ్చుచున్నాను.

శ్లో॥ అద్వైతం మద్దయాదేయం, కణ్ఠచామీకరం న తత్
నాప్తప్రాప్తి ర్న సిద్ధార్థో, న సాధ్యం గమ్యదేశవత్॥ 24

తా॥ అద్వైత కైవల్యము నేను దయతో ఈయవలసినదే తప్ప, మెడలోని బంగారు గొలుసు పోయినదని భ్రమపడి, తరువాత ఉన్నదని గ్రహించి, పొందినట్లు కాదు. తాతతండ్రుల ఆస్తి వలె అది సిద్ధమై పొందబడినదీ కాదు. నీ ప్రయత్నము చేత, సాధ్యమై సాధింపబడునదీ కాదు. నడచిపోయి, ఒక ఊరిని చేరినట్లు ప్రయత్నసాధ్యమూ కాదు. (మెడలోని బంగారు గొలుసుగా శంకరులు చెప్పుట సాధకులను జ్ఞానమార్గమునకు మరలించుటకు చెప్పినట్టి ఉత్సాహప్రదమగు వాక్యమని గ్రహించవలెను)

శ్లో॥ అన్యథోచ్యేత బౌద్ధానాం, నాస్తికానాం మనోహరమ్
సులభప్రాప్తికృష్టో హి, కుర్యాద్వేత్తుం పురోమతిమ్॥ 25

తా॥ "మెడలోనున్న బంగారు గొలుసు పోయినదని భ్రమించి ఉన్నదానినే, మరల అన్యుల చేత బోధింపబడి జ్ఞానము చేత పొందుట వంటిది. బ్రహ్మప్రాప్తి" అని అచార్యులు చెప్పినారు గదా అని సంశయించపనిలేదు. నాస్తికులగు బౌద్ధులను ముందు



బ్రహ్మమును గురించి శ్రవణము చేయు మొదటి జ్ఞానదశకు అకర్షించుటకు, "వినితెలుసుకొన్నంతనే సిద్ధించును" అని చెప్పబడినది. కాన ప్రయోజనము కొరకు శంకరులు అట్లు చెప్పినారు. అంతే.

శ్లో॥ సాన్ద్రాసాన్ద్ర దశాభ్యాంతు, నభిన్న స్తత్త్వతో హ్యహమ్
బాలప్రౌఢ ద్విబోధేన, కిం తత్రాస్తి గురు ద్వయమ్? ॥ 26

తా॥ ఒకచోట సాంద్రత చెందుట, మరియొక చోట సాంద్రత చెందకుండుటచేత, నేను వేరువేరుగా లేను. తాత్త్వికంగా అంతా నేనొక్కనిగా యున్నాను. ఒక అచార్యుడు బాలునికి బోధించుటలో సాంద్రత లేని పలుచని జ్ఞానమునే చెప్పును. అదే అచార్యుడు ప్రౌఢునికి బోధించునపుడు సాంద్రతతో గూడిన గహనమైన జ్ఞానమును బోధించును. ఇంతమాత్రమున ఇరువురు అచార్యులున్నారా?

శ్లో॥ అధర్మం రాక్షసప్రేతా, ధర్మం దేవా మదాజ్ఞయా
ఆవిశన్తి హ్యహందేవా, ధర్మం కోఽపి న బాధతే॥ 27

తా॥ నా అజ్ఞమేరకే, దేవతలు, ధర్మపరుని వెంట నుండి వానినావేశించి యుందురు. నా అజ్ఞమేరకే, అధర్మపరుని, రాక్షసపిశాచాదులు ఆవహించి వెంటబడుదురు. నా ఆజ్ఞలేనిచో నీవెంత ఆరాధించినా, ఏ దేవతయూ నీకు ప్రసన్నము కాదు, ఏలననగా సర్వదేవతలూ నేనే. నా అజ్ఞలేనిదే, ఎవరెన్ని ప్రయోగములను చేసినా, రాక్షసపిశాచాదులు నిన్ను ఏమియును చేయజాలవు. నీ ధర్మా ధర్మ కర్మలననుసరించియే నా ఆజ్ఞలుండును. ధర్మపరుని, ఏ దుష్టశక్తియును ఏమీచేయజాలదు.

శ్లో॥ ఇహ జన్మని కుత్రాపి, కాలేత్వాం గృహ్ణతే గ్రహాః
తే కర్మఫలమాత్రా హి, జ్యోతిషం తత్త్వశాస్త్రగమ్॥ 28

తా॥ నీ పూర్వజన్మ కర్మఫలమును, నీవు ఈ జన్మలో, ఈ సృష్టిలో, ఎక్కడఉన్నా, నిన్ను పట్టుకొని, దశలలో అనగా-నేను నిర్ణయించిన సమయములలో, నీకు అందచేయునవే గ్రహములు. పూర్వకర్మ లేనిదే ఈ గ్రహములు నీకేదియును కలుగజేయవు. అట్టి పూర్వజన్మ కారణము లేకుండా, అహంకారమున, నిన్ను ఎవరైనా బాధించినచో అది గ్రహ బాధ కాదు. అట్టి వారిని నేను శిక్షించి, నేను, నీకు న్యాయమును చేసెదను.

కాన, గ్రహములిచ్చు ఫలములు పూర్వజన్మ కర్మలకు సంబంధించియే యుండును కాన, గ్రహశాస్త్రము (జ్యోతిష్యము) వేదాంత శాస్త్ర విరుద్ధము కాదు, అంతే కాదు అది వేదాంత శాస్త్రము యొక్క భాగమే.

శ్లో॥ ఆశీశ్శాపైః ఫలం నాన్య, త్ప్రజ్ఞయా న చ పూజయా
అకర్తుః క్షమతే శిక్షా, తదుద్దిష్టైవ నో పునః॥ 29

తా॥ ఆశీస్సులచేత అధర్మఫలము రద్దుకాదు. శాపాల చేత ధర్మఫలం తప్పిపోదు. ధర్మఫలము లభించే సమయంలో కాకతాళీయకంగా ఆశీస్సులు తోడుకావచ్చును. అంతమాత్రాన ఆశీస్సుల వలన పుణ్యఫలాలైన సుఖాలు రాలేదు. కాకతాళీయకంగా, అధర్మఫలాలు లభించే సమయానికి శాపాలు తోడు కావచ్చును. అంతమాత్రాన వారి శాపాల వలన అధర్మ ఫలాలైన కష్టాలు రాలేదు. ఆ సమయానికి వారు నిమిత్తమాత్రంగా తోడగుదురు. తెలివితేటలచే కుయుక్తులచే ధర్మమని వాదించినంత మాత్రాన దుర్యోధనుడు శిక్షించబడలేదా? పూజలు చేసినంత మాత్రాన రావణుడు శిక్షంచబడలేదా? ఇది నిప్పు, ఇది పగడము అని నా చేత నిర్ణయించబడినది. నీ తెలివితేటలచే, పూజల చేత పగడము నిప్పుకాదు. కాన, ధర్మాధర్మాలు నాచేత నిర్ణయించబడినవి. నీ తెలివి తేటలచేత కాదు. పగడము నిప్పుకాదు. నిప్పు పగడము కాదు. కాన, శాస్త్రముద్వారా నాచే నిశ్చయించబడిన ధర్మాధర్మఫలములు మారవు. అధర్మ ఫలము రద్దు కావలయునన్న నా వద్ద క్షమాపణ కోరి, దిద్దుకొని, మరల చేయకుండుటయే ఏకైక మార్గము. శిక్షకూడా ఈ మార్పు కొరకేగదా. మార్పు వచ్చినచో ఇక శిక్ష ఎందులకు? కాన, ఈ మార్గము ద్వారానే పాపములు అనుభవించకయే రద్దుఅగును.

శ్లో॥ న ముక్తౌ వాద పూజాభ్యాం, దుర్యోధన దశాననౌ
అపునః క్రియయా ముక్తి, స్సర్వవ్యాపీ ఫలప్రదః ॥ 30

తా॥ దుర్యోధనుడెంత వాదించినా, రావణుడెంత పూజించినా, దిద్దుకొనకుండా చేసి పట్టుపట్టిన అధర్మఫలముననుభవించక తప్పలేదు. కాన, దిద్దుకొనకుండా, పాపమురద్దుకాదు. ధర్మాధర్మముల ఫలముల నిచ్చు భగవానుడు విశ్వమంతయును వ్యాపించియున్నాడు. కాన, అతడి నుండి ఎవరును తప్పించుకొనలేరు. సీతాపహరణము



చేసిన రావణుడు, రామునికి తెలియకుండా తప్పించుకపోయినా, దుర్యోధనుడు ధర్మరాజును వెడలగొట్టినా, సర్వవ్యాపకుడగు పరమాత్మ ఇద్దరికీ అధర్మఫలాలను అందచేసినాడు గదా.

శ్లో॥ ధృతరాష్ట్ర స్స్వపుత్రేణ, నాభిజ్ఞాతో నర స్తథా
స్థూలేన వాసనా నష్టా, ధర్మాదాప్నో త్యనుగ్రహమ్॥ 31

తా॥ ధృతరాష్ట్రుడు దుర్యోధనుడి కోసం ఎంతో పాపం చేశాడు. అయినప్పటికి పైలోకంలో ధృతరాష్ట్రుని దుర్యోధనుడు గుర్తించను కూడా గుర్తించలేదు. స్థూలశరీరంతో పాటు ఇహజన్మవాసనలు కూడా పోతాయి. పుత్రశోకంతో నున్న అర్జునుడిని పైలోకంలో అభిమన్యుడు "ఎవరు నీవు?" అని ప్రశ్నించాడు! ఈ ఒక్క విషయాన్ని గుర్తిస్తే చాలు. జీవుడు అధర్మం చేయలేడు. ధర్మాచరణతో నా అనుగ్రహానికి పాత్రుడై తరిస్తాడు,

శ్లో॥ రామో ధర్మేణ దేవోఽభూ, న్మూఢో రక్షో దశాననః
ధర్మం రక్షామి గాం నిత్యం, గోపాలం మా మతో విదుః॥ 32

తా॥ రాముడు ఏ పూజలూ చేయలేదు. ఏ గ్రంధములూ వ్రాయలేదు. కేవలము సామాన్యమానవులకు సైతము తెలియు ధర్మముల నాచరించి అందరి చేతను దేవుడనిపించుకొని ఊరూరా ఆలయములను కట్టించుకున్న మహాత్ముడు. రోజూ సహస్రలింగాభిషేకపూజలు చేసి, నాలుగు వేదాలు, 6 శాస్త్రాలు తన పదితలలలో ఇముడ్చుకొన్న రావణుడు సామాన్యధర్మాన్ని ఉల్లంఘించి ఎందరు చెప్పినా మొండి తనంతో వినక అందరితో రాక్షసుడని పించుకొని శిక్షించబడినాడు. కాన, ధర్మము యొక్క గొప్పతనమును తెలియుము. ధర్మమే ఈ గోవు. నేను సదా ధర్మమును రక్షింతును కాన, నన్ను గోపాలుడని పండితులు పిలుతురు.

శ్లో॥ పూర్వహేతో ర్నభక్తోఽపి, న చేదన్యోఽపి దణ్డదః
భక్తిః ప్రేమ ప్రియానన్ద - హృన్నస్వార్థేఽయశ శ్చుచే॥ 33

తా॥ పూర్వ జన్మ కారణముండి ఈ జన్మలో అపకారము చేయుచున్న శత్రువును ఈ జన్మలో నేను ఉపేక్షింతును. నీవు నా భక్తుడవైననూ వానికి అపకారము చేయజాలను ఏలనన వాని చేత నీకు ప్రత్యపకారమును చేయించిన వాడను నేను కదా. అట్లు కాక,

నీ శత్రువు నీకు నిష్కారణముగా - అనగా పూర్వ జన్మ కారణము లేకుండా అపకారము చేసెనేని, నీవు నా భక్తుడవు కాకున్ననూ నీ శత్రువును నేను దండించి నీకు న్యాయమును చేసెదను నా శాసనము నందు అధర్మము ఎప్పటికిని తప్పించుకొనలేదు. ఐతే, ఇక, భక్తి అనవసరము కదా - అన్నచో నిజమైన భక్తి ప్రతిఫలమును కోరదు. నిజమైన ప్రేమ, తాను ప్రేమించువాని సుఖమును కోరునే తప్ప, తన సుఖమును కోరదు. నీవు నా భక్తుడవు కాన, నీ దుష్కర్మఫలమును తప్పింతునేని, అది నాకు అపకీర్తి నిచ్చును. దానివలన దుఃఖింతును. నా భక్తుడవైన నీవు నా దుఃఖమును సహింతువా? నా ఆనందమునే గదా కోరుచున్నావు. కాన, నా ధర్మపాలనకు అడ్డము వచ్చి, నాకు దుఃఖము కలిగించకుము.

శ్లో॥ ధర్మచక్రం గతా ముక్తా, నాఽధర్మం జన్మమృత్యుగాః
శాన్తా స్తృప్తా హి మే దాసా, శ్చక్రాతీతోఽస్మి కేవలః ॥ 34

తా॥ విచారించి చూసినచో, ముక్త జీవులూ, కర్మ చక్రాన్ని తప్పించుకొనలేదు. వారు సత్కర్మలను చేయుచూ, నా సేవకులై , అసత్కర్మ వాసనలగు సద్బుద్ధులను పెంచుకొనుచు, వాటివలన మరల మరల నా సేవారూపసత్కర్మలనే చేయుచున్నారు. వారు జన్మమరణ దుఃఖరహితులై, జన్మ మరణాలలో కూడా శాంత చిత్తులై మరలమరల జన్మించుచూ, నా కార్యమును నిర్వహించుచున్నారు. వారు అధర్మకర్మ చక్రము నుండి తప్పించుకొని, దుఃఖహర్షరహితులై, శాంతులై, ధర్మకర్మ చక్రమున భ్రమించుచూ, సంతృప్తులై యున్నారు. అధర్మకర్మచక్రమున పడిన వారు, దుఃఖముతో అసంతృప్తితో భ్రమిస్తున్నారు. ఇదే తేడా తప్ప, కర్మ చక్రమును అతిక్రమించిన వాడు నేను తప్ప, రెండవవాడు లేదు.

శ్లో॥ క్రియాయాః ప్రతి కర్మస్స్యా, దహం మే సుఖమిత్యపి
అహన్తా మమకారౌ తా, వన్యోన్యాశ్రయ విస్మృతౌ ॥ 35

తా॥ నీవు,స్వామి కార్యములో పాల్గొని క్రియాత్మకంగా ప్రేమిస్తే ఆయన నిన్ను క్రియాత్మకంగా ప్రేమిస్తాడు. నీ చర్యకు ప్రతిచర్యయే స్వామి-"నేను" "నాసుఖము" -ఈరెండే అహంకార-మమకారాలు.ఇవి ఒకదానినొకటి ఆశ్రయించి ఉన్నవి. ఇందులో ఏ ఒక్కదానిని మరచినను, రెండవది కూడ ఎగిరిపోవును.



శ్లో॥ నిర్మమో భగ్నబాహశ్చ, నిరహంయు స్తిరస్కృతః
కార్యవీర్యో యోగసిద్ధ, స్తాభ్యాం భ్రష్టోఽ భవ త్వరమ్॥ 36

తా॥ కార్తవీర్యార్జునుడి ఉన్న రెండు చేతులనూ తుంచి వేసితిని. కానీ, వాడు తన సుఖమును విస్మరించినాడు, కాన, దానిని గురించి చింతించలేదు. ఎన్నో అవమానములను చేసితిని. తాను రాజునన్న "అహం" ను మరచినాడు. కాన చింతించలేదు. నా సేవలో మునిగినాడు కాన, అనుగ్రహించబడినాడు. యోగసిద్ధుడైనాడు. ఆ తరువాత వానిలో ఈ రెండు (అహంకార, మమకారాలు) మేల్కొన్నవి కాన, జమదగ్నిని అవమానించి, కామధేనువును కోరి యోగభ్రష్టుడయ్యెను.

శ్లో॥ పరీక్షా కరణం కర్మ - సిద్ధాన్తో యేన విచ్యుతాః
ఫలార్థినః ప్రియా నిత్యం, తిష్ఠన్త్యస్మా న్మయాధృతః ॥ 37

తా॥ కర్మ సిద్ధాంతముకూడ, నా పరీక్షకు సాయపడుచున్నది. నేను కర్మ ఫలముల నేమియును రద్దుచేయజాలనను కర్మ సిద్ధాంతమువలన, ఫలము కొరకే నన్ను ఉపాసించు జీవులు జారిపోయి, ఫలము లేకున్ననూ నన్ను ఉపాసించు ప్రీతి గల ఉత్తమ భక్తులు ఎవరో తెలుచున్నారు గదా. అందువలనే, నేను ఈ కర్మ సిద్ధాంతమును ఖండించక, ఆదరించి, దానిని నిలువుచున్నాను.

శ్లో॥ ధర్మ ఏవ స్వభావో మే, సత్యకారుణ్య శాన్తిమాన్
ధర్మఘ్నా న్దణ్డయామ్యాశు, సాధకానాం సహాయదః ॥ 38

తా॥ సత్యము, కారుణ్యము, శాంతి, కల ధర్మమే నా స్వభావము. ధర్మమును భం.వరచిన వారిని వెంటనే దండింతును.అట్లు దండించి సాధకులకు సహాయపడుదును.

శ్లో॥ యోగారూఢస్య హి శమ, స్సమత్వం యోగ ఇత్యపి
గీతా దానన్దకోశో హి, శమ స్తన్నిగ్రహోఽధికః ॥ 39

తా॥ ఒకడు యోగ సిద్ధిని పొందినవాడని చెప్పుటకు కారణమైన లక్షణము ఈ సమత్వరూపమైన శాంతియేనని గీతలో వచించియున్నాను. యోగారూఢుని స్థితికి

కారణమైన లక్షణము శాంతియేనని చెప్పబడుచున్నది("యోగారూఢస్యతస్యైవ, శమః కారణముచ్యతే" అని గీత) కాన, నా మూల స్వభావము శాంతియే. ఆనందము శక్తి స్వరూపము. ఆ శక్తి స్వరూపమును నిగ్రహించుటయే ఆనందకోశము. ఆ నిగ్రహ స్వరూపమే శాంతి. నా శాంతి, ఆనందమును, నిగ్రహించి యున్నది. కాన, శాంతియే ఆనందము కన్న గొప్పది. (నిగ్రహించువాడే గొప్ప వాడు కావున). సుఖదుఃఖముల సమత్వమే యోగమనియు "సమత్వమే యోగము" ("సమత్వం యోగ ఉచ్యతే") అనియు గీతలో చెప్పియున్నాను. ఈ సమత్వమే శాంతి.

శ్లో॥ ఆనన్దో నయతో హర్ష - వృద్ధి ర్న బ్రహ్మ కర్మణామ్
అన్తే ప్రణవశాన్తి స్త్రి, స్త్రిమూర్త్యక్షరయోజితా ॥ 40

తా॥ సంతోషాతిశయమే ఆనందము. ఆనందము యోగ లక్ష్యము కాదు. ఆనందమే లక్ష్యమని వాదించు ఆనందవాదుల మతము యుక్తము కాదు. ఆనందము కోశములో నియమించబడిన పదార్థము. నియమించబడునది బ్రహ్మము కాదు. నియమించునదే బ్రహ్మము. శాంతి, దానిని (ఆనందమును) నియమించుచున్నది కాన శాంతియే బ్రహ్మము. శాంతియే సర్వసాధనలక్ష్యము. కావుననే, ప్రతికర్మకు చివర, ప్రణవస్వరూపమైన-అనగా మూడు అక్షరములగు అకార-ఉకార-మకారములతో త్రిమూర్త్యాత్మకంగా ఉన్న నాతో అనగా ఓంకారంతో చేర్చి, నాత్రిమూర్తి సంకేతముగా నా అసలు స్వరూపమైన శాంతి శబ్దమును మూడుసార్లు ఉచ్చరిస్తారు. (ఓం శాంతిః శాంతిః శాంతిః అని). అనగా-ఇదే సర్వసాధన కర్మల లక్ష్యము. అనగా లక్ష్యమైన నేనే ఓంకారము. అ-ఉ-మ కారములతో కూడిన ఓంకారమే త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మమైన నేను. నా అసలు స్వభావమే శాంతి. త్రిమూర్తి సంకేతంగా, మూడు అక్షరాలాతో గూడిన ఓంకారంతో, మూడుసార్లు శాంతి శబ్దాన్ని ఉచ్చరిస్తారు. కాన, అన్ని ఆరాధన క్రియలకు ఫలస్వరూపమే శాంతి. అదే బ్రహ్మము.

శ్లో॥ అనన్త జన్మవాత్సల్య - మనన్త జగతాం మమ
యోగశాన్తోఽస్మి చత్వార - స్తవాశాన్తి స్తు చిన్తయ ॥ 41

తా॥ అనంతకోటి బ్రహ్మాండాలలో అనంత కోట్ల జీవరాశులూ నాబిడ్డలే. నీకు ఒక జన్మమమకారమే నీ బిడ్డలపై కలదు. నాకు అనేక జన్మల వాత్సల్యము బిడ్డయగు



ప్రతి జీవునిపైనను కలదు. ఒక్క జన్మమమకారంతోనే, నలుగురు బిడ్డలు కల కుటుంబములోనే నీవు సతమతమై, అశాంతితో నుందువేని, ఇందరు బిడ్డల విశ్వకుటుంబములో, ప్రతి బిడ్డపై అనంతకోటి జన్మల మమకారము గల నేను ఎంత సతమతమై అశాంతితో ఉండాలి? ఆలోచించుము. కానీ, నేను పరమ శాంతితో ఉన్నాను. నిర్వికారంగా నిశ్చలంగా యోగ సిద్ధుడనై యున్నాను. నన్ను ఆదర్శముగ తీసుకొనుము.

శ్లో॥ మర్త్యోఽశన బలా ద్దుఃఖ - నిరయో హర్షనాకవాన్
బ్రహ్మలోక శ్శమో యోగా, ద్యోగీ మర్త్యోఽపి ముచ్యతే ॥ 42

తా॥ దుఃఖము నరకము. సంతోషమే స్వర్గము. ఈ రెండింటిలో శక్తి వ్యయము ఉద్రేకముల వలన కలిగి శక్తి విహీనుడగును కాన, ఇవి నిత్యములు కావు. శక్తి లేని వాడు దుఃఖించలేడు, సంతసించలేడు. దుఃఖహర్షాలలో ఉద్రేకం వల్ల శక్తిని పోగొట్టుకొన్నవాడు మరలమరల ఆహార నిద్రాదుల వలన శక్తిని సంపాదించుకొనుచు మరల, పోగొట్టుకొనుచుండును.ఇదే నరక-స్వర్గముల నుండి పడి మర్త్యలోకమునకు వచ్చుట. మర్త్యలోకమనగా మరల శక్తిని సంపాదించుట.ఈ మూడు లోకముల పరిభ్రమించు వాడే మూర్ఖుడు. యోగి ఈ స్వర్గ నరకములను త్యజించును. అనగా ఉద్రేకములను పొందక, శక్తిని కోల్పోవడు. శాంతమే బ్రహ్మము. మర్త్యలోకమున ఉండుచూ ఈతడు బ్రహ్మలోకముననే ఉండును అనగా - ఆహారనిద్రాదుల వలన శక్తిని సంపాదించుచూ, శాంతము వలన, శక్తిని కోల్పోవక, శక్తి దినదిన వృద్ధియగుచుండ, మహాశక్తిమంతుడై జీవించియుండగనే ఈశ్వరత్వమును పొందును.

శ్లో॥ శక్తిమా నీశ్వరో లోకే, సోఽహం చర్చా శమో హి విత్
నిర్వికారస్థిరో భక్తః, కర్మీ ముక్త స్స సర్వకృత్ ॥ 43

తా॥ లోకమున శక్తిమంతుడే ఈశ్వరుడు కాన యోగియే సిద్ధుడై ఈశ్వరుడగుచున్నాడు. అతడే నేను. శాంతితో గూడిన శక్తి వలన అతడు ఓర్పుతో విచారణ చేయగలడు కాన, పూర్ణజ్ఞానియగును. ఉద్రేకములు గల అల్పశక్తిమంతుడు ఓర్పుతో విచారణ చేయు శక్తి ఉండదు కాన, పూర్ణజ్ఞానికాలేడు. శక్తిమంతుడే అన్ని కర్మలను సునాయాసంగా చేయగలడు. శక్తిమంతుడే, సుఖదుఃఖములందు నిర్వికారుడై యుండుటవలన,

నాయందు స్థిరభక్తి కలిగి యుండును. కాన, యోగియే జ్ఞాని, కర్మి మరియు భక్తుడు. యోగరహితుడేదియూ కాలేడు.

శ్లో॥ జగత్కుటుమ్బ నేతృత్వ - శాన్తి మీశత్వ మిచ్ఛసి
కుటుమ్బాల్పశమః ప్రాక్పే, త్స్ఫులిఙ్గోఽథ మహానలః ॥ 44

తా॥ నేను ఈ జగత్తునకు యజమానిని. తల్లిని, తండ్రిని. ఇంత పెద్ద సంసారకుటుంబమున ఉండియును, నేను పరమశాంతితో ఉన్నాను. నలుగురు గల కుటుంబమున నీవు శాంతితో ఉండజాలవేని, ఒక మహాగ్ని యొక్క నిప్పురవ్వ వలె నేను "శ్రీ దత్తుని అంశను "అని చెప్పకొను అర్హతను కూడ కోల్పోవుచున్నావు. నాశాంతి సముద్రములో, నీవు శాంతి బిందువు కూడ కాలేని ఎడల, ఇక నీవు శాంతి సాగరమగు నేనెట్లు కాగలవు? చిన్న కుటుంబమునే, నీశాంతి స్వభావమునకు భంగము రానీయకుండగ, నిర్వహించుకొన లేని నీవు, నేనుగా మారవలయునని, నా కైవల్యమునే కోరుచున్నావే! దానిని, నీకిచ్చినచో, ఈ మహాసంసారమును నిర్వహించునపుడు నీవెంత అశాంతిని పొందెదవో ఊహించుకొనుము! కాన, ముందు, నీ చిన్న కుటుంబమును నిర్వహించుచూ, నీలోని శాంతి స్వభావమునకు భంగము రానీయకుండా ఉండగలుగు సామర్థ్యమును పొంది, నిప్పురవ్వగా ఉండగలుగు స్థితికి రమ్ము. ఆ తరువాత, జగత్తు అను ఈ కుటుంబమును నిర్వహించుచూ, శాంతి స్వభావమును కోల్పోవని ఈశ్వరతత్త్వమును సంపాదించుటను ఆలోచింతము.

శ్లో॥ యన్త్రచక్రభ్రమో గ్రాహ్యో, భయదుఃఖం నశాన్తిమాన్
జీర్ణవస్త్రం త్యజే దన్తే, మరణం జన్మ మే తథా ॥ 45

తా॥ కర్మ చక్రమునుండి తప్పించుకొన పనిలేదు. ఒకానొకడు తిరణాలలో రాటము నందు తిరుగుచూ ఆనందించుచున్నాడు. కాన, జన్మ-మరణ సమయ దుఃఖమును తప్పించుకొనవలయునే తప్ప, మరణ-జన్మలను కాదు. రాటములో తిరుగుట మానుకొనుట కాదు. రాటములో తిరుగునపుడు ఏర్పడు భయదుఃఖములను పోగొట్టుకొనవలెను. శాంతముగా మరణించు వాడు, జీర్ణ వస్త్రమును త్యజించువాడెంత శాంతముగా నుండునో అంత శాంతముగా నుండును. భయదుఃఖములతో మరణించుటయే శోచనీయముతప్ప మరణము శోచనీయము కాదు.



జన్మయుశోచనీయము కాదు. నేను అవతరించునపుడు, జననమరణములను ఎలా శాంతముగా నిర్వికారంగా గ్రహిస్తానో, ముక్త జీవుడూ అలానే నిత్యమూ నా సేవలో జన్మమరణాలను శాంతంగా నిర్వికారంగా గ్రహిస్తాడు.

శ్లో॥ రామాఞ్జనేయ లలితా - శివా శ్శక్తే శ్శమగ్రహః
కపిక్రోధ పదక్షేప - నిగ్రహ శ్శాన్తి కోశవాన్ ॥ 46

తా॥ అంజనేయారాధనాంతరము రామారాధనము చేయుట, లలితాపూజానంతరము శివాభిషేకము చేయుట శాంతి అందురు. దీనిలో అంతరార్థమేమి? యోగము ద్వారా శక్తిని సంపాదించిన తరువాత, దానిని, శాంతితో సంయమనము చేయుటయే. లేకున్న, శక్తి, వానరుని వలెను, మహిషాసురమర్దనమున దుర్గ వలెను, చిందులు తొక్కును. అనగా శక్తిమంతుడు తప్పటడుగులు వేయును. అవి వేయకుండగ, నా శాంతి స్వరూపమును స్మరించి, నా శాంతి గుణమును తనలోనికి అవహించుకొనవలెను. ఇదే దీని అంతరార్థము. ఇదే ఆనంద శక్తికి కోశము అగు శాంతి. కోశములోనున్న పదార్థము బయటకు రానట్లు శాంతిచేత శక్తి, నిగ్రహించబడును.

శ్లో॥ ప్రాప్తేః ప్రాక్కమ్పభక్తిస్తు, ప్రాప్తే శాన్తిశ్చ సేవకే
సర్వం మయ్యర్పితం తేన, దాసోఽహం శాన్తి రర్పితా॥ 47

తా॥ నేను జీవుని ఆవేశించినపుడు అతడు పరిపూర్ణశాంతిని పొందును. అదియే, నేను అతడిలో ఉన్నట్లు గుర్తు. నేను పొందవలసినది ఏదీ లేదు. కాన, నా స్వభావము శాంతియే. ఆవేశము అనగా - అతడే నేను అగుట కదా! అంటే ఆ జీవుడూ పూర్ణ శాంతుడై యుండవలెను కదా! దుఃఖకంపాది లక్షణములు, నన్ను పొందుటకు ముందుండు భక్తి యొక్క లక్షణములే తప్ప, నన్ను పొందిన స్థితి యొక్క లక్షణము కాదు. నేను ఆవేశించగనే అద్వైతస్థితి కలుగును. అదియే పరమశాంతి స్థితి. ఇట్టి పరమశాంతి స్థితి నా సేవకునిలోను ఉండును. ఇతడు సర్వస్వము నాకు అర్పించి తనసొంతమైనది ఏమియు లేకుండును కాన పరమ శాంతిలో నుండును. నా సేవకుని నేను ఆవేశించక పోయిననూ, ఆవేశించిన వాని పరమశాంతి స్థితి వానికిని ఉండును. ఏలనన, నా దాసునికి దాసుడను కాన, నా సర్వస్వమైన శాంతి స్థితిని నేనా సేవకునికి సమర్పించి నేనును అతడి సేవకునిగ ఉండును.

శ్లో॥ సేవక శ్ఛాయయా దుఃఖ, మనుభూయ సుకర్మభిః
ప్రాప్యసేవాఫలం శాన్తో, భవేచాన్తే న చక్రగః ॥ 48

తా॥ ఈ భయదుఃఖమయమగు కర్మ చక్రమునుండి బయటపడుటయే ముక్తి, ఇది ఎట్లు కలుగును? నా సేవకునిగా మారుము. నీ సమస్త పాపకర్మఫలములను ఈ జన్మలోనే ఛాయామాత్రంగా నీచే అనుభవింప చేసి, నీ సమస్త పుణ్యకర్మలఫలంగా, నా సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తాను. దీనితో నీకిక కర్మ చక్రములేదు. నా సేవకునకు జన్మ-మరణ దుఃఖములుండవు. వాని జీవితమంతయు శాంతితో నిండియుండును. ఇది శాశ్వత వడ్డీ పథకము వంటిది.

శ్లో॥ వామదేవా న్మనురహ మిత్యుక్తేః కేవలోZద్వయః
అవేశా న్ముక్త జీవోZస్తి, పర స్సేవకసేవకః॥ 49

తా॥ "నేను మనువును" మొ॥ శ్రుతుల ప్రకారము ("అహం మనురభవం సూర్యశ్చ") వామదేవాదుల యందు అద్వైత కైవల్యము కనిపించుచున్నది. ఇప్పటినికీ లోకములో అవేశము అనగా పూనకము నందు అద్వైత కైవల్యము ప్రత్యక్షముగనే గోచరించుచున్నది. కాన, అద్వైతముక్తి సత్యముగనే కలదు. అయితే, నాకు సేవకునిగా నున్న వాడే అందరి కన్న శ్రేష్ఠుడు. ఏలననగా వానికి నేను సదా సేవకునిగా నున్నాను. అద్వైతకైవల్యము కలవాని కన్ననూ గొప్పవాడు నా సేవకుడు.

శ్లో॥ శాన్తి యోగీ మహాశక్తో, జ్ఞానీ భక్తశ్చ కర్మకృత్
ప్రాణాయామాసనైః కిం వా?, వినా శాన్తిం క్షణవ్యయైః ॥ 50

తా॥ జ్ఞానమెంత కలుగునో అంత భక్తి కలుగును. భక్తి ఎంత కలుగునో కర్మ (సేవ) అంత చేయుదురు. అయితే ఈ మూడింటికీ యోగమే ఆధారము. యోగము అనగా శక్తిని వ్యయము చేయక లోపల పేర్చుకొనుట. ఇది ఎట్లు జరుగును? సుఖదుఃఖము లందు ఏ ఉద్రేకములను చెందక, పరమ శాంతితో నుండుట వలన శక్తి వృద్ధి (శక్తి పేరుకొనుట) జరుగును. యోగము యొక్క లక్షణము శాంతియే. ఆసనములు-ప్రాణాయామము వలన అన్నము ఎక్కువగా అరిగి ఎక్కువ శక్తి పుట్టుట నిజమే కానీ, మనస్సులో అశాంతి ఉన్నచో, ఈ శక్తి అంతయు క్షణకాలములో వ్యయము అగును. కాన, శాంతిలేని అసన-ప్రాణాయామముల వలన ప్రయోజనమేమి? కాన, శాంతియే



యోగము. యోగరహితుడు శక్తిహీనుడు. అట్టివాడు జ్ఞానమును పొందుటకు కానీ, వేదనారూపమైన భక్తిని ఆచరించుటకు కానీ, సేవారూపమైన కర్మను చేయుటకు కానీ శక్తి ఏది? కాన యోగియే జ్ఞాని - భక్తుడు - కర్మి (సేవకుడు) కాగలడు.

శ్లో॥ తేజో నాదా ఇహాపి స్యు, ర్మత్సర్గా ద్దర్శనాచ్చ కిమ్?
అజ్ఞోన్మత్తా శ్శ్రితైః కూపే, న ల్లాభ స్త్రిషు కిం కృతః? ॥ 51

తా॥ ఈ పురాణములు, దైవచలన చిత్రములు-ముక్తి అనగా ఒకలోకముకు విమానములలో పోయి, మేఘరావములతో గూడిన, తేజస్సులు మెరయు చోట విహరించునట్లు చిత్రించుదురు. ఇట్లు నేను సృష్టించగలను. కానీ, అట్టి విహారములకును, ఈ లోకములో విమానముపై పోయి ఒక పర్వతముపై, మంచుమేఘములు ఉదయకాల సూర్యకాంతిలో మెరయుచుండ విహారము చేయుటకును తేడా ఏమి? ఈ లోకంలో ఈ కొండ, ఈ మంచు మేఘము ఈ సూర్యకాంతి మాత్రము నేను సృష్టించినవి కావా? ఈ లోకమున విమానము మాత్రము నా సృష్టికాదా? ఈ విమానసృష్టిజ్ఞానము మానవునకు నేను ఇచ్చినది కాదా? ఈ విమాన పదార్థములగు లోహములు నేను సృష్టించినవి కాదా? కొందరు తేజస్సులను చూచినామందురు! ఈ కనిపించు సూర్యతేజస్సు, మెరుపులకును వాటికిని తేడా ఏమిటి? ఇవి మాత్రము నేను సృష్టించినవి కావా? కొందరు నాదములు వింటిమి అందురు? ఈ లోక వీణామృదంగనాదములకును వాటికిని తేడా ఏమిటి? ఈ నాదములు మాత్రము నేను సృష్టించినవి కావా? ఇవి అన్నియు అజ్ఞాన-బాల్య-ఉన్మత్త చేష్టలతో కూడిన వాక్కులు. ఇట్టి అజ్ఞానాంధులైన ఉన్మత్తులు వారితో పాటు, ఇతరులనూ అజ్ఞానకూపమున కూలద్రోయుచున్నారు. పోనీ, అట్టి వాటిని నా శక్తిచే సృష్టించి, వారికి చూపించితి ననుకొనుడు. దానివలన నాకేమి లాభము? వారికేమి లాభము? ఈ జీవుల కేమి లాభము? ఏలాభమూ లేని పనిని నేను చేయుదునా? చేయగలిగియు చేయను.

శ్లో॥ న శూన్యం నాపి మే లోకే, జగద్భర్తా జగద్గతః
జీవోద్ధరణ కర్మాZహం, ముక్తో మత్కర్మ సేవకః 52

తా॥ ముక్తి అనగా తాను శూన్యమై నాలో లీనమగుటయని కొందరును, నా లోకమున నుండి నన్నే సేవించుచు దివ్యలోక భోగములననుభవించుట యని మరికొందరు

తలచుచున్నారు. ఈ రెండూ ముక్తి కానే కావు. ఈ రెండింటిలోను జగత్తుతో సంబంధము లేదు. నేను సదా జగత్తును భరించుచు, అనేక రూపములతో జగత్తులోనికి ప్రవేశించుచూ, సదా జగత్తుతో సంబంధము కలిగియున్నాను కాన జగత్తునుండి ముక్తి అన్నచో నా నుండియు ముక్తుడే కావలయును. నాతో సంబంధమున్నచో ఈ జగత్తుతో సంబంధముండియే తీరవలయును. వేయి మాటలేల? నేను సదా ఈ జగత్తులో విశేషించి ఈ భూలోకముననే సంచరించుచూ, సదా సర్వజీవోద్ధరణమునకై కృషి చేయుచున్నాను. నా ఈ కృషిలో పాల్గొన్నవాడు మాత్రమే ముక్తుడు. వాడే నా దాసుడు. నా వెంటసదా నాతో నిత్యసంబంధమును కలిగి యుండును. కాన, ఏ స్వార్థమూ లేక సర్వజీవులను ఉద్ధరించుటకు సదా ప్రయత్నించుటయే నిజమైన ముక్తిసిద్ధి. అట్టివానితో నిత్యసంబంధమును కలిగి యుండును. ఇదే చరమ-పరమముక్తి.

*ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం*
*శ్రీ దత్తసేవక జీవన్ముక్తి యోగోనామ*
*ద్వాదశాధ్యాయః*

ఓం

శ్రీ గురుదత్త జయ గురుదత్త

కాలభైరవ ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## త్రయోదశాధ్యాయః

## శ్రీ దత్త ఆకాశ చైతన్య విచార యోగః

శ్రీ దత్త శిష్య ఉవాచ:-

శ్లో॥ ఆకాశా త్పరమాణూనా, మాకర్షణ వికర్షణాత్
సాన్ద్రాసాన్ద్ర దశాతీతే, కథం, బ్రహ్మణి సద్గురో? 1

తా॥ దత్త శిష్యుడు వచించెను:-

శూన్యమైన ఆకాశము ఉన్నందువలన, పదార్థ పరమాణువుల యొక్క-సన్నిహిత సంబంధము, దూరముగా జరుగుటయు, అనునవి కారణములుగా, పదార్థము సాంద్రము చెందుటయు, పలుచబడుటయు జరుగును గదా. ఓ సద్గురూ! వీటికి అన్నింటికీ అతీతమైన బ్రహ్మము నందు ఇది ఎట్లు జరుగును?

శ్రీ దత్తగురు భగవానువాచ:-

శ్లో॥ సాధు పృష్టం త్వయా శిష్య!, మయా దత్తం పుర స్త్వయా
యదధీతే పురాణం చ, నవం విజ్ఞాన మప్యభే॥ 2

శ్రీ దత్తగురు భగవానుడు వచించెను:-

తా॥ శిష్యా! మంచి ప్రశ్ననే అడిగితివి. నేను అనుగ్రహించి ఈ లోకమునకు ఇచ్చిన ప్రాచీన తర్క శాస్త్రమునూ, ఆధునిక భౌతిక విజ్ఞాన శాస్త్రమునూ ముందే నీవు అధ్యయనము చేసినావు కాన, ఈ ప్రశ్నను వేయగలిగితివి. నీ చేత ఈ రెండింటినీ నేను అధ్యయనమును చేయించుటకు కారణము కూడ నీ చేత ఇట్లు అడిగించుటయే.

శ్లో॥ ఆకాశ స్యోప సంహారా, జ్జగత్సర్వం సమాహృతమ్
యత్సర్వం పాద ఏకో మే, చైతన్యస్యాతి సూక్ష్మతః॥ 3

తా॥ ఆకాశమంతయును ఉపసంహరించబడగనే, జగత్తు అంతయును ఉపసంహరించబడుచున్నది. ఇది అంతయును, నా యందున్న చైతన్యము యొక్క అత్యంత సూక్ష్మమైన ఒక కిరణము మాత్రమే. "పాదము" అనగా కిరణము అని అర్థము కూడ కలదు. కాన ఈ జగత్తు నాపాదము ("పాదోZస్య విశ్వా భూతాని" అని శ్రుతి) అనగా నా కాంతి యొక్క ఒక కిరణము మాత్రమే.

శ్లో॥ అభావం ప్రాహు రత్యన్త - సూక్ష్మ మవ్యక్త మస్తి యత్
అత్యల్ప శక్తి రూపో Z య, మాకాశ శ్శూన్య ముచ్యతే॥ 4

తా॥ అత్యంత సూక్ష్మమై, గోచరము కాని దానిని "అభావము" (ఏమీలేదు) అని పిలుచుచున్నారు. అభావము అనగా ఏమీలేదని కాదు. అత్యంత సూక్ష్మశక్తి రూపమైన ఆకాశము కూడా అంతే. అంత్యంత సూక్ష్మమై గోచరము కాక ఉన్నది అనియే అర్థము. అత్యంత సూక్ష్మశక్తి స్వరూపము గోచరించనందున దానిని శూన్యము అని చెప్పుచున్నారు. (ప్రాచీన తార్కికులు ఆకాశ పరమాణువులను ప్రతిపాదించిరి.)

శ్లో॥ ఆకాశ శక్తి తత్త్వం హి, నైవ లబ్ధం నవైరపి
అభావస్య హ్యభావత్వం, సర్వమస్తి న నాస్తి హి॥ 5

తా॥ ఆకాశము యొక్క శక్తి స్వరూపమును, నవీన భూత విజ్ఞాన శాస్త్రజ్ఞులును దర్శించలేక శూన్య మనుచున్నారు. అసలు శూన్యమే లేదు. అభావమే (శూన్యము) లేదు. అంతా ఉన్నది. లేనిది అను మాటయే లేదు.

శ్లో॥ జాగ్రతో Z ప్యూహశార్దూల, శ్చైతన్య లవ నిర్మితః
చైతన్య ఘన దేహం తం, భేత్తుం శక్నోతి నాల్పతః॥ 6

తా॥ మేల్కొని పులిని ఊహించుచున్న చైతన్య ఘనమగు శరీరము కలవాడు, తన చైతన్యము (మనస్సు) యొక్క చాలా కొంచెమైన చైతన్య కణముతో నిర్మించబడిన పులిని చూచుచున్నాడు. ఆ స్వల్ప కణమైన చైతన్య శక్తి, చైతన్య ఘనమైన తన



దేహమును చీల్చలేకున్నది. ఏలనన - దేహము ఒక మహా సముద్రమంత చైతన్యము సంకోచించి ఘనీభవించినది. ఊహమయమైన పులి ఒక చైతన్య బిందువు మాత్రమే. కాన ఊహమయమైన పులి కూడ చైతన్య బిందువు కాన, సత్యముగనే ఉన్నది.

శ్లో॥ చైతన్య ఘన శార్దూల, శ్చైతన్య ఘన మానవమ్
అధికో హన్తి చాల్పో Z లం, స్వాప్నికం స్వాప్నిక స్తథా॥ 7

తా॥ యథార్థమైన పులి, యథార్థమానవుడు - ఇరువురును చైతన్యఘనములే. పులిలో ఎక్కువ చైతన్య శక్తి ఘనీభవించియున్నది కాన యథార్థ మానవుని యథార్థపులి చంపుచున్నది. అట్లే, స్వప్నంలో మనోమయమైన పులి, ఎక్కువ శక్తి కల్గినందున, మనోమయుడైన తక్కువ చైతన్య శక్తి గల మానవుని చంపుచున్నది.

శ్లో॥ అత్యన్త విరలాం శక్తి, మాకాశం విద్ధి కాశ్యప!
ప్రాగేష వ్యక్త రూపాణాం, స్వసాన్ద్రాణాం క్వచిత్క్వచిత్॥ 8

తా॥ శక్తి బాగుగా పలుచబటి విస్తరించిన స్వరూపమే ఆకాశ మని తెలియుము. ఓ కాశ్యపా! ఈ ఆకాశమే (పలుచని, గోచిరించని శక్తి) అచట నచట ఘనీభవించి ఈ జగత్తు రూపములు (వస్తువులు) ఏర్పడుచున్నవి. ఇవి ఏర్పడక ముందు ఆకాశము ఒక్కటియే స్వస్వరూపమున ఉన్నది.

శ్లో॥ ఘనామ్బు హిమఖణ్డాని, ప్లవన్తే సాగరే యథా
తథాZZకాశ జనిస్థాన-లయం సర్వ మిదం జగత్॥ 9

తా॥ సముద్రములో నీటి ఘనములైన మంచు ముక్కలు ఏర్పడి, కదులుచూ, మరల కరిగి సముద్రమే అయినట్లు ఈ సర్వ జగత్తు యొక్క వస్తువులూ, ఆకాశము నుండి పుట్టి, ఆకాశములో నిలచి, ఆకాశము నందే లయించును.

శ్లో॥ ఆకాశా త్సృజ్యతే వస్తు, పునస్తస్మిం శ్చ లీయతే
యోగినో దర్శయన్త్యత్ర, మమ సఙ్కల్ప సమ్భవాః॥ 10

తా॥ శూన్య మనబడు ఆకాశము నుండి సమస్త వుస్తువులు సృష్టించ బడుట, ఉన్న వస్తువులు ఆకాశము నందు లయించుట - ఈ రెండూ యోగులు చేయుచున్నారుగదా!

ఈ యోగులు నా సంకల్పము వల్లనే నా కార్యక్రమమునకు సహకారులుగా ఈ లోకమున జన్మించుచున్నారు.

శ్లో॥ సత్యాకాశే నృణాం బుద్ధౌ, చైతన్యం వర్తతే పురః
మధ్యే స్వప్నోహయో రన్తే, యచ్చాకాశ మపేక్షతే ॥ 11

తా॥ స్వప్నము కానిండు, మేల్కొని ఊహించుట కానిండు - ఏదయినా, సత్యమైన ఈ ఆకాశంలో నిలిచి ఉన్న మానవుల బుద్ధులలో స్వప్న, ఊహలకు ముందు కానీ, మధ్యలో కానీ, చివర కానీ, చైతన్యమే నిలచిఉన్నది. నిజమే. కానీ, చైతన్యము కూడ సత్యమైన ఆకాశము లేకుండ నిలువజాలదు. అనగా ఈ సత్యమైన శూన్యాకాశమంతయును అంతర్ధానము చెంది అభావమై పోయినచో, చైతన్యము, ఆకాశాతీతముగా మిగిలి ఉండదని భావము. ఇది లోకంలో కనిపించుచున్నది గదా.

శ్లో॥ మాయా వైచిత్ర్య మజ్ఞేయం, చైతన్య స్యోప యుజ్యతే
ఆకాశాతీత భావాయ, చిన్మాత్ర బ్రహ్మవాదిభిః॥ 12

తా॥ ఈ సత్యమైన ఆకాశము అనగా శూన్యము అంతా ఉపసంహరించబడినపుడు లేదా ఈ ఆకాశము సృష్టించబడక ముందు, ఈ ఆకాశమునకు అతీతంగా చైతన్యము ఉన్నదని చెప్పవలసినప్పుడు, చైతన్యమే బ్రహ్మమని వాదించువారు కూడ అట్టి చైతన్యమునకు, మనకు అందని, అనూహ్యమైన, మాయాశక్తి - విచిత్ర సామర్థ్య మున్నదన్న అంశమును సమాధానము కొరకు ఉపయోగింతురు. అనగా ఆ చైతన్యము ఈ సాధారణ చైతన్యము కాదనియే తాత్పర్యమగుచున్నది.

శ్లో॥ సాకాశస్థాఙ్గ చైతన్యం, స్వప్నోహా దిహ నాన్యథా
మమేతి వ్యవహారో Z పి, చైతన్యస్య హి విద్యతే॥ 13

తా॥ సత్యమైన ఈ ఆకాశములో నిలచియున్న శరీరము నందున్న చైతన్యము, స్వప్నములను కానీ, ఊహలను కానీ సృష్టించు చున్నదే తప్ప, సత్యమైన ఈ ఆకాశమును విడచి కానీ ఈ సత్యమైన శరీరమును విడిచి కానీ, ప్రత్యేకంగా నిలిచి, చైతన్యము, స్వప్నోహలను సృష్టించుట మనకు ఎక్కడా కనిపించదు. "చైతన్యమే నేను" అనునది సిద్ధించుట కూడ లేదు. "నాలో చైతన్యము జాగృత మైనది" అను వ్యవహారము



వినిపించుచున్నది. కాన, "చైతన్యమే, నేను అనునది, మిగిలినవియే (మనస్సు,బుద్ధి, శరీరము మొ॥) చైతన్యమునకు సంబంధించినవి. ( నామనస్సు, నాశరీరము అనే వ్యవహారము వలన) "అని అనుటకు వీలులేదు. (నా చైతన్యము అని అనుట వలన చైతన్యము "నేను" కాదు అని తాత్పర్యము.)

శ్లో॥ యథా స్వప్నా త్పురః పశ్చా, త్సత్యాకాశో వ్యవస్థితః
తథా సృష్టేః పురః పశ్చా, త్సత్యాకాశో హి విద్యతామ్. 14

తా॥ స్వప్నమునకు ముందు, తరువాత, నిజమైన ఈ ఆకాశము శూన్యమనబడు ఈ ఖాళీ స్థలము ఎలా ఉన్నదో, అలానే సృష్టించుటకుముందు, తరువాతను, మహా ప్రళయ కాలము తరువాతను, నిజమైన ఆకాశము మరియొకటి ఉండవలెను గదా. కాన ఉన్నది. (అదే "పరమ వ్యోమము.")

శ్లో॥ ఏతావా న్జాగ్రదాకాశ, ఏతావానేవ దృశ్యతే
స్వప్నోహయో స్స్మృత స్తావా, న్నైవాల్పే సృజ్యతే మహాన్॥ 15

తా॥ మనము మేల్కొని ఈ ఆకాశమును (ఖాళీస్థలమును) చూచుచున్నపుడు, మన బుద్ధిలో, ఆకాశమును, పెద్దదిగా చూచుదుమే తప్ప, చిన్నదిగా చూడము గదా. కాన, ఈ పెద్ద ఆకాశమే, ఊహలలో కానీ, కలలో గానీ, యథాతథంగా స్మరించబడి వచ్చు చున్నదే తప్ప, చిన్న పరిమాణము గల బుద్ధిలో పెద్ద ఆకాశము మరల ప్రత్యేకంగా సృష్టించబడుటలేదు.

శ్లో॥ స్మర్యన్తే సర్వవస్తూని, దృష్టఖణ్డాన్వయో నవః
మమ వైచిత్ర్య మాకాశ - పరిమాణ నిజగ్రహః॥ 16

తా॥ కలలో గానీ, ఊహలోగానీ, వస్తువులు, ఆకాశంతో పాటు, యథాతథంగానే స్మరించబడుచున్నవి. ఊహలో ఎనిమిది పాదములు కల కొత్త జంతువును జీవుడు సృష్టించుట లేదు. ఏలననగా - ఆ పాదాలలో ఒక్కొక్క పాదమూ ఈ లోకంలో చూడబడినదే. చూడబడిన వస్తువుల భాగాలనే కూర్చి, కొత్తదిగా సృష్టించినట్లు జీవుడు భావిస్తూ ఉన్నాడే తప్ప, జీవుడు కొత్త దానిని సృష్టించలేదు. (ఈ విధంగా ఈ నాటి

యంత్రపురుషుడు కూడ "కొత్తవి" అనబడేవి, పాత వాటిలో భాగాలను కూర్చి, స్వయంగా ఊహించినట్లు చెప్పుచున్నాడు). కొత్తగా చెప్పుట భగవంతునికే సాధ్యము. కావున ఈ ఆకాశము చిన్న బుద్ధిలో, ప్రతిబింబించి చిన్నదిగా కనపడక యధాతథంగా పెద్దదిగానే కనపడుట నా విచిత్ర మాయయే.

శ్లో॥ నాస్త్యాకాశః పురస్సృష్టే, స్సంక్షిప్త ఉపసంహృతః
ఇతః పరం స న స్యా ద్వా, యదీచ్ఛా మ్యస్మి కేవలః॥ 17

తా॥ ఈ జగత్తు సృష్టించబడక ముందు ఈ ఆకాశము లేదు. మహా ప్రళయములో, మరల సృష్టి కొరకు, ఈ ఆకాశము ఉపసంహరించబడి సంక్షిప్తమై, నాలో అవ్యక్తముగా తన జగత్తుతో సహా ఉండును. అయితే నేను సంకల్పిస్తే ఈ ఆకాశము, తన జగత్తుతో బాటు, సృష్టికి ముందు వలె, లేకుండ పోవును. అప్పుడు నేను ఒక్కడినే మిగిలి యుండును. నాకు అసాధ్యము లేదు.

శ్లో॥ సజ్ఞాతో Z స్మ తృదార్ధోయ, ద్వైచిత్ర్యా న్నాన్య మార్గతః
ఆకాశాతీత మూహ్యం నో, కథం శిష్టో Z స్మి నోహగః॥ 18

తా॥ "నేను" అనునది ఒక్క చైతన్యమునకే కాక, అన్నింటికిని కలిపి లోకములో వ్యవహారమున్నందున, ఊహాతీతమైన వస్తువును అంగీకరించక తప్పనందున, ఈ ఆకాశము లేకుండా పోయినచో జీవుడేవిధముగాను ఆ పరిస్థితిని ఊహించలేడు కావున, ఈ ఆకాశము లేనపుడు నేను ఒక్కడినే ఎట్లు మిగిలియుందును? అనునది జీవుల ఊహకు అందదు.

శ్లో॥ సత్యలోక ఇతి ఖ్యాతః, పరమవ్యోమ్ని సుస్థితః
తం సత్యలోక మాధాయ, త్రయోదశ పరో మమ॥ 19

తా॥ ఈ అసత్యమైన లోకములకు ఆధారమైన ఈ అసత్యమైన ఆకాశములకును పరమాధార మైన మరియొక "పరమవ్యోమ" మనబడు ఆకాశమున్నది. ఆ పరమవ్యోమము మీద మిగిలిన పదమూడు అసత్య లోకములు నిలచియుండగా, ఈ పరమ వ్యోమమే నా సత్యలోకము అని ప్రసిద్ధి చెందినది. ఆ సత్యలోకము అన్ని లోకములకును ఆధారమైయున్నది.



శ్లో॥ మర్త్యానాం ప్రేత నరక - పితృ జ్యోతి స్స్వరాది హి
న దృశ్యం వివిధ వ్యోమ - విచిత్రా Z నూహ్య బన్ధనమ్॥ 20

తా॥ భూలోకములోని అవాంతరలోక మగు మర్త్యలోకము పైన భూలోకము యొక్క ఇతర అవాంతర లోకములైన ప్రేత - నరక - పితృలోకాలు కానీ, జ్యోతిర్లోకముకానీ , స్వర్గలోకము మొ॥ లోకాలు కానీ జీవులకు కనిపించవు. ఒక్కొక్క లోకమునకు ఒక్కొక్క ఆకాశము నా విచిత్ర మాయా శక్తి చేత ఆధారమై యుండి ఈ ఆకాశములన్నియును, పరస్పరము ముడిపడి యుండును.

శ్లో॥ మహ స్తపో జన వ్యోమ, త్రిమూర్తీనాం జగత్త్రయమ్
మర్త్యాది జన పర్యన్తం, భ్రాన్తో మాం న హి పశ్యతి॥ 21

తా॥ మహర్లోకము, తపోలోకము, జనలోకములు - శివ-విష్ణు-బ్రహ్మ దేవుల లోకాలు, మర్త్యలోకము మొదలు, జన లోకము వరకు భ్రాంతి వలన (అసత్యమును, సత్యముగా) చూచును తప్ప, సత్యమైన నన్ను, నా సత్యలోకమును చూడజాలడు.

శ్లో॥ సఙ్ఘాత శ్చేతనా గీతా, సఙ్ఘాతో Z హం స చేతనః
చేతనా Z ప్యస్తు సఙ్ఘాతే, ప్రత్యేకం పూర్ణ మప్యహమ్॥ 22

తా॥ "సంఘాతము" (సమూహము) "చేతన" అని గీతలో అవయవముల శరీరము, చేతన్యము చెప్పబడినది. చేతనతో కూడిన సంఘాతమే నేను. చేతనను సంఘాతములో (సమూహములో) చేర్చవచ్చును. ఈ సంఘాతములో ప్రతిదీ (అనగా ప్రతి అవయవమూ, ద్రవ్యమూ, రూపమూ, గుణమూ) ఆకాశమునకు అతీతమగుట వలన వీటి సమూహములగు నేను పూర్ణ బ్రహ్మమే. మరల విడిగా ప్రతి అవయవమూ పూర్ణ బ్రహ్మమైన నేనే.

శ్లో॥ సాన్ద్రా సాన్ద్ర దశే స్యాతాం, జీవస్యాకాశసద్దృశా
పరమార్థ దశాయాం చ, పరమవ్యోమ్ని తే మయి॥ 23

తా॥ సాంద్రత చెంది ఘనీభవించుట, పలుచబడుట అను దశలు, ఈ కనిపించు ఆకాశము సత్యముగా గల జీవుని దృష్ట్యా సత్యములే. పరమార్థ దశలో కూడ నా

తనువున ఉన్న పరమ వ్యోమమునందు నా చైతన్యమునకు ఈ దశలు జరుగగలవు. ఈ పరమాకాశమూ నేనే.

శ్లో॥ తను రూహఘనా చేయం,కర్తుం, సృష్ట్యాది సోప్యZలమ్
హస్తం నాపేక్షతే తత్ర, మద్భక్తాభయముద్రితమ్॥ 24

తా॥ నా ఊహ యగు చైతన్యశక్తియే ఘనీభవించి, నీకు కనపడుచున్న ఈ తనువుగా మారినది. ఈ తనువు శక్తి ఎంతో ఊహించుకొనుము. కాన, విశ్వముల యొక్క సృష్టి-స్థితి-లయములను చేయుటకు, ఈ తనువు అవసరము లేదు. కేవలము నా ఊహయగు చైతన్యము యొక్క కిరణము చాలును. ఆ పనులకు ఈ తనువు యొక్క చేతులు అవసరము లేదు. ఈ చేయి నా భక్తులకు అభయము నిచ్చు ముద్రలోనే నిత్యము ఉన్నది.

శ్లో॥ చైతన్యం మే స్వయం బ్రహ్మ, తద్ఘనా బ్రహ్మ మే తనుః
నమే స్సాన్ద్రాధిక న్యూన - భావో వైచిత్ర్యకారణాత్ 25

తా॥ నాలోని చైతన్యము స్వయముగ బ్రహ్మము. ఆ చైతన్యమే ఘనమై నా ఈ తనువు (రూపము) ఏర్పడినది. (ఇట్లే లోకమున కూడ జరుగును). అయిననూ, నాయొక్క అనూహ్యతత్త్వకారణంగా, ఘనము ఎక్కువ, ఘనము కానిది తక్కువ యను భేదము నాయందు ప్రవర్తించదు. అనగా విచిత్రతత్త్వము వలన భేదాభేదములు రెండును నా యందు ఉండును.

శ్లో॥ ఊహ వ్యాఘ్రో Zపి హన్తి త్వా, మిచ్ఛామి యది గీయతే
తవ దృష్ట్యా న మే దృష్ట్యా, శాదం నాగ్ని ర్దదాహ హి॥ 26

తా॥ నీవు ఊహ మాత్రంగా ఊహించుకొన్న పులి (తక్కువ చైతన్య శక్తి కలది). అధిక చైతన్య శక్తి ఘనీభవించిన నీ దేహమును ఏమియు చేయలేదు. అయినా నేను సంకల్పిస్తే, అదే, నీ దేహమును చీల్చగలదు. నేను చెప్పు ఈ గీత నీ దృష్టితో చెప్పుచున్నానే తప్ప, నా దృష్టిలో కాదు. నేను సంకల్పించినందున, ఒక ఎండు గడ్డి పరకను, కూడ అగ్ని దహించలేక పోయెను గదా. (పూర్వము బ్రహ్మము యక్షాకారమున గోచరించి జయ గర్వితులగు దేవతలకు బుద్ధి చెప్పెను).



శ్లో॥ జగతో Zసత్య వాదో Zపి, సత్య వాదోZపి సమ్మతః
శూన్యే స్వల్పానిలే గన్తా, శూన్యగామీతి కథ్యతే॥ 27

తా॥ జగత్తు అసత్య మను మతము, జగత్తు సత్య మను మతమూ రెండూ సమ్మతములే. కొంచెము గాలి కల శూన్యప్రదేశములో పోవువాడు శూన్యములో పోవుచున్నాడు అనియే చెప్పబడును. అత్యల్ప మైనది అభావము, అనగా, లేనిదిగా భావించబడును గదా.

శ్లో॥ లోకాకాశో Zస్తి సర్వత్ర, యథా స్వప్నోహయో స్సదా
అవ్యక్త వ్యక్త యో స్సత్య - లోకో Zస్తి జగతాం తథా॥ 28

తా॥ స్వప్నముకానిమ్ము, మేల్కొని ఊహించుట కానిమ్ము, ఊహాకాశమునకు ముందు, మధ్య, అంతంలోనూ ఊహాకాశంలో వ్యాపించి, సత్యమైన ఈ లోకము యొక్క అకాశమున్నది. ఊహా జగత్తు ఉన్నా, ఉపసంహరించబడినా, సత్యమైన అకాశమున్నది. అట్లే అన్ని జగత్తులూ (13 బ్రహ్మాండాలు) ఉపసంహరించ బడినా, ముందు కానీ, మధ్యలో కానీ, అంతంలో కానీ సత్యలోక ఆకాశము అన్ని జగత్తులనూ, అలానే వ్యాపించి ఉన్నది.

శ్లో॥ సత్యలోకోప సంహారే, శిష్టో Zహం కేవలో Zద్వయః
అనేనైవ హి రూపేణ, పరమ వ్యోమ వర్తినా. 29

తా॥ ఆ సత్య లోకమును కూడ, ఉపసంహరిస్తే, నేను ఒక్కడినే, అద్వితీయునిగా మిగులుతాను. అప్పుడు ఈ రూపము మాత్రమే మిగులుతుంది. ఈ రూపంలో ఏ మాత్రం ఆకాశ తత్త్వమున్న దో దానిని "పరమ వ్యోమము" అంటారు. (పరమ వ్యోమము నా తనువు లోని భాగము.)

శ్లో॥ గ్రస్తేషు సర్వ లోకేషు, సత్యలోకో న సంహృతః
యస్మి న్మే సేవకాస్సన్తి, భూమిం ప్రాప్తాః పునః పునః॥ 30

తా॥ అన్ని లోకాలు ఉపసంహరించబడినా, సత్య లోకము మాత్రము ఉపసంహరించబడదు. అందులో నా సేవకులు నివసిస్తూ ఉంటారు. వారే భూమిపై మరల మరల అవతారముల నెత్తి, నాకార్యాన్ని కొనసాగిస్తూ ఉంటారు.

శ్లో॥ ప్రియమాణే తు తస్మింశ్చ, న త్వమూహయితుం ప్రభుః
దృశ్యమానాజ్ఞశిష్టం మా, మతీతాకాశ వర్తినమ్॥ 31

తా॥ ఆ సత్యలోకమును కూడ నేను ఉపసంహరించెదనేని, ఈ రూపము మిగిలి యుండుట నీవు ఊహించలేవు. ఈ రూపము అన్ని ఆకాశముల నియమములకును అతీతమై యుండును.

శ్లో॥ పరమ వ్యోమ సర్వేషా, మాకాశానాం హి కారణమ్
మమాజ్ఞ పర భూతాని, భూతానాం ఛాయయా చితి॥ 32

తా॥ నాఈ రూపంలో ఉన్న "పరమ వ్యోమము" అన్ని బ్రహ్మాండముల ఆకాశములకును కారణము. నాఈ రూపంలో ఉన్న మిగిలిన భూతాలు (వాయు, అగ్ని, జల, పృధ్వి) అన్ని లోకాల మిగిలిన నాలుగు భూతాలకు కారణములు. అన్ని లోకాలు నా అంశములే. అయితే నా ఈ తనువులోని పంచభూతాలు ఛాయా మాత్రంగా చైతన్యంలో ప్రవేశించి, చైతన్యం ద్వారా కారణములగుచున్నవి.(ఇదే విధంగా సత్యములైన పంచ భూతములు ఛాయలుగా చైతన్యంలోకి ప్రవేశించి, ఊహలను కానీ, స్వప్నములను కానీ సృష్టించుట మానవుని యందు గోచరించును)

శ్లో॥ యదస్మి న్మమ చైతన్యం, జీవ చైతన్య కారణమ్
ప్రతిబిమ్బా స్సమే లోకా, బిమ్బం బిమ్బాన్యహం పృథక్॥ 33

తా॥ నా ఈ రూపంలో ఉన్న చైతన్యమే స్వయంగా చైతన్య రూపులైన జీవులకు కారణము కాన ఈ లోకాలన్నీ నా ప్రతి బింబాలే. నాలో ఉన్న ప్రతి భాగమునూ నేనే. (బింబమూ నేనే) నాతో ఉన్న భాగాల (బింబాల) సమూహము కూడా, మరల,నేనే. (పరిమాణనియమానికి అతీతుడను కావున)

బింబము నేనే. ప్రతి బింబము నేనే. నేను పరిమాణనియమానికి అతీతుడను కావున నాలో ఉన్న ప్రతి భాగము నేనే.

శ్లో॥ మామాంశో జీవ భూతో వా, సో Z హం జీవో Z స్మి వా మతః
అచక్షుర్గ్రాహ్య చైతన్య, మరూపం, మమ రూపగమ్॥ 34



తా॥ నాలోని భాగమగు చైతన్యము జీవుడైనది అన్నా, నేనే జీవుడనైతిని అన్నా ఒక్కటే. కన్నులతో గ్రహించబడనిది చైతన్యము కావున "అరూపము"అన్నారు. (రూపము అనగా నేత్రములచే గ్రహించబడునది) అయితే, ఆ చైతన్యము నా ఈ రూపంలోనే ఉన్నది. (పలుచబడుట వల్లనే, జీవుడు అంశమైనాడు తాత్త్వికంగా బ్రహ్మమే). తత్త్వపరంగా జీవుడు బ్రహ్మమే. కాని జీవుడు అత్యల్పమైన చైతన్య శక్తి మాత్రమే.

శ్లో॥ ఆకాశాతీత భాగేషు, కస్మింశ్చిదపి నోచ్యతామ్
పరిధి స్తస్య చాభావో, రూపాకార స్థితి చ్యుతిః॥ 35

తా॥ నా ఈ రూపంలో ఏ భాగమైననూ, ఆకాశ నియమాలకు అతీతమైనది. కావున, ఏ భాగాన్ని అయినా "నిరాకారము" అని కానీ "అకారము" అని కానీ అనుటకు వీలు లేదు. అట్లే "అరూపము" "రూపము" అను శబ్దములు కూడ పనికి రావు. ఏలననగా,- "నా ఈ భాగాలకు పరిమితి ఉంది" అంటే-ఆకాశనియమాలకు బద్ధమౌతుంది. పరిమితి లేదంటే, పరిమితి లేని ఆకాశము వలె, అప్పుడూ పరిమాణనియమానికి బద్ధమే అవుతుంది. అలానే, రూపము, అంటే నేత్రములచే స్వీకరించబడే తేజోరూపమై, తేజోనియమాలకు బద్ధమౌతుంది. "అరూపము" అంటే, నేత్రముల చేత గ్రహించబడక, స్పర్శచే గ్రహించబడే వాయువు వలె, వాయునియమాలకు బద్ధమౌతుంది. అన్నినియమాలకు అతీతమైనది కావున, ఏశబ్దము కూడ యధార్థముగా వాడుటకు వీలులేదు. అన్ని నామాలచే చెప్పబడు సర్వ వస్తువులకు అతీతమైనదే నా రూపము.

శ్లో॥ పరమ వ్యోమ్ని చైతన్యం, సాన్ద్రాసాన్ద్ర దశా ద్వయమ్
ఆదావన్తే చ మధ్యే చ, న బహిః కిఞ్చి దస్తి మే॥ 36

తా॥ నా ఈ రూపంలో నున్న సత్యమైన పరమవ్యోమములో, సత్యమైన చైతన్యము, సాంద్రతను చెందుట, పలుచబడుటయను దశలను పొందును, కాన, అది సాధ్యమే.ఈ బ్రహ్మాండముల సృష్టికి ముందు, మధ్య కాలము లోను, అంతము తరువాత కూడ నా ఈ రూపమునకు మించి "బాహ్యము" అనునది ఏమియును లేదు. (అన్ని పరమ వ్యోమము లోనే ఉన్నవి కాన).

శ్లో॥ మచ్చైతన్య సముద్రస్య, లోకా ఏతే హి బిన్దవః
యథా తవ చిదబ్ధేశ్చ, నానోహాః కిల బిన్దవః 37

తా॥ నా యొక్క చైతన్య సముద్రములోని బిందువులే ఈ లోకములు. ఎట్లు నీ చైతన్యసముద్రము యొక్క బిందువులే, నీ ఊహలుగా నుండునో అట్లే నా యొక్క చైతన్యసముద్రములోని బిందువులే ఈ లోకములు.

శ్లో॥ ఏక బిన్దౌ సముద్రాభే, జీవో బిన్దు స్తదన్తరే
చిద్ఘన స్తనురేవాయం, చిద్ఘనో ఽహం చ సా చ మే॥ 38

తా॥ నా యొక్క మనో (చైతన్య) బిందువు లైన అనేక లోకాలలో,ఒకానొక లోకమనే సముద్రంలో నున్న బిందువు ఈ జీవుడు. మనో బిందువైన లోకంలోని దాని బిందువైన చైతన్యము ఘనీభవించగా ఏర్పడినదే ఈ జీవుని "చైతన్య ఘన" మనబడు శరీరము. నేనును నా మనస్సు ఘనీభవించి ఏర్పడిన చైతన్య ఘనమే ఈ తను రూపంగా ఉన్నది. అంటే ఈ తనువుకు, జీవుని తనువుకు శక్తిలో ఎంతో భేద మున్నది.

శ్లో॥ మదంశ మనసోఽంశాంశ-ఘనా జీవతను స్తనోః
అంశాంశ ఊహ ఏతస్య, కథ మూహై రహం గతః? 39

తా॥ నా (తనువు యొక్క) అంశమే చైతన్యము. దానిలోకి బిందువు అనగా దాని అంశమే భూలోకము. దానిలోని అంశమైన చైతన్య ఘనమే జీవ శరీరము. ఆ జీవశరీరము యొక్క అంశమే జీవ చైతన్యము. దాని అంశయే జీవుని ఊహలు. కాన, నా అంశ యొక్క - అంశ యొక్క-అంశ యొక్క అంశలగు జీవుని ఊహలచే నేను (తనువు) ఎట్లు లభింతును?

శ్లో॥ అపేక్షతే ఽయమాకాశం, శూన్యం హి పరిమాణవత్
సాన్ద్రాసాన్ద్రదశార్థం చ, శూన్యే న సతి తత్కథమ్? 40

తా॥ ఈ విధమైన భేదము, పరిమాణము గుణముగా గల శూన్యమైన ఆకాశమున్న కాని సంభవించదు. ఒక వస్తువు సాంద్రత చెంది, ఘనీభవించవలయు నన్నచో పరిమాణమునకు అవకాశము గల శూన్యము లేనిచో ఎట్లు సంభవించును? శూన్యము



ఉన్నందువల్లనే, అణువులు దూరముగా నున్న, నీటి ఆవిరియు, దగ్గరకు వచ్చినందున, జలము, ఇంకా దగ్గరకు వచ్చిన, మంచు, ఏర్పడుచున్నది. శూన్యమే లేకున్నచో అణువులు దగ్గరకు వచ్చుట-దూరము పోవుట సంభవించదుకదా. అప్పుడు సాంద్రత చెందుట కూడ సంభవించదు కదా.

శ్లో॥ ఆకాశే సర్వ శూన్యే తు, కథం తిష్ఠతి నిశ్చలమ్?
చలచ్చలతి సోపానే, స్థిరం చ స్ఖలితం భవేత్॥ 41

తా॥ ఆకాశము సర్వశూన్యమే అయినచో-నవీనుల మతము ప్రకారము "శూన్యములో నిలుచున్న వస్తువు సదా నిలుచుండును. కదలు వస్తువు సదా కదలును" అను సిద్ధాంతము వారి చేతనే నిరూపించబడియున్నది. నిరోధించు శక్తి శూన్యములో లేనందున, స్వశక్తిని ఖర్చు చేయకయే కదలు వస్తువు కదులును అని వీరి మతము. నిరోధించు శక్తి లేని జారుడుబండపై కదలు వస్తువు కదులుటయే కాక, నిలుచున్న వస్తువు కూడ నిలువ లేక జారుచున్నది కదా! కాన శూన్యమున నిల్చిన వస్తువు ఎట్లు నిలుచున్నది?

శ్లో॥ సర్వత్ర సికతాస్నిగ్ధే, భిన్న వస్తు కథం స్థితమ్।
సర్వత్ర బ్రహ్మణా పూర్ణే, భిన్న వస్తు కథం భవేత్? 42

తా॥ ఈ సర్వ సృష్టియును ఆకాశ పరమాణువులతో నిండియున్నప్పుడు, ఆకాశము కన్న భిన్నమైన వస్తువు ఈ ఆకాశ పరమాణువులను ప్రక్కకు త్రోయుట వీలులేదు. కాన ఎట్లు పట్టును? ఈ సర్వ విశ్వము, ప్రక్క ప్రక్క ఆనుకొని మధ్య అవకాశమేలేని ఇసుక రేణువులతో నిండియున్నదని భావించినచో , ఈ విశ్వములో మరియొక వస్తువు అనగా ఇసుక కన్న భిన్నమైన వస్తువు, ఎక్కడ నిలచును? ఎట్లు నిలచును? ఇసుకలోనికి ఒక వస్తువును గుచ్చినపుడు ఆ వస్తువు ఇసుకరేణువులను పైకి త్రోసి కొంత ప్రదేశమును ఆక్రమించును. ఆ పైకి తోయబడిన ఇసుక రేణువులు, ఇసుక కన్న భిన్న మైన శూన్యము ఇసుక పైన ఉన్నది కాన, ఆ శూన్యములోనికి పోగలవు. కానీ శూన్యమే లేక, అంతా ఇసుక రేణువులే అయినచో ఏ వస్తువూ ఇసుకలో నిలువజాలదు. అట్లే అంతా బ్రహ్మమే అయినపుడు, బ్రహ్మ భిన్నమైనది ఏదియును, బ్రహ్మము లో ఉండజాలదు.

శ్లో॥ సర్వం చైతన్య మేవేదం, భేదః కల్పిత ఏవ హి
మమాసత్యోZల్ప సత్యత్వా, త్వమసత్యో హి జీవతామ్॥ 43

తా॥ కాన, ఈ సృష్టి అంతయును చైతన్యమే, భేదము కల్పించబడినదే. అయితే ఈ భేదము అల్పమైనది కాన, సత్యమైననూ నాకు అసత్యముగ పరిగణించ వచ్చును. జీవులకు సమాన సత్యముకావ, భేదము జీవులకు పూర్ణ సత్యవ··

శ్లో॥ కల్పనాZప్యూహ ఏవ స్యా, దూహ శ్చిన్మయ ఏవ హి
శశశృఙ్గం కల్పితోZహం, సత్య మత్యల్ప మఞ్చసి॥ 44

తా॥ కల్పనయు ఊహయే. ఊహ, చైతన్య (మనో) మయమే కదా. చైతన్యము సత్యమే కదా. ఊహించిన కుందేటి కొమ్ము కూడ చైతన్య మయమైన ఊహయే కావున సత్యమే అయితే, దానిని అత్యల్పముగా భావించుచున్నావు.

శ్లో॥ మత్వాహి శూన్య మాకాశం, సాన్ద్రా సాన్ద్రవదానవాః
రూపాన్తరాణి భాషన్తే, వస్తుశూన్యా త్సృజామి హి॥ 45

తా॥ ఆకాశమును సర్వ శూన్యముగా భావించి, జడశక్తి సాంద్రత చెందుటయు, సాంద్రత చెందక పోవుటయు సిద్ధాంతముగ కల్పించి, జడశక్తి యొక్క రూపాంతరములను నవీనులు వివరించుచున్నారు. నేను అవతరించినపుడు శూన్యము నుండియే వస్తువులను సృష్టించుచున్నాను గదా. కాన, శూన్యము, సర్వశూన్యము అని కాదు.

శ్లో॥ సూక్ష్మ వీచి ర్నవా చ్చిద్ధి, సాకాశైవ పరం నభః
భిన్నం సత్య మభిన్నం చ, విచిత్రం బ్రహ్మ యత్త్వహమ్.· 46

తా॥ ఆకాశమునకు అతీతమగు చైతన్యము ఈ లోకములో లేదు. చైతన్యశక్తి అత్యంత సూక్ష్మకణరూపమై తరంగ స్వభావమును కలిగియున్నదని నవీనుల మతము. కాన, చైతన్యము ఉండుటకు చైతన్య భిన్నమైన - చైతన్యముతో సమాన సత్యమైన ఆకాశమగు "పరమ వ్యోమము" ఉన్నది. అయితే ఈ పరమ వ్యోమమునకు చైతన్యమునకునూ భేదము లేదు. ఇట్లు భేదాభేదము ఒకేసారి ఒకే వస్తువునందు సమాన సత్యంగా ఉండుటయే విచిత్రము అనగా మన ఊహాతీతము. ఆ బ్రహ్మము కూడా, ఈ దృశ్యమాన పరిమితాకారముగల నేనే అనుటయు విచిత్రమే.



శ్లో॥ పరమార్థ జగత్తుల్య, మథ భూయోZస్య నాయసే
చిత్రం తదధికం చిత్రం, మాం చ చిత్రం న మే సమమ్॥ 47

తా॥ నీతో సమానమైన పరమార్థ దశ ఈ జగత్తు. నిజంగా చెప్పాలంటే ఈ జగత్తులో ఒక భాగము నీవు కాన, నీకన్న ఈ జగత్తు చాలా గొప్పది. కాన, జగత్తులోని విచిత్ర తత్త్వాలనే నీవు గ్రహించలేవు. ఇక ఈ జగత్తు కన్న ఎంతో గొప్పయగు నన్ను, నా విచిత్రములను నీ వెట్లు గ్రహించగలవు? నాకు నేను సమమే కాన, నాకు నేను విచిత్రమును కాను గదా. కాన, నాకు చిత్రమేమియును లేదు.

శ్లో॥ బ్రహ్మ భూత్వా బ్రహ్మవేత్తి, బ్రహ్మజ్ఞాత్వా న తద్భవేత్
బ్రహ్మైవ బ్రహ్మవి న్నాన్యో, విపరీతం న చిన్తయేత్॥ 48

తా॥ బ్రహ్మమైన వాడు బ్రహ్మమును తెలియును. అంతే తప్ప, బ్రహ్మమును తెలుసుకొని బ్రహ్మము కాలేడు. ఏలననగా, బ్రహ్మమును తెలిసినది బ్రహ్మమే తప్ప, బ్రహ్మ భిన్నుడు బ్రహ్మమును తెలియలేడు. కాన, బ్రహ్మమే బ్రహ్మజ్ఞాని తప్ప, బ్రహ్మజ్ఞాని బ్రహ్మము అగును అని విపరీతార్థమును పలుకరాదు.

శ్లో॥ చిత్కాన్తివ జ్జడా శక్తి, ర్మేధా నాడీషు తన్త్రగా
పూర్వేZవిదో నవా విజ్ఞా, దయయా మే స యన్త్రవత్॥ 49

తా॥ జ్ఞాన స్వరూపమైన చైతన్యమును కూడ దృష్టాంతముగా తీసుకొనలేము-ఏలననగా చైతన్యము జడశక్తి కన్నా వేరు కాదని నవీనుల ప్రయోగములలో నిరూపితమైనది. ప్రాచీనులు చైతన్యస్వరూపమును సరిగా తెలియని వారై, చైతన్యము ఆకాశాతీతమైన తత్త్వముగా భావించిరి. ఈ నవీనులు చైతన్య స్వరూపమును సత్యముగా గ్రహించునట్లు నేనే అనుగ్రహించితిని. నవీన మతము ప్రకారము చైతన్యము, జడశక్తియే. అనగా అత్యంత సూక్ష్మ ద్రవ్య కణములే - అనగా ఆకాశనియమ పరిమాణమునకు లొంగినదే. అయితే "జడశక్తి యగు కాంత్యాదులకు లేని సంకల్పాదులను చైతన్యము చేయుచున్నదికదా" అన్నచో, సంకల్పాది క్రియలు కేవలము మేధాపిండము, నాడీమండలము యొక్క తంత్రమువలన జరుగుచున్నవే తప్ప విశేషమేమీలేదు.

కాంత్యాది శక్తులలో అట్టి తంత్రము లేనందున సంకల్పాది క్రియలు జరుగుటలేదు. అట్టి తంత్రము గల యంత్రపురుషులు సంకల్పాదులను సైతము చేయుచున్నారు కదా. కాన ఇట్టి తంత్రగతమైన శక్తినే చైతన్య మన్నచో బ్రహ్మము చైతన్యము కన్న అతీతమైనది. ఇట్టి తంత్రగతమైన జడ శక్తి యే బుద్ధి అనగా జీవుడు.

శ్లో॥ శాసనం న గ్రహస్వేచ్ఛా, మదధీనా జడో హి సః
సఙ్కల్ప గ్రహణే కర్మ, స్వేచ్ఛాల్పాంశోZపి మద్యతః॥ 50

తా॥ జీవుడు కలిగియున్న స్వతంత్రము కూడా నాచేత నీయబడి నా అధీనములోనే యున్నది. కావున మానవుని అధీనములో నున్న యంత్ర మానవుని వంటి వాడే జీవుడు. అందువలన, జీవుడు పరాధీనుడగు జడమే. అందువలన జగత్తులో స్వతంత్రమైన చైతన్యము లేదు. కేవలము మంచి చెడులను గ్రహించుటలో మాత్రమే, జీవుడు నా చేత వొసగబడిన స్వతంత్రమును కలిగియున్నాడు. అంతే తప్ప. జడములన్నింటిని, అనగా సృష్టిని శాసించు స్వతంత్రము జీవునకు లేదు. స్వాధీనమైనది చైతన్యమనియు, పరాధీనము జడమనియు, పండితులు పలుకుదురు గదా. కేవల సంకల్పాది క్రియలను కలిగినదే చైతన్యముగా భావించినచో, జీవుడు చైతన్యశబ్దవాచ్యుడు. సంకల్పము తంత్రపరమైన ఒక జడక్రియయే కాన, ఇది చైతన్య-జడములను భేదపరచుటకు ఉపయోగించదు. మంచి చెడులను గ్రహించుట కూడ ఒక తంత్రపరమైన క్రియయే. అందులోని స్వేచ్ఛ మాత్రము నాలక్షణము యొక్క స్వల్పాంశమే - ఏలయనగా, నా స్వేచ్ఛ హద్దులు లేనిది. జీవునకు ఈయబడిన స్వేచ్ఛ చాలా పరిమితి గలది. అది పంచభూతములపై స్వేచ్ఛాశాసనము కాదు. కేవలము మంచి చెడుల విషయములను గ్రహించుటలోనే ఆస్వేచ్ఛ. ఇంత మాత్రముననే నా లక్షణము యొక్క అల్పాంశ వలన జీవుడు బ్రహ్మ మనరాదు. ఆ అల్పాంశ మగు అల్పస్వేచ్ఛ కూడా నా అధీనములోనే యున్నది. స్వాధీనత కల చైతన్యమువలె జీవుడు కనిపించినా, యధార్ధముగా నా అధీనములో పూర్తిగా నున్న జడమే కాన, జీవుడు పరాధీనమైన జడమే.

శ్లో॥ సంజ్ఞాన స్మరణే యన్త్రైః, క్రియతే పూర్ణ మోక్షవాన్
అహం తాభ్యాం యదా భేద, స్తదా చిన్నాస్మి చిత్పరః 51



తా॥ సంజ్ఞానమును (అనగా ఒక విషయమును గ్రహించుట గుర్తు పట్టుట) మరియు స్మరణములవే చైతన్యము యొక్క లక్షణముగా శబ్దము యొక్క వ్యుత్పత్త్యర్థము ప్రకారము తీసుకొన్నచో, ఈ రెండూ యంత్ర పురుషులు చేయుచున్నారు. కాన, చైతన్యము జడము కన్న వేరు కాదు. అట్లు కాక, స్వతంత్రమునే చైతన్య లక్షణముగా తీసుకుంటే (అనగా ముక్త స్వభావము) అప్పుడు నేను మాత్రమే చైతన్యము. నా అధీనమై, బద్ధమైన, ఈ జగత్తు జీవులతో సహా జడమే. అట్లు కాక, సంజ్ఞాన-స్మరణ క్రియలు, కాంత్యాది జడశక్తులు చేయకపోయినా, నాడీ మండల తంత్ర క్రియచే కాన, యంత్రపురుషులవి చేయుచున్నందున, అట్టి తంత్ర మున్న ప్రాణిలోని జడశక్తిని చైతన్య మనియు, అగ్న్యాదులలో నుండే కాంత్యాదులను జడమనియూ విభాగం చేసుకునే పక్షంలో నేను అట్టి చైతన్యమును కాదు. నేను అట్టి చైతన్యమునకు అతీతుడను.

శ్లో॥ భిన్న వస్తూని వస్తుస్థ - సూక్ష్మాంశా మధ్య శూన్యతా
అశూన్యైకం నచోహేZస్మి, న్నాకాశో బ్రహ్మ తద్వశాత్. 52

తా॥ ఈ సృష్టిలో ఏ ఉపమానమైననూ బ్రహ్మమునకు పోల్చలేము. ఏలననగా ఈ సృష్టిలో అనేక వస్తువులు భిన్నములుగా ఉన్నవి. మరియు, వీటి మధ్య ఏ వస్తువూ లేని శూన్య మున్నది. ఒక్కొక్క వస్తువు ఒకటిగా లేదు. ఆ వస్తువు ఎన్నో సూక్ష్మకణముల సమూహముగా ఉన్నది. కాన, శూన్యమే లేని, కణముల స్వరూపము కాకుండు ఏకత్వము కల వస్తువు సృష్టిలో లేదు. పోనీ "భేదాలన్ని కల్పితాలు అని భావించి, ఏకైక వస్తువు అంతా వ్యాపించి ఉన్నట్లు, శూన్యమే లేనట్లు భావిద్దాము" అనుకుంటే, అటువంటి వస్తువు "అంతా" అను ఆకాశపరిమాణతత్త్వమునకు లొంగిన వస్తువే కావలయును. అట్లు లొంగినది, ఆకాశము కన్నా గొప్పది.కాదు. కాన, అప్పుడు, ఆ వస్తువు బదులు ఆకాశమే బ్రహ్మము కావలయును.

శ్లో॥ తన్నిష్ఠ పఞ్చ భూతాని, నాద్యన్తా న్యవధే ర్నభః
రూపవ ద్ధాన్య రాశిర్వా, సర్వాకాశే న వస్తు హి॥ 53

తా॥ రూపములు కలిగిన పంచభూతముల సమూహములు అనాది-అనంతముగా నున్నవి. ఇవి అన్నీ బ్రహ్మముపై ఆధారపడియున్నవి. ఆకాశముతోపాటు మిగిలిన భూతములు కూడ అనాది, అనంతంగానే ఉన్నవి. ఆకాశము కూడా ఇతర భూతముల

వలె ఖండములు గానే ఉన్నది. ఏలననగా - మిగిలిన భూతములున్నపుడు ఆకాశము ఆ వస్తువులలో లేదు. వస్తువులో ఆకాశమే సర్వత్ర ఉంటే వస్తువు శూన్యము కావలయును. కాన, ఆకాశము ముక్కలు, ముక్కలై పరిమితులు (అవధులు) కలిగి రూపము కలిగిన ముక్కలే. కాన, పంచ భూతములన్నీ ముక్కలు ముక్కలుగా రూపములు కలిగి వివిధ ధాన్యము గింజలు కలబోసిన రాశులుగా ఉన్నవి.

శ్లో॥ పూర్ణ బ్రహ్మాస్త్యణౌ వస్తు - న్యపుం స్త్రీ బ్రహ్మ మే బలమ్
తదహం నోహ్య మస్మ్యత్ర, చిత్తే జీవే పృథక్సమే॥ 54

తా॥ ప్రతి పరమాణువులోను, ప్రతివస్తువులోనూ పరబ్రహ్మము పూర్ణంగా ఉంది. స్త్రీ పురుష భేదంతో వ్యామోహితులై పరమాత్మ పురుషుడనీ, స్త్రీ అని కలహించుట నివారించుటకే బ్రహ్మశబ్దము నపుంసక లింగములో పరమాత్మపరంగా చెప్పబడినది. ఆ బ్రహ్మము నా సామర్థ్యము. ఆ సామర్థ్యము నేనే. నా కన్న భిన్నంగా సామర్థ్యము లేదు. దానికన్న భిన్నంగా నేనూ లేను. ఇది ఎట్లో నీ ఊహకు అందదు."అహం బ్రహ్మాస్మి" వాక్యములోని అహం (నేను) శబ్దానికి అర్థము జీవుడిలో ఉన్న నేనే.ఇక్కడ జీవుడంటే చిత్తము (చైతన్యము). నేను ప్రతి జీవుడిలో విడివిడిగా పూర్ణంగా ఉన్నాను. మరియు సర్వజగత్తులో ఒక్కనిగానే ఉన్నాను. (అంటే ప్రతి నీటిబిందువులోనూ సముద్రమంతా ఉంది. అదే సముద్రము అన్ని నీటి బిందువుల్లోనూ కలిపి ఉంది. ఇది అనూహ్యము. దీనికి కారణము బ్రహ్మము ఆకాశతత్వానికి అతీతము).

ఇతి శ్రీ దత్తగురు భగవాద్గీతాయాం
శ్రీ దత్త ఆకాశ చైతన్య విచారయోగోనామ
త్రయోదశాధ్యాయః

కాలభైరవ ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

## చతుర్దశాధ్యాయః

## శ్రీదత్త పరబ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణ యోగః

శ్రీదత్తగురు భగవాన్ ఉవాచ:-

శ్లో॥ చేతనా యన్త్ర దృశ్యేయం చైతన్య మియ మేవ తత్
జీవో దృశ్య స్సచాత్మీయ! భవానీ బాలకృష్ణయోః॥ 1

శ్రీ దత్త భగవానులు వచించిరి :-

తా॥ ఈనాడు విశేష యంత్రముల ద్వారా చేతనాశక్తిని కన్నులతో చూడవచ్చును. ఓ శ్రీ భవాని బాలకృష్ణలను దంపతులకు ఆత్మీయుడా! ఈ చేతనా శక్తియే చైతన్యమనబడును. ఈ చైతన్యమే జీవుడు. కాన జీవుడు చూడబడుచున్నాడు.

శ్లో॥ ప్రత్యక్షం హి ప్రమాణానాం, మూలం ప్రత్యక్ష దర్శనాత్
జగత్సృష్టి స్థితి ధ్వంస-కృదేకం బ్రహ్మ చాస్మి తత్॥ 2

తా॥ అన్ని ప్రమాణములకు ప్రత్యక్షమే మూలము. ప్రత్యక్షముగా, నేను ఒక్కడినే, ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములను చేయుచున్నానని ఈ స్వరూపము ద్వారా కనిపించు చున్నందుననే, అట్టి వేదోక్త లక్షణ బ్రహ్మము నేనే నని తెలియుట కూడ ప్రత్యక్ష ప్రమాణమువల్లనే కదా,సిద్ధించినది.

శ్లో॥ వ్యాప్తి ర్దృష్టాZ ను మానేచ, వక్తా శబ్దోపమానయోః
ద్రష్టా ప్రత్యక్ష తోZ నూహ్యాం, నోహ్య సిద్ధి ప్రదర్శనైః॥ 3

తా॥ అనుమాన ప్రమాణములో కూడ, ముందు, వంట ఇంటిలో అగ్ని-పొగలకు సంబంధమును ప్రత్యక్షంగా చూచిన తరువాతనే గదా-"కొండపై తడసిన కట్టెలు గల అగ్ని ఉన్నది; పొగ వచ్చుచున్నది కాన" అను అనుమాన ప్రమాణము ఏర్పడినది. "గవయమృగము ఆవు వలె ఉండును" అను ఉపమాన ప్రమాణములో కూడ,

చెప్పువాడు, అవును, గవయమృగమును ప్రత్యక్షంగా చూచిన వాడే కదా. అప్పుడు చెప్పు శబ్ద ప్రమాణంలో కూడ, ఆ అప్పుడు ప్రత్యక్షంగా చూచినదే కదా చెప్పును. (మిగిలిన ప్రమాణములలో కూడ ఇట్లే ప్రత్యక్ష సమన్వయము). బ్రహ్మము ఊహకు సైతము చిక్కదు అన్న సిద్ధాంతమునకు కూడ, బ్రహ్మము యొక్క అవతారములు, ఊహకు సైతము అందని అష్టసిద్ధులను ప్రత్యక్షముగా లోకమున ప్రదర్శించుటవల్లనే గదా ఆ సిద్ధాంతమునకు ప్రత్యక్ష ప్రమాణము ద్వారా అధారము కలిగినది.

శ్లో॥ సమాధిస్థస్య చిద్దృశ్యా, యన్త్రే కాన్తి రవీచికా
జీవోऽ సత్యో హి మమ చ, చిన్మాత్ర బ్రహ్మవాదినామ్॥ 4

తా॥ సమాధి (సుషుప్తి దశలో కూడ)లో నున్న వాని చైతన్యము యంత్రములో చూచునపుడు తరంగములుగా కనిపించక పోయినా, అత్యంత సూక్ష్మతరంగ స్వరూపమైన శక్తిగా కాంతి వలె కనబడుచున్నది. కాన, అసత్యమైన జగత్తులో భాగ మగు జీవుడు, పరమార్థ దశలో (నా దృష్టిలో) కూడ అసత్యమే. ఆ పరమార్థ దశనే ఆశ్రయించుచు చైతన్యమే బ్రహ్మ మని వాదించు వారికినీ జగత్తుతో బాటు జీవుడూ అసత్యమే కావలయును.

శ్లో॥ ద్రవ్య చిద్గుణ రూపాణి, సజ్జాతే మయి సన్తిహి
నిత్య సత్యాని చై కైకం, సజ్జాతో బ్రహ్మచాద్భుతమ్. 5

తా॥ నా ఈ తనువులోని సంఘాతములో నున్న ద్రవ్యము చైతన్యము, వీటి రెండింటి గుణములు అన్నియును నిత్యములు, సత్యములు. వీటిలో ప్రతి ఒక్కటీ పూర్ణ బ్రహ్మమే. వీటి సమూహము కూడ పూర్ణ బ్రహ్మమే. బ్రహ్మము చాలా అద్భుతము, అనూహ్యము, పరిమాణ నియమాలకు బ్రహ్మము అతీతము కాన బ్రహ్మము సత్యము, నిత్యము.

శ్లో॥ చిద్బ్రహ్మ మయి సజ్జాతే, రూపం బ్రహ్మ గుణోऽ ప్యహమ్
కిన్తు బ్రహ్మ న లోకస్థా, ఇమేऽ ల్పాశ్చ న సన్తి మే॥ 6

తా॥ నీకు కనిపించు ఈ స్వరూపంలోని ద్రవ్య, రూప-చైతన్య-గుణముల సమూహములో నున్న చైతన్యము నేనే కాన, బ్రహ్మమే. అట్లే ఈ రూపము నేనే కాన బ్రహ్మమే. అంటే ఈ నా స్వరూపంలో నున్న రూపము నేను కాన బ్రహ్మమే. నాలోని ప్రతి గుణమూ నేనే, కాన బ్రహ్మమే. అయితే, ఇవే, లోకంలో బ్రహ్మము కావు, ఏలనన,ఇవి లోకములో బ్రహ్మము యొక్క అత్యంత స్వల్పతత్త్వము కలవి కాన, పరిపూర్ణ ఘన స్వరూపంతో సమానము కావు. పరమార్థ దృష్టిలో-అనగా నా దృష్టిలో అసలు ఇవి లేనే లేవు. అనగా నా దృష్టిలో, నేనొక్కడినే ఉన్నాను.



శ్లో॥ కుడ్యం ప్రవిశ్య గచ్ఛేయం, మమోహాకార మేవ యత్
ఊహ శ్చైతన్య శక్తిశ్చ, సత్యైవాల్పా ఘనస్య మే॥ 7

తా॥ నేను ఈ ఎదురుగ నున్న గోడలో దూరి అవతలకు పోగలను. ఏలనన, ఆ గోడ కేవలము నా ఊహనే ఆకారముగా ధరించినది. అయితే, ఊహయును చైతన్య శక్తియే, అయితే చైతన్య శక్తియే ఘనీభవించిన నన్ను ("ప్రజ్ఞాన ఘనః" శ్రుతి) అడ్డుకొన జాలదు. ఊహ సత్యమే కానీ స్వల్ప మైనది. అత్యంత స్వల్పమైన దానిని పరిగణించము గదా. ఉన్ననూ లేనట్లే కదా కావున దానిని అసత్యముగా భావించుటలో తప్పులేదు.

శ్లో॥ పాదో మే విశ్వభూతాని, పాద ఏకాంశు రత్ర చ
అనన్తోహ సహస్రాంశు-సహస్ర జగతామపి॥ 8

తా॥ ఈ విశ్వమంతయు నా ఊహలోని ఒక పాదము. పాదము అనగా ఒక కిరణము. నాలో అనంతములైన ఊహలున్నవి. ఒక్కొక్క ఊహ ఒక్కొక్క సహస్ర కిరణుడు. ఇట్టి ఊహలను సహస్ర కిరణుల సహస్రాలు అనంతాలు. ఒక్కొక్క సహస్ర కిరణునిలోని ఒక్కొక్క కిరణము ఒక్కొక్క బ్రహ్మాండము అనగా జగత్తు.

శ్లో॥ సచ్చాప్యల్ప మభావోహి, ప్రజ్ఞాన ఘన దృష్టితః
ఊహ ద్వితీయ ఇత్యత్ర, నోక్త ఊహేऽపి చిన్మయే॥ 9

తా॥ జగత్తు సత్యమైననూ, నాతో పోలిస్తే చాలా స్వల్పమైనది కాన, జగత్తు అభావముగనే పరిగణించబడును. చైతన్య ఘనమైన శరీరముతో పోల్చిన, చైతన్యమయమైన స్వల్పమైన ఊహతో నున్న వానిని చూచి, "ఒక్కడే ఉన్నాడు" అని అందురు. కానీ "ఊహయు, ఊహించువాడును ఉన్నారు" అని అనరు గదా.

శ్లో॥ జడ శక్తి ర్హి చిద్ద్రవ్యే, మతా నవ్యై స్స బన్ధనే
భేద స్తైవ సమం బ్రహ్మ, భేదో బ్రహ్మ చ నాన్యసత్ ॥ 10

తా॥ నవీనుల మతము ప్రకారముగా, చైతన్యమూ, ద్రవ్యమూ (జడ పదార్థము) రెండు జడశక్తి రూపాంతరములే. కాన శరీరమును (ద్రవ్యమును) చైతన్య ఘనము అనవచ్చును. ఈ శరీరములోనున్న కణముల మధ్య బంధములు కూడ జడశక్తియే కాన, అవియును చైతన్యమే అనవచ్చును. ఈ బంధములే నానా రూపములకు కారణములై భేదమును కలిగించుచున్నవి. కాన భేదమూ (బంధములు) జడశక్తియే. అంటే భేదమూ బ్రహ్మమే అనగా సత్యమే. బ్రహ్మము కన్న రెండవ సత్యము లేదు. కాన, అంతా బ్రహ్మమే అనగా అంతా సత్యమే.

శ్లో॥ ఉపమానే హి వైచిత్ర్య, ముపమేయే ऽపి తత్సమమ్
ఉపమానోపమేయౌ హి, బ్రహ్మైవ ప్రభవాదికృత్॥ 11

తా॥ ఉపమానములలో ఏవైచిత్ర్యము కనపడుచున్నదో, అదే వైచిత్ర్యము ఉపమేయము నందును ఉన్నది. ఉపమాన-ఉపమేయములు రెండునూ, బ్రహ్మమే కదా. అన్నింటికీ సృష్టికర్త, భర్త, హర్తయును బ్రహ్మమే కదా.

శ్లో॥ ఏకైక జడశక్తి స్సా, బన్ధ చిద్ద్రవ్య భేదకృత్
తథా భేదకరీ మాయా, మాయా బ్రహ్మైవ నాపరమ్॥ 12

తా॥ ఒకే జడశక్తి, నవీనుల విజ్ఞానమతము ప్రకారముగా ఎట్లు చైతన్యముగను, మట్టి మొ॥ ద్రవ్యములుగను, ఆ ద్రవ్య కణములను బంధించు శక్తి బంధములుగను భాసిల్లుచున్నదో, అట్లే, మాయా శక్తియును అనేక భేదములను కల్పించుచున్నది. ఈ మాయ బ్రహ్మమే. బ్రహ్మము కన్న రెండవది లేదు గదా. జడశక్తి ఉపమానము. మాయ ఉపమేయము. రెండునూ బ్రహ్మమే కాన, రెండింటిలోనూ విచిత్రమైన అనూహ్యతత్త్వము సమానముగ నున్నది.

శ్లో॥ ఉపమానే యథా మూకో, వైచిత్ర్యం వక్తు మల్పవత్
ఉపమేయే తథా మూకో, వైచిత్ర్య ముభయో స్సమమ్॥ 13



తా॥ ఉపమానమైన ఈ జగత్తులో జడశక్తి-చైతన్యము-ద్రవ్యము-కణముల మధ్య బంధములగను ఒక్కటే అయ్యును, ఎట్లు భేదముతో కన్పించునో, దీనిని వివరించుటకు ప్రయత్నించి, ఎట్లు ఎవడైననూ మూగ బోవునో, అట్లే - ఉపమేయమైన నాయందు మాయ యొక్క భేదమును వర్ణించువాడు మూగ బోవును. ఉపమానములో ఎక్కువ విచిత్రము-ఉపమేయములో అత్యల్ప విచిత్రము ఉన్ననూ, తాత్త్వికంగా ఒక్కటియే. ఏలననగా రెండూ బ్రహ్మమే.

శ్లో॥ అపి నవ్యమతా ద్వేత్సి, జడశక్తి రపి క్రియా
వ్యాఘ్రో బ్రహ్మ నరో బ్రహ్మ, దారణం బ్రహ్మ చాశనమ్॥ 14

తా॥ నవీనుల విజ్ఞాన మతము నుండి ఇది తెలుసుకున్నావా? క్రియ కూడా జడశక్తి యొక్క రూపాంతరమేనని వారు భావించుచున్నారు. అట్లు అయినచో కర్మయూ బ్రహ్మమే. కాన పులియూ బ్రహ్మమే. నరుడును బ్రహ్మమే. పులి నరుని చీల్చి తిను క్రియయును బ్రహ్మమే గదా.

శ్లో॥ పలాయన మపి బ్రహ్మ, కర్తా బ్రహ్మైవ కర్మ చ
సర్వం హి ఖల్విదం బ్రహ్మ, పరమార్థ దృశా మమ 15

తా॥ పులిని చూచి పరుగెత్తు క్రియయును బ్రహ్మమే. కర్తయును, క్రియయునూ రెండూ బ్రహ్మమే. రెండూ జడశక్తి రూపాంతరములే కాన, "ఇదంతయును బ్రహ్మమే కదా" అని శ్రుతి. ఇది నా యొక్క పరమార్థ దశలోని వాక్యము.

శ్లో॥ యదీచ్ఛామి పునర్యాతో, భక్షితో భవితోత్థితః
అథవా భక్షయే ద్వ్యాఘ్రం, మమ చైతన్య సారవాన్॥ 16

తా॥ నేను సంకల్పించినచో, పులిచే భక్షింపబడినవాడు మరల లేచి పోవును. లేదా, అతడే పులిని భక్షించునట్లు చేయుదును. అప్పుడు నా చైతన్యబలమును అతడు పొందుచున్నాడు.

శ్లో॥ చైతన్య పరిమాణస్య, భేదా త్సాన్ద్ర దశాగతాత్
బలవా నల్ప ఇత్యస్తి, శక్తి భేదో ऽత్ర తాత్త్వికః 17

తా॥ చైతన్యము (అనగా నా మనస్సు) యొక్క పరిమాణము ననుసరించి, అది ఘనీభవించుటను బట్టియు "ఈ రూపము అధిక శక్తి గల బలశాలి, ఈ రూపము అల్పశక్తి గల బలహీనుడు" అను శక్తి భేదము సృష్టిలో సత్యముగనే ఉన్నది.

శ్లో॥ చిద్ఘనం ధేనుశృఙ్గం హి, సత్యం వదసి చిత్కణమ్
శశశృఙ్గ మసత్యం చ, సంప్రదాయోఽపి సమ్మతః॥ 18

తా॥ చైతన్యమే ఘనీభవించి అధిక పరిమాణంలో ఉన్నపుడు కనిపించు ఆవు కొమ్మును సత్య మనుచున్నావు. చైతన్య కణముతో నిర్మించబడిన నీ ఊహ యగు కుందేటి కొమ్మును అసత్య మనుచున్నావు. ఇట్లు అనుట కూడ సమ్మతమైన సంప్రదాయమే. కానీ రెండునూ అనగా కుందేటి కొమ్ము ఆవు కొమ్మూ సత్యములే. ఒక్కటి తక్కువ, మరొకటి ఎక్కువ చైతన్యముతో నిర్మించబడినది.

శ్లో॥ తవ యద్ధేను శృఙ్గం హి, శశశృఙ్గ మసన్మమ
సత్యే మమాపి శృఙ్గంహి, న సత్యే పరమాల్పతః ॥ 19

తా॥ నీకు అవుకొమ్ము సత్యము, నీ ఊహ మాత్రమైన కుందేటి కొమ్ము అసత్యము. నీ ఆవు కొమ్ము నాకు కుందేటి కొమ్ము వంటిది. తాత్వికంగా, ఈ రెండూ నీకూ నాకూ కూడ, సత్యములే. అయితే నాకు రెండూ చాలా అల్పములు కాన నాకు అసత్యములుగ పరిగణించవచ్చును. నీకు కుందేటి కొమ్ము చాల అల్పము గాన దానిని అసత్యముగ నీవూ పరిగణించవచ్చును.

శ్లో॥ అవతారే వస్తు సర్గే, ద్రవ్యం వా రూప కర్మ వా
చైతన్యా న్మనసో మే హి, స్రష్టా కర్తాZ హ మేవ చ॥ 20

తా॥ నా అవతారములలో ప్రదర్శించు సిద్ధులలో శూన్యము నుండి వస్తువును సృష్టించినపుడు శూన్యమంతయును జడశక్తి నిండి యుండుటవల్లనే, నా ఇచ్ఛానుసారముగా ఘనీభవించి ద్రవ్యముగ రూపమును చెందుచున్నది. ఆద్రవ్యము నేను సంకల్పించిన వస్తువు ఆకారమును కూడ పొందుచున్నది. ఆకారమును కలిగించు క్రియ కూడ నేను చేయునదే. కాన వస్తువును సృష్టించునది నామనస్సే అనగా నా చైతన్యమే. క్రియలను చేయునది కూడ నామనస్సే. సృష్టించేది నేనే, ఏదైనా పనిచేసేది నేనే.



శ్లో॥ జడశక్తి క్రియా ద్రవ్యే, ష్వన్యోన్య పరివర్తనమ్
నాస్తి య న్మన్యతే నవ్యైః, ర్జడ శక్తి ర్ద్విధామతమ్॥ 21

తా॥ జడశక్తి, అనగా- కాంతి, ఉష్ణము, శబ్దము, విద్యుత్, ఆకర్షణము మొదలగునవి ద్రవ్యములు అనగా-పరమాణువులు వాటి సంఘాతములైన మట్టి మొదలగునవి క్రియలు అనగా కదలికలు. ఇవి, ఒకదాని రూపాంతరములు ఒకటి కావు. నవీనులు తలచునట్లు, ఒకటి మరియొకటిగా మారదు. "జడశక్తి రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ద్రవ్యతత్త్వము, రెండవది క్రియా తత్త్వము" అని నవీనుల సిద్ధాంతము.

శ్లో॥ సా సూక్ష్మకణవద్ద్రవ్యం, సా క్రియా కణకమ్పనాత్
జడశక్తి శ్చలద్ధూలి, స్థూలం తత్సా తు సూక్ష్మతః॥ 22

తా॥ ఆ జడశక్తి అత్యంత సూక్ష్మ కణాలుగ ఉండుటచేత ద్రవ్యమై యుండును. ఆ సూక్ష్మకణములు నిరంతర చలనము కలిగియుండుట చేత, జడశక్తి, క్రియా రూపంగా కూడ ఉంటుంది. కాన ఉన్నవి రెండే. (1) ద్రవ్యము (జడము) (2) క్రియ. జడశక్తి అనగా అత్యంత సూక్ష్మ కణాల రూపంలో ఉన్న జడ ద్రవ్యమే క్రియతో చేరి ఉంటుంది. కాన జడశక్తి యనగా అత్యంతవేగముతో చలించుచున్న సూక్ష్మ జడ ద్రవ్యకణాలే. కాన, ద్రవ్యము, జడశక్తిగా మారునపుడు స్థూలకణములు సూక్ష్మకణములుగా విభజించబడుటయే. ఆ సూక్ష్మ కణాలు ఎక్కువ వేగంతో చలిస్తూ క్రియా సహితంగా ఉంటాయి. అప్పుడే వాటిని జడశక్తి అంటారు. కాన, జడము, జడశక్తిగా మారునపుడు,రూపాంతర పరివర్తన మేమీలేదు.

శ్లో॥ ద్రవ్య క్రియే హి తే చిద్ధి, సా సూక్ష్మాంశక్రియా ప్రభా
రయా ZZద్య స్తత్క్రియా ధర్మః, క్రియా ద్రవ్యం న శూన్యవత్॥ 23

తా॥ కాన ఉన్నవి రెండే, (1) ద్రవ్యము (2) క్రియ. క్రియతో కూడిన సూక్ష్మకణ ద్రవ్యమే నా చైతన్యము. ఇక కాంతి, ఉష్ణము, మొ॥ లగు జడశక్తులు చైతన్యము వలె క్రియతో కూడిన అత్యంత సూక్ష్మద్రవ్య కణాలే. ఇక దయ, ధైర్యము మొ॥ గుణములు చైతన్యము యొక్క క్రియలే. ద్రవ్యము క్రియగా మారదు. ద్రవ్యము కూడ క్రియా స్వరూపమేని, "ద్రవ్యము లేని క్రియ నిలువ లేదు" అని అనరాదు. శూన్యములో నున్న శూన్యము ఏ క్రియను చేయును? ద్రవ్యము లేకపోవుటయే శూన్యము కదా. అనగా-శూన్యములో

ద్రవ్యము లేదు కాన, క్రియ, ద్రవ్యరూపమే అయినచో, శూన్యములో ద్రవ్యము నిలచినట్లు, ఇతర ద్రవ్యము నాశ్రయించకయే స్వయముగ నిలువ వలయును గదా. అట్లు నిలచుట లేదు కాన, క్రియ, ద్రవ్య రూపము కాదు.

శ్లో॥ శూన్య ద్రవ్యస్య తచ్ఛక్తే, ర్న క్రియా పరివర్తనమ్
వాతేZపి ప్రతిరోధ్యంశ - క్రియా దానవ్యయో మతిః 24

తా॥ శూన్యములో చలించు వస్తువు యొక్క ద్రవ్యము కానీ, ఆ ద్రవ్యము నాశ్రయించి ఉన్న ద్రవ్య స్వరూపమే అయిన (సూక్ష్మ ద్రవ్య కణ స్వరూపమైన) కాంత్యాది జడశక్తి కానీ, ఆ చలనమునకు ఖర్చు అగుట లేదు. అనగా, ద్రవ్యము కానీ, జడశక్తి కానీ, పరివర్తనము చెంది క్రియగా మారలేదనియే దాని తాత్పర్యము. ఇది నిరూపితమైన నవీన విజ్ఞాన విషయమే కదా. ఇక వాయువుతో కూడిన ఈ లోకములో వస్తువు ప్రయాణించునపుడు కూడ, చలన క్రియకు ద్రవ్యము కానీ, ద్రవ్య సూక్ష్మ రూపమైన జడశక్తి కానీ ఖర్చు అగుట లేదు. కేవలము, చలన క్రియను నిరోధించు శక్తులను ఎదుర్కొని జడశక్తిలోని కణములు తమ క్రియ వేగమును ఎదుర్కొన్న శక్తి కణాలకు అందించుటచేత క్రియను కోల్పోవుటచేత జడ శక్తిలోని క్రియా తత్త్వమైన శక్తి వ్యయము జరుగుచున్నది. ఇదియును, నవీనులు అంగీకరించిన మతమే కదా. (క్రియా రూపాన్ని కూడ శక్తి అని నవీనులు అంటారు).

శ్లో॥ క్రియా రహిత సద్ద్రవ్యా, త్క్రియాకారక మిష్యతే
కారకోZహం క్రియా ద్రవ్య - ద్వైతం భూతాని పఞ్చమే, 25

తా॥ లోకములో ద్రవ్యమైన వస్తువు, క్రియారహితంగా స్థిరంగా ఉండుట కనపడుతున్నది.. అంటే ద్రవ్యము, స్వయంగా క్రియను ఉత్పాదించలేదు. ద్రవ్యానికి-క్రియకు సంయోగ వియోగాలు ఉన్నాయి. కాన, అవి రెండూ వేరువేరుగా ఉన్నాయి. అయితే క్రియ స్వయంగా పుట్టలేదు. ఎవరో ఒకరు క్రియను చేస్తే, క్రియ పుట్టు తున్నది కానీ, స్వయంగా ఉత్పన్నము కాదు. కాన క్రియను చేయు వాడను నేనే. చైతన్యము కూడా ద్రవ్యము-క్రియ అను రెండు తత్త్వాల మిశ్రమముగా ఉంటుంది. చైతన్యంలో ద్వైతము వచ్చింది గదా అంటే ఇబ్బంది లేదు. నాలో ఈ పంచభూతములు ఐదున్నవి. ఇబ్బంది ఏముంది? నేనొక్కడినే. అట్లే, చైతన్యమూ ఒక్కటియే. (సమూహమును ఒక్కటిగా చెప్పవచ్చును



గదా). ఏకకాలంలో భేదాభేదాలు జీవుని దృష్టిలో సమాన సత్యాలుగా ఉండేటట్లు చేయగల అనూహ్య సామర్థ్యము పరబ్రహ్మమునకున్నది.

శ్లో॥ క్రియా స్థిరేZపి సూక్ష్మాంశే, సూక్ష్మానాస్తీవ భావ్యతే
తత్రాప్యహం స్థవిష్ఠాంశే, సోZహ మంశోZస్మి తత్సమమ్॥ 26

తా॥ స్థిరమైన ద్రవ్యంలో కూడా అత్యల్పమైన క్రియాతత్త్వ మున్ననూ, అది దాదాపు స్థిరంగానే పరిగణించబడుచున్నది. కాన చైతన్య భాగమైన స్థిరమైన ద్రవ్యము యొక్క (చైతన్య తత్త్వభాగములు రెండు: ద్రవ్యము, క్రియ తత్త్వంలో కూడా నా క్రియాతత్త్వము అత్యల్పంగా ఉండుట చేత, తాత్త్వికంగా బ్రహ్మమే అనగా నేనే) ఉంది అనుటలో అభ్యంతరము లేదు. స్థిరమైన వస్తువులోని పరమాణువులలో కూడా చలనములు, ఆ పరమాణువుల సూక్ష్మాంశములలో కూడా భ్రమణాది క్రియలున్న వని నవీనుల మతమే కదా. వాటినీ చేయువాడను నేనే. కాన అక్కడనూ, నేనున్నాను ఇక క్రియారహితంగా ఉంటే, అత్యంత సూక్ష్మకణాలలో క్రియ లేకపోయినా, బ్రహ్మత్వము లేదనరాదు. అట్టి-స్థిరమున కనిపించు సూక్ష్మకణాలు కూడ సదా చలన, కంపన, భ్రమణాది క్రియలతో కూడియున్నవే. క్రియా రహితంగా సూక్ష్మకణాలు ఉన్నప్పుడు కూడ అవీ బ్రహ్మమే కదా. క్రియా రహితంగానూ బ్రహ్మము ఉండవచ్చును. కాన వాటి స్వరూపమూ నేనే. అనగా క్రియా రూపమైనా, ద్రవ్యరూపమైనా, బ్రహ్మమే.

శ్లో॥ ఏకో Zహం బహుధా ద్రవ్య - రూప చైతన్య తద్గుణైః
అఙ్గీ కృత్యాప్య నూహ్యంమాం, నిశ్చినోతి క ఆగ్రహః? 27

తా॥ నేను ఒక్కడినే. అయితే నా ఈ స్వరూపము, ద్రవ్యము, రూపము, చైతన్యము వాటి వాటి గుణములతో కూడిన నానాత్వముతో నున్నది. నేను మీ ఊహలకు (తర్కములకు) అందనన్న విషయమును అంగీకరించిన తరువాత, నన్ను నిశ్చయించుటకు మీమీ పట్టుదలలు (మతములు) చెల్లవు కాన ఎందులకు?

శ్లో॥ న జ్ఞాతోZహం తు దృష్టోZపి, వేదా ద్బ్రహ్మేతి నిశ్చితః
ఊహాతీతోZస్మి వైచిత్ర్యం, సిద్ధిభి ర్దర్శయామి చ॥ 28

తా॥ నేను సాక్షాత్కరించితిని కాన, నన్ను చూసినావు. అంతే తప్ప, నన్ను పూర్తిగా తెలియజాలవు. వేదవాక్య ప్రమాణము ననుసరించి నేను బ్రహ్మమని నిశ్చయింప బడితిని. నా దర్శనము, కేవలము నేనున్నాననియే నిరూపించును తప్ప, నా స్వరూప జ్ఞానము నీయదు. ఊహలకు సైతము అందని నేను ఉన్నానియే గ్రహించవలయునే తప్ప, నాస్వరూపమును గూర్చి తర్కించుట వలన, నేను బుద్ధులకు అందను. నేను ఊహలకు అందను అను విషయమును, నేను అష్టసిద్ధులను ప్రదర్శించి, విచిత్రలీలల ద్వారా నిరూపించుకొందును.

శ్లో॥ నాసాధ్యం వర్తతే మేZపి, సర్వత్రౌచిత్య సంయమః
ఛినత్తి స్వశిశుం కోను?, సర్వచ్ఛేత్తా నిరూపణే॥ 29

తా॥ నాకు అసాధ్యమైనది అంటూ ఏదీ లేదు. అయితే ఔచిత్యము ననుసరించి, ఏది చేయాలన్నా ప్రవర్తిస్తాను. దేనినైనా నరుక గల శక్తి గలవాడు, తన శక్తిని నిరూపించుటకు, తన కన్న బిడ్డను నరుకునా? (నరుక గలడు. కానీ అనౌచిత్యము కాన నరుకడు).

శ్లో॥ నానావేష పరిచ్ఛన్నం, మర్త్యలోకే తు నాస్తికః
మాం పశ్య న్నా హమస్మీతి, జగదస్తీతి మన్యతే॥ 30

తా॥ ఈ మర్త్యలోకమున, అనేక వేషములతో నేను అనేక వస్తువులుగా కనపడుచున్నాను. నాస్తికుడు ఈ కనపడు వస్తురూపమైన జగత్తు ఉన్నదనియూ, నేను లేననియూ తలచుచున్నాడు.

శ్లో॥ విశ్వరూపాఖ్య దేవస్య, వేషస్య మమ సమ్మతమ్
సత్త్వమస్యాస్తి కః కిం స్యా, న్మామజ్ఞాయ చ సన్నటమ్॥ 31

తా॥ ఈ విశ్వము అంతయును "విశ్వరూపుడు" అను పేరు గల నా దేవతా వేషాలలో ఒకటి. నాస్తికుడు, వేషధారియగు నేను లేననుచున్నాడే తప్ప, వేషము (విశ్వము) ఉన్నదనియే అంటున్నాడు గదా. వేషధారి యగు నన్ను తెలియక, వేషము మాత్రమే ఉన్నదను నాస్తికుడు కూడ ఆస్తికుడే అగునా? కాదు.



శ్లో॥ కోZపి త్రిమూర్తి పర్యన్తం, దేవ భక్త స్తథైవ హి
వేషమాత్రస్య చాస్తిత్వం, భిన్నస్య బ్రహ్మణో న చ॥ 32

తా॥ త్రిమూర్తుల పర్యంతము, ఏ దేవుడి భక్తుడైననూ, ఈ నాస్తికుని వంటి వాడే గదా. నాస్తికుడు ఎట్లు విశ్వరూపదేవుడే అనగా విశ్వమే ఉన్నది తప్ప, విశ్వవేషధారి వేరుగ లేడనియూ, ఈ విశ్వరూపదేవుడే అనగా విశ్వమే బ్రహ్మమనియు అనుచున్నాడో, త్రిమూర్తులు-తదితర దేవతల భక్తులు కూడ నా వేషమునే (ఈనామరూపాలు గల దేవుడే బ్రహ్మము, అనగా శివుడే బ్రహ్మము, విష్ణువే బ్రహ్మము మొ॥) బ్రహ్మముగ భావించి, ఈ వేషము తప్ప వేరుగా బ్రహ్మము లేదని (అనగా నేనే లేనని) వాదించుచున్నారు. నాస్తికుడును ఈ జగత్తు అను నా వేషము తప్ప, వేరుగ బ్రహ్మము లేదని వాదించు చున్నాడు. కాన, వీర వైష్ణవ, వీర శైవాదులూ-నాస్తికులూ ఇరువురూ సమానమేకదా.

శ్లో॥ జగ ద్వేషేణ మాం బ్రహ్మ, నాభిజానాతి నాస్తికః
అభీష్ట దేవతా వేషం, మాస్తిక ఖ్యాత నాస్తికః॥ 33

తా॥ నా యొక్క ఈ జగత్తు అను వేషము చేత భ్రాంతుడై, బ్రహ్మమైన నన్ను నాస్తికుడు గుర్తించుట లేదు. అటులనే వారి వారికి ఇష్టములైన నా దేవతా వేషముల చేత భ్రాంతులై, "ఆస్తికులు" అని పిలువబడు ఈ నాస్తికులు గూడ బ్రహ్మమైన నన్ను గుర్తించకున్నారు.

శ్లో॥ శివ విష్ణు ఘటా దీనాం, శబ్దార్థో మయి నిష్ఠితః
సామానాధికరణ్యేన, నాట్యం కిం వేష కేవలాత్॥ 34

తా॥ "శివ" "విష్ణు" "కుండ" మొ॥ అన్ని జగత్తులో వస్తువుల-దేవతల నామ శబ్దాలు బ్రహ్మమైన నా యందే చివరకు స్థిరముగ నిలచును. ఇది "సామానాధికరణ్యము"న బడును. అనగా నీలమైన కలువ అన్నపుడు, నీలత్వము అను రంగు-వేషమును కలువ ధరించిననూ, "నీలము" అనే శబ్దము కలువనే చెప్పును. ఒక నటుడు వేషమును వదలినచో, కేవలము ఆవేషము మాత్రమే, నటుడు చేసిన నాట్యమును చేయగలదా? కాన, బ్రహ్మమే ఆయావేషముల ద్వారా ఆయా శక్తులను ప్రదర్శించు చున్నది.

శ్లో॥ న రామే కృష్ణ వేషే హి, కుర్యా త్కాళియతాణ్డవమ్
ఔచిత్య సంయతా శక్తి, శ్ర్శూయతాం క్వచిదప్యసౌ॥ 35

తా॥ కృష్ణవేషంలో నటుడు కాళియ మర్దన తాండవమును ప్రదర్శించగలడు కానీ రామవేషంలో ప్రదర్శించలేడు. ఏలననగా, ఆ పాత్ర వేషము యొక్క ఔచిత్యమునకు బద్ధమైన నటుని శక్తి సామర్థ్యములుండును. అయితే, ఆ నటుడు ఏ వేషంలో ఉన్నా, ప్రేక్షకుడు పలుకునది వినగలడు కానీ, తన వేషపాత్ర మర్యాదను అతిక్రమించి బదులు ఇవ్వలేడు. అట్లే బ్రహ్మము భక్తుల మొరలను ఏ వేషంలో ఉన్నా వినగలడు కాని బదులు ఇవ్వలేడు.

శ్లో॥ బ్రహ్మ హి పాలనే ధ్వంసే, శ్రుత్వా హరిహరాత్మనా
కుర్యా ద్దత్తస్తు నిర్వేష,. స్సృజే త్కుర్యా దపి ద్వయమ్॥ 36

తా॥ సృష్టికర్తయగు బ్రహ్మదేవుని దుష్టశిక్షణము చేయమని ప్రార్థించిన, బ్రహ్మవేషంలో ఉన్న నేను వింటాను కానీ, విష్ణు వేషంతోనే దానిని చేస్తాను. అలానే శివ వేషంలోనే ప్రళయము చేస్తాను. ఏ వేషమూ లేని, ఈ దత్తుడు, పాత్ర వేషము యొక్క ఔచిత్య-నిర్బంధము లేదు కాన, బ్రహ్మ దేవుడి లాగా సృష్టి చేస్తాడు. విష్ణువు లాగా పాలనము చేస్తాడు. శివునిలాగా ప్రళయమూ చేస్తాడు. (స్వవేషంలో ఉన్నపుడు, ఏ వేషనిర్బంధమూ లేదు కావున, స్వవేషంలో ఉన్న నటుడు కాళియమర్దన నృత్యముచేసి చూపగలడు.)

శ్లో॥ అతర్క్యాఽజ్ఞేయసిద్ధాన్తే, కుత శ్చైతన్య సంయమః?
అహం రూప మిదం స్యాంచ, సచైతన్య గుణాదిమాన్॥ 37

తా॥ "తర్కమునకు అందదు" "తెలుసుకొనలేము" అనేదే చివరకు సిద్ధాంతంగా పరిణమించక తప్పనప్పుడు, అట్టి అతర్క్య-అజ్ఞేయ వస్తువు చైతన్యమే కావలయునని మడికట్టుకొని కూర్చొన నేల? ఈ రూపము కూడ అట్టిది కావచ్చును గదా! (అర్థము కానిది తర్కమునకు అందనిది ఏది-అయితే ఏమి?) నా ఈ రూపంలో-ద్రవ్యము, చైతన్యము-వాటి గుణములు కూడ ఉన్నాయి. వీటి అన్నింటి సమాహారమైన, నేను తర్కాతీతుడను, అజ్ఞేయుడనని అంగీకరించవచ్చును.



శ్లో॥ జగ త్సత్యం న వాచ్యం మే, వక్తుం సత్యాం, తనుం మమ
నేయం వాచ్యాZ ప్యసత్యేతి, వక్తుం జగదస త్తథా॥ 38

తా॥ నాఈతనువు (రూపము) సత్యమని స్థాపించుటకు, జగత్తు (జగత్తులోని రూపములు) సత్యములు అని చెప్పపనిలేదు. అట్లే, జగత్తు అసత్యమని వాదించుటకు నా ఈ తనువు (రూపము) అసత్యమని చెప్పపనిలేదు. అనగా నా రూపము సత్యమని స్థాపించుటకు జగత్తులోని రూపములు సత్యములని చెప్పనవసరము లేదు. అట్లే జగత్తు అసత్యమని చెప్పుటకు నా రూపము అసత్యమని చెప్పనవసరము లేదు.

శ్లో॥ అవిభక్తం విభక్తంచ, విభక్తాఙ్గేషు మాం స్థితమ్
న కోZపివేత్తి తత్త్వేన, జానాత్యస్తీతి కేవలమ్॥ 39

తా॥ నా ఈ అవయవములన్నియు విడివిడిగా వాటి వాటి ఆకారములతో కలిసి యున్నవి. వీటిచేత, నేను విభజింపబడలేదు. ప్రతి అవయవమూ పూర్ణ బ్రహ్మమే కాన, విభజింపబడిన ప్రతి అవయవమూ నేనే కాన విభజింపబడియున్నాను. నన్ను యధార్థముగ ఎవడునూ తెలుసుకొనలేడు. కేవలము "నేను" ఉన్నాననియే తెలుసుకొలగలడు.

శ్లో॥ సాహఙ్కారేణ తర్కేణ, మయ్యేవ మితి నిశ్చితే
తథా న స్యా మపి స్యాత్త, త్కార్యకారణసమ్మతమ్ 40

తా॥ అహంకారముతో కూడిన తర్కము ద్వారా నన్ను "ఈ విధముగా బ్రహ్మము యొక్క స్వరూపము" అని నిశ్చయించిననూ, నేను అట్లు ఉండను. అది చక్కని కార్య - కారణ వాదముతో సమ్మతముగా నున్ననూ నా యందు వ్యర్థ మగును. నేను తర్కాతీతుడను. అహంకారముతో కూడిన బుద్ధి శక్తి యగు తర్కములకు లొంగను.

శ్లో॥ తర్కో గ్రాహ్యో హి తర్కేణ, సాధయే న్మా మతర్కితమ్
ఇతి నో తర్క సిద్ధాన్త - నిశ్చితం నైవ కారవాన్॥ 41

తా॥ తర్క శాస్త్రము అవసరమే. ఎట్లు? తర్కించి, తర్కించి చివరకు తర్కమునకు సాధ్యము కాడని తెల్సుకొనుటకే తప్ప, తర్కముతో నా స్వరూపమును నిశ్చయించుటకు

కాదు. "ఇట్లే ఉండునని" పట్టుదలతో నా స్వరూపమును గురించి నిర్ణయించరాదు. నేను తర్కాతీతుడను గాన నన్ను తర్కముతో ఇట్లుండునని నిర్ణయించరాదు.

శ్లో॥ వాచ్యమేవ మపీత్యత్ర, నైవేతి బ్రహ్మ వస్తుని
కుణ్ఠితా ఏవకారాహి, గిరో మన్దానిలా మయి॥ 42

తా॥ "ఈవిధముగా కూడ బ్రహ్మ స్వరూపము ఉండును" అని పలుకవలయునే తప్ప, "ఇట్లే ఉండున"ని నిశ్చయించి పలుకరాదు. "ఇట్లే" అను మాటలు, బ్రహ్మవస్తువు అగు నా యందు, కొండ యందు పిల్లగాలుల వలె వ్యర్థములు అగును. కనుక, తర్కాతీతుడనైన నన్ను, అహంకారముతో తర్కముచే, "నేను ఇట్లే ఉండునని' ' నిశ్చయించి పలుకరాదు.

శ్లో॥ అతర్క్యం మాం నిశీవ్యాపి, న హి తృప్తో భవే దతః
తర్కయిత్వా తథా జ్ఞాత్వా, తృప్తస్తర్కో హి సమ్మతః 43

తా॥ "నేను తర్కమునకు అందను" అని విన్నంత మాత్రమున మానవుడు తృప్తిని చెందడు, తాను స్వయముగ తర్కించి తర్కించి శ్రమతో అలిసిపోయి, "తర్కమునకు అందడు" అని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నగాని తృప్తిని పొందడు. కాన, అట్టి అనుభవమును ప్రసాదించు ఈ తర్కశాస్త్రము కూడ సమ్మతమైనదే గదా!

శ్లో॥ సాన్ద్రాసాన్ద్రదశాముక్త, మనన్తానాది సాగరమ్
నిరాకారం హి నిశ్చిత్య, వేత్తి కిం తర్కపణ్డితః? 44

తా॥ సాంద్రత చెందుటయు, పలుచబడుటయు, నాలో అసంభవము కాన, ఒకే రీతిలో అంతటనున్న అనాది-అనంత ఏకతత్త్వ సాగర స్వరూపముగా నన్ను తన తర్కముతో నిరాకారునిగా నిశ్చయించి, తర్కపండితుడు నన్ను తెలుసుకొనగలిగెనా? లేదు.

శ్లో॥ నిరాకారో నతస్యాహం, పరమార్థేऽ పి కస్యచిత్
నిరాకారోऽ పి యోవక్తి, నిరాకారోऽ పి చేతి మామ్ 45



తా॥ అహంకారముతో నన్ను నిరాకారునిగా నిశ్చయించిన వానికి, పరమార్థ దశ యందును నేను నిరాకారుడను కాను. ఆకారమే. వినయముతో, మరియొకడు "బ్రహ్మము నిరాకారముగను ఉండవచ్చును" అని చెప్పిన వానికి, నేను అదే సమయమున నిరాకారముగ కూడ నుండి యుందును. అనగా ఒకే సమయమున నేను ఆకారముగను, నిరాకారముగను ఉండగలను. నేను సర్వ శక్తిమంతుడను గదా! కనుక నా యందు తర్కముచే నిర్ణయించుట కుంఠితమే యగును.

శ్రీ దత్త శిష్య ఉవాచ:-

శ్లో॥ కుడ్య మార్జాల వద్బ్రూషే, బుద్ధిర్మే మోహితా గురో!
కిం సత్యం? కిమసత్యం చ? - వదనిశ్చిత్య మే దృశా॥ 46

శ్రీ దత్త శిష్యుడు వచించెను:-

తా॥ ఓ గురుదేవా! గోడపై పిల్లి వాటంగా మాట్లాడుచున్నావు. నా బుద్ధి అర్థము చేసుకొనుట లేదు. ఏది సత్యము? ఏది అసత్యము? నన్ను (జీవుని) దృష్టిలో ఉంచుకొని నిశ్చయించి పలుకుము.

శ్రీ దత్తగురు భగవానువాచ:-

శ్లో॥ కుడ్యమధ్యేతు మార్జాలే, వస్తు తత్త్వే తథావిధే
నిశ్చితే చైక భాగస్థే, శిష్య!, సత్యం బ్రవీషి కిమ్? 47

తా॥ ఓ శిష్యా! సరిగా గోడ మధ్యలోనే పిల్లి కూర్చుని యుండగా, ఒక వైపున పిల్లి ఉన్నదని పలుకుచో నీవు సత్యము చెప్పితివా? అసత్యము చెప్పితివా? వస్తు స్వరూపమే అట్లు ఉండగా చెప్పువాడేమి చేయగలడు? గోడ మధ్యలోనే పిల్లి ఉన్నదని సత్యమైన వస్తుస్థితినే చెప్పవలయును గదా.

శ్లో॥ అస్తి సత్యం పరం బ్రహ్మ, ద్వితీయం నాస్తి యత్పరమ్
అస్త్యపి బ్రహ్మతత్త్వేన, శక్త్యా తు పరమాణుకః 48

తా॥ సత్యము, పరము అగు బ్రహ్మ మున్నది. దాని కన్న రెండవది లేదు. ఒక వేళ ఉన్నది అనుకొన్నను, అదియును తాత్త్వికంగా బ్రహ్మమే. అయితే అది శక్తి చేత ఒక అత్యల్పమైన పరమాణువు వంటిది. కాన, దాదాపు లేనట్లుగా భావించుటలో తప్పులేదు.

శ్లో॥ జీవ తత్త్వ మసి బ్రహ్మ, శక్త్యా నాస్తిక భావిని
కావే భవసి తాతస్య, వాత్యల్యాతిశయాత్తు లట్॥ 49

తా॥ వేదములో ఇలా చెప్పబడినది. "ఓ జీవుడుగా ఉన్న శ్వేతకేతూ! నీవు తాత్త్వికంగా బ్రహ్మమే"అయితే దీని భావము "శక్తి సామర్ధ్యాలలో బ్రహ్మము కావు." అయితే "నీవు బ్రహ్మమై యున్నావు" అని శ్వేతకేతువు యొక్క తండ్రి చెప్పుటలో తన కుమారుడు అతి శీఘ్రకాలములో బ్రహ్మము కావలయునను ఆశీస్సు ద్వారా తన వాత్సల్యాతిశయమును సూచించుచున్నాడు. అత్యంత సన్నిహితమైన (అతి దగ్గరగా) భవిష్యత్కాలమును, వర్తమాన ధాతువు (లట్) చెప్పను గదా. ("వెంటనే వెళ్ళబోవుచున్నావు" అను అర్ధములో "వెళ్ళుచున్నావు" అను వర్తమానకాల ధాతువును వాడవచ్చును. కాన, సామాన్య జీవుడైన శ్వేతకేతువు తాత్త్వికంగా బ్రహ్మమే. శక్తి సామర్ధ్యాల చేత కాదు. అయితే శక్తి సామర్ధ్యాలలో కూడా బ్రహ్మమే యగుట సాధ్యమే. అట్లు బ్రహ్మము కమ్మని ఈ వాక్యములో తండ్రి కుమారుని వాత్సల్యాతిశయము వలన అతి త్వరగా కమ్మని ఆశిస్తున్నాడు.

శ్లో॥ తత్సర్వం బ్రహ్మతత్త్వేన, జీవః కి మపి వస్తు వా
సాన్ద్రాసాన్ద్ర దశే శక్తే, ర్భేదా జ్జగతి వీక్షితే॥ 50

తా॥ కాన, తత్త్వపరంగా, అంతా బ్రహ్మమే, జీవుడే కాదు - ఏ వస్తువైనా బ్రహ్మమే. అయితే, జగత్తులో ఒక వస్తువుకు మరియొక వస్తువుకూ శక్తి సామర్ధ్యాలలో భేదమున్నది. ఇట్టి భేదమునకు కారణము ఒక వస్తువులో శక్తి సాంద్రమై ఎక్కువ ఉండుట మరియొక వస్తువులో పలుచగా తక్కువ శక్తి ఉండుటయే.

శ్లో॥ బ్రహ్మాన్య శూన్య సాంద్రత్వా, న్నానారూపాణి కేచన
ప్రాహు ర్బ్రహ్మసమం తోయ - భ్రాన్తి ర్భిన్నేతి కేచన 51

తా॥ బ్రహ్మము లేని శూన్యమైన ఆకాశమున్నదనకొని, బ్రహ్మము సాంద్రత చెందుటలో అవకాశముండును కాన నానా రూపములు ఏర్పడునని కొందరి మతము. మరి కొందరు బ్రహ్మము లేని ప్రదేశమే లేదు కాన, అంతా బ్రహ్మము నిండియున్నది కాన - అనగా ప్రపంచమంతా జలముతో వ్యాపించి, జలముకన్నను భిన్నమైనది లేనపుడు--బ్రహ్మము



లేని శూన్యమే లేనందున ఈ రూపములన్నియునూ అసత్యములు, కేవల భ్రమలు అని మరికొందరి మతము.

శ్లో॥ ఉభావజ్ఞౌ బ్రహ్మమతా, దబోధ్య మమతం హి యః
వక్తి జ్ఞానీ విమృశ్యైవ, నోహ్యం సత్య విరుద్ధయోః॥ 52

తా॥ ఈ ఇరుపక్షములవారూ బ్రహ్మమును అర్ధము చేసుకొనలేదు. ఎందువలననగా, ఇరువురూ ఒకే సిద్ధాంతమును నిర్ణయించి, దాని ప్రకారము బ్రహ్మ స్వరూపమును తాము అర్ధము చేసుకొని, ఇతరులకు బోధించుచున్నారు. నిజముగా ఈ లోకములో బ్రహ్మజ్ఞాని ఎవరనగా - ఎవరు తర్కముతో ఆమూలాగ్రము కూలంకషముగా తర్కించి, బ్రహ్మమును అర్ధము చేసుకొనలేమనియు, ఎవరికిని బోధించజాలమని సిద్ధాంతమును నిరూపించిన వాడే. అర్ధము కాకపోవుట ఎపుడు జరుగుననగా రెండు విరుద్ధములైన మతములు సమన్వయించకపోయినా, సత్యములే అగునపుడు - అది అజ్ఞేయము, అబోధ్యము అగును.

శ్లో॥ ఏకదైకత్ర సత్యౌ తౌ, సిద్ధాన్తౌ పరమాద్భుతమ్
ఏకం చ బహుధా సత్యం, సకృచ్చిత్రా న్మహత్తమమ్॥ 53

తా॥ ఇప్పుడు బ్రహ్మ విషయమున, పైరెండూ ఒకే ప్రదేశమున ఒకే కాలమున సత్యములగుచున్నవి. అందు వల్లనే, బ్రహ్మము అతి విచిత్రము, అనూహ్యము. అందు వల్లనే ఇది అన్నింటి కన్ననూ గొప్పదియగు అర్ధము కల బ్రహ్మమైనది. అనగా - బ్రహ్మము జలము వలె అంతా వ్యాపించి, దాని కన్నా భిన్నమగు రెండవది పుట్టుటకు అవకాశము లేని 'అద్వైతము అనునదియు నిజమే. అదే సమయమున బ్రహ్మము లేని శూన్యమున్నది కాన, ఆ శూన్యములో బ్రహ్మము సాంద్రత చెందుట వలన నానా రూపములు ఏర్పడుటయు నిజమే.ఈ రెండూ పరస్పర విరుద్ధములు అయినా ఈ రెండూ ఒకే చోట, ఒకే సమయమున సత్యము లైనందున బ్రహ్మము అతి విచిత్రము, ఊహకు అందదు, బోధించుటకు వీలు కానిది అనియే తేలుచున్నది. ఇదే నిజమైన బ్రహ్మ తత్త్వము బ్రహ్మము ఒక్కటే-బ్రహ్మము అనేకమూ - ఒకే సమయమున అయి ఉన్నది. ఇట్టి విచిత్రము వలన, అన్నిటి కన్న గొప్పది కాన బ్రహ్మము అనబడును. ఈ విచిత్రము జీవునకే నని తెలియవలమును.

శ్లో॥ ప్రత్యక్షా దవతీర్ణస్య, సిద్ధ్యా Z నూహ్యం పునర్భవః
దృష్టో జీవస్య వదతో, మర్త్య జన్మ తు దుర్లభమ్॥ 54

తా॥ నేను అవతారముల ద్వారా ప్రదర్శించు ఊహాతీతములైన చిత్రములగు సిద్ధుల వలన, నేను తర్కమునకు అందను అనియే నేను సూచించు నాతత్త్వము. ఇది ప్రత్యక్ష ప్రమాణ సిద్ధమే గదా. ఇక, జీవుడును, పునర్జన్మల నెత్తుటయు ప్రత్యక్షముగ లోకములో అనేక ప్రదేశములలో వెనుక జన్మ విషయములను ఎక్కడో ఉండి చెప్పుటయు కనబడుచున్నది. కాన నేను తర్కాతీతుడననియు, జీవునకు మరల మరల జన్మములు కలవనియు తెలుసుకొనవలయును. అయితే, పునర్జన్మలు ఉన్న వనుట నిజమే కానీ, మానవ జన్మ మరల లభించుట చాలా కష్టము.

శ్లో॥ సజాతీయ విజాతీయ - స్వగతం భేద ముజ్ఝితమ్
శ్రుతే ర్దృష్టే స్స శూన్యం హి - భిన్నం ద్వంద్వం ధియోహ్యతే॥ 55

తా॥ సజాతీయ భేదము (అనగా రెండు ఆవుల మధ్య భేదము) విజాతీయ భేదము (అనగా ఆవు-కుక్క మధ్య భేదము), స్వగత భేదము (అనగా ఆవు యొక్క కాలు, చెవి, ముక్కు మొదలగు అవయముల మధ్య భేదము) - ఈ మూడు భేదములు లేనిది బ్రహ్మమని వేదము చెప్పుచున్నది. కానీ ప్రత్యక్షానుభవంలో అట్టి పదార్థము ఎక్కడనూ లేదు. ఈ సృష్టి అనేక భేదములతో గూడిన పదార్థములతోను, అసలు పదార్థములే లేని శూన్యముతోను కలసి కనపడుచున్నది. కావున శ్రుతికిని, ప్రత్యక్షానుభమునకూ విరోధము ఏర్పడినది. అయితే ఈ రెండు పక్షములు బుద్ధికి అంది "ఊహ్యతత్త్వములుగనే ఉన్నవి. సారాంశము- శ్రుతి ప్రకారముగా బ్రహ్మము సర్వవ్యాపకమైన ఏకతత్త్వము. సర్వవ్యాపక మంటే, బ్రహ్మము కన్న భిన్నమైన వస్తువు కానీ శూన్యము కానీ ఉండరాదు. ఇట్టి తత్త్వము సర్వ వ్యాపక మనగా ఏ వస్తువులూ లేని అనాది, అనంతమైన శూన్యమువలె ఒకే పదార్థము ఉండవలెను. అట్టి పదార్థమును కూడ మనము ఊహించగలము కాన ఊహాతీతము కాదు. ఇక, ప్రత్యక్షంగా కనపడే విశ్వము అనేక భేదములు గల పదార్థములతోను, ఏ పదార్థమూ లేని శూన్యము యొక్క భాగములతోను, నిండి యున్నది. ఇది ఊహకు అందు తత్త్వము. కాన, శ్రుతి తత్త్వమునకు, సృష్టి తత్త్వమునకు గల సామ్యము "ఊహకు అందుట" అను విషయము. ఇది తప్ప, రెండూ పరస్పర విరోధము కలిగియున్నవి.



శ్లో॥ ఊహ్యం నైక తరం బ్రహ్మ, నైవం నోహ్య శ్రుతే ర్గుణః
సర్పాది రేకదా నోహ్య, స్సార్థకం హి శ్రుతి ద్వయమ్॥ 56

తా॥ఈ రెండింటిలో ఏది బ్రహ్మము? అనగా ఏది గొప్పది? ఏదీ బ్రహ్మము కాదు. ఏదీ గొప్పది కాదు. ఎందువలన? రెండూ బుద్ధికి (అనగా ఊహకు/ తర్కమునకు) అందునవే. బ్రహ్మము ఊహకు అందనిది అని శ్రుతి చెప్పుచున్నది. కనపడుచున్న భేదంలో కనపడని ఏకత్వాన్ని, మరియు అనూహ్యత్వాన్ని శ్రుతి చెప్పుచున్నది. కనపడని ఏకత్వాన్ని ప్రతిపాదించి, కనపడిన భేదాన్ని నిరాకరించటమే శ్రుతి భావమైతే ఇక అనూహ్యత్వము నెందుకు చెప్పాలి? అంటే దీని అర్థము- చీకటిలో తాడును చూచి ఇది సర్పము, నీటి ధార, కర్ర మొ॥ భేదాలను చూచి భ్రమపడుచున్నాము. ఈ భేద వస్తువులన్నీ బుద్ధికి అందినవే. "ఇవి అన్నీ కాదు. ఇది ఒకే వస్తువు అగు తాడు" అని చెప్పినపుడు, ఆ తాడు కూడా బుద్ధికి అందే వస్తువే కదా. "ఈ తాడు ఊహకు అందదు" అని చెప్పరాదు కదా. ఈ తాడు ఊహకు అందనిది ఎప్పుడు అగును? ఒకే సమయంలో ఒకే తాడు, నిజంగానే సర్పంగా, కర్రగా, నీటి ధారగా ఉండగలిగితే, అప్పుడు ఆ తాడు అనూహ్యమగును. అప్పుడు "తాడు ఊహకు అందదు" అను శ్రుతి సార్థక మగును. కనిపించని ఒకే తత్త్వమైన తాడును ప్రతిపాదించినపుడే, "ఒకే వస్తువు ఒకే సమయంలో అనేకంగా ఉండగలుగుచున్నది". అని కూడా అన్నపుడే ఊహకు అందక పోవుట సిద్ధించుచున్నది. అప్పుడీ సిద్ధాంతంలో "ఒకే వస్తువు (తాడు)" అను శ్రుతియూ. "ఊహకు అందదు" అను శ్రుతియూ - రెండూ సార్థకమగుచున్నవి గదా.

శ్లో॥ వాయో ర్వీచి ర్ఘటో బన్ధో, ప్రాచీనా న్నవ్య ముత్తరమ్
ప్రయోగ నిశ్చితం మత్తః, ప్రాప్తం వేదాన్త సాధనమ్॥ 57

తా॥ ఈ సృష్టిలో ఏ పదార్థమైననూ, కణములుగానే ఉన్నది. మరియు సజాతీయ, విజాతీయ భేదములు కలిగియున్నది. జలము-తరంగములలో కూడ జలము అణువులుగా ఉంది. తరంగము కేవల జలము అనరాదు. జలాణువులు వాయుసంయోగంతో చలించుచు తరంగాకారము ఏర్పడుచున్నవి. వాయు సంయోగము లేనిదే తరంగమేర్పడదు కాన తరంగము కేవల జలమే అనరాదు. మట్టి కుండలు కూడా మట్టి అణువుల మధ్య అగ్నిపాకం వల్ల విశేష శక్తి బంధాలు ఏర్పడుట వల్లనే కుండ ఆకారము ఏర్పడినది. కాన, మట్టికి కుండకు విశేష శక్తి బంధాలు లేక పోవుట, ఉండుట, అనే భేద మున్నది. ప్రాచీన తర్కశాస్త్రములో నేటి ప్రయోగ విజ్ఞాన

పూర్వకమైన ఈ అవగాహనము లేకపోవుటవల్లనే ఈ ప్రమాదములు సిద్ధాంతములలో దొర్లినవి. నా అనుగ్రహము వల్లనే నేటి శాస్త్ర పదార్థ పరిశీలనంలో ప్రయోగపూర్వకంగా సత్యమును అన్వేషించకలిగినారు. దీని వలన వేదాంత జ్ఞానమునకు సహకారము జరుగుననియే నేను నేడు శాస్త్రజ్ఞులకు ఈ నవీన భౌతిక విజ్ఞానమును అందించుచున్నాను.

శ్లో॥ ఏకత్వం పఞ్చభూతత్వం, స్వరూపే జగతి స్థితమ్
సమన్విత మహం విశ్వం, నోహ్యో విశ్వాత్మ విశ్వగః॥ 58

తా॥ ఒకే తత్త్వము - అనేక తత్త్వములతో కూడిన ఆకాశము (శూన్యము-) ఈ రెండూ పరస్పర విరోధముల సమన్వయము, ఒకే చోట ఒకే సమయమున జరుగుటయే. బ్రహ్మము అనగా గొప్పతనము. ఈ సమన్వయము ఈ సృష్టిలోనే కాక, నీకు కనుపించు నా ఈ స్వరూపములో కూడా ఉన్నది. అనగా, నా ఈ స్వరూపములో కూడ అనేకత్వము (పంచభూతాలు) మరియు ఏకత్వము, రెండూ - సమన్వయించినవి. ఇట్లే సృష్టిలోను ఈ రెండు తత్త్వములు, అన్యోన్యము విరోధించకొనుచూ సమన్వయముతో నున్నవి. ఇదే అనూహ్యతత్త్వమైన బ్రహ్మము. కాన ఈ స్వరూపము బ్రహ్మము. ఈ సృష్టియు బ్రహ్మము. కాన ఈ సృష్టియు నా స్వరూపమే. బ్రహ్మమే. అనగా నేనే. ఈ విశ్వమూ నేను. ఈ విశ్వానికి ఆధారము నేనే. ఈ విశ్వములోనికి ప్రవేశించి, సంచరించుచున్నదీ నేనే. విశ్వమే నేనై, విశ్వానికి ఆధారము నేనై, విశ్వంలో ప్రవేశించు సంచరించువానిగా నన్ను అర్థము చేసుకొనుట అసంభవము. కాన అనూహ్యుడను.

శ్లో॥ అహం సామర్థ్య విశ్వే చ, పరిమాణస్య నావధేః
దృష్టోZహం ద్రష్టృమానాత్మా, నోహ్యోZన్వయ విరోధతః॥ 59

తా॥ ఏకతత్త్వము నేనే. అనేక తత్త్వములు ఒకే సమయములో నేనేనై యుండుట అనూహ్యము. ఆకాశ పరిమాణమునకు అతీతుడను కాన, విశ్వవ్యాపకమైన ఏకత్వమైన నా సామర్థ్యమగు బ్రహ్మము నేనే. అనేక తత్త్వము లైన విశ్వమూ నేనే. ఈ విధంగా విశ్వవ్యాపకుడను, విశ్వము నేనే అయియుండి ఈ నీకు కనిపించు పరిమిత ప్రమాణ రూపము నేనే. ఎవ రెంత ప్రమాణములో ఉంటారో వారికి అంతే ప్రమాణంలో నేను కనిపిస్తాను. ఈ విధంగా అన్ని విరోధ పక్షములు నా యందు ఒకే సమయంలో సమన్వయించుట వలన అనూహ్యుడను.



శ్లో॥ నవ్యర్థా బ్రహ్మజిజ్ఞాసా, సాZభిజ్ఞానం హి కర్తృగమ్
తటస్థం న స్వరూపం త, త్రికర్మిత్వం ద్వితీయతః॥ 60

తా॥ "బ్రహ్మ మగు నేను అనూహ్యుడనేని బ్రహ్మజిజ్ఞాస వ్యర్థము కావున బ్రహ్మ సూత్రాదులను పఠించుట వ్యర్థము" అని అనరాదు. జిజ్ఞాసయనగా గుర్తించుట అని అర్థమే తప్ప, తత్త్వబోధ కాదు. ఈ వంద మందిలో "సుబ్బయ్య ఎవరు?" అని గుర్తించుట, సుబ్బయ్య యొక్క తత్త్వమును తెలుసుకొనుట కాదు. ఈ గుర్తింపునే తటస్థ లక్షణ మంటారు. "అదిగో ఆగట్టు మీద నున్నది ఆవు" అని చెప్పినపుడు ఆవును గుర్తించు లక్షణము అగు" గట్టు మీద ఉండుట" అనునది ఆవు యొక్క స్వరూపలక్షణము కాదు. స్వరూపలక్షణము తెలిసిన గదా తత్త్వబోధ. బ్రహ్మము విషయంలో బ్రహ్మమును గుర్తించు తటస్థలక్షణ మేమనగా - "ఈ జగత్తును సృష్టించి, పాలించి, లయింప జేయునది బ్రహ్మము" అను లక్షణమే. ఇంత మాత్రమున స్వరూపబోధ కాలేదు. బ్రహ్మమును గుర్తించుట అని ప్రథమ సూత్రమున చెప్పి, ద్వితీయ సూత్రమున ఆ గుర్తును (తటస్థ లక్షణము) చెప్పినాడు.

శ్లో॥ కార్య కారణ జాలాని, న విజ్ఞాయాల్పధీర్విశేత్
అపార్థం భగవత్తత్త్వం, కేచిత్పక్షవిదో విదః ॥ 61

తా॥ కోటాను కోట్ల కార్య - కారణ సంబంధములు వలల వలె, ఈ సృష్టిలో నున్నవి.వాటిని అర్థము చేసుకొనలేక, అల్పజ్ఞులై, భగవత్తత్త్వమును అపార్థము చేసుకొనుచున్నారు. ఈ మహా కార్య కారణజాలమైన కర్మ తత్త్వములో కొంత భాగమునే తెలుసుకొని, అదియే సమగ్రమని సిద్ధాంతమును కొందరు సర్వజ్ఞులమని భావించుచు చేయుచున్నారు.

శ్లో॥ జ్ఞానీ భక్తో హి కర్మీ చ, వాదశ్చిన్తా క్రియా స్తుతిః
జ్ఞానయజ్ఞోZయ ముక్తో హి, బుద్ధి యోగోZన్యథాZవ్యయాత్॥ 62

తా॥ జ్ఞానియును భక్తుడే. జ్ఞాని నా గురించి ఎంతో విమర్శించి, విమర్శించి, నేను ఏతర్కమునకునూ అందనివాడనని నిరూపించుట నా స్తోత్రమే కదా. వాని వాద చర్చ అంతయునూ నా స్తోత్రమే. కాన, భక్తుడు చేయు స్తోత్రమునకు ప్రీతి నొందినట్లు, నేను, జ్ఞాని యొక్క వాద చర్చలకు ప్రీతుడ నగుచున్నాను. చింతనము కర్మయే కాన,

ఈ చర్యయు కర్మయే. ఇట్లు జ్ఞాన-భక్తి-కర్మలు మూడును ఏకమైన ఈ సిద్ధాంత చర్య, జ్ఞాన యజ్ఞ మని పిలువబడును. జ్ఞాని యొక్క కాలశక్తులు నా కొరకే వ్యయించ బడుచున్నవి కాన, సంసారమున ఖర్చు అగుట లేదు కాన, ఈ యజ్ఞము యోగమగుచున్నది. చర్య, బుద్ధికి సంబంధించినది కాన, బుద్ధియోగమనబడుచున్నది.

శ్లో॥ లోకవ త్పరమ వ్యోమ్ని, చైతన్యం సాన్ద్రమీక్షితమ్
అసాన్ద్రం జీవ రూపం చ, నోహ్యాZ ప్యేకముభే సకృత్॥ ॥ 63

తా॥ లోకములో వలె, ఆకాశములో నున్న చైతన్యము అనగా జడశక్తి, సాంద్రమై దృశ్యజగత్తుగాను, సాంద్రము కాక స్వరూపంలో జీవుడి గాను మారును. నా పరమ వ్యోమము లోనున్న చైతన్యము కూడ అట్లే చేయును. అయితే లోకములోని ఆకాశ-చైతన్యముల వలె కాక, రెండూ ఒకే సమయంలో ఒకటిగానే ఉండుట ఊహకు అందదు.

శ్లో॥ అత్యన్త సూక్ష్మ శక్త్యంశ - కణాకాశేన సంహతిః
ఊహ్యతే శూన్య మకాశం - మన్యన్తే నవ తార్కికాః॥ 64

తా॥ ఆకాశము కూడ అత్యంత సూక్ష్మ చైతన్య శక్తి కణముల సమూహమే అయినచో, ఆ చైతన్య శక్తి దగ్గరకు సంకోచము చెంది ఘనీభవించుట కుదరదు గదా. శూన్యమే లేనిచో దగ్గరకు జరుగుట కుదరదు గదా. కాన తర్కమునకు అందదు. అందుకే ఈ నవీనులైన భౌతిక విజ్ఞానవాదులు ఆకాశమును శూన్యమనుకొను చున్నారు.

(ఆకాశము అత్యంత సూక్ష్మచైతన్య శక్తి కణముల సమూహమూ కాదు. ఆకాశము శూన్యమూ కాదు. అత్యంత సూక్ష్మ చైతన్య శక్తి కణముల సమూహమే అయినచో, చైతన్య కణములు సాంద్రత - పలుచబడుట జరుగుట అసంభవము కదా. అట్లు కాక, శూన్యమే అయినచో బ్రహ్మము లేని ప్రదేశమున్నట్లే అగును కాన శ్రుతి విరుద్ధము. ఈ రెండు పక్షముల విరోధ సమన్వయ వైచిత్ర్యమే బ్రహ్మము అని భావము)

శ్లో॥ శక్తి సూక్ష్మాంశ బిన్దూనా, మబ్ధి రాకాశ ఏష హి
అగృహీతో నవై శ్శూన్యం, శూన్యం నేత్యేవ వేదవాక్ ॥ 65



తా॥ శక్తి యొక్క సూక్ష్మకణములే జలబిందువులుగా నున్న అవిచ్ఛిన్న జలమైన శక్తి యొక్క సాగరమే ఈ ఆకాశము. నవీన తార్కికులు, ఆ విషయమును గ్రహించ జాలకున్నారు. కాన, శూన్యమనునది లేదని నిశ్చితమైన సిద్ధాంతము అని వేద మతము.

శ్లో॥ శూన్యాభావే త్వసంహత్యా, కథం దృశ్యేత సంహతిః?
జలాణు మధ్య శూన్యత్వా, త్సంహతిం తర్కయన్తి తే. 66

తా॥ శూన్యమే లేకున్నచో, దగ్గరగా జరిగి ఘనీభవించుట ఎట్లు కుదురును? జలములో అణువుల మధ్య శూన్య మున్నది కాని, అవి దగ్గరకు జరుగుట వలన జలము ఘనీభవించి మంచుగా మారునని నవీనుల తర్కము. ఇది ప్రయోగ నిరూపితము. కాన, సత్యమే కదా! ఈ విధముగా తార్కికుల మతము.

శ్లో॥ శూన్యం న క్వాపి సర్వం హి, బ్రహ్మేదం న హి సంహతిః
పరమార్థ దశేయం మే. జీవానా మస్తి సంహతిః॥ 67

తా॥ ఎక్కడనూ శూన్యమనునదియే లేదు. ఇదంతయును బ్రహ్మమే. ఎక్కడనూ సాంద్రత చెందుట అనునది లేదు. అయితే ఇది పరమార్థ దశ. ఇది నాకు మాత్రమే వర్తించును. జీవులకు మాత్రము సాంద్రత చెందుట కలదు. శూన్యమనునది లేదు. నా దృష్టిలో సాంద్రత చెందుట అనునది లేదు. జీవులకు మాత్రము సాంద్రత చెందుట కలదు. ఈవిధముగా వేద మతము పలుకుచున్నది.

శ్లో॥ పరమార్థ దశాగ్రాహ్యే, సత్యే బ్రహ్మణ్యసంహతే
తర్కేణ గృహ్యతాం బ్రహ్మ, తదగ్రాహ్యం యదద్భుతమ్॥ 68

తా॥ ఈ విధంగా వేదమతము ప్రకారముగ పరమార్థ దశలో సత్యాన్ని సాధించి, బ్రహ్మములో శూన్యము లేదు కాన, సాంద్రత చెందుట అసంభవము కాన, బ్రహ్మము ఒకే ఒక తత్త్వము, సాంద్రత అను మాటయే లేకుండ బ్రహ్మమును నిశ్చయించినచో, బ్రహ్మము తర్కమునకు చిక్కినట్లే అగుచున్నది కదా! కాని అద్భుతమైన బ్రహ్మము తర్కమునకు లొంగదు.

బ్రహ్మము తర్కాతీతము అనుటయే వేద తాత్పర్యము. (అనగా-ఏమీ లేని శూన్యమున్నదని ప్రత్యక్షానుభవవాదులగు తార్కికుల మతము. అంతా బ్రహ్మమే కాన,

ఏమీ లేని శూన్యము అనగా బ్రహ్మము లేక పోవుట సిద్ధించును కాన, ఏమీ లేని శూన్యము లేదని వేదమతము. ఈ రెండు పరస్పర విరుద్ధ పక్షాలు సమన్వయించి, ఏకకాలంలో, ఏకవస్తువగు బ్రహ్మములో సాధ్యమగుటయే ఊహకు/తర్కమునకు అందని స్వరూపలక్షణమే బ్రహ్మము అని సిద్ధాంతము. ఈ రెండు పక్షములను ఖండించుట సిద్ధాంతము కాదు.రెండు పక్షములు విరోధించుకొనునపుడు ఏర్పడిన అసాధ్య అనూహ్య స్థితియే బ్రహ్మము. రెండు పక్షములలో ఏది కాదన్ననూ, ఒక పక్షము నిర్ణయింపబడుట వలన సాధ్యమైన - ఊహ్యస్థితి బ్రహ్మమునకు ఏర్పడును. అప్పుడు గొప్పదనము లేదు కాన, అది బ్రహ్మము కాదు. కాన, సర్వ విరోధ పక్షములను సమానముగ సమర్థించి, వాటి సమన్వయమును బ్రహ్మమునందు అసాధ్యము సాధ్యమనుటయే, బ్రహ్మము యొక్క అర్థమైన "గొప్పతనమును" స్థాపించగలము. అటు ప్రత్యక్షానుభవ పక్షము - ఇటు వేదోక్తమైన అప్రత్యక్ష మతము దేనిని ఖడించినా, బ్రహ్మము యొక్క తత్త్వమును తర్కమునకు అందించుటచేత, బ్రహ్మ శబ్దార్థమునే ఖండించినట్లు అగును. అయితే, ఈ బ్రహ్మశబ్దార్థమంతయును జీవదృష్టిలో జీవునకు తప్ప బ్రహ్మ దృష్టిలో బ్రహ్మమునకు కాదు. బ్రహ్మమునకు బ్రహ్మము అనూహ్యము కాదు).

శ్లో॥ మత్తో Z న్యస్య హి కస్యాపి, నోహానా మపి గోచరమ్
పరమార్థదశాతత్త్వం, స్వరూపం బ్రహ్మణో మమ॥?॥ 69

తా॥ నేను తప్ప, ఎవ్వరైననూ నన్ను, కనీసము ఊహలతో నైననూ ఊహించలేరు. నా యొక్క బ్రహ్మస్వరూపమును, పరమార్థ దశలో నున్న తత్త్వము చాలా అనూహ్యము."నేను అనూహ్యుడను" అనునదియే పరమ సిద్ధాంతము.

శ్లో॥ అనేక భక్త సిద్ధాన్త - విరోధేషు స్థితేషు చ
సర్వేషాం సకృదేకత్వం - భేద శ్చానూహ్య వస్తుని॥ 70

తా॥ నా భక్తులు నన్ను గురించి అనేక సిద్ధాంతములను చేసి యున్నారు. అవి అన్నియు ఒకే సమయములో విరోధము లేకుండా ఒకటి గాను, విరోధంవల్ల వేరు వేరుగాను ఉండగలవు. ఎందుకనగా నేను ఎవరి ఊహలకు అందను. అనూహ్యమైన వస్తువు లో ఇట్టిది అసంభవము కాదు. భేదాభేదము నాకు సాధ్యమే.



శ్లో॥ శక్తి శక్తి మతో ర్యోగో, వియోగ శ్చేహ వర్తతామ్
లౌక్యేషు మయి నానూహ్యే, న మే పూర్ణోపమా క్వచిత్॥ 71

తా॥ శక్తి-శక్తిని కలవాడు - ఈ రెండును కలసియుండుట, విడి పోవుట, ఈ లోకములోని వస్తువులలో ఉండవచ్చును. యౌవనములో ఈ పనిని చేసెను. వృద్ధుడై ఇప్పుడీపనిని చేయలేడు" అని వ్యవహారమున్నందున - శక్తి, శక్తిని కలవాడు వేరుగా ఉన్నట్లు లోక వ్యవహారమున ఉన్నది గదా. కానీ, లోకాతీతమై ఊహకు సైతము అందని నా యందు ఈ అంశము వర్తించదు. నాతో పూర్ణముగా పోల్చదగు వస్తువు ఎక్కడనూ లేదు గదా.

శ్లో॥ ఊహ్యయో రస్తు సంబన్ధో, విజ్ఞేయోZ నూహ్యయోః కథమ్?
అనూహ్యోZహ మనూహ్య చ, మాయాశక్తి స్సదా మమ॥ 72

తా॥ ఊహకు అందు రెండు వస్తువుల మధ్య సంబంధమును ఊహించవచ్చును. లోకములోని శక్తి-శక్తి కలవాడు-ఈ రెండూ ఊహకు అందునవి. ఊహకు అందని రెండు వస్తువుల మధ్య సంబంధము కూడ అనూహ్యమే కదా! దానిని ఎట్లు ఊహించగలవు? నేను ఊహకు అందను. నా మాయా శక్తియు ఊహకు అందదు. మా ఇద్దరి మధ్య సంబంధము కూడ ఊహకు అందదు కదా. కనుక నేను, నా మాయా శక్తి ఊహాతీతమైనవి. అనగా ఊహాతీతమైనది ఒక్కటియే కాన, నేనే నా మాయాశక్తి.

శ్లో॥ అనూహ్యాత్రయ సిద్ధాన్తా, దనూహ్యైకత్వ ముత్తమమ్
అహం మమేతి భాషేయం, వ్యవహార మను శ్రితా॥ 73

తా॥ ఊహకు అందని నేను, ఊహకు అందని నా మాయా శక్తి, ఉహకు అందని మా ఇరువురి పంబంధము. ఇట్లు ఊహకు అందనివి మూడు ఉన్నవి అనుట కన్న, ఊహకు అందనిది ఒక్కటే ఉన్నదని చెప్పినచో మంచిది కదా. "నేను-నాయొక్క మాయాశక్తి" అని నేను మాట్లాడుట లోకంలోని వ్యవహారమును అనుసరించియే.మాట్లాడుచున్నాను. లోకంలో "నా యొక్క శక్తి గొప్పది" అని భేదంతో కూడిన వ్యవహారమున్నది కదా. అంతే తప్ప, నేనూ నా మాయ వేరు అని కాదు.

కనుక ఊహకు అందను, నేను ఊహాతీతుడను. ఊహాతీతమైనది నేను ఒక్కడినే. ఊహాతీతవస్తువు నేను తప్ప రెండవది లేదు.

శ్లో॥ అజ్ఞేయైకత్వమేవేదం, సజ్ఞేయైకత్వ మిత్యపి
అస్త్యేకం తదవిజ్ఞేయ, మితి సిద్ధాన్త నిశ్చయః॥ 74

తా॥ "తెలియనిది ఒకటి" -అనవలయు నే తప్పు, "ఒక్కటి" అన్నచో, "తెలిసినది ఒక్కటి" అనుకొనవచ్చును. కావున, నా స్వరూపములో నిశ్చిత సిద్ధాంతమే మనగా "తెలియనిది ఒక్కటి ఉన్నది" అనియే.

శ్లో॥ అజ్ఞేయం బహు వైకం వా, కథంజానాత్యనిశ్చయాత్ -
ఏకం చ బహు యుగప, దనూహ్య మసమన్వయాత్॥ 75

తా॥ తెలియనిది ఒకటి లేక అనేకము కావచ్చును. అనూహ్యమును నిశ్చయింపలేము. కాన, ఒకే సమయమున అది ఒకటి, అనేకము. ఇచట సమన్వయము కుదరనందున అనూహ్యమగుచున్నది. ఒక్కటే అన్నచో అది ఒకటి అని తెలిసినందున అది ఊహ్యమగును. అది అనేకము అన్నచో అప్పుడును అది ఊహ్యమగును. అది ఒకటి - అనేకము ఒకేసారి సమాన సత్యమని చెప్పినపుడు ఊహాతీతమై అనూహ్యమగుచున్నది. దత్త తనువు ఒకటే-అది అనేక తత్త్వములుగా కూడ (పంచభూతాత్మక శరీరంలాగా) ఉన్నదన్నపుడు సమన్వయము కుదరక అనూహ్యమై, చాల గొప్పదియై బ్రహ్మ మగుచున్నది.

శ్లో॥ నవభూతజ్ఞయన్త్రైశ్చ, దృశ్యం పశ్యన్తి నిశ్చితమ్
చైతన్యం జడశక్త్యంశం, యన్త్రమాణవకై రపి 76

తా॥ నవీన భౌతిక విజ్ఞానులు కనిపెట్టిన యంత్రముల ద్వారా చైతన్యమును జడశక్తి స్వరూపంగా నిశ్చితమైన దానిని చూడవచ్చును. జడశక్తి యొక్క భాగాలలో (కాంతి, ఉష్ణము మొ॥) చైతన్యము ఒక భాగము. నవీనులు కనిపెట్టిన యంత్రపురుషులు కూడ దీనినే నిరూపించుచున్నారు. యంత్ర పురుషులు, మనుష్యుల వలె పని చేయుచున్నారు గదా.

శ్లో॥ నవ స్తర్కః పురాణశ్చ, పదార్థ పరిశీలనమ్
మదనుగ్రహ దత్తంచ, బ్రహ్మ జ్ఞాన సహాయదమ్ 77



తా॥ ప్రాచీన తర్కము అనగా సృష్టి పదార్థముల పరిశోధన జ్ఞానము అది ప్రాచీన తర్కమైననూ, నవీనుల భౌతిక విజ్ఞాన మత మైననూ, విషయము ఒక్కటే. పదార్థ పరిశీలన జ్ఞానము కూడ, మనుజులకు నాచేత బ్రహ్మజ్ఞానమునకు సహాయముగా నుండుననియే అనుగ్రహించబడినది.

శ్లో॥ మమానుగ్రహ మజ్ఞాయ, సాహఙ్కారా ఇమేవిదః
బ్రహ్మజ్ఞా నాస్తికా చక్రు, ర్దత్తం భోగార్థసాధనమ్॥ 78

తా॥ "నా అనుగ్రహముచేత పదార్థ పరిశీలన జ్ఞానము కూడ లభించుచున్నది" తెలియక అహంకారముతో వారే తెలుసుకున్నామని నవీనులు భావించుచూ, అజ్ఞానమును బ్రహ్మ జ్ఞానమునకు ఉపయోగించక, నాస్తికులై ఆ పదార్థ తర్క జ్ఞానమును భోగముల యొక్క సాధనములను కనిపెట్టుటకు ఉపయోగించుచున్నారు.

శ్లో॥ ఉష్ణ శక్త్యాది కాన్తైశ్చ, దృశ్య ద్రవ్యస్య చాన్తరే
పరివర్తన మన్యోన్యం, తత్త్వైక్యం నవ విజ్ఞధీః॥ 79

తా॥ శక్తి, ఉష్ణము, కాంతి మొ॥ రూపాలలో ఉన్నది. ద్రవ్యము మట్టి మొ॥ రూపాలలో ఉన్నది. ద్రవ్య-శక్తులకు అన్యోన్య పరివర్తనమూ, రెండునూ ఒక్కటియే పదార్థమనియు నవీనుల విజ్ఞాన మతము గదా!

శ్లో॥ అతర్క్యోZహం ఫలం దీర్ఘ-తర్కా దనుభవే బలమ్
తత్తర్కయామి న జ్ఞాతా, మదన్యోZహం భవా నపి. 80

తా॥ ఎంత తర్కించినా, నేను తర్కానికి (ఊహకు) అందను అని తెలుసుకొనుటయే నా తత్త్వ సారాంశము. అయితే ఎంత తర్కిస్తే అంత నా తత్త్వ సారాంశము దృఢపడుతుంది. పూర్తిగా తర్కించి తర్కానికి అందదని నిర్ణయించు కున్నప్పుడే, అనుభూతి బలంగా ఉంటుంది. ఆ బలమైన అనుభూతి ఏర్పడుటకే నా తత్త్వాన్ని ఇంతగా తర్కించానే తప్ప, నా తత్త్వాన్ని అర్థం చేసుకుంటావని కాదు. నేను తప్ప నా తత్త్వాన్ని ఎవడు తెలుసుకొనలేడు. నీవు నా కన్నా భిన్నుడిగా ఉన్నంత కాలమూ నన్ను తెలుసు కొనలేవు. నీవు నేనే అయినప్పుడు, నా కన్నా భిన్నంగా నీవు లేవు కాన, అప్పుడు కూడా నన్ను తెలుసుకొనువాడను నేనే (నీవు లేవు కావున).

శ్లో॥ చిచ్ఛక్తీ సోర్మికే సూక్ష్మా, సర్వ స్థూలేషు వేగతః
తరఙ్గ శ్శూన్యగత్యా న, క్రియా సూక్ష్మైవ రంహసా॥ 81

తా॥ చైతన్యమునకూ, కాంత్యాది జడశక్తికీ, తరంగాకార శక్తి స్వరూప విషయంలో తేడా లేదు. జడము కూడ శక్తితో కూడియే ఉన్నది. అత్యంత సూక్ష్మకణములే శక్తి. స్థూలకణములే ద్రవ్యము. ప్రతి స్థూల పదార్థంలోనూ సూక్ష్మకణాలు ఉండుట వలన శక్తియున్నట్లే. ఈ సూక్ష్మ కణాలు తమ మధ్య శూన్య ముండుట వలన అత్యంత వేగంతో చలిస్తూ ఉంటాయి కాన తరంగాకారంలో ఉంటాయి. (పలుచని కాగితం రెపరెపలాడగా తరంగాకారములో ఉన్నట్లు). ఇట్లు కాక, కొన్ని కణాలు వరుసగా తరంగాకారంలో ఉంటాయి. అంటే (నీటిలో రాయి వేసినపుడు శక్తి, జలకణాలతరంగాకారాలలో ప్రసరించునట్లు) - అనగా శక్తికి సూక్ష్మకణ రూపం కాకుండా క్రియా రూపాన్ని అంటగడితే-ఇది కుదరదు గదా. శూన్యంలో శక్తి ప్రసరిస్తున్నది గదా. శూన్యానికి పదార్థత్వం లేనపుడు ఇది సంభవము కాదు గదా. కాన అత్యంత సూక్ష్మ కణాల పంక్తికి అతి వేగంలో తరంగా కారము వచ్చుటయే సమ్మతమైన మతము.

దీని సారాంశము:- నవీనులు ద్రవ్యాన్ని, శక్తినీ వేరు తత్త్వాలుగా విభజించినారు. ఆ రెండుతత్త్వాలకు అన్యోన్య పరివర్తనమూ ఉంది అని అన్నారు. కావున ఈ రెండూ వేరు వేరు తత్త్వాలు కావు. ద్రవ్యము అంటే స్థూల కణాలనీ, శక్తి అంటే సూక్ష్మ కణాలనీ గ్రహించాలి. స్థూల కణాలు సూక్ష్మకణాలుగా మారవచ్చును కాన, అన్యోన్య పరివర్తనము సాధ్యము. ఇక, నవీనులు, క్రియను కూడ శక్తి యొక్క రూపాంతరముగా తీసుకుంటారు. ఇదియును సరికాదు. అలా అయితే, క్రియ సూక్ష్మకణాల రూపంగా తీసుకోవాలి.

శ్లో॥ అథ శూన్యం జలం కృత్వా, క్రియా శక్తిస్తు సా త్రయోః
ద్రవ్య క్రియే హి పూర్వస్థా, క్రియా తత్కారక స్త్వహమ్॥ 82

తా॥ ఒక వేళ శక్తిని క్రియా తత్త్వం కింద పరిగణించి, శూన్యమైన అకాశము కూడ అత్యంత సూక్ష్మకణములతో కూడినదిగా భావించి, జలతరంగముల వలె, శక్తి, క్రియా స్వరూపంగా, ప్రసరిస్తున్న దన్న బాధ ఏమీ లేదు. ఏలననగా ద్రవ్యము, క్రియ అను రెండు తత్త్వములలో శక్తిని కేవల క్రియగా భావింపవచ్చును. లేదా అత్యంత సూక్ష్మ ద్రవ్యకణాలుగా (అతి వేగంతో చలించే క్రియతో కూడిన స్వరూపములుగా) భావిస్తే క్రియా సహిత ద్రవ్యమౌతుంది. అయితే, ద్రవ్యము లేనిదే క్రియ ఉండదు. ద్రవ్యము నాధారము చేసుకొనియే క్రియ ఉండును. ఈ ద్రవ్యము యొక్క రూపాంతరము



క్రియ కాదు కాన, కారకము (కర్త) వేరుగా నుండవలెను. ఆ కర్తను నేనే నని చెప్పియుంటిని గదా.

(ఈ శ్లోకముల ద్వారా నవీన తర్కము ఖండించబడినది).

శ్లో॥ క్రియా కర్తృభవోత్క్షేప - ప్రభృతి ర్న కణాత్మికా
కణాశ్రయా న చాన్యోన్యం, కర్తాZహం బ్రహ్మ సాZమతా 83

తా॥ క్రియ అనగా - ఒక కర్త, ఒక కణమును త్రోయుట, లాగుట మొ॥ నవి చేయునపుడు, అకణమును ఆశ్రయించిన కర్మయే తప్ప, కణము ఎట్లు అగును? కణము వేరు - ఆ కణము నాశ్రయించి, ఆ కణమును చలింపచేయు కర్మరూపమైన క్రియ వేరు. కావున, ద్రవ్య - శక్తుల మధ్య ఉన్న అన్యోన్య పరివర్తన నియమాన్ని ద్రవ్య - క్రియలమధ్య కానీ, శక్తి - క్రియల మధ్య కానీ ఉన్న దనుటకు వీలు లేదు. ఏలనన, ద్రవ్య-శక్తులు రెండూ స్థూల-సూక్ష్మ కణములు. కావున, సమస్త క్రియలు ఒక కర్తను నిరూపించుచున్నవి. ఆ కర్తను నేనే. అయితే ఆ క్రియయు బ్రహ్మమే కాన, క్రియయు నేనే. ఇది ఊహకు అందని విషయము.

ఇక్కడ నవీన తర్కము, క్రియ, శక్తి ద్రవ్యములు కాదని నివారించుటలో ఖండించబడినదే తప్ప క్రియ కర్త ఎట్లు అగునో తర్కాతీతమని చెప్పబడినది.ఒక వేళ శక్తి నే క్రియగా భావిస్తే, సూక్ష్మ కణాలు-స్థూల కణాలు కలిసి ద్రవ్యము అగును.

శ్లో॥ చిద్వృత్తి ర్విషయాకారా, న కాన్తి ప్రతిబిమ్బతః
న స్వర్ణం తైజసం లోహ-సామాన్యం కిట్ట వర్జితమ్॥ 84

తా॥ ప్రాచీన తార్కికులు, చిత్తము ఇంద్రియముల ద్వారా బయటకు పోయి వస్తువుల అకారమును ధరించునని చెప్పితి. ఇది సరి కాదు. బాహ్యవస్తువులే కాంతి సంయోగము చేత, మేధాపిండముపై ప్రతిబింబములను ఏర్పరచగా, ఆ ప్రతిబింబములను బుద్ధి గ్రహించు చున్నది. అట్లే బంగారము తేజోరూపమని ప్రాచీన తార్కికుల మతము. ఇదియును సరికాదు. బంగారము అన్నిలోహముల వంటిదే. అది తుప్పుపట్టదు కాన కాంతితో నుండును.

శ్లో॥ వ్యోమ శబ్ద గుణం నాణు - సంఘట్టన ధ్వనే ర్శ్రుతేః
అన్యథా సర్వహేతుత్వం - పరిమాణ గుణో భవేత్॥ 85

తా॥ శూన్యమగు ఆకాశము నందు శబ్దము ప్రసరించదని నవీన తర్కమతము. ఆకాశము యొక్క గుణము శబ్దమని ప్రాచీనుల మతము, ధ్వని, మన చెవిని చేరుట శూన్యము ద్వారా కాదు. శూన్యములో నున్న వాతాణువుల సంఘట్టనముల ద్వారా ధ్వని చెవిని చేరుచున్నది. ఇక్కడ శూన్యము ప్రధాన కారణము కాదు. అణువుల సంఘర్షణమే ప్రధాన కారణము. శూన్యమే లేకున్నచో ఏదియును జరుగదు కాన, అన్నింటికీ శూన్యమే కారణము కావలసి వచ్చును. ఆకాశమునకు పరిమాణమును గుణముగా చెప్పవచ్చును. కాన ఆకాశము నిర్గుణమగునని భయపడవనిలేదు.

(ఈ రెండు శ్లోకముల ద్వారా ప్రయోగనిరూపణము కల నవీన తర్కము ముందు ప్రాచీన తర్కము విలువ లేదని నిరూపించబడినది.)

శ్లో॥ ద్వాపరే తర్కవిజ్ఞాయ, గీతం పార్థాయ తావతా
మద్దయాలబ్ధతర్కాయ, మయా సంప్రతి గీయతే॥ 86

తా॥ ద్వాపర యుగంలో పదార్థ పరిశీలనమగు తర్కము ఎంత వరకు వృద్ధిచెందినదో, ఆ తర్కమును అర్జునుడు అభ్యసించియున్నవాడు కావున, ఆనాడు గీతను చెప్పినపుడు అనాటి తర్కము యొక్క స్థాయిలో చెప్పితిని. ఈనాడు ఇంకనూ కొన్ని ప్రకృతి రహస్యములను మానవుడు కనుగొనునట్లు అనుగ్రహించితిని కాన ఈనాటికి వృద్ధి చెందిన పదార్థ పరిశీలనము అగు తర్క శాస్త్రమును దృష్టిలో నుంచుకొని చెప్పుచున్నాను.

శ్లో॥ న కర్తా జ్ఞాయతే సృష్టి, రిత్యహన్తాత్మ తర్కవిత్
పరిభూతః పరైస్తర్కై, ర్మల్లబ్ధై రేవ మాయతౌ॥ 87

తా॥ తర్కము వలన సృష్టిని పూర్తిగా తెలుసుకున్నా మనియు, సృష్టి కర్త లేడనియు, తానే ప్రభువునని మానవుడు అహంకరించెను. వాని అహంకారమును పోగొట్టుటకై, అదే తర్కమార్గమున, తరువాత విజ్ఞుల చేత పదార్థ పరిశీలనములో పాత తర్కములు కొన్ని తప్పుగా నిరూపించబడినవి. దీని చేత తార్కికుని అహంకారమును అణచితిని. అయితే, తరువాత తర్కములో కనుగొన్నవి కూడ నా దయవల్లనే. అది తెలియక



వీరును అహంకరించుచున్నారు. కాన, రాబోవు కాలములో వీరును పరాభవించబడుదురు. అనగా, రాబోవు తార్కికుల విజ్ఞాన సిద్ధాంతలములచేత, నేటి తార్కికుల సిద్ధాంతములు నిరాకరించబడును. (అనగా - ప్రకృతి నా ఇచ్ఛ కావున, తార్కికుల గర్వ మణచుటకు ప్రకృతి నియమాలను సైతము నేను మార్చి వారి ప్రకృతి నియమ జ్ఞానము యొక్క అహంకారమును అణచెదను.)

శ్లో॥ ప్రయోగాధికసాధుత్వా, త్ప్రా గూహా దపి సిద్ధిభిః
నవాః క్షిప్తాః పరో హన్తి, పూర్వం వధ్యో Zసురోమయా॥ 88

తా॥ ప్రయోగముల ద్వారా సిద్ధాంతమును ప్రత్యక్షంగా నిరూపించుట అనే అంశము వలన, నవీనుల మతము ప్రాచీనుల కన్న, తర్కములో సరియైనది. ప్రాచీనుల మతము కేవలము బుద్ధి యొక్క ఊహల చేత నిర్మించబడినది. కాన ప్రాచీనుల తర్క గర్వము నణచుటకు, నవీనుల మతమును ఉపయోగించిననూ, నాస్తికులైన నవీనుల గర్వము నణచుటకు, వీరు కనుగొన్న నియమాలను కూడ ఉల్లంఘించు అష్ట సిద్ధులను అవతారముల ద్వారా ప్రదర్శించుచున్నాను. ఒక రాక్షసుని, మరొక రాక్షసుని చేత సంహరింపచేసినా, రెండవ వానినీ సంహరింపవలెను గదా! అనగా - ప్రాచీనుల తర్కమును నవీనుల తర్కము చేతను, నవీనుల తర్కమును అష్టసిద్ధుల ప్రదర్శనము చేతను అణచివేయుచున్నాను.

శ్లో॥ తర్కాతీతం మతం చిత్రం, కృత్యాకాశ స్థితా హి చిత్
నరాశ్రయా కృతే శ్శూన్యం, చిదభావ పరం భవేత్॥ 89

తా॥ కావున, తర్కాతీతమైన విచిత్ర తత్త్వమును అంగీకరించక తప్పదు. చైతన్యమే బ్రహ్మ మని వాదించు వారు సైతము, అట్టి చైతన్యము తర్కాతీతమని యే నిర్ణయించక తప్పదు. ఏలనన, ఊహలను ఉపసంహరించిన చైతన్యము ఆకాశములో (అనగా ఈ జగత్తులో) ఒక ద్రవ్యము (ఒక మనుష్యుని) ఆశ్రయించి ఉన్నది. మరియు, అట్టి చైతన్యములో ఈ ఊహ అత్యంత సూక్ష్మరూపంగా నిజాకాశ తత్త్వంలోనే ఉంది కాన, ఆకాశము కల్పితము అనుపక్షంలో, ఊహ పూర్తిగా ఉపసంహరింపబడవలసివుంటడగా, అది అసంభవముగా నున్నది గదా. చిత్రములగు ఊహలను చేయు చైతన్యము ఒక

మానవాకారము నాశ్రయించియే యున్నది. చైతన్యమే నరాకారమును ధరించుననన్నచో, అట్టి ఆకారమును ధరించుటకు అవకాశమును కల్పించు శూన్యము ఉండవలెను. శూన్య మున్నచో చైతన్యము తప్ప రెండవది లేదు అనుటకు వీలు లేదు. (చైతన్య భిన్నమైన, చైతన్యాభావమైన శూన్య మున్నది కావున చైతన్యము తప్ప రెండవది లేదు అనుటకు వీలులేదు.) (అనగా నవీన తర్కనిరూపణము ప్రకారముగా ఊహ అనునది ఒక చిచ్ఛక్తి రూపమైన స్ఫోటముగా (గుర్తుగా) చైతన్యములో ఉన్నదే తప్ప లయించ లేదు. దీనివలన శుద్ధ చైతన్యము లభించుట లేదు. మరియు నవీనుల ప్రకారముగా చిచ్ఛక్తి యొక్క ఘనరూపమే నరుడు. ఘనీభవించుట చైతన్యము లేని అవకాశ రూపమైన శూన్యము కావలయును కాన, చైతన్యమే ఉన్నది రెండవది లేదనుటకు వీలు లేదు. చైతన్య భిన్నమైన శూన్యమున్నది. శూన్యము చైతన్యము కాదు గదా. చైతన్యము అవిచ్ఛిన్నంగా ఉందనుట ప్రత్యక్షానుభవ విరుద్ధము.)

శ్లో॥ న శూన్యం నానుభూతేశ్చ, న చే ద్ద్రవ్య దశాత్రయమ్
అప్రత్యక్షం ద్వయే శూన్యం, వినాZన్య చ్చిత్ర మాశ్రయేత్॥ 90

తా॥ పోనీ శూన్యము ఒక్కటియే ఉందనుకుంటే, అది అనుభవ విరుద్ధము. అంతా శూన్యము అను అనుభవమే ఉండవలెను. శూన్యము లేదన్నచో, శక్తి ఘనీభవించి రూపమును దాల్చుటకు అణువులు దగ్గరకు - దూరముగా జరిగి ఘన-ద్రవ-వాయు స్థితులను పొందుటయు అసంభవ మగును. కాన శూన్యము ఉండవలెను. లేకున్న ప్రత్యక్షానుభవవిరోధము కల్గును. పోనీ, రెండూ ఉన్నవన్నచో శూన్యము లేకున్నచో చైతన్యము ఉండజాలదు. చైతన్యము లేని శూన్య మున్నది. కాన, చైతన్యము శూన్యమైన ఆకాశమునకు లోబడి నదే కాని ఆకాశమును అతిక్రమించినది కాదు. కాన, విచిత్ర తత్త్వమైన మాయను అంగీకరించక తప్పదు. ఎవరైనా మాయను అంగీకరిచక తప్పదు. (మయ-వైచిత్ర్యే - కావున మాయ అనగా అనూహ్య మని అర్థము)

*ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం*
*శ్రీ దత్త పరబ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణ యోగో నామ*
*చతుర్దశాధ్యాయః*

మానవాకారము నాశ్రయించియే యున్నది. చైతన్యమే నరాకారమును ధరించుననుచో, అట్టి ఆకారమును ధరించుటకు అవకాశమును కల్పించు శూన్యము ఉండవలెను. శూన్య మున్నచో చైతన్యము తప్ప రెండవది లేదు అనుటకు వీలు లేదు. (చైతన్య భిన్నమైన, చైతన్యాభావమైన శూన్య మున్నది కావున చైతన్యము తప్ప రెండవది లేదు అనుటకు వీలులేదు.) (అనగా నవీన తర్కనిరూపణము ప్రకారముగా ఊహ అనునది ఒక చిచ్ఛక్తి రూపమైన స్ఫోటముగా (గుర్తుగా) చైతన్యములో ఉన్నదే తప్ప లయించ లేదు. దీనివలన శుద్ధ చైతన్యము లభించుట లేదు. మరియు నవీనుల ప్రకారముగా చిచ్ఛక్తి యొక్క ఘనరూపమే నరుడు. ఘనీభవించుట చైతన్యము లేని అవకాశ రూపమైన శూన్యము కావలయును కాన, చైతన్యమే ఉన్నది రెండవది లేదనుటకు వీలు లేదు. చైతన్య భిన్నమైన శూన్యమున్నది. శూన్యము చైతన్యము కాదు గదా. చైతన్యము అవిచ్ఛిన్నంగా ఉందనుట ప్రత్యక్షానుభవ విరుద్ధము.)

శ్లో॥ న శూన్యం నానుభూతేశ్చ, న చే ద్ద్రవ్య దశాత్రయమ్
అప్రత్యక్షం ద్వయే శూన్యం, వినాZన్య చ్చిత్ర మాశ్రయేత్॥ 90

తా॥ పోనీ శూన్యము ఒక్కటియే ఉందనుకుంటే, అది అనుభవ విరుద్ధము. అంతా శూన్యము అను అనుభవమే ఉండవలెను. శూన్యము లేదన్నచో, శక్తి ఘనీభవించి రూపమును దాల్చుటకు అణువులు దగ్గరకు - దూరముగా జరిగి ఘన-ద్రవ-వాయు స్థితులను పొందుటయు అసంభవ మగును. కాన శూన్యము ఉండవలెను. లేకున్న ప్రత్యక్షానుభవవిరోధము కల్గును. పోనీ, రెండూ ఉన్నవన్నచో శూన్యము లేకున్నచో చైతన్యము ఉండజాలదు. చైతన్యము లేని శూన్య మున్నది. కాన, చైతన్యము శూన్యమైన ఆకాశమునకు లోబడి నదే కాని ఆకాశమును అతిక్రమించినది కాదు. కాన, విచిత్ర తత్త్వమైన మాయను అంగీకరించక తప్పదు. ఎవరైనా మాయను అంగీకరిచక తప్పదు. (మయ-వైచిత్ర్యే - కావున మాయ అనగా అనూహ్య మని అర్థము)

ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం
శ్రీ దత్త పరబ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణ యోగో నామ
చతుర్దశాధ్యాయః

శ్రీ గురుదత్త ఓం జయ గురుదత్త

కాలభైరవ ఖండము

# శ్రీ దత్తగురు భగవద్గీత

పంచదశాధ్యాయః

## శ్రీ దత్త విశ్వవ్యాపక యోగః

శ్రీ దత్తగురు భగవాన్ ఉవాచ:-

శ్లో॥ పశ్య కాశ్యప! విశ్వస్య,రమ్యస్య బహి రన్తరమ్
మమ చైతన్య సఙ్కల్ప - లీలా బిన్దుం స్వరూపతః॥ 1

శ్రీ దత్తగురు భగవానులు వచించిరి :
తా॥ ఓ కాశ్యపా! ఈ విశ్వము బయటకు చూచుటకు ఎంతో రమ్యంగా ఉంది. కానీ, దాని అంతః స్వరూపము ఎట్లుండునో చూడుము. అయితే ఈ విశ్వాంతః స్వరూపము నా చైతన్య సంకల్పము యొక్క లీలా మాత్రమైన బిందు మాత్రమే.

శ్లో॥ విరాజం పశ్య విశ్వస్థం, శక్త్యబ్ధిం భ్రాన్త బిన్దవః
ద్రవ్య ధర్మ భేద కరా, మయ్యబ్ధి ర్నభసః పరే॥ 2

తా॥ ఈ విశ్వము. అను నా బాహ్య వేషమునకు అంతర్గతంగా ఉన్న నా "విరాట్ స్వరూపమను మహాశక్తి సముద్రమును చూడుము. ఈ శక్తి సముద్రములోని అత్యంత సూక్ష్మ కణములు, ఒకదానినొకటి అంటక, భ్రమణ, కంపనములతో, మహా వేగంతో, స్థానములను మార్చుచూ, నీకు విశ్వములో అనేక రకములగు ద్రవ్యపదార్థములను భిన్న భిన్న ధర్మములతో నుండునట్లు కనిపింపచేయుచున్నవి. ఈ శక్తి మహా సాగరమంతయును పరిమాణ గుణము కల ఆకాశమునకు అతీతుడనగు నా యందే ఉన్నది.

శ్లో॥ అనూహ్య మాయయా సర్వం, త్వన్మాత్రే మయి శక్తికృత్
చాలకోZహం చ తేనైవ, భిన్నవస్తు జగద్దృశా॥ 3

తా॥ నీ యంత పొడవు, లావు, పరిమాణంతో నేనూ ఉన్నాను. కానీ, నాయందే ఈ జగత్తు అంతా ఇమిడియున్నది. ఇదే నా అనూహ్య మాయా శక్తి. ఈ శక్తి రూపాలైన సూక్ష్మకణాలను నేనే సృష్టించి, వాటిని కదల్చుచున్న వాడను నేనే. ఆ కదలికలు అన్నియును ఒక క్రమ బద్ధమైన రీతులలో చేయుచు, అనేక వస్తువులను భిన్న భిన్నములుగా (జగత్తుగా) కనిపింపచేయు చున్నాను. (అనగా- క్రియా రూపమైన శక్తినీ నేనే. సూక్ష్మ - స్థూల కణరూపమైన ద్రవ్యమూ నేనే. క్రియరూపశక్తితో కూడిన సూక్ష్మ-స్థూల కణ సముదాయమే ఈ జగత్తు కాన ఈ జగత్తూ నేనే. ఈ స్వల్ప రూపంలో ఉన్న నాలో ఈ అనంత జగత్తూ ఇమిడి ఉండుటయూ నిజయే. ఇది నీ ఊహకు అందదు).

శ్లో॥ అనన్త భేద దృశ్యాని, విన్యాసై ర్నియతై ర్మమ
మేధా శక్తి రియం ప్రాజ్ఞః, విరాజా విశ్వ మీక్ష్యతే॥ 4

తా॥ క్రమము తప్పని ఈ చిత్ర విచిత్ర రీతులతో కూడిన విన్యాసములతో అనంత కోటి భేదములతో ఈ జగత్తును నీకు కనిపింపచేయు నా మేధాశక్తి యే "ప్రాజ్ఞడ"ని పేరుతో పిలువబడుచున్నది. ఇట్టి నా మేధా శక్తి యగు ప్రాజ్ఞడు, నా విరాట్ శక్తి యగు సూక్ష్మ కణములతో కూడిన అంతరస్వరూపముతో బాహ్యంగా రమ్యంగా గోచరించునదే ఈ విశ్వము. (విశ్వ - విరాట్ - ప్రాజ్ఞ పురుష స్వరూపములు)

శ్లో॥ దృశ్యన్తే బహవ శ్శక్తి - కణౌఘ పరమాణవః
కమ్పన భ్రమణైః కోZపి, సంక్షిప్త నియతార్ణవః ॥ 5

తా॥ అత్యంత సూక్ష్మ ద్ర్యవ్య కణములే శక్తి కణములు. ఆ శక్తికణముల చేత పరమాణువులు నిర్మించబడినవి. ఇందులో కొన్ని అటు నిటు కంపించుచుండగా, మరికొన్ని భ్రమణములను చేయుచున్నవి. ఇందులో ప్రతి కణమూ ఒకానొక అపారశక్తి సాగరము, నా చేత సంక్షేపింపబడి, నా చేత శాసించబడి నిలచి యున్నది.

శ్లో॥ శక్త్యబ్ధి ర్మాయయా ద్రవ్య - కణో మద్భయ సూక్ష్మవాన్
వివృతో లోకవిధ్వంసీ, పరమాణు రిమైః కణైః ॥ 6

తా॥ ఈ కణములోని శక్తి సముద్రము నా భయము చేత సంకోచించబడి పదార్థ కణముగా మాయ వలన గోచరించుచున్నది. ఈ ద్రవ్య కణములో నున్న శక్తి



సముద్రముపై నున్న నా శాసనము సడలినచో ఆ శక్తి సముద్రము విజృంభించి ఈ లోకమునే నాశనము చేయగలదు. ఇట్టి అనేక శక్తి సముద్రముల సంక్షేపములైన సూక్ష్మ ద్రవ్య కణముల (శక్తి కణముల) చేత ఒక పరమాణువు నిర్మించబడినది.

శ్లో॥ పరమాణోః కియాం స్తేషాం, కియద్విశ్వం చితః పృషత్
కియతీ చి త్క్రియాం శ్చాహం, చిద్ఘనో బాహ్య కోమలః ॥ 7

తా॥ ఇక, ఒక పరమాణువులో ఇట్లు అనేక శక్తి సముద్రములు సంక్షేపించబడియున్నచో ఒక పరమాణువులో ఎంత శక్తి ఉన్నదో ఊహించుము. ఇక, అనంత పరమాణువులతో నిర్మించబడిన ఈ విశ్వంలో ఎంత శక్తి సంక్షేపించబడినదో ఊహించుము. ఈ విశ్వము నాయొక్క ఇచ్ఛా చైతన్యములోని ఒక బిందు మాత్రమైనపుడు, ఇక నా సంకల్ప రూపమైన చైతన్య శక్తి ఎంతదో ఊహించుము. చైతన్యము ఘనీభవించి స్వరూపమైన (ప్రజ్ఞాన ఘనుడు) నేను ఇక ఎంత శక్తి మంతుడనో ఊహించుము. కానీ, నీకు బాహ్యంగా ఎంతో కోమలమైన రూపంతో గోచరిస్తున్నాను. ("ప్రజ్ఞానఘనః" అని శ్రుతి)

శ్లో॥ విశ్వం విష్ణు రహం తత్త్వా, ద్బాహ్య రమ్యో హి మాయయా
మాయాZతి చిత్రా తే నో మే, పరమార్థ స్త్వైవ తే॥ 8

తా॥ నేను, ఈ విశ్వమూ, తత్త్వములో ఒక్కటియే. అనంత శక్తి స్వరూపములమై బాహ్యమునకు ఎంతో రమ్యంగా గోచరిస్తున్నాము. ఇదే "విశ్వం విష్ణుః" అనుమాటకు అర్థము. ఇట్లు బాహ్యమునకు వేరుగా గోచరించుటయే మాయ. మాయ అనగా నీకు అర్థము కాని అతివిచిత్ర శక్తి అని అర్థము. అయితే అర్థము కాక పోవుట. నీకే గానీ నాకు కాదు. అయితే నాకు అర్థమగును, అను మాట నీకు అనవసరము. నీకు అర్థము కాదు అను మాటయే నీకు పరమార్థము. (నా పరమార్థ దశ నీకు అందదు కాన అనవసరము)

శ్లో॥ పరమార్థం మమానీయ, మతం భ్రష్టం న మేZస్తి సా
అతి చిత్రాZస్తి తే సాZహం, చిత్రకృ చ్చాత్మవి న్న సా॥ 9

తా॥ నాకు పరమార్థమగు దానిని, జీవుడు, సిద్ధాంతము లోనికి తెచ్చి నందున సిద్ధాంతము పాడగుచున్నది. కావున, జీవునకు మాయ సత్యము, అతివిచిత్రము అనునదియే

పరమార్థము. ఈ మాయ నాకు అసలు లేనే లేదు. నీకు ఈ విచిత్రమును కల్పించుచున్న వాడను నేనే. కాన, మాయను నేనే. నన్ను గురించి నాకు పూర్తిగా తెలిసిన వాడను కావున తెలుసుకొనుటకు వీలుకాని మాయ నాకు లేదు. నాకు మాయ లేదు అనగా నన్ను గురించి తెలియక పోవుట యనునది నాకు వర్తించదు. నీకు మాయ ఉన్నది. అనగా నన్ను గురించి నీవు తెలుసుకొనలేవు అనుటయే.

శ్లో॥ సూక్ష్మ ద్రవ్య కణా శక్తి, స్సమ్మతా స్థూల గోచరా
శక్తిః కర్మార్థ సంక్షిప్తా, న స్యా చ్ఛూన్య క్రియా కణా॥ 10

తా॥ శక్తి, ఇదివరలో రెండు అర్థములలో చెప్పబడినది.(1) సూక్ష్మ ద్రవ్య కణములు (2) క్రియ. ఇందులో శక్తి మొదటి అర్థంలో అయితే, సూక్ష్మద్రవ్యకణాలు సన్నిహితంగా జరిగి, ఒక ద్రవ్య కణంగా గోచరించుట తర్కానికి అందుతుంది. కానీ, శక్తిని రెండో అర్థంలో చెపితే అంటే - శక్తి అనగా క్రియ. శక్తి సంక్షేపించబడిన సూక్ష్మద్రవ్య కణముగా గోచరించుట అసంభవము, తర్కవిరుద్ధము. లోకంలో ఎవడునూ శూన్యములో ఎంత పనిని చేసినా ఆ పని, ద్రవ్య కణాలుగా మారదు కదా.(అనగా శక్తి, సూక్ష్మ ద్రవ్య కణాలు అనే అర్థంలో ఉంటే, సూక్ష్మ కణాలు సన్నిహితంగా జరుగుట వలన స్థూల కణాలైన ద్రవ్యంగా మారుట కలదు. కాన, శక్తి - ద్రవ్యంగా మారునని చెప్పవచ్చును. అంతే తప్ప, శక్తిని "క్రియ" అనే అర్థంలో చెపితే, క్రియ, ద్రవ్యంగా మారుట లోకంలో ప్రత్యక్ష విరుద్ధము కాన అసంభవము).

శ్లో॥ కణ సన్నిహితం కర్మ, కుర్యా ద్గురు కణేక్షణమ్
వినా తైః క్రియయా నైతే, సృజ్యన్తే మే క్రియా కణాః॥ 11

తా॥ సూక్ష్మ ద్రవ్య కణములను పోగు చేసి, సన్నిహితంగా జరువుక్రియ చేత, ఒక స్థూల ద్రవ్య కణము గోచరించునట్లు జీవుడు చేయగలడు. అంతే తప్ప, సూక్ష్మ ద్రవ్య కణములు లేకుండా, తన క్రియ ద్వారా, సూక్ష్మ ద్రవ్య కణములను సృష్టించలేడు. నేను అట్లు కాదు. కేవలము నా క్రియ ద్వారానే, సూక్ష్మ ద్రవ్య కణములను సృష్టించుచున్నాను. అనగా నా క్రియా శక్తియే. సూక్ష్మ ద్రవ్య కణములుగా సంక్షేపించ బడి గోచరించుచున్నది. ఇది జీవుని ఊహకు అందని పరమ విచిత్రము. (అనగా జీవుడు సూక్ష్మ కణాలను, తన క్రియ ద్వారా సంక్షేపించి ద్రవ్యముగా మార్చ గలడే తప్ప, సూక్ష్మ కణాలు లేకుండా, కేవల క్రియ నుండి సూక్ష్మకణాలను కానీ స్థూల కణాలను కానీ (అనగా ద్రవ్యమును) పుట్టించలేడు. అనగా శూన్యంలో జీవుడు ఎంత క్రియ చేసినా ద్రవ్యమును ఉత్పాదనము చేయలేడు. నేను అట్లు కాదు- సూక్ష్మకణములు లేకుండానే శూన్యములో నా సంకల్ప క్రియ నుండి సూక్ష్మకణాలు - స్థూల కణాలను సృష్టించి ద్రవ్యమును సృష్టించగలను.)



శ్లో॥ క్రియాZత్యన్త తను ద్రవ్యా, న కర్తృ ద్రవ్య కర్మభిః
కర్తృ ద్రవ్యేZపి కర్మాZన్య, ద్ద్రవ్యా ధారా కణాఅహమ్ ॥ 12

తా॥ పోనీ, జీవుని దృష్టికి అందని అత్యంత సూక్ష్మ ద్రవ్య కణాలే, క్రియ అని అను కుందామా? అదీ కుదరదు. లోకంలో ఎక్కడైనా, కర్త, ద్రవ్యము,క్రియ అను మూడు, వేరు వేరుగా ఉన్నాయి. (క్రియ,ద్రవ్యం కన్నా భిన్నమని ఇదివరకే వివరించబడినది). శూన్యంలో ఒకడు చేతులు తిప్పుటలో కర్త, క్రియ - రెండే ఉన్నాయి కదా! అంటే అక్కడ కర్తయే ద్రవ్యంగా ఉన్నాడు. కావున, క్రియ, ద్రవ్యంతో ఏకీభవించదు. అయితే క్రియ, ద్రవ్యాన్ని ఆశ్రయించి ఉంటుంది. కావున, నా క్రియకు ఆశ్రయమగు సూక్ష్మ - స్థూల ద్రవ్య కణ రూపము నేనే అయి ఉన్నాను. (అనగా క్రియ, ద్రవ్యరూపమైన కర్తనైనా ఆశ్రయించి ఉండాలి, లేదా కర్తకు భిన్నమైన ద్రవ్యాన్ని అయినా ఆశ్రయించాలి. కర్త భిన్నమైన ద్రవ్యము లేనపుడు, క్రియ, కేవలము కర్తనే ఆశ్రయించి ఉండును.).

శ్లో॥ క్రియా శ్రయా హి చి త్సూక్ష్మ - ద్రవ్యం మత్పరమామ్బరే
సత్యాకాశే తదేవాత్ర, ప్రతిబిమ్బిత మాత్మనః॥ 13

తా॥ నా క్రియకు ఆశ్రయమై, నా కన్న వేరు కాని, నేనే అయివున్న సూక్ష్మ ద్రవ్య కణ సంఘాతమే చైతన్యము. ఈ చైతన్యము నాయందున్న "పరమవ్యోమము" అనబడు ఆకాశము నాధారము చేసుకొని, నా క్రియ చేత సన్నిహితము చేయబడి, స్థూల ద్రవ్యములుగా గోచరించుచున్నది. సత్యమైన ఆకాశము లేనిచో, కర్త గానీ, ద్రవ్యము కానీ, ద్రవ్యాశ్రయమైన క్రియ గానీ ఉండుటకే వీలు లేదు. కాన సత్యమైన ఆకాశము (అనగా శూన్యము) ఉండియే తీరవలయును కాన, అదే నాలోని పరమవ్యోమము. నా ప్రతిబింబమే ఈ సృష్టి కావున, ఈ సృష్టిలో కూడా, నీకు గోచరించు ఈ సత్యాకాశము ఉండుట, సూక్ష్మ ద్రవ్యకణముల (అనగా శక్తి కణముల) సన్నిహిత దూర సంబంధముల చేత, నానా రూపములు గోచరించుట జరుగుచున్నది.

శ్లో॥ ద్రవ్యం శూన్యం క్రియా కర్తా, సృష్టేః కరణ ముచ్యతే
సక్రియం ద్రవ్య సూక్ష్మం హి, శక్తి శ్చైతన్య మప్యభే॥ 14

తా॥ సృష్టికి కావలసినవి నాలుగు. ద్రవ్యము అనగా (1) సూక్ష్మ ద్రవ్య కణములు, (2) శూన్యమైన సత్యాకాశము,(3) కర్తయగు నేను. (4) కర్త యొక్క వ్యాపారమగు క్రియ. ఈ నాలుగు సాధనములు ఉండవలెను. సంకల్పము అను క్రియా సహితమగు సూక్ష్మ ద్రవ్య క్షణములే చైతన్యమనియు, ఇతర క్రియలతో కూడిన సూక్ష్మ ద్రవ్య కణములే శక్తి అనియు, పిలువబడుచున్నవి. శక్తికీ, చైతన్యానికీ తేడా లేదు. రెండూ క్రియా సహిత సూక్ష్మ ద్రవ్యకణములే.

శ్లో॥ అహమేక శ్చతుర్ధాZస్మి, సత్యం చత్వారి కేవలమ్
ప్రత్యేక మస్మి చిత్రం హి, కిం చిత్రం? త త్సమన్వయే. 15

తా॥ నేను ఒక్కడినే ఈ నాలుగు సాధనములుగా మారితిని. నేను ఒక్కటి అనుట నిజమే. నాలుగు సాధనములుగా మారుటయు నిజమే. ఇందులో ప్రతి సాధనము మరల నేనే పూర్ణముగా అయి ఉన్నాను. ఇవి అన్నియు జీవునకు పరమార్థంగా నిజాలే కావున, నేను విచిత్రుడను. ఒకటి నిజమై మిగిలినవి అసత్యములైనచో విచిత్రమేమున్నది? కావున తర్కముచేత. సమన్వయము చేసినచో ఇక విచిత్ర మేమున్నది? కాన సృష్టి వ్యాపారము కూడ అనూహ్యమే.

శ్లో॥ స ఏవ మమ సిద్ధాన్తో, దుర్లభే హి సమన్వయే
తర్కానుభవ వేద్యం చే, దవేద్య మితి నిశ్చితమ్॥ 16

తా॥ ఎప్పుడు తర్కముచే సమన్వయము చేయుట సాధ్యము కాదో, అదే నా తత్త్వమును గురించిన సిద్ధాంతము. తర్కించి,తర్కించి తెలుసుకొనలేము. అని అనుభవపూర్వకంగా తెలిస్తే కాని నిశ్చయ జ్ఞానము కలుగదు. కాన తర్కించుటయు అవసరమే.

శ్లో॥ అస్మత్ప్రత్యయ వాచ్యో హి, దేహ శ్చేతనయా సహ
అహ మాగత ఇత్యుక్తం, నాహం దేహేన చేతి హి॥ 17

తా॥ నేను అను శబ్దమునకు అర్థము చైతన్యముతో కూడిన శరీరమే "నేను వచ్చితిని" అంటాడే తప్ప, "నేను నా శరీరముతో సహా వచ్చాను" అని ఎవడూ అనడు కదా! కాన,



కేవల చైతన్యమునకే కాక, అన్నింటినీ (అనగా చైతన్యము, శరీరము) కలిపియే "నేను" అని అర్థము.

శ్లో॥ మాయయా బహుధా హ్యస్మి, బహురూపాణి చైకదా
పూర్ణః ప్రత్యేక మప్యస్మి, నైత ద్వార్ధి తరఙ్గవత్. 18

తా॥ నేను నా మాయ వలన అనేక రూపములతో అనేక విధములుగా, మారుతాను. ఒక్కొక్క రూపంలో మరల ఒకే సమయంలో పరిపూర్ణముగ నున్నను ఇది అనూహ్యమైన నా మాయ. "అనేక తరంగములతో ఒకే సముద్ర జలము వలె" అను ఉపమానము కూడ నా యందు కుదరదు. సముద్రము అనేక తరంగాలుగా మారినా, ప్రతి తరంగంలో సముద్ర మంతా లేదు. కానీ, నా విషయ మట్లు కాదు. అనేక తరంగాలుగా మారి, ప్రతి తరంగంలోనూ సముద్రమంతా ఉంటుంది అని ఊహించాలి.

శ్లో॥ పాత్రౌచిత్యా త్ప్రమాణాను - శక్తి వ్యక్తో న తావతా
విభక్తోZల్పో యథా జీవో - బ్రహ్మ చిన్త్య స్తథాకణః॥ 19

తా॥ అల్ప ప్రమాణము గల భాగాలలో ఆయా భాగాల ప్రమాణానికి తగిన శక్తిని మాత్రమే అభివ్యక్తం చేస్తూ ఉంటాను. ఇది పాత్రౌచిత్యము. ఇందు వలన నేను అశక్తుడ ననియు, పరిమాణము వలన విభజింపబడినాననియు, భావించరాదు. జీవుడు ఎట్లు పూర్ణ బ్రహ్మమో, ఈ జగత్తులోని ప్రతి పరమాణువూ అట్లే పూర్ణ బ్రహ్మము.

శ్లో॥ అభివ్యక్తే ర్మహాన్భేద, స్సత్త్వా దద్వైత మావయోః
కుతో జీవః కణే బ్రహ్మ, సాధకావసరో గురుః॥ 20

తా॥ అభివ్యక్తమైన శక్తిని ఆధారము చేసుకొన్నచో, జీవునకు నాకు అనంత భేదము కలదు. అభివ్యక్తితో సంబంధము లేక ఉన్నశక్తిని ఆధారము చేసుకొన్నచో, జీవుడే కాదు బ్రహ్మము ప్రతి పరమాణువులోను అత్యంత సూక్ష్మమైన కణము కూడ బ్రహ్మమే. అయా కాలములోని సాధకుల సాధన దశావసరమును బట్టి గురువు ప్రవర్తిస్తాడు.

శ్లో॥ ఏకోZహం బహుధా భిన్న, స్సకృదస్మి విచిత్రవాన్
మమాంశ స్సర్గ ఏవం చ, న భిన్నం పూర్ణ మప్యణౌ॥ 21

తా॥ నేను ఒకే ఒక పదార్థము మరియు అదే సమయమున అనేక పదార్థములుగను ఉన్నాను. నేను ఒకే ఒక చైతన్య పదార్థముగా ఆనంద స్వరూపునిగా కూడ యున్నాను. ఇది ఏకతత్త్వ ప్రియులైన చిన్మాత్ర బ్రహ్మవాదులకు ప్రియము. అయితే ఒకే సమయమున ఏకపదార్థముగనూ అనేక పదార్థములగనూ ఉన్నాను. అందువల్లనే నా స్వరూపము పంచభూతమయమైన అనేక తత్త్వముల సమూహంగా యున్నది. ఇక ఏక సమయమున ఒకటిగానూ అనేకముగానూ నేనుండగలనని నా స్వరూపములోనే సిద్ధించియున్నది. ఇది నా విచిత్రతత్త్వము. ఈ విచిత్రతత్త్వము యొక్క అంశమే సృష్టిగా రూపొందినది. కాన, సృష్టియును ఒకే సమయమున ఒకే పదార్థముగాను, అనేక పదార్థములుగాను భాసించుచున్నది. బ్రహ్మము అన్నింటిలోను పూర్ణముగా ఉన్నది. దీని వలన బ్రహ్మము భిన్నము కాలేదు.

శ్లో॥ విష్ణ్వంZశః కపిలో బుద్ధో, నాస్తికః కిం స్వసిద్ధిమాన్
అసఙ్గ హింసయా దృష్టౌ, ముఖ్యా న్మౌనం పరేZ న్యథా. 22

తా॥ కపిలుడు,బుద్ధుడు విష్ణ్వంశావతారములు కాన నాస్తికులు ఎట్లు అగుదురు? వారు ఎన్నో సిద్ధులను ప్రదర్శించినారు. ఆకాలములలో సాధకులకు కావలసిన "అసంగ" యోగమును కపిలుడు, "అహింసా" ధర్మమును బుద్ధుడు బోధించినారు. అసంగ మనగా మనస్సును విషయములందు తగులుకొననట్లు చేయుట. అందుకే వారు అవతరించిరి. ఇవి రెండూ లేకుండా భగవంతునిపై భక్తి వ్యర్థము కాన, భగవంతుని గురించి మౌనము వహించిరి. మౌనము వహించినారు కాన వారిని నాస్తికులని అనుయాయులు భావించినారు.

శ్లో॥ కర్మణా శక్తి రత్యల్పా, చిన్తయా ఫల కామయోః
బహ్వీ కేవల కర్తా త, న్న కర్తాZ త్యల్ప శక్తితః॥ 23

తా॥ కర్మలను చేయుట యందు చాలా తక్కువ శక్తి వ్యయ మగును. ఆ కర్మల సంకల్పములలోను, ఆ కర్మల ఫలముల గురించి చింతించుటలోను ఎంతో శక్తి వ్యయమగును. కావున సంకల్పము చేయకుండా, ఫలముల వలన ఎట్టి మానస వికారమును పొంద కుండా కర్మలను చేయువాడు అత్యల్ప శక్తి వ్యయమును చేసిన వాడు దాదాపు శక్తిని ఏమియు వ్యయము చేయని వాడే కాన, కర్మలను చేసియు చేయని వాడే అగుచున్నాడు.



శ్లో॥ లీలా కర్తేహ చాముత్ర, సోZ సఙ్గో మృత భుఙ్న హి
పాపీ చిన్తా వధే పాప, మహింసా హ్యాహ మీశ్వరః॥ 24

తా॥ సంకల్పము, ఫలచింతలను వదలిన వాడు ఎంతో శక్తిని దాచుకున్నవాడు అగుచున్నాడు. కేవలము కర్మలను చేయుటకు చాలా తక్కువ శక్తి చాలు కాన, వాడు ఈ లోకమున గల తన అన్ని కర్తవ్యములను అవలీలగా చేసి అదే విధముగా నా సేవాకార్యములను కూడా అవలీలగా చేయును. ఇదే కపిలముని యొక్క "అసంగ యోగము".

ఇక బుద్ధుని అహింసా మార్గములో కూడా సహజముగా మరణించిన జీవుల శరీరములను తిను కాకాది పక్షులకు మాంసాహార పాపము లేదు. ఒక జీవిని ఆహారము కొరకు వధించుచున్నప్పుడు ఆ జీవుడు పడు బాధలో ఎంతో శక్తిని చింతా రూపముగా వ్యయము చేయుచున్నాడు. ఇదే పాప రూపమున వధించువానికి తగులు కొనును. ఒక జీవుని ఈ లోక జీవనమును అపుచేయు అధికారము ఈశ్వరుడగు నాకే ఉన్నది తప్ప, మరొక జీవునకు లేదు.

శ్లో॥ పశ్య కృష్ణ! జగత్సర్వం, రమ్యం హ్యుపరి దృశ్యతే
దదామి దివ్యదృష్టిం తే, మహాశక్తి ర్న యన్త్రగా॥ 25

తా॥ ఓ కృష్ణా! పైకి ఎంతో రమ్యంగా కనపడే ఈ జగత్తును ఒకసారి లోపలికి చూడుము. నీకు దివ్య దృష్టిని ఇచ్చుచున్నాను. ఈ నాటి "సూక్ష్మదర్శిని" పేరు గల మహా యంత్రములు సైతము దర్శించలేని అత్యంత సూక్ష్మ కణ రూపములతా నున్న, ఈ జగత్తులోని మహా శక్తిని చూడుము.(అనగా ప్రస్తుత యంత్రముల ద్వారా గోచరించు సూక్ష్మ కణములలోని అత్యంత సూక్ష్మ కణములని భావము)

శ్రీ భవానీ సమేత బాలకృష్ణ ఉవాచ:-

శ్లో॥ ఏవం దత్త దృశా కృష్ణో, దదర్శాన్త ర్జగత్సమమ్
అనన్త తేజసాం బిన్దు-మధ్య శూన్య కణ భ్రమమ్. 26

శ్రీ భవానీ సమేత బాలకృష్ణుడు వచించెను :-

తా॥ ఈ విధముగా శ్రీదత్త గురు భగవానుడు వచించగనే, శ్రీ దత్త శిష్యుడు, ఈ సర్వ విశ్వము యొక్క అంతర స్వరూపమును, దత్త గురు భగవానునిచే ప్రసాదించబడిన దివ్య దృష్టితో తిలకించెను. అప్పుడు బాహ్య దృశ్యమాన మగు ఈ జగత్తు అంతర్ధానమై లోపల దాని స్వరూపము కనపడెను. ఆ దృశ్యము ఇట్లున్నది - అనంత కోటి కోటి సంఖ్యలతో అత్యంత సూక్ష్మము లైన తేజః కణములు, అత్యాశ్చకరమైన విన్యాసములతో, మధ్య మధ్య గల అత్యల్ప శూన్యములగు ఖాళీ స్థలములతో కనపడెను.

శ్లో॥ నా ద్యన్త కణ చలన - కమ్ప భ్రమణ వేగవత్
అత్యల్ప వస్తు శక్త్యబ్ధి - మహా ప్రళయ కారకమ్॥ 27

తా॥ ఎటు చూసినా, ఆది-అంతములు కనవడుటలేదు శక్తి కణముల యొక్క కంపనములు, భ్రమణములు, చలనములు, మహావేగముతో నున్నవి. జగత్తులో కనిపించు ఎంతో చిన్నవస్తువు నందు సైతము, ఒక మహా శక్తి సాగరము ఘనీభవించి యున్నది. అ చిన్న వస్తువులోని మహాశక్తి సముద్రము ప్రకటించబడినచో ఒక్కొక్క శక్తి సాగరమే మహా ప్రళయముమ చేయగలిగి యున్నది.

శ్రీ దత్త భగవానువాచ :-

శ్లో॥ స్థావరం జఙ్గమం వస్తు, లీయతే హి క్షణ క్షణమ్
క్రియతే చ మయా తత్ర, స్థిర మన్యత్ర త చ్చలత్॥ 28

శ్రీ దత్త భగవానుడు వచించెను:-

తా॥ ఈ జగత్తులోని ప్రతి వస్తువు స్థిరముగా నున్నది కానీ, కదలుచున్నది, ప్రతి క్షణము లయించి అదృశ్యమై పోవుచున్నది. కానీ వెంటనే స్వామి చేత సృష్టింప బడుచున్నది. ఒక వస్తువు తానున్న ప్రదేశములోనే సృష్టింపబడినచో ఆ వస్తువు అ ప్రదేశములో స్థిరముగ నున్నట్లు కనపడుచున్నది. ఒక వస్తువు దాని స్థానమును వదలి మరొక స్థానములో సృష్టింపబడినచో, ఆ వస్తువు దాని పూర్వ స్థానమును వదలి రెండవ స్థానమునకు నడిచినట్లు కనిపించుచున్నది.



శ్లో॥ మమ తత్త్వస్య నాన్తోऽస్తి, పశ్య కాశ్యప! మాం జగత్
చాలయన్తం మహా చిత్రం, లోకే చలన చిత్రవత్. 29

తా॥ ఓ కాశ్యపా! నా స్వరూప తత్త్వము యొక్క విచిత్రములకు అంతము లేదు. ఈ జగత్తును మహా చిత్రమైనదిగా సృష్టించి దానిని, ఈ లోకంలో చలన చిత్రమును వలె ఎట్లు నడిపించు చున్నానో చూడుము.

శ్లో॥ చల చిత్రే యథా చిత్ర - పఙ్క్తిః కాలో నిరన్తరః
తథాऽత్రాహం దర్శయామి, భూతం వా గత చిత్రదృక్ ॥ 30

తా॥ జీవుడు, కాల, దేశ భ్రమలను త్యజించ వలయును. కాలము, దేశమూ నా సంకల్పక్రియారూపాలే. నీవు చలన చిత్రమును చూచునప్పుడు ఏమి జరుగు చున్నది? ఒక పిల్లవాడు ఒక్కనిమిష కాలములో క్రమముగా పెరిగి 20 సం॥ వానిగా చూచుట చేత, నీవు 20 సం॥ కాలమును అనుభవించుచున్నావు. కానీ, సినిమాలో ఏమి జరిగినది? చిన్నవాడు క్రమంగా పెద్దవాడుగా, పది చిత్రములు (ఫిల్ములు) వరుసగా తెరపై చూపబడినవి. చిత్రముల మధ్య అంతరమును నీ కన్ను గ్రహించలేదు. ఈ పది చిత్రములు తెరపై ప్రతిబింబించు క్రియల వరుసయే 20 సం॥ కాలము. కావ, కాలము క్రియా స్వరూపము. నీ కన్ను గ్రహించలేనంత వేగముగా, ఒక జీవుని శరీరము యొక్క చిత్రముల వరుస నా చేత ఈ ప్రపంచమున నీకు గోచరింపబడునట్లు చేయుచున్నాను. ఈ క్రియల వరుసనే కాలము అనుచున్నావు. వెనుక చిత్రములను మరల, ఒక్క సారి నేను ప్రకటించినచో, ఈ సృష్టి అంతయు వెనుకకు పోవును. అనగా భూత కాలమును మరల తీసుకొని రాగలను.

శ్లో॥ నాన్తరం గృహ్యతే వేగా, చ్చల చిత్ర మపీదృశమ్
దృశ్యాదృశ్యో భవానఙ్గ, స్థానా దేవ స్థిరం చలమ్॥ 31

తా॥ వస్తువు లయించుట - మరల నాచేత సృష్టింపబడుట ఈ రెండింటి మధ్య గల అంతర కాలము చాలా స్వల్పమైనది. దీనిని నీ బుద్ధి కన్ను గ్రహించలేదు. కావున ఒక వస్తువు ఒకే స్థానములో నున్నట్లు నీకు కనపడుచున్నది. అట్లే మరియొక వస్తువు కూడా మరియొక స్థానమునకు పోయినట్లు కనపడుచున్నది. ఇట్లే చలన చిత్రములో కూడ కనపడుచున్నది. నీవు ప్రతి క్షణమూ అదృశ్యమై పోవుచూ, మరల నాచేత సృష్టింప

బడుచున్నావు. ఇది ఎంతో మెఱుపు వేగంతో జరుగుచున్నది. కాన, నీకు తెలియుట లేదు. నేను మరల సృష్టించే స్థానాన్ని పట్టే, వస్తువు అక్కడే స్థిరంగా ఉండటమా? లేక మరొక స్థానానికి కదులుటయా? అనునది తేలును. అంటే అదే స్థానంలో సృష్టింప బడితే స్థిరంగాను, మరొక స్థానంలోకి సృష్టింప బడితే ఆ వస్తువు కదులుచున్నట్లున్నూ కనపడుచున్నది.

శ్లో॥ ఏక దాZనన్త విశ్వస్థ - కణకోట్యో యథేరితాః
చలన భ్రమ కమ్పాస్తా, యతాకాశే మితే మయా॥ 32

తా॥ నేను ఒకే సమయమున, ఈ అనంత విశ్వంలో ఎన్ని కోట్ల కోట్ల పరమాణువులను వాటి వాటి పరిమిత నియమిత స్థానాలలో భ్రమణ, కంపన, చలనాలతో పైన చెప్పిన విధంగా, అంటే వాటిని స్థానాంతరాలలో క్షణం క్షణం సృష్టించుచుండే క్రియల ద్వారా వాటిని భ్రమింప చేయుచు, కంపింప చేయుచు, చలింప చేయుచున్నానో తిలకించుము.

శ్లో॥ అనాద్యనన్త విశ్వస్య, న బోధ స్తత్వతో నృణామ్
లీలా సఙ్కల్ప బిన్దోర్మే, నాహ మూహ్య స్సురై రపి॥ 33

తా॥ అనాది, అనంతము అగు ఈ విశ్వము నా లీలా మాత్రమైన ఊహ యొక్క ఒక చిన్న బిందువు. దీని అసలు తత్త్వమే ఇంత వరకు మానవులకు అంతు చిక్కలేదు.ఇక, నా తత్త్వము గురించి దేవతలు సైతము ఊహించజాలరు.

శ్లో॥ న విశ్వా దధికం తస్య, కారణ స్థితి నాశతః
నాన్య త్సర్వాధికం బ్రహ్మ, విశ్వరూపే ప్రదర్శితమ్॥ 34

తా॥ ఈ విశ్వము కన్న గొప్ప వస్తువు ఏదియును కనిపించుట లేదు.ఇది అనాది - అనంతముగా ఉన్నది. కాన, దీనిని నిర్మించి, పాలించి, లయము చేయు వస్తువు దీని కన్ననూ గొప్పదిగా ఉండవలెను.దాని కన్న గొప్ప వస్తువు మరియొకటి ఉండుటకు వీలు లేదు. కాన, అన్నింటి కన్ననూ గొప్పది అదే. అందువల్లనే, "అన్నింటి కన్ననూ గొప్పది" అను అర్థము కల బ్రహ్మము అను శబ్దముతో అది సూచింప బడినది. ఈ విశ్వమును నేనే సృష్టించి, ధరించి, లయము చేస్తున్నాను అనునది కూడ విశ్వరూపమున ప్రదర్శించితిని కదా.



శ్లో॥ సృష్టం ధృతం విలీనం చ, విశ్వరూపం త్రిమూర్తిమత్
బ్రహ్మZహం పరిపూర్ణోZయం, న విష్ణో ర్దశసు స్థితః॥ 35

తా॥ అర్జునుడు ముందు చూచినపుడు కృష్ణుడే ఉన్నాడు. విశ్వము లేదు. తరువాత విశ్వరూపము అనగా (విశ్వము) సృష్టించబడినది. ఆ విశ్వమును కృష్ణుడే ధరించి నిలిచినాడు. ఆ తరువాత ఆ విశ్వము ఉపసంహరించ బడినది. అంటే నేనే విశ్వమును సృష్టించి, ధరించి, నశింపచేయుచున్నాననియే కదా దీని అర్థము. విశ్వరూపంలో మధ్యమూడు ముఖములు బ్రహ్మ విష్ణు శివ ముఖములు నన్నే సూచించుచున్నవి. యదువు ననుగ్రహింప దలచి నేనే కృష్ణావతారము నెత్తితిని. అందుకే కృష్ణుడు విష్ణువు యొక్క దశావతారములలో లేడు. త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మమైన నా పరిపూర్ణావతారముగ స్తుతించబడి దశావతారధారిగా నిలచినాడు.

శ్లో॥ వర్తమానే భూత భావి, దర్శయామి తథాకృతమ్
క్రియానాం సన్తతిః కాలః, కాలాతీత స్సమో దృశే॥ 36

తా॥ ఈ విశ్వము ఇట్లు నిలచియుండగనే, ఈ విశ్వము యొక్క సృష్టి స్థితి లయములు చూపించితిని. ఇది ఎట్లు? ఇది నీ ఊహకు అందని నా మాయా చిత్రశక్తి. నేను కాలా తీతుడను. వర్తమాన కాలములోనే భూత భవిష్యత్కాలములను ప్రదర్శించగలను. కాలము అనగా ఏమి? అది నా యొక్క క్రియల రూపమే, ఒక క్రియ, రెండవ క్రియ, మూడవ క్రియ... ఇట్లు క్రియల వరుసయే కాలము. నేను సర్వ క్రియలను ఆపినచో ఇక కాలమే లేదు. క్రియ నా అధీనము. కాన, కాలము నా అధీనము.

శ్లో॥ త్వన్మాత్రే మయి విశ్వం చ, దృష్టం నాన్తం హి మద్వశే
ఆకాశో న తవోహ్యోZహం, కాలాకాశా త్పరో యతః॥ 37

తా॥ నీయంత ఎత్తు, పొడవు, లావు గల నా శరీరములో ఈ అనంత విశ్వమును ఇమిడ్చి, చూపుటయు మాయయే. ఏలననగా, అకాశము నా ఊహయే, నా ఊహాశక్తి యందు ఇమిడియుండును. కాన, అకాశము నా అధీనములో నున్నది. ఇట్లు కాలాకాశములకు అతీతుడగు నన్ను, కాలాకాశతత్త్వములను దాటి ఊహించలేని, నీవు ఏవిధముగను ఏంత ప్రయత్నించినా ఊహించజాలవు.

శ్లో॥ చేతనా యన్త్ర దృశ్యా న, క్రియా చైతన్య మస్మి చేత్
ఆవేశ చేతనా వాZశ్మ, నాZZనన్దోZతి శయో ముదః॥ 38

తా॥ ఇట్టి నన్ను చైతన్య మని ఎట్లు నిర్ధారించగలవు? చైతన్యమన్ననూ, ప్రాణి వర్గములో యంత్రములలో కనిపించు తంత్ర క్రియా సహితమైన జడశక్తిని చైతన్యమనరాదు. దానిని "చేతన"గా నిర్ధారించి, అగ్రాహ్యుడగు నన్ను చైతన్యము అనవచ్చును. "చేతన"ను నేను ఆవేశించి అవతారమైనపుడు అట్టి చేతనను చైతన్యముగా పిలువవచ్చును.అట్టి చైతన్యము బ్రహ్మమే. నేను ఆవేశించుట ఒక శిలావిగ్రహములో కూడ జరుగ వచ్చును. అప్పుడా జడమైన శిలయు బ్రహ్మమే. నేను ఆనందమూ కాదు. సంతోషము యొక్క అతిశయమే ఆనందము.

శ్లో॥ ఆనన్దా దధికా శాన్తి, స్సా యోగ చరమం ఫలమ్
దుఃఖశక్తి వ్యయోZప్యస్మిన్, కోశానన్దో నభో యతః॥ 39

తా॥ ఆనందము కన్న శాంతి గొప్పది. అది యోగము యొక్క చివరి ఫలము. దుఃఖములో ఎట్లు తనలోని శక్తి ఖర్చు అగునో, అట్లే సంతోషములో అనగా ఆనందములో శక్తి వ్యయము అగును. శక్తి వ్యయము జరిగినచో అది యోగమునకు విరుద్ధము. ఆనందము కూడ ఒక కోశమే. (ఆనందమయకోశము) అంటే ఆనందము కూడా చైతన్యము యొక్క క్రియయే. కాన, చైతన్యము (చేతన) ఆకాశమునకు లొంగినది కాన, ఆనందము కూడ ఆకాశ పరిమాణ నియమానికి లొంగినదే.

శ్లో॥ త్రిమూర్త్యక్షర ఓంకారో, వాచకో మే స శాన్తిమాన్
శ్రుతస్త్రి స్సంస్మృతౌ శాన్తి,-ర్నభక్త్యాం న హత శ్శమః॥ 40

తా॥ 'అ' కారము బ్రహ్మ - 'ఉ' కారము విష్ణువు - 'మ' కారము శివుడు. ఈ మూడు కలసిన ఏకస్వరూపమైన ఓంకారమే త్రిమూర్త్యాత్మకమైన సృష్టి స్థితి లయ కారకమైన పరబ్రహ్మ మగు నన్ను సూచించును కాన ఓంకారము నా వాచక మని చెప్పబడినది. అట్టి ఓంకారముతో శాంతిని చేర్చి " ఓం శాంతిః" అను త్రిమూర్తి సూచకంగా మూడు సార్లు వేదములో మాటిమాటికిని వినపడుచున్నది. కావున శాంతియే నా పరమ స్వభావము. అయితే ఈ శాంతి సంసార విషయములలోనే తప్ప, నా ఆరాధనలో వచ్చు ఉద్రేకములకు వర్తించవు. అవి శాంతి భంగకరములు కావు.



శ్లో॥ అద్వైతం సాధనేZపీష్టం, న దోషాయ న మత్కృతమ్
యద్యహన్తా దశాస్యాది - ప్రమాదో భగవన్మతేః॥ 41

తా॥ సాధనలో కూడ ఒక్కొక్కసారి అద్వైతమును సాధకుడు ఇష్టపడి పొందును. అది దోషము కాదు. అయితే, అది నా వైపునుండి వచ్చినది కాదు. అయిననూ, నా యొక్క విరహమును అనగా నాతో ద్వైతమును సహించలేక అత్యాకర్షితుడైనా తాదాత్మ్యమును సాధకుడు కోరుచుండును. గోపికలు కృష్ణ విరహమును సహింపలేకున్న సమయమున, ఒక గోపిక "నేనే కృష్ణుడనని భావించి పలికినది. ఇట్టి అద్వైతము ఆరాధనము వరకు పరవాలేదు. అది అహంకారమునకు దారి తీయరాదు. అట్లు దారి తీసినచో ఆ జీవుడు రావణ, హిరణ్యకశిపుల వలె తానే ఈశ్వరుడ నని ప్రకటించుకొని అత్యాచారములను చేయును.

శ్లో॥ సంసార నిగ్రహాశ్శక్తో, బహురూపాధ్వచర్చయా
నాన్యా న్వఞ్చయతి హ్యేష, కాలక్షేపాత్మవఞ్చకః॥ 42

తా॥ సంసార విషయములలో చిత్తాన్ని నిగ్రహించలేనివాడు, నారూపాలను గురించి నా ఆరాధనావిధానాల గురించి, "ఏది ఉత్తమము?" అని చర్చ చేయుచుండును. దానిలో కాలము గడుపును. వాడు తనలోని అసలు లోపమును గుర్తించలేక నా బహురూపములు బహు మార్గములుండుట వలన ఏమి చేయవలయునో చర్చించుచున్నానని, నెపము నాపై నెట్టును. అట్టివాడు చివరకు ఎవడినీ మోసగించుటలేదు. తనను తానే మోసగించుకొనుచున్నాడు.

శ్లో॥ న దేవ రూప ఏవాహం, పరమాణౌ ప్రతి క్షణమ్
సృష్ట్యాది త్రిముఖానన్తః, కాలా దేకముఖః పరః॥ 43

తా॥ నేను సర్వదేవ దేవతా రూపాలలోనే కాదు. ప్రతి పరమాణువులో పరిపూర్ణంగా నిండి యున్నాను. ప్రతిచోటా ప్రతి క్షణమూ నేను సృష్టి, స్థితి, లయములను వెంట వెంటనే చేయు చున్నాను. ఈ మూడును ఒక గొలుసు వలె అనంతముగా జరుగుచుండును. ఇందులో ఏ మూడింటిని తీసుకున్ననూ మధ్య బిందువు బ్రహ్మ (సృష్టి), విష్ణువు (స్థితి), శివుడు (లయము) కావచ్చును. కాన, నా రూపము మధ్యముఖము బ్రహ్మ-విష్ణు-శివులలో ఏదైననూ కావచ్చును. నేను కాలాతీతుడను

గాన, ఈ మూడు ముఖములను ఒకే ముఖమైన ఏకముఖ దత్త రూపంగానూ ఉన్నాను. అది కాలాతీతస్థితి అనగా కాలత్రయ సూచకమగునది మూర్తి త్రయము. ఏకమైన కాలా తీతము, ఏక ముఖావస్థ.

శ్లో॥ సాధనం న జపాద్యేవ, భోగోZప్యుక్త స్స్మృతిం త్యజన్
మత్పరో దక్షిణాచారో, జ్ఞాన్యహం దృశ్య భోగ్యతః॥ 44

తా॥ ఇక సాధన మార్గములు జపాది మార్గములే కాక, విషయభోగములను కూడ సాధన మార్గములుగా మలచ వచ్చునని చెప్పియున్నాను. కాన ఏ రూపంలో నున్నా, ఏమార్గమైనా నన్ను చేరవచ్చును. కాన, ఈ చర్చ అనవసరము. సంసారము వైపు, ఏమాత్రము అభిరుచి లేక కేవలము నా యందే రుచి గలవాడు అత్యుత్తమ సాధకుడు. ఇది దక్షిణాచారమను జ్ఞాన మార్గము. అట్టి వాని చూపులకు నా సౌందర్యమే తప్ప, సంసార గత సౌందర్యములు నచ్చవు. అట్టి వానికి కేవల భోగ్య వస్తువు నేనే కాన, సంసారములోని భక్ష్యాదులు రుచించవు. వానికి దృశ్యము, భోగ్యము నేనే అయి ఉందును.

శ్లో॥ అపూర్ణజ్ఞ రుచేః కర్మీ, వామాచార స్స్మృతో రతః
ధర్మేణ మత్పరం కుర్యా, జ్జిహ్వా గుహ్యా ద్వయే యతః॥ 45

తా॥ ఇక వామాచారము కర్మ మార్గము. ఈ జీవుడు సంసార దృశ్యభోగ్యములను త్యజించలేడు. కారణము పరమాత్మునిపై పరిపూర్ణ జ్ఞానాభావము వలన పరమాత్మ రుచి పూర్ణముగా వానికి చిక్కలేదు. వీనికి సంసార దృశ్య భోగ్యములందు అసక్తి ఉండును. ఇట్టి వాడు సంసార దృశ్యభోగ్యములందు అధిష్ఠానముగా నున్న నన్నే చూచి, వాటిని నా పరంగా చేసినందున మధ్యమ మార్గమగు వామాచార మగును. అయితే ఈ దృశ్య భోగ్య వస్తువులు ధర్మబద్ధములై యుండవలెను. అనగా ధర్మపత్ని యందే రమించుట, న్యాయార్జితమునే భుజించుట ఉండవలెను. ఏలననగా అధర్మములో నేనుండను. దానికి దూరముగా నుండి, దానిని జీవుల ఇష్టము వలన కేవల సంకల్పము చేత ధారణము చేసి అధర్మమును నిలుపుచున్నాను. జిహ్వా, -గుహ్య చాపల్యములను నిగ్రహించుకొని ధర్మమార్గమున సంసారములో విషయముల ననుభవించుచు వాటిని మత్పరములు చేసినచో వాడును క్రమంగా తరించును. ఇది మధ్యమమార్గము.



శ్లో॥ పాపీ తరతి చాధర్మం, మత్సంబన్ధా త్స ధర్మవాన్
నాస్తికః కేవలం భుఙ్క్తే, నాస్మి య త్పశుపక్షిగః ॥ 47

తా॥ ఇక అధముడు, ప్రారబ్ధవశమున అధర్మముగా భోగమును చేయు పాపియును, ఆ భోగములను నాపరములుగా చేసినచో, వాడు అచిర కాలములోనే నా అనుగ్రహము వలన, ఆ అధర్మ కూపము నుండి బయట పడి ధర్మమార్గ వర్తను డగును. నాతో ఏవిధంగా, ఎవడు సంబంధమును పెట్టుకొన్ననూ వాడు తరించక తప్పదు. ఇక నాస్తికుడు ఒక్కడు మాత్రము, నాతో ఏ సంబంధము లేకుండా, అసలు నన్ను ఉన్నానని కూడ అంగీకరించడు కాన, వాని కిక భగవంతుని చేరు వివేకము గల మానవ జన్మలు అనవసరము కాన, వాడు కేవల భోగపరములైన జిహ్వా-గుహ్యేంద్రియ తృప్తి కరములగు విషయ భోగములే కల క్రిమి కీటక పశుపక్ష్యాది జన్మలను పొందును.

శ్లో॥ నాస్తికాయావతారో మే, సిద్ధిమాన్కోZపి చాస్తికః
ఇన్ద్రజాల మతాశ్చక్రం, యాన్తి పూర్వః క్రమాత్సుధీః ॥ 48

తా॥ నాస్తికుడును నా బిడ్డయే కాన, వానిని మార్చుటకై కట్టకడపటి మహా ప్రయత్నమే నేను అవతరించి ప్రత్యక్షముగా ఊహకందని సిద్ధులను ప్రదర్శించి నేనున్నానని వానికి నిరూపించుచున్నాను. ఒక్కొక్క నాస్తికుడు ఆస్తికుడై మారుచున్నాడు. కొందరు నా సిద్ధులను కేవలము ఇంద్రజాలములుగా భావించి నమ్ముటలేదు. అట్టి నమ్మని వాడు ఈ మానవ జన్మ తరువాత శాశ్వతముగా క్రిమి కీటకాది జన్మల చక్రములో పడుచున్నాడు. ఆస్తికుడైన వాడు క్రమముగా పైన చెప్పిన అధమ-మధ్యమ-ఉత్తమ సాధనలతో నన్ను చేరునే తప్ప ఎన్నటికినీ నాస్తికుడు కాడు.

శ్లో॥ సర్వేZధికారిణో జీవా, మదపత్యాని నో కులమ్
న లిఙ్గం మాZ స్త్వహ ఙ్క రో, మాZసూయా శ్లాఘ్యతాం గుణీ॥ 49

తా॥ జీవులందరును నా బిడ్డలే. నన్ను చేరు అధికారము ప్రతి జీవునకును గలదు. ఈ అధికారమునకు బ్రాహ్మణ-చండాలాది కులములు కానీ, స్త్రీ పురుష లింగ భేదముకానీ అడ్డురాదు. కాన బ్రాహ్మణాద్యగ్ర వర్ణములకు, పురుషులకును అహంకారము పనికిరాదు. అట్లే అంత్య వర్ణములకును స్త్రీలకును, పైవర్ణములవారిపై నసూ

పురుషులపైననూ అసూయ పనికి రాదు. ఏ జీవుడు గుణవంతుడైనచో, ఆ జీవుడు ఏ కులము వాడైననూ, స్త్రీ యైననూ, పురుషులైననూ పూజింపబడవలసినదే.

శ్లో॥ సకృ దేకత్ర భిన్నే హి, పరిమాణై ర్ధృతేక్షితః
బహుదేశేషు వా నైవ, మష్టసిద్ధ స్స మేZ ర్చకః 50

తా॥ బ్రహ్మమైన దత్తభగవానుడు ఒకే సమయమున, ఒకే ప్రదేశంలో కానీ, అనేక ప్రదేశాలలో కానీ, చూచేవారి పరిమాణాలకు సమానపరిమాణాలలో కనపడగలడు. ఇది అష్టసిద్ధులకుసాధ్యము కాదు. అష్టసిద్ధులు కలవాడు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఒకే పరిమాణంతో కనపడగలడు. ఒకే దేశంలో వివిధ సమయలలో కానీ, వివిధ సమయాలలో వివిధ దేశాలలో వివిధ పరిమాణాలలో కనపడగలడు. అష్టసిద్ధులు కలవాడు నా ఆరాధనము వలన వరములను పొందిన వాడే తప్ప నేను కాదు.

శ్లో॥ సిద్ధి భిన్నేZస్తి నాల్పత్వ - మహత్త్వ పరదేశితా
నభిన్నేZప్యణుపూర్ణోZస్మి, బ్రహ్మ సృష్ట్యాది భేదవాన్॥ 51

తా॥ అష్ట సిద్ధులలో కూడ ఇట్టి విచిత్రము లేదు. ఒకడు సిద్ధి ద్వారా తన పరిమాణమును పెంచుకొనగలడు, తగ్గించుకొనగలడు. లేదా సూక్ష్మరూపమున ఎక్కడికైననూ పోగలడు. నేను అట్లు కాదు. నా పరిమాణమును పెంచుకొనను. తగ్గించు కొనను. ఎవరెంత పరిమాణంలో ఉన్నారో అంత పరిమాణంలోనే వారికి గోచరిస్తాను. అంతే కాదు, నేను పూర్ణ స్వరూపంతో ఒకే సమయమున అనేక ప్రదేశములలో గోచరించగలను. ఒకే సమయంలో ప్రతి అణువులోను, ఇదే రూపంతోను, లేక వేరు వేరు రూపాలతోను గోచరించగలను. నేను వేరు రూపాలను ధరించను. కాని వేరు రూపాలతో గోచరిస్తాను. సిద్ధు లిట్లు కాదు. వేరు రూపమును ధరించవలయును. ఒకేసయమమున ఒకే ప్రదేశములోనే ఉండగలరు. ఒకే సమయమున సర్వత్రా ఉండవలయునన్నచో అతడు విశ్వమును వ్యాపించు పరిమాణమును పెంచుకొన్ననూ, ప్రతి అణువులోను పరిపూర్ణ స్వరూపంతో వుండలేదు. అనగా సముద్రమంత కావచ్చును. కాని ప్రతి అలలో ప్రతి నీటి బిందువులో సముద్రమంతయును ఇమిడియుండుట సిద్ధులు కలవానికి కుదరదు. అతడు సూక్ష్మ శరీరముతో మరియొక చోటికి పోగలడు లేదా తన శరీరమును విశ్వవ్యాపకముగా పెంచగలడు కాన నా సిద్ధులముందు అష్టసిద్ధులు ఎందుకున్నూ



పనికిరావు. జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయముతోనే కాదు. సిద్ధులలో కూడ నేను మిగిలిన సిద్ధ పురుషుల కన్న విశిష్టుడను గొప్పవాడను కాన బ్రహ్మమై యున్నాను.

శ్లో॥ అతర్క్యోZనుభవ జ్ఞేయో, జ్ఞానం వృక్ష ఇవ స్థిరమ్
స్వయం న దయయా సిద్ధో, మార్గస్య త్రిపుటి ప్రమా॥ 53

తా॥ నా యొక్క ఈ విచిత్ర తత్త్వమును గుర్తించుటయే జ్ఞానము. కాని అర్థము చేసుకొనుట జ్ఞానము కాదు. తర్కము ద్వారా నేను అతర్క్యుడనని గుర్తించుటయే జ్ఞానము కాన నన్ను తెలుసుకొనుట అసంభవము. అట్లు నా స్వరూపమును తర్కము ద్వారా అర్థము చేసుకొన్నానని ఇతరులకు బోధించువాడు హాస్యాస్పదుడగు మూఢుడు. అయితే తర్కము నేను అతర్క్యుడనని నా విచిత్ర తత్త్వమును గుర్తించుటకు అవసరమే. తర్కించిన గదా, తర్కమునకు అందడని తెలియుట. తర్కించని వాడు, తర్కమునకు నేను అందుదునేమో అన్న అనుమానము కలిగియుండును. తర్కించిన వానికి ఆ అనుమానము ఉండదు. మరియు తర్కించి, తర్కించి నేనుఅతర్క్యుడనని తెలుసుకొన్న వాని జ్ఞానము ధృఢముగా నుండి నాపై స్థిరమైన ఆకర్షణ (లేక దృష్టి) ఏర్పడును. జ్ఞాన రహితుని దృష్టి లేత మొక్క వలె కష్టములను-పిల్ల వాయువులకే విరిగి పోయి విశ్వాసము పోవును. జ్ఞాని దృష్టి ధృఢమైన చెట్టు వలె, పెద్దగాలులకు సైతము నిలబడి విశ్వాసము స్థిరముగా యుండును. కావున జ్ఞానము ఎంతో అవసరము. అర్థము కాని వాడనని ప్రయత్నించి అనుభవపూర్వకంగా తెలుసుకొనుటయే బ్రహ్మజ్ఞానము. అట్టి నన్ను చేరు మార్గము యొక్క జ్ఞానము అన్నింటి కన్ననూ ముఖ్యము. జీవుడు స్వయముగా, నేను కాదనియు, సాధన చేసిన నా అనుగ్రహము ద్వానికి చేకూరిన నేను కాగలడననియు, జీవుని జ్ఞానము కూడ ముఖ్యము. ఇట్లు ధ్యాత (జీవుడు) - ధ్యానము - (సాధన) - ధ్యేయము (నేను)ల త్రిపుటి జ్ఞానమునే పూర్ణ బ్రహ్మ జ్ఞాన మందురు.

శ్లో॥ చతుష్పథం సమై ర్మార్గైః, ప్రాప్యం నాహన్తయా నృణామ్
నాZసూయయా బ్రహ్మలిఙ్గ - వర్ణాశ్రమ స్వధర్మగమ్॥ 55

తా॥ నాలుగు బజారుల కూడలిని చేరుటకు ఎవరి గృహము నుండి ఏ వీధి కలదో ఆ వీధి ద్వారా వచ్చి కూడలిని చేరవచ్చును. ఒక వీధిలో ప్రత్యేకత ఏమీ లేదు కాన, ఏ ధి వారికినీ అహంకారము పనికిరాదు. అట్లే ఒక వీధిలో ప్రత్యేకత కలదని, మరొక ధివారు, ఈవీధి లోనికి నడచి వచ్చి అసూయతో కూడలికి చేరుకొనవసరములేదు. హంకరించు వారు వారి వీధి నుండి బయలుదేరినా బ్రహ్మ మను కూడలికి రుకొనలేరు. అట్లే అసూయతో మరియొకరి వీధి ద్వారా కూడలికి రా ప్రయత్నించిన రునూ బ్రహ్మ మను కూడలికి చేరలేరు. కావున అహంకారము అసూయ లేనివారై, మ వర్ణమునకు, తమ ఆశ్రమమునకు, తమ లింగమునకు శాస్త్రము విధించిన వధర్మ మార్గము ననుసరించినచో, త్వరగా బ్రహ్మ మను కూడలికి చేరగలుగుదురు.

*ఇతి శ్రీ దత్త గురు భగవద్గీతాయాం*
*శ్రీ దత్త విశ్వ వ్యాపక యోగోనామ*
*పంచదశాధ్యాయః*

కాలభైరవ ఖండః

# శ్రీ దత్తగురు భగవద్గీత

షోడశాధ్యాయః

## శ్రీదత్త మతసమన్వయ యోగః

శ్రీ దత్త గురు భగవాన్ ఉవాచ:-

శ్లో॥ అన్యోపమాన భిన్నాంశ - గ్రహణై రన్య దూషకాః
స్వీయోపమానతుల్యాంశ - గ్రహణా స్స్వమత స్థిరాః॥ 1

శ్రీ దత్తగురు భగవానులు వచించిరి:-

తా॥ ఈ లోకములో పండితులు ఇతరులు ఇచ్చిన ఉపమానములలో పోలికకు పనికిరాని అంశములను లేవదీసి, ఇతరుల మతములను దూషించుచున్నారు. తమ మతములలో ఇచ్చిన ఉపమానములలో పోలికకు పనికి వచ్చు అంశములనే గ్రహించి, తమ మతములనే పట్టుకొని కూర్చొని యున్నారు.

శ్లో॥ అహం బ్రహ్మ సమధ్వోZహం, సోZహం రామానుజో హరిః
శఙ్కర శ్శఙ్కర స్సోZహం, త్రిమూర్తి త్రిగురు స్స్వయమ్. 2

తా॥ నేను బ్రహ్మదేవుడైన శ్రీ మధ్వాచార్యుడను. నేను విష్ణుదేవుడైన శ్రీరామానుజాచార్యుడను. నేను శివదేవుడైన శ్రీ శంకరాచార్యుడను. త్రిమూర్తులే స్వయముగ మత త్రయాచార్యులుగ అవతరించినారు.

(శంకర, రామానుజ, మధ్వాచార్యులు ఆయా కాలముల పరిస్థితులలో ప్రచారము చేసిన మతములను సమన్వయపరచుటకే "ఈ దత్తమత సమన్వయ యోగము" అనుగ్రహించబడినది.)

శ్లో॥ పరమార్థ దశావాక్యం, వ్యవహార దశాగతః
శ్రుత్వా హి స్వదశాభ్రష్ట, స్సాధకః పతితో భవేత్॥ 3

తా॥ పరమార్థ దశలోని వాక్యములను, వ్యవహారదశయందున్న జీవుడు విన్నచో, తన దశ నుండి భ్రష్టు డగుచు, సాధకుడు పతితు డగును. అనగా నా యొక్క స్థితి యందలి వాక్యములను జీవుని స్థితిలో యున్నవాడు విని సరియగు అర్థమును గ్రహించ లేనిచో అట్టివాడు భ్రష్టుడగునని భావము-అనగా నా స్థితి వాక్యములను తన స్థితికి సమన్వయించుకొని పతితుడగును.

శ్లో॥ ఏవం హి పతితేష్వేవ, శఙ్కరః పునరాగతః
అవతీర్ణ స్స్వరూపాభ్యాం, శ్రీరామానుజ మధ్వయోః॥ 4

తా॥ ఈవిధంగా, జీవులు నిజంగానే భ్రష్టులైనందుననే శంకరాచార్యులు, మరల శ్రీరామానుజ, మధ్వాచార్య రూపాలతో అవతరించిరి. శ్రీ రామానుజ మధ్వులు శ్రీశంకరాచార్యుల అవతారములే.

శ్లో॥ త్రివేణీ తీర్థరాజో హి, గాయత్రీ త్రిపదా మనుః
త్రిమతాచార్య భాష్యాణాం, మమ భాష్య సమన్వయః॥ 5

తా॥ త్రిమతముల ఆచార్యుల భాష్యముల సమన్వయమే నా భాష్యము. ఇది త్రివేణీ సంగమమైన తీర్థ క్షేత్ర రాజము. త్రిపాదములతో కూడిన గాయత్రీ మంత్రము. అత్యంత పావనము.

శ్లో॥ తత్తత్సమయ లోకానాం, గుణ కర్మానురోధతః
మూర్తిత్రయం, యథా భిన్నం, తథా భిన్నం గురుత్రయమ్॥ 6

తా॥ ఆయా సమయములందు లోకముల గుణకర్మల ననుసరించి అనగా జగత్తు యొక్క రజోగుణ సృష్టి- సత్త్వ గుణ స్థితి-తమో గుణ లయముల ననుసరించి త్రిమూర్తులు ఎట్లు భిన్నులైనారో, అదే విధంగా, అయా సమయాలలో నున్న సాధక జీవుల యొక్క సాధన దశలలోని గుణ-కర్మల ననుసరించి త్రిమతాచార్యులును భిన్నులు కావలసివచ్చినది. శిష్యుల గుణ కర్మ దశల ననుసరించి భిన్నముగా బోధించవలసి వచ్చినది.

శ్లో॥ యథా సమన్వితా హ్యేకో, దృశ్యమానోZస్మి చ త్రయః
తథా సమన్వితాన్యేకం, మతం మే త్రిమతా న్యపి॥ 7.



తా॥ ఎట్లు త్రిమూర్తులు కలసి ఒక్కటిగా సమన్వయము చెందినచో నేను ఒక్కడనే కనబడుచున్నానో, అలానే, మూడు మతములును సమన్వయము చెందినప్పుడు నామతము కనబడును.

శ్లో॥ య స్త్రిమూర్తిషు భేదం చ, కలయే త్త్రి గురు ష్వపి
తిష్ఠే న్నరక లోకేషు, తావద్యావ జ్జగ ద్భవేత్॥ 8

తా॥ ఎవడు త్రిమూర్తులలోను, త్రిమతాచార్యులలోను భేదమును చూచునో, అట్టివాడు, ఈ సృష్టి యున్నంతవరకు, నరకలోకమునందు ఉండును.

శ్లో॥ జీవస్య పరమార్థేన, గీతేయం న మమాస్మిహి
ఈదృగిత్యేవ నో తర్క్య, శ్చిత్ర మాయా సురాతిగా॥ 9

తా॥ జీవునకు ఉపదేశమగు ఈ గీతా శాస్త్రము జీవుని పరమార్థ దశను దృష్టిలో ఉంచుకొని చేయుచున్నాను. అది నాకు వ్యవహార దశ మాత్రమే. నా పరమార్థ దశ అతి విచిత్రము గాన జీవుని బుద్ధికి అందదు. నేను ఈ రూపమున ఉన్నానని గుర్తించుటయే తప్ప, నా పరమార్థతత్త్వమును విచారణ చేత అందుకొనుట సాధ్యము కాదు. నా విచిత్ర తత్త్వమైన మాయ దేవతలకే అందలేదు. ఇక మనుజుల కందునా?

శ్లో॥ త చ్ఛూన్యం భేద వైచిత్ర్యా, త్తద్భిన్న ర్వ్యోమ లోకధృత్
అసద్భావ్యం చతుర్భిశ్చ, శఙ్కరః ప్రాహ తత్త్వసత్॥ 10

తా॥ నాలోని శూన్యమగు పరమ వ్యోమము యొక్క భేదము కూడ వైచిత్ర్యము వలన సత్యమే కాని శూన్యమే. ఆ పరమవ్యోమము యొక్క ఒక బిందు మాత్రమే ఈ బ్రహ్మాండమునకు ఆధారమైన ఈ ఆకాశము. అట్టి అత్యల్ప శూన్య బిందువు దాదాపు లేనట్లే కాన, శూన్యమైన ఈ ఆకాశము కూడా జగత్తుతో బాటు నాకు అసత్యమని భావించవచ్చును. ఈ అత్యల్ప మైన శూన్యముతోపాటు, అత్యల్పము లైన ఇతర వాయుభూతములు కూడ అట్లే అసత్యములుగ భావించవచ్చును. అందువల్లనే, అత్యల్ప పంచభూతములతో కూడిన ఈ జగత్తు అసత్యమని శంకరాచార్యులు చెప్పెను. అత్యల్పమును అభావముగా పరిగణించవచ్చును.

శ్లో॥ భిన్నా సదసతో ర్మిథ్యా, న సదల్ప మసన్నసత్
మమైవ న తు జీవస్య, యో హ్యల్పోZల్ప జగద్గతః 11

తా॥ సత్యముకాదు. - అసత్యము కాదు ఇదే మిధ్య. అత్యల్పమగుట చేత, ఉన్నది యని చెప్పుటకు వీలు కానిది, కాన సత్యము కాదు. అసలు లేదు అని చెప్పుటకునూ వీలుకాదు. ఏలనన అత్యల్పముగా ఉన్నది గనుక. కాన, అత్యల్పమైన ఈ జగత్తు. సత్యము కాదు, అసత్యము కాదు. అందువలన మిధ్య యనబడును. అయితే ఈ జగత్తు అత్యల్పము కాన, మిధ్య యగుట నాకు మాత్రమే, జీవునకు కాదు. ఈ అత్యల్ప. జగత్తులో జీవుడు ఇంకనూ అత్యల్పమైన వాడు.

శ్లో॥ ఏకో గేహేZస్తి హీ త్యుక్తం, న గణ్యన్తే పిపీలికాః
జగ్యన్మిథ్యే తి తేనోక్తం, నాత్యన్తా సదితి క్వచిత్. 12

తా॥ "ఒక్కడే ఇంట్లో ఉన్నాడు" అని చెప్పెదరు కాని, "అతనితో బాటు అతని ఇంట్లో కొన్ని తిరుగుచున్న చీమలున్నవి" అని ఎవరూ చెప్పరు. అలా, అత్యల్పమైన దానిని, ఉన్నదని, ఎవరూ వ్యవహారంలో చెప్పరు. శంకరులు జగత్తును "మిధ్య" అన్నారే తప్ప, "అసలు లేదు" అని ఎక్కడను అనలేదు.

శ్లో॥ అల్పార్థే నఞ్ యథా కన్యా, నోదరాZసత్య భావయోః
పిపీలికా ద్వితీయోన, మిథ్యా ద్వన్ద్వ విలక్షణా॥ 13

తా॥ అత్యల్పమైన దానిని అసత్యంగా, అభావంగా, పరిగణించే సంప్రదాయమున్నది. "అనుదరా కన్యా" అన్నపుడు - అనగా "ఈ పిల్ల పొట్టలేనిది" అన్నపుడు పొట్ట అసలు లేదని కాదు, "చాలా అత్యల్ప మైన పొట్ట కలది" అనియే అర్థము. ఇచ్చట నకారము అల్పార్థమున వాడబడినది. కాన, అసత్యము లేక అభావము అనగా అత్యల్పంగా ఉన్నది అనియే కాని, అసలు లేదని కాదు. అత్యల్పమైన చీమ శరీరముపైన నుండగా "మీరు ఇరువురున్నారు" అని ఎవరూ అనరు. నిజంగా మాట్లాడితే ఇద్దరు జీవులున్నారు, కాన, చీమ సత్యమే. కానీ చీమ నెవడూ లెక్కించడు కాన ఒక్కడే ఉన్నాడు" అంటారు. కాన చీమ అసత్యమే. ఇట్లు చీమ సత్యమూ అని చెప్పలేము, అసత్యమూ అని అని చెప్పలేము. కావుననే శంకరులు అట్టి దానిని మిధ్య అన్నారు. ("సదసద్విలక్షణా మిధ్యా" అని శంకరులు) మిధ్య అనగా సత్యమా? అసత్యమా? అని నిర్ణయించుటకు వీలు కాని వంటిది అనియే తప్ప అసలు లేదని కాదు.



శ్లో॥ జగ న్మిథ్యా న జీవే హి, బ్రహ్మణ్యేవ పిపీలికా
తదబ్ధి పృష దేషోZల్పః కథ మల్పం జగద్వదేత్? ॥ 14

తా॥ జగత్తుతో కూడిన బ్రహ్మము చీమతో కూడిన మానవుని వంటివాడు. కాన, బ్రహ్మము విషయములో జగత్తు మిధ్య కానీ, జీవుని విషయములో కాదు. జీవుడు ఈ జగత్తు అను చీమలోని చీమ వంటి వాడు. అనగా చీమను ఒక మహా సముద్రంగా భావిస్తే, ఆ సముద్రములోని ఒక బిందువు జీవుడు. ఇట్టి నీటిచుక్క యగు జీవుడు మహా సముద్రము వంటి జగత్తు అను చీమను అత్యల్పంగా పరిగణించి అసత్య మని ఎట్లు చెప్పగలడు?

శ్లో॥ జీవో బ్రహ్మ జగ ద్బ్రహ్మ శ్రుత మన్య త్పరం హి కిమ్?
-తథాZహం బ్రహ్మ వక్తా స్యా, త్త థాZవర్తత శఙ్కరః 15

తా॥ జీవుడు బ్రహ్మము అని శంకరులు అన్నారంటే, "జగత్తు అంతా బ్రహ్మమే" (సర్వం ఖల్విదం బ్రహ్మ) అని శ్రుతి చెప్పిన ప్రకారము, బ్రహ్మము కాని దేది? జగత్తు అంతయును బ్రహ్మమే అయినప్పుడు, జగత్తు లోని భాగము అగు జీవుడును బ్రహ్మమే కదా. తాత్వికంగా అంతా బ్రహ్మమే కదా " నేను బ్రహ్మము"అని పలుకు వాడు జగత్తును మొత్తము, బ్రహ్మముగా చూడవలెను. ఆ విధముగా శంకరులు ప్రవర్తించిరి. (వారు కల్లును,కరుగుచున్న సీసమును సమభావముతో త్రాగిరి). అనగా జగత్తు అంతయు తాత్వికంగా బ్రహ్మమని భావించ గల్గినప్పడే అందులోని భాగమైన జీవుడు తాను బ్రహ్మ మని పలుక వచ్చునే గాని, అట్టి ప్రవర్తన లేక పలుకరాదు. తాత్వికంగా జగత్తు అంతయూ బ్రహ్మమే నని వివరించితిమి గదా.

శ్లో॥ సిద్ధావిష్టావతారాణా, మహం బ్రహ్మేతి చైక్యవాక్
జీవ బ్రహ్మ హ్యుపాస్యార్థే, సామాన్యే పాపకారణమ్॥ 16

తా॥ బ్రహ్మ దృష్టిలో జగత్తు అత్యల్పము కాన మిధ్య అన్నారు శంకరులు. జీవుడే నిజంగా బ్రహ్మమైతే, అట్టి జీవునికి జగత్తు మిధ్యయే. కాని అట్టి జీవుడు ఎవరు?

అవతార పురుషుడైన నేనే. లేదా, నేను ఆవేశించిన ఒక జీవుడూ కావచ్చును. కాన, అట్టి ముక్త - సిద్ధ జీవుని గురించి జీవుడే బ్రహ్మ మన్నారు.అంటే బ్రహ్మము మనుష్యావతారమున వచ్చినపుడు లేదా బ్రహ్మము జీవుని ఆవేశించినపుడు అట్టి మనుష్యుడు బ్రహ్మమే అన్నారు శంకరులు. "అహం బ్రహ్మాస్మి" అను వాక్యము సిద్ధ పురుషుని (ఆవేశము చెందిన పురుషుడు) లేక అవతార పురుషుని అవస్థావాక్యము. ఆవేశమున, లోకంలో (పూనకమున) "నేనే భగవంతుడ" నని పలుకుట కలదు గదా. అవతార పురుషులైన కృష్ణాదులు, సిద్ధపురుషు లైన వామ దేవాదులు కూడ ఇట్లు పలికిరి గదా. ఇట్లు సిద్ధ / ఆవేశ పురుష / అవతార పురుషుల వాక్కు మాత్రమే అద్వైత బోధక మగు మహావాక్యమైన "నేను బ్రహ్మము"అను దానికి అర్థము. ఇక్కడ బ్రహ్మమునకు - జీవునకు అద్వైతము. అనగా ఇట్టి వారిని సాక్షాత్తుగ బ్రహ్మ మని ఉపాసింపుమని తాత్పర్యము. ఈ వాక్యమును సామాన్య జీవులును తమకు అన్వయించుకొని, తావేం బ్రహ్మ మనియును జగత్తు లేదనియును భావించి అన్ని పాపములను చేయ నారంభించిరి.

శ్లో॥ ప్రమాద స్సిద్ధ ధీమార్గ - భ్రంశోऽ స్మచ్ఛబ్ద తత్త్వతః
అన్తః కరణ జీవా న, చిత్తం స ప్రకృతిః పరా॥ 17

తా॥ ఇందులో మహాపాపము, తాము సిద్ధులమని భావించి, ఉపాసనను త్యజించి దైవారాధనమును మానివేసి, సామాన్య జీవులు భ్రష్టులైనారు. బౌద్ధుల నాకర్షించుటకు పలికిన వాక్యము జీవులందరినీ పాడు చేసినది. అహం బ్రహ్మాస్మి వాక్యంలోని "అహం" (నేను) శబ్దానికి శంకరులు స్పష్టంగా చెప్పిన అర్థాన్ని ఎవరూ అర్థము చేసుకొనలేదు. పంచ భూతాల శరీరము, ఇంద్రియాలు, అంతఃకరణాలు నాలుగు (మనస్సు - బుద్ధి- అహంకారము - చిత్తము) "అహం" శబ్దానికి అర్థాలు కావన్నారు. అంటే దీని అర్థము " అహం" శబ్దానికి జీవుడు అర్థము కాదనియే కదా. ఈ నాలుగు అంతఃకరణములు కాని జీవుడేడి? ఈ నాలుగు అంతఃకరణాలలోని చిత్తమే పరాప్రకృతి యగు జీవుడు గదా. (మనో - బుద్ధి - అహంకారములను అపరాప్రకృతిగాను మిగిలిన చిత్తమునే పరా ప్రకృతిగాను భగవద్గీత చెప్పినది). అంటే "అహం" శబ్దము సృష్టిని చెప్పుట లేదు, సృష్టిలోని భాగమైన జీవునీ చెప్పుటలేదు.సృష్టి మొత్తమునకు ఆధారమై సర్వత్ర అధిష్ఠానంగా ఉన్న బ్రహ్మమునే చెప్పును. అనగా జీవునికి ఆధారమైన బ్రహ్మమునే చెప్పును.



శ్లో॥ అస్మ చ్ఛబ్దార్థ దేహన్తు - సత్త్వా త్తన్వంశుకోపమః
ఉచ్యతే ధారకో లోహ - పేటికా న తమోమయః 18

తా॥ "అహం" శబ్దము శరీరానికి, అంతఃకరణాలకు కలిపి వర్తించుటయే లోక వ్యవహారం కదా అని అంటే - నిజమే - ఈ అహం శబ్దము, బ్రహ్మమును చెప్పుట అవతార సిద్ధపురుషులకే. అట్టి వారి శరీరములు శుద్ధ, సత్త్వగుణమయములై అతి పలుచని వస్త్రముల వలె నుండును. అతి పలుచని వస్త్రమును ధరించిన దేవదత్తుడు, వాని పేరుతోనే పిలువబడుచున్నాడు. పలుచని గుడ్డకుండా దేవదత్తుడు పూర్ణముగా అభివ్యక్తమగుచున్నాడు కాన పలుచని గుడ్డను పేరుతో పిలువరు. అట్లే శుద్ధ సత్త్వ శరీరము గల సిద్ధుడు ఆ శరీరధారి యగు బ్రహ్మము స్పష్టముగా అభివ్యక్తమగు చుండ బ్రహ్మ మనియే పిలుతురు. ఇదే దేవదత్తుడు ఒక ఇనుప పెట్టెలో నున్నచో "పెట్టె" అని పిలతురే కాని దేవదత్తుని పేరు నుపయోగించరు. అట్లే సామాన్య జీవులలోను బ్రహ్మమున్ననూ, వారి శరీరాంతఃకరణములు రజోగుణ తమోగుణమయములై మందమైన ఇనుప పెట్టెలవంటివి కాన బ్రహ్మము అభివ్యక్తము కాదు కాని, వారి విషయంలో "అహం" శబ్దము వారి శరీరాంతః కరణములకే వర్తించును.

శ్లో॥ అత్యల్పం బ్రహ్మదృష్ట్యైవ, జగ న్నాస్తీతి శఙ్కరః
జీవదృష్ట్యా పరౌ సత్యం, జగ దస్తీతి దుర్ధియామ్॥ 19

తా॥ అత్యల్పమును అసత్యముగా చెప్పవచ్చును. గాన శంకరులు, బ్రహ్మదృష్టిలో అత్యల్పమైన ఈ జగత్తును అసత్య మన్నారు. దీనిని జీవులు వక్ర బుద్ధితో, తమ దృష్టిలో భావించి, జగత్తు అసత్య మని పలుక నారంభించిరి. జీవునితో సమానమే కాక, నిజంగా జీవుని కన్న చాలా ఎక్కువదియగు ఈ జగత్తు సత్యమే నని రామానుజ మధ్వులు చెప్పిరి. అనగా - శంకరులే, రామనుజ మధ్వ రూపంలో వచ్చి అపార్థమును తొలగించిరి.

శ్లో॥ జగ న్నాస్తీ తి మత్వాऽ యం, పాపం కర్తుం ప్రచక్రమే
పాపం నాస్తీతి తద్దణ్డం, దద న్నాస్తీతి ధర్మరాట్॥ 20

తా॥ జగత్తు అసత్యమనుచు తలచి పాపము కూడ అసత్యమేననుచు జీవుడు పాపము చేయనారంభించెను. అట్టి జీవునకు పాప శిక్షను అనుభవింపచేయుచు శిక్షయును అసత్యమే నని యముడు బదులు చెప్పెను. పాపము ఎట్లు అసత్యమో, దాని శిక్షయును అట్లే అసత్యమని యమధర్మరాజ రూపుడైన భగవంతుడు సమాధాన మిచ్చెను.

శ్లో॥ అత్యల్పే దాహ ధర్మోఽపి, భస్మవ ద్భిద్యతే గుణః
సూక్ష్మా స్థూల జడా ద్భిన్నా, శక్తి రల్పస్థిరా యథా॥ 21

తా॥ అత్యల్పమైన ఒక చిన్న నిప్పురవ్వలో అగ్ని గుణమైన దహించు ధర్మము కూడ అత్యల్పముగ నుండును, కానీ, దాదాపు ఆధర్మము లేనట్లే అంటే - దానిని ఒక బూడిద కణముగా తీసుకొనవచ్చును. అనగా చల్లదనము అను వేరుధర్మము వచ్చినట్లు కాన భేదము ఏర్పడినది. స్థూల కణముల సంఘాతముగా నున్న ద్రవ్యము విభజింపబడి అత్యల్పమైన సూక్ష్మకణములుగా మారగా, స్థిరత్వము అను గుణము అత్యల్పమై, చలనము అను అన్యగుణము రాగా, అది శక్తి యను వేరు పేరుతో భేదమును పొందుచున్నది గదా . అట్లే, అత్యల్ప దహన గుణము కల నిప్పురవ్వ, తన కాల్చుగుణమును ప్రదర్శించలేనందున బూడిద కణముగా భావింపవచ్చును.

శ్లో॥ దాహ ధర్మేణ చైకత్వం, శఙ్కరః ప్రాహ తత్పరౌ
అత్యల్ప భిన్న ధర్మం చ, మోక్షాభావా వివేకినామ్॥ 22

తా॥ అత్యల్పమైననూ, దహించు ధర్మ మున్నది కాన, అంతా అగ్నియే తప్ప రెండవది లేదు అన్నారు శంకరులు. దీనివలన, జీవులు, ఆయన చెప్పినది అర్థము చేసుకొనక, రెండవది లేదు, కావున, "ఇక ముక్తి దేని నుండి?" అని "మోక్షమే లేదు, సాధన లేదని" అవివేకులై తలచిరి. కాన శ్రీ రామానుజ మధ్వులు, అత్యల్పమైన ధర్మమును, వేరు ధర్మముగా తీసుకొనవచ్చును, కాన అగ్ని కన్న భిన్నమైన ధర్మము కలదని స్థాపించిరి. ధర్మమనగా, ఆధారపడునది. అంతయును బ్రహ్మాధారమే కాన, జగత్తును బ్రహ్మధర్మముగా తలచిరి. కాన, శ్రీ రామానుజుల విశేషణ - విశేష్యవాదము (జగత్తు విశేషణము లేక ధర్మము. బ్రహ్మము విశేష్యములేక ధర్మి). లోకములోని ఏ ధర్మి అయినా ధర్మమే కావున, ధర్మమైన ఈ జగత్తునకు ఆధారమైన ధర్మిగా బ్రహ్మమును ప్రతిపాదించినారు.



శ్లో॥ అత్యల్ప సత్త్వ ధర్మాభ్యా, మస్తినాస్తీతి గృహ్ణతే
అత్యల్పం నాస్తి ధర్మోఽస్తి, ధర్మో నాస్తి తదస్తిచ॥ 23

తా॥ అత్యల్పమైన దాని యొక్క అస్తిత్వమును రామానుజ మధ్వులు పట్టుకొనగా, అత్యల్పమైన దానిలోని అత్యల్పమైన ధర్మము యొక్క అస్తిత్వమును శంకరులు పట్టుకున్నారు. అత్యల్పమైనది లేదు అని శంకరులు చెప్పగా, అత్యల్పధర్మమును లేదు' అని రామానుజ మధ్వులు చెప్పిరి. కాన, 'ఆచార్యులు ముగ్గురూ చేసిన పని ఒక్కటే. కాన, సారాంశము ఏమనగా- అత్యల్పమైన జగత్తు లేదు.దానిలో అత్యల్ప బ్రహ్మత్వముంది కాన, బ్రహ్మమే నన్నారు శంకరులు. అనగా ఉన్నది బ్రహ్మము ఒక్కటే, జగత్తు లేదు అని మతము. ఇక రామానుజ మధ్వమతము ఏమనగా- అత్యల్పమైననూ జగత్తు ఉంది. కానీ, దానిలోని అత్యల్ప బ్రహ్మత్వమును లేనిదానిగా పరిగణించి, బ్రహ్మ భిన్నమైన జగత్తు ఉంది అన్నారు.

శ్లో॥ అత్యల్ప మస్తి నాస్తీతి, ధర్మే వస్తుని వా హ్యుభే
మతే హ్యేకం మతం భిన్నం, విపరీతార్థవాదినామ్॥ 24

తా॥ అత్యల్పమైన వస్తువు లేదని ఒకరూ, అత్యల్పమైన వస్తువు ఉన్నదని మిగిలిన ఇద్దరూ అన్నారు. అత్యల్పమైన వస్తువులోని ధర్మము ఉన్నదని ఒకరూ, అత్యల్ప వస్తువు యొక్క ధర్మము లేదని మిగిలిన ఇద్దరూ అన్నారు. కాన ఒకచోట అత్యల్పమున్నదని సిద్ధాంతము. అదే సిద్ధాంతము మరియొక చోట అత్యల్పము లేదని చెపుతుంది. ఇదే పనిని రెండో సిద్ధాంతమూ చేస్తున్నది. అంటే తాత్త్వికంగా రెండు సిద్ధాంతాలు ఒక్కటేనని తాత్పర్యము. మరి ఎందు కిలా భిన్నములైనవి అనగా, జీవుల యొక్క విపరీతార్థముల వలన జరిగిన అనర్థములను దిద్దుటకై అట్లు కావలసి వచ్చినది. ఆయా సమయములలో జీవుల సాధన దశ ననుసరించి అపార్థములను తొలగించుటకు ఇట్లు చెప్పవలసివచ్చినది.

శ్లో॥ అద్వైత మేక ధర్మత్వా, ద్ద్వావు ర్ధర్మైక్యశేషతః
విశిష్టం ద్వైతమన్య త్స, ద్భిన్నధర్మం న తద్వపుః ॥ 25

తా॥ నిప్పురవ్వలోను మహాగ్నిలోను గల దాహక ధర్మము ఒక్కటే అగుటవలన రెండూ ఒకటేనని శంకరుల అద్వైతము. ఇక, నిప్పురవ్వ అత్యల్పమైననూ ఉన్నది. నిప్పురవ్వలోని దాహక ధర్మము అతి స్వల్పంగా ఉంది కాన, బూడిదకణంగా మహాగ్ని చుట్టూ ఉన్న బూడిద రాశియును మహాగ్ని యొక్క శరీరములోని ఒక అవయవము వంటి భాగము. ఇది విశిష్టాద్వైతము. ఇక నిప్పురవ్వ అత్యల్పమైననూ ఉన్నది. అయితే, దానిలోని దాహకగుణము చాలా తక్కువ కాన దాదాపు లేనట్లే. అంటే అది ఒక బూడిద కణంగా తీసుకొనవచ్చును. కాన, మహాగ్ని కంటే పూర్తిగా భిన్నమైన ధర్మము కలది కాన, మహాగ్ని చుట్టు ఉన్న బూడిద మహాగ్నికి శరీరము కాదు. భిన్నధర్మంతో, వేరుగా జగత్తు ఉన్నది. ఇది ద్వైత మతము.

శ్లో॥ విశిష్ట ద్వైతయోరేకా, స్ఫులిఙ్గాస్తిత్వ భస్మదృక్
చిదగ్నిత్వం త్రయే పూర్వ-ద్వయే భస్మాఙ్గ భేదదృక్॥ 26

తా॥ విశిష్టాద్వైతమున, ద్వైతమున కూడా సమానమైన అంశము ఇది - మహాగ్ని (బ్రహ్మము) కన్నా భిన్నంగా నిప్పురవ్వ (జీవుడు) ఉంది. కానీ మహాగ్ని ముందు నిప్పురవ్వలోని దాహకత్వము (బ్రహ్మత్వము) చాల చాల తక్కువ కాన లేనట్లే కావున నిప్పురవ్వ ఒక బూడిద కణమే.

అద్వైత-విశిష్టాద్వైత-ద్వైతములలో సమానాంశము ఇది :- మహాగ్నియును నిప్పురవ్వయును తాత్త్వికంగా ఒకే అగ్ని పదార్థములు. అలానే బ్రహ్మమూ, జీవుడూ చైతన్యమను పదార్థములే.

విశిష్ట ద్వైత-ద్వైతములలో భేదము :- మహాగ్ని చుట్టును ఉన్న బూడిదరాశి, మహాగ్నికి శరీరమ్ము వంటిది అని విశిష్టాద్వైతము. బూడిద రాశి, శరీరము కాదు, మహాగ్ని చుట్టు ఉన్న వేరు పదార్థము అని అంటుంది ద్వైతము.

శ్లో॥ తస్య చాఙ్గస్య దోషాణాం, దూరార్థం బుద్ధ్యపార్థతః
శక్తి స్సర్వం నవా త్తర్గా, ద్వైద్ధ భ్రష్టాయ తత్త్రయమ్॥ 27

తా॥ జగత్తు యొక్క దోషాలు బ్రహ్మమునకు అంటకుండుటకై జగత్తు (జీవుడూ - జగద్భాగమే కాన) బ్రహ్మ భిన్న మన్నారు రామానుజులు. జగత్తు దోషాలు బ్రహ్మము



యొక్క శరీరానికి అంటకుండా ఉండుటకై జగత్తు బ్రహ్మము యొక్క శరీరము కాదు వేరు అన్నారు మధ్వులు. కొందరు విపరీత బుద్ధులు చేసిన వక్రార్థాలను నివారించుటకై ఇట్లు చెప్పినారే తప్ప వారి మతముల హృదయ మొక్కటే.

ఇక, మహాగ్నియును, బూడిదయును ఒకే శక్తి యొక్క రూపాంతరములని నవీన విజ్ఞాన మతము నిరూపించి యున్నది. కాన, తాత్త్వికంగా బ్రహ్మ భిన్నమైన జగత్తు అంతయును బ్రహ్మమేనని అద్వైతము కూడ సత్యమే. బౌద్ధులను మార్చుటకై శంకరులు ఈ తాత్త్వికాంశాన్ని తీసుకొన్నారు. ఆ తరువాత, అద్వైతమతమును విపరీతంగా సమన్వయిచుకొని పాపములను చేయు ప్రబుద్ధులను మార్చుటకై అనుభవంలో వేరు వేరుగా కనపడు అగ్ని -బూడిదల భేదమును రామానుజ మధ్వులు తీసుకున్నారు.

అనగా, అగ్ని-బూడిదలు ఒకే శక్తి పదార్థమే అయినా నా విచిత్రమాయ వలన వేరు వేరు పదార్థాలుగా గోచరించుట అనుభవంలో కనపడుచున్నది.

శ్లో॥ వినా సాధన మద్వైతం, మఙ్గత్వం ధూత భిన్నవత్
సాధనా ద్వేత్తి చాత్మీయ, స్సేవకశ్చ మతత్రయే 28

తా॥ సాధన ఏమియును లేకుండగనే, జీవుడు బ్రహ్మమే ననుట అద్వైతము. సాధన ఏమియు లేకుండా జీవుడు బ్రహ్మము యొక్క శరీరావయవము అనుట విశిష్ట ద్వైతము. సాధన ఏమియు లేకుండా, జీవుడు బ్రహ్మమునకు భిన్నంగా దూరంగా ఉన్నవాడు అనుట ద్వైతము.

సాధన వలన తాను బ్రహ్మము అని జీవుడు తెలుసుకొనుట అద్వైతము. సాధన వలన శరీరము యొక్క అవయవమైన జీవుడు బ్రహ్మమునకు ప్రియమైన శరీర అవయవ మగుట విశిష్టాద్వైతము. సాధన వలన జీవుడు బ్రహ్మమునకు సేవకు డగుట ద్వైతము.

తాత్త్వికంగా సర్వమూ బ్రహ్మమే కాన జీవుడు బ్రహ్మమే. జ్ఞానము ద్వారా తాత్త్వికంగా తానూ బ్రహ్మమే నని జీవుడు తెలుసుకొనుట ద్వారా తాత్త్విక బ్రహ్మత్వమును జీవుడు పొందుచున్నాడు కాన అద్వైతము సత్యమే. అభివ్యక్తమైన శక్తి భేదము వలన జీవుడు బ్రహ్మము ముందు హస్తిమశకాంతర భేదము కలిగిన వాడు కావున విశిష్ట ద్వైత-ద్వైతములూ సత్యములే. ఆయా అంశముల సందర్భ దృష్టి భేదమే తప్ప సిద్ధాంత భేదము లేదు.

శ్లో॥ జలబిన్దు జలత్వం చ, స్ఫులిఙ్గాగ్నిత్వమస్తి సత్
ప్రలయే శక్తి భేదశ్చ, బిన్దురబ్ధి రహం సకృత్॥ 29

తా॥ ఒక నీటిబిందువు - సముద్రము- ఈ రెండింటిలో ఉన్న తత్త్వము జలమే. ఒక నిప్పురవ్వ - మహాగ్ని ఈ రెండింటిలో గల తత్త్వము అగ్నియే. ఇది ఎవడునూ కాదనలేడు. అయితే ప్రళయకాలంలో సర్వజగత్తునూ ముంచి వేయగల సాగర మెక్కడ! పడిననూ తెలియబడని నీటిబిందువు ఎక్కడ! అట్లే ప్రళయములో జగత్తును దహించే మహాగ్ని ఎక్కడ! పడిననూ తెలియని నిప్పురవ్వ ఎక్కడ! కాన,భేదమునూ ఎవ్వడూ కాదనలేడు.

ఇక అవతార పురుషునిగా ఒక చిన్న జీవునిగా కనిపించు నేను, నా విచిత్ర మాయా శక్తి వలన బిందువుగను - సముద్రముగానూ ఉన్నాను. ఈ స్వరూపములో నీయంత నే నున్నాను. కానీ, మహాశక్తి సాగరముగా కూడ ఉన్నాను.

శ్లో॥ ఊహాతీతోZ ప్యణుశ్చాద్రి, ర్భేదోZ భివ్యక్త శక్తితః
చలచిత్రే నటో హ్యేకో, నాయక ప్రతినాయకౌ॥ 30

తా॥ యధార్థముగా విమర్శించినచో, అకాశపరిమాణ నియమాన్ని అతిక్రమించిన నేనే ప్రతి అణువుగా కూడ పరిపూర్ణముగానే ఉన్నాను. అనగా - అపార పరబ్రహ్మమే ప్రతి అణువుగాను ఉండి దీనివలన బ్రహ్మము ముక్కలుగా కాకుండా ఉన్నది. మరియును అనేక బ్రహ్మములూ లేవు. ఇది ఊహాతీత విషయము. అయితే, శక్తి-అభివ్యక్తిలో తేడా వలన పర్వతము ముందు పరమాణువు నిలువలేదు. ఇది ఎట్లు అనగా- ఒక చలన చిత్రములో నాయకుడు, ప్రతినాయకుడుగను ఒకే నటుడు నటించును. నాయకుని చేతిలో ప్రతినాయకుడు ఓడిపోవును. ఒకే నటుడు నాయకుని పాత్రలో శక్తిని అభివ్యక్తము చేయుచున్నాడు. ప్రతినాయకుని పాత్రలో శక్తిని అభివ్యక్తము చేయుట లేదు. కావున ఒకని చేతిలో ఒకడు ఓడిపోవుటయూ సత్యమే ఇరువురునూ ఒకడే అగుటయు సత్యమే.

శ్లో॥ జ్ఞాన సిద్ధిః పురో బౌద్ధా, నాక్రష్టుం శూన్యవ చ్చితా
ప్రాగ్వేత్తుం శ్రవణం హ్యాద్యం, శూన్యేష్ట మవద త్తథా॥ 31

తా॥ మొదట బౌద్ధులను ఆకర్షించుటకు శంకరులు , "బ్రహ్మమును తెలియగనే బ్రహ్మమే అగునని" ఆకర్షించెను. నిరాకారమైన శూన్యము నిష్టపడు బౌద్ధులకు సన్నిహితంగా



నిరాకార చైతన్యమే బ్రహ్మ మని తెలిపెను. "సాధన లేకయే బ్రహ్మమై ఉన్నావు. ఇక తెలియుటయే మిగిలినది. తెలిసినచో బ్రహ్మ మగుదువు" అని ముందు బ్రహ్మజ్ఞానమును తెలుసుకొనుటకు ప్రోత్సహించుచూ, నాస్తికులను ఆకర్షించెను. వినని వానిని వినిపించుటయే గదా మొదటి మెట్టు. అయిననూ, శంకరులు, అబద్ధమును పలుకలేదు. అత్యల్పమును అసత్యముగా పరిగణించి, బ్రహ్మ భిన్న జగత్తు లేదని, శూన్యవాదులకు ఇష్టముగానే పలికెను. అత్యల్ప కణములోనున్న అత్యల్ప ధర్మమును ఉన్నదానిగా పలికి, దాని ద్వారా బ్రహ్మమునకు జగత్తునకు అద్వైతము సాధించి, జీవుడు బ్రహ్మమేననెను. జగత్తులోని భాగము జీవుడు కాన, జగత్తు బ్రహ్మమైన జీవుడునూ బ్రహ్మమేగదా. ('సర్వం ఖల్విదం బ్రహ్మ' అని శ్రుతి) (జగత్తు శూన్య మను వాదమును అంగీకరించి, బౌద్ధుల కిష్టుడై, నాస్తికులగు వారి చేత బ్రహ్మాస్తిత్వమును అంగీకరింప చేయుట శంకరుల భావము.)

శ్లో॥ ఆస్తికః క్రియతే లక్ష్యం, సత్యభాగేన రూపగా
శూన్యేష్టా చి న్నిరాకారా, సృష్ట్యాదే ర్బ్రహ్మ చాపరౌ॥ 32

తా॥ నాస్తికులగు బౌద్ధులను ఆస్తికులుగా మార్చుటయే శంకరుల లక్ష్యము. దానికి కావలసిన వరకు పూర్ణ సత్యములోని ఒక భాగమును గ్రహించెను. నిరాకారమే శూన్యవాదులకు ప్రియమగును కాన, బ్రహ్మము యొక్క రూపములోని చైతన్యభాగము నిరాకారము కాన, దానినే బ్రహ్మముగా గ్రహించెను. ఊహారూపమగు ఈ జగత్తును సృష్టించి, ధరించి, తనలో లీనము చేసుకొనునది. నా చైతన్యమే కాన దానినే బ్రహ్మముగా గ్రహించుట, మిగిలిన ఆచార్యులును అదే పనిని చేసిరి. (అనగా బ్రహ్మము రూపము కలిగి ఉన్ననూ బ్రహ్మము తన యొక్క అనూహ్యశక్తి వలన, ప్రతి పరమాణువూ మరల పరిపూర్ణ బ్రహ్మమై ఉన్నది కాన, బ్రహ్మము యొక్క ఊహయు పరిపూర్ణ బ్రహ్మమే. ఈ ఊహ (చైతన్యము)యే జగత్తును సృష్టించి, ధరించి, తనలో లయింప చేసుకొను చున్నది కాన, ఆ ఊహనే బ్రహ్మ మనవచ్చును. ఒకడు చేతితో పనిని చేయగా "వాడు పనిని చేశాడు" అని అంటారే తప్ప "వాని చేయి పనిని చేసింది" అనరు గదా. బ్రహ్మము యొక్క ఊహ చేసిన పనిని బ్రహ్మము చేసినదనియూ చెప్పవచ్చును.

శ్లో॥ అహం బ్రహ్మాస్మి వాక్యేన, సర్వం ఖల్వితి మద్యవత్
బ్రహ్మ త్రీణి ద్రవత్సీసం, పిబేదితి హి శఙ్కరః॥ 33

తా॥ "అహం బ్రహ్మాస్మి" (నేను బ్రహ్మమును) అని ఎవరైననూ చెప్పినచో, ఆ చెప్పిన వాడను నేనే తప్ప మరియొకడు పలుక జాలడు. ఆ వేదవాక్యమును చెప్పినవాడు "సర్వం ఖల్విదం బ్రహ్మ" (ఇదంతయూ బ్రహ్మమే) అని కూడ పలికి అట్లు ఆచరించవలెను గదా! అట్టి అచరణములో నేను బ్రహ్మము, కల్లు బ్రహ్మము , త్రాగుట బ్రహ్మమే అనియే కాక నేను బ్రహ్మము, కరిగిన సీసము బ్రహ్మము, త్రాగుట బ్రహ్మమే అని కల్లుతో భాటు కరిగిన సీసమునూ త్రాగవలయును. ఇట్లు బ్రహ్మమైన శంకరులు ఆచరించి చూపిరి గదా. అనుయాయులు సర్వం బ్రహ్మ వాక్యమును కేవలము మద్యపానము నందే ఉపయోగించిరి.

శ్లో॥ విచిత్రం పరమ వ్యోమ, యస్య బిన్దు ర్జగ చ్ఛితః
త్వన్మాత్రం త్వ త్సమక్షం చ, న భవా న్వా జగద్గతమ్॥ 34

తా॥ నాలోని ఈ "పరమ వ్యోమము" అనబడు ఆకాశము అతి విచిత్రము. జగత్తును నా ప్రక్కన పెట్టినచో, ఈ జగత్తు నాలోని చైతన్యముయొక్క ఒక బిందువు కాన, పరమవ్యోమము ముందు పరిమాణములో అత్యల్పము. నీముందు నిలుచున్నప్పుడు ఈ పరమవ్యోమము, సరిగా నీ శరీరములోని ఆకాశ మంతే యున్నది. అంతేకాదు నీ ఊహరూపమైన ఈ జగత్తులోనికి, ఈ పరమవ్యోమము, ఏవిధమైన అసత్య కల్పన లేకుండగనే ప్రవేశించగలదు. నీ శరీర మట్లు నీ ఊహ జగత్తులోనికి ప్రవేశించలేదు. నీ ఊహజగత్తు లోనికి కూడా ఈ పరమ వ్యోమము (నేను) ప్రవేశించగలదు. అనగా పరమవ్యోమము పరమ సత్యము. ఈ జగత్తులోని వ్యోమము (ఆకాశము) నీ ఊహాకాశమూ రెండూ అత్యల్ప సత్యములు అనగా దాదాపు అసత్యములే. ఈ రెండు అసత్యములలోనికి పరమ సత్యము ప్రవేశించగలదు. ఈ రెండు అసత్యములలో ఒక అసత్యము మరియొక అసత్యములోనికి ప్రవేశించలేదు.

శ్లో॥ పరిమాణాశ్రయస్వల్ప - తత్త్వం సత్యం జగత్పరమ్
పరమాణౌ చ పూర్ణోఽస్మి జీవేఽప్యద్వైత తత్త్వసత్॥ 35

తా॥ కావున ఆకాశ పరిమాణ ధర్మముపై ఆధారపడియే స్వల్పత్వము, అత్యల్ప శక్తిత్వము, మొ॥నవి జగత్తునకు సత్యములే అగుచున్నవి. నేను ప్రతి పరమాణువులో సైతము, పరిపూర్ణముగా నా విచిత్ర మాయ వలన ఉన్నాను కాన, ప్రతి పరమాణువు పూర్ణ బ్రహ్మమే కాన అద్వైతము సత్యము. ఇట్లు తాత్త్వికంగా అద్వైతము నిజమే.



శ్లో॥ అసత్యం జగతే తన్మే స్వల్పత్వా న్మే మనోమయమ్
జీవోఽపీదం తథా మత్వా, ధూతో హస్తి కరేణ హి॥ 36

తా॥ జగత్తు నాకు అసత్యము (అత్యంతము స్వల్పమైన దానిని అసత్యము గనే పరిగణింతురు కాన అసత్యము). ఈ జగత్తు కేవలము నా యొక్క మనస్సుతో నిర్మించ బడిన ఊహ మాత్రమే. జీవుడు కూడ ఈ జగత్తును అట్లే తలచినచో, ఏనుగు యొక్క తొండముచే విసరివేయబడును. అనగా ఏనుగు అసత్యమనిదాని ముందుకు పోయినచో భంగపడును. జీవుడు అసత్యము. ఏనుగు అసత్యము. అసత్యమునకు అసత్యము సత్యముకదా. కనుక ఏనుగు సత్యమైనది. అందువలన జీవుడు ఏనుగును అసత్యమని యెంచి దాని ముందుకు పోయినచో అది సత్యముగాన దానిచే విసరివేయబడుచున్నాడు.

శ్లో॥ శక్త్యభి వ్యక్తి పక్షేతు, స్వల్ప శ్చిజ్జగదఙ్గగః
సమగ్రస్య హి మే శేషో, విశిష్టా ద్వైత మస్తి సత్॥ 37

తా॥ అయితే జగత్తులోని వస్తువులలో పాత్రౌచిత్యానుసారంగా నా శక్తిని అభివ్యక్తము చేస్తాను. ఆ అభివ్యక్త శక్తిని అనుసరించి చూస్తే, ఈ స్వరూపంలో పరిపూర్ణ శక్తిని అభివ్యక్తం చేస్తాను కాన, అల్పశక్తి యొక్క అభివ్యక్తి గల జీవుడు నా తనువు వంటి చైతన్య జగత్తులో ఒక భాగమే కాన నా తనువు యొక్క ఒక అంగమే అగును కాన విశిష్టాద్వైతమూ సత్యమే. అనగా నా ఊహ జగత్తు నాకు శరీరము వంటిది. (దానికి నేను ఆధారము కాన). ఈ ఊహ జగత్తులో ఒక భాగమైన ఊహ బిందువైన జీవుడు నా శరీరములోని ఒక భాగ మగుచున్నాడు. (అనగా నా శరీరావయవము జీవుడు).

శ్లో॥ అద్వైత మపృథ క్కార్యం, విశిష్టం శేషి భోక్తృ చ
నియామక మపి బ్రహ్మ జీవస్స్విహ జగత్తనుః॥ 38

తా॥ ఒక మనుజుని (విశిష్టము) నుండి, వాని ఊహ జగత్తును (విశేషణము) వేరు చేయలేము. కాన అద్వైతము, మరియు ఊహ జగత్తు ఒకనికి శరీరము వలె చెప్పవచ్చును. ఏలనన ఆధేయ మగు ఊహ జగత్తుకు తానే ఆధారము గదా. ఊహ జగత్తును తాను భోక్తగా భోగించును కాన అది భోగ్యము. ఒకని ఇచ్ఛానుసారముగా ఊహ (శరీరము) పని చేయును. కావున జీవుడు నియామకుడు ఊహ (శరీరము)

నియామ్యము. ఇవే సంబంధాలు నాకు జగత్తుకు ఉండును.

కాన అధారాధేయ, భోక్తృ భోగ్య, శేషి-శేష సంబంధములను ప్రతిపాదించు విశిష్టాద్వైతము కూడ యధార్థమే అగుచున్నది. ఈ సంబంధములు అద్వైత విరుద్ధములు కావు. ఊహ చైతన్యము. చైతన్య శక్తియే ఘనీభవించిన జీవ శరీరము. (శరీరము - దాని ఊహ ఒకే చైతన్య స్వరూపములుగా నవీన విజ్ఞాన మత నిరూపితము). కాన,రెండింటికీ అద్వైతము, పై విశిష్టాద్వైత సంబంధములు సత్యములే. తాత్త్వికంగా పదార్థ స్వరూపంగా అద్వైతము, నా మాయా శక్తి వలన ఏర్పడిన పదార్థ భేదము వలన పై సంబంధములు సత్యములే.

శ్లో॥ న భేద ఊహ సత్త్వా చ్చ, స్వల్పా న్మిథ్యా హ్యసన్మతాత్
విశిష్ట వ్యతిరేకో న, శఙ్కరో లక్ష్మణ స్స్వయమ్॥ 39

తా॥ ఊహ, అత్యంత స్వల్పమైనప్పటికీ సత్యమే కాన, ఊహ యనగా అసత్యము కాదు. కావున శంకరుల ఊహ జగత్తు బ్రహ్మమునకు (విశేషణము) శరీరము అనుటలో రామానుజ సిద్ధాంతము విభేదించదు. రెండింటికి తేడా లేదు. శంకరులు అత్యంత స్వల్పమైన దానిని లేని దానిగా పరిగణించి, ఉన్నదీ కాదు, లేనిదీ కాదు అని మిధ్య అన్నారు. లేనిదానిగా నరిగణించకుండా, స్వల్పమైననూ ఉన్న దను అంశమును తీసుకొని జగత్తు సత్యమన్నారు రామానుజులు. రామానుజాచార్యులు సాక్షాత్తుగా శంకరుల అవతారమే. ఆ విధంగా రామానుజులు తీసుకొనుట, జగత్తు అసత్యమని పాపములను చేయు శిష్యులను సరిదిద్దుటకే శంకరులు అవతరించిరి.

శ్లో॥ అనాద్యనన్త మాకారం, విద్ధి కాన్త్యాది సావధి
చిచ్చోహశ్చ న జీవాది, సంఖ్యైవ హ్యమితం జగత్॥ 40

తా॥ నేను అనాది - అనంతుడను. ఆకారము కూడా అనాది-అనంతముగా ఉండవచ్చును. అకార మున్నది కాన అవధులుండవలె నన్నచో కాంతి మొ॥ నిరాకారములకు కూడా అవధులున్నవి కాన నిరాకారమే లేదు. అనంతుడగు నా ఈ చైతన్యము కూడ అనాది - అనంతము. దాని ఊహ యగు ఈ జగత్తు అనాది-అనంతమే. అయితే జీవుడు కాని, ఏ వస్తువైనా పరిమితులు కలదియే. ఈ జీవుల/వస్తువుల సంఖ్యలు అనాది అనంతములనియే తప్ప జీవుడు-వస్తువు అనాది అనంతము కాదు. ఈ జీవుల-వస్తువుల సంఖ్య లనంతము లగుట చేతనే జగత్తు ఆది అంతములు



గోచరించక యున్నది. ఈ జగత్తుకు ఆధారమైన నా ఊహ అనాది-అనంతము కాన, నా ఊహ నిర్మిత మగు జగత్తు కూడ అనాది-అనంతము. అంతే కాని, జగత్తు లోని ఏ భాగమూ అనాది-అనంతము కాదు.

శ్లో॥ మితవ్యక్తే రూహ సృష్టి, ర్హమితేవ మమాపి తత్
దృష్టస్య పరమార్థస్య, పరమార్థ దశా సతః॥ 41

తా॥ ఎవరైనా ఒక వ్యక్తి యొక్క ఊహ జగత్తు అద్యంతములు లేక ఉండును. కానీ ఆ వ్యక్తి పరిమితాకారముతోనే ఉండును. అట్లే నా ఈ ఊహ జగత్తు అనాది అనంతము అయినా నేను పరిమితాకారముతోనే ఉన్నాను. నీవు ఇప్పుడు చూచుచున్న ఈ పరిమిత స్వరూపమే, నీ పరమార్థ దశలోనే కాదు, నా పరమార్థ దశలోనూ సత్యమైన స్వరూపము. నేను అన్ని దశలలోను పరిపూర్ణ సత్యము.

శ్లో॥ ఇదం తే పరమార్థం చ, స్వప్నం చ వ్యావహారికమ్
ప్రవిశే న్మూల మస్మ్యన్త, ర్బ్రహ్మరూపం హి సూక్ష్మచిత్॥ 42

తా॥ ఈ పరమార్థమునకే పరమార్థమూల రూపము, నీ పరమార్థ దశలోనే కాక, నీ వ్యవహారదశలో సైతము ప్రవేశించగలదు కాన, నీ స్వప్నములలోనికి సైతము నేను ప్రవేశించగలను. ఈ నా స్వరూపమునే మూల స్వరూపము లేదా మూలము అందురు. ఈ మూల రూపములో నున్న నిరాకారమైన శక్తినే బ్రహ్మ మందురు. అదే అత్యంత సూక్ష్మకణ రూపమైన చిచ్ఛక్తి. అనగా బ్రహ్మము నిరాకార చైతన్య శక్తి స్వరూపము. ఆ బ్రహ్మమే ఈ సాకార స్వరూపము. నిరాకార జలము ఘనీభవించి సాకారమైనపుడు, మంచు కూడా జలమే కదా. ఇచట నిరాకార మనగా అవధులు లేనిది అని కాదు. మంచు స్థిరమైన అవధులు కలది కాన సాకార మందుము. జలము స్థిరమైన అవధులు లేక పాత్ర-అవధులను ఆశ్రయించిన అవధులను కలిగియుండును. అంతే తప్ప జలము నిరాకారమన్నపుడు అవధులు లేని అనంత పదార్థమని కాదు.

శ్లో॥ ఊహస్యాల్పం మితం సత్త్వం, సత్తా శక్తి శ్చ నో పరా
పూర్వాZస్తీతి మతం మాధ్వం, వస్తు భిన్నగుణం హి సత్॥ 43

తా॥ ఊహ అత్యంత స్వల్ప శక్తి స్వరూపము కాన దాని సత్త్వము అత్యల్పము. సత్త్వము అనగా అస్తిత్వము అను అర్థమే కాక శక్తియని గూడ కలదు. ఇందులో అస్తిత్వమును

అంగీకరించి, శక్తిని అభావముగా మధ్వులు పరిగణించినారు. అంటే అత్సల్పమైనది ఉన్నది కానీ, దాని శక్తి (అనగా గుణము లేక ధర్మము) లేని దానిగా పరిగణించినచో, భిన్నమైన ధర్మము గల వస్తువు ఒకటి ఉన్నట్లుగా తెలును. అనగా-అతి స్వల్పమైన నిప్పురవ్వను ఉన్నదిగా పరిగణించి, దాని లోని అత్యల్పమైన అగ్నిని లేనిదానిగా పరిగణించి, దానిని బూడిద కణంగా రామానుజ మధ్వులు భావించినారు. అత్యంత సూక్ష్మమైన నిప్పురవ్వ శరీరముపై బడినపుడు చుర్రుమనుట లేదు కాన దానిని బూడిద కణంగా భావించవచ్చును.

శ్లో॥ స్ఫులిఙ్గే దహనాభావా, ద్భిన్న వస్తుని భేదదృక్
బ్రహ్మ భిన్నౌ జగజ్జీవౌ, పరమ వ్యోమ్ని దూరగౌ॥ 44

తా॥ చిన్న నిప్పురవ్వలో నున్న దాహకత్వ గుణమును (కాల్చు గుణము) దాదాపు అభావముగా (లేని దానిగా) పరిగణించి, ఆ నిప్పురవ్వ యొక్క అస్తిత్వమును గ్రహించినపుడు, దాహకత్వ గుణము లేని, నిప్పు కన్నా, భిన్నమగు వస్తువు మరి ఒకటి ఉన్నట్లే తెలును. కాన, బ్రహ్మమునకు భిన్నమైన జగత్తు ఉన్నది, బ్రహ్మ భిన్నుడైన జీవుడున్నాడని రామానుజ మాధ్వ మతములు. ఎటూ సత్యమైన పరమాకాశ మున్నది కాన, దానిపై ఆధారపడిఉన్న వస్తువులగు జగత్తు, జీవుడు, బ్రహ్మమునకు దూరముగనే యున్నారు. అంటే శరీరము వలె, విడదీయుటకు వీలు కానివి కావని మధ్వమత భావము. ఇదే మధ్వ మతము. కుమ్మరివాడు, మట్టి వేరుగా ఉన్నట్లు రామానుజ మతంలో విడదీయుటకు వీలు కాని జీవుడు - శరీరము వలె బ్రహ్మము - జగత్తు ఉన్నవి.

శ్లో॥ శరీరే చ ఘటే చాత్మా చిచ్ఛక్తి ర్నవతర్కతః
అపదార్థాన్తరా దన్య, త్సాకాశా దపృథక్కృతమ్॥ 45

తా॥ జగత్తు బ్రహ్మమునకు శరీరము వలె విడదీయుటకు వీలు కానిదైననూ, లేక వేరుగా కుండవలె ఉన్ననూ, జీవుడూ, శరీరమూ-కుండా ఈ మూడును ఒకే చిచ్ఛక్తి పదార్థ నిర్మితములని నవీన విజ్ఞాన మతము. ఈ విధంగా అద్వైతము తాత్త్వికంగా సత్యము. మరియు జీవుడు - శరీరము - ఘటము విభిన్నములుగా నున్నవనుట సత్యమే. ఏలనన ఒక పదార్థము మరియొక పదార్థము కాదు కాన వేరుగా నున్నట్లే కదా. పదార్థముల మధ్య నున్న ఆకాశమూ చిచ్ఛక్తి స్వరూపమే కాన, పదార్థములు



విడదీయుటకు వీలు లేక అవినాభావ సంబంధము కలిగి యుండుట నిజమే. ఈ విధంగా అద్వైత - ద్వైత - విశిష్టాద్వైతములు సత్యములై అన్యోన్య విరోధము లేకయే ఉన్నవి. వేరు కాన ద్వైతము, విడదీయుటకు వీలు లేనిదిగా ఉన్నందున విశిష్టాద్వైతము.

శ్లో॥ ద్వైతం భిన్న శరీరేఽస్మి, న్విశిష్టా ద్వైతధీస్తనౌ
శరీరోహ తనౌ తత్త్వ, మేక మద్వైత వస్తుతః ॥ 46

తా॥ ఈ ప్రపంచము బ్రహ్మము యొక్క ఊహ, నశించునది కాన శరీర మనబడును. బ్రహ్మము నిత్యము కాన,ఈ శరీరము కన్న వేరు. ఇదే ద్వైతము. ఇక బ్రహ్మమన్నచో తనుస్వరూపముగా కనిపించు దత్త తను రూపమే. ఈ తనువు నశించదు. కాన బ్రహ్మము, శరీరము నశించినా, నశించుటలేదు. అయితే ఈ జగచ్ఛరీరము బ్రహ్మతనువును విడచి నిలువలేదు కాన విశిష్టాద్వైతము. ఇక శరీరము అగు ఊహ, బ్రహ్మ తనువు - ఒకే వస్తుతత్త్వము కాన అద్వైతము.

శ్లో॥ నాస్తికానాం వస్తుతత్త్వం, దూరే సఙ్కల్పవర్తినామ్
ఇచ్ఛా చిద్బ్రహ్మనిష్ఠా స్తే, బ్రహ్మ తద్భిన్న మస్తి నో॥ 47

తా॥ వస్తు స్థితి ఏమనగా- నాస్తికులగు జీవులు, నాకన్నా దూరముగా వేరుగానే యున్నారు. వారు, నా ఆధారమును అంగీకరించరు కావున వారి కన్న దూరముగ నుండి వారిని కేవలము నా సంకల్పము నాధారముగా చేసి, వారి ఇష్టప్రకారముగనే, వారిని దూరముగా ఉంచి, నిలిపి యున్నాను. అయితే నా ఆధారము లేకున్ననూ, నాసంకల్పమును ఆధారముగ చేసుకొని యున్నారు . కావున వారునూ నా ఆధారమును కలిగిన వారే. అయినా, నా సంకల్పము వారికి గోచరించదు కాన, వారు తమకు తామే ఆధారముగ ఉన్నామని భ్రమపడుచున్నారు. నా సంకల్పము చిచ్ఛక్తియే అనగా బ్రహ్మమే. వారును చిచ్ఛక్తి రూపులే కాన బ్రహ్మమే. బ్రహ్మముపై ఆధారపడనిదీ, బ్రహ్మము కానిదీ ఏదీ లేదు గదా. ("నాన్య త్కించ న మిషత్" అని శ్రుతి)

శ్లో॥ నాస్తికై ర్నిర్గుణై శ్చాహం, న లభ్యో నేష్ట రూపతః
శక్తి శ్చి జ్జడ కైవల్యా, శాక్తేయాస్తే ద్విరూపతః॥ 47

తా॥ నాస్తికులు కూడ జడశక్తి విశ్వాధారమని అంగీకరింతురు. నిర్గుణ బ్రహ్మవాదులు చిచ్ఛక్తి విశ్వాధారమని తలచెదరు. కణ స్వరూపము, తరంగ స్వభావము ఈ రెండూ

వేరు కాదని నవీనుల మతము కాన,ఈ రెండింటినీ శక్తి రూపంగా తీసుకుంటే ఇరువురూ నిరాకారవాదులే. వీరిరువురికీ నేను లభించను. ఏలనన, వారు ఆకారమును ఇష్టపడరు. వీరిరువురికీ జడశక్తి లేదా చైతన్య శక్తి రూపమగు నా సంకల్పమే అనగా శక్తియే ఆధారముగ నుండును. ఈ శక్తినే నిర్గుణవాదులు బ్రహ్మమనియు, నాస్తికులు జడశక్తి యనియు, అనుసచున్నారు. ఈ ఇరువురునూ శాక్తేయులే. ఒకరు చిచ్ఛక్తి వాదులు. మరొకరు జడశక్తి వాదులు. శాక్తేయులు కూడా, చైతన్య - జడస్వరూపంగా శక్తి యున్నదని వాదిస్తారు. నా సంకల్పమే నా శక్తి. ఆ సంకల్పానికి అధిష్ఠాన వ్యక్తిగా నేనున్నాను.

శ్లో॥ శేష భావస్య శేషోZహ, మద్వయా దిద ముత్తరమ్
ఉత్తమం ద్వైత దాసత్వం, కాలక్రమ గురు త్రయమ్॥ 48

తా॥ ఎవడు నా శరీరములో అవయవము అనగా శేషముగా నన్ను ఉపాసించునో, వాని శరీరములో హృదయావయవముగా నేనూ ఉండుచున్నాను. అనగా నేను వానికి అవయవముగా అగుచు, వానిని నా కన్నా ఎంతో అధికునిగా చేయుచున్నాను. (అనగా అవయవములు కల అవయవి, అవయవము కన్నను గొప్పది అని భావము). అద్వైత కైవల్యము నందు మేము ఇరువురము కేవలము సమానము అగుటయే కాన, అద్వైత కైవల్యము కన్ననూ ఈ విశిష్టాద్వైత కైవల్యము ఇంకా గొప్పది. నాకు దాసుడగు వాడు ఇంకనూ గొప్పవాడు ఏలననగా వానికి నేను సదా దాసుడ నగుదును కాన ద్వైతముక్తి ఇంకనూ గొప్పది. అందువల్లనే, ముందు శంకరులు తరువాత రామానుజులు, తర్వాత మధ్వులు క్రమముగా ఒకదాని కన్న ఒకటి గొప్పది యగు ముక్తిని కాలక్రమమున చెప్పిరి.

శ్లో॥ స్ఫులిఙ్గ చేతనా బుద్ధిం, జీవం మా ముచితం యతమ్
శఙ్కరః ప్రాహ పూర్ణం చ, యదహం నభసః పరః॥ 49

తా॥ జీవునికి స్వల్ప బ్రహ్మత్వమున్నది. ఈ స్వల్ప బ్రహ్మత్వము వలన జీవునకు స్వల్ప శక్తి ఉన్నది. జీవుడు, బ్రహ్మ మను మహాగ్నిలో నుండి వచ్చిన చిన్న నిప్పురవ్వయే. ఈ సృష్టిలోని ప్రతి పరమాణువూ ఒక నిప్పురవ్వయే. నిజముగా, ఈ జీవుడు "చేతనా" అను పేరుగల బుద్ధి మాత్రమే. ఈ జీవునిలో పాత్రధారిగా పాత్రౌచిత్యబద్ధుడనై నా సంపూర్ణ శక్తిని ప్రకటితము చేయకుండా పరిపూర్ణుడనైన నే నున్నాను. ఈ బుద్ధిలో



(చేతనా) అనగా జీవుడిలో నున్న నన్నే, "జీవుడు" అన్నారు శంకరులు. నేను ఆకాశ ధర్మమైన పరిమాణానికి అతీతుడను కాన "జీవుడు పూర్ణ బ్రహ్మమే" అన్నారు. పాత్రౌచిత్యం వల్ల నా సంపూర్ణ శక్తిని నేను ప్రకటించనంత మాత్రమున, నేను అశక్తుడను కాను గదా. అట్టి అవస్థలోనూ నేను పూర్ణబ్రహ్మమునే గదా. ఆకాశ పరిమాణము నాలో వర్తించదు కావున, స్వల్ప పరిమాణము కల జీవుడిలోనూ మహా పరిమాణము గల విశ్వంలోనూ విచిత్ర తత్త్వము గల నేను పరిపూర్ణుడుగనే యున్నాను. కాన, జీవుడు అనగా నేనే ఎక్కడ వున్నా పూర్ణ బ్రహ్మమే కదా.

శ్లో॥ జీవో జీవ న్జీవయతి, సూర్య దీప్త మణి స్సమః
భిన్న స్సామ్యార్థ బుద్ధి శ్చ, స బ్రహ్మ తౌ ధియం విదుః॥ 50

తా॥ ఇక్కడ "జీవుడు" అనగా - జీవించు వాడు మరియు జీవింప చేయువాడు అని రెండు అర్థములు కలవు. ఇవి నిజముగా పరమాత్మకు వర్తించును. బ్రహ్మమే జీవము. బ్రహ్మమే అన్ని ప్రాణులను జీవింప చేయుచున్నది. బ్రహ్మము చేత జీవింపబడిన బుద్ధి (చేతన) స్వయముగా జీవించుచూ, ఈ దేహమును జీవింప చేయుచున్నది కాన, బుద్ధి లేక చేతన కూడా జీవుడే అనబడుచున్నది. అయితే బ్రహ్మము స్వతంత్ర జీవుడు. బుద్ధి బ్రహ్మాధీనమైన జీవుడు. సూర్యుడు స్వయం ప్రకాశ స్వతంత్రుడు. సూర్య దీప్తమైన స్ఫటికము కూడా ప్రకాశించును కానీ స్వతంత్రము కాదు. స్వయంప్రకాశమూ కాదు.అయితే సూర్యుని వలె స్ఫటికము కూడ స్వయముగా ప్రకాశించు చున్నట్లు కనపడును. సూర్యుడు స్ఫటికమును వలె, స్ఫటికము కూడ ఇతర వస్తువులను దీపింప చేయును. కాన స్ఫటికము కూడ సూర్యునితో సమానముగా కనిపిస్తున్నా, సూర్యుని కన్నా నిజముగా భిన్నమైనది. సమానార్థకంలో బుద్ధిని కూడా జీవుడనవచ్చును. ఇక్కడ జీవ శబ్దమును బుద్ధిలో నున్న బ్రహ్మమునకు శంకరులు తీసుకున్నారు. రామానుజ మధ్వులు, జీవ శబ్దాన్ని, సమానార్థంలో ప్రవర్తించిన బుద్ధిగా తీసుకున్నారు.

అనగా సూర్యుడు, స్ఫటిక ఉపమానములో: స్ఫటికము సూర్యునితో సమానముగా కనిపించినా, సూర్యుని కన్నా భిన్నమే కదా! అట్లే బ్రహ్మము బుద్ధులలో నుండి, బుద్ధి బ్రహ్మము వలె కనిపిస్తున్నా బ్రహ్మము కంటే భిన్నమే! జీవశబ్దార్థమును, శంకరులు - బుద్ధి లో నున్న బ్రహ్మమును తీసుకొనగా దానిని రామానుజ మధ్వులు - బుద్ధిగానే తీసుకొన్నారు అని భావము.

శ్లో॥ యన్త్ర దృశ్య తరఙ్గాఙ్గ-చేతానాZZకాశ ధర్మగా
చైతన్యం చేన్న త ద్బ్రహ్మ, ధర్మాతీతం తు తద్భవేత్॥ 51

తా॥ ఈనాడు యంత్రములలో తరంగాకారమున కనపడు చేతన, ఆకాశ ధర్మమైన పరిమాణమునకు లొంగియున్నది - అనగా ఆకాశములో తరంగాకారమున ఉన్నది. అట్టి చేతనయే జీవుడు. ఈ చేతననే చైతన్య మన్నచో, చైతన్యము బ్రహ్మము కాదు. చైతన్యము, ఆకాశమునకు అతీతమైనది అనగా బుద్ధికి అందనిది అన్నచో, అప్పుడు చైతన్యమును బ్రహ్మ మనవచ్చును. కాన చైతన్యశబ్దమును అర్థవిచారణతో ప్రయోగించవలెను.

అనగా - చేతనను జీవుడంటే, చైతన్యము బ్రహ్మము. చేతననే చైతన్యమన్నచో చైతన్యము కాని బ్రహ్మ మున్నది. ఉన్నవి రెండు:- చేతన-బ్రహ్మము. చేతన యంత్రాలలో కనపడును. బ్రహ్మము సిద్ధుల అనుభవైక లభ్యము. ఈ రెండింటిలో ఏదో ఒక దానివే చైతన్యము లేక జీవుడు అనవలెను.

శ్లో॥ కేచి త్పరిమితా న్భిన్నా, నిచ్ఛంతో వేషధారిణః
తథా స్యాం తావ దజ్ఞా హి, పరబ్రహ్మణ్య దర్శనాత్॥ 52

తా॥ ఇక, పరిమితాకారమగు ఈ రూపమును అంగీకరించియు, నన్ను భిన్న భిన్నవేషములలో కొందరు ఇష్టపడుదురు. వారికి, అయా వేషాలలోనే నేను విశ్వాధారముగా లభిస్తాను. ఇంతవరకూ పరబ్రహ్మమైన నన్ను గుర్తించని వారే కావున వీరందరునూ అజ్ఞానులే. అనగా బ్రహ్మమును గుర్తించు జ్ఞానము లేని వారు. ఇతర దేవతోపాసకులందరును బ్రహ్మమైన నన్ను గుర్తించలేనందున బ్రహ్మజ్ఞాన హీనులే.

శ్లో॥ శ్రుతేః ప్రత్యక్ష శాస్త్రాచ్చ, తపసా బ్రహ్మ పశ్యతి
యో విశ్వాసీ తదాధార,స్తద్విష్ట స్సోZహ మద్వయః 53

తా॥ వేదవాక్య ప్రమాణముననుసరించి, ప్రత్యక్ష ప్రమాణముపై ఆధారపడిన తర్క శాస్త్రము ననుసరించియు, తపస్సు చేత, నా ఈ పరబ్రహ్మ స్వరూపమును దర్శించి విశ్వసించిన వాడికే నేను విశ్వాధారముగా లభిస్తాను. నాపై శ్రద్ధ పెరిగిన కొలదీ, వాని లోనికి ప్రవేశించి వానిని పూర్తిగా ఆక్రమిస్తాను. వాడే నేను అవుతాను. ఇదే అద్వైత కైవల్యము.



శ్లో॥ గ్రామ దేశ పతీ పత్యా, గృహ్యేతే పురుషాత్మవత్
స మా ముపాధి మన్యో చ, సత్యమానే యథోహయోః 54

తా॥ పల్లెరాజు, దేశరాజు అన్న శబ్దాలలో రాజు అనగా గ్రామాధికారి లేక దేశాధికారి కావచ్చును. ఒకే శబ్దమునకు అనేకార్థములున్నప్పుడు, ప్రకరణ సందర్భాన్ని పట్టి ఆయా అర్థాలను తీసుకోవాలి. కాన, "జీవుడు" "పురుషుడు" "ఆత్మ" మొ॥ శబ్దాల వ్యుత్పత్త్యర్థాల ప్రకారము జీవుడికి బ్రహ్మమునకూ వర్తిస్తాయి. పెద్ద వస్తువులోనూ, చిన్న వస్తువులోను నేను పరిమాణాతీతుడను కాన పూర్ణంగా ఉన్నాను కాన, పెద్ద వస్తువులో, చిన్నవస్తువులో, నేను ఒక్కడినే అని శంకరుల అర్థము. ఇక్కడ పెద్ద వస్తువూ, చిన్న వస్తువూ తాత్త్వికంగా బ్రహ్మమే అయినా, విచిత్రం వల్ల కల్పించబడిన భేదం వల్ల, అత్యల్పము కాన, దాదాపు అభావంగా (అనగా అసత్యంగా) శంకరులు తీసుకున్నారు. ఈ రెండు వస్తువులూ ఆకాశ పరిమాణమునకు లొంగినవి. కాన, భేద మున్నది. కాన ఈ రెండు వస్తువుల భేదమునే రామానుజ మధ్వులు తీసుకున్నారు.

శ్లో॥ ఊహాZ సన్మతిరద్వైతే, పురగేహ ద్వయే విశః
ఊహ సద్వైత మల్పేZపి, భేదే చౌపాధికే సతి॥ 55

తా॥ రామానుజ మధ్వులు జీవేశ్వర భేదమును తీసుకున్నారు. వారు అత్యల్పమైనా వస్తువును సత్యంగానే పరిగణించారు. ఒకే వ్యక్తి ఒకే పెద్ద నగరమును ఊహించి, అందులో తానున్నట్లు భావించుచున్నాడు. అదే వ్యక్తి చిన్న గృహమును ఉహించి దానిలో తానున్నట్లు మరొక సమయమున భావించు చున్నాడు. రెండు ఊహలలోనూ ఉన్న వ్యక్తి ఒక్కడే అని చెప్పనదే అద్వైతము. అద్వైతంలో మరియొక అంశము ఏమనగా వ్యక్తితో పోల్చినపుడు, అత్యల్ప మైన ఊహ దాదాపు లేనట్లే కాన, ఊహను అసత్యంగా తీసుకొని మిధ్య అనుట. (మిధ్య అనగా, గట్టిగా ఉన్నది అనుటకు వీలు లేదు - గట్టిగా లేదు అనుటకు వీలు లేదు) ఇక మిగిలిన రెండు మతాలు చెప్పేది ఏమనగా - ఊహ కూడ సత్యమే. ఏలననగా ఊహ చైతన్య శక్తి యగు మనస్సు యొక్క నిర్మాణమే. సత్యమే అని తీసుకోవాలి. అయితే వ్యక్తి లాగా నిత్యము నిలచుటలేదు కాన అనిత్యము అనవలయును. మరియు ఊహ, సత్యమైన పదార్థమైనపుడు ఒక ఊహ నగరము ఒక ఊహ గృహము-ఈరెండింటికి పదార్థ పరిమాణ భేద మున్నది. కాన ఊహ మహానగరంలో ఉన్న వ్యక్తికి , ఊహ గృహంలో ఉన్న వ్యక్తికి భేదమున్నది. ఈ భేదానికి

కారణము సత్యమైన గృహము - సత్యమైన నగరము. ఈ ఉపాధులు రెండూ సత్యములు కావున భేదము కూడా సత్యమైనది.

శ్లో॥ బాష్పభేదేZపి పాత్రామ్బు - సామ్యం ప్రత్యక్షవాదయోః
విచిత్రం బ్రహ్మ శబ్దార్థా, త్పాత్రం బాష్పద్వయం సకృత్. 56

తా॥ అయితే, ఒక బిందెడు నీరులో నుండి ఒక చిన్న గ్లాసు నీరు ఆవిరియై బిందెడు నీరును ఆవరించియున్నది. అదే ప్రమాణంలో నీరు గల మరొక బిందెడు నీరు నుండి ఒక పెద్ద చెంబు నీరు అవిరియై రెండవ బిందె నీటిని ఆవరించియున్నప్పుడు ఈ రెండు బిందెల నీరు, ఆవిరి కలుపుకొని చూస్తే రెండూ సమానమే అయినా, బిందెలలోని నీరు ప్రమాణములు వేరుగా ఉంటాయి. అంటే గ్లాసు నీరు ఆవిరి అయిన బిందెలో నీరు ఎక్కువగను, చెంబునీరు ఆవిరి అయిన బిందెలలో నీరు తక్కువగను ఉంటుంది. దీని ప్రకారంగా- విశ్వంలో నున్న బ్రహ్మము తక్కువ, జీవుడిలో నున్న బ్రహ్మము ఎక్కువ ఉంటుంది. కానీ, ఇది నిజము కాదు. జీవుడి (బుద్ధి) లోను విశ్వంలోను ఉన్న బ్రహ్మము సమానమే, ఒక్కటే కానీ, జీవుడూ (బుద్ధి) విశ్వమూ పరిమాణంలో తేడా గలిగి ఉన్నవి, అనుట ప్రత్యక్షము. అంటే-ఈ ఉపమానము, బ్రహ్మము విషయంలో సరిపోదు. ఏలననగా - రెండు బిందెలలోను నీరు సమాన ప్రమాణముగానే యున్నది. అదే సమయములో ఒక బిందె నుండి గ్లాసు నీటి ఆవిరి, మరియొక బిందె నుండి చెంబు నీటి ఆవిరి బయటకు వచ్చి, బిందెలను ఆవరించి యున్నవి. ఇదే బ్రహ్మము యొక్క విచిత్ర తత్త్వము. ఇదే బ్రహ్మము యొక్క మాయా శక్తి. బ్రహ్మము యొక్క విచిత్ర తత్త్వాన్ని పూర్తిగా అంగీకరిస్తే, అటు ప్రత్యక్షంగా కనిపించే ఆవిరుల భేదము, ఇటు వేదోక్తి ప్రకారముగా రెండు బిందెలలోను సమాన ప్రమాణంలో నీరు ఉండుట సమన్వయమగుట జరుగును. బ్రహ్మము యొక్క విచిత్ర తత్త్వాన్ని అంగీకరించక పోతే, అటు ప్రత్యక్షమో, ఇటు వేదమో, ఏదో ఒకటి అసత్య మగును. అలా కాక ఏదో ఒక రీతిలో బ్రహ్మము యొక్క తత్త్వము తర్కమునకు లొంగి, మనకు అర్థమగుట వలన, బ్రహ్మము గొప్ప తనము పోయినందున అట్టి వస్తువు బ్రహ్మమే కాక పోవును. (బ్రహ్మ మనగా ఊహలకు అందని గొప్పతనము కల వస్తువు) ఇక్కడ ఉపమానంలో రెండు బిందెలను తీసుకున్నాము కాన రెండు బ్రహ్మములు వేరుగా లేవు. అంటే ఒకే బిందెలోని నీరు, ఒకే సమయమున గ్లాసు నీటి ఆవిరితోను, చెంబు



నీటి ఆవిరితోను ఆవరింపబడియున్నది.ఇది ఇంకనూ విచిత్రము కాన బ్రహ్మ శబ్దము, బ్రహ్మములో సార్థకమగుచున్నది.

శ్లో॥ ఉభయో ర్నియత శ్చైషో, బాహ్య శ్చోహాత్మకో ఘటః
అత్యల్పా భావ మిథ్యా చ, గుర్యు త్రయ మతం సమమ్॥ 57

తా॥ రామానుజమతంలో జీవుడు నా చే నియమింపబడి నా నుండి వేరు పరచుటకు వీలు కాని వాడు, నా శరీరావయవము వంటి వాడు. మధ్వమతంలో జీవుడు నా కన్నా వేరుగా ఉండి నా చేత నియమించబడువాడు. అనగా ఉ॥ కుమ్మరివాడు, కుండ వలె వేరుగా ఉండటము. ఈ రెండు కూడ ఒకే అర్థము. నీ ఊహను నీ నుండి వేరు చేయలేము కాన ఊహ నీ శరీరము వంటిదే. అయితే, నీ కన్న భిన్నంగా, నీకు బాహ్యంగా ఒక కుండను ఊహించినావనుకో, అకుండ నీ కన్నా భిన్నంగా బాహ్యంలోనే ఉంది. నీ ఊహాత్మకమైన కుండ నీచేత నియమించబడునదే కదా. ఇందులో ఇరువురికి భేదము లేదు. ఇక,శంకర మతంలో ఊహాత్మకమైన కుండ, కేవలము నీ ఊహయే, అత్యల్పము కాన దాదాపు లేని వంటిదే కాన మిధ్యయే. కాన, ముగ్గురి మతమూ ఒక్కటియే.

శ్లో॥ శూన్యేష్ట బ్రహ్మ బోధాయ, జగతో బ్రహ్మ గమ్యతామ్
ఇతి మిథ్యోచ్యతే తేన, హన్త! పాప మసత్కృతమ్॥ 58

తా॥ జగత్తును మిధ్య అన్నారే కాని, అభావము అనలేదు శంకరులు. మిధ్య అనగా దాదాపు అభావంగా పరిగణించబడినది. ఇలా ఎందుకు తీసుకున్నారంటే అప్పటి బౌద్ధులకు ఇష్టమైన శూన్యవాదమునే ప్రతిపాదించి వారల కిష్టులై, చల్లగా బ్రహ్మమును ప్రతిపాదనము చేయుటలో వారిని వినిపించుటకే. అంతే కాక, సాధకుడు జగత్తును మిధ్యగా భావించి జగత్తు వైపు కాక, తన బుద్ధిని బ్రహ్మముపై కేంద్రీకరించునని సత్సంకల్పముతో ఈ అంశమును ప్రతిపాదించెను. కాని జీవులు దీనికి వక్రార్థమును కల్పించి, జగత్తు అసత్యము కాన, వారు చేయు పాపములు కూడ అసత్యము లేనని, పాపములను చేయ నారంభించిరి.

శ్లో॥ శివో విష్ణు స్స దుష్టార్థ - హరో మిధ్యాZప్యస న్నతత్
సదనిత్య మితి ప్రాహ, వికారా స్స్పృష్ట మత్ర చ॥ 59

తా॥ ఈ అపార్థమును పరిహరించుటకై, శంకరులే రామానుజులుగా అవతరించెను. మొదటి అవతారములో శివరూపంతో నున్నారు కాన, ఇప్పుడు విష్ణురూపంలో గోచరించారు. జగత్తు మిధ్య అనగా అసత్యము కాదు సత్యమేననియు, పరిణామము చెందుట వలన అనిత్యమనియు చెప్పినారు. అయితే ఈ పరిణామ వికారము లన్నియు, శరీరము వంటి జగత్తులోనే తప్ప, ఆత్మ వంటి బ్రహ్మము నకు అంటవని చెప్పినారు. శంకరులు ఎటూ జగత్తును దాదాపు అసత్యముగా పరిగణించారు కాన, జగత్తులోని వికారాలు బ్రహ్మమునకు అంట వన్నారు.

శ్లో॥ సాపేక్ష నిత్య ఆత్మా హి, శరీరే వస్త్ర ధర్మవత్
స్థితప్రజ్ఞో న మూఢోZత్ర, న వాద్వైకత్వ మేతయోః॥ 60

తా॥ శరీర మనగా నశించునది. ఆ శరీరమును వ్యాపించి, దానిని ధరించు ఆత్మ శరీరము కన్నను నిత్యము. శరీర ధర్మములు ఆత్మకు ఎలా అంటవు? అనగా వస్త్ర ధర్మములు శరీరమునకు అంటని విధంగా, జ్ఞానియైన స్థితప్రజ్ఞునకు శరీరమునకు సంబంధించినవి ఏవియును అంటుటలేదు. కావున స్థితప్రజ్ఞుడు (ఆత్మ)వాని శరీరమును ఇక్కడ ఉపమానంగా తీసుకోవాలి కానీ, శరీర ధర్మాలను ఆత్మకు ఆరోపించుకొని పొంగు, క్రుంగు మూఢుని ఉపమానంగా తీసుకోరాదు. ఇక, చైతన్యశక్తి స్వరూపమైన ఆత్మ - ద్రవ్యస్వరూపము అయిన శరీరము ఈ రెండూ తాత్త్వికంగా ఒక్కటేనని నవీన శాస్త్రజ్ఞుల విజ్ఞాన మతము ఎటూ నిరూపిస్తున్నది కావున అద్వైత - విశిష్టాద్వైతముల భేదము రాదు.

శ్లో॥ స్వరూపం వికృతం మూఢాః, ప్రాహు ర్బ్రహ్మZబ్రవీత్పరమ్
శరీరవ చ్ఛరీరం న, భోగ్య వస్తు యతంత్వితి॥ 61

తా॥ కొందరు పండితం మన్యులు, జగత్తుల వికారాల వల్ల బ్రహ్మము యొక్క శరీరములోని అవయవాలు వికారము చెందుటవలన బ్రహ్మము యొక్క స్వరూపమునకు వికారాలు వచ్చినవని ఆక్షేపించినారు. అప్పుడు బ్రహ్మరూపంలో రామానుజులే మధ్వులుగా అవతరించినారు. ఈ జగత్తు శరీరము వలె బ్రహ్మముపై ఆధారపడినదే నన్న భావమును అపార్థము చేసుకొన్న జీవులకు, ఆ అపార్థము మరల రాకుండా బ్రహ్మమునకన్నా భిన్నమైనది జగత్తు శరీరము కాదనియు కుమ్మరి వాని



కన్న వేరగు కుండ వలె అనియు, కేవలము ఆధారపడి శాసింపబడునట్టి ఒక భోగ్య వస్తువేననియు ప్రతిపాదించవలసిన అవసరము వచ్చినది కాన అట్లు చెప్పినారు.

శ్లో॥ స్ఫులిఙ్గాగ్ని సమత్వం మే, వ్యోమాతీత స్స తస్యతు
ధీజగద్వ్యోమ భేదోZస్తి, స్వల్పాభావోZస్తి మే న తే॥ 62

తా॥ నేను పరిమాణమునకు అతీతుడను కావున మహాగ్ని గాను, నిప్పురవ్వగాను ఒకే సమయమున ఉండగలను. ఇక్కడ మహాగ్ని-నిప్పురవ్వ కేవలము బ్రహ్మము నందే అన్వయించినపుడు శంకర మతము. ఈ మతము నా దృష్టిలో అనగా పరమార్థ దశలో చెప్పబడినది. కాని జీవుని దృష్టిలో చెప్పినప్పుడు జీవుడు పరిమాణమునకు లొంగినవాడు కావున వ్యవహార దశలో చెప్పవలెను. అప్పుడు బ్రహ్మముపై ఆధారపడిన బుద్ధిని (అనగా జీవుని)-జగత్తును పోల్చినపుడు చాలా పరిమాణ భేదము కలదు. అయితే ఈ బుద్ధి జగత్తులు రెండు నాతో పోల్చినప్పుడు చాలా అల్పములు కాన దాదాపు అసత్యములే. అంటే, నా దృష్టిలో బుద్ధి, జగత్తు దాదాపు అసత్యములే కాన లేవు. అంటే ఆకాశము దాని పరిమాణ గుణము అసత్యమే అయినది. మిగిలినది నిప్పురవ్వ - మహాగ్నియే అనగా నేనే. ఇప్పుడు పరిమాణము యొక్క ప్రశ్నయే లేదు. కావ నిప్పురవ్వయే (జీవుడు) మహాగ్ని (బ్రహ్మము). నా పేరే జీవుడు - నా పేరే బ్రహ్మము. అనగా శేషించిన వస్తువు పరమార్థ దశలో అంటే నా దృష్టిలో ఒక్కటియే కాన అద్వైత సిద్ధి. అయితే ఇది జీవుని దృష్టిలో కుదరదు కాన జీవోపదేశమగు శాస్త్రమున చెప్పరాదు అని రామానుజ - మధ్వుల మతము.అట్లు చెప్పినందున జీవులు దానిని వక్రముగా సమన్వయించుకొని భ్రష్టులైనారు.అయితే, బౌద్ధులను సన్మార్గమున పెట్టుటకై ఆనాడు శంకరులు పరమార్థ సత్యమును చెప్పవలసి వచ్చినది. కాన, ముగ్గురిలో తాత్పర్య భేదము లేదు.

శ్లో॥ మద్భిన్న తత్కణా భేద, స్స్వల్పా భావా దహం మహాన్
విశ్వాణు ర్మాయయాZతీతః, పూర్ణోZబోధ్యోZల్పగాల్పగైః 63

తా॥ పరమార్థదశలో మరొక విధంగా కూడా బుద్ధికీ (జీవుడు) జగత్తుకూ అభేదాన్ని చెప్పవచ్చును. ఈ జగత్తు అంతా నాలో (నా పరమ వ్యోమంలో) ఒక బిందువు. జగత్తు నాతో పోల్చినపుడు దాదాపు ( అత్యల్పం కాన) అసత్యంగా పరిగణిస్తే, ఇక దానికి

దానిలోని ఒక చిన్న బిందువైన బుద్ధికి గల భేదం కూడా అసత్యంగా పరిగణించటంలో అభ్యంతరమేమున్నది? ఆ విధంగా కూడ బుద్ధి జగత్తులు అసత్యాలే అయినపుడు మిగిలినది నేను ఒక్కడినే. నేను అనగా నా పరమ వ్యోమము అనగా నా శరీర పరిమాణాకాశము. ఈ జగత్తు కన్నా ఎన్నో రెట్లు పెద్దది. అయితే ఈ పరమవ్యోమానికి ఉన్న విచిత్ర మాయా శక్తి (అనూహ్యత)వల్ల తనలోని ఒక బిందువగు ఈ మహాజగత్తులోని ప్రతి పరమాణువు లోనూ తాను (నేను) పరిపూర్ణంగా ఉంది. అదే సమయంలో ఈ మహా జగత్తులోను పరిపూర్ణంగాఉంది. అదే సమయంలో ఈ మహా జగత్తును అతిక్రమించియు పరిపూర్ణంగా ఉంది. ఇది నీ కెంత బోధించినా, నీ వెంత ప్రయత్నించినా నీ ఊహకు చిక్కదు. దీనికి కారణము నా పరమ వ్యోమదృష్ట్యా అనగా నాకు పరమార్థ దశలో నీవు నాకన్నా ఎంత అల్పుడివో ఆలోచించుము. ఈ మహా జగత్తే నా ముందు ఎంత అల్ప మంటే, ఇది ఉన్నా దాదాపు లేనట్లే అంటే, ఇక ఈ మహా జగత్తులో నీ వెంత అల్పుడి వంటే, దీనిముందు నీవు ఉన్నా దాదాపు లేనట్లే. ఇక నీవు నా ముందు ఎంత అల్పాల్పమో ఆలోచించుము. ఈ జగత్తులోని జీవులంతా కలిసినా నా ముందు ఒక బిందువుగా అల్పంగా ఉన్నందున నన్ను అర్థము చేసుకొనలేరు. వారిలో ఒకడైన నీవు నన్నేమి అర్థముచేసుకొనగలవు? ( దీనినే శ్రుతి వాక్కు "మనస్సు బుద్ధికి అందదు" అని చెప్పినది). జీవులు జగత్తునే పూర్ణముగా అర్థము చేసుకొనలేరు. ఇక నన్నేమి అర్థము చేసుకొనగలరు?

శ్లో॥ వ్యవహారే ధియం చాస్మ - చ్ఛబ్ద స్స్పృశతిమాం న తు
అవిష్టోZహం బ్రహ్మకథం, భిక్షుర్భూపోZ హ మిత్యేతః? 64

తా॥ ఇక వ్యవహార దశలో-జీవుడిలో అనగా బుద్ధిలో నున్న నేను బుద్ధికి అందుట లేదు. కాన జీవుడు (బుద్ధి) "నేను" అని సంభోదించుకొన్నది తననే కాని, నన్ను కాదు. ఆ "నేను" నన్ను స్పృశించదు. అయితే, నేను ఆ బుద్ధిని అక్రమించి ఆవేశించినపుడు ఆ బుద్ధి ద్వారా నేనే మాట్లాడుదును. అప్పుడా జీవుడు (బుద్ధి) చెప్పే "నేను" అను శబ్దము నన్నే చూపును. అనగా ఆ మాట్లాడు వాడను నేనే కావున అటువంటి సమయంలో బాహ్యమైన శరీరమును చూచి ఇతడు మానవుడని జనులు భావింతురు. కాన, నేను ఈ మానవుడను కాను "నేను" బ్రహ్మమును (అహం బ్రహ్మాస్మి) అను శ్రుతి సందర్భము- ఆ సందర్భము కాక ప్రతి మానవుడూ "నేను బ్రహ్మమును" అనుచో, ఆ మాట్లాడు జీవుడు (బుద్ధి) నేను కాదు 'కావున



హాస్యాస్పదమగును. కాన, సిద్ధావస్థ వాక్యమును సాధకుడు తనకు సమన్వయించుకొనరాదు. "నేనే రాజును" అని రాజు అన్నాడు. "నేను బిచ్చగాడిని" అని ఒక బిచ్చగాడు అన్నాడు. ఇప్పుడు బిచ్చగాడు పై వాక్యములో నున్న "నేను" అను శబ్దము తన వాక్యంలో కూడ ఉన్నది కావున "నేను రాజును" అనుకుంటే ఎలా కుదురు తుంది?

శ్లో॥ అస్మత్సంబన్ధ తత్త్వాగ్ని, బ్రహ్మత్వం భేద కల్పనమ్
సత్యం జీవస్య తత్కాల, స్థితావద్వైత విభ్రమాత్॥ 65

తా॥ ఈ "నేను" అను శబ్దము బుద్ధికీ, బ్రహ్మమునకు గల సంబంధమును సూచిస్తుంది. ఈ బుద్ధికూడా తత్త్వ పరంగా బ్రహ్మమే. కానీ, విచిత్రమైన బ్రహ్మము తన మాయా శక్తి వలన, బ్రహ్మము లేని పదార్థమైన శూన్యమును (అకాశము) సృష్టించినది. విచిత్రము కావుననే ఆ శూన్యము శూన్యమయ్యును అదే సమయమున బ్రహ్మము. ఈ శూన్యము వలన బ్రహ్మము ఒక మహాగ్ని గాను, చిన్న నిప్పురవ్వగాను గోచరించినది. దీని వలన సాంద్రత గల బ్రహ్మము, సాంద్రత తక్కువైన జీవుడు (బుద్ధి) వేరుగా గోచరించినారు. ఇప్పుడీ మహాగ్ని ముందు జీవుడు పోల్చబడినచో చాలా అత్యల్పుడు కాన బ్రహ్మము కాడు. విచిత్ర శక్తి వలన బ్రహ్మము పరిపూర్ణంగా నిప్పురవ్వలోను, మహాగ్నిలోనూ అధిష్ఠానంగా ఉంది. బ్రహ్మము మహాగ్నిగాను నిప్పురవ్వ గాను గోచరించుటయూ సత్యమే. నిప్పురవ్వకూ, మహాగ్నికీ ఎంతో భేదముండుటయూ సత్యమే .నిప్పురవ్వలోను మహాగ్నిలోను తాత్త్వికముగా ఒకే బ్రహ్మత్వము (అనగా అగ్నిత్వము) ఉన్నది కాని ప్రమాణంలో భేద మున్నది. భేదము బ్రహ్మము యొక్క మాయా శక్తి విచిత్ర కల్పనము. అయితే ఈ కల్పనము బ్రహ్మమునకు బ్రహ్మదృష్ట్యా అసత్యమైననూ, జీవునకు పరమార్థ పరమ సత్యము కాన, అసత్యమను మాటయే జీవునకు అనవసరము కావున ఈ అంశముపై రామానుజ, మధ్వులు నిలబడినారు. అద్వైతము వలన కలిగిన అపార్థముల వలన ఈ విధంగా నిలబడవలసిన కాలావసరము ఏర్పడినది. జీవుడు, నేను ఆవేశించకుండగనే, "నేను బ్రహ్మమును" (తత్త్వపరంగా కాకుండ) అధిష్ఠాన పరంగా చెప్పటంతో అపార్థము మొదలైనది.

శ్లో॥ బ్రూయా దహమపి బ్రహ్మ, సర్వం సత్వం చిదిత్యపి
అహమేవేత్యహం బ్రూయాం, మిథ్యా నాసత్య మల్పసత్॥ 66

తా॥ ఇదంతయు బ్రహ్మము (సర్వం ఖల్విదం బ్రహ్మ), నీవు బ్రహ్మము (తత్త్వ మసి) వాడు బ్రహ్మము (అయమాత్మా బ్రహ్మ) చైతన్య మంతా బ్రహ్మమే (ప్రజ్ఞానం బ్రహ్మ) మొ॥ శ్రుతులు తాత్త్వికంగా జగత్తు అంతా బ్రహ్మమే నని చెప్పుతున్నది. ఈ జగత్తులో ఒక భాగము అగు జీవుడు (బుద్ధి) కూడా బ్రహ్మమే కాన నేను బ్రహ్మము (అహం బ్రహ్మాస్మి) అనుచున్నాడే తప్ప, తానొక్కడే బ్రహ్మమనియు, ఈ మిగిలిన జగత్తు బ్రహ్మము కాదు అని కాదు, కానీ ఈ విధంగా అపార్థము వచ్చినది. తానొక్కడే బ్రహ్మము అనియూ, జగత్తు మిథ్య అనియు అవతార పురుషుడగు సిద్ధుడు చెప్పు మాట. అధిష్ఠానముగ మున్న నేను ఒక జీవుని ఆవేశించి నేను అట్లు "నేనే బ్రహ్మమును" అని పలుకుదును. సామాన్యజీవులు "నేను కూడా బ్రహ్మమే" అని తాత్త్వికార్థములో అనవచ్చును. మరియు మిథ్య అనగా పూర్తి అసత్యము కాదు. సత్యమే కాని, అల్పత్వము వలన దాదాపు అసత్యముగా పరిగణించబడినది.

శ్లో॥ ప్రజ్ఞానం నహి చైతన్య, మరూఢం తత్త్వశాస్త్రవిత్
గుణీ శాస్త్రా ద్గుణోభూయా, న్గురురేవాహ మత్ర తత్॥ 67

తా॥ "ప్రజ్ఞానము" అనగా ప్రశస్తమైన వేదాంత జ్ఞానము. ప్రజ్ఞాన శబ్దము వ్యవహారములో చైతన్యము అని అర్థములో లేదు (అనగా యౌగికంగా శబ్దమున్నా రూఢిలో లేదు) ఈ వేదాంతజ్ఞానము అతిశయముగా గల వానిని "ప్రజ్ఞాని" అని అనుటకు బదులు "ప్రజ్ఞానము" అని అనవచ్చును. (గుణాతిశయము కల గుణిని, ఆ గుణ శబ్దముతోనే వ్యవహరించుట) ఇది వ్యాకరణ సమ్మతమే. కావున, అతిశయముగా వేదాంత జ్ఞానము కలిగి బోధించు గురువగు నన్నే "ప్రజ్ఞాన" శబ్దము చెప్పుచున్నది. కావున "ప్రజ్ఞానం బ్రహ్మ" అన్నపుడు అతిశయించిన వేదాంత జ్ఞానియగు గురువే (ప్రజ్ఞానమే) బ్రహ్మము అనగా గొప్పవాడు అని అర్థము.

శ్లో॥ జగత్తత్త్వాంశ జీవేZపి, మయ్యేవకణ పూర్ణతః
బిన్దూర్మివార్ధి పూర్ణత్వా, న్న దృష్టాన్తోZతిచిత్రవత్॥ 68

తా॥ నేను "బ్రహ్మము" అను నప్పుడు అది సత్యము. ఏలననగా నేను పరిపూర్ణముగనే ప్రతి వస్తువులో నున్నాను. కాన ఒక మానవ శరీరమును ఆశ్రయించి "నేనే బ్రహ్మమును" అని నేను చెప్పునప్పుడు నేను ప్రతి దానిలోను సంపూర్ణముగనే ఉన్నాను. కాన, అది



సత్యము. కానీ జీవుడు (బుద్ధి) అట్లు చెప్పరాదు. జీవుడు బ్రహ్మమే. కాని తాత్త్వికంగానే తప్ప,. పరిపూర్ణుడుకాడు. అంటే జీవుడు జల బిందువే. జల బిందువు జలమే కాని సముద్రము కాదు. కాన, జీవుడు, బ్రహ్మము యొక్క స్వల్ప భాగమైన జగత్తు అను ఒక బిందువు లో చిన్న బిందువై యున్నాడు.ఎంత స్వల్ప మంటే, జగత్తే దాదాపు బ్రహ్మముతో పోలిస్తే అసలు లేనట్లే. కాన జీవుడు "నేను బ్రహ్మమును" అన్నప్పుడు ఒక జల బిందువు, నేను జలమును అన్నట్లు. ఇదే తాత్త్వికంగా జీవుడు బ్రహ్మమనుట. "నేను కూడా బ్రహ్మమే" అన్నప్పుడు ఈ జగత్తు అను ఒక అలలోని బిందువును అల-ఎట్లు జలమో (బ్రహ్మమో) దానిభాగమైన నేను జలమే (బ్రహ్మమే) అని అర్థము. ఇక పరిపూర్ణ బ్రహ్మము సముద్రము వలె పరిమాణ నియమములకు లొంగినది కాదు అందువలన-సముద్రము - అలలు - బిందువులు ఉండునపుడు ఒకే సమయములో సముద్ర మంతయు ప్రతి అలయును ప్రతి బిందువులోను పరిపూర్ణంగా అధిష్ఠానంగా ఉంది. బ్రహ్మము, సముద్రము - అలలు - బిందువులు - దృష్టాంతములో కుదరదు. అంతే కాదు, ప్రపంచములోని ఏ దృష్టాంతములోను బ్రహ్మము కుదరదు. ఎందుకనగా బ్రహ్మము అతి విచిత్రము, అనూహ్యమైనది.

శ్లో॥ వినార్థం కలహా శ్శబ్దై, ర్జీవక్షేత్రజ్ఞతః పరా
చేతనా క్షేత్ర బుద్ధి శ్చ, గీతైవం పురుషోZపి చ 69

తా॥ శబ్దానికి అర్థము నిర్ణయించకుండా కేవలము శబ్దాలతో కలహించరాదు ఒకరు జీవుడు బ్రహ్మము అంటే, మరొకరు కాదు అని కలహించుచున్నారే తప్ప, జీవశబ్దానికి ఏ అర్థము తీసుకున్నామనే విచారణ ఎవరూ చేయుట లేదు. జీవుడు లేదా చైతన్యము అనే శబ్దాలకు పరిపూర్ణ స్వాతంత్ర్యము కల సర్వసృష్టినీ శాసించే పదార్థమును అర్థముగా తీసుకుంటే జీవుడు లేదా చైతన్యము బ్రహ్మమే. అలా కాక నా అధీనమై, నాచే స్వల్పమైన స్వేచ్ఛ నొసగ బడి తంత్రపరమైన జడశక్తి అనగా కేవల సంకల్ప సంజ్ఞాన క్రియలను చేయు పదార్థమే జీవ చైతన్యములకు అర్థమైనచో నేను జీవుడను కాదు,. చైతన్యమును కాదు. నన్ను జీవుడు లేక క్షేత్రజ్ఞుడు లేక చైతన్యము అన్నచో ఈ జడశక్తి పదార్థమును "చేతన" అను వేరు పేరుతో "క్షేత్రము" నందు అనగా జడము నందే చేర్చి గీతలో చెప్పియున్నాను. ఈ చేతనయే "బుద్ధి" లేక "క్షేత్రము" అని పిలువబడుచున్నది. ఇది విధముగా జడ శక్తిని పురుషు డంటే, నేను పురుషోత్తముడను.

శ్లో॥ పరాచే త్పురుషోZ హంతు, రూఢ యౌగిక భేదవాక్
ప్రాణి జీవోZ పి యద్బ్రహ్మ, శఙ్కర స్తం పరౌవిదామ్॥ 70

తా॥ జీవుడిని, పురుష శబ్దంతో కాక పరా ప్రకృతి శబ్దంతో అనగా ప్రకృతిగానే పిలిస్తే నేను "పురుషుడు" అనబడుతాను. శబ్దము రూఢార్ధంలో ఉపయోగించబడినపుడు అనగా వ్యవహారబలంతో (అనగా వ్యుత్పత్తి అర్ధము లేకుండా కేవల జన వ్యవహార భాష),అయితే వ్యుత్పత్తి అర్ధము (యౌగికము) తీసుకొనరాదు. వ్యుత్పత్త్యర్ధము తీసుకంటే, రూఢి తీసుకొనరాదు. రెండూ ఒకే శబ్దానికి ఉంటే ఏ తగాదా రాదు. ఒకరు శబ్దాన్ని రూఢంగాను,మరొకరు యౌగికంగానూ తీసుకొని, ఈ రెండూ ఒక శబ్దానికి లేనపుడు తగాదాలు వస్తాయి. ఉదా॥ ఒకరు జీవ శబ్దాన్ని యౌగికంగా బ్రహ్మార్ధంలో తీసుకున్నారు. అంటే సమస్త జగత్తునూ జీవింపచేసేవాడన్న వ్యుత్పత్తి అర్ధము ఇది. మరొకరు జీవ శబ్దాన్ని ఈ లోకంలో జీవించే ప్రాణిగా యౌగికంగానూ, (అంటే దేహమును జీవింప చేయువాడు అను వ్యుత్పత్తితో) మరియు రూఢంగానూ (అంటే జనులు జీవశబ్దాన్ని ఒక ప్రాణిని చెప్పునప్పుడే వాడుతున్నారు.) తీసుకొని సృష్టి భాగమైన పరమాత్మకు అధీనమైన జడశక్తియగు ఒక ప్రాణిని తీసుకున్నారు. అక్కడ తగాదా వస్తుంది. అయితే, "ఏమయ్యా! బ్రహ్మమును బ్రహ్మమే అనరాదా! జీవుడంటే ప్రాణిగానే తీసుకొనరాదా?" అంటే జీవ శబ్దమును బ్రహ్మ పరంగా కూడ తీసుకొనవచ్చును. ఎట్లు అనగా ఒక ప్రాణిలో నున్న చైతన్యము దేహమును జీవింపచేస్తున్నా, మాయా శక్తి వలన ప్రతి దానిలోనూ పరిపూర్ణంగా వున్న బ్రహ్మమే నిజంగా ఆ దేహాన్ని, చైతన్యము ద్వారా జీవింపచేస్తున్నది. కాన, ప్రాణిలోనున్న నిజమైన వ్యుత్పత్తి అర్ధముగల జీవశబ్దము బ్రహ్మమునకే వర్తిస్తున్నది. కాన, జీవ శబ్దమును బ్రహ్మార్ధంలో తీసుకొన్న వారినీ కాదన లేము కదా! శంకరాచార్యులు చెప్పే, జీవశబ్దము ఇలా బ్రహ్మపరంగా తీసుకొనబడినది. ఇక రామానుజ మధ్వులు జీవ శబ్దాన్ని రూఢంగాను, యౌగికంగాను, తీసుకొని, దేహాన్ని నేరుగా జీవింప చేసే చేతన- బుద్ధి-క్షేత్రము-పరాప్రకృతి-పురుషుడు మొ॥ శబ్దాలతో చెప్పబడే పరమాత్మా ధీనమైన జడశక్తిని జీవ శబ్దార్ధంగా తీసుకున్నారు. విచారిస్తే, ఈ మతాలలో అసలు పరస్పర విరోధము ఏమీ లేదు గదా.

శ్లో॥ ప్రాణిస్థం శఙ్కరో మాం చ, నభోZ తీతం జగద్గతమ్
పరం మిథ్యాల్ప మూచే హి, పశ్చాచ్ఛేదం భ్రమచ్యుతమ్॥ 71



తా॥ ఒక ప్రాణిలో పరిపూర్ణంగా ఉన్న నన్నే అనగా బ్రహ్మమునే పరాప్రకృతి-జీవ-పురుష-క్షేత్రజ్ఞ మొ॥ శబ్దాలతో శంకరులు తీసుకున్నారు. ఇక నా మీద ఆధారపడి నా అధీనమైన ఆదేహమును "అపరా ప్రకృతి - బుద్ధి- క్షేత్రము- చేతనా మొ॥ శబ్దాలతో శంకరులు తీసుకున్నారు. నేను ఆకాశ నియమాలకు అతీతుడను కావున విశ్వగతుడగు "నేను",. ఒక ప్రాణిగతుడగు "నేను" లో ఏ భేదమూ లేదు కావున, ప్రాణి గతుడగు పరిపూర్ణుడైన నన్నే బ్రహ్మ మంటూ జీవుడే బ్రహ్మమన్నారు.ఇక దేహము, విశ్వము అత్యల్పము గాన, అభావంగా పరిగణించి మిధ్య యన్నారు. ఇక, రామానుజ మధ్వులు కూడా ఇదే చెప్పినారు. అయితే శంకర వాదం వల్ల వచ్చిన అపార్ధాలను తొలగించినారు.

శ్లో॥ అపార్థఘ్నౌ పరః ప్రాణి - నిష్ఠం త్యక్త్వా జగద్గతమ్
గృహీత్వాZ ధీన విశ్వస్య, - భాగం జీవ మువాచ సః॥ 72

తా॥ వారిరువురూ శంకరావతారములే. జగత్తు మిధ్య అనగా అసలు లేదనియూ, జీవుడు సిద్ధిపొందకుండగనే బ్రహ్మ మైనట్లు భావించుకొని, పాపాహంకారములలో పడినాడు. అందుకు, వారిరువురి మతంలో ప్రాణిలో పరిపూర్ణంగా ఉన్న నన్ను బ్రహ్మము అనుట వల్లనే ఈ ప్రమాదము వచ్చినది కావున ఆ అంశమును వదలి వేసినారు. నన్ను కేవలం విశ్వగతుడైన పరిపూర్ణ బ్రహ్మమునే పరమాత్మగా తీసుకున్నారు. ఇపుడు బ్రహ్మముపై ఆధారపడిన విశ్వంలోని ఒక భాగము జీవుడైనాడు. ఇక్కడ జీవ శబ్దాన్ని బ్రహ్మపరంగా వాడటాన్ని పరిహరించారు. ఈశ్వర శబ్దాన్నే పరమాత్మపరంగా వాడినారు. ఈశ్వరు డనగా విశ్వాంతర్గత పరిపూర్ణ బ్రహ్మము. ఇప్పుడు ఈశ్వర శరీరమైన ప్రకృతి క్షేత్రము అను జగత్తులోని అవయవము మాత్రమే జీవుడైనాడు. ఇది రామానుజులు సవరించినది.

శ్లో॥ శరీర వికృతే రన్యో, మధ్వ రూపేణ చాహ హి
రోమవత్పరమస్యాఙ్గ - జీవోZ పీతి భ్రమం హరన్. 73

తా॥ దీనివలన కూడ మరల అపార్ధము వచ్చినది. విశ్వము పరమాత్మ ముందు చాలా అల్పము కాన, విశ్వవికారము ఏమీ లేనట్లే అనే అర్ధాన్ని తీసుకోకుండా (అంటే ఒక వ్యక్తి యొక్క రోమంలో జరిగే వికారాల వల్ల, ఆ వ్యక్తి వికారాలను పొందినాడని ఎట్లు చెప్పలేమో అట్లే, ఈశ్వర శరీరంలో జగద్వికారాలన్నీ జరుగును కాన ఈశ్వర శరీరము నానా వికారములతో కూడినదని కొందరు మూఢులు ఈశ్వరునకు దోషాపాదనముకు

చేసినారు. వీరు ప్రబుద్ధులు. దీనిని పరిహరించుటకై, రామానుజులే, మధ్వావతారంలో వచ్చి, అసలు జగత్తు ఒక రోమము వలె, వ్యక్తి కన్నా భిన్నమైనది. జగత్తులో భాగ మగు జీవుడు కూడా పూర్తిగా భిన్నుడే నన్న వాదమును స్థాపించి, ఆ అపార్థములను తొలగించినాడు.

శ్లో॥ శ్రుతా మే వా క్ప్రమాణం హి, సర్వజ్ఞస్య స్మృతా యుతా
స్వభావై ర్న ప్రమాణంచ, జీవే యుక్త్యనుభూతిభృత్॥ 74.

తా॥ నా భక్తుల ద్వారా, నా అవతారముల ద్వారానే చెప్పుదును. నేను సర్వజ్ఞుడను. జీవుడు అల్పజ్ఞుడు. వాని శరీరములోని తత్త్వములే వానికి తెలియవు. వాని శాసనము నంగీకరించవు. నేను చెప్పినది శ్రుతి. నేను చెప్పినది నా భక్తుడు వింటాడు. కావుననే "శ్రుతి" అని పేరు. నా భక్తులగు ఋషులు విని దానిని యథాతథంగా ప్రవచించారు. కావుననే అది "శ్రుతి" ఐనది. అది నా పూర్ణ వాక్కు కాన పరిపూర్ణ ప్రమాణము. నేను చెప్పుదానిలో సొంతమును కలుపక ఏ భక్తుడు వచించినా అది శ్రుతియే. విన్నతరువాత కాలంతరమున గుర్తుకు తెచ్చుకొని చెప్పినది స్మృతి. అట్టి స్మృతిలో పూర్తిగా గుర్తుకు రాక కొన్ని జీవుల సొంత భావములు చేరుచుండును. కాన స్మృతిలో ఎంత వరకు శ్రుతిని అనుసరించి యుండునో అంత వరకే నా వాక్కు గాన అంతవరకే ప్రమాణము. యుక్తి అనగా తర్కము. తర్కమునకు నేను అందను. అనుభూతి యనగా గ్రహించుట. జీవుల యొక్క ఎట్టి ప్రయత్నముచేతనూ నేను గ్రహింపబడను. కావున అనుభూతికి చిక్కను. కాన యుక్తి, అనుభవము, జీవుడికి సంబంధించినవి. శ్రుతి, పూర్తిగా అనుసరించిన స్మృతి నా వాక్కులే కాన, నాకు సంబంధించినవి. ఈ రెండింటి ద్వారా నన్ను తెలుసుకొన వీలగును.

శ్లో॥ శఙ్కరేణ పురో జ్ఞానం, భక్తిః పశ్చా న్మయోచ్యతే
సేవాZన్తే ఫల మేతస్యాః, న ఫలాన్తర ముచ్యతే ॥ 75

తా॥ అందుకే ముందు శంకరాచార్య రూపంలో వచ్చి జ్ఞానాన్ని బోధించాను. ఆ తరువాత రామానుజాచార్యులరూపంలో వచ్చి భక్తిని బోధించాను. వస్తువు దొరికిన తరువాత, దానిని ప్రతిఫలాపేక్ష రహితంగా సేవించుటయే చివరి దశ. ఈ సేవయే ప్రాప్తి యొక్క ఫలము. ఇక దీని తరువాత ఫలం లేదు. అందుకే చివరకు మధ్వచార్య రూపంలో వచ్చి సేవను బోధించాను.



శ్లో॥ ప్రక్షేపం గురు భాష్యేషు, పరఖణ్డన ధీమయమ్
శిష్యాణాం వేద్మి సర్వజ్ఞో, వాదోన్మత్తా ఇవేక్షితాః॥ 76

తా॥ పురాణములలోనే కాదు. ఆచార్య త్రయ భాష్యములలో కూడ, కొందరు శిష్యులు, వారి వారి పరమత ద్వేష ఖండన బుద్ధితో కొన్ని వాక్యములను ప్రవేశ పెట్టినారను విషయము ఎవరికినీ తెలియదు కానీ, సర్వజ్ఞుడగు నాకు తెలియును. ఇట్టి భాష్యములను ఈనాడు అధ్యయనము చేయు వారికి, ఆచార్యులే పరస్పర ఖండనములను చేసుకొన్న పిచ్చివారిగా కనపడుచున్నారు.

శ్లో॥ ఆచార్యా అవతారా మే, పితా పుత్ర జయేప్సితః
భ్రాతరో హ్యన్యథా పుత్ర - దుర్మతాను ప్రియా హి తే॥ 77

తా॥ ఆచార్యులు ముగ్గురును నా అవతారములు. నేను సమస్త జీవులకు తండ్రిని. నేను నా పుత్రుని మతమును ఖండించి, వాని పరాజయమును కోరుదునా? తండ్రి పుత్రుల విజయమునే కోరును తప్ప తన జయమును కోరడు. సోదరులు మాత్రము తమ విజయమును, తమ సోదరుల పరాజయమును కోరుదురు కాన, జీవులు అన్యోన్యమత ఖండనములను కావించుకొందురు. పుత్రులు దుర్మతములో నున్నచో, వారి దుర్మతములను అంగీకరించుచూ, వారికి ప్రియుడై, క్రమముగా వారికి హితమును బోధించును. కాన, ఆచార్యు లెన్నడునూ ఇట్టి తండ్రి పద్ధతినే అనుసరించిరి కానీ, సోదరుల పద్ధతి ననుసరించి,అన్యమత ఖండనములను చేయలేదు.

శ్లో॥ జగచ్ఛూన్య ప్రియో బ్రహ్మ - సత్తా బోధక శఙ్కరః
బౌద్ధపుత్రాయ సౌలభ్య - శ్రవణా న్మోక్షదో గురుః॥ 78

తా॥ నాస్తికులగు బౌద్ధులు బ్రహ్మమూ, జగత్తూ, రెండూ లేవన్నారు. వారును తమ పుత్రులే కాన, శంకరులు, జగత్తు లేదను వాదమును అంగీకరించి, వారికి ఇష్టమైన బ్రహ్మ మున్న దను వాదమును అంగీకరింపచేసిరి. బౌద్ధుల రెండు మతములను ఖండించినచో వారు అసలు వినరు. తక్కువ ప్రమాదకరమైన వాదము నంగీకరించి, ఎక్కువ ప్రమాదకర వాదమును వారు సరిదిద్దినారు. మహావాక్యములను వినుటతో, జ్ఞానము కలిగినంతనే, నీవు బ్రహ్మమే అగుదువని, బ్రహ్మప్రాప్తి అత్యంత సులభమని,

అనలు వినని నాస్తికులగు బౌద్ధమూర్ఖులను, శ్రవణము అను మొదటి అవస్థకు ("శ్రోతవ్యః" అని శ్రుతి) తీసుకొనిరాదలచి, ఆవిధముగా చెప్పి ఆకర్షించిరి.

శ్లో॥ అద్వైతం వేషి సత్త్వేన, ప్రవిష్టాధార సన్మతమ్
విశిష్టాద్వైతగం ద్వైతం, తస్యసేవా మతత్రయమ్॥ 79

తా॥ సర్వపాత్రల ధారియును, సర్వవేష వస్తువులను సృష్టించిన వాడును ఒక్కడే. ఈ పాత్రలు, వేషవస్తువులును ఆ పాత్ర ధారి దృష్ట్యా అత్యల్పములు కాన, అసత్యములే నని తెలియుట అద్వైతము. ఈ నాటకములోనికి, సర్వవేషధారియగు ఆ వ్యక్తియు తన నిజస్వరూపముతో ప్రవేశించియుండుటయే ఈ దత్తస్వరూపము. ఈ నిజ స్వరూపము, సర్వపాత్రలనూ, సర్వవేష వస్తువులనూ ధరించియున్నాడని తెలియు ఆధార - ఆధేయ సంబంధము (దత్తుడాధారము, మిగిలినవి ఆధేయములు) తెలియుటయే విశిష్టాద్వైతము. ఇక, ఆధారస్వరూపుని ఆజ్ఞాప్రకారముగా నడచుకొని ఆధేయములు సేవించుకొనవలయునని తెలియుటయే ద్వైతము. ఈ మూడును త్రిమతములు.

శ్లో॥ సకృ ద్ద్విపరిమాణోऽహం, కాలాతీతో న సిద్ధవత్
స ఏవ సమశక్తిః కిం, మయి తత్త్వ మసీత్యతః॥ 80

తా॥ నేను ఒకే సయమున విశ్వాకారునిగా విశ్వమంత పరిమాణంలో విశ్వంలో విశ్వాధారంగా ఉన్నాను, మరియు అదే సమయమున పరమాణువులో పరమాణు పరిమాణంలో ఉన్నాను. దీనికి కారణము నేను ఆకాశ తత్త్వానికి అతీతుడను. పరిమాణము ఆకాశతత్త్వానికి సంబంధించినట్టి ధర్మము కదా. అష్ట సిద్ధులు కలవారు ఆకాశ తత్త్వాతీతులు కారు కాన ఒక సమయంలో పరమాణు పరిమాణంలోను మరొక సమయంలో విశ్వ పరిమాణంలోను ఉండగలరు తప్ప ఒకే సమయంలో రెండు పరిమాణల్లోను ఉండలేరు. అష్ట సిద్ధులు కలవాడే పరమాణు పరిమాణాంలో ఉన్నా, విశ్వపరిమాణంలో ఉన్నా ఒకే శక్తిని కలిగి ఉంటాడు. ఇక నావిషయంలో చెప్పనేల? కాన విశ్వంలో ఉన్న నాకు జీవునిలో ఉన్న నాకు అద్వైతమును చెప్పుటయే "తత్త్వ మసి" (నీవు అదే) వాక్య తాత్పర్యము.



శ్లో॥ సామాన్యే తత్త్వతో బిన్దు - వార్ధ్యో స్తోయం న లక్షణా
అభిధైవాహం చ జీవ, శ్చిత్తగో బ్రహ్మ విశ్వగమ్॥ 81

తా॥ సామాన్య జీవుని విషయంలో అద్వైతానికి అర్థా లిట్లుండును. (1) జీవుడూ (చిత్తము) బ్రహ్మము తాత్త్వికంగా ఒకటే కానీ శక్తిలో తేడా ఉంటుంది. బిందువూ, సముద్రమూ జలమే తాత్త్వికంగా అయిననూ జలపరిమాణము నందు భేదమున్నది. ఇక్కడ తాత్త్వకంగా అభేదమే అద్వైతము. ఇట్లు జీవుడు తాత్త్వికంగా బ్రహ్మమే కాన మహా వాక్యాలకు అర్థము లక్షణ (వ్యంగ్యార్థము) అక్కర లేకుండా అభిధతోనే (శబ్దాలకున్న సహజార్థముతోనే) సమన్వయిస్తుంది. బిందువూ, సముద్రమూ జలమే అంటున్నాము తప్ప, బిందువు సముద్ర మనుటలేదు. అనగా జీవుడూ ఈశ్వరుడూ బ్రహ్మమను చున్నామే తప్ప, జీవుడు ఈశ్వరు డనుటలేదు. ఇక రెండవ అర్థము (2) జీవ శబ్దము చిత్తములో నున్న నాకు సమన్వయించవచ్చును. జీవింపచేయువాడు జీవుడు అన్నపుడు నిజంగా సమస్త ప్రాణులను జీవింపచేయువాడను నేనే కాన, చిత్తములో పూర్ణంగా నున్న నన్నూ (జీవునీ) విశ్వవ్యాపకమైన బ్రహ్మమునూ ఒక్కటేనని చెప్పుట. ఈవిధంగా సామాన్య జీవునిలో తత్త్వ మసి వాక్యానికి గల అద్వైతార్థమును సమన్వయించవచ్చును.

శ్లో॥ భేదాభేద ద్వయం సత్యం, జ్ఞానాభ్యాం నిత్యమశ్నుతే
వినోదం దుఃఖరహితం, సర్వశక్త్యా సకృద్ద్వయమ్. 82

తా॥ అద్వైతమూ, ద్వైతమూ రెండూ అభేద- భేదజ్ఞానములు. భేద జ్ఞానముతో సృష్టి వినోదమూ కలుగును. సృష్టిలో వచ్చు దుఃఖములను పోగొట్టుటకు అభేద జ్ఞానము సహకరించును. అనగా దుఃఖరహిత నిత్య వినోదమునకు అభేద, భేద జ్ఞానములు రెండూ అనగా వాటి మూలములను అభేద-భేదములు రెండూ కావలసినవే.ఇది రెండూ ఏకకాలంలో ఏక దేశంలో సత్యంగా ఉండటమే బ్రహ్మము యొక్క అనూహ్య శక్తి సాధ్యము కావున తర్క విరోధమిచట లేదు. అనగా - ఒకే వ్యక్తి, అన్ని పాత్రల వేషాలతోనూ, ఒక విచిత్ర నాటకము నాడుచున్నాడనుకొనుము. ఆ వేషములు వేరుగా ఉండటము, సత్యములే కావటము అనేది భేదము సత్యము అనుట - సత్యము కాక పోతే వినోదము లేదు. భేద జ్ఞానమే వినోదకరము. అట్టి నాటకములో ఒక చోట బాధ కలిగిన దనుకొనుము. ఆ బాధ పోవుటకు, ఆ వేషములన్నీ అసత్యములే, వేషధారి ఒక్కడే సత్యము అను అభేదజ్ఞానము అవసరము కాన, అభేదము సత్యము. ఈ

అభేద జ్ఞానము కావలసినదే. ఇట్లు అభేద జ్ఞానము దుఃఖమును పోగొట్టుచుండగా, భేద జ్ఞానము నిత్య వినోదము కలిగించుచుండగా, అభేద జ్ఞానము ఆ వినోదములో మధ్య మధ్య కలుగు శోకమును నివారించుచున్నది. ఇట్లు భేధాభేదములు సత్యములై, వాటి జ్ఞానములు నిత్యమూ దుఃఖరహిత వినోదమును కలిగించుచున్నవి.

శ్లో॥ జ్ఞానా ద్భక్తి స్తత స్సేవా, సద్దాసో హనుమాన్మమ
దాసదాసో హి తత్త్వజ్ఞో, మద్దాసో గురవః క్రమాత్॥ 84

తా॥ సేవ చేయువానికి నిజమైన ప్రేమ (భక్తి) ఉండును. జ్ఞానము లేనిదే అకర్షణ రూపమైన భక్తి కలుగదు కాన, సేవకుడే జ్ఞానియు భక్తుడు. జ్ఞానము వలన భక్తి, భక్తి వలన సేవ కలుగును. అట్టి నా నిజమైన సేవకుడు శ్రీ అంజనేయుడు. ముందు నా దాస దాసునిగా మారుము. దానివలన జ్ఞాన భక్తి సేవల తత్త్వము తెలిసి, నా దాసుడి వగుదువు. అందువలననే, ముందు జ్ఞానమును బోధించు శంకరునిగను, తరువాత భక్తిని బోధించు రామానుజునిగను, ఆ తరువాత సేవను భోధించు మధ్వుని గను క్రమముగనే గురురూపములతో అవతరించితిని.

శ్లో॥ గురూణాం సర్వ సత్యాంశా, యుక్తాః పూర్ణం మయోచ్యతే
గజస్యేవ కరాదిస్స్యా, ద్బ్రహ్మజ్ఞానం శ్రుతి ర్మమ॥ 85

తా॥ లోకములో గురువులు చెప్పునది సత్యములే కాన వాటిని నిరాకరించకుము. అయితే వారు, తాము తెలుసుకున్నదే సంపూర్ణమని వాదించి బోధింతురు. దానిని గ్రహించకుము. పరమగురువగు నేను చెప్పినదే సత్యము - సంపూర్ణము అగు జ్ఞానము. ఏనుగు కాలు సత్యమే కాని అదే ఏనుగు కాదు. ఆ కాలు లేకున్నచో ఏనుగూ సంపూర్ణము కాదు. ఈ గురువులు కాలి నొకరు, తొండము నొకరు. పొట్ట నొకరు, తోక నొకరు పట్టుకొనియున్నారు. ఇవి అన్నియును వాటి వాటి యధార్థ స్థానములనం దుంచినచో ఏనుగు పూర్ణ స్వరూపము గోచరించును. నేను బోధించునది నీకు దర్శింప చేయునది పూర్ణమైన ఏనుగు. ఈ గురువు లందరునూ నా అంశలే ( నా భాగములే) కాన వీరు సమగ్ర జ్ఞానములోని ఆయా అంశమును మాత్రమే గ్రహించగలరు. కాన, వీరు పరస్పరము ఖండించుకొనుట సరికాదు. వీరందరూ కలిసి, వారి వారి తత్త్వదర్శనములను యధా స్థానాలలో ఉంచితే సంపూర్ణ సత్యము గోచరిస్తుంది. అదే బ్రహ్మజ్ఞానము. అదే వేదము.



శ్లో॥ ఆచార్యాః పరమా ముక్తా, భక్తా మే లోక సఙ్గ్రహమ్
కర్మ జ్ఞాన ప్రచారాఖ్యం, కుర్వన్తి స్మ నిరన్తరమ్॥ 86

తా॥ పరమ ముక్తిని పొందిన ఆచార్యులు, నా భక్తులును లోకోపకారమైన ఈ జ్ఞాన ప్రచార మను నా సేవా కర్మను నిరంతరముగా చేసియున్నారు. కావున, నీవును అట్టి సేవనే చేయుము.

శ్లో॥ జీవాయైవోపదేష్టవ్యం, శాస్త్రం మహ్యం నహి క్వచిత్
వ్యవహార దశామేవ, సద్గురు ర్నిత్య మాశ్రితః ॥ 87

తా॥ శాస్త్రము ఎప్పుడును అల్పజ్ఞుడు - అజ్ఞుడు అయిన జీవునకే ఉపదేశించవలయును కానీ, సర్వజ్ఞుడైన నాకు కాదు. అందువలన, జీవుని దృష్టియగు వ్యవహార దశనే సద్గురువు సదా ఆశ్రయించి బోధించును. అనగా శాస్త్రబోధనలో జగత్తు అసత్యమన్న మతముపై అధారపడి జీవులకు జ్ఞానబోధ చేయరాదు. అట్టి మతము నా దృష్టిలోనిది.

శ్లో॥ న వేదా దపరోగ్రన్థో, న దత్తా ద్బ్రహ్మ చా పరమ్
న మే బోధాత్పరం జ్ఞానం, న తే సేవాన్యసాధనమ్ 88

తా॥ వేదమును మించిన గ్రంధము లేదు. దత్తుని మించిన బ్రహ్మము లేదు. నాఈ బోధలను మించిన బ్రహ్మజ్ఞానము లేదు. నా ఈ బోధలను ప్రచారము చేయు సేవను మించిన సాధన నీకు లేదు.

శ్లో॥ అథాZతో బ్రహ్మ జిజ్ఞాసా, జన్మాద్యస్య యత శ్శ్రుతేః
తదహం శాస్త్రయోనిత్వా, ద్బ్రహ్మజ్ఞాన మిదం త్రయమ్॥ 89

తా॥ "తరువాత, కావున, బ్రహ్మజిజ్ఞాస" అని మొదటి సూత్రము. "ఆ బ్రహ్మము నుండియే ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి లయములు" అని రెండవ సూత్రము. "బ్రహ్మ లక్షణమును వేదము చెప్పినది కావున" అని మూడవ సూత్రము. ఈ మూడు బ్రహ్మసూత్రములే బ్రహ్మ జ్ఞానము.

శ్లో॥ త్రిమూర్తి దర్శనా త్పశ్చా, దధికారత్రయం యతః
కో ను బ్రహ్మేత్యభిజ్ఞానం, సూత్రశబ్దత్రయం చ తత్॥ 90

తా॥ త్రిమూర్తులను దర్శించిన, తరువాత అని అథ శబ్దమునకు అర్థము. వేదమునందు సృష్టి స్థితి లయాధికారములు మూడును ఒక్క బ్రహ్మమునకే కలవని చెప్పుట వలన, త్రిమూర్తులు ఒక్కొక్కరు ఒక్కొక్క అధికారమునే కలిగియున్నందున, ఈ ముగ్గురిలో బ్రహ్మము ఎవరు? అని బ్రహ్మమును గుర్తించుటయే బ్రహ్మజిజ్ఞాస. ఇట్లు మొదటి సూత్రములోని మూడు శబ్దముల సారమే బ్రహ్మజ్ఞానము.

శ్లో॥ తత్త్వాజ్ఞేయా దభిజ్ఞానం, విచికిత్సా సురైరపి
వాఙ్మనోబుద్ధితర్కేభ్యః, పరమేకమితి శ్రుతిః॥ 91

తా॥ బ్రహ్మము యొక్క తత్త్వమును ఎవడునూ గ్రహించలేడు. (బ్రహ్మమే బ్రహ్మమును తెలుసుకొన్నది" - బ్రహ్మవిద్బ్రహ్మైవ అను శ్రుతియు, "నన్ను ఎవడును తెలుసుకొనలేడు" అను గీతయు కలదు). కావున, బ్రహ్మ జిజ్ఞాస అనగా త్రిమూర్తులలో బ్రహ్మమెవ్వరని గుర్తు బట్టుటయే తప్ప బ్రహ్మ తత్త్వమును తెలుసుకొనుట కాదు. "దేవతలు సైతము బ్రహ్మమును తెలియ లేక చర్చించిరి. నాకు మాత్రము ఎట్లు తెలియును?" అని కేనోపనిషత్తులో చెప్పబడినది. వాక్కులకు, మనస్సుకు, బుద్ధికిని అందనిది బ్రహ్మము అని వేదములు ఘోషించుచున్నవి. ("యతో వాచో" అప్రాప్య మనసా"; యోబుద్ధేః పరతః" "అతర్క్యః" మొ॥ శ్రుతులు) "బ్రహ్మము ఒక్కటే" అని కూడ శ్రుతి (ఏకమేవ).

శ్లో॥ తత్పూర్వ పక్షే మూర్తీనాం, శక్తి భఙ్గే సమన్వయః
శిరశ్ఛిన్న ముఖైకత్వ - వ్యక్తిరేకా స్వమాయయా॥ 92

తా॥ ఇక, నాల్గవ సూత్రము "అట్లు కాదు. సమన్వయము వలన" అని ఉన్నది. దీని అర్థము - మరి, నాల్గవ రూపమును బ్రహ్మము అన్నపుడు, నాల్గవ రూపమగు నాకు సృష్టి స్థితి లయాధికారములు వచ్చినచో, త్రిమూర్తులకు ఆ అధికారములు లేనట్లే కదా అన్నచో అట్లు కాదు. నాల్గవ వ్యక్తి త్రిమూర్తుల యొక్క మూడు ముఖములతోనే ఉన్నాడు కావున త్రిమూర్తుల అధికారములకు భంగము లేదు అని సమన్వయము. మూడు తలలు మాత్రమే త్రిమూర్తులను సూచించవు కదా అన్నచో అట్లు కాదు - ఆ మూడు ముఖములు నిజముగా ఒకే ముఖము. ఒకే వ్యక్తి అగు దత్తుడు తన మాయ చేత వేరు వేరుగా మూడు మూర్తులుగా కనపడుచున్నాడని సమన్వయము. (ఒకే నటుడు ఒకేసమయంలో మూడు పాత్రలుగా ఈనాడు చలన చిత్రాలలో కనిపించినట్లు).



శ్లో॥ క్లీబ లిఙ్గం న లోకే య, త్కళత్రాదే శ్రుతః పుమాన్
ఏవం సూత్రై శ్చతుర్భిశ్చ, సారమేయై రహం స్థితః 93

తా॥ బ్రహ్మము నపుంసక లింగమున ఉన్నది కదా అన్నచో అట్లు కాదు ('తత్' శబ్దము ఈ సూత్రములో నపుంసకలింగము అను పూర్వపక్షము) -ఏలననగా లోకములో పురుషులు నపుంసక లింగాంతనామములతో కనబడు చున్నారు గదా! "రామ బ్రహ్మము" మొ॥ పేర్లు గలవు. కళత్ర శబ్దము నపుంసక లింగమైనను స్త్రీని చెప్పుచున్నది గదా! మరియును వేదములలో "పురుషః" "సః" "ఆత్మా" మొ॥ పుంలింగ పదములే పరమాత్మకు వాడబడినవి. ఈ విధముగా - నాలుగు బ్రహ్మసూత్రములు (చతుస్సూత్రీ) నాలుగు వేదములు, నాలుగు కుక్కలు నన్ను సూచించుచూ, ముఖములు నా వైపునకు పెట్టి నా పాదముల వద్ద నున్నవి. (బ్రహ్మ సూత్ర పదైశ్చైవ అని గీత).

శ్రీ భవానీ సహిత బాలకృష్ణ ఉవాచ:-

శ్లో॥ ఏవముక్త్వా నతం శిష్య, మనుగృహ్యా చ పాణినా
శ్రీ దత్త భగవా నంత-ర్దధే శిష్యా దియం శ్రుతా. 94

శ్రీ భవానీ సహితుడైన శ్రీ బాలకృష్ణుడు వచించెను.:-

తా॥ ఈ విధంగా ఉపదేశించి, నమస్కరించిన దత్త శిష్యుని తన పాణితో ఆశీర్వదించి అంతర్ధానము చెందెను. ఆ దత్త శిష్యుని వద్ద నుండి మేము ఈ గీతను విని యున్నాము.

శ్లో॥ ప్రచార సేవాం కుర్వశ్చ, నావాం ప్రతి ఫలాశయౌ
ఇహాముత్ర చ తత్సేవా, కామౌ నిత్యం తథా సమే. 95

తా॥ ఈ గీతను మేము దంపతులము ఇరువురము కలిసి ముద్రించి సర్వజీవోద్ధరణమునకై స్వామి ఆదేశానుసారముగా ప్రచారము చేయుచున్నాము. మేము స్వామి నుండి ఎట్టి ఐహిక ప్రతి ఫలములు కానీ, మోక్షమును కాని కోరుట లేదు. సర్వదా జన్మల నెత్తుచూ స్వామి వారి సేవకులుగా ఉండునట్టి పరమముక్తినే కోరుచున్నాము. ఇట్టి కోరికతో సర్వజీవులును ఈ జ్ఞాన ప్రచారము చేయవలయును.

శ్లో॥ పఠతాం నన్దతాం గీతా, మిమాం దత్తః ప్రియో భవేత్
కావ్యాదివ కవేః కింన, ప్రేమ్ణ స్సిధ్యతి సత్ఫలమ్? 96

తా॥ ఎవరు ఈ గీతను పారాయణము చేయుదురో అట్టి వారికి శ్రీ దత్తాత్రేయ భగవానుని పూర్ణానుగ్రహము సిద్ధించును. ఇది సాక్షాత్తు శ్రీ దత్త భగవానుని వాక్కు కావున, దీనిని పారాయణము చేసుకొని తెలుసుకొని ఆనందించువారికి, ఒక కవి యొక్క కావ్యమును విని ఆనందించు వారికి ఆకవి యొక్క అభిమానము ఎట్లు లభించునో, అట్లే శ్రీ దత్త సద్గురువుల ప్రేమ ఫలముగా లభించును. ప్రేమయే లభించినపుడు ఇక ఏ ఫలమును భగవానుడీయడు? వారికి కావలసిన వన్నియును శ్రీ దత్త భగవానుడే ప్రేమతో సమకూర్చును.

*ఇతి శ్రీ దత్తగురు భగవద్గీతాయాం*
*శ్రీ దత్తమత సమన్వయ యోగోనామ*
*షోడశాధ్యాయః*

*బ్రహ్మ విష్ణు శివాత్మక, వాణీహిరణ్యగర్భాత్మక, లక్ష్మీ నారాయణాత్మక, ఉమామహేశ్వరాత్మక, సర్వదేవతా దేవాత్మక, సర్వగ్రహాత్మక, సర్వసిద్ధాత్మక, సర్వబ్రహ్మర్ష్యాత్మక, శ్రీ భగవద్దత్తాత్రేయ గురుదేవస్వామి పరబ్రహ్మార్పణమస్తు.*

*ఓం తత్ సత్*



శ్లో॥ సృష్టి స్థితి ప్రళయ కారణమస్య వేదా,
ద్బ్రహ్మైవయ స్త్రిముఖసూచక దత్తదేవః
అన్యస్వరూప మసమన్వయహేతుముక్తం,
తస్మాత్స ఏవ శరణం మమ వేద సిద్ధః

తా॥ వేదములో చెప్పిన బ్రహ్మము - నిర్వచనమేమనగా - ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి ప్రళయములను చేయు ఏకైక స్వరూపమే బ్రహ్మము. మూడు ముఖములతో యీ మూడు పనులను చేయు ఏకైక స్వరూపమగు శ్రీ దత్తదేవుడే వేదము ద్వారా సిద్ధించిన బ్రహ్మము కావున మాకు శరణ్యుడు. ఇతర స్వరూపములందు యీ వేద సమన్వయము కుదరదు కావున వాటిని విడచినాము.

శ్రీ దత్తదేవ గురు భగవానునిచేత ప్రోక్తములైన 1. ఉపనిషద్భాష్యము 2. బ్రహ్మసూత్ర భాష్యము 3. భగవద్గీతా భాష్యములను తెలుగు తాత్పర్యముతో సహా ముద్రణ చేసి భక్తులకు అందించు మా జ్ఞానయజ్ఞమునకు భక్తులు యీ గ్రంథ గురు దక్షిణల ద్వారా సహకరించెదరు. మరియు ఈ స్వామి సేవకు విరాళములను పంపదలచిన వారు యీ క్రింది అడ్రసుకు పంప ప్రార్థన.


**చిలుకూరు బాలకృష్ణ మూర్తి**
**శ్రీమతి భవాని**
41-15-4, నల్లగేటు డౌన్, కృష్ణలంక, విజయవాడ - 520 013,
ఫోన్ : 521809.